# మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ కృతుల పరిశీలనము

ఆచార్య కె.జె. కృష్ణమూర్తి



ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ కృతుల పరిశీలనము

## (సిద్ధాంతగ్రంథము)

సాధారణ సంపాదకుడు

**జి.యస్. రెడ్డి (భూమన్)**

సంచాలకులు, తరిగొండ వెంగమాంబ వాఙ్మయప్రాజెక్ట్

"శ్వేత" తి.తి.దే. తిరుపతి


**రచయిత : ఆచార్య కె.జె.కృష్ణమూర్తి**

తరిగొండ వెంగమాంబ వాఙ్మయప్రాజెక్ట్

**"శ్వేత" తి.తి.దే. తిరుపతి**



**ప్రచురణ**

**కార్యనిర్వహణాధికారి**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2008**

**MĀTṚŚRĪ TARIGOṆḌA VEṄGAMĀMBA KṚTULA PARIŚĪLANAMU**

(Ph.D., Thesis)

Author:
Prof. K.J.Krishnamoorthy
Tarigoṇḍa Veṅgamāmba Vāṅmaya Project
"SVETA",T.T.D., TIRUPATI.

TTD "SVETA" Religious Publications Series No.

©All Rights Reserved

Second Edition: 2008
Copies : 1000

Published by
K.V.RAMANACHARY,I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
TIRUPATI-517 507

Printed at
TTD.Press, Tirupati.

ఓం నమో వేంకటేశాయ

## * ముందుమాట *

**భూమన కరుణాకర రెడ్డి** 15-07-2008.

అధ్యక్షులు,

తి. తి. దేవస్థాన పాలకమండలి,

తిరుపతి.

శ్రీవేంకటేశ్వరస్వామిని ఉద్దేశించి రచనలను వెలయించిన సారస్వత మూర్తుల్లో తాళ్ళపాక అన్నమాచార్యుల అనంతరం పేర్కొనదగిన మహాకవయిత్రి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ. అన్నమాచార్యులవలె సహస్ర మాస జీవియై విరాజిల్లిన ఈ భక్త కవయిత్రీ శిరోమణి పదునెనిమిది గ్రంథాలను రచించి, శ్రీవారికి సాటిలేని సాహితీ సేవలను నిర్వర్తించి చరితార్థురాలయింది.

వెంగమాంబ రచించిన రచన లన్నింటిలోనూ అగ్రగణ్యమైనది 'శ్రీవేంకటాచల మాహాత్మ్యము'. ఈ పద్యకావ్యం కవయిత్రి లేఖినినుండి అవతరించిననాటినుండి తిరుమల పుణ్యక్షేత్ర మహిమలను గూర్చి, కలియుగ ప్రత్యక్షదైవంగా అచ్చట వెలసియున్న శ్రీనివాసుని ప్రభావాన్ని గూర్చి, తిరుచానూరులో నెలకొనియున్న అలమేలుమంగమ్మ (వీరలక్ష్మి) అమ్మవారిని గురించి ఆంధ్రావనిలో విపులంగా ప్రచారం కావించటంలో సార్థకమై వరలుతున్నది.

తిరుమల తిరుపతి దేవస్థానముల యాజమాన్యం ఈ "కవితా తపస్విని" తిరుమలయందు నిర్వహించిన సాహితీ సేవను, ముత్యాలహారతి లాంటి కైంకర్య విశేషాలను దృష్టిలో నిడుకొని, ఇటీవల రెండేళ్లక్రితం "మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వాఙ్మయ ప్రాజెక్టు"ను ఏర్పరచింది. ఈ ప్రాజెక్టు నిర్వహిస్తూవున్న పలురకాల సాహిత్య.

సాంస్కృతిక కార్యక్రమాలవల్ల వెంగమాంబ వాఙ్మయ ప్రశస్తి ఈనాడు విశ్వవ్యాప్తమై విరాజిల్లుతూవుంది.

శ్రీవేంకటనాథుని సన్నిధిలో కవయిత్రీమతల్లిగా వర్ధిల్లిన వెంగమాంబగారి రచనలపై తొలుదొలుత రచింపబడిన పరిశోధనగ్రంథం ఈ "మాతృశ్రీ తరిగొండ వెంగమాంబకృతుల పరిశీలనము". ఈ గ్రంథం తి.తి.దేవస్థానముల ఆర్థిక సహాయంతో 1983లో ప్రథమతః ముద్రింపబడింది.ఈ సిద్ధాంతం గ్రంథం ఇకమీదట ఈ రంగంలో ఇతోఽధికంగా పరిశోధన కొనసాగించే విద్యార్థినీ, విద్యార్థులకు, తదితరులకు కరదీపికగా ఉండగలదు. ఈ ఉదాత్త ఆశయంతోనే ఇన్నేళ్ళ పిమ్మట తి.తి.దే. దీనిని పునర్ముద్రిస్తున్నది. ఈ వాఙ్మయ ప్రాజెక్టులో పరిష్కర్తయైయున్న రచయిత ఆచార్య కె.జె.కృష్ణమూర్తిగారిని ఈ సందర్భంలో అభినందిస్తున్నాను. ఈ వాఙ్మయ ప్రాజెక్టు ఇలాంటి రచనలను ఇంకా అనేకం ప్రకటించగలదని ఆశిస్తున్నాను.

సదా శ్రీవారి సేవలో

**భూమన కరుణాకర రెడ్డి**

# * నామాట *

కె.వి.రమణాచారి, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి,
తి.తి.దేవస్థానములు,
తిరుపతి.

22- 07-2008.

'ఆనందనిలయు'డయిన తిరువేంకటనాథదేవుణ్ణి భక్తిసౌరభాలు వెదచల్లే కావ్యకుసుమాలతో అపూర్వంగా ఆరాధించి, తరించిన మహిత సాహితీమూర్తి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ. ఈ కవయిత్రీ శిరోమణి సృజించిన సారస్వతంయొక్క వైశిష్ట్యాన్ని గుర్తించిన తిరుమల తిరుపతి దేవస్థానం ఇటీవలి కాలంలో ఈ "కవితాతపస్విని" పేరిట ఒక వాఙ్మయ ప్రాజెక్టును "శ్వేత" భవనంలో నెలకొల్పింది.

ఈ ప్రాజెక్టు ద్వారా వెంగమాంబగారి ముద్రితాముద్రిత రచనలను చక్కగా పరిష్కరించి పీఠికలతో ప్రచురించటం, ఈ భక్తకవయిత్రి భాషా, సాహిత్యాలపై సదస్సులను జరుపటం, హరికథలు, సంగీత సమావేశాలు - ఇత్యాది సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలవల్ల వెంగమాంబ వాఙ్మయ విశిష్టత ప్రపంచానికి విశదంగా వెల్లడయ్యింది. "శ్వేత" సంస్థ సంచాలకులు శ్రీ'భూమన్'గారి దీక్షాదక్షతలు ఇందులకు ముఖ్యకారణం!

తి.తి.దేవస్థానం - తాళ్లపాక అన్నమాచార్యాదుల కృతులపై పరిశోధనా వ్యాసంగాన్ని ప్రోత్సహించిన విధంగానే - తరిగొండ వెంగమాంబ రచనల పరిశోధన విషయమై విశ్వవిద్యాలయాల్లోని అర్హులైన విద్యార్థినీ, విద్యార్థులకు నెలసరి పారితోషికాలను ప్రకటించింది. ఈ నిర్ణయం ఈ రంగంలో కృషి చేసే వారందరికీ శుభ వర్తమానం!

"మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ కృతుల పరిశీలనము" - అనే ఈ పిహెచ్.డి. సిద్ధాంతగ్రంథం తి.తి.దేవస్థానముల ఆర్థిక సాహాయ్యంతో 1983లో ముద్రితమైంది. ఇది ఈ రంగంలో పరిశోధన (Research) కొనసాగింపదలంచేవారికి మార్గదర్శకంగా ఉంటున్నది. ఇందువల్ల తి.తి.దేవస్థానంల ఈ గ్రంథాన్ని ప్రచురించటానికి ఆమోదించింది.

ఇలాగే, ఈ ప్రాజెక్టు అచిరకాలంలో తరిగొండ వెంగమాంబగారి తదితర రచనలను, సాహితీ సదస్సులకు సంబంధించిన వ్యాస సంకలనాలను, సంచికలను, తులనాత్మక పరిశీలనలను, శబ్దసూచికలు (concordances) మొదలైనవాటిని క్రమేణ ప్రచురించగలదని ఆశిస్తున్నాను.

సదా శ్రీనివాసుని సేవలో

(signature)

కె.వి. రమణాచారి

# * అభినందన *

"భూమన్"　　　　　　　　　　　　　　　　　　01 -07 -2008.

సంచాలకులు,

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వాఙ్మయప్రాజెక్టు,

"శ్వేత", తి. తి. దేవస్థానములు, తిరుపతి.

"మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ కృతుల పరిశీలనము" - అనే ఈ గ్రంథం ఈ కవయిత్రి రచనలపై తొలుదొలుత వెలువడిన పిహెచ్.డి. సిద్ధాంతగ్రంథం. ఈ పరిశోధన గ్రంథం తిరుమల తిరుపతి దేవస్థానముల ఆర్థిక సాహాయ్యంతో 1983లో ప్రథమంగా ప్రచురితమయింది. మళ్లీ ఇప్పుడు - అనగా ఇరవైయైదేళ్ల తరువాత తి.తి.దేవస్థాన ప్రచురణగా వెలుగుచూస్తూవుంది.

తాళ్లపాక అన్నమాచార్యుల సారస్వతంవలెనే తరిగొండ వెంగమాంబ వాఙ్మయంకూడా వేంకటేశ్వరుని అనుగ్రహంచేతనే ఆవిర్భవించింది కావడంవల్ల, ఈ వాఙ్మయంయొక్క విశిష్టతనూ, ప్రాముఖ్యాన్నీ గుర్తించిన తి.తి.దే. యాజమాన్యం రెండేళ్లక్రితం 2006లో ఈ భక్త కవయిత్రి పేరిట ఒక వాఙ్మయ ప్రాజెక్టును "శ్వేత" భవనంలో పాదుకొల్పింది. అప్పటి నుండి ఈ కవయిత్రియొక్క ముద్రిత, అముద్రిత రచనలను ఈ ప్రాజెక్టు పక్షాన చక్కగా పరిష్కరించి ప్రకటించడం జరుగుతున్నది.

అన్నమయ్యలాగానే వేంకటేశ్వరస్వామికి ఆంతరంగిక భక్తురాలయినందువల్ల ఈ మహాకవయిత్రి రచనలపై పిహెచ్.డి. నిమిత్తమై పరిశోధన సాగించే విద్యార్థినీ, విద్యార్థులకు ప్రోత్సాహకరంగా టి.టి.డి. ఇటీవల నెలసరి పారితోషికాన్ని సైతం ప్రకటించింది! అలాంటి

అభ్యర్థులకు ఈ సిద్ధాంతగ్రంథం అందుబాటులో ఉంటే, ఈ రంగంలో మార్గదర్శకంగా ఉంటుందనే అభిప్రాయంతో తి.తి.దే. అధికారులు ఈగ్రంథాన్ని ఈ ప్రాజెక్టు పక్షాన ప్రచురించటానికి సమ్మతించారు. ఇది ఎంతో ముదావహమైన విషయం!

రచయిత కె.జె.కృష్ణమూర్తి ఆనాడు తనకు లభించిన ఆకరాలను అన్నింటిని చక్కగా వినియోగించుకొని, ఈ సిద్ధాంత గ్రంథాన్ని పది ప్రకరణాలుగా సమకూర్చియున్నాడు. ఈతని కృషికి కీ.శే. ఆచార్య జీరెడ్డి చెన్నారెడ్డి, ఆచార్య జి.యన్.రెడ్డి - లాంటి విద్యావేత్తల ఆశీస్సులూ, అండదండలూ తోడుకాగా, ఈ పరిశోధన గ్రంథం ఈవిధంగా రూపొందింది.

ఈ గ్రంథం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ సృజించిన భాషా, సాహిత్యాలపై, ఆమె ప్రకటించిన తాత్త్విక విషయాలపై - వాఙ్మయ ప్రపంచంలో ఇతోఽధిక పరిశోధనను ప్రోత్సహింపగలదని విశ్వసిస్తున్నాను. ఈ వాఙ్మయ ప్రాజెక్టులో పరిష్కర్తగా ఉద్యోగిస్తూవున్న ఈ రచయితను అభినందిస్తున్నాను.

భూమన్

***Prof. J. Chenna Reddy, M.A.,PH.D.,***
***RETIRED PROFESSOR***
***(Sri Venkateswara University)***
***533,Balaji Colony,***
***TIRUPATI - 517502.***

## ఆశీస్సు

డా॥ కె.జె.కృష్ణమూర్తిని ఆతని విద్యార్థిదశనుండియు నే నెఱుగుదును. అతడు నాకు శిష్యప్రాయుడు. అతని వైదుష్యమును గూర్చిగాని, ఇతోఽధిక జ్ఞానసముపార్జనకృషినిగూర్చి గాని ఎవరును సందేహింపరు. నే నిచట వానినిగూర్చి కీర్తింప నక్కఱ లేదు. అతనితో పరిచయము గల ఏ ఒక్కరును ఆ విషయమున ఏకీభావము కలవారే. డా॥ కృష్ణమూర్తి నాకు సహాయకుడుగా నాలుగేండ్లపాటు ప్రాచ్యపరిశోధనాలయమునందు పనిచేసియున్నాడు.

ఇప్పుడు డా॥ కృష్ణమూర్తి ప్రేమతో నా కిచ్చిన "తరిగొండ వెంగమాంబ కృతులు-సవిమర్శకపరిశీలనము" అను గ్రంథమును శ్రద్ధగా రెండవసారి సాంతముగా జదివితిని. ఇందతని కృషి అద్వితీయము. వెంగమాంబను విదుషీమణిగా, మహాయోగినిగా, పరమభక్తురాలుగా గుర్తించి, ఆ యా గుణములను ఆమెయందు సప్రమాణముగా నిరూపించిన ధన్యజీవి కృష్ణమూర్తి. ఆమెయందలి పై గుణము లెవ్వియు ప్రశస్తి కెక్కకపోవుటకు కారణముల నూహించిన, మనమెంతో సిగ్గుపడవలసి వచ్చును. వాఙ్మయచరిత్రకారులు స్త్రీ యను కారణముననో - మఱెందుకో - ఆమె సాహితీవిశిష్టతనుగూర్చి యెక్కువగా చర్చింపలేదు. ఆ కారణముచేతనే ఆమె వాఙ్మయములో చాలభాగము అముద్రితముగనో - ముద్రితమైనను - అనాదృతముగనో ఉండిపోయినది.

డా॥ కృష్ణమూర్తి మిక్కిలిశ్రమ కోర్చి మదరాసు, బెంగుళూరు, తరిగొండ పరిసరములలోని వాయల్పాడు మున్నగుచోట్ల పర్యటించి, ముద్రితాముద్రితములైన వెంగమాంబ కృతుల నన్నింటిని - అందును - ఇదివఱకు వెలుగు చూడని 'జలక్రీడావిలాసము'ను సంపాదించుటలో మన అందఱ ప్రశంసకు పాత్రుడైనాడు.

వెంగమాంబ జీవితచరిత్రము వ్రాసినవారు ఎన్నియో మహిమలు, అభూతకల్పనలు ఆమె జీవితమునకు జోడించి, ప్రాయోభావమునకు దూరముగా సంభావ్యము లెవ్వియో, అసంభావ్యము లెవ్వియో తెలియ సేయక సత్యచరిత్రమును మఱుగుపఱచియున్నారు. డా॥ కృష్ణమూర్తి అట్టి అభూతకల్పనలను ప్రక్కకు నెట్టి, కేవల గ్రంథస్థాధారములతో వెంగమాంబ జీవించిన కాలమును అసందిగ్ధములు, సప్రమాణములునైన తిరుగులేని సాక్ష్యాధారములతో నిర్ణయించి, ఆ విషయమున పూర్వము నెలకొనియున్న అపోహములను తాఱుమాఱు చేయుటతో అతని కృషి సార్థక మయి, వాఙ్మయచరిత్రలో ఆ నిగమనము చిరస్థాయిగ నిలిచిపోయినది.

వెంగమాంబ రచించిన కృతులను వివిధప్రక్రియలలో వింగడించి, ఒక్కొక్కవిభాగమును కూలంకషముగా, ఐదుప్రకరణములలో విమర్శించి వాఙ్మయమున వాని వాని స్థానములను చక్కగా ఈ గ్రంథమున డా॥కృష్ణమూర్తి నిర్ణయించియున్నాడు.

వెంగమాంబ నివసించిన స్థలము, పరిసరములనుబట్టి ఆమె వాడిన భాషయందలి వైలక్షణ్యమును సోదాహరణముగా వివరించుటలో అతడు కృతకృత్యుడయ్యెనని చెప్పవచ్చును. ఆమె వాడిన భాష రాయలసీమప్రాంతమందు శిష్టవ్యవహారములో నుండినదనియు, ఆనాడు వాడుకలో నుండి నేటికిగూడ నిఘంటువుల కెక్కనివి, ఎక్కినను భిన్నార్థములలో వాడబడినవి - అగు శబ్దములు, సమాసములు, మాండలికములగు క్రియాపదములు మున్నగున వెన్నియో కల వనియు పరిశోధించి వెలికి దీసి, వానిని సోదాహరణముగా, ఒక ప్రకరణ మంతట ప్రదర్శించెను.

డా॥కృష్ణమూర్తి ఇంతకంటె విలువైన పరిశోధన ఫలితములను జిజ్ఞాసువుల కందించుట కనువైన ఆయురారోగ్యైశ్వర్యములను శ్రీ వేంకటేశ్వరస్వామి అతనికి ప్రసాదించుగాత.

ఇట్లు
సుధీవిధేయ
జీరెడ్డి చెన్నారెడ్డి.

15-7-1983,
తిరుపతి.

***Prof. G.N. Reddy,*** *M.A.,M.LIT.,PH.D.,*
***PROFESSOR OF TELUGU,***
***Department of Telugu Studies,***
***Sri Venkateswara University,***
***TIRUPATI - 517502.***

# ప్రశంస

నన్నయనాటినుంచి నేటివరకు తెలుగువాఙ్మయరంగంలో వెలసిన రచయితలకు సంబంధించి ఒక విశేషాన్ని గుర్తించి చెప్పవచ్చు. అది ఏమిటంటే: ప్రాచీనకాలంలో తెలుగురచయిత్రుల సంఖ్య స్వల్పాతిస్వల్పం; ఆధునికకాలంలో అధికం. ఇందుకు కారణం దేశకాలసామాజికపరిస్థితులే. అయినా ఈనాడు తెలుగులో వున్నంతమంది రచయిత్రులు మరే ఇతరభారతీయభాషల్లో లేరు. ఇది అత్యుక్తిమాత్రం కాదు. అసలు నిజం.

తెలుగుకు నన్నయ ఆదికవి అనుకుంటే, ఆదికవి తర్వాత ఐదువందల సంవత్సరాలకుగాని తెలుగులో ఆదికవయిత్రి అవతరించ లేదు. అలా అవతరించిన తొలితెలుగు కవయిత్రి తాళ్ళపాక తిమ్మాంబ, రాజాస్థానాల్లో కాకుండ తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిసన్నిధిలో వెలసిన విషయం గమనార్హం. తిమ్మాంబ తర్వాత మనకు కనిపించే ప్రాచీన తెలుగు కవయిత్రులు మొల్లమ్మ, రంగాజమ్మ, ముద్దుపళని మొదలైనవారు. ప్రాచీన తెలుగుకవయిత్రుల్ని ఎంత లెక్క పెట్టినా చేతివ్రేళ్ళ సంఖ్యకు మీరిపోరు.

అయితే తెలుగుకవయిత్రుల్లో మగమహాకవులకు సరితూగ గల మహాకవయిత్రి ఉన్నారా? - అని ప్రశ్నిస్తే - ఉన్నారు, ఉన్నది ఒక్కరే: ఆ ఒక్కరే తరిగొండ వెంగమాంబ-అని నిస్సంశయంగా చాటి చెప్పవచ్చు. తరిగొండ వెంగమాంబ శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో వెలసి తరించిన సాహిత్యమూర్తి; అష్టాదశగ్రంథకర్త్రి; మహాకవయిత్రిగా కీర్తింపదగిన రచయిత్రి. ప్రాచీన తెలుగు కవయిత్రుల్లో ఈమె కడపటి కాంతిదీపం. ఎందుచేతనో తెలుగువాఙ్మయచరిత్రకారుల్లో ఎవ్వరూ వెంగమాంబ విషయంలో న్యాయం చేయలేదు. ఆమె జీవితం ఆసక్తిదాయకం; ఆమె సాహిత్యకృషి అద్భుతావహం; ఆమె కవితాశిల్పం కీర్తనీయం.

తెలుగువాఙ్మయచరిత్రకారులు వెంగమాంబయెడ చూపిన ఉదాసీనతను, ప్రదర్శించిన అన్యాయాన్ని సరిదిద్ది తెలుగుకవుల, కవయిత్రుల పంక్తిలో వెంగమాంబా మహాకవయిత్రికి సముచితస్థానాన్ని

తన పరిశోధనాబలంతో స్థాపించిన ధన్యపరిశోధకులు డా॥కృష్ణమూర్తిగారు. తొలి తెలుగుకవయిత్రి తాళ్లపాక తిమ్మాంబను అపూర్వంగా లోకానికి పరిచయం చేసిన ఘనత కీర్తిశేషులు వేటూరి ప్రభాకరశాస్త్రిగారికి చెల్లుతుంది. తరిగొండ వెంగమాంబ తెలుగులో బహుగ్రంథకర్త్రి అయిన మహా కవయిత్రి అన్న సత్యాన్ని ఆవిష్కరించిన కీర్తి డా॥ కృష్ణమూర్తిగారికి దక్కుతుంది. తాళ్ళపాక తిమ్మాంబ, తరిగొండ వెంగమాంబ లిద్దరూ తిరుమలక్షేత్రనివాస పునీతులు కావడంకూడా దైవికమైన విశేష మనే చెప్పాలి.

డా॥కృష్ణమూర్తిగారు తన గ్రంథానికి పెట్టినపేరు "తరిగొండ వెంగమాంబ కృతులు - సవిమర్శకపరిశీలనము." సాధారణంగా ప్రాచీనకవుల్ని, వారికృతుల్ని గురించి పరిశోధన చేసే విద్యార్థులు - గ్రంథనామం గ్రంథస్థవిషయసూచకంగా వుండాలనే దృష్టితో - ఇటువంటి శీర్షికల్నే ఎన్నుకుంటూ వుంటారు. ప్రాచీన తెలుగు కవులకు సంబంధించి ఇట్టి పరిశోధన చేసే విద్యార్థులకు డా॥ కృష్ణమూర్తిగారి రచన చక్కని నమూనాగా వుండగలదని నా విశ్వాసం. ఎందుచేతనంటే: ఆకరాల సేకరణలో, విషయవిశ్లేషణలో, కృతుల వింగడింపులో, ఉపపత్తుల ప్రదర్శనలో, అభిప్రాయ వ్యక్తీకరణలో విమర్శవిధానంలో, పూర్వాపర సమన్వయంలో, భాషాశైలిలో కృష్ణమూర్తిగారి రచన ప్రశంసార్హమైంది. పరిశోధకుల కుండవలసిన సునిశితదృష్టిని, క్షేత్రపర్యటనాసక్తిని పట్టుదలనుకూడ ఈ గ్రంథం ప్రతిబింబిస్తుంది.

మన విశ్వవిద్యాలయాల్లో పరిశోధకులుగా ముద్రవేసుకొని, నానావస్థలు పడి సిద్ధాంతవ్యాసాలు వ్రాసి సమర్పించి డిగ్రీలు పొందడం ఒకయెత్తు; వాటి ప్రచురణ ఒకయెత్తు. త్రిశతిసంఖ్యను సమీపిస్తున్న తెలుగుసిద్ధాంతవ్యాసాల్లో ముద్రణ భాగ్యానికి నోచుకొన్నవి చతుర్దశిని మించి వుండవు. ఉత్తమములైన కొన్ని సిద్ధాంత వ్యాసాలు పాఠకలోకాతీతాలుగా వుండిపోవడం శోచనీయం. ఇట్టి పరిస్థితుల్లో కృష్ణమూర్తిగారి రచన ముద్రణ పొందడంకూడా ప్రశంసనీయమే. ఈ గ్రంథం సహృదయ విమర్శకుల, పాఠకుల, పరిశోధకుల ఆదరణ పొందగలదని నా దృఢవిశ్వాసం.

12-8-1983,

తిరుపతి. -జి.యన్. రెడ్డి.

# పీఠిక

ఆంధ్రవాఙ్మయమున విలసిల్లిన కవయిత్రులలో తరిగొండ వెంగమాంబ దొక విశిష్టస్థానము. ఆమె వెలయించిన కృతులు సంఖ్యాధిక్యమును బట్టియే కాక, కవితా వైశిష్ట్యముచేతను పేరెన్నిక గన్నవి. వాటిపై నేటివరకు సవిర్శక మగు పరిశీలనము వెలువడక పోవుటకు కారణములు మూడు కనబడుచున్నవి:

1. తెనుగున ఇంతవరకు వెలువడిన వాఙ్మయచరిత్ర గ్రంథములలో తరిగొండ వెంగమాంబ సాహితీ విశిష్టతను గూర్చి చర్చించినవి చాల అరుదుగా నుండుట.

2. ఆమె సృజించిన వాఙ్మయరాశిలో అధికభాగము అముద్రిత, అజ్ఞాతస్థితిలో నుండుట.

3. ఆమె రచనలు కొన్ని ఒకప్పుడు ముద్రితము లైనను, అచ్చు తప్పులచే 'అపరూపము' లైన ఆ గుజిలీప్రతులుసైతము, ఈనాడపు రూపములై, అందుబాటులో లేకపోవుట.

పైన పేర్కొన్న కారణముల మూలముగా ఏర్పడిన ప్రతికూలతను అధిగమించి వెంగమాంబ కీర్తి వాఙ్మయజగత్తున ప్రకాశించుచుండుటకు ఆమె సారస్వతమూర్తి మత్త్వమే (Literary Personality) ముఖ్య హేతువు.

ఈ మహాకవయిత్రి కృతులను విషయముగాగైకొని ఈ పరిశోధన గ్రంథమును రచించుటలో పూర్వరంగముగా సమకూడిన పరిస్థితు లివి:

తెనుగుసాహిత్యపరముగా పరిశోధించుట కనువైన యొక అంశమును సూచింపుడని అస్మద్గురువర్యులు, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్యపరిశోధనా లయాధ్యక్షులు ఆచార్య జీరెడ్డి చెన్నారెడ్డి గారిని కోరితిని. తోడనే వారు తరిగొండ వెంగమాంబ కృతులపై పరిశోధన సల్పవలసినదని నన్నాదేశించిరి. మఱియు నా అభ్యర్థన మేరకు ఈ పరిశీలనమున నాకు పర్యవేక్షకులుగా నుండుటకు మిగుల వాత్సల్యముతో అంగీకరించిరి.

శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ తెలుగువిభాగాధ్యక్షవర్యులు, సహృదయులు, గురువర్యులు ఆచార్య జి.యన్. రెడ్డిగారు, పరిశోధనా విషయమునుగూర్చి విన్నవింపగా తమ ఆమోదమును దెలిపి, అమూల్యములైన పెక్కు సూచనలను, సలహాల నొసగి, మిగుల వాత్సల్యముతో ప్రోత్సహించిరి.

పై విషయము నుద్దేశించి నేను పరిశోధన కొనసాగించుటకు విశ్వవిద్యాలయాధికారులు అనుమతించి అనతికాలముననే, కాకతాళీయముగా ఈ కవయిత్రి అముద్రిత కృతి యగు 'జలక్రీడావిలాసము' (యక్షగానము)ను కనుగొనుట జరిగినది. ఈమె రచనగా లోక మెఱుగని ఈ యపూర్వకృతి లభించుట శుభసూచనగా నెంచి విషయ సేకరణకు మొదలిడితిని.

ఈ కవయిత్రియొక్క ముద్రితాముద్రితకృతులను సంపాదించు నిమిత్తము, జనశ్రుంతిలో నిలిచియున్న ఆమె జీవితచరిత్రాంశములను సేకరించుటకు తరిగొండ ప్రాంతమున సంచరించితిని. ఇందువలన ఆమె కృతులు కొన్ని లభించుటతోపాటు, అనేక విశేషములు తెలియ వచ్చినవి. ముఖ్యముగా కొందరు వృద్ధులను కలియుటవలన ఇతరత్ర లభ్యముకాని పెక్కు నూతనాంశములను సమకూర్చుకొను వీలు కలిగినది. ప్రజా హృదయమున వెంగమయెడ, ఆమె వాఙ్మయమునెడల నెలకొనియున్న నిర్మలభక్తి గౌరవములు చక్కగా అవగతములైనవి.

వెంగమాంబ సారస్వతావిర్భూతికి తావలములై యుండిన తరిగొండ లక్ష్మీనృసింహాలయము, మదనపల్లికి చేరువలో నున్న యోగ భోగసోమేశ్వరాలయము, తిరుమలలో ఈ మహనీయురాలు నివసించిన గృహము (మఠము), ఆమె యనుదినము ధ్యాననిమగ్న యగుచుండిన ఆరామప్రదేశము (తరిగొండమ్మతోట) మొదలగు స్థలములను దర్శించుటవలన కలిగిన అనుభూతి ఆమె రచనల సమ్యగధ్యయనమునకు మిగుల దోహదకారియైనది.

వీలైనపుడెల్ల ఈ కవయిత్రీమతల్లినిగూర్చి తెలుప గల పెద్దలను కర్ణాకర్ణికగా తెలిసికొని, మదరాసు, బెంగుళూరు, బేతంచర్ల మొదలైన

చోటుల నున్న అట్టి పెద్దలతో ఉత్తరప్రత్యుత్తరములను జరిపి, కొన్నిచోట్లకు స్వయముగా వెళ్లి, మఱికొంత అమూల్య సమాచారమును సేకరించితిని. ఇట్లు ఈ పరిశోధనావ్యాసంగమునకు వలసిన 'మూలద్రవ్యము'ను ఒనగూర్చుకొని, పరిశీలనాపూర్వకముగా ఈ సిద్ధాంతగ్రంథ రచనకు పూనుకొంటిని.

ఈ కవయిత్రి కృతులనుగూర్చిన పరిశోధనలో ఇది తొలుతటి దగుటచే, ఈ సారస్వతమూర్తియొక్క జీవితసంగ్రహము ఇందు మొదటిప్రకరణముగా కూర్పబడినది. వెంగమాంబ జీవితముపై వెలువడిన రచనలు దాదాపు ఏడెనిమిది యున్నను, అవన్నియు రంగప్రకాశదాసు ఈ శతాబ్ద్యారంభమున రచించిన 'శ్రీ తరిగొండ వేంకమాంబ చరిత్రము'నకు ఇంచుమించు ప్రతిరూపములే! ఇవన్నియు వెంగమాంబ భక్తిమహిమను ప్రధానీకరించుకొన్నవే యగుటచే, వాటిలో కొన్నిటియందు కొంత అభూతకల్పనయు చోటు చేసికొన్నది. ఈ ప్రకరణమున అట్లు గాక, కృతుల యాధారమున కవయిత్రి జీవితాంశముల కొక ఆనుపూర్విని నిర్మించి, ఆమె జీవనయాత్రను సాహితీప్రస్థానముతో సముచితరీతిని సమన్వయించుట జరిగినది. ఈ విధముగా ఈ ప్రకరణము కవయిత్రియొక్క సత్యసమ్మత మగు జీవితచిత్రణముగా రూపు దాల్చినది.

ఇందలి రెండవ ప్రకరణము వెంగమ కాలనిర్ణయము. దీనిని ప్రత్యేకప్రకరణముగా పరిగణించుటలో ప్రకృష్టమైన కారణము కలదు. ఈమె కాలమునుగూర్చి ఇంతదనుక సవ్యముగా చర్చింపబడకపోవుట అటుండగా, ఈ కవయిత్రి ప్రధానముగా పందొమ్మిదవ శతాబ్దికి చెందిన దనెడి అపోహ వాఙ్మయప్రపంచమున స్థిరముగా కాలూని యున్నది. ఈ భావన పుణ్యమా యని, ఈ కవితామతల్లి సారస్వతము పండితలోకపు ఔదాసీన్యమునకు కొంతవరకు గుఱి యైనది.

ఇట్లుండగా, ఈ యన్వేషణలో క్రొత్తగా లభించిన చారిత్రక, సారస్వతాద్యాధారముల సాహాయ్యమున ఈ కవయిత్రి జీవితకాలమును సప్రమాణముగా నిందులో నిర్ణయించుట జరిగినది. వెంగమాంబ క్రీ.శ. 1730-'35 సంవత్సరముల మధ్యకాలమున జన్మించి క్రీ.శ.1817

ఈశ్వరసంవత్సరమున పరమపదము నొందినదను ఈ నిర్ణయము ఈమె సారస్వతమునుగూర్చిన సదవగాహనకు మూలకందమై వెలసినది.

మూడవప్రకరణము వెంగమాంబ కృతుల వింగడింపు. ఈ విభజనము 1) కృతులస్థితి (ఉనికి) 2) ఆకృతి (స్వరూప, స్వభావములు) - అనెడు రెండంశములను ప్రధానముగా దృష్టిలో నిడుకొని చేయబడినది. లభ్యములు, అలభ్యములు, ముద్రితములు, అముద్రితములు - అను విభజనము తొలి యంశమునకు, ప్రక్రియ, ఛందస్సు - ఇత్యాదుల ననుసరించిన వింగడింపు మలి యంశమునకు సంబంధించి యున్నవి. మొదటిరకము విభజనమువలన వెంగమ సారస్వతముయొక్క విస్తృతి, విలువ; రెండవరకము విభజనమువలన ఆ సారస్వతముయొక్క వైచిత్రి, వైవిధ్యము-వెల్లడి యగుచున్నవి. కృతిసేకణలో రచయితయొక్క కృషిని సూచించుచున్న ఈ ప్రకరణము, వెంగమ సారస్వతముపై వెలువడ గల భావిపరిశోధనలకు సుకర్యకరమైన 'సూచిక'గా అమరియున్నది.

నాలుగవ ప్రకరణమునుండి యెనిమిదవప్రకరణమువరకు గల యైదు ప్రకరణములలో శతకములు, యక్షగానములు, ద్విపదకృతులు, పద్యకావ్యములు, తత్త్వకీర్తనలు-అను క్రమమున ఒక్కొక్కప్రకరణములో ఒకే ప్రక్రియకు చెందిన ఈ కవయిత్రి రచన లెల్ల నొకచో విమర్శనాత్మకముగ సమీక్షింపబడినవి. ఇట్లు ఈ కవయిత్రి రచనలను వేర్వేరు ప్రకరణములుగా వింగడించి పరిశీలించుటలో ఈమె చేపట్టిన రచనాక్రమముకూడ దృష్టిలో నుండినది. ఉదాహరణమునకు వెంగమ తొట్టతొలిరచన శతకము గావున, ఆమె రచించిన శతకము లన్నిటిని ఒకేచోట నాల్గవ ప్రకరణమున పరిశీలించుట జరిగినది. అట్లే ఆమె రెండవకృతి యక్షగానము గావున, ఆమె యక్షగాన రచనలన్నియు ఐదవప్రకరణమున పరిశీలింపబడినవి. ఈ 'కృతిపరిశీలన ప్రకరణముల'లో ఒక్కొక్క దానియందు ఆ యా కృతులను సవిమర్శముగా, విపులముగా సమీక్షించిన పిదప ఆ ప్రకరణము చివర ఆ రచన లన్నింటి సామాన్య లక్షణములు (.common features) క్రోడీకరింపబడినవి.

ఇట్లు క్రమపరిణతముగా, బహుముఖముగా వెల్లివిరిసిన ఆమె కవితాప్రతిభను పరామర్శించిన తదుపరి, తొమ్మిదవప్రకరణమున కవయిత్రియొక్క భాషావైశారద్యము సమీక్షింపబడినది. వెంగమ 'బాలభాష' యందలి అంతరార్థము, పాత్ర, వర్గ, వయో, జాత్యనుగుణముగా ఆమె తన కృతులలో ప్రదర్శించిన వ్యావహారిక భాషావైవిధ్యము, బహు భాషాభిజ్ఞత ఇందు సోదాహరణముగా వివరింపబడినవి. తదితర మహాకవులవలె వెంగమాంబ తాను ప్రయోగించు భాషావిషయ మున స్పష్టమైన అవగాహనకలదనియు, సమకాలీనజీవద్భాషా స్వరూప, స్వభావములను చక్కగా ఆకళించుకొనిన భాషాతత్త్వ వేత్తయనియు ఈ నవమప్రకరణమున నిరూపింపబడియున్నది.

పదవప్రకరణము వెంగమ మూర్తిమత్త్వచిత్రణము. స్వభావము, వైదుష్యము, జీవితదృక్పథము, భక్తి, మతము-వేదాంతము, ప్రాచీనకవిప్రభావము, అనంతరకవులపై ప్రభావము - ఇత్యాది శీర్షికలక్రింద వెంగమాంబ వ్యక్తిత్వమును ప్రదర్శించుటద్వారా, ఇందు ఈ కవయిత్రి అంతరమూర్తిమత్త్వమును సుస్పష్టరేఖలలో ఆవిష్కరించుట జరిగినది. ఇందుమూలముగా ఆంధ్రసారస్వతమున వెంగమాంబకు గల స్థానము చక్కగా నిరూపితమైనది. ఆంధ్రవాఙ్మయమున అవతరించిన కవివర్యులలో పోతన యెట్లు ద్వితీయుడో, కవయిత్రులలో వెంగమాంబ అట్లద్వితీయ కవయిత్రి.

శతకములలో శ్రీకృష్ణమంజరి, యక్షగానములలో విష్ణుపారిజాతము, ద్విపద కావ్యములలో రాజయోగామృతసార, రమాపరిణయములు, పద్యకావ్యములలో శ్రీవేంకటాచలమహాత్మ్యము ఈ కవయిత్రీమతల్లి సాహితీ సౌందర్యమునకు ప్రాతినిధ్యము వహించు మనోజ్ఞకృతులు.

ఇట్లు పర్యవేక్షకు లగు పెద్దలు నిర్దేశించిన పథమున పయనించుటలో ఈ పరిశోధనగ్రంథ మీ రీతిని రూపొందినది. ఈ పయనింపు 'సకల తత్త్వార్థవివేకిని', 'కవితా తపస్విని', 'మాతృశ్రీ' తరిగొండ వెంగమాంబ సారస్వతమందలి వైశిష్ట్యమును ఇతఃపూర్వాధికముగా వెల్లడించుటద్వారా సాహితీలోకమున ఇంపు నింప గలదని ఆశింతును.

శ్రీకృష్ణజయంతి,

31-8-1983. -రచయిత

2




ఈ పరిశోధనగ్రంథము

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ యిలవేలుపు,

మహామహిమోపేతు డయిన

తరిగొండ శ్రీ లక్ష్మీనృసింహస్వామివారి

దివ్యశ్రీ పాదారవిందములకు

సభక్తికముగా సమర్పితము.

# కృతజ్ఞతాంజలి

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వాఙ్మయ పరిష్కరణ ప్రాజెక్టును నెలకొల్పటంలోనూ, దానికి శాశ్వత స్థితిని ప్రసాదించటంలోనూ ఆదినుండీ మూలవిరాట్టుగా విలసిల్లుతూవున్న శ్రీవారి ప్రతినిధులు,సహృదయ వతంసులు, సుగృహీత నామధేయులు, పరిపాలనా దక్షులు, తిరుమల తిరుపతి దేవస్థాన పాలకమండలి అధ్యక్షవర్యులు శ్రీభూమన కరుణాకరరెడ్డి మహోదయులకు, తిరుమల తిరుపతి దేవస్థాన పాలకమండలి సభ్యులెల్లరకు నా అనేక ధన్యవాదములు.

శ్రీవారి ప్రతినిధులు స్మితపూర్వభాషులు, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వాఙ్మయ పరిష్కరణ ప్రాజెక్టుకు చిరస్థాయి యయిన అభ్యుదయాన్ని, సమగ్రతను ప్రసాదిస్తూవున్న సహృదయతంసులు తి.తి.దే. శ్రీకార్యనిర్వహణాధికారివర్యులు, పరిపాలనాదక్షులు, సుగృహీత నామధేయులు శ్రీ కె.వి. రమణాచారి, ఐ.ఎ. యస్., మహోదయులకు నా అనేక ధన్యవాదములు.

తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి, సౌజన్యహృదయులు శ్రీ ఎ.వి. ధర్మారెడ్డి గారికి నా అనేక ధన్యవాదములు.

మాతృశ్రీ తరిగొండ వాఙ్మయ పరిష్కరణ ప్రాజెక్టుయొక్క సర్వతోముఖమైన వికాసానికి తమ వ్యక్తిత్వ లక్షణమైన ఉద్యమస్ఫూర్తిని సమన్వయించి ఉత్సాహ, ప్రభు, మంత్రశక్తి పూరితమైన దక్షతతో ముందుకు నడిపిస్తూ వున్న తి.తి.దే. "శ్వేత" సంచాలకులు, "భూమన్" గా సుగృహీతనామధేయులైన శ్రీ భూమన్ సుబ్రహ్మణ్యం రెడ్డి మహోదయులకు నా అనేక హృదయపూర్వక ధన్యవాదములు.

తి.తి.దే. పౌరసంబంధాధికారివర్యులు, సరసహృదయులు శ్రీయుతులు కె. రామ్‌పుల్లారెడ్డిగారికి నా అనేక కృతజ్ఞతాభివాదములు.

సహృదయులు మాతృశ్రీతరిగొండ వెంగమాంబ వాఙ్మయప్రాజెక్టు సమన్వయకర్త ఇన్‌ఛార్జ్ విద్వాన్ డా॥ పమిడికాల్వ చెంచుసుబ్బయ్య గారికి హార్దమైన నా కృతజ్ఞతాభినందనములు.

"శ్వేత" కేంద్రగ్రంథాలయం లైబ్రేరియన్ సోదరీమణి శ్రీమతి ఎన్. లీలావతి గారికి, వారి సహాయోద్యోగులయిన మిత్రబృంద మందరికీ - "శ్వేత" సంస్థ కార్యాలయం సూపరిండెండెంట్ శ్రీ వి. దామోదరంగారికి, శ్రీదీనదయాళ్(యు.డి.సి.)గారికి వారి సహెూద్యోగబృందమందరికీ, నా అనేక కృతజ్ఞతాభినందనములు.

ఈ పుస్తకమును ముచ్చటగా ముద్రించిన తిరుమల తిరుపతి దేవస్థాన ముద్రణాలయ అధికారులకు నా కృతజ్ఞతాభివందనములు.

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబా మహాకవయిత్రియొక్క ఆరాధ్యదైవమయిన "శ్రీ తరిగొండ శేషకుధరాధ్యక్షు"నకు నా భక్తి పూర్వక ప్రసూనాంజలి.

కె. జె. కృష్ణమూర్తి

కె. జె. కృష్ణమూర్తి

# విషయసూచిక


| | | పుట |
|---|---|---|
| | **ముందుమాట** | iii |
| | **నామాట** | v |
| | **అభినందన** | vii |
| | **ఆశీస్సు** | ix |
| | **ప్రశంస** | xi |
| | **పీఠిక** | xiii |
| | **కృతజ్ఞతాంజలి** | xviii |
| 1. | **అ) జీవిత సంగ్రహము** | 1 -48 |

తరిగొండ-ఐతిహ్యము 1, వెంగమాంబ జననము - బాల్యము 4
వివాహము 6, గురూపదేశము గ్రంథరచన 9, [illegible] 11,
మహిమలు 12, ప్రవాసము 15, తిరుమల యాత్ర 17, తాళ్ళపాక
వారితో వైషమ్యము 18, [illegible] 20, బృందావనము -22
ముత్యాలహారతి 24 [illegible]-26 మహాసమాధి 27
[illegible] 28.
ఆ) జీవిత సంగ్రహము జ్ఞాపికలు 33

| | | |
|---|---|---|
| 2. | **అ) జీవితకాలము** | 49-64 |

చరిత్రకారుల నిర్ణయము 49, కాలనిర్ణయమునకు ఆధారములు 50,
గ్రంథరచనల కాలనిర్ణయము 54.
ఆ) జీవితకాలము-జ్ఞాపికలు 59.

| | | |
|---|---|---|
| 3. | **అ) వెంగమాంబ కృతుల వింగడింపు** | 65-77 |

అలభ్యములు 66, ప్రక్రియనుబట్టి వింగడింపు 72,
ఛందస్సును బట్టి వింగడింపు 73, ఇతివృత్త స్వభావమునుబట్టి
వింగడింపు 74, ప్రతిపాదితవిషయమునుబట్టి వింగడింపు 74.
ఆ) వింగడింపు జ్ఞాపకలు 76.

| | | |
|---|---|---|
| 4. | **అ) వెంగమాంబ కృతి శతకములు** | 77-99 |
| | I. తరిగొండ నృసింహశతకము | 78-89 |

రచనోద్దేశము 78, ప్రతిపాద్యవిషయములు 79, రచనావైచిత్రి 84,
వైశిష్ట్యము 87, వికల్ప కవిత్వము 88,
సంస్కృతమున శతక రచన 89.

II. కృష్ణమంజరి **90-99**

ప్రత్యేకత 90, ప్రపత్తి 91, ఆత్మాశ్రయత 93.
ఆ) వెంగమాంబ కృత శతకములు-జ్ఞాపికలు 97.

5. **అ) యక్షగానములు** **99-173**

I. చెంచునాటకము **99-114**

కథాస్వరూపము 101, పాత్ర చిత్రణము 105, వర్ణనలు 109,
ఇతర విశేషములు 113, కృతిసందేశము 114.

II. బాలకృష్ణనాటకము **115-121**

పాత్రచిత్రణ117, నాటకీయత 118, శైలి 119.

III. పారిజాతాపహరణము **121-138**

కథాసంగ్రహము 122, కథా సంవిధానము 125,
పాత్రచిత్రణము 133, నాటకీయత 135, కావ్యసందేశము 136,
సిద్ధేంద్రయోగికృతిపై ప్రభావము 136.

IV. జలక్రీడావిలాసము **139-147**

కథావస్తువు 139, పాత్రచిత్రణము 141, వర్ణనలు 142, శైలి 146.

V. శివనాటకము **147-154**

కథాసంగ్రహము 147, పాత్రచిత్రణ 150, వర్ణనలు 152.
ఇతర విశేషములు 153.

VI. ముక్తికాంతావిలాసము **154-164**

కథాసంగ్రహము 154, కథాకల్పనము 156, నాటకీయత 159,
ఇందలి రచనావిశేషములు 162.

VII. గోపికానాటకము **164-173**

ఆ) యక్షగానములు-జ్ఞాపికలు 170.

6. **అ) ద్విపదరచనలు** **174-234**

I. రాజయోగసారము **174-185**

ఇతివృత్తము 175, మార్పులు , చేర్పులు 176,
అనువాద నైపుణ్యము 180,నామౌచిత్యము 181,
ఇతర విశేషములు 182.

II. రమాపరిణయము **185-192**

ఇతివృత్తము 185, పాత్రచిత్రణ 186, సంభాషణలు 188,
వర్ణనలు 190, ఇతరవిశేషములు 192.

III. శ్రీభాగవతము **193-215**

వెంగమ భాగవతకథ 193, పూర్వానువాదములు 194, కృతి
రచనాహేతువు 196, మార్పులు, చేర్పులు 199, పాత్రపోషణ 206,
వర్ణనలు 209, ఇతరవిశేషములు 211.

IV. వాసిష్ఠ రామాయణము **215-230**

మూలగ్రంథము 216, వస్తుసంవిధానము 218,
కథాసంగ్రహము 218, కావ్యప్రశస్తి 222, అనువాద పద్ధతి 223,
స్వతంత్ర కల్పనలు 226, రాజవిద్య 227, ఇతర విశేషములు 228.
ఆ) ద్విపద రచనలు - జ్ఞాపికలు230.

7. **అ) పద్యకావ్యములు** **235-311**

I. వేంకటాచలమహాత్మ్యము **235-300**

మూలగ్రంథస్వరూపము 235, ప్రశస్తిప్రచారములు 239,
వేంకటాచలమహాత్మ్యము-పూర్వానువాదములు 240,
వెంగమాంబ స్వీకరించిన మూలము 240, కథాసంగ్రహము 243,
కథాకల్పన 246, అనువాద విధానము 250, వర్ణనలు 260,
సన్నివేశ చిత్రణము 270, నాటకీయత 273, పాత్రోన్మీలనము 277,
రసపోషణ 285. శైలి 290, వెంగమ కృతిప్రభావము 293.

II. అష్టాంగయోగసారము 300-311

కథాసూత్రము 301, అనువాదపద్ధతి 302, కృతివైశిష్ట్యము 305.

ఆ) పద్యకావ్యములు-జ్ఞాపికలు 306

8. అ) తత్త్వకీర్తనలు 312-325

ఉనికి 312, నిర్వచనము 312, తరిగొండ ముద్ర 313.

జీవితాంశముల సూచన 314. క్రమపరిణతి 317.

మరికొన్ని విశేషములు 318, నారాయణశతకకర్తృత్వము 320.

ఆశుకవితా పటిమ 321. ఆ) తత్త్వకీర్తనలు - జ్ఞాపికలు 322.

9. అ) భాష 325-370

పదజాలము 325. సమాసము 333, క్రియలు 337. సంధి 342.

వాక్యము 346, కారకము 349, ఊనిక 351, నుడికారము 353.

జాతీయాలు 360 మరికొన్ని విశేషములు 366.

ఆ) భాష-జ్ఞాపికలు 369.

10. అ) వేంకటాచలమాహాత్మ్యము 370-395

ప్రస్తావము 370, వైదుష్యము 370, జీవితదృక్పథము 372,

భక్తి 374 మతపరమ వేదాంతము 376, ప్రాచీన కవిప్రభావము 380,

తాళ్ళపాక కవుల ప్రభావము 382,

అనంతర కవులపై ప్రభావము 386,

ఆంధ్ర సారస్వతము-వెంగమాంబ 387.

ఆ) వేంకటాచలమాహాత్మ్యము-జ్ఞాపికలు 391.

సింహావలోకనము 393.

సింహావలోకనము-జ్ఞాపికలు 394.

ఉపకరించిన గ్రంథములు, వ్యాసములు

# జీవిత సంగ్రహము

తెలుగున వెలసిన రచయిత్రులలో రచనాబాహుళ్యముచేతను, గుణాధిక్యముచేతను, భక్తిపారమ్యసిద్ధాంతములను ప్రతిపాదించి వేదాంత విద్యారహస్యములను రమ్యముగా ప్రబోధించుట చేతను మకుటమణిగా విలసిల్లిన కవయిత్రి తరిగొండ వెంగమాంబ. అయినను నేటివరకు వెలువడిన తెలుగువాఙ్మయచరిత్రగ్రంథములలో నెందును ఆమె జీవితవిశేషములను, కృతులను గూర్చిన సమగ్రచర్చ లేకపోవుట చింత్యము.

వెంగమాంబ జన్మస్థలమై [illegible] పొందిన గ్రామము తరిగొండ. ఇది చిత్తూరుజిల్లా వాయల్పాడు తాలూకాలో వాయల్పాడునకు ఉత్తరముగా నాలుగుమైళ్ళ దూరమున కలదు. తరిగొండ చిన్న గ్రామమే యైనను, దానికి ప్రసిద్ధి ప్రాముఖ్యము లేకపోలేదు. ఆ గ్రామమున శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ మొకటి కలదు. ఈ దేవాలయమునకు, గ్రామనామమునకు కొంత సంబంధమున్నది. గ్రామ మేర్పడిన విధమును దెలిపెడి ఐతిహ్య మొకటి కలదు. ఆ ఐతిహ్యమిది.

### తరిగొండ - ఐతిహ్యము :

బళ్ళారిమండలమున [illegible] గ్రామము రాయదుర్గము. [illegible] గోత్రోద్భవుడైన రామానాయుడను [illegible] యూరికధిపతి (పాళెగాడు)గా నుండెను. [illegible] రాయదుర్గమునందు [illegible] గొప్ప కఱవు సంభవించెను. ఆ యూరివారికి పన్నెండేండ్లు [illegible]. జనులు తమ కాహారము లభింపకుండుటవలన, తమకు ఆధారపడిన గోవులకేని పశుగణమునకు మేతదొరకని కారణమునను దిగులుచెంది రాయదుర్గమును వదలి అన్య సుభిక్ష ప్రాంతములకు వలసపోయిరి. రామానాయుడు, అతని భార్య నగసమాంబ, అతని సోదరుడు ఎర్రమనాయుడు, వానితల్లి పుల్లమాంబ- ఈ నలువురు తమ గోగణముతో, గోరక్షకులతో ఆ వలసజనమునకు మార్గదర్శకత్వము వహించి, కొన్ని దినములకు నేటి తరిగొండ గ్రామ మున్న చోటికి చేరిరి.

ఆ చిట్టడవి ప్రదేశము తృణకాష్ఠ జలసమృద్ధి గలిగి వాసయోగ్యముగ కనిపింపగా, వా రెల్లరు ఆ ప్రదేశమున కొంతకాలము నిలువదలంచిరి. వారట్లు విడిసిన ఆ ప్రదేశమునకు 'ప్రత్తిమిట్ట' యని, అచ్చటి జలాశయమునకు 'పాలనూయిమడు' గనియు పేళ్లుండినవట. ఆ సమీపములో పురాతనమగు నొక చిన్న గుడి యుండినది. ఆ వలస జనులు నిత్యము ఆ గుడి కేగి అందు నెలకొనియున్న లక్ష్మీనృసింహ స్వామిని[3] తమ యిక్కట్టుల బాపుటకై ప్రార్థించుచుండిరి.

అట్లు ప్రత్తిమిట్ట ప్రాంతమున విశ్రమించిన కుటుంబములలో ఒకటి రెండు విప్రకుటుంబములు నుండినవి. లక్ష్మీనరసమ్మ యను బ్రాహ్మణగృహిణి వాడుక చొప్పున ఒకనాటి వేకువజామున లక్ష్మీ నృసింహదేవుని మనమున ధ్యానించుచు, పాటలు పాడుచు, కుండలో పెరుగుబోసి చిలుకుచుండినది. ఆ సమయమున కవ్వమునకు రాయివలె నేదియో కుండనడుమ తటుకు తటుకున తగుల జొచ్చెను. కుండలో తడిమిచూడగా అందేమియు చేతి కందకుండెను. కాని, చిలుకునప్పుడు కవ్వమున కేదియో తగులుచునే యుండెను. ఈ విచిత్రమున కచ్చెరువును, భీతిని పొందిన ఆ యిల్లాలు వెంటనే ఆ విషయమును తన పెనిమిటికి తెలిపినది.

ఆతడు వచ్చి చూడగా ఆ మజ్జిగ తరుచుకుండ (తరికుండ)లో అతని కొక నున్నని నల్లటిశిల చేతికందినది.[4] అతడా శిలను బాగుగా పరికించి చూచి, యది నృసింహ సాలగ్రామముగా గుర్తించి, సంతోషాశ్చర్య సంభ్రమములు ముప్పిరిగొనగా శుచిప్రదేశమున నుంచి సాగిలబడి నమస్కరించెను. క్షణములో ఆ వార్త ఆ విడిది యంతట వ్యాపించెను. అంతనచ్చట భక్తిప్రపత్తులతో గుమికూడిన వారెల్లరు వినునట్లుగా నొక అశరీరవాక్కు 'మిమ్ము రక్షించుటకై నేనిచట తరికుండలో ఆవిర్భవించితిని. మీరిచ్చటనే యుండి భక్తిశ్రద్ధలతో నన్నారాధింపుడు. మీకష్టము లన్నియు కడతేరును' అని పలికెనట!

ఆ రాత్రియే రామానాయునకు స్వప్నములో నృసింహస్వామి సాక్షాత్కరించి, తనకు నూతనాలయ ప్రతిష్ఠాది కైంకర్యములను

జరిపించుమని యానతిచ్చెనట. ఆ స్వప్నవృత్తాంతము వారందరిలో ఆలయనిర్మాణ కుతూహలమును రేకెత్తించినది. ఒక మంచిముహూర్తమున లక్ష్మీనృసింహుని గుడి సమీపమున నేలను త్రవ్వించుచుండగా రామానాయనికి ధనసంచయము (నిధి) గోచరించినది.[5] ఆ ధనలాభముచే నాతడు నూతనాలయ మండప గోపురాదికమును నిర్మింపజేసి లక్ష్మీనృసింహస్వామివారిని ప్రతిష్ఠింప జేసినాడు. ఆ విగ్రహము ప్రక్కనే తరికుండ (మజ్జిగ తరుచు కుండ) లో లభించిన లక్ష్మీనృసింహ సాలగ్రామమును ప్రతిష్ఠింప జేసినాడు.[6] ఆ స్వామిని యనుగ్రహ విశేషముచే ఆ గ్రామము దినదినాభివృద్ధి గాంచెను.[7]

ఇట్లు ఒకప్పుడు 'ప్రత్తిమిట్ట'గా పరిగణింపబడుచుండిన ఆ ప్రదేశము "తరికుండ"లో ఆవిర్భవించిన స్వామి నెలకొనిన తావగుటచే 'తరికుండ' యనియు, 'తరిగుండ' యనియు పిలువబడుచు, రానురాను గుఱ్ఱంకొండ-వంటి గ్రామనామముల సామ్యమున జన వ్యవహారములో 'తరిగొండ'గా రూఢిగాంచినది.[8] ఈ 'తరిగొండ' యను పేరు క్రీ.శ.16వ శతాబ్దినాటికే ఏర్పడి వాడుకలో నుండినది. మెకంజీ లోకలు రికార్డులలోని ఒకానొక కౌలుపత్రమిందుల కాధారము. ఈ కౌలుపత్రము కొమఱ్ఱాజు వేంకటలక్ష్మణరావుగారిచే "కృష్ణదేవరాయల నిధనకాలము" అను వ్యాసమున ఉదాహరింపబడినది.[9] వారు ఉదాహరించిన ఆ కౌలునందలి కొన్ని పంక్తులు ఈ దిగువ నీయబడుచున్నవి.

"స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహన శక వరుషంబులు ౧౪౪౮ అగు నేటి వ్యయనామ సంవత్సర వైశాఖ శు. ౧౫ శ్రీమద్రాజాధిరాజ రాజ కంఠీరవ రాజకందర్ప మహారాజాధిరాజ పరమేశ్వర పూజితు లగు మహారాజశ్రీ రామరాజయ్యగారు విజయనగర సింహాసనమున పృధ్విసామ్రాజ్యము చేయుచుండగాను గురిగింజ కూట నమలనేని కుమార పెదబుచ్చినాయని వారికి వ్రాయించి యిచ్చిన కౌలు నిరూపం-

మహారాజశ్రీ శ్రీకృష్ణరాయలయ్యగారికిన్నీ తరిగొండ తిమ్మానాయని కుమారరామానాయనికిన్నీ విరోధం సంభవించినప్పుడు మీరు వారిలో కలస్తిరి అని సంశయించి మీకు నడుస్తువున్న గ్రామాదులు నశర జప్తీ చేయించిరి గనుక......"

పై కౌలుపత్రము కాలము క్రీ.శ. 1526 ఏప్రిల్ 26వ తేదీ గురువారమగుచున్నది.[10] అనగా ఆనాటికే "తరిగొండ"యను పేరు జనవ్యవహారమున రూఢమై యుండెనని స్పష్టపడుచున్నది. ఇంతేగాక మఱికొన్ని ముఖ్యవిశేషములు పై వంక్తులవలన వెల్లడియగుచున్నవి. శ్రీకృష్ణదేవరాయలంతటి చక్రవర్తితో విరోధించు నన్నదమ్ములు గల్గిన వాడగుటచే కుమారరామానాయుడు సామాన్యుడు కాడనుట స్పష్టము. రాయదుర్గమునుండి వలసవచ్చి తరిగొండ గ్రామనిర్మాణము గావించిన రామానాయుడుపై "కుమార రామానాయని"కి ప్రపితామహుడో, అంతకన్న పూర్వుడో అయియుండునని 'కుమార' విశేషణమునుబట్టి నిశ్చయింప వీలగుచున్నది. దీనినిబట్టి శ్రీకృష్ణదేవరాయలకు మిగుల పూర్వకాలముననే తరిగొండ గ్రామ మేర్పడి, రామానాయని వంశీయులు తత్పాలకులుగా నుండుచు వచ్చిరనియు, ఆ పాలకులకు "తరిగొండ" యింటిపేరుగా అప్పటికే రూఢిలో నుండెననియు వెల్లడియగుచున్నది. అనంతకాలమున పండితులు కొందరు 'తరిగొండ' గ్రామనామమును 'మంథాద్రి' యని సంస్కృతీకరించుటయు జరిగినది.[11]

## వెంగమాంబ జననము, బాల్యము :

'తరికుండ'లో నృసింహ సాలగ్రామము లభ్యమైన విప్రుని వంశీయులు పారంపర్యముగా ఆ స్వామిని ఇలవేల్పుగ అర్చించుచు వచ్చిరి. ఆ వంశీయులలో నొకరి యింటికి క్రీ.శ. 13-14 శతాబ్దుల నడిమికాలమున నేటికర్నూలుజిల్లా యందలి కానాలయను గ్రామము నుండి అహోబలపతి యను నతడు (బహుశః బంధుత్వరీతిగా) వచ్చి తరిగొండలో స్థిరపడెను.[13] ఆతని వంశీయులు క్రమముగా 'కానాలవా'రనెడు గృహనామము గలవారైరి.[14] ఆ సంతతికి జెందినవారై, క్రీ.శ.18వ శతాబ్ది ప్రారంభకాలమున ఆ యూర నివసించుచుండిన గృహస్థు కానాల కృష్ణయార్యుడు. వారిది 'నందవరీక' శాఖ.[15] వసిష్ఠ గోత్రము. కృష్ణయార్యుడు. శిష్టమానసుడు, దుశ్శీల వర్జితుడు, సలలిత హృదయుడు, సద్బ్రహ్మవేత్త."[16] ఆయన ధర్మపత్నియైన మంగమాంబ "అనుకూలయైన మానినీమణి,"[17] "పరభార్య యగు పతివ్రత."[4] ఆ పుణ్యదంపతులకు

చాలకాలమువరకు సంతానప్రాప్తి కలుగదయ్యెను. అందువలన వారొక పర్యాయము తిరుపతి క్షేత్రమున కేగి శ్రీవేంకటేశ్వరుని సందర్శించి మనసార మ్రొక్కుకొని వచ్చిరి. దైవభక్తి సదాచారసంపత్తిగల ఆ పుణ్యదంపతులకు కొంతకాలమున కొక ఆడుబిడ్డ జన్మించెను.[5] వేంకటేశ్వరుని యనుగ్రహ ఫలముగా జన్మించిన ఆ బిడ్డకు వెంగమ్మ యని నామకరణము కావించిరి. ఈ నామధేయము తరువాతి కాలమున 'వెంగమాంబ' యను రూఢి నొందినది.[18]

దైవచింతనకు, సదాచార సంపదకు పుట్టినిల్లైన ఆ యింటి వాతావరణము ఆ బాలికకు సహజమై యొప్పిన దైవభక్తి వికాసమునకు దోహదకారియైనది. తరిగొండ లక్ష్మీనృసింహుడు, తిరుపతి వేంకటరమణుడు మున్నగుదేవతల కథలతో గాథలతో గూడిన ఆట పాటలతో వెంగమ్మ శైశవము అల్లారుముద్దుగా, ఆనందదాయకముగా గడచెను.

వెంగమ్మ అక్షరాభ్యాసము మొదలుకొని సాహిత్యశిక్ష వరకు గల విద్యనంతటిని బాల్యమున సహజముగనే నేర్చినది. ఈ విషయము నామె తన రచనలలో స్పష్టముగా పేర్కొనినది.[19] తండ్రితాతల నుండియు సారస్వత వాతావరణము నెలకొనియున్న కుటుంబమున వరప్రసాదముగా జన్మించిన వెంగమాంబకు అటువంటి దసాధ్యమేమియుకాదు.

భక్తితో మైమరచి పాటలు పాడుట, దేవతార్చనకు వలసిన పూజాద్రవ్యములను ఆసక్తితో అందించుట మొదలగు బాల్యచేష్టలు తొలుదొల్త తలిదండ్రులను మిగుల అలరించినను, రానురాను భగవద్భక్తితో పరవశించి నాట్యము చేయుట, తోడిబాలికలను వీడి ఒంటరిగా పరధ్యానమున మసలుకొనుట- మున్నగు వింతధోరణులు ఆ బాలిక భవిష్యత్తును గూర్చిన ఆలోచనలను వారి హృదయములందు రేకెత్తించినవి. కూతురు ప్రవర్తనము ఒక రకమైన ఉన్మాదస్థితి యేమో యని కృష్ణయ్య శంకించెను. అట్లే కొనసాగనిచ్చిన యెడల ఆమెకు వివాహమగుటయు అసంభవమేమో యను సందేహమాయన మనస్సులో సందడి గావించెను. అందువలన వీలయినపుడెల్ల కూతురు ధోరణిని

నిరుత్సాహపరచుచు, వెంగమయొక్క భక్తిచేష్టలకు, భజన కీర్తనలకు ఆక్షేపణలు పలుకసాగెను. ఫలితము కనిపించనందున ఆలోచనలో మునిగిన కృష్ణయ్య కొక యూహ స్ఫురించినది. వెంగమాంబను ఊపిరి సలుపని గృహకృత్యములలో నిరంతరము నియోగించిన యెడల, ఆమె యా 'పిచ్చి' చేష్టలు మానుకొనునని, అట్టి ప్రయత్నము చేసినాడు. అయినను ఆ బాలిక తల్లిదండ్రుల యాజ్ఞలను చక్కగా నెరవేర్చుచునే మానసికమైన యుపాసనను వీడక భగవద్భక్తిని కొనసాగించుచునే యుండినది. చివర కొకనాడు కృష్ణయార్యుడు కూతురునకు వివాహము కావించినచో ఆమెలో తప్పక మార్పు కలుగ గలదని దృఢముగా విశ్వసించెను.

**వివాహము :**

బాల్యవివాహ వ్యవస్థ బాగుగ అమలులో నుండిన కాలమిది. 'అష్ట వర్షా భవేత్ కన్యా' అను నిర్వచనము ననుసరించి కన్యాదాన ఫలము దక్కించుకొన వలయునని తహతహ చెందెడి తలిదండ్రులెందరో ఆనాటి సంఘమున నుండిరి. ప్రాపంచిక దృష్టికి విపరీతముగా గనబడు కూతురు నడవడితోపాటు, నాటి బాల్యవివాహ పద్ధతి సైతము కృష్ణయ్యను వరాన్వేషణమునకు ప్రేరేపించినది.

కృష్ణయామాత్యుని ఇరుగుపొరుగుల నివసించెడు అసూయాపరులు కొందరు పెండ్లిచూపుల నిమిత్తము వచ్చువారలకు, వెంగమ్మ గాలిసోకుడుదనియు, పిచ్చిబాగులదనియు పితూరీలు చెప్పి కార్యభంగము గావించుచుండిరి. ఎట్టకేలకు కృష్ణయ్య పెండ్లి ప్రయత్నములు ఫలించినవి. చిత్తూరుకు సమీపమున గల నారగుంటపాళెము నందలి శ్రీ వత్సనగోత్రుడైన ఇంజేటి తిమ్మయార్యుని కుమారుడైన వెంకటాచలపతితో వెంగమాంబ వివాహము నిశ్చయింపబడెను. వరునివైపువారు కన్యకయొక్క ధోరణులనుగూర్చి చూచాయగా వినియున్నను, చక్కని చుక్కయై యుండుటవలనను, 'పెండ్లియైన పిచ్చికుదురు' ననెడు లోకోక్తి ప్రకారము వివాహమున కంగీకరించిరి.

వెంగమాంబ తనకు వివాహము వలదని తండ్రితో పల్కినది. భగవంతుడే తన పతియనియు, లౌకికమగు పెండ్లి తన కక్కరలేదనియు ఆ బాలిక చెప్పినది. కాని, కృష్ణయ్య కూతురును తీవ్రముగా మందలించినాడు. కన్యకు కల్యాణము విధివిహితమని గట్టిగా గద్దించి, నోరు మూయించి పెండ్లి నడిపించినాడు.

బాల్యవివాహమగుటచే, వివాహకార్యము నెరవేర్చికొని వరుడు, తద్బంధువులు తమ తమ యూళ్లకు తరలిపోయినారు. వెంగమాంబ యథారీతిగా తరిగొండలో తన భక్తి సాధనలను కొనసాగించుచునే యుండినది. అత్తవారింటి కేగినచో కూతురి 'విపరీత భక్తి వర్తనము' తగ్గిపోవునని తలంచి, కృష్ణయ్య యూరట జెందినాడు. కాని, ఈలోగా బిడ్డ నొకదారికి తేవలయునని సంకల్పించి యనేక రీతుల హితము నుపదేశించినాడు. అయినను ఆమె భక్తి పారవశ్య ప్రవర్తనమున మార్పు కానరాలేదు. తండ్రితో తర్కవితర్కములు గావించుచునే యుండినది. తన శరీరముపై తనకే అధికారము లేనపుడు ఇతరుల కెవ్వరికో మఱొకరి కప్పగించు అధికారము అర్థరహితమని వాదించినది. మనసా, వాచా, కర్మణా శ్రీనివాసుని కంకితమైన తనను ఎవరికో ధారాదత్త మొనరించి తిరని వాదించినది.

వెంగమ్మ వ్యక్తురాలు కాగానే నిషేకముహూర్తము నిశ్చయింపబడెను. నాటిరాత్రి శోభన గృహమున ప్రవేశించిన వరునితో వెంగమాంబ, తనను సహచరిగాగాక, దైవభక్తురాలిగా భావించి మన్నించుమని వేడిన దనియు, తన జీవితము త్రికరణ శుద్ధిగా శ్రీ వేంకటేశ్వరున కంకితమని పలికిన దనియు, ఆమె విరక్తవేదాంతవాక్యములు వినిన వరుడు వెరగంది, ఆమె యెడల విరక్తుడై, ఆ మఱునాడే తన గ్రామమునకు మరలిపోయెననియు కొన్ని చరిత్రలు పేర్కొనుచున్నవి. శోభనపు గదిలో ప్రవేశించిన వేంకటచలపతికి వెంగమాంబ భార్యగా కాక, తమ కులదేవతయైన చౌడే శ్వరిగా గోచరించెననియు, అందువలన అతడామెను సమీపింపజాలక, గదినుండి బయటపడి, కులదేవతను స్మరించుకొనుచు, గ్రామము చేరెనని మఱికొందరి కథనము.

సౌందర్యవతియైన కన్యక ఇల్లాలుగా లభించినను, తనకామెతో కాపురము చేసెడు భాగ్యము లేకపోయినదను విచారమొకవైపునను జీవితములో అత్యంతముఖ్యమైన వివాహమిట్లు నిష్ఫలమయ్యెనను చింత మఱొక వైపునను వరుని పీడింపగా, ఆ దిగులుతో జబ్బుచేసి కొంత కాలమున[20] కాతడు స్వర్గస్థు డయ్యెను.

వెంగమాంబ శోభనమందిరమున భర్తను నిష్ఠురోక్తులాడినట్లు, 'పాపీ! మూఢా!' వంటి సంబోధనలతో తూలనాడినట్లు, 'నన్ను స్పృశించితివా నీశిరస్సు సహస్రవయ్య లగును. భస్మము కాగలవు' అని హుంకరించి శపించినట్లును, [21] వెంగమ శాపప్రభావముచే వరుడు తరిగొండ కాఱుమైళ్ళ దూరమునందలి బావిలోబడి మృతినొందినట్లు[22] మఱికొన్ని చరిత్రలు నుడువుచున్నవి. కాని, ఇవన్నియు కల్పితములగు కట్టుకథల నియు, కాలక్రమమున చిలవలు పలవలుగా పెంపొందినవనియు, ఈ కవయిత్రికి తన భర్తయెడల గౌరవభావము కలదనియు ఈమె రచనలు సాక్ష్యమిచ్చుచున్నవి.[23] వేంకటరమణుని వరప్రసాదముగా జన్మించినదని మురిసిపోయిన వెంగమ తలిదండ్రులు అచిరకాలములోనే తమ బిడ్డయొక్క ఐహికజీవిత మిట్లు ఎడారియై పోయెనని మిగుల పరితపించినారు. సహజముగనే భక్తిమార్గానుయాయి, ఐహిక జీవితవిరక్తియునైన వెంగమాంబకు పై సంఘటన నైరాశ్యమును గాక, వైరాగ్యభావమునే పెంపొందించెను.

భర్తృవియోగమును గూర్చి యంతగా దుఃఖించినటులు కానబడనందున ఈర్ష్యాపరులైన కొంతమంది, ఆమె యాతనిని దుర్భాషలాడినదనియు, మనస్సు నొప్పించి, మనోవ్యథకు గుఱి కావించి ఆతని మృతికి కారకురాలైనదనియు కథ లల్లి ప్రచార మొనర్చిరి. మఱి కొందరామె మహనీయురాలని వాకొనిరి.

వెంగమాంబ సర్వేశ్వరుడగు వేంకటాచలపతియే తన పతియని విశ్వసించినందున సౌమంగల్య చిహ్నములను విడనాడుట కంగీకరింపదయ్యెను. సంప్రదాయ విరుద్ధమైన ఈ విప్లవాత్మక ధోరణి ఆనాటి తరిగొండవాసులను, అందును ముఖ్యముగా విప్రబృందమును

ముక్కుపై వ్రేలిడుకొనజేసినది. వారెల్లరును మిగుల ఆగ్రహావిష్టులైరి. కృష్ణయ్య యింటి కేగి వెంగమాంబకు నయభయోక్తుల తండ్రిచే చెప్పించి, తాము స్వయముగా చెప్పి చూచినారు.

లక్ష్మీనృసింహధ్యానపరాయణ యైన వెంగమాంబ వారి యెదుట నిర్భయముగ, నిశ్చలముగ నిలిచి, తనకు వైధవ్యము ప్రాప్తింపలేదనియు, తిరుపతి వేంకటాచలపతియే తన పతి యనియు, తాను విధవ యగుట అసంభవమనియు సోపపత్తికముగ వాదించినది. పిన్నప్రాయములో నున్న ఆమె వాగ్ధోరణి ఒకవైపు కోపమును రెట్టింపజేసినను, మఱియొకవైపు వారి కాశ్చర్యమును కలిగించినది.

వెంగమ దుఃఖభారనిమగ్నులైయున్న తల్లిదండ్రుల నోదార్చి, 'భగవచ్చింతనతో, వైరాగ్యభావనతో, కుటుంబ గౌరవమునకు వెలితి కలుగని విధమున జీవితము గడపెద'నని ధైర్యమలర బలికినది. కూతురి వైరాగ్యధోరణికి అనుగుణమై, ఆమె భవిష్యత్తును శాంతిమయము కావింపగల మార్గమును కనుగొనుటకై కృష్ణయార్యుడు తీవ్రముగా ఆలోచించెను. ఆ కాలమున మదనపల్లిలో రూపావతారము సుబ్రహ్మణ్యశాస్త్రులను గొప్ప ఆధ్యాత్మిక విద్యావేత్త యుండెను. కృష్ణయ్య ఆయన యొద్దకేగి, తన కూతురు వృత్తాంతమును విన్నవించి, ఆమెకు బ్రహ్మవిద్యోపదేశము చేయుటకై అభ్యర్థించినాడు.

## గురూపదేశము, గ్రంథరచన:

తరిగొండవాస్తవ్యుడు, ఉత్తమగృహస్థుడైన కానాల కృష్ణయామాత్యుని కూతురగు వెంగమాంబ వైఖరిని గూర్చి కర్ణాకర్ణిగా వినియున్న శాస్త్రులవారు కృష్ణయార్యుని అభ్యర్థనము నంగీకరించెను. కృష్ణయ్య తరిగొండకు మరలి వచ్చి, యొక రోజున వెంగమ్మను మదనపల్లికి దోడ్కొనిపోయెను.[24] సుబ్రహ్మణ్యయోగి వెంగమ్మను కొన్ని ప్రశ్నలడిగి ఆమె తాత్త్వికధోరణి సవ్యమైనదే యని గుర్తించి, తన శిష్యురాలిగా అంగీకరించెను.

శాస్త్రిగారు తన యుపాస్యదైవమగు శ్రీసోమేశ్వరస్వామి సన్నిధిని[25] వెంగమాంబకు వేదాంతవిద్య నుపదేశింపదొడగిరి.[26] 'గురుస్సాక్షాత్

పరబ్రహ్మ' యను పరిపూర్ణ విశ్వాసముతో నామె గురూపదేశములను ఆచరణపూర్వకముగా అనుభవమునకు దెచ్చుకొనుచుండినది. తనయ వాత్సల్యముతో తనను గౌరవించుచున్న సుబ్రహ్మణ్య గురుని మిగుల నభినివేశముతో వెంగమ శుశ్రూషింప జొచ్చినది.[27] ఆ దేశికోత్తముడు క్రమముగ నామెకు మంత్రోపదేశము గావించి, తదుపాసనా విధానమును సాంగముగా నుపన్యసించినాడు. భక్తి తత్త్వమును, యోగశాస్త్రరహస్య ములను సాంకల్యముగ బోధించి, పరమార్థమును వివరించినాడు. జన్మాంతర సంస్కారరూపమున ఆమెలో అణగియుండిన జ్ఞానశక్తి అనుక్షణ తీవ్రసాధనల వలన, ఉద్బుద్ధమై, అచిరకాలముననే ఆమె పరిపూర్ణజ్ఞాని యయ్యెను. ఇది గుర్తించిన సుబ్రహ్మణ్యదేశికుడు సంతృప్తుడై, మఱికొన్ని సాధన మార్గములను దెలిపి, మెలకువలను విశదీకరించి, సూచనల నొసంగి వెంగమాంబను దీవించి తరికొండ కనిపెను.

గురూపదేశమును బడసి వచ్చిన వెంగమాంబ దినములో నెక్కువ కాలము తరిగొండ లక్ష్మీనృసింహాలయములో గడుపుచుండెను. ఆ గుడిలో నొకవైపున నున్న ఆంజనేయస్వామి విగ్రహము చాటున గల ఏకాంతప్రదేశమం దామె యోగసమాధి లీన యగుచుండెను. ఇది యెవ్వరును గమనింపరైరి. యోగాభ్యాస సమయము గాక తక్కినవేళలలో వెంగమ కవిత్వ మల్ల నారంభించెను.

వెంగమాంబ సారస్వతకృషిలో తొట్టతొలి ఫలము తరిగొండ నృసింహ శతకము. "మీరిపుడు వాక్కుల నిచ్చినంతలో, శతకము గాను జెప్పెదను సద్గురు స్వామి కటాక్ష మేర్పడన్"[28] అని యందు పేర్కొనినది. ఈ యమ కవితను కొందరు 'వికల్పకవిత్వ'మని యాక్షేపించిరట![29] అయినను వెంగమ అందులకు నొచ్చుకొనక, తన శతక పద్యములను ధరిత్రి మీదట నిల్పుమని ఆ తరిగొండ నృసింహునే వేడుకొనినది.[30]

నృసింహ శతకానంతరము ఈకవయిత్రి ప్రహ్లాదచరిత్ర ఆధారముగా 'నృసింహ విలాసకథ' (యక్షగానము)ను రచించి ఆ స్వామికే సమర్పించినది. అటుపిమ్మట శివనాటకము (శివవిలాసము) అను

యక్షగానమును రచించి రాచవీటి (రాయచోటి) వీరభద్రస్వామి కంకిత మొనర్చెను.

నృసింహాలయమునకు రాకపోకలు సాగించుచుండుట యోర్వలేని కుమతులు కొందరామె ప్రవర్తనమును గూర్చి దుష్ప్రచారము గావింప మొదలిడిరి. మఱికొంద రామె యేగుచుండగా వెకిలిగా మాటాడుచు సన్నసిఙాలు రువ్వుచుండిరి.[31] దుష్టశిక్షకుడు, శిష్టరక్షకుడు, భక్తపాలకుడునైన లక్ష్మీనృసింహస్వామియే అట్టివారలకు బుద్ధి గరపగలడని తలచి, యామె ఒకవైపు యోగసాధనను, మఱొక వైపు గ్రంథరచనమును కొనసాగించుచు 'కవితైవ తపః' అను సూక్తిని సార్థక మొనర్చుచుండెను.

ఇంచుమించు ఈకాలముననే ఈ కవయిత్రి రాజయోగామృత సార మనెడు తాత్త్విక (ద్విపద) కావ్యమును రచించి[32] తరిగొండ పురధాముడైన నృసింహస్వామి కంకితము గావించినది. అనంతరము బాలకృష్ణనాటక మనెడు యక్షగానమును రచించి వాసుదేవున కంకిత మొనర్చెను.

**తెనుగు మీరా :**

భక్తుల జీవితములలో సామ్యము గోచరించినటులే భక్తురాండ్ర జీవితములయందును సాదృశ్యము సాక్షాత్కరించుచుండుట వింతకాదు. ఉత్తరభారతమున అవతరించిన భక్తురాండ్రలో మీరాబాయి అగ్రగణ్య. బాల్యమున జరిగిన యొకానొక సంఘటనతో నామె గిరిధర గోపాలుని భక్తురాలై, ఆతడే తన సర్వస్వమనియు, తానే గోపిక, ఆతడే తన స్వామి యనియు వలుకుచు, ఆ పవిత్రభావమునే నిరంతరము పెంపొందించుకొనినది. కావుననే భర్తయగు కుంభరాణాతో 'కేవలము భౌతిక శరీరమునకే నీవు భర్తవు. నా మనస్సెనాడో గిరిధర గోపాలున కంకితమైనది' అని నిర్ధారించి చెప్పగలిగినది.

వెంగమాంబ జీవితమునకు, మీరాబాయి జీవిత చారిత్రమునకు మిగుల పోలిక గలదు. ఈ కారణముచే తరిగొండ వెంగమాంబను 'తెనుగు మీరా' యనినను అతిశయోక్తి కానేరదు. నందగోపాలుని గుణగానముతో తన్మయురా లగుచు మీరాబాయి తనకు వచ్చిన కష్టములను దైవభక్తి

బలిమిచే అధిగమించినది. అట్లే తరిగొండ వెంగమాంబ ఆనాటి సంఘము తనను పలుకష్టములకు పాల్పరుపగా ఆ దైవభక్తి బలముచేతనే వాటినుండి తరింపగల్గినది. ఐహిక ప్రయోజన దూరమగు నిస్స్వార్థ మోక్షలక్ష్యమే ఈ యిరువురు భక్త నారీమణుల ప్రధాన గమ్యమగుట ముఖ్యముగా గమనింపదగిన యంశము.

**మహిమలు:**

వెంగమాంబ వేదాంతధోరణి తరిగొండ గ్రామీణులకు అందును ముఖ్యముగా బ్రాహ్మణులకు-మనసు కెక్కని మందైనది. 'ఉన్మాదిని, భూతము, పిశాచి, మహాకాళి'- ఇత్యాది దూషణోక్తులే వారలకు కర్ణపేయములై అలరుచుండినవి. చిన్నకూన, శాస్త్రజ్ఞాన శూన్యురాలు తమను ఎదిరించి మాటాడుటయా? కావున ఆమె నెటులైనను తమ శిరసావహించినట్లు చేయవలెనని పట్టుదల వహించినారు. వెంగమ్మ వైధవ్యము నంగీకరింపనియెడల కానాల కృష్ణయ్యగారి యింటిని బ్రాహ్మణసంఘము నుండి వెలివేయవలయునని తీర్మానించుకొన్నారు. తమ నిర్ణయమును కృష్ణయ్యకు తెలియజేసినారు. నాటి సంఘపు కట్టుబాట్ల ననుసరించి కృష్ణయ్య వారల బిభీషికలకు కలత జెందినాడు.

ఒకవైపు కూతురు! మఱొకవైపు కరుడుగట్టిన సాంఘికాచారములు! చివరకు ఆయన మనస్సు సంఘశక్తికి లోగినది. ఆయన యంగీకారమును ఆసరాగా గొని, బలవంతుగానైనను వెంగమకు శిరోముండనము చేయింపవలెనని తరిగొండ యందలి విప్రులుత్కంఠులైనారు. తనవలన తండ్రి కిట్టి యిక్కట్టు కలిగినందులకు చింతించుచు వెంగమ, కానున్నది కాకమానదని ధైర్య మవలంబించి, తీవ్రముగ ఇష్టదైవధ్యాన మొనరించుచుండినది. వారామెను బలవంతముగా దోడ్కొని వెళ్లినారు. తరిగొండ లక్ష్మీనృసింహదేవుని తదేక మనస్కయై ధ్యానించుచున్న యామెను సమీపింపగానే క్షౌరకునకు విపరీతమైన దడ కలిగి చేయాడకపోయెను. పులిని గాంచిన లేడివలె అతడు భీతిల్లి, తానాపని చేయజాల ననినాడు. అచట జేరిన బ్రాహ్మణులకును దైవికముగా అట్టి వికారములు కలుగగా ఆ ప్రయత్న మప్పటికి విరమింపబడినది.[33]

ఐనను, తరిగొండ విప్రబృందములో కొందరి కింకను సంతృప్తి గాని, సుఖనిద్ర కాని సమకూరలేదు. ఒకానొక లేమ పూర్వాచార సంప్రదాయముల కెదురు తిరిగి వర్తించుచుండగా తామంతమంది యుండి ఏమియు చేయజాలక పోవుట వారల కవమానముగా తోచినది. వెంటనే వా రావిషయమును పుష్పగిరి పీఠాధిపతులకు నివేదింపవలెనని తీర్మానించుకొన్నారు. ఆ ప్రాంతమంతటికి గురుపీఠాధిపత్యము వహించియుండిన పుష్పగిరి శంకరాచార్యులవారు సంచారములో నున్నట్లు తెలిసికొని, వారి సమక్షమున కరిగి వెంగమాంబ యొక్క పూర్వాచార వైముఖ్యమును పూసగ్రుచ్చినటుల విన్నవించినారు. ఆ కాలమున పుష్పగిరి పీఠాధిపతులై యుండిన శ్రీమదభినవోద్దండ విద్యానృసింహభారతీస్వాములవారు బ్రాహ్మణయువతి అటులుండుట ధర్మవిరుద్ధమని భావించి, తాము తరిగొండకు విచ్చేయుచున్నారమని విప్రమండలికి శ్రీముఖము పంపిరి.[34]

తరిగొండ దేవాలయమున సపరివారముగా విడిసిన స్వాముల వారు వెంగమ్మను తనయొద్దకు పిలుచుకొని రావలసినదిగా పరిచారకులను బంపిరి. వెంగమాంబ తాను భుజించివత్తునని చెప్పివంపినది. ఆ సమాధానము స్వాములవారి కాశ్చర్యావేశములను, అచట గుమికూడి యున్న విప్రులకు కోపతాపములను కల్గించినది. పూజ్యులకడకు రిక్తహస్తములతో వెళ్లరాదను సూక్తి ననుసరించి వెంగమ్మ యొక నారికేళమును చేతబూని స్వాములవారి సమక్షమున కేగెను. స్వాములవా రచ్చట నొక తెర గట్టించియుండిరి.[35] సేవకుల నిర్దేశానుసారము ఆమె యా తెరచాటున నిలుచుండినది. స్వాములవారు సదాచారములను గూర్చి, కులవధూవర్తనమును గూర్చి, బ్రాహ్మణ వనితా ధర్మములను గూర్చి పెక్కురీతుల నుపన్యసించి, సానునయముగా ప్రబోధించి, విప్రవితంతువున కుచితమగు శిరోముండనాదికమును శిరసావహింపవలసినదిగా ఆదేశించెను.

వెంగమాంబ స్వాములవారి యెడల సద్భావముతోడనే ''స్వామీ! పతివ్రత పరపురుషుని ముట్టరాదు కదా? క్షురకుడు పరపురుషుడే కదా? అది యటులుంచి, పాతివ్రత్యధర్మము కేశము లుంచినందున

తొలగిపోవునని, తీయించినందున నిలుచునని ఏ శాస్త్రములో నున్నదో తాము సెలవిండు. 'తలలు బోడులైనంతమాత్రాన తలపులు బోడులగునా?' స్వామీ! ఒకవేళ నేను తమ యాదేశానుసారము తీయించుకొనిన, మరల మొలవకుండునట్లు చేయగలరా?'' అని ప్రశ్నించెను.

యుక్తియుక్తములైన వెంగమ్మ ప్రశ్నములు స్వాములవారికి ఆగ్రహముతో పాటు ఆశ్చర్యమును జనింపజేసినవి. స్వాములవారికి వెంగమాంబ నమస్కరింపకుండుటను గమనించిన సదస్యులు 'నమస్కరింపకుంటివేల?' యని గద్దించి పల్కిరి. అయినను వెంగమాంబ కిమ్మనక, చేతులు జోడింపక, అట్లే నిలువబడియుండెను. స్వాములవారప్పుడు తెరను ఆవలికి తీయించి, గురుపీఠమునకు నమస్కరింపకుండుటకు కారణమేమని కోపముతో వెంగమ్మను ప్రశ్నించినారు.

అందుల కామె సవినయముగనే 'మీ రా సింహాసనము నుండి లేచి ప్రక్కకు తొలగినచో నేను నమస్కరింపగల'నని పలికినది. అది విని స్వాములవారు ఈ వనిత యీ ప్రకార మెందుల కనుచున్నదో యని యించుక సందేహించి, పిమ్మట బ్రాహ్మణకులాచార పరిపాలనార్థము శాంతముగానైనను ఆ యువతికి బుద్ధి చెప్పవలయునని తలంచి, 'సరే; నమస్కరింపు'మని చెప్పి, పీఠమునుండి లేచి యీవలకు వచ్చి నిలిచిరి. వెంగమ్మ స్వాములవారి పీఠమునకు రెండుచేతులు జోడించి నిండుగా నమస్కరించెను. తోడనే గొప్పధ్వనియు, దాని వెనువెంటనే సింహాసనమున అగ్నిజ్వాలలును లేచి, అది యనతి కాలములోనే భస్మీపటలమై పోయెనట![36]

అట్లు వెంగమాంబ యొక్క నమస్కారాగ్నేయాస్త్రమున పీఠము భస్మీభూతము కాగా, స్వాములవారు భయభ్రాంతులయ్యి నివ్వెఱగుపడి, కలకల మణగిన పిమ్మట వెంగమాంబకు తానే వందన మొనరించి, ఆమె సాక్షాత్తు ప్రహ్లాదావతారమని పలుతెఱగుల ప్రశంసించి, అట్టి పూజ్యురాలి మాహాత్మ్యము నెఱుంగక వర్తించిన విప్రులను మందలించి, వెంగమనుండి సెలవు గైకొని వెడలిపోయిరట.

ఈ రీతిని వెంగమ మహత్త్వము పుష్పగిరిపీఠాధిపతులచే నామోదింప బడినను, తరిగొండ యందలి విప్రుల మనములం దొకానొక 'కించ నెలకొనినది. తమ గ్రామములో గురుపీఠమున కట్టి గతి పట్టుట,' జగద్గురువుల కవమతి వాటిల్లుట - ఇన్నిటికి హేతువు తమ యాహ్వానము. అందులకు కారణము వెంగమ్మ. ఆ వెంగమ్మను అట్లు పెంచిన కానాల కృష్ణయ్యయే ఇన్నింటికిని మూలకారణము. ఈ భావనచే వారెల్లరును కృష్ణయ్యగారి యింటికి పండుగలకు, పబ్బములకు రాకపోకలు మానుకొనుటేగాక, ఆయన యెదురుపడినచో మాటాడక ముఖము మరల్చుకొని పోవుచుండిరి. తన కుటుంబమును వెలివేసి ఆంక్షలు విధింపకున్నను, ఫలితము మాత్రము తత్తుల్యముగానే యుండుట కృష్ణయ్య గమనించెను. ఇందులకుతోడు నవయౌవనమున నున్న కూతురు గుడికి వెళ్లునపుడు, మరలి వచ్చునపుడు వీధిలో అడుగులు వేయుచు పాటలు పాడుచుండగా ఆబాలగోపాలము కలకలము చేయుచు ఆమె వెంట నుండుట, కానక కన్నకూతురువలన తన బ్రదు కిట్లు పరిహాసప్రాయమగుట- ఈ పరిస్థితు లన్నిటివలన విసిగిన కృష్ణయ్య యొకనాడు వెంగమాంబను 'ఇంటి నుండి వెడలిపోయినచో బాగుండు'నని వేసరికతో కసరుకొన్నాడు.

**ప్రచోదన :**

తండ్రి మాటలకు వెంగమాంబ చింతింపలేదు. 'మాతా నాస్తి; పితా నాస్తి' యను విరక్తి భావన ఆమెలో నేనాడో కేంద్రీకృతమై యుండినది. కాని, ఐహిక ప్రపంచమున తండ్రితోడి సంబంధముతో నెంతకాలము నటింపవలెనో అంతకాలము తనను దైవము నటింపజేసినాడని యామె తలంచినది. ఆనాడట్లు తండ్రి కసరుకొనుట జీవననాటకమున నొక సన్నివేశముగా భావించి, తండ్రి పలుకును దైవవాక్కుగా స్వీకరించి, వెంగమాంబ లక్ష్మీనృసింహాలయమును బ్రవేశించి, దేవదేవుని సాన్నిధ్యమున సదా ధ్యానముతో, సంకీర్తనల గానముతో అహర్నిశలు అందే వసింప జొచ్చినది.

ఒక్కొకపరి భక్త్యావేశముతో గర్భాలయమున బ్రవేశించి యామె స్వామిని చేతులార పూజించెడిది. రాత్రులందు పూజారులు గర్భగుడి

తలుపులు తాళము వైచి యేగినపుడు ప్రాకారమండపములలో భగవన్నామ సంకీర్తన మొనర్చుచు కాలక్షేపము గావించు చుండెడిది. ముఖ్యముగా, తెల్లవారుజాములలో ఆ యమ గొంతెత్తి పాడుచుండిన స్తోత్రముల యొక్క, మేలుకొలుపు పాటల యొక్క సుశ్రావ్యధ్వని, వినబడినంతమేర భక్తిభావ పరిమళములను వెదజల్లుచు, ప్రశాంతములైయుండు బ్రాహ్మముహూర్తములందు ఆలయమునకు పవిత్రశోభను ప్రసాదించు చుండెను.

వెంగమాంబ తొలుతనుండియు లక్ష్మీనృసింహాలయములో ఎడమవైపున గల ఆంజనేయుని విగ్రహము వెనుక నున్న స్థలములో కూర్చుండి, పెక్కుగడియలు ధ్యానసమాధి యందు గడుపుచుండెడిది. ఆమె గుడికి వచ్చిపోవుచుండుట చాలమంది ఎఱిగియున్నను, అట్లు ఆంజనేయ విగ్రహము చాటున ధ్యాననిమగ్న యగుచుండుట యెవ్వరెఱుగరు. ఒకనాడామె యాంజనేయవిగ్రహము వెనుక యోగ సమాధిలీనయై, కొన్ని దినము లట్లే యుండెను. వెంగమ్మ గుడిలో గాని, గ్రామములో గాని కనిపింపనందున ఎల్లరును ఆమె యూరువిడిచి ఎచటికైన పారిపోయి యుండునని పరిపరి విధముల ఊహించిరి.

ఆలయార్చకు డొకనాడు ఆంజనేయుని పూజించుచు, వెనుక నున్న వెంగమాంబను జూచుట తటస్థించెను. చూచి, దయ్యమో, భూతమో యని భయపడెను. ధైర్యము తెచ్చుకొని మరల నొకమాఱు పరికించి, విగ్రహము చాటున చీకటిలో నున్నది కానాల కృష్ణయ్య కూతురగు వెంగమ్మయే యని నిశ్చయించి, గుప్తవర్తనమునకై అచ్చట చేరినదని ఆ భక్తురాలిని శంకించి, యతడు కోపాటోపముతో బిగ్గరగా దూషించుచు, తలవెండ్రుకలుపట్టి యామె నీవలికి లాగెను.

కేశములు లాగబడుటవలని బాధచే సమాధి భంగము కాగా ఆమె కనులుదెరచి చూచినది. ఆ యోగిని దృష్టికి తాళలేక అర్చకుడు మూర్ఛితుడై పడెను. కొంతవడికి తెప్పిరిల్లి, అపరాధమును క్షమించుమని యామె చరణములపైబడి ప్రార్థించినాడు.[37] తన ధ్యానమున కారీతిని విఘ్నము కల్గుట దైవసంకల్పమే యని తలపోసి, వెంటనే ఆ యూరు

వదలి వెళ్లవలసినదిగా నరహరి తనను ఆజ్ఞాపించిన ట్లామె నిశ్చయించి, ఆ యిష్టదైవమును మనసార ధ్యానించి మ్రొక్కి దారిబట్టెను.[38]

**తిరుమలయాత్ర :**

వెంగమాంబ తరిగొండను వీడి, తిరుపతి క్షేత్రమున కభిముఖముగా పయనించుచు క్రమముగా వేంకటాచలారణ్యమును ప్రవేశించినది. ఆకలిదప్పులను లెక్కపెట్టక, క్రూరజంతువుల సంచారమునకు భీతి నొందక, ఇష్టదైవమగు తరిగొండ లక్ష్మీనృసింహుని సంస్మరించుచు, ఒకటి రెండు దినము లడవిదారిలో పయనించి, 'సందెకావు మొగలిపెంట' యను పేరుగల కోనను[39] చేరెను. అచ్చట వెలసియున్న యాంజనేయుని పాదసన్నిధిలో పద్మాసనాసీనయై యామె తిరుపతి వేంకటేశ్వరస్వామిని గూర్చి తీవ్రముగా తపము గావింప దొడగెను. ఒకనాడు శ్రీవేంకటేశ్వరుడు ప్రత్యక్షమై, తన సన్నిధికి రావలసినదని యానతిచ్చినటుల నామె కనుభూతి కలిగెను. ఆ కాఱడవిలో తన నాదరించి కాపాడిన ఆంజనేయస్వామిని మిగుల కొనియాడి, క్రమముగా వెంగమాంబ కానినడకన, తిరుమల పుణ్యక్షేత్రమును చేరుకొనినది.

ఉన్నతములగు గాలిగోపురములు, సూర్యకిరణసంకలితములై ప్రకాశించు బంగారుశిఖరములు, ఎత్తైన ప్రాకారములు, ఉద్యానవనములు, మఠములు, మందిరములు మున్నగు వాటితో మనోజ్ఞములైయున్న వేంకటాచలక్షేత్ర దృశ్యముల దిలకించుచు, వెంగమాంబ భక్తిభావపులకితయై వేంకటనాథుని కొనియాడుచు, ఆలయమున కరిగి, స్వామివారి దివ్యమంగళ విగ్రహమును తనివితీర, ముదమార సందర్శించినది.

వెంగమాంబ యోగిని యని, గొప్ప భక్తురాలని ఆ నోట, ఆ నోట అంతకుముందే వినియుండిన ఆనాటి మహంతు ఆమె రాక నెఱిగి, శ్రీనివాసుని కోవెల యొక్క తూర్పు మాడవీథి చివర నుండిన రాతి తేరునకు కుడిప్రక్కనున్న పూరియింటిని ఆమె నివాసమునకై యొసంగెను. మఱియు స్వామివారి పాకశాల నుండి పడిబియ్యమును, అందులకు దగిన సంభారములను వకుళమాలిక పేరట వెంగమాంబకు పంపించు నేర్పాటు గావించెను.[40]

వెంగమాంబ తన కుటీరమున స్వయంపాకము చేసికొని స్వామికి నైవేద్యము పెట్టి భుజించుచు, మిగిలిన వేళలయందు భక్తి ప్రపత్తులతో గ్రంథరచన గావింప మొదలిడెను. తన కుటీరము నొద్ద తులసి మొక్కలను, పూలతీగలను పెంచి, పుష్పమాలలు కట్టి ఆలయమున కేగి స్వామివారికి సమర్పించుచుండెను. ఈ కవయిత్రి తిరుమల క్షేత్రమును చేరిన పిమ్మట హయగ్రీవ మంత్రోపదేశమును పొందినటుల తోచును. ఈమె తరిగొండలో రచించిన రచనలలో దేనియందును హయగ్రీవస్తుతి లేకుండుట, తిరుమల యందు రచించిన కృతులన్నింట ఇష్టదైవతా స్తుతిలో హయగ్రీవుడు పేర్కొనబడి యుండుట ఈ యూహ కాధారము లైనవి. వెంగమ తిరుమల క్షేత్రమును చేరిన తొలినాళ్లలో రచించిన కృతి విష్ణుపారిజాతము. ఈ యక్షగాన మామె కవితా కమనీయతను, భక్తితత్త్వ మును వేనోళ్ల చాటుచున్నది.[41]

**తాళ్లపాకవారి సాన్నిహిత్యము :**

తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామివారి సంకీర్తనాచార్య పదవియందు స్థిరపడియుండిన తాళ్లపాక పెదతిరుమలాచార్యుల[42]వంశీయులు స్వశాఖీయురాలగు వెంగమ్మయొక్క భక్తిమహిమను, కవితా విశిష్టతను గూర్చి విని సంతోషించినవారై, ఉత్తరమాడ వీధిలో తమ నివాసగృహము నకు ప్రక్కనున్న చిన్నయింటిని ఆమె కుచితముగా నొసంగిరి. అందుచే వెంగమాంబ తానదివరకు వసించుచుండిన కుటీరమును వీడి, తాళ్లపాకవా రిచ్చిన మిద్దెయింటిలో జేరినది. ఆ యింటి వెనుక భాగమున దివ్యపరిమళ కుసుమ, తులసీ వనము నేర్పరచి, సదా శ్రీనివాస రూపమును పూలతో, తులసీ దళములతో అలంకరించి యారాధించు చుండెను.

తాళ్లపాకవారి పొరుగున నుండుట వలన, వారి పూర్వులు రచించియుండిన రచనలతో పరిచయము కలుగు నవకాశము వెంగమాంబకు లభించెను. ఆ రచనలలో అన్నమయ్య ధర్మపత్ని యగు తిమ్మాంబ (తిమ్మక్క)[3] రచించిన సుభద్రాకల్యాణ మను కృతి వెంగమను మిగుల నాకర్షించినది. తదనుగుణముగా నామె రమాపరిణయమను ద్విపద కావ్యమును 'పెండ్లిపాట'గా రచించినది.

వెంగమాంబ నివసించుచుండిన యింటినానుకొని, ఇంకొక ప్రక్కన అక్కా రామయ్యదీక్షితులు అను సర్కారు అర్చకుడు[43] కాపురముండెను. మిగుల సంపన్నుడు, బహుకుటుంబి, అర్చక సంఘమునకు పెద్దయునైయుండి, ఆతడా కాలమున తిరుమలయందు పలుకుబడిగల ప్రముఖుడుగా పేరొందియుండెను. కులమునుండి వెలివేయబడి, ఊరువిడిచి వచ్చిన యొకానొక వనిత- అందును పూర్వాచారపద్ధతి నెదిరించిన వితంతువు- వేంకటాచల క్షేత్రమున భక్తురాలుగా, కవయిత్రిగా పేరు గాంచుట, స్వామివారికి తులసీ, సుమమాలికలను కూర్చి సమర్పించుట, అట్టి యువతి వచ్చి వచ్చి తన పొరుగుననే నివసించుచుండుట సనాతనాచార పరాయణమ్మన్యుడగు దీక్షితులకు సుతరాము సహింపరానిదైనది. అందువలన నాతడు తన యింటికి వచ్చిపోయెడి వారలతో, వెంగమ్మకు వినబడునటుల సూటిపోటిమాట లాడుచుండెను. అయినను పరమసాధుస్వభావ యైన వెంగమాంబ ఆ మాటలను పెడచెవిని బెట్టుచు, సర్వము ఈశ్వరేచ్ఛగా భావన సేయుచు మిన్నకుండెను.

అధికారగర్వితుడైన దీక్షితులు అంతటితో నూరకుండక, తన యింటి యెంగిలి విస్తళ్లను వెంగమాంబ పెరటి యందలి పూలమొక్కలపై బడునటుల వేయించుచుండెను. ఆ విషయమై ఆ యింటివారి కెంత చెప్పినను ఫలితము లేకుండెను. అందుచే వెంగమ్మ ఆ యెంగిలి పుల్లెలను తొలగించి, నిత్యము పూలతోటను శుభ్రపరచు కొనుచుండెడిది. ఒకనాటి ప్రదోషవేళ వెంగమాంబ తన పెరడు నందలి తులసికోట తిన్నెపై గూర్చుండి శ్రీవారి 'ఆనందనిలయము'ను కన్నులార గాంచుచు, తదేక ధ్యానమున మేనుమరచి నిశ్చలముగా నుండెను. అట్లాయమ్మ ఎంత సేపటి నుండి యున్నదో ఎవ్వరు నెఱుగరు. ఇంతలో దీక్షితుల యింట రాత్రి భోజనములు ముగిసి, యథాప్రకారముగ ఎంగిలాకులు వెంగమ పెరటిలో వచ్చి పడినవి. అవి సరాసరి యామె పాదములపై బడుటతో ధ్యానసమాధికి భంగము వాటిల్లెను. తోడనే అదివర కెన్నడును కలుగని క్రోధము దైవికముగా నపుడామె నావేశింపగా, 'ఓరీ పాపీ! నీవు, నీవంశము నాశనముగాను గదరా!' అను శాపోక్తులు అప్రయత్నముగా, ఆవేశ

పూర్వకముగా వెంగమ నోట వెలువడెను. తత్ప్రభావమున ఆ కుటుంబ ములోని యనేకు లార్తి వమన విరేచనములచే బాధితులై అకాలమృత్యువు వాత బడిరి. అక్కా రామయ్య వెంగమాంబ చరణములపైబడి, శాపమును మరల్చి తన వంశమును రక్షింపవలసిన దని దుఃఖించుచు దీనముగా ప్రార్థించెను.

**తపస్సు :**

పరమశాంత స్వభావయైన ఆ యోగిని అదంతయు వేంకటరమణుని లీలగా భావించి, 'నీవు పశ్చాత్తాపము వలన పునీతుడవైతివి. ఇక మీదట నీ కుటుంబము ఏకప్రాణి మాత్రముగ శేషించియుండును' అని యాతని నోదార్చి పంపెను. దైవికమైన ఈ సంఘటనచే చలించిపోయిన వెంగమ మనస్సు విజనప్రదేశమున కొంతకాల మేకాంతముగా గడుప నిచ్చగించెను. తుంబురుకోన [44] అందుల కనువైన ప్రదేశమని నిశ్చయించి, యొకనాడామె యెవ్వరికి జెప్పక అచ్చటకు జేరుకొనెను.[45] అచ్చట నున్న గుహలలో నొకదాని యందు వసించుచు ఆ యోగిని తీవ్రమగు తపము చేయదొడగెను. ఆ మఱుదినము నుండి యామె తిరుమలలో కనబడనందున ఇరుగుపొరుగు జనులు వెంగమ్మ వేంకటేశ్వరునం దైక్యమై పోయెనని భావించిరి. మఱికొందరా యోగిని శేషాచలారణ్యములో నెచ్చటనైన తప మొనరించుచుండునని తలంచిరి.

ఇట్లుండ, కొంతకాలమునకు కుష్ఠురోగపీడితుడగు విప్రుడొకడు [46] ఐహిక విషయ విరక్తుడై, శ్రీవేంకటాచల పుణ్యక్షేత్రమున జీవిత శేషము గడుప నిశ్చయించి, యెట్లో తిరుమలను చేరగల్గెను. మహావ్యాధిపీడితు డగుటచే అతనికి స్వామిదర్శనము దుర్లభ మయ్యెను. అందుచే బ్రతుకుపై రోసి యాతడు అడవి తెరువుబట్టి తుంబురుకోన ప్రాంతములు జేరెను. అప్పటి కాకలిదప్పులతో శ్రమ యధికమై, అతడు కాలు ముందునకు కదపలేకపోయెను. ఆ నిర్భాగ్యుని దీనాలాపములు ప్రశాంతమైన యా కోనలో ప్రతిధ్వనించి, అచట తపోనిష్ఠాగరిష్ఠయై యున్న వెంగమాంబ చెవిని బడినవి.

దయామయి యగు నామె ఆ విప్రుని దైన్యస్థితిని గమనించి, కనికరముతో కొన్ని ఫలములను, ఉదకమును అతని కడకు గొంపోయి యొసగి సేదదీర్చెను. అటుపిమ్మట ఆతనికి పరిపూర్ణారోగ్యము కలుగునటుల వేంకటరమణుని వేడుకొని, ఇట్లు పలికెను; 'ఓయీ! శ్రీనివాసుని యనుగ్రహము వలన శీఘ్రమే నీకు స్వస్థత చేకూరగలదు. కాని, నీవు నన్నిచట చూచిన ట్లెవ్వరితోడను చెప్పరాదు. కాదని చెప్పితివా ప్రమాదము పాలయ్యెదవు. జాగరూకుడవై మెలగుము. కనులు మూసికొనుము.' వెంటనే యాతడు కనులు మూసికొనెను. స్వామివారి పుష్కరిణిలో మునిగితేలిన యనుభూతి కలుగగా నాతడు కనులు దెరచి చూచెను. ఆ సమయమున స్వామి పుష్కరిణిలో స్నానమాడుచుండిన తైర్థికులు ఒక్కుమ్మడిగా నీటిలో నుండి పైకిలేచిన యా నూతనవ్యక్తిని గాంచి యాశ్చర్యచకితులైరి. స్వామి పుష్కరిణి నుండి వెడలినకతన, అచ్చటి తీర్థవాసు లాతనిని 'పుష్కరిణీజు',డని వ్యవహరింప నారంభించిరి. నీరోగియై, నవయౌవనుడై, తీర్థవాసుల గౌరవమునకు పాత్రుడైన యా విప్రుడు గర్వించి, కొన్నాళ్లకు వెంగమాంబ యునికిని పురజనులకు వెల్లడించెను. వెంటనే యతడు భిన్నశిరస్కుడై మృతి నొందెను.[47] మహంతు మొదలుగాగల పౌరులు మంగళవాద్యములతో బృందముగా తుంబురుకోన కేగి వెంగమాంబను సందర్శించి, 'మరల తిరుమలకు దయచేసి మమ్మందరను ధన్యుల గావింపు'డని మిగుల భక్తితో ప్రార్థించిరి. తిరుమలవాసుల వాక్కును శ్రీనివాసుని యానతిగా సంభావించి, యా తపస్విని తిరుగ తిరుమల క్షేత్రమున తాళ్లపాకవారి యింటి ప్రక్కనున్న తన మఠమును జేరెను.

వెంగమాంబ తుంబురుకోనలో నుండిన కాలము (కనీసము రెండు, మూడు సంవత్సరములు)లో చాలమట్టుకు తీవ్ర తపస్సాధనకే వినియోగించెను. చెంచునాటక మను యక్షగానము మాత్రము ఆమె తుంబురుకోనయం దుండినపుడు రచించినదని, అందలి యితివృత్తమే చెప్పుచున్నది.

వెంగమ్మ తుంబురుకోన నుండి మరలి రాలేదనియు, అచ్చటనే యామె భగవంతునియం దైక్యమయ్యెననియు కొన్ని చరిత్రములు

వాకొనుచున్నవి.[48]కాని , చెంచునాటకము తర్వాత ఆమె లేఖిని నుండి పెక్కు ముఖ్యరచనలు వెలువడియుండుటనుబట్టియు, ఆమె బృందావనము (సమాధి) తిరుమలయం దుండుటనుబట్టియు, ఆమె 'తిరుపతికొండ మీద శ్రీనివాసమూర్తి చరణారవిందముల బొందె'నని ఇంకొక చరిత్రము[49] పేర్కొను చున్నందునను, వెంగమాంబ తుంబురుకోనను వీడి మరల తిరుమల క్షేత్రమును చేరినట్లు నిశ్చయముగా భావింపవచ్చును.

**బృందావనము :**

తిరుమలలో తాను నివసించుచుండిన యింటికి ఉత్తరదిశలో ఎత్తైన ప్రదేశమున కొంతచోటును సేకరించి, వెంగమాంబ అందు పూలమొక్కలతో గూడిన తులసీ బృందావనమును పెంచదలచినది. అట్లు పెంపొందించదలంచిన ఆ తోటకు నీటివసతి నిమిత్తముగ అందొక దిగుడుబావిని త్రవ్వించినది. ఎంతలోతు త్రవ్వినను అందు ఊటపొడమలేదు. అట్టడుగున పెద్దబండ యొకటి అడ్డుపడియుండుట అందులకు కారణమని తెలిసిన పిమ్మట, ఆమె బావిలోనికి దిగి యాశువుగా గంగాభవానిని ఈ క్రింది గేయ రూపమున ప్రార్థించినది.[50]

రాగం - మోహన, త్రిపుటచాపు తాళం
ఓ తల్లీ! గంగాభవానీ! రావే!
ఖ్యాతిగ ఇచటికి కపటము మాని ॥ఓ తల్లీ॥

హరిపాదమున బుట్టినావు; పుర
హరుని జటాజూటమున నిలిచినావు
పరమపవిత్రవైనావు; మా
పాలిట వెలసి పూజలు గైకొన్నావు ॥ఓ తల్లీ॥

హరికర్పితముగ శ్రీతులసీవన
మలనా డర్చతో నిన్ను గావింప వెలసి
తరుణిది పెంచను మెరసి యున్న
నర లేక రావె శేషాద్రిలో వెలసి ॥ఓ తల్లీ॥

వాసిగ నిను చాల నమ్మి, చిన్న
వాండ్ల కాదరువుగ నున్న సా మ్మమ్మి
చేసితి; నిను పని నమ్మి చేయ
నిరవుగ ఇచటికి బిరబిర రమ్మి ॥ఓ తల్లీ॥

తరిగొండ నరసింహుడైనా శేష
గిరివాసు నే వేళ కీర్తింపు జ్ఞాన!
కరుణ నాపై నుంచు శానా; మమ్ము
కడతేర్చు భారము కల్గినదాన! ॥ఓ తల్లీ॥

-శ్రీ త. వేం. చరిత్రము (1), పుట 36.

వెంటనే బావిలో నలువైపుల నుండి పుష్కలముగా నీరూరజొచ్చెను. ఈ వృత్తాంతము నెఱింగిన జనులు ఆ యోగిని మహిమను వేయినోళ్ల కొనియాడిరి.

పై గేయములో మూడవ చరణమున "చిన్నవాండ్ల కాదరువుగ నున్న సొమ్మమ్మి" అని యుండుటచే, వెంగమాంబ తుంబురుకోన నుండి తిరుమల చేరిన పిమ్మట, ఆమె చెల్లెలి కూతురగు మంగమ్మయో, మఱి యొకరో ఆమెకు సహాయముగా పరిచర్యార్థమై చేదోడు వాదోడుగ నుండుటకు చేరినట్లు భావింపవలెను.[51]

తులసివన మేర్పడిన నాటినుండి వెంగమాంబ చాల సమయమందే గడపదొడిగినది. అందుగల యొక శిలాతలముపై [52] ఆసీనయై ధ్యానసమాధి నిమగ్న యగుచుండు వేళల తెల్లనిసర్ప మొకటివచ్చి యామె శిరస్సునకు నీడ నిచ్చుచుండెడిదట! మఱియు, తుంబురుకోన నుండి తిరుమల చేరిన పిమ్మట ఈ కవయిత్రి లేఖినినుండి అవతరించిన రచనలన్నియు ఆ దివ్యారామ నిరుపహతి స్థలముననే తొలుదొల్త అక్షరరూపము నందినవి. ఆ పవిత్ర 'కవితా బృందావనము' నుండి వెలువడిన మధురకృతులలో మొదటిది శ్రీకృష్ణమంజరి.

**ముత్యాలహారతి :**

వెంగమాంబ తరిగొండను వీడి తిరుమల చేరి ఇంచుక స్థిరపడిన నాటనుండి ప్రతిదినము సాయంవేళలో స్వామివారి కైంకర్యములు ముగియు ఏకాంతసేవా సమయమునకు ఆలయమున కరిగి కర్పూరహారతి యొసగి వచ్చుచుండెడిది. తరతరములుగా మహాత్ముల, మహనీయుల కైంకర్యము లందుకొనిన శ్రీవేంకటేశ్వరునకు, ఒకానొక స్త్రీ-ఆమె యెంతటి భక్తురాలైనను - పూర్వాచార విరుద్ధముగా సకేశియై యున్నట్టిది- కర్పూరహారతి యిచ్చుట, ఆ హారతితో శ్రీస్వామివారి నిత్యపూజాక్రమము ముగియుట యను విషయములు తత్రత్యులగు అర్చకశిఖామణులకు అసూయావహము లయ్యెను. అందుచే వా రొక నాడా యమకు వినిపించు నటుల ఈసడింపు పల్కులు పలుకుకొనిరి. నిత్యకైంకర్యపరులైన వారి పల్కులు స్వామివారికిని సమ్మతములై యుండుననెడు సద్భావముతో, హారతి యొసగి, వెంగమ్మ ఆ మఱునాడు గుడి కేగక తన యింట అర్చనలోనున్న శ్రీనివాస ప్రతిమకు హారతి యిచ్చి సంతృప్తి నొందెను. అట్లామె గుడికి రాకపోవుట అంతకు ముందటి దినమున తమలో తాము పల్కుకొనిన పల్కుల యొక్క ప్రభావమే యవి అర్చకులు తనిసి, ఆ యుత్తమభక్తురాలి కైంకర్యమునుగూర్చి యెగతాళిగా మాటలాడుకొనిరి.

ఆ మఱుసటి దినము రథోత్సవము, భక్తబృందము యొక్క మేరమీఱిన యుత్సాహముచే తిరువీధులలో నడగొండవలె కదలి వచ్చుచున్న వేంకటేశ్వరుని తేరు వెంగమాంబ యింటివద్దకు వచ్చునప్పటికి నిశ్చలముగా నిలిచిపోయెను. రథమును ముందునకు కొనసాగించుటకు మహంతు మొదలగు అధికారు లెంత ప్రయత్నించినను, భక్తాదులు బలము కొలది లాగినను కట్టు కదల దయ్యెను. అయ్యది మహాభక్తు రాలగు తరిగొండ వెంగమాంబ ప్రభావమేయై యుండునని అర్చకస్వాము లప్పటికి గ్రహింపగల్గిరి. ఆ పూజారులు బుజములు తడుముకొనుచు, ఆమె సమక్షమున కరిగి తమ తప్పులను క్షమింపవేడుకొనిరి. శ్రీవారి రథము సాగిపోవునటుల, వచ్చి కర్పూరహారతి యిచ్చి ప్రార్థింపవలసినదిగా మిగుల

బ్రతిమాలుకొనిరి. పశ్చాత్తాపతప్తులైన వారి యభ్యర్థనల నంగీకరించి, మహంతు మున్నగువారి కోరిక ననుసరించి, వెంగమ రథముకడ కేతెంచి రథారూఢుడై యున్న శ్రీభూసమేత వేంకటేశ్వరునకు పరమభక్తితో కర్పూర నీరాజన మొసంగెను. ఆ పిమ్మట తేరు మెల్లగా కదలిపోయి గమ్యము చేరినది. ఆనాటినుండి వెంగమాంబ హారతి ఆలయాధికారులచే నిత్యహారతిగా అంగీకరింపబడెను. మహాత్మురాలైన వెంగమాంబ ప్రారంభించిన ఈ కర్పూరహారతి కైంకర్యము "ముత్యాలహారతి"[53] "తరిగొండ వారి హారతి"- అను పేళ్లతో నేటికి, రేపటికి అవిచ్ఛిన్నముగా కొనసాగుచున్నది, కొనసాగ నున్నది.

వెంగమాంబ తాను ప్రారంభించిన హారతి సేవను క్రమము తప్పక జరిపించుటకై తన చెల్లిలి కూతురగు మంగమ్మను దత్తు తీసికొనెనని యొక చరిత్రమున చెప్పబడినది. [54] కాని, యందుల కాధారము కానబడదు. వెంగమ్మ తన చెల్లిలి కూతురైన మంగమ్మను బాల్యమునుండి దగ్గర చేర్చుయుండినది. మంగమ్మ అత్తింటివారు చీనేపల్లి (గరిడిమిట్ట) వారు. ఆత్రేయసగోత్రులు. వారి స్వగ్రామము వాయల్పాడు తాలూకాలోని గరిడిమిట్ట. వెంగమాంబ తన అపరవయస్సున ఆ చీనేపల్లి (గరిడిమిట్ట) వంశమునకు చెందిన నరసప్ప యను యువకుని దత్తుగైకొనెను. ఈ 'యింజేటి నరసప్ప' భార్య చెంగమ్మ. వీరి కూతురు పేరు లక్షమ్మ. ఈ లక్షమ్మ భర్త గరిడిమిట్ట గమ్మన్న.[55] ఈ దంపతుల కుమారుడే 'విష్ణు పారిజాత' ప్రతిలేఖకుడైన గంగాధరప్ప.[56]

వెంగమ తిరుమల చేరిననాటినుండియు వేంకటేశ్వరుని తన యిలవేల్పైన తరిగొండ నృసింహునితో అభేదముగ భజించు చుండినది. ఈ యభేదభక్తి భావన ఆయమ సృజించిన సారస్వత మందంతట అడుగడుగున అక్షరరూపమున సాక్షాత్కరించుచునే యున్నది. తరిగొండ లక్ష్మీనృసింహస్వామి భక్తురాలగు నామె ప్రతి సంవత్సరము నృసింహజయంత్యుత్సవములను జరుపుచుండెడిది. క్రమముగా తరిగొండలో తన తండ్రి యింట నుండిన నృసింహదేవతార్చన సంపుటి వెంగమ మఠమును జేరెను. వైశాఖ శుద్ధ చతుర్దశి (నృసింహ జయంతి)

మొదలుకొని పదిదినములపాటు జరిగెడి ఆ జయంత్యుత్సవములలో పేదసాదల కన్నదానము, చలివేంద్రలు నిర్వహించుట మున్నగు ధార్మిక కార్యక్రమములు వైభవోపేతముగా నిర్వహింపబడుచుండెను. పదియవనాడు శ్రీవేంకటేశ్వరస్వామి (ఉత్సవమూర్తి) వెంగమాంబ గృహమునకు వేంచేసి, నైవేద్యాది కైంకర్యముల నందుటతో ఆ యుత్సవములు పరిసమాప్తము లయ్యెడివి.[57]

**సారస్వత కేంద్రము :**

ఒకవైపు రచనల మూలమున, మఱియొకవైపున తపశ్శక్తి తోడి మహానుభావత వలన, దాన ధర్మాది సత్కార్యక్రమముల మూలమున, ఆధ్యాత్మిక, భక్తసందేశముల వలన తరిగొండ వెంగమాంబ కీర్తి తిరుమలకు వచ్చెడి తైర్థికబృందముల ద్వారా దేశము నలుగడల వెన్నెలవలె అలముకొన జొచ్చెను. తమిళనాడులోని దిండిగల్లు మొదలుకొని, తెలంగాణ మండలి గోలకొండవరకు గల దేశమున గల జమీందారులు, పాళెయగార్లు, సంపన్నులు, భూస్వాములు, సామాన్యప్రజలు ఆమె నిర్వహించు నృసింహోత్సవములకై అయాచితముగా సమర్పించిన భూదానాదికము ఇందుకు నిదర్శనము.[58]

క్రమముగా ద్విపద భాగవత రచన నాటికి ఆమె మఠమున 'అష్టఘంటము'లను పేరున ఎనమండుగురు వ్రాయసకాండ్రు ఏర్పడి యుండిరి. వారామె యొక్క రచనలకు ప్రతులు (Copies) తయారు చేయుచుండిరి.[59] తిరుమల యాత్రకు వచ్చెడు కవులు, పండితులు మున్నగు తద్జ్ఞులు స్వామివారి దర్శనమైన వెనుక, తరిగొండ వెంగమాంబగారిని దర్శించి 'ధన్యులమైతి'మని సంతసించుచు తరలి పోయెడివారు. మఱికొందరామె కృతులకు ప్రతులు వ్రాయించుకొని యేగెడువారు. అట్టివారలలో వారు వెంగమాంబిక రచించిన నృసింహ విలాసము, విష్ణుపారిజాతము, గోపీనాటకము (గొల్ల కలాపము) వంటి యక్షగాన నాటకముల ప్రతులను గైకొనిపోయి, వాటిని నేర్చుకొని, ఆ యా సందర్భములలో ప్రదర్శించుచుండిరి. ఈ రీతిని ఈ కవయిత్రీమతల్లి యొక్క కీర్తిచంద్రికలు నలుదెసల వ్యాపించెను.

ఆ కాలమున తిరుమల క్షేత్రములో తరిగొండ వెంగమ్మ మఠము నిరంతరము సందడిగా నుండుచు దర్శనీయమగు పవిత్ర సారస్వత కేంద్రముగా ప్రకాశించుచుండినది.

వెంగమాంబ ద్విపద భాగవత రచనానంతరము వేంకటాచల మాహాత్మ్యమును పద్య (చంపూ) కావ్యముగా వెలయించినది. జలక్రీడా విలాస, ముక్తికాంతా విలాస యక్షగానములు, వాశిష్ఠ రామాయణ ద్విపదకావ్యము- ఈ కవయిత్రి చివరి కృతులు. ఈ గ్రంథములేగాక ఈ కవితా తపస్విని తన యిష్టదైవమైన 'తరిగొండ శేషకుధరాధ్యక్షు'ని సంబోధించుచు భక్తిభావభరితములైన కీర్తనలను, తత్త్వములను (వచనములను), పద్యములను, పాటలను, సంవాదములను ఎన్నిటినో విరచించినది. వీటిలో కొన్ని ముద్రణ భాగ్యము నందినటుల తెలియుచున్నను, నేడు లభింపకున్నవి.

ఇట్లు ఒకవంక సారస్వతసేవను, మఱొకవంక స్వామి కైంకర్యములను, ఇంకొకవైపు జిజ్ఞాసువులైన శిష్యులకు, శిష్యురాండ్రకు ఆధ్యాత్మికోపదేశ ములను గావించుచు, ఈ కవయిత్రి సహస్రచంద్ర దర్శన మొనరించి[60] క్రీ.శ. 1817 ఈశ్వర సంవత్సరమున పరమ పదము నలంకరించెను.

**మహా సమాధి:**

వెంగమాంబ భక్తులు, శిష్యులు నిర్ణీతప్రకారము ఆ మహనీయురాలి భౌతికకాయమును ఆమె పూలతోటలో నిత్యము ధ్యానసమాధి నిమగ్న యగుచుండెడిచోట మహాసమాధి గావించిరి. క్రమముగ నందుమీద ఒక మండపము, ఆ మండపముమధ్య నొక తులసికోట నిర్మింపబడెను. ఆ సమాధి కెదురుగ నేరేడుచెట్టు క్రింద నిర్మించిన చిన్నగూటిలో ఆంజనేయ విగ్రహము అభిముఖముగా ప్రతిష్ఠితమై యున్నది. ఆ ప్రతిష్ఠితమూర్తి వెంగమాంబకు యుద్ధకళ తీర్థము నొద్ద నీడ నిచ్చి కాపాడిన ఆంజనేయుడే యని యొక చరిత్రము వాకొనుచున్నది.[61]

ఆ పవిత్ర ప్రదేశము వెనుకటివలె తులసి మొక్కలతో పలు తెరగుల పూలచెట్లతో ఫలవృక్షములతో విరాజిల్లక యున్నప్పటికిని, 'తరిగొండ

వెంగమాంబ బృందావన' మనియు, 'తరిగణమ్మ (తరిగొండమ్మ) తోట' యనియు ఆ యారామస్థలిని జనులు వ్యవహరించుచునే యున్నారు. భక్తిప్రపత్తులతో ఆ మహాయోగీశ్వరి యొక్క బృందావనమునకు కాయకర్పూరములు నివేదించుచు, నైవేద్యములు పెట్టుచు (ముఖ్యముగా శుక్రవారములయందు) మ్రొక్కు లిడుచున్నారు.

**మహానుభావత:**

వెంగమాంబ జీవితగాథ తదితర మహనీయ జీవితముల వలెనే మహిమను సూచించు సన్నివేశములతో గూడియున్నది. వేంకటేశ్వరస్వామి నిత్య మామె యింటి కరుదెంచుట, వెంగమ తుంబురుకోన నుండి గుహామార్గమున నేతెంచి స్వామి నర్చించిపోవుట మొదలైన విట్టివి. పౌరాణిక ధోరణిలో గన్పట్టు ఈ కథాంశములను పూర్తిగ నిరాకరించుట కంటె, వీటిని ఆమె మహానుభావతకు తార్కాణములుగా స్వీకరింపదగును.

ఒక్కమాటలో వచించినచో, వెంగమాంబ తాను జన్మించిన దేశమునకు, జీవించిన కాలమునకు అతీతముగా-అడుగడుగున కష్టపరంపరల నెదుర్కొనుచునే- విలసిల్లినదని చెప్పవలెను. ఈ కవయిత్రి తన యైహిక జీవితమునుగూర్చి అంతగా పేర్కొనక, కృతులన్నింటిలో కడుంగడు వినయమునే ప్రకటించియున్నను, ఆధ్యాత్మిక భావోద్దీప్తమై, భక్తిరంజితమైన ఆమె సారస్వతమూర్తిమత్త్వము మాత్రము ఆమె సృజించిన కృతు లన్నింట స్పష్టరేఖలతో సాక్షాత్కరించుచున్నది.

నేటికిని శ్రీ వెంగమాంబగారిని ధ్యానించినవారి కాయోగీశ్వరి దర్శనము ననుగ్రహించుచు, వారల ఆపదలను వారించుచున్నదని యొక చరిత్రము నుడువుచున్నది.[62] వెంగమాంబ తప మొనరించిన తుంబురుకోన యందే ఇటీవలి కాలమున (క్రీ.శ. 1915 ప్రాంతమున) తప మాచరించిన మహర్షి సద్గురు మలయాళస్వాములవారి దివ్యానుభూతి ఇందులకొక చక్కని నిదర్శనము. ఆ మహత్తర దివ్యానుభూతిని ప్రకటించుచున్న ఈ క్రింది పద్యములు తిలకింపదగియున్నవి.

"అట్లనవరత ధ్యాననిష్ఠుండై యుండ మఱి కొన్ని వర్షమ్ములు గడచె. ఒకానొక దినంబున నత్తపస్వివరేణ్యుండు. 55

## శ్రీ వేంగమాంబా సందర్శనము

తరిగొండ వెంగమాంబా
చరితము పలుమాఱు చదివి స్మరియించునెడన్
దరిసెన మొసంగె వెంగమ
పరువడి ధ్యానానుభూతి ప్రత్యక్షముగా. 56

అంచఱెక్కల మిసిమిడా ర్మించు మేలి
ముసుఁగు గల స్వరదీకాంతఁ బోలు నామె
యెదుర నిలఁబడి వత్స! నీ మదిఁ దలంపు
పెం పెఱింగితి నీ యిచ్చ యింపుఁ గూర్చె. 57

అనినం దొల్లి చరిత్ర కెక్కిన యనన్యాఖండ భక్తిప్రప
త్తిని వెల్గొందిన వెంగమాంబ యని యెంతే స్వాంతమం దెంచి యొ
య్యన సాష్టాంగనతుల్ పొనర్చియు స్వకీయానూన శంకానివృ
త్తిని వాంఛించిన యామె దీవెనల నెంతేఁ గూర్చె ప్రేమాదృతిన్. 58

అట్లు శ్రీవేంగమాంబాసందర్శనమున తనివి సెంది యెప్పటి యట్ల
తన నియమంబు పాటించుచుండె." 59

-శ్రీ మలయాళస్వామిచరిత్రము, పుట116.

(వారు నాగనార్యకవి రచితము)

మఱియు శ్రీ మలయాళస్వాములవారు తమ రచనలలోను, ఉపన్యాసములలోను స్త్రీలను గూర్చి, వారి బ్రహ్మవిద్యార్హతను గుఱించి, ఆధ్యాత్మిక విద్యావైదుష్యమును గూర్చి ప్రసక్తి వచ్చిన సందర్భముల యందెల్ల మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ నామధేయమును ప్రకృష్టముగా ఉదాహరించి యుండుట పేర్కొనదగిన ముఖ్యాంశము.[63]

తిరుపతి వాస్తవ్యులు, పెద్దలు, వెంగమాంబ జీవితగాథను వచనకృతిగాను, పద్యకావ్యముగాను రచించినవారు, ప్రముఖ వైద్యులు, కవులు నైన డా॥ పి.టి.జగన్నాథరావుగారు క్రీ.శ. 1932లో తమకు గలిగిన విచిత్రదర్శనమునుగూర్చి My Vision of Lord Venkateswara[64] అను

ఆంగ్లవ్యాసములో వివరించి యున్నారు. ఆ వ్యాసమునుండి యుద్ధరింపబడిన ఈ క్రింది పంక్తులు ముఖ్యముగా నిట తిలకింపదగి యున్నవి.

``I came to Tirupathi in the year 1932-33 to settle down permanently. I went up the hill, stood before Lord Venkateswara and prayed to Him.....I came down the hill to my residence. That night very early in the morning at about 4 A.M., I had a vision. It is not a dream. I will give the difference between a vision and a dream in the end before I finish this article.

There was twilight. It was neither day nor night. I was moving towards Bangaru Vakili. As I approached it, the doors automatically opened by themselves. There were none. I went in upto Kulasekhara-padi. Sri Venkateswara was fully decorated. He was shining in gold and gems. I folded my hands and said `You, are again appearing to me as an idol. I cannot understand you, nor can I converse with you. Immediately the idol transformed into Ahobila mutt Pedda Jeeyangar of 1916, from whom I had the first initiation (Samasrayanam) and said `Now come on, what do you want?,

I was overwhelmed with joy and I thought I was the only fortunate person on earth. I forgot my issue and questioned Him, 'Dear Swami, people say that Hathiram Bawaji, Thallapaka Annamacharya and Tharigonda Venkamamba merged in you. If it is a fact, I wish to see how you have taken them into you'. Look here, He said and stretched His long hands horizontally side ways. Just before His stretched right hand stood Venkamamba clad in a simple cotton saree and a jacket. Her haid was knotted and turned in (koppu). She wore a long red Namam on her face. She was having a plate in her hands with burning camphor. She was slightly bent forward out of devotion. Similarly, on the left side close to

God was Hathi Ram a robust figure with a beard and North Indian Namam. Next to him was Annamacharya with his S. Indian Namam and Thambura. Both were clad in white dhoties. Shri Venkateswara in the form of Jeeyangar brought them all close to his chest with His hands. They melted awy into him. I would not believe my own eyes..... I went near Him and prostrated before his feet. By the time I got up I saw the original Idol only. Suddenly I opened my eyes and woke up. It was about 4.30 A.M."

పై ఆంగ్లవాక్యములు తద్రచయితయొక్క స్వానుభవమును ప్రకటించుచు, తరిగొండ వెంగమాంబ, తాళ్లపాక అన్నమాచార్యులవలె, హత్తీరామ్ బావాజీవలె శ్రీవేంకటేశ్వరస్వామివారియందు సాయుజ్యము నొందిన పరమభక్తురా లనెడు సత్యమును వెల్లడించుచున్నవి. నేడును ఆమెను ధ్యానించువారలు స్వానుభవపూర్వకముగ పేర్కొనుచున్న దృష్టాంతములు ఇట్టి వెన్నో యున్నవి.

ఈ కవయిత్రి విరచించిన వేంకటాచల మాహాత్మ్యాది గ్రంథముల యందలి పాత్ర లన్నియు సాధారణముగా స్మితపూర్వాభిభాషులుగా వర్ణింపబడియున్నవి. ఈ యంశమునుబట్టి వెంగమాంబ వదనమున ఆధ్యాత్మిక తేజ ముట్టిపడెడు చిఱునవ్వు నిరంతరము తాండవించు చుండెడిదని భావింపవచ్చును.

చిట్టచివర, ప్రత్యక్షరమున వెంగమాంబ మహనీయత నినదించు చున్న ఆమె దానపత్రములలో మచ్చునకుగా నొక్కటి ఈ దిగువ తిలకింప దగియున్నది.[65]

"శ్రీ లక్ష్మి నృసింహ స్వామినే నమః అస్మద్గురుభ్యోన్నమః స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలీవాహన శకాబ్దః ౧౭౦౭ కల్యాబ్దః ౪౮౮౬ ప్రభవాది గతాబ్దః ౩౯మీద నగు నెటి చాంద్రమాన విశ్వావసునామ సంవ్వత్సర చైత్రశుద్ధ౩ లు భానువాసర అశ్వనినక్షత్రం యీ శుభదినమంద్దు శ్రీమదఖండ్డ సచ్చిదానంద్ద నిత్యపరిపూర్ణు లయిన శ్రీమదఖిలాండ్డకోటి బ్రహ్మాండ్డ

నాయకు లయిన శ్రీ శేషాచల నివాసు లయిన శ్రీ తరిగొండ్డ లక్ష్మి నృసింహస్వామి దివ్య శ్రీపాదారవిన్ద్ద మధుకరాయమానమానస్కులయిన మాతుశ్రీ తరిగొండ్డ వెంగ్గమాంబ్బగారికి చంద్రగిరి తాలూకాస్తళ కరుణం పాపయబిళ్ల పౌత్రులయిన నరసయబిళ్ల పుత్రులయిన శెతువరాయబిళ్ల వ్రాయించ్చి యిచ్చిన భూదాన ధర్మ శాసన పత్రిక క్రమ మెట్లంన్నను తొండ్డమండ్డలం తిరువళయాట్టం పుళ్మండ్డలం శేషాచలపర్వతానకు దక్షణం ఆగస్త్యమహారుషి వాసమైన చంద్రగిరి దుర్గ్గానకు వశ్చమం అయితె పల్లెకు రూపుౕ వృషభపర్వతానకు వుత్తరం యీ మధ్యె వుంన్న అగరం గ్రామంల్లో మాకరిణీక స్వతంత్ర మాన్యంల్లో నలుపైయెనిమిది అడుగుల కోలను నీరారంభం అచ్చుకట్టిన గుంట్టలుఞం యీ యాభై గుంట్టలుంన్ను శ్రీలక్ష్మి నృసింహ్వార్పితముగా యిచ్చినాము గనుక యీ మాన్యం తమ శిష్య పారంపర్యంత్తముంన్ను ఆచంద్రార్క స్థాయిగా క్రయవిక్రయంబ్బులకు యోగ్యమవునట్టుగా మీరె అనుభవించ్చ గలవారు. మా పుత్రపౌత్ర పారంపర్యంత్తరముంన్ను ఆచంద్రాక్క స్థాయిగా నడిపించ్చగలవారం. యింద్దులకు యెమి ఆక్షెపణ అటంక్కాలు లెవు. కలిగినట్టు అయితె మెమె ముంద్దు నిల్చి తిచ్చుౕ కోగలవారం, యిటని హరిహరాదుల సాక్షిగా అగరాల తొగురు శేషయ మాముడూరు నూలి పాపయ వీర్ల సంమ్మతిని నా రాజీన నా పుత్రుడైన కృష్ణరాయలు వ్రాశిన భూదాన ధర్మశాసన పత్రిక.

యింద్దుకు ప్రమాణం.

దానపాలయోర్మధ్యె దానాశ్రెయస్య పాలనం
దానా స్వర్గ్గ మవాప్నోతి పాలనాదచ్యుతం పదం
స్వదత్తా ద్విగుణం పుణ్యం పరదత్తానుపాలనం
పరదత్తాపహారెణ స్వదత్తం నిష్పలం భవేత్

అని ప్రమాణం వుంన్నది గనుక తెలిశి నడిపించ్చ వలిశినది. స్తళ కరుణం శెత్తువరాయని స్వహస్తం చెవ్రాలు.'

## జీవితసంగ్రహము - జ్ఞాపికలు

1. వాయల్పాడు తాలూకాయు, దాని ప్రక్కనున్న మదనపల్లి తాలూకాయు క్రీ.శ. 1911లో చిత్తూరుజిల్లా ఏర్పడువరకును కడపజిల్లాలో నుండినవి.

2. ఏకరు, యాకరు - అను వాని వ్యావహారిక (మాండలిక) రూపమే "ఏకిలి" ఏకర్లనుగూర్చి North Arcot District Manual Vol.I లో ఇట్లు తెల్పబడినది.

"Eakaris or Yakarlu: A class of cultivators and village watchmen found chiefly in the northern taluks of North Arcot and in the adjoining district of Cuddapah... It is clear however that they enjoyed some authority, for several lose to be poligars.........and their titles are Naidu and Dora" - vide page 21

ఈ రామానాయుడు కమ్మవంశీయుడని కొందరు స్థానికుల యభిప్రాయము.

3. ఈ స్వామి దుర్వాసుడను మహర్షిచే ప్రతిష్ఠింపబడినట్లు, పురాతన కాలమున ఆ మహర్షి యచ్చట ఆశ్రమము నిర్మించుకొని తపము గావించినట్లు జనశ్రుతి.

ఇందుల కనుగుణముగ తరిగొండకు దగ్గరలో నున్న వాయల్పాడు (వాల్మీకిపురము) నందలి సుప్రసిద్ధ రామాలయమున వెలసియున్న, శ్రీరాముడు వాల్మీకి ప్రతిష్ఠితుడనియు, బ్రిటిష్ ప్రభుత్వపు 'రికార్డు'లలో గూడ 'వాల్మీకిపురి' యను పేరు పేర్కొనబడియున్నదనియు ఆ గ్రామస్థులు శ్రీఆరమడక వెంకటరమణారెడ్డిగారు తెల్పినారు.

వాయల్పాడుకు ఉత్తరమున 'నూరుకుప్ప (కొప్పు)లకొండ' యున్నది. దీనినే 'తరిగొండ వెంకమాంబ జీవితరత్నాకరము' "శతశృంగి" యని పేర్కొనినది. చూ.పుట. [1]

4. రామానాయని ధర్మపత్ని నరసమాంబ మజ్జిగ చిలుకుచుండగా ఈ విచిత్రము జరిగినట్లు త.వెం.జీ. రత్నాకరము పేర్కొనుచున్నది. చూ.పుట. [2]

5. తరిగొండకు సమీపమున గల 'మారెళ్ల గవి'లో లభించిన ధనరాసుల వలన రామానాయడు నృసింహాలయమును నిర్మించినటుల కొందరు స్థానికులు చెప్పెదరు.

6. ఈ సాలగ్రామము తరిగొండ యందలి లక్ష్మీనృసింహాలయమున గల లక్ష్మీనృసింహస్వామివారి విగ్రహమునకు ఎడమవైపున నెలకొల్పబడియున్నది. ఈ సాలగ్రామ నృసింహుని అచ్చటివారు 'పుట్టుశిల' యను పేర వ్యవహరించుచున్నారు.

7. ఈ యూరిలో వెలసియున్న లక్ష్మీనృసింహస్వామి మహిమ లనేకములు. ఆ ప్రాంతమున నేవైన తగాదాలు వచ్చినప్పుడు నేటికిని ఆ స్వామివారి గుడిలో "సత్యప్రమాణములు" చేయుట కలదు. ఇచ్చట చేయబడు ప్రమాణములను ప్రభుత్వ న్యాయస్థానములు కూడ ఆమోదించుచున్నట్లు తెలియవచ్చినది. ఎన్నాళ్లకును తెగని మొండి వ్యాజ్యముల తీర్పునకై మదనపల్లి మునసబుకోర్టు వారు వాది ప్రతివాదులను ప్రమాణముచేయు నిమిత్తము తరిగొండకు పంపు ఆచారము ఈనాటికిని కలదు.

అనాదినుండియు ఈ గ్రామమున (భక్త) ప్రహ్లాదనాటకము, బ్రహ్మోత్సవములలో మోహినీ ఉత్సవము జరుగుటలేదు. ఇది తెలియక క్రీ.శ. 1932 ప్రాంతమున కొంద రా యూరికి వచ్చి ప్రహ్లాదనాటకమును ప్రదర్శింపగా, నృసింహ వేషధారికి పట్టరాని ఆవేశము వచ్చి హిరణ్యకశిపు వేషధారిని వీధుల వెంట తరిమెనట! ప్రేక్షకులు వెనువెంటనే పరువెత్తి వెళ్లి ఆ నృసింహావేశమును కాయ కర్పూరములతో, గుగ్గిలపు ధూపములతో ఉపశమింపజేసిరట! అంతటితో ఆ నాటక మాగిపోయెను.ఈ విషయములను తరిగొండ గ్రామ పురోహితులు శ్రీ మునుగోటి సుబ్బరామశర్మగారు తెలిపినారు.

8. రాయదుర్గమునుండి వలస వచ్చుటచే రామానాయని వంశీయులకు తొలుత "రాయదుర్గమువా"రను ఇంటిపేరు ఏర్పడినను, రానురాను వారు "తరిగొండవారు"గా వ్యవహరింపబడిరి. ఆ వంశీయులు తరువాతి కాలమున నెప్పుడో తరిగొండకు సుమారు అరువదిమైళ్ల దూరముననున్న "చిట్టేచెర్ల"ను చేరుకున్నందున "చిట్టేచెర్లవారు"గా మార్పునొందిరి. నేటికిని తరిగొండ యందలి వివిధ వర్ణములలోని కొన్ని కుటుంబముల యింటిపేరు "రాయదుర్గము".

9. ఈ కౌలుపత్రము మెకంజీ లోకల్ రికార్డ్సు యొక్క ౧౮వ సంపుటములోని ౪౦౭వ పుట లోనిదిగా పేర్కొనబడినది.
చూ. లక్ష్మణరాయ వ్యాసావళి, ప్ర.సం.పుట.49.

10. See An Indian Ephemeris, Vol 5, page 254.

11. చూ. శ్రీ తరిగొండ వేంకమాంబ చరిత్రము (1). పుట 3,& శ్రీ తరిగొండ వేంకమాంబ చరిత్రము (2), పుట 73.

13. చూ. "కానాల నరసింహకవి" భారతి జూలై 1963, పుటలు 83-84, & అక్టోబరు 1963, పుటలు 52-55.

14. కర్నూలు మండలమున "కానాల" యను పేరుతో రెండు గ్రామములు కలవు. అందొకటి "పెద్దకానాల". "కృష్ణరాయ సముద్ర"మని దీనికి నామాంతరము. పింగళి సూరనకు నెలవై యుండిన గ్రామ మిది. ఇది నంద్యాల తాలూకాలో నున్నది. రెండవది కోవెలకుంట్ల తాలూకాలో నున్నది. దీనిని "చిన్నకానాల" "కొయిటాకు కానాల" అను పేళ్లతో వ్యవహరింతురు. తరిగొండ వెంగమాంబ అత్తవారి యొక్క ఇంటిపేరు "ఇంజేటివారు". ఈ యింటి పేరేర్పడుటకు కారణమైన "ఇంజేడు" అను గ్రామము సైతము "చిన్నకానాల"కు సమీపమున నున్నది. ఇందువలన, అహోబలపతి జన్మించిన "కానాల" ఈ రెండవ కానాలయే యని తలప నగును.

15. నందవరము-అను గ్రామనామమును బట్టి యేర్పడిన శాఖ "నందవరీకులు". వీరు తొలుత కాశీనివాసులు. పూర్వము నందుడను పాండవవంశపు రాజు సతీసమేతుడై కాశి కేగినపుడు అచటి

బ్రాహ్మణులలో కొందరు బహిష్ఠయైన ఆ రాజుపత్నిని తమ మంత్రశక్తిచే పునీతను గావించి, యా రాజదంపతులను సత్వరముగ రాజధానికి చేర్పించిరి. ఆ మహోపకారమునకు కృతజ్ఞతగా ఆ రాజు, అనంతర కాలమున కఱవు కారణముగ కాశిని వీడి తన కడకు వచ్చిన ఆ విప్రులకు తన నివాసమగు నందవరమును అగ్రహారముగా నొనరించి యిచ్చెను. అట్లు నందమహీపతిచే నందవరమును అగ్రహారముగా బడసిన పదమూడు గోత్రములకు చెందిన ఏనూరు బ్రాహ్మణ కుటుంబములే "నందవరీకులు"గా ప్రఖ్యాతి వహించిరి. వీ రెల్లరును ఋగ్వేదులు, ఆశ్వలాయన సూత్రులు. శాక్తేయులై యుండిన వీరల కులదైవతము శ్రీ చముం(చౌ)డేశ్వరి. ఈ "నందవరము" కర్నూలు జిల్లా బనగానిపల్లి తాలూకాలో నున్నది. ఈ గ్రామమున పురాతన ప్రసిద్ధమగు శ్రీ చౌడమాంబాదేవి యాలయము కలదు. నందవరీకులు కాలక్రమేణ నందవరమునుండి చీలిపోయి వివిధగ్రామములలో స్థిరపడుటచే ఆ యా కుటుంబముల వారికి ఆ యా గ్రామనామములే ఇంటిపేళ్లై వెలసినవి. కానాల, ఇంజేడు, తాళ్లపాక, రేవణూరు-మున్నుగా గల ఇంటిపే ళ్లిట్లేర్పడినవే!

16,17 చూ. "బాలకృష్ణ నాటకము" (తాళపత్రప్రతి) చివరి ద్విపద పంక్తులు.

4. చూ. "శ్రీకృష్ణమంజరి" చివరి పంక్తులు.

5. ఆ దంపతులకు అంతకు ముందు ఐదుగురు మగసంతతి యున్నను, ఆడుబిడ్డ లేదనెడు కొరతతో అనుదినము వేంకటేశ్వరుని ఆరాధింపగా వెంగమాంబ జన్మించెనని కొన్ని చరిత్రలు నుడువుచున్నవి.

చూ. శ్రీత. వేం. చరిత్రము (1), పుట 4, &శ్రీత.వేం.చరిత్రము(2), పుట 73.

కాని, వెంగమాంబ కొక సోదరుడు మాత్రము కలడని, అతనిపేరు కృష్ణుడని ద్విపద భాగవత స్కంధాంతములయందలి.

"ఐన కృష్ణార్యున కతిభక్తితోడ
నంగన యగు మంగమాంబ గర్భమున

సంగతి కృష్ణుండు సైదోడు గాగ
వెంగమాంబిక ప్రభవించి.........
అను కవయిత్రి పలుకులవలన తెలియుచున్నది.

చూ. మద్రాసు ఓరియంటల్ మేన్యుస్క్రిప్ట్ లైబ్రరీ (మ.ఓ.మే.లై.), డిస్క్రిప్టివ్ కేటలాగు (డి.కే.), వాల్యూమ్ iv పుట 1329.

18. ఈమె నామధేయమున ప్రథమాక్షరము హ్రస్వము. ద్వితీయాక్షరము సరళము. ఈ విషయమై ఈమె రచనలన్నియు సాక్ష్యమిచ్చుచున్నవి. ఇది యెఱుగక అర్వాచీన రచయితలు కొంద రీమె పేరును- వెంకమ్మ, వెంకమాంబ. వేంకమాంబ- ఇత్యాది పర్యాయ నామములతో పేర్కొని నారు.

19. i) "తలకొని వేదశాస్త్ర పురాణములను
లలి కావ్యనాటకాలంకారములను
దగ పూర్వకథల చందంబుల నెఱుగ
నగు మాట గా దిది నైజ మెట్లనిన
నా చిన్ననాఁట నోనామాల నైన
నాచార్యు లెవరు నా కాన తీలేదు"

-ద్విపద భాగవతావతారిక, ప్రథమ స్కంధము.

చూ.మ.ఓ.మే.లై.డి.కే., వాల్యుమ్ IV, పుట 1328.

ii) "సీ. నా చిన్ననాఁట నోనామాలనైన నా
చార్యుల చెంత నేఁ జదువ లేదు
పరఁగ ఛందస్సులోఁ బది పద్యములనైన
నిక్కంబుగా నేను నేర్వ లేదు
లలి కావ్యనాటకాలంకారశాస్త్రముల్
వీనులనైనను వినఁగ లేదు
పూర్వేతిహాస విస్ఫురితాంధ్ర సత్కృతుల్
శోధించి వరుసగాఁ జూడ లేదు"

- శ్రీ వేంకటాచల మాహాత్మ్యము 1 ఆ-21ప.

20. ఈ "కొంత కాలము" సంవత్సరమని కొందరు, ఐదేండ్లని మఱి కొందరు.

21. చూ.i) శ్రీ.త.వేం. చరిత్రము (1), పుట 13.
ii) ఆంధ్ర కవయిత్రులు, పుట 76.

22. చూ. "తరిగొండ వెంకమాంబా" (కన్నడము), పుట ೧೬.

23. i) ఈ కవయిత్రి తొట్టతొలి రచన యగు తరిగొండ నృసింహశతకము చివరి అంకితాంక పద్య మిట్లున్నది:

"ఎలమిని పెంపు సొం పొదవ నింజెటి వంశజుఁడైన వెంకటా
చలపతి నామధేయుని నిజాంగన వెంగమ సత్కవీంద్రు లి
మ్ముల ముదమంద నీ శతకమున్ రచియించి యొసంగె మీకుఁ
గోర్కులు సమకూర్ప వయ్య తరిగొండ నృసింహ!దయాపయోనిధీ!"

ii) ఈ కవయిత్రి బాలకృష్ణనాటక, విష్ణుపారిజాత, చెంచునాటక, అష్టాంగ యోగసార, జలక్రీడావిలాస, ముక్తికాంతా విలాసములయందు తన నామధేయమును భర్త యింటి పేరుతో చేర్చి "ఇంజేటి వెంగమాంబ" యని పేర్కొనినది.

iii) మఱియు నీమె ద్విపద భాగవతమున స్కంధాంతములలో తన భర్త నిట్లు సభక్తికముగా స్మరించియున్నది:

"వరుసగా నింజేటి వంశభూషణుడు
గురుతర శ్రీవత్సగోత్ర సంభవుఁడు
ఘనుఁడైన తిమ్మయ్యాగ్రణి పుత్రుఁ డనఁగ
జను లెన్ను వెంకటాచలపతి పాద
వనజయుగ్మంబు భావంబునం దుంచి
యనుపమంబైన మోక్షాసక్తితోడ
వలనొప్ప శ్రీభాగవతమునం దొనర
నిలను షష్ఠస్కంధ మిరవుగా ద్విపద"

చూ. మ.ఓ.మే.లై.డి.కే. వాల్యూమ్IV, పుట 1329, 1330.

24. వెంగమాంబ స్వయముగనే (తండ్రిగారి ప్రయత్నము లేకుండనే) దైవ ప్రేరణగా మదనపల్లి యందలి సుబ్రహ్మణ్యశాస్త్రిగారి కడ కేగినట్లు శ్రీమహాభక్త విజయము. చూ. పుటలు 400-404.

25. ఈ సోమేశ్వర స్వామివారి యాలయము మదనపల్లికి పశ్చిమముగా అర్ధమైలు దూరమున బెంగుళూరు రోడ్డుపై నున్నది వెంగమ యీ స్వామిని రాజయోగసార, వాసిష్ఠ రామాయణములలో స్తుతించియున్నది.

26. ఈ యుపదేశ విధానమును వెంగమాంబ రాజయోగ సారమున కపిలుడు దేవహూతికి ఉపదేశించు ఘట్టమున తెలిపినది

"సకలలోకాతీత! సత్యమౌ తత్త్వ
మింక నైన నుపదేశ మీవయ్య దేవ!
అన విని కపిలుఁ డయ్యంబ కిట్లనియె
జనని! నీ వత్యంత సద్గుణవతివి
కావున నీ రీతిగా బ్రహ్మవిద్య
కావలె నంటివి కలుగదా నీకు
నని యిట్టు పల్కి సిద్ధాసనమందుఁ
దన తల్లి నునిచి యత్తఱి లలాటమున
జెలువుగ వీభూతిచేఁ జుక్కపెట్టి
మలినంబుఁ బోఁద్రోసి మస్తక మంటి
బోధింపఁ దొడఁగె నా పుణ్యసాధ్వి కొగి"

-రాజయోగసారము, ద్వి.ప్ర.పుటలు 36.37.

27. ఈ గురు శుశ్రూషాకాలము పంద్రెండేండ్లని కవయిత్రి ఈ క్రింది పంక్తులలో, భంగ్యంతరముగా సూచించియున్నది.

i) "వినవమ్మ జననని! యీ విశ్వంబునందు
మనుజులు వేఱ కర్మంబులు విడిచి
తను దాను దెలిసిన ధన్యునిఁ జేరి
పనివడి ద్వాదశాబ్దములు శుశ్రూషఁ
జేసి మెప్పింపఁగ శ్రీ గురుమూర్తి
భాసురంబుగ వారి భక్తికి మెచ్చి"

రా.యో.సా. ద్వి.ప్ర.పుట27.

ii) "ప్రాణాయామాద్యష్టాంగయోగ త్రిబంధాష్ట కుంభక ముద్రాది సాధనంబులచేత నియ్యోగంబు ద్వాదశాబ్దంబు లభ్యసింప సిద్ధి యగునది యెట్లనిన"

అష్టాంగ యోగసారము, పుట 26.

28. తరిగొండ నృసింహ శతకము, 3ప.

29,30 అందే, 4 ప.

31. మురాషావలి-అను మహమ్మదీయు డట్టి సమయములలో ఆమెకు అండగా నుండి కాపాడుచుండెనని త.వెం.జీ.రత్నాకరము. చూ. పుట 21.
తరిగొండ యూరి వెలుపల ఉత్తరదిక్కున "మురాషావలి దర్గ" యను నొక దర్గా యున్నది. ఇది వెంగమాంబ యెడల మిగుల భక్తిప్రపత్తులు గల్గియుండి, ఆమెచే ఆధ్యాత్మికోపదేశమును పొందిన మురాషావలియొక్క దర్గాయే యని స్థానికుల అభిప్రాయము.

32. ఈ తాత్త్విక కావ్యరచన నాటికి కవయిత్రి పరిపూర్ణ రాజయోగాను భవసిద్ధి నంది యుండినదని ఈ కావ్యమే చాటుచున్నది.

33. క్షౌరకు డామెకు క్షురకర్మ గావించెననియు, అనంతరము ఆమె సమీప తటాకమున (తరిగొండ లక్ష్మీనృసింహాలయము ఎదుట నున్న కోనేటిలో) మునిగి లేవగానే శిరస్సున కేశకలాపము యథారీతిగ నుండెననియు కొన్ని చరిత్రములు, జనశ్రుతియు వాకొనుచున్నవి.
కీ॥ శే॥ చిలకమర్తి లక్ష్మీనరసింహము పంతులుగారు, ఇట్లు వెంటనే వెంట్రుకలు మొలిచినట్లు చెప్పెడు కథ కల్పిత మని, బంధువు లామె పలుకులకు సరి యగు సమాధాన మీయ జాలక, అహంకరించి బలవంతముగా క్షురకర్మ చేయించి యుండవచ్చునని, మరల నామె పెంచియుండవచ్చునని, లేక ఆ పని జరుగకనే యుండవచ్చునని అభిప్రాయపడిరి.
-చూ. చమత్కారమంజరి. 1,2 భాగములు, పుటలు 136-141.

34 వెంగమాంబ నిమిత్తముగా ఆ కాలమున తరిగొండ కేతెంచినవారు శృంగేరీ పీఠాధిపతులని కొందరు. ఆ యూరిలో నిన్న మొన్నటివరకు పుష్పగిరి పీఠమునకు చెందిన పొలములుకూడ నుండినవి. లక్ష్మీనృసింహస్వామి గుడికి ఉత్తర దిక్కున గల ఒక చేను పేరు నేటికిని "పుష్పగిరిస్వాములవారి చేను." దీనినిబట్టి ఆ ప్రాంతము పుష్పగిరి పీఠాధిపతుల ధర్మాధికారపరిధికి లోబడినదని, అందువలననే వారికి (బహుశః గృహస్థులు దానమిచ్చిన) స్థిరాస్తి

కూడ ఉండినదనియు తెలియుచున్నది. కావున ఆ సమయమున తరిగొండకు విచ్చేసినది పుష్పగిరి పీఠాధిపతులే యనుట నిస్సంశయము.

35. ధర్మమునుండి చ్యుతులయిన వారలను, వేదనిందకులను, దైవదూషకులను, నాస్తికులను చూచుట పాపహేతువనెడి తలంపుతో పూర్వాచారపరాయణులు, విధిగా అటువంటివారితో భాషింపవలసి వచ్చినప్పుడు తెర గట్టించి మాటాడుచుండెడివారు. వేదప్రామాణ్యము నంగీకరింపని జైనులు, బౌద్ధులు మున్నగు దార్శనికులతో మతసంబంధములగు వాగ్వాదములు ( Debates) సలుపవలసి వచ్చిన సందర్భములయందు అట్టి తెర లుపయోగించెడివా రట.

36 ఈ సంఘటన మూలముగా ఈమె అష్టసిద్ధులను సాధించిన సిద్ధయోగిని యనియు, స్వాములవారలను మించిన ఆధ్యాత్మిక తపశ్శక్తి సంపన్న యనియు వెల్లడియగుచున్నది. ఇందువలననే ఆమె స్వాములవారికి నమస్కరింపక యుండినది. కాని, బ్రాహ్మణులు తన నమస్కారము విషయమై మూర్ఖపు పట్టుదల వహించినందున, గత్యంతరములేక స్వశక్తిని ప్రదర్శింపవలసివచ్చెననియు, తన్మూలముగా స్వాములవారి కెట్టి యపాయము కలుగుకుండుటకై, ఆయనను పీఠమునుండి ప్రక్కకు తొలగవలసినదిగా నామె కోరినదనియు భావింపదగును. నిగ్రహానుగ్రహ సమర్థులగు మహాత్ములు ఆవశ్యకమైననే తమ మహిమలను ప్రదర్శింతురనుటకు పై సన్నివేశ మొక తార్కాణము.యోగాభ్యాసమువలన నిట్టి శక్తులు స్వాధీన మగుననుటకు, దిగువ నుదాహరింపబడుచున్న యీ కవయిత్రి వాక్యములు నిదర్శనములు!"ఇయ్యోగంబు ద్వాదశాబ్దంబు లభ్యసింప సిద్ధి యగు; నది యెట్లనిన ప్రథమాబ్దంబునందు రోగరహితుండగు.ద్వితీయాబ్దంబునందుఁ గవిత్వంబు జెప్పు. తృతీయాబ్దంబున విషజయుండగు. చతుర్థాబ్దంబున క్షుత్తృష్ణా నిద్రాలస్యంబుల జయించు. పంచమాబ్దంబున వాక్సిద్ధి నొందు. షష్ఠాబ్దంబున ఖడ్గాభేద్యుండగు. సప్తమాబ్దంబున భూమినంటకుండు.అష్టమాబ్దంబున అణిమాద్యైశ్వర్య సంపన్నుం డగు. నవమాబ్దంబున నభోగమ నుండగు.దశమాబ్దంబున మనోవేగుండగు. ఏకాదశాబ్దంబున విశ్వవశత్వంబు గలవాడగు.

ద్వాదశాబ్దంబున సాక్షాతీశత్వంబు నొందు......''
అష్టాంగయోగసారము, పుటలు 26,27.

37 ఈయర్చకుని పేరు కృష్ణమాచార్యులనియు, పై సన్నివేశముద్వారా వెంగమ యోగమహిమను గుర్తించిన ఈయన, అటు తర్వాత వెంగమాంబకు శిష్యుడై యామెచే జ్ఞానోపదేశము నొంది, గొప్ప వేదాంతిగా మాఱెననియు స్థానికుల కథనము. 'కృష్ణమాచార్యులు మండప' మనుపేర వ్యవహరింపబడుచున్న ప్రాతబడిన చిన్నకట్టడ మొకటి నేటికిని తరిగొండ గ్రామపు సివారులలో నిలిచియున్నది. వెంగమాంబ శిష్యుడును, వేదాంతియునైన కృష్ణమాచార్యు లీ మండపమున తఱచుగా వసించుచు వచ్చెనని యచ్చటి వారలయొక్క పరంపరాగతమగు నభిప్రాయము. ఈ యర్చకుడు, వెంగమచే నుపదేశము నొందిన కృష్ణమాచార్యుడు విభిన్నవ్యక్తులని మఱికొందరు తెల్పుచున్నారు.

38 విగతభర్తృక యగుటచే అర్చకులు వెంగమ్మను తరిగొండ లక్ష్మీనృసింహాలయములో ప్రవేశింపనీయక అడ్డగించిరనియు, త్రాళ్ళతో, గొలుసులతో కట్టి వేసిరనియు, ఱాళ్లు రువ్వించిరనియు, తుదకు ఎటువైపు కదలకుండ చుట్టు గోడ కట్టించిరనియు, నరహరి యనుగ్రహమువలన ఆ ఆటకంము లామెను ఏమియు చేయజాలక పోయెననియు శ్రీ త.వేం.చరిత్రము (1) నుడువుచున్నది. మఱియు, చుట్టును గోడ కట్టబడినందున, భగవానుని యనుగ్రహముచే ఆమె యున్నచోట గొప్ప బిలమేర్పడెననియు, ఆ సొరంగముగుండ ఆమె తరిగొండను వీడి వేంకటాచలారణ్యమును జేరెననియు పైగ్రంథమున చెప్పబడియున్నది. చూ.త.వేం.చరిత్రము (1), పుటలు 29-31.

39. వెంగమాంబ తప మొనర్చిన ఆ కోన, నేడు యుద్ధకళతీర్థమని చెప్పబడు స్థలమునకు సమీపమున నున్నదనియు, ఆ కోనలో ఎల్లప్పుడును సూర్యరశ్మి లేక, దట్టమగు చీకటి ఆవరించి యుండుననియు శ్రీత.వేం.చరిత్రము (1) నుడువుచున్నది. చూ.పుట31.

40. వెంగమాంబ నాదరించిన ఈ మహంతు ఎవరు?- అనునది యొక ప్రశ్న. ఈస్టిండియా కంపెనీవారిచే క్రీ.శ. 1843వ సంవత్సరమున తిరుమల-తిరుపతి దేవస్థానముల పాలనాధికారము సమర్పింపబడిన సేవాదాసు (క్రీ.శ.1843-1864) అను మహంతు వెంగమాంబ నాదరించెనని కొన్ని చరిత్రములు పేర్కొనుచున్నవి.

చూ. శ్రీ త.వేం.చరిత్రము (2),పుట 87.

క్రీ.శ. 1864లో కీర్తిశేషుడైన ఈ సేవాదాసు తన బాల్యమున (అనగా క్రీ.శ. 1817కు పూర్వము) వృద్ధురాలై యుండిన వెంగమాంబను చూచియుండిన చూచియుండవచ్చును. ఈ మహంతు క్రీ.శ. 1843లో తిరుమల-తిరుపతి దేవస్థానముల తొట్టతొలి విచారణకర్తగా కంపెనీ ప్రభుత్వముచే నియమితుడైన పిమ్మట పెక్కు ధర్మకార్యములు నిర్వహించి ప్రసిద్ధి వహించెను. ఆ ప్రఖ్యాతినిబట్టి ఈ సత్పురుషునకు వెంగమాంబ నాదరించిన సత్కార్యముతో తరువాతివారు ముడిపెట్టిరి. వెంకటగిరి సంస్థానాధీశుడగు వెలుగోటి కుమార యాచమనాయని (క్రీ.శ.1776-1864) వారిచే క్రీ.శ.1777 సంవత్సరమున కొంతభూమిని దానముగా బడసిన తిరుపతి మహం తొకరు మెకంజీ లోకలు రికార్డులవలన తెలియవచ్చుచున్నాడు.

"Vol.238, M..800 వేంకటగిరి ఎస్టేటు శాసనములు (Inscriptions of Venkatagiri Estate) Holio 12b- copy of the samad in the possession of the Mahanth of Tirupati,

The samad is dated 1777 A.D. records the donation of land with its boundaries fixed to Mahant Atmaram by Velugoti Kumara Yachamanayana"

- మ.ఓ.మే.లై.డి.కే. వాల్యూం XV. పుట 361.

వెంగమాంబ పై భూదాన కాలము నాటికి మిగుల పూర్వముననే (అనగా క్రీ.శ.1750 ప్రాంతమందు) తిరుమల చేరుకొనినట్లు, తెలియుచుండుటచే, ఈ కవయిత్రికి ఆశ్రయమొసంగిన హాత్తీరాంజీ మఠాధిపతి పై ఆత్మారామ్ మహంతే అయి యుండునని ఈ రచయితచే నూహింపబడినది.

41. ఈ యక్షగాన కృతిలోనే వెంగమాంబ ప్రప్రథమముగా హయగ్రీవుని స్తుతించి యున్నది:

"శ్రీ విఘ్ననాథుని క్షేత్రపాలకుని
శ్రీ వాణిని హయగ్రీవుని దలచి"
-విష్ణుపారిజాతము, పుట 2.

42. ఈయన పదకవితాపితామహుడగు తాళ్ళపాక అన్నమాచార్యుల చిన్నకుమారుడు. అన్నివిధముల, తండ్రియగు అన్నమాచార్యులకు దీటైన మహనీయుడు. శ్రీ వేంకటేశ్వరస్వామివారిని ప్రత్యక్షీకరించు కొనిన పరమ భాగవతోత్తముడు. పెక్కు గ్రంథములను రచించిన కవీశ్వరుడు.

3. ఈమె అన్నమాచార్యుల పెద్దభార్య, పెదతిరుమలాచార్యుల తల్లియైన అక్కలాంబ రెండవల భార్య.

43. "సర్కారు అర్చక పదవి" యనునది. శ్రీ వేంకటేశ్వరస్వామివారి గుడిలో వంశపారంపర్య హక్కు (మిరాశీ) గల అర్చకులు ప్రతిదినము జరుపు పూజాది కైంకర్యములను ప్రభుత్వము తరపున పర్యవేక్షించు నిమిత్తమును ఏ కారణము (అవాంతరము) చేతనైనను శ్రీవారి ఆలయములో నిత్యపూజ నిలిచిపోవు ఇబ్బంది యేర్పడినప్పుడును, ఆ అర్చనాది కైంకర్యములను అవిచ్ఛిన్నముగా కొనసాగించు నిమిత్తము ఈస్టిండియా కంపెనీ ప్రభుత్వమువారిచే, వారి పరోక్ష యాజమాన్యము (Indirect management) యొక్క తొలిరోజులలో (అనగా క్రీ.శ. 18వ శతాబ్ది ఉత్తరార్ధమున ఆర్కాటు నవాబు మహమ్మదాలీ తి.తి.దేవస్థానాదాయమును కంపెనీ ప్రభుత్వమునకు దఖలుపఱచిన కాలమున) ఏర్పరుపబడినది. ఈ పదవిలో నియమితుడైన తొట్ట తొలి వ్యక్తియే పైన పేర్కొనబడిన అక్కా రామయ్య దీక్షితులు. ఈయన కంపెనీవారిచే "సర్కారు అర్చకుడు"గా నియమితుడుగాక పూర్వము మిరాశీ అర్చకుల పక్షమున అవసరమునుబట్టి అప్పుడప్పుడు స్వామివారి గుడిలో నిత్యపూజా కైంకర్యములను నెఱవేర్చుచుండినవాడే. ఇతని పూర్తిపేరు "అక్కారం వెంకట్రామయ్య దీక్షితులు". దిగువ తిరుపతికి సమీపమున నున్న "అక్కారాంపల్లి" (అగ్రహారంపల్లి)

గ్రామము రామయ్య దీక్షితులు పూర్వులు అగ్రహారముగా సంపాదించినట్టిదని జనశ్రుతి.

44. తుంబురుకోన తిరుమల క్షేత్రమునకు ఉత్తరముగా పది పన్నెండు మైళ్ళ దూరములో నున్నది. ఇది విరక్తులకు చాల రమణీయ ప్రదేశమనియు, క్రూర జంతువు లిచ్చట విచ్చలవిడిగా సంచరించు చుండుననియు, బ్రహ్మచర్యము, తపస్సు, ప్రాణాయామాది సాధనలు లేనివా రిచట నుండజాలరనియ, వెంగమాంబ తపస్సు చేసిన గుహకు దాపున ఇటీవల కాలములో తపమొనర్చిన బ్రహ్మీభూత శ్రీ మలయాళ స్వాములవారు (ఏర్పేడు శ్రీ వ్యాసాశ్రమ స్థాపకులు) స్వానుభవ పూర్వకముగా వచించియున్నారు.

చూ. శ్రీ వ్యాసాశ్రమ రజతోత్సవ సంచిక, పుట11

45. వేంకటేశ్వరుడు అనుదినము వెంగమ గృహమున కేతెంచి, యామె కావించు సపర్యల నందుకొని వెళ్ళుచుండెననియు, ఒకనాడామె "నే నీ మానవుల కన్నుల కగపడక యుండవలయు"నని ప్రార్థింపగా, ఆ దయామయుడు వెంగమాంబ కరమును బట్టుకొని కనురెప్పపాటు కాలమున తుంబురు కోనకు జేర్చి, అచ్చటి యొక గుహలో ఆమె నుండ నియమించెననియు, ఆ గుహాంతరాళమునుండి వేంకటేశ్వరుని గర్భాలయమువరకు గల బిలమార్గముగుండా వెంగమ్మ నిత్యము వచ్చి స్వామివారిని పూజించి పోవుచుండెడిదనియు శ్రీ త. వేం. చరిత్రము (1) నుడువుచున్నది. చూ. పుటలు 71-73

46. ఈతనిపేరు "చంద్రశేఖరు"డని, కాంచీమండలమందలి యొక గ్రామమునకు చెందినవాడని, క్రీ.శ.1963లో తిరుపతియందు ముద్రితమైన "శ్రీ వేంకటేశ్వర భక్తవిజయము"న కలదు. చూ.పుటలు 135, 136.

47. చంద్రశేఖరుడు మరణించిన స్థలమునందు ఆయన జ్ఞాపకార్థము తులసి బృందావనము నిర్మించి, ఆయన పేరుతో ధూపదీప నైవేద్యములు జేయుచున్నట్లును, ఆ తులసి బృందావనమును నేటికిని స్వామిపుష్కరిణి పడమర భాగమందు చూడవచ్చుననియు,

క్రీ.శ.1963లో తిరుపతియందు ముద్రింపబడిన "శ్రీ వెంకటేశ్వర భక్త విజయము"న నున్నది. చూ.పుటలు143,144.

48. i) శ్రీ.త.వేం. చరిత్రము (1) పుట 81.

ii) శ్రీ.త.వేం. చరిత్రము (2) పుట104.

49. చూ. తరిగొండ వేంగమాంబా విజయము, పుటలు

50. గునపము, గడ్డపార ధరించిన యొకానొక వృద్ధుని రూపమున ఆంజనేయుడే వెంగమాంబవద్ద కేతెంచి, ఆ బండను త్రవ్వి తొలగించెననియు, తదుపరి ఆమె గంగను ప్రార్థించెననియు, తిరుపతిలో ముద్రితమైన "శ్రీ వేంకటేశ్వర భక్త విజయము (1963)" నుడువుచున్నది. చూ. పుటలు 126, 127.

51. చూ. శ్రీ త.వేం. చరిత్రము (1), పుట 66.

52 ఈ శిలాతలము (బండ) నేటికిని తిరుమలలో వెంగమాంబ బృందావనము (సమాధి) ఎదుట నున్నది.

53. తరిగొండ నృసింహస్వామివారి వెండిప్రతిమగల యొక పంచలోహపు పళ్లెములో విష్ణువుయొక్క దశావతారములను దినమున కొక్కటిగా వెండిముత్యములతో తీర్చి పిండితో, కుంకుమతో చుట్టు నలంకరించి, ఆ నడుమ ఒక చిన్నగిన్నెలో కర్పూరము నుంచి, వెంగమాంబ యింటివారలు వేంకటేశ్వరుని ఏకాంతసేవ వేళకు తీసికొని పోవుదురు. అర్చకులు ఆ హారతిని మొదట మూలవిరాట్టునకు, పిమ్మట పాన్పుపై పవ్వళించియుండు "భోగశ్రీనివాసమూర్తి"కి నయనానందకరముగా నొసంగుదురు. శ్రీ స్వామివారికి గావింపబడు నిత్యకైంకర్యములలో ఈ ముత్యాలహారతియే చివరిది. ఈ ముత్యాలహారతిని బట్టియే "తాళ్ళపాకవారి లాలి; తరిగొండవారి హారతి" అనెడి సూక్తి అన్వర్థముగా వెలసినది. ఇట్లు ప్రతిదినము ఏకాంతసేవాసమయమునందేగాక, ప్రతిసంవత్సరము జరిగెడు రథోత్సవ సందర్భమునను, వెంగమాంబ యింటినుండి కర్పూరహారతి పళ్లెము కొనిపోవబడును. ఆ హారతి యీయబడిన పిమ్మటనే రథమును లాగుట ప్రారంభింతురు.

54. చూ. శ్రీత. వేం చరిత్రము (1), పుట 66.

55. ఈ "నరసప్ప దత్తత" విషయమును, నరసప్పకు గమ్మన్న అల్లుడను విషయమును శ్రీగరిడిమిట్ట సుబ్రహ్మణ్యముగారు తెల్పినారు. వీరు తరిగొండ వెంగమాంబయొక్క దత్తుతో చేరిన దౌహిత్రుల సంతతికి చెందిన వారసులు. ప్రకృతము ఈ రచనాకాలము నాటికి - అనగా క్రీ.శ. 1979 నాటికి వీరు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ కార్యాలయములో (Audit Inspector) గా ఉద్యోగించుచున్నారు.

56. చూ. విష్ణుపారిజాతము, పుట 163.

ఈ పుటలో ముద్రితమైన వ్రాయసకాని వక్కణ యిది:-

"దుర్ముఖినామ సంవత్సర ఆషఆఢ శుద్ధ౬ గురువారమునకు సరియయిన ౧౮౭౬ సంవత్సరం జులాయినెల తేదీ ౧౬న శ్రీ తరిగొండ వెంగమ్మగారికి మునిమనుమడున్ను, వెంగమ్మగారికి కోడలైన చెంగమ్మగారికి మనుమడైన గరిడిమి.....గమ్మన్న కొమారుడయిన గంగాధరప్ప, గాదంశెట్టి పుల్లయ వ్రాసిన అసలు మాతృకను పట్టి నేటికి సంపూర్ణముగా గ్రంథం పూర్తిగా వ్రాయడ మయినది."

ఈ గంగాధరప్పయొక్క తమ్ముని మనుమడే శ్రీ గరిడిమిట్ట సుబ్రహ్మణ్యముగారు.

57. నేటికిని నృసింహ జయంతికి పదియవ దినమున వేంకటేశ్వరస్వామి ఉత్సవముగా వెంగమాంబ యింటికి విజయంచేయు పద్ధతి కొనసాగుచున్నది.

58. ఈ దానము లెల్ల దాదాపు ముప్పది తాళపత్రములలో లభింపబడియున్నవి. ఇవన్నియు క్రీ.శ. 1785 మొదలుకొని క్రీ.శ. 1812 వరకు ఇంచుమించు ముప్పది వత్సరముల కాలపరిధిలో వెలువడినవై, వెంగమాంబగారి ఆధ్యాత్మిక మూర్తిమత్త్వమునకు అక్షర నిదర్శనములై యలరారుచున్నవి.

59. "శ్రీవేంకటాచల మాహాత్మ్యమను గ్రంథమును వ్రాసిన పరమభక్తురాలు పూజ్య మాతృశ్రీ తరిగొండ వెంగమాంబగారివద్ద ఎనిమిది ఘంటములలో నొక ఘంటమును నిర్వహించిన చంద్రశేఖరపిళ్ల విశ్వనాథపిళ్లకు ముత్తాత" ఈ వాక్యములు, కార్వేటి నగరవాస్తవ్యులు, పండితులు, శతవృద్ధులు, ఇటీవలనే (క్రీ.శ. 1975లో)

కీర్తిశేషులున్నైన "మధురకవి" ముకుంద దైవజ్ఞులు (ముకుందపిళ్లగారు) రచించిన "రక్షమాం శరణాగతం" అను సంస్కృత శతకముయొక్క "తొలిపలుకు" నందలివి. పై పంక్తులలో పేర్కొనబడిన చంద్రశేఖరపిళ్ల, శతక రచయితయగు ముకుంద దైవజ్ఞులకు మాతామహుడు. ఈయన పూర్వులు కార్వేటి నగర సంస్థానమున "తరం సంప్రతి" వంటి యుద్యోగముల నలంకరించుచు, ఆ సంస్థానాధీశులకు చేదోడు వాదోడుగా నుండుచు వచ్చిరి. ఈ చంద్రశేఖరపిళ్ల బాల్యమున ఇంటిలో తన కేర్పడిన వైమనస్యము వలన ఎవ్వరికి జెప్పక కార్వేటి నగరమునుండి నేరుగా తిరుమలకేగి, తరిగొండ వెంగమాంబగారి సన్నిధిని "అష్టఘంటముల"లో నొకడుగా కుదురుకొనెను.

ప్రస్తుతము శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయమున గణితశాస్త్ర శాఖాధ్యక్షుడుగా నుద్యోగించుచున్న ఆచార్య పి.విశ్వనాథ అరుణాచలముగారు పైచంద్రశేఖర పిళ్లగారియొక్క వంశీయుడు. వీరే పైవిషయములను సవివరముగా ఈ రచయితకు దెల్పినారు.

60. తరిగొండ వెంగమాంబ సహస్ర చంద్ర దర్శన మొనర్చిన విషయమును ఆమె ప్రశిష్య యగు వెంగమ్మగారిచే, శుభకృతు సంవత్సరమున (క్రీ.శ.1903 అక్టోబరు నెలలో) జరిగిన బ్రహ్మోత్సవములలో తాను తిరుపతి కొండ కేగి నపుడు విని యున్నట్లు, "విద్యారణ్య పంచానన," "విద్యావాచస్పతి" శ్రీమాన్ కళత్తూరు విక్రాల రామచంద్రాచార్యులవారు, "తరిగొండ వెంగమాంబా విజయము" అను పుస్తకములో పేర్కొనినారు. చూ. పుటం .

61. శ్రీ త.వేం. చరిత్రము (1), పుట 83.

62. చూ.శ్రీ.త.వేం.చరిత్రము (1), పుట 83.

63. శ్రీమలయాళస్వాములవారిని గూర్చిన ఈవిషయములను, స్వాములవారి శిష్యులలో అగ్రగణ్యులు తి.తి.దే. హిందూధర్మ ప్రతిష్ఠాన కార్యాలయమున పురాణ ప్రబోధ పరీక్షాధికారియు నైన శ్రీసముద్రాల లక్ష్మణయ్యగారు తెల్పినారు.

64. See T.T.Devasthanams' Journal, Vol.XX (1969), No.10 (October) p p 33-37.

65. కవయిత్రి కాలమునాటి దానపత్రముల స్వరూపము తెలియునిమిత్తము, ఇది యిందు యథాతథముగా నుదాహరింప బడినది.

## జీవితకాలము

ఆంధ్రవాఙ్మయచరిత్రమున నిశ్చితముగ జీవితకాలము తేలని కవులు పలువురు కలరు. స్థూలదృష్టికి కాలము తెలిసినట్లుండియు, జీవితకాల నిరూపణము నిర్ద్వంద్వముగా గావింపబడని కవులు మఱికొందరున్నారు. అట్టివారిలో నొకరు తరిగొండ వెంగమాంబ.

### చరిత్రకారుల నిర్ణయము :

కందుకూరి వీరేశలింగముపంతులుగా రీ కవయిత్రి కాలమును గూర్చి "ఈమె ౧౮౪౦ సంవత్సరమునందు జీవించియుండినట్లు బ్రౌను దొరగారు తమ నిఘంటువునందు వ్రాసియున్నారు. కాఁబట్టి యీమె యేఁబది సంవత్సరముల క్రిందట నుండినట్లు తెలియవచ్చుచున్నది."[1] అని పేర్కొనియున్నారు. ఇదే విధముగా వంగూరి సుబ్బారావుగారు "ఈమె క్రీ.శ. 1840లో జీవించియున్నట్లు, బ్రౌను దొరగారు నిఘంటువు పీఠికలో వ్రాసిరి."[2] అని చాటి యున్నారు.

పై యిరువురు కవి చరిత్రకారుల వాక్యముల కాధారములైన సి.పి.బ్రౌను దొరగారి పలుకు లీ క్రిందివి.

"The Dwipada Bhagavatham ద్విపద భాగవతము also was written by a poetess who was living in the year 1840."[3]

పై వాక్యమున వెంగమాంబ నామధేయమును బ్రౌనుదొర వాచ్యముగా పేర్కొనక పోయినప్పటికిని, ఇంచుమించు ఆ కాలమున భాగవతమును ద్విపదగా రచించిన కవయిత్రి మఱియొకరు లేనందున ఆ మహాశయు డామె నుద్దేశించియే అట్లు ఉల్లేఖించెనని తలంచుట సమంజసము. కందుకూరివారు, వంగూరివారు ఈ యంశమును గుర్తించియే పై రీతిని తెలిపియున్నారు. తరువాతి వాఙ్మయ చరిత్ర కారులెల్లరు పై ఇరువురి యభిప్రాయమునే స్వీకరించినారు.

**కాల నిర్ణయమునకు ఆధారములు :**

తరిగొండ వెంగమాంబ "శాలివాహన శకాబ్దం, ౧౭౩౮ గల ఈశ్వర సంవత్సర శ్రావణ శు. ౯లు పరమపదము నొందె" నని మదనపల్లియందు ప్రచురితమైన ఒక కరపత్రము తెలియజేయుచున్నది.

ఆ కరపత్రము పరిశీలనార్థము యథాతథముగ నీయబడి యున్నది.[4]

ఆ కరపత్రము యొక్క ప్రామాణికత్వమునకు ఈ క్రింది యంశములు అక్షరసాక్ష్యములు.

ఈ కరపత్రము ప్రకటించు (క్రీ.శ.1920 మార్చినెల) నాటికి తిరుమలలోని వెంగమాంబ మఠమున నృసింహ జయంతి కైంకర్యములను, ముత్యాలహారతి మున్నగు సేవలను జరుపుచుండిన వ్యక్తి చీనేపల్లె గమ్మన్న. ఈయన "వేంగమాంబగారి దత్తుతో చేరిన దౌహిత్రుల వంశీకుడు; గర్నిమిట్ట (వాయల్పాడు తాలూకా) గ్రామస్థుడు."

వెంగమాంబ రచించిన విష్ణుపారిజాత యక్షగానముయొక్క మూలప్రతికి క్రీ.శ.19వ శతాబ్ది చివరి వత్సరములలో ప్రత్యంతరమును వ్రాసిన "గంగాధరప్ప"కు తండ్రియైన యొక "గమ్మన్న" కలడు.

"దుర్ముఖి నామ సంవత్సర ఆషాఢ శుద్ధ ౬ గురువారమునకు సరియయిన ౧౮౯౬ సంవత్సరం జులాయి నెల తేదీ ౧౬ న శ్రీతరిగొండ వెంగమ్మగారికి మునిమనుమడున్నూ, వెంగమ్మగారికి కోడలైన చెంగమ్మగారికి మనుమడైన గరిడి మి(ట్ట) గు(గ)మ్మన కొమారుడయిన గంగాధరప్ప, గాదంశెట్టి పుల్లయ వ్రాసిన అసలు మాతృకను పట్టి నేటికి సంపూర్ణముగా గ్రంథం పూర్తిగా వ్రాయడమయినది."[5]

పై వక్కణలో పేర్కొనబడిన ప్రకారముగ క్రీ.శ. 1896 జూలైలో విష్ణుపారిజాతమునకు ప్రతి వ్రాసిన గంగాధరప్ప, ఆతని తండ్రి గమ్మన్న క్రీ.శ. 1920 మార్చిలో "మదనపల్లి కరపత్రము"న పేర్కొనబడిన గమ్మన్నకు తండ్రి, తాతలుగా తెలియవచ్చుచున్నారు.

వెంగమాంబ తిరుమలలో తానొనరించుచుండిన నృసింహ జయంతి, ముత్యాలహారతి - మొదలగు కైంకర్యములను తన తదనంతరము నిర్వహించుటకై తన చెల్లెలి కూతురైన మంగమ్మయొక్క అత్తింటివారైన చీనేపల్లె (గర్నిమిట్ట) కుటుంబమునుండి నరసప్పయను నాతనిని దత్తు గైకొన్నది. ఈ "యింజేటి నరసప్ప" భార్యయే చెంగమ్మ. వీరి అల్లుడు గమ్మన్న. ఇతని భార్య లక్ష్మమ్మ. ఈ లక్ష్మమ్మ గమ్మన్నల కుమారుడే విష్ణుపారిజాత ప్రతిలేఖకుడగు గంగాధరప్ప. ఇతడు వెంగమాంబ దత్తపుత్రుడగు నరసప్పకు దౌహిత్రుడగుటచే, ఆమెకు "దత్తుతో చేరిన దౌహిత్రుడు", అట్లే మునిమనుమడు అగుచున్నాడు. ఈ మునిమనుమని కుమారుడగుటచే "మదనపల్లి కరపత్రము" నందలి గమ్మన్న "వేంగమాంబగారి దత్తుతో చేరిన దౌహిత్రుల సంతతి"గా పేర్కొనబడి నాడు. ఇట్లు వెంగమాంబతోడి బాంధవ్యము, ఆమె కైంకర్యములతో వంశపారంపర్యముగా సంబంధము గలిగిన గమ్మన్నయేగాక, "మదనపల్లి కరపత్రము"న తచ్ఛాఖీయులగు మఱికొందరు ప్రముఖులు పేర్కొనబడియుండుట గమనింపదగియున్నది.

కాని, కరపత్రములో పేర్కొనినట్లు (వెంగమాంబ పరమపదించిన) ఈశ్వర సంవత్సరము ౧౭౩౮ శాలివాహన శకాబ్దమందు గాక ౧౭౩౯లో వచ్చినది.[6] ఇందలి శకవత్సర సంఖ్య (౧౭౩౮) పొరబాటై యుండు ననుటకును, వెంగమాంబ ఈశ్వర సంవత్సర శ్రావణమాసముననే పరమపదించె ననుటకును మఱియొక నిదర్శనము లభించినది.

విద్యారణ్య పంచానన, విద్యావాచస్పతి - ఇత్యాది బిరుదాంకితులు, ఈ శతాబ్ద్యారంభకాలమున ఆంధ్రదేశమున వెలసియుండిన సుప్రసిద్ధ జ్యోతిశ్శాస్త్ర విద్వాంసులు అయిన శ్రీమాన్ విక్రాల రామచంద్రాచార్యుల వారు (క్రీ.శ. 1879-1932) "తరిగొండ వేంగమాంబా విజయము" అను గ్రంథమును రచించియున్నారు. అందులో నొకచో వారిట్లు వ్రాసినారు:

"ఈ వెంగమాంబగారు సహస్ర చంద్రదర్శన మొనరించి కలి ౪౯౧౮వ ఈశ్వర సంవత్సరము శ్రావణ బహుళ ౬ నాఁడు తిరుపతికొండమీఁద శ్రీనివాసమూర్తి చరణారవిందములను బొంఁదెను.

ఈ విషయ మంతయు నా వేంగమాంబగారి శిష్యురాలగు నలిమేలు మంగమ్మగారి శిష్య యగు వెంగమ్మగారు నాకు తిరుపతికొండలో ౪౮ శుభకృతు సంవత్సర బ్రహ్మోత్సవమున[7] దటస్థించి తెలిపిరి. దానిలోఁ బ్రమాణాకరములఁ జేర్చి వ్రాసితి."[8]

విక్రాలవారు పేర్కొనిన కలి ౪౨వ ఈశ్వర సంవత్సరము క్రీ.శ. 1817వ సంత్సరముతో సమానమగు శా.శ. ౧౭౩౯వ ఈశ్వర సంవత్సరమే యగుచున్నది.[9] "మదనపల్లి కరపత్రము"న తెల్పబడియున్నట్లే విక్రాలవారును శ్రావణ మాసమును పేర్కొన్నారు. కరపత్రమున తిథి "శుద్ధనవమి" యని యుండగా, ఆచార్యులవారి పుస్తకము అది "బహుళ షష్ఠి" యని వాకొనుచున్నది.ఈ రెండు తిథులలో ఏది సరియైనదో నిర్ణయించుటకు దగిన యాధారములు ప్రకృతమునకు మృగ్యములు. పైగా ఆ సంవత్సరమున అధిక శ్రావణ, నిజశ్రావణ మాసములు వరుసగా వచ్చినవి.[10] అందే శ్రావణమాసమున వెంగమాంబ పరమపదమలంకరించెనో తెలియవలనుపడకున్నది. అందుచే ఈ తిథి, మాస నిర్ణయము నటుంచి చూచినచో, తరిగొండ వెంగమాంబ శాలివాహన శకము ౧౭౩౯కి సరియైన క్రీ.శ.1817వ సంవత్సరమున పరమపదము నలంకరించినదని నిశ్చయింపవచ్చును.

విక్రాలవారు తరిగొండ వెంగమాంబగారి ప్రశిష్యయైన వెంగమ్మగారివలన క్రీ.శ. 1903లో స్వయముగా వినిన విషయములను గ్రంథస్థ మొనరించినారు. వారు వినుటయం దొకవేళ నేదేని విస్మరణ వాటిల్లి యుండు ననుకొనుటకు వీలులేదని "మదనపల్లి కరపత్రము" వలన నిరూపితమైనది .ఈశ్వర సంవత్సరము ఉభయత్ర సమానమే.

కావున క్రీ.శ. 1817నాటికి సహస్ర చంద్రదర్శన మొనర్చి (అనగా దాదాపు 85 సంవత్సరములు జీవించి) యుండిన వెంగమాంబ క్రీ.శ. 1730-35 మధ్యకాలమున జననమంది యుండునని తలంపవచ్చును.

ఆ "యీశ్వర సంవత్సరము" క్రీ.శ.1877 లో వచ్చిన ఈశ్వర సంవత్సరమే యని శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు నిర్ణయించినారు:

The English equivalent of the above 'Eswara Sravana Bahula Shashthi is, 30th August 1877 and this is her Nirvana tithi........So we might conclude that she lived from 1794 to 1877 A.D."[11]

కాని, ఇంతకు ముందు వివరించినటుల, వ్రికాలవారు పేర్కొనిన ౮౨వ ఈశ్వర సంవత్సరము1817 A.D.యగునుగాని, 1877 A.D.కాజాల దనుట స్పష్టము. బ్రౌనుదొరగారి వాక్యానుసారము వెంగమాంబ క్రీ.శ. 1840లో జీవించియుండినదనెడు భావనయే నిడుదవోలు వారి దృష్టిని అట్లు క్రీ.శ. 1877 ఈశ్వరపై ప్రసరింప జేసిన దనవలెను.

ఇంకొక విషయము. వెంగమాంబ తిరుమలలో నుండిన కాలమున ఆమె నిర్వహించుచుండిన నృసింహ జయంతి ఉత్సవముల నిమిత్తము ఆస్తికులగు భూస్వాములు, ధనస్వాములు, పాళెగార్లు మొదలగు ననేకు లొసంగిన దానధర్మములను దెలిపెడి దానపత్రములు దాదాపు ముప్పది కలవు. అవి క్రీ.శ. 1817కు పిమ్మట వెంగమాంబ జీవించియున్న జాడను సూచింపవు. క్రీ.శ. 1785 నుండి 1812 వరకు ఇంచుమించు ముప్పది సంవత్సరముల కాలవ్యవధిలో అవి విస్తరిల్లి యున్నవి. అనగా ఆ ముప్పదియేండ్ల కాలము ఆయమ జీవితములో అన్ని విధముల పరిపక్వత నొందిన యామె కీర్తులను వెదజల్లిన మహోన్నత దశయని చెప్పవచ్చును.

ఈ దాన శాసనముల ఆరంభకాలముననే - అనగా క్రీ.శ. 1785 నాటికే - ఆమె పెక్కు గ్రంథములను రచించి, లబ్ధప్రతిష్ఠయై, ఆధ్యాత్మిక జ్ఞానశిఖరముల నధిరోహించిన "కవితా తపస్విని"గా ప్రశస్తికెక్కి యుండినది. అప్పటికే ఆమె తుంబురుకోనలో కొన్నేండ్లు తపము గావించి, పునః శ్రీవేంకటేశ్వర సన్నిధి చేరుకొన్న సాహిత్యవ్రతమై వరలుచుండినది గనుక, "పంచాశద్వర్షదేశీయ" యై యుండును. అందువలననే దానపత్రములలో ఆమె "శ్రీ మదఖండ సచ్చిదానంద నిత్యపరిపూర్ణులైన, శ్రీ తరిగొండ లక్ష్మీనృసింహస్వామి దివ్య శ్రీ పాదారవింద మధుకరాయమాన మానసులైన మాతృశ్రీ వెంగమాంబగారు"గా ప్రశస్తి కెక్కియున్నది.

**స్వీయరచనలు - కాల నిర్ణయము :**

ఈ కవయిత్రి కాలనిర్ణయ విషయమున ఈమె రచనలుకూడ కొంతవరకు తోడ్పడుచున్నవి. వెంగమాంబ తిరుమల క్షేత్రమును చేరుకొనిన తొలి వత్సరములలో రచించిన కృతులలో విష్ణుపారిజాతము" మొదటిది. అందు కుపితయైన సత్యభామ శ్రీకృష్ణుని పలుతెరగుల ఉపాలంభించు సన్నివేశము కలదు. అట్లుపాలంభించుటలో నొక పరి సత్యభామ-

"తురకల రవుతౌచు వెరచి వారికి రూక
నెఱి నిచ్చినను లజ్జ నీకు లేదు"

అని పరిహసించును. ఇది వేంకటేశ్వరునితో శ్రీకృష్ణుని కభేదము చేసి చెప్పినమాట. ఇందులకు సమాధానముగా శ్రీకృష్ణుడు-

"అలయించి వడ్డికాసుల మొదల్గొని, భక్త
భరము తురుష్కుల పాలు జేతు" అని వాకొనును.[12]

వేంకటేశ్వరుడు తురకలకు రూక లిచ్చుట యను విషయము చారిత్రక సత్యము. విజయనగర సామ్రాజ్య పతనానంతరము క్రమముగా కల్లోలములను గడచుచు వచ్చి తిరుపతి ప్రాంతము క్రీ.శ. 17వ శతాబ్ది ప్రథమ పాదమునకు కర్ణాటక నవాబుల యేలుబడి లోనికి వచ్చెను. శ్రీ వేంకటేశ్వరస్వామి కుబేరున కియ్యవలసిన వడ్డీ చెల్లింపు క్రింద-తిరుపతి ప్రాంత పాలకుడగుటచే -కర్ణాటక నవాబునకు దేవస్థానమునుండి కొన్ని లక్షల వరహాల మొత్తము ప్రతిసంవత్సరము సమర్పింప బడుచుండెడిది. ఇది దాదాపు క్రీ.శ. 1750 ప్రాంతము వరకు కొనసాగినది. పిమ్మట అప్పటి కర్ణాటక నవాబగు మహమ్మదాలీ, ఈస్టిండియా కంపెనీ ప్రభుత్వమువారు తన అధికారమును స్థిరపరచినందులకు కృతజ్ఞతా సూచకముగా తిరుమల దేవస్థానాదాయమును బ్రిటీషువారికి దఖలుపరచెను. ఇది యించుమించు క్రీ.శ.1750 ప్రాంతమున సంభవించినది.[13]

పై విషయ మాధారముగా, వెంగమాంబ క్రీ.శ. 1750వ సంవత్సరమునకు పూర్వమే తిరుమల క్షేత్రమును చేరియుండెననియు, ఇంచుమించు అదే కాలముననే విష్ణుపారిజాతమును రచించిన దనియు నిశ్చయింపవచ్చును.

ఇక ఈ కవయిత్రియొక్క చివరి రచనలలో ముఖ్యమైనవగు ద్విపద, భాగవత, వేంకటాచల మాహాత్మ్యములను క్రీ.శ. 1808వ సంవత్సరము నాటికే ప్రతులు వెలువడి ప్రచారములో నుండినవను విషయము సైతము ఇందులకు ఉపబలకముగా నున్నది. తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయమునందలి ప్రాచ్య పరిశోధన సంస్థ గ్రంథాలయము (యస్.వి.యు. ఓరియంటల్ రీసర్చి ఇన్స్టిట్యూట్ లైబ్రరీ)లో నొక ద్విపద భాగవత ప్రతి కలదు. దాని సంఖ్య 7410 (తాళపత్రప్రతి).[14] ఈ. ప్రతిలో a,b,c - అని మూడు వేర్వేఱు కృతులు గలవు. అందు మొదటిది (7410a) వెంగమాంబ రచించిన ద్విపద భాగవత ప్రథమస్కంధము, ఈ స్కంధాంతమున ౪౩ వ సంఖ్య గల తాళపత్రములో లేఖనకాలము క్రింది రీతిని లిఖింపబడియున్నది.

"విభవ సంవ్వత్సర భాద్రపద బ॥ ౧౦ గురువారంవరకు గొల్లపూడి త్రివిక్రమయ్య వ్రాశిన భాగవతం ప్రథమ స్కంధము ద్విపద సంపూర్ణం

ఈ లేఖన కాలము క్రీ.శ. 1808 సెప్టెంబరు 15వ తేదీ గురువారముతో సరిపోవుచున్నది. [15]

దీని తరువాతి కృతి అష్టాంగయోగసారము (7410 b). ఇదియు వెంగమాంబ రచనయే. ఇది ౪౪ వ సంఖ్యగల ఆకు నుండి ౫౯వ సంఖ్యగల ఆకు వరకు 16 ఆకులలో నున్నది. దీని చివర లేఖన కాలము లేఖకుని పేరు లేకున్నను, తాళపత్ర సంఖ్యయొక్క వరసక్రమమును బట్టి, పత్రముల ఏక రూపతను బట్టి, వ్రాతపోలికనుబట్టి ఇది పై ద్విపద భాగవత ప్రథమస్కంధ లేఖకుడగు గొల్లపూడి త్రివిక్రమయ్య యొక్క వ్రాతయే యని స్పష్టముగా తెలియుచున్నది.

మూడవకృతి (7410c) నాదెండ్ల గోపన రచించిన కృష్ణార్జున సంవాదము (ద్విపద). ఇది ౧ నుండి ౧౩ వరకు గల పదమూడాకులలో వ్రాయబడినది.౧౩ వ ఆకులో గ్రంథాంతమున నిట్లు వ్రాయబడినది.

"యీ కృష్ణార్జున సంవ్వాదం మార్గ శిర శు ౭ మీ గురువారం వర్కు గొల్లపూడి శేషయ్య అయ్యవారు వ్రాశి మహారాజరాజశ్రీ దామర చినవేంక్కటప్ప నాయని వార్కి శ్రీరాగుల రక్షకత్వం గ్గాను యిచ్చెనూ శ్రీశ్రీశ్రీశ్రీశ్రీశ్రీశ్రీ"

ఈ లేఖన కాలము క్రీ.శ. 1808 నవంబరు 24వ తేదీకి సమానమగు చున్నది[16]. దీనినిబట్టి పై కృతులలో రెండవదగు అష్టాంగయోగసారము క్రీ.శ. 1808 సెప్టెంబరు 24వ తేదీకి పిమ్మట, అట్లే క్రీ.శ. 1808 నవంబరు 24వ తేదీకి పూర్వమున ప్రతి వ్రాయబడినట్లు తలంపవచ్చును.

వెంగమాంబ తాను వేంకటాచల మాహాత్మ్యావతారికలో
"...........భాగవత పురాణ
మమరనే ద్విపద కావ్యంబుగాను
ద్వాదశ స్కంధముల్ తగఁ జెప్పి హరికి స
మర్పించి, శ్రీ వేంకటాద్రి మహిమ
మవనిపై రమ్య పద్య కావ్యంబు జేసి
శ్రీనివాసునికే సమర్పింప నుంటి" I- ఆ., 22ప.

అని వ్రాక్రుచ్చినది. దీనినిబట్టి వెంగమ ద్విపద భాగవతమును రచించిన పిమ్మట వేంకటాచల మాహాత్మ్య రచన గావించినట్లు స్పష్టపడుచున్నది. "అష్టాంగయోగసార" మనునది వెంగమాంబ రచించిన వేంకటాచల మాహాత్మ్య (వరాహపురాణ భాగము) తృతీయాశ్వాస మందలి భాగమే గాని, వేఱు కాదు.

" ఆ వరహ పురాణమం దమరు యోగ
సరణి నీవలఁ దీసి యెచ్చటను భక్తి
యోగమే యుంచి యష్టాంగ యోగసార
మనఁగ నీ కృతి రచియింతు నార్యులార.!" -అ.యో.సా,2ప.

అని కవయిత్రియే కంఠోక్తిగా బల్కినది. ఇందువలన అష్టాంగయోగసారము నిర్వివాదముగా వేంకటాచల మాహాత్మ్యానంతర రచన యని తెల్లమైనది. ఏతావతా ఈ కవయిత్రి క్రీ.శ. 1808 కి పూర్వమే వేంకటాచల మాహాత్మ్యమును రచించి, అందలి తృతీయాశ్వాసమునుండి కొంత భాగమును తీసి "అష్టాంగ యోగసారము"గా కూర్చి యుండె నని విదితమగుచున్నది.

మఱియొక దృష్టాంతము. మ.ఓ.మై.లై. యందలి వేంకటాచల మాహాత్మ్యము వ్రాతప్రతులలో డి.నెం. 354 అనున దొకటి. ఇది కాగితపు

ప్రతి. ఇందలి కాగితములు మెకంజీ లోకల్ రికార్డుల కుపయోగింపబడిన కాగితములను పోలియున్నవి. అందువలన ఈ ప్రతి మెకంజీ (క్రీ.శ. 1754-1821) కాలములో తయారుచేయబడిన ప్రతి యని చెప్పవచ్చును.[17] ఆ ప్రతి ముఖపత్రము (fly leaf) లో బ్రౌన్ దొర ఈ క్రింది విధమున "రిమార్కు" వ్రాసియున్నాడు.

"తె ఇ. అనే గ్రంథం చూడూ.
నం ౧౧౪ అది యిది వకటే"

ఈ వ్రాతప్రతి తాను తయారుచేయించినది కాదు గనుకనే బ్రౌనుదొర అట్లు "రిమార్కు" వ్రాసినాడని భావింపదగును.

ఈ రీతిని క్రీ.శ. 19వ శతాబ్ద్యారంభకాలమునకే ఈ కవయిత్రి రచించిన ద్విపద భాగవత, వేంకటాచలమాహాత్మ్య, అష్టాంగ యోగసారము లకు వ్రాత ప్రతులు వెలువడి, శ్రీ కాళహస్తి రాజాగారి గ్రంథాలయము నలంకరించియుండి, మదరాసువంటి చోటులకు వ్యాపించిన వనెడు విషయమునుబట్టి, ఇవి క్రీ.శ. 18వ శతాబ్ది చివరి భాగమునాటికే విరచితములై యుండిన వను అంశము ఊహ కందుచున్నది.

ఇక తదనంతర రచనలగు జలక్రీడావిలాస, ముక్తికాంతావిలాస, వాసిష్ఠ రామాయణములు మూడును ఇంచుమించు క్రీ.శ. 1810 లోపుననే రచియింపబడి యుండునని విశ్వసింపవచ్చును. ఈ విధముగా వెంగమాంబ రచనావ్యాసంగపు పరిపూర్తిని బట్టి చూచినను, ఆయమ క్రీ.శ. 1817 ఈశ్వర వత్సరమువరకు జీవించియుండెనను విషయము సత్యసమంచితముగా తోచుచున్నది.

ఇంకొక్క విషయము. క్రీ.శ. 19వ శతాబ్ది ప్రారంభకాలమున అప్పటి ఈస్టిండియా కంపెనీ ప్రభుత్వమువారిచే తిరుమల తిరుపతి దేవస్థానముల చరిత్రకు సంబంధించిన కొన్ని "రికార్డు"లు తయారుచేయింపబడినవి. వాటిలో "కైంకర్య పట్టీ" యనున దొకటి. ఇది తిరుమల, తిరుపతి వగైరా దేవస్థానముల అర్చకులు, జియ్యంగార్లు, ఆచార్యపురుషులు మున్నగువారలు ఆ యా దేవస్థానములలో చేయగల సేవాకైంకర్యములను గూర్చి తెలియజేయునట్టిది. ఆ పట్టీలోని 31వ అంశము తరిగొండ వెంగమాంబయొక్క కైంకర్యమును గూర్చి తెల్పుచున్నది:

31. తరిగొండ వెంగమ్మ యిలాఖా కోడలు చెంగమ్మ [18] } తిరుమలపై రాత్రి మంచం సేవ కాలంలో
వెండిగుండ్లతో నిత్యం వొక అవతారం జోడించి హారతికి ఇచ్చేది.
ఈ కైంకర్య పట్టీచివరన ఈ క్రింది సంతకములు, తేదీయు కలవు:

(Sd) A. Ranga Rao (Sd) [Illegible in English]
Seresthadar
(Sd) R. Subba Rao
Tahasildar
2nd Oct.1820[19]

పై నుదాహరించిన అంశములనుబట్టి క్రీ.శ. 1820వ సంవత్సరమునాటికి వెంగమాంబ పక్షమున ఆమె కోడలైన చెంగమ్మ హారతి (ముత్యాలహారతి) కైంకర్యమును నిర్వహించుచుండినట్లు తెలియుచున్నది. అట్లు క్రీ.శ.1820 నాటికి వెంగమాంబ కీర్తిశేషురాలై యుండినందువలననే. ఆమె కోడలగు చెంగమ్మ పేరు "కైంకర్య పట్టీ"లోని కెక్కిన దని తలంప నగును.

బ్రౌన్‌దొర క్రీ.శ. 1840కి పూర్వాపరములయందు పెక్కు పర్యాయములు, ఆ యా చోటుల వెంగమాంబ పేరును స్పష్టముగా ఉట్టంకించియే యున్నాడు.[20] కాని, ఈ ప్రకరణము మొదట నుదాహరింపబడిన నిఘంటు పీఠికా వాక్యములో మాత్రము "a poetess"అని, పేరు వదలి పేర్కొనియుండుట వింతగానే యున్నది.

మొత్తముమీద బ్రౌనుదొర "తెలుగు-ఇంగ్లీషు నిఘంటువు" యొక్క పీఠికలో వ్రాసిన ప్రకారము వెంగమాంబ క్రీ.శ. 1840లో నివసించుచుండి యుండలేదనియు, ఆయన. ఈస్టిండియా కంపెనీ ప్రభుత్వోద్యోగిగా భారతదేశమునకు వచ్చిన సంవత్సరముననే[21]- అనగా క్రీ.శ. 1817 ననే - ఈ కవయిత్రీమతల్లి దేహయాత్ర చాలించినదనియు, బ్రౌనుదొర తా నితరులవలన వినిన వినుకలిని బట్టియే వెంగమాంబ కాలమును (క్రీ.శ.1840లో నివసించు చుండినట్లు) పేర్కొనె ననియు నిర్ణయింప దగియున్నది.

## జీవితకాలము - జ్ఞాపికలు

1. చూ. ఆంధ్రకవుల చరిత్రము, తృతీయభాగము, పుట 575.

2. చూ. శతకకవుల చరిత్రము, పుట 320.

3. చూ. బ్రౌణ్య తెలుగు - ఇంగ్లీషు నిఘంటువు (1966), పీఠిక పుట XIX.

శ్రీ చౌడేశ్వర్యై నమః

## శ్రీ తరిగొండ వెంగమాంబా ధర్మసంరక్షణ సంఘము

మదనపల్లి

శ్రియః కాన్తాయ కల్యాణ నిధయె నిధయేర్థినాం।

శ్రీ వేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళం॥

ఆర్యులారా!

1. ఆంధ్రదేశమున శ్రీ తరిగొండ వెంగమాంబగారి పేరు వినని వారుండరు. ఈమె నందవరీక వంశమున జనించి చిన్నతనముననే వైధవ్యమును పొంది, పామరుల దూషణ తిరస్కారములకు జంకక విరాగియై తిరుమల అనే శ్రీవేంకటాద్రియందు శిష్యులతో నివసించుచు వెంకటాచల మహాత్యము రాజయోగసారము మొదలగు గ్రంథములు తెనుగు భాషలో రచించి, శాలివాహన శకాబ్దం ౧౭౩౮ గల ఈశ్వర సంవత్సర శ్రావణ శు ౯ ల్కు పరమపదము నొందెను. ఈమెయొక్క భక్తికి మెచ్చి తిరుమల దేవస్థానమువారు శ్రీ శ్రీనివాసస్వామివారి నిత్యారాధనకు కడపటిదిగా ఈమె ఇచ్చే ముత్యాలహార్తి గ్రహించుట, ఈమె జరుపు శ్రీ నృసింహ్వా జయంతి కడపట ఈమె మఠమునకు శ్రీ శ్రీనివాసస్వామివారు వేంచేయుట మొదలైన మర్యాదలు నేర్పరచిరి. యిప్పటికిని ఇవి జరుగుచున్నవి.

2. తిరుమలలో పై జయంతి జరుగుకాలములో అనగా వైశాఖశు ౧౪లు ప్రభృతి ౧౦ దినములు రాత్రింబగళ్లు అన్నదానము చేయుచుండుట

వాడుకయైయున్నది. ఇందుకుగాను ఈమె శిష్యులు దూరదేశమున నున్నవారుకూడ గ్రామములు భూములు నగదువర్తనలు మొదలగు సౌకర్యముల నేర్పరచి జయంతి జరుపుచుండిరి. కాలాంతరేణ తగిన విచారణ లేకపోవుటచేత ఈ మాన్యములు గ్రామాదులు వగయిరాలవల్ల వరుమానము వచ్చుటలేదు. అయినను ఇంతకాలము ఈ వేంగమాంబగారి దత్తుతో చేరిన దౌహిత్రుల వంశీకులైన గర్నిమిట్ట గ్రామమున నుండు చీనేపల్లి గమ్మన్నగారు ఈ మర్యాదలను విడవక వంశపరంపరగా సొంత ద్రవ్యముతో జరుపుతున్నారు. వీనిని శాశ్వతముగా జరుపుటకు తగిన అనుకూలములు లేకుండుటవలన తగిన ఏర్పాటుతో దీనిని స్వమత సంఘపరిపాలన క్రింద నుంచ నుద్దేశించి మార్చినెల 7వ తేదీన మదనపల్లె గ్రామంలో కొందరు నందవరీకులు మ.రా.రా.శ్రీ నెమలి పట్టాభి రామారావుగారి యాజమాన్యము క్రింద నొక సభ గావించి పై పేరున నొక సంఘ మేర్పాటు చేసి దాని యుద్దేశము లీ క్రింద వివరించియున్నారు.

3 ౧. తిరుమలలో శ్రీ వేంగమాంబగారివలన నేర్పరుపబడిన శ్రీ నృసింహ్వ జయంతి అన్నదానాది కైంకర్యములు శాశ్వతముగా జరుపుట.

౨ తిరుమలయందు శ్రీ వేంగమాంబగారు స్థాపించిన మఠమును జీర్ణోద్ధారణ చేయుట.

౩ ఈ మఠమునకు సంబంధించిన సొత్తులను రాబట్టుకొని పరిపాలించుట.

౪ శ్రీ వెంగమాంబగారిచే రచింపబడి అముద్రితముగ యుండు గ్రంథములను పరిష్కరించి ముద్రించుట.

౫ శ్రీ వెంగమాంబగారి జ్ఞాపకార్థముగా నందవరీకులలో బీదవిద్యార్థులకు విద్యార్థివేతనముల స్థాపించుట.

౬ తరిగొండ గ్రామంలో శ్రీ వెంగమాంబగారి జ్ఞాపకచిహ్నము నేర్పాటు చేయుట.

౭ పై కార్యముల నిర్వహించుట కొక నిధిని యేర్పాటు చేయుట.

4. పైకార్యములను జరుపుటకై ఈ క్రిందివారలు కార్యనిర్వాహక సంఘ సభ్యులుగ నియమింపబడిరి.

అధ్యక్షులు: మ.రా.రా.శ్రీ ఉంజేటి సీతారామరావుగారు బి.ఏ.,బి.యల్., దివాన్, పుంగనూరు సంస్థానం.

ఉపాధ్యక్షులు: ౧ మ.రా.రా.శ్రీ చీనేపల్లె డాకరాజుగారు. చిన్నతిప్పసముద్రం

౨ " గుమ్మరాజు రామారావుగారు. గౌనిపల్లె

కార్యదర్శి: " సి. వెంకట శివరావుగారు, ప్లీడర్ , మదనపల్లె

కోశాధిపతి: " ముడియం సీతారామారావుగారు, బి.ఏ., యల్.టి. బోర్డుహైస్కూల్ హెడ్‌మేష్టర్,మదనపల్లె

చందాలు పోగు చేయుటకు నేర్పరుపబడిన గౌరవసభ్యులు

౧ మ.రా.రా.శ్రీ చీనేపల్లె గమ్మన్నగారు, గర్నిమిట్ట

౨ " చీనేపల్లె రామారావుగారు, వాయల్‌పాడు

౩ " తావరకెరె రామచంద్రప్పగారు, తావరకెరె

౪ " బోడిచెర్ల వేంకట్రాయప్పగారు, నెలవంకి

౫ " గండేపల్లె సూర్యనారాయణయ్యగారు, తిరుపతి

5. చందాదార్లు తాము యిచ్చే మొత్తమునకు కంతులు కోరు విషయములో మొదటి కంతు చందా పోగుచేయుట కేర్పరచిన గౌరవ సభ్యులకు చందా చెల్లించి రసీదు పొందవలెను. తక్కిన కంతుల మొత్తం పూర్తిగా చందా వేశిన తేది మొదలు ఒక సంవత్సరము లోపల సంఘపు కార్యస్థానమున నుండే కోశాధిపతిగారి పేర తమ సౌకర్యము కొలది మనీఆర్డరు ద్వారా గాని నేరుగా గాని చెల్లించి రసీదు పొందవలెను. ఈ చందా తప్ప మరల చందా కోరుట లేదు. ఈ సంఘము రిజిష్టరు చేయబడును.

ఆంధ్ర భాషాభిమానులార! నందవరీకులారా!

ఈ యుద్యమము నెరవేర్చుటకు తగిన ధన సహాయము శక్తివంచనలేక చేయుదురని ప్రార్థించుచున్నవాడు.

మదనపల్లి
12-3-1920

ఇట్లు విధేయుడు
సి. వెంకటశివరావు,
కార్యదర్శి.

ఎ.వి.ప్రెస్, మదనపల్లె

5. చూ. విష్ణుపారిజాతము, పుట 163.

6.See. An Indian Ephemeris, Vol. VII. Pages 36-37.

7. ఈ బ్రహ్మోత్సవము క్రీ.శ. 1903 అక్టోబరులో జరిగినట్టిది.

8. చూ. తరిగొండ వేంగమాంబా విజయము, పుట౮౦

9. కలి ౮౨ వ ఈశ్వర సంవత్సర మనగా కలియుగము ఆరంభమైన నాటినుండి ప్రతి అఱువదియేండ్ల కొకమాఱు వచ్చు "ఈశ్వర" సంవత్సరములలో ౮౨ వ దగు"ఈశ్వర" సంవత్సరమని యర్థము. కలియుగము శ్రీకృష్ణ నిర్యాణ దినమునుండి ప్రారంభమైనట్లు శ్రీమద్భాగవతమున చెప్పబడినది:

"యస్మిన్ కృష్ణో దివం యాత స్తస్మిన్నేవ తదాహని।
ప్రతిపన్నం కలియుగ మితి ప్రాహుః పురావిదః॥"
- XII స్కం., 2 అధ్యా, 32 శ్లో.

శ్రీకృష్ణుడు ప్రమాధి సంవత్సర చైత్ర శుద్ధ ప్రతిపద్భృగు వాసరమున వైకుంఠమును ప్రవేశించినట్లును, అదియే కలియుగారంభమైనదనియు వావిళ్ళ ప్రచురణ సంస్థ క్రీ.శ. 1915లో ప్రచురించిన శ్రీ మదాంధ్రభాగవతము పీఠిక పుట viii లో సోపపత్తికముగా నిరూపింపబడియున్నది. కావున కలియుగ ఆదిమ సంవత్సరమగు ప్రమాధినుండి లెక్కించినచో సరిగా 58 సంవత్సరములకు "ఈశ్వర" వచ్చును. అది కలియుగమున మొదటి ఈశ్వర సంవత్సరము . అప్పటినుండి అఱువది యేండ్ల వంతున కలి ౮౨ వ ఈశ్వరవరకు లెక్కించుచు పోయినయెడల కలియుగము 4918వ సంవత్సరమున ౮౨ వ "ఈశ్వర" తటస్థించుచున్నది. ఇది శాలివాహన శకము ననుసరించి ౧౭౩౯వ సంవత్సరముగను, క్రీస్తు శకానుసారముగ 1817వ సంవత్సరముగను అగుచున్నది.

See. An Indian Ephemeris, Vol. VII. Pages 36-37.

10. Ibid, Page 37.

11. See. 'Literary' and philosophical works of Tarigonda Vengamamba, A woman Saint.'

The Madras University Journal, Vol.XXN page 29.

12. చూ. విష్ణుపారిజాతము, పుటలు 97,98.

13. "Muhammad Ali assigned the revenues of the Tirumalai Shrine to the East India Company as a sure means of discharging his obligations to the Company for having established his authority in Carnatic. This was about 1750 A.D." - 'Sri Venkateswara-Balaji,' page 159.

14. ఈ తాళపత్రప్రతి కీ.శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు శ్రీ కాళహస్తి రాజాగారి గ్రంథాలయమునుండి సేకరించి ఓరియంటల్ రీసర్చి ఇన్స్టిట్యూట్ లైబ్రరీ (యస్.వి.యు.ఓ.రీ.ఇ.లై.)కి చేర్పించిన వ్రాతప్రతుల సముదాయములోనిది.

15.See. An Indian Ephemeris, Vol, VII Page 19.

16. See. Ibid.

17. ఈ డి.నెం. 354 ప్రతియందలి కాగితమునుబట్టి నిస్సందేహముగా అది మెకంజీ కాలమునాటిదే యని, పరిశోధక పండితుడుగా పెక్కేండ్లనుండి మ.ఓ.మే.లైలో పనిచేయుచున్న విద్వాన్ శ్రీ తీర్థం శ్రీధరమూర్తిగారు తెల్పినారు.

18. విష్ణుపారిజాతము చివరి వ్రాయనకాని వక్కాణయందును ఈ "చెంగమ్మ" పేర్కొనబడి యుండుట గమనింపదగినది.

18&19 తిరుమల-తిరుపతి దేవస్థాన శాసన పరిశోధకులు, "రిటైర్డు పేష్కారు" చరిత్రకారులు అయిన కీ.శే. సాధు సుబ్రహ్మణ్య శాస్త్రిగారు 1942-'43 ప్రాంతమున వ్రాసికొనియుండిన "కైంకర్య పట్టీ" వ్రాతప్రతినుండి వారి సౌజన్యముతో ఈ యంశములు స్వీకరింపబడినవి.

20 i) "Gollacatha written by Tarigomma Vengamma"

- ఇండియా ఆఫీసు లైబ్రరీ (లండను)లోని
సి.పి.బ్రౌను వ్రాతప్రతినుండి

Dated September 1839.

ఈ యుల్లేఖము శ్రీ వేం.వి. తెలుగు శాఖయందలి బ్రౌనుప్రాజెక్టు సీనియర్ రీసర్చి ఆఫీసర్ శ్రీ బం.గో.రె.గారి సౌహార్దమువలన ఈ రచయితకు లభించినది.

"వెంగమాంబ the poetess wrote this ద్విపద వాశిష్ఠరామాయణం" ఈ వాక్యమును సి.పి.బ్రౌన్‌దొర డి.నెం. 1010 (కాగితపు ప్రతి) ప్రారంభములో సీసంపుల్ల (pencil) తో వ్రాసియున్నాడు. ఈ వ్రాతప్రతి మ.ఓ.మే.లై.లో నున్నది. ఇందు ఉపయోగింపబడిన కాగితము 1849వ సంవత్సరములో తయారైనట్టిది. కాబట్టి బ్రౌనుదొర ఈ ప్రతిని 1849కి తరువాతి వత్సరములలో వ్రాయించినట్లు నిశ్చయింప వీలైనది.

21 "On landing Madras on the 3rd of August, 1817 I was ordered to learn Telugu and Marata."

-Literary Autobiography of
C.P.Brown, page 27.

## వెంగమాంబ కృతుల వింగడింపు

తరిగొండ వెంగమాంబ రచనలలో నేటికి తెలియవచ్చినవి పదునెనిమిది. ఆమె రచించిన చివరి కృతులలో ద్విపద భాగవత మొకటి. అందలి అవతారికలో తన పూర్వకృతులనుగూర్చి కవయిత్రి ఈ క్రిందివిధమున తెలిపియున్నది.[1] అవి పంద్రెండు.

"అటు గాన ౧ నారసింహాంకితశతక
మటమీద ౨ నారసింహవిలాసకథయు
నట ౩ శివనాటకం బదియును గాక
నట ౪ రాజయోగసారాఖ్య సద్ద్విపద
నట ౫ కృష్ణనాటకం బదియును గాక
నట ౬ పారిజాతాపహరణ సత్కృతియు
నట ౭ రమాపరిణయం బను పెండ్లిపాట
యట ౮ చెంచునాటకం బను నొక్క కథయు
మఱియును ౯ శ్రీకృష్ణమంజరి యవల
నిరుపమ ౧౦శ్రీరుక్మిణీ ం నాటకంబు
కర మొప్ప నల ౧౧ గోపికా నాటకంబు
విరచించి భక్తితో వేంకటశైల
వరమందు తరిగొండవాసుడై నన్ను
పరిపాలనము సేయు ప్రభువై తనర్చి
కరుణార్ద్ర దృష్టితో గడతేర్తు ననుచు
సరస విజ్ఞాన లక్ష్యము నిచ్చినట్టి
శ్రీనివాసస్వామి శ్రీపాదములకు
బూని యర్పించి తిప్పుడు సంతసమున
ఫలితార్థమైన ౧౨శ్రీభాగవతంబు
నల ప్రథమస్కంధ మాది జేసికొని
క్రమముగా ద్వాదశ స్కంధముల్ వరుస
నమర నే రచియింతు నంటి నా స్వామి"

పై ద్విపద పంక్తులలో పేర్కొనబడిన పంౘ్రెండు రచనలేగాక, వెంగమ కర్తృకములైన రచనలు మఱికొన్ని యున్నవి. అవి ౧౩వేంకటాచల మాహాత్మ్యము ౧౪ అష్టాంగయోగసారము ౧౫ జలక్రీడా విలాసము౧౬ ముక్తికాంతా విలాసము ౧౭ తత్త్వ కీర్తనలు ౧౮ వాసిష్ఠ రామాయణము అనునవి. ఈ యాఱు కృతుల నామె తరువాతి కాలమున రచించినది. వీటిలో మూడవదగు జలక్రీడా విలాసము ఇంతదనుక లోకమునకు తెలియనిది. వెంగమ సాహితీ పరిశోధనమున కుపక్రమించిన తరుణమున ఇది రచయిత దృష్టిలో పడినది.[2]

మీద తెల్పబడిన మొత్తము పదునెనిమిది రచనలలో కృష్ణ నాటకము వరకు గల తొలియైదు కృతులు వెంగమాంబ స్వగ్రామమైన తరిగొండలో నుండిన కాలమున (క్రీ శ.1750 కి పూర్వము) రచించినవి. పారిజాతాపహరణము మొదలుకొని వాసిష్ఠరామాయణము వరకు గల పదమూడు రచనలు ఆమె తిరుమల క్షేత్రమును చేరిన పిమ్మట రచియించినట్టివి.

ఈ కృతులన్నింటిని-అలభ్యములు, ముద్రితములు, అముద్రితములు-అని విభజింపవచ్చును.

**అలభ్యములు :**

వెంగమాంబ రచనలలో నారసింహ విలాసకథ(౨), రుక్మిణీ నాటకము (౧౦), గోపికా నాటకము(౧౧), ద్విపద భాగవతము (౧౨)లో చివరి ఆఱు స్కంధములు - ఈ నాలుగు కృతులు నేడలభ్యములు.

తక్కినవాటిలో కొన్ని ముద్రితములుగను, మఱికొన్ని అముద్రిత లిఖితప్రతుల రూపమునను లభించుచున్నవి. వాటి వివరములు ఈ దిగువ పట్టికలో నీయబడినవి.

ముద్రణ వివరములు

౧ తరిగొండ నృసింహ శతకము:

Journal of Sri Venkateswara Oriental Institute, Vol,V,No.I (1944-Jan-June)లో ముద్రితము. సంపాదకుడు:మానవల్లి రామకృష్ణకవి.

రాజయోగసారము:

i) క్రీ.శ. 1864లో, (See: A catalogue of The Telugu Books in the Library of The British Museum.1912Page159)

ii) క్రీ.శ.1878లో, (చూ. ఆంధ్ర వాఙ్మయ ముద్రిత గ్రంథ సూచిక, పుట ౧౬౫)

iii) క్రీ.శ 1881లో, శారదానిలయ ముద్రాక్షరశాల.

iv) క్రీ.శ. 1895లో. బరూరు త్యాగరాయశాస్త్రి, గీర్వాణభాషా రత్నాకర ముద్రాక్షరశాల, చెన్నపట్టణము.

v) క్రీ.శ. 1908లో. (వేలమూరి కామశాస్త్రి, దామరాజు శోభనాచలము-అనువారి వ్యాఖ్యతో) మంజువాణి ప్రెస్సు, ఏలూరు.

vi) క్రీ.శ.1914లో. వావిళ్ళ రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి.

vii) క్రీ.శ. 1930లో. " " "

viii) క్రీ.శ. 1950లో. " " "

౬ పారిజాతాపహరణము (విష్ణుపారిజాతము):

క్రీ.శ.1965లో. (సంపా॥ శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ అం.ప్ర. సాహిత్య అకాడెమీ ప్రచురణ.

౭ రమా పరిణయము:

i) క్రీ.శ. 1948లో (సంపా॥ వేటూరి ప్రభాకరశాస్త్రి). చూ. 'శ్రీవేంకటేశ్వర లఘుకృతులు' Sri Venkateswara Oriental Series-16. (తి.తి.దే. ప్రచురణ)

ii) క్రీ.శ. 1967లో. పునర్ముద్రణ (తి.తి.దే.)

౮ చెంచు నాటకము:

i) క్రీ.శ. 1927లో . అమెరికన్ డైమండ్ ముద్రాక్షరశాల, మద్రాసు.

ii) క్రీ.శ. 1929లో. శాల, మద్రాసు.

౯ శ్రీకృష్ణ మంజరి:

i) రెంటాల వెంకట సుబ్బారావుగారు ప్రకటించిన "స్మరణానందము" అను స్తుతి సంకలనమున ప్రచురితము. ముద్రణ వత్సరము తెలియదు.

ii) క్రీ.శ. 1929 జనవరి (విభవ సంవత్సరము)లో వాసుదాసుగారిచే భక్తి సంజీవని' అను మాసపత్రిక (సంపుటము౧, సంచిక౧)లో ప్రకటితము.

iii) క్రీ,శ. 1930లో మ.రా.రా. శ్రీ మరుపూరు కోదండ రామరెడ్డిగారి సంపాదకత్వమున నెల్లూరుజిల్లా నర్వాయుపాళెం, పోలంరెడ్డి రామలింగారెడ్డిగారి సోదరి శ్రీ లింగమ్మగారి ప్రోత్సాహమున ప్రచురింపబడినది.

iv) క్రీ.శ. 1956లో, T.T.D.Monthly Bulletin Vol.VII, No. 9&11 సంచికలలో ముద్రితము. పరిష్కర్త పం.బాల కృష్ణమూర్తి.

v) 'శ్రీవేంకటేశ్వర కృష్ణమంజరి' అను పేర శ్రీమతి శంకరమంచి చెంచులక్షమ్మగారిచే కడపలో ప్రకటితము. ముద్రణవత్సరము తెలియదు.

vi) క్రీ.శ. 1972లో విద్వాన్ శ్రీ నవులూరి మాలెకొండయ్య పంతులుగారి సంపాదకత్వమున నెల్లూరుజిల్లా నార్తురాజు పాళెము వాస్తవ్యులైన కీ.శే.మోపూరు శేషురెడ్డిగారి స్మృత్యంకముగ వారి ధర్మపత్ని యగు బుజ్జమ్మగారిచే ముద్రింపబడినది.

vii) క్రీ.శ. 1977లో నెల్లూరుజిల్లా కొత్తూరు వాస్తవ్యులు శ్రీ ఎఱ్ఱమరెడ్డి అన్నపూర్ణమ్మగారిచే, ప్రకటితము. ఇది పై iiiవ ప్రచురణకు ద్వితీయ ముద్రణము.

౧౨ శ్రీ భాగవతము:

క్రీ.శ. 1931 జనవరి, ఫిబ్రవరి నెలలలో వెలువడిన 'గృహలక్ష్మి' మాసపత్రిక Vol.III, 1,2 సంచికలలో ప్రథమ స్కంధమున కొంత భాగము మాత్రము ముద్రితమైనది.

౧౩ వేంకటాచల మాహాత్మ్యము:

i) క్రీ.శ. 1866 నవంబరులో చెన్నపురి శ్రీరామ గుణ దర్పణ ముద్రాక్షరశాలయందు ముద్రితము.

(పరిష్కర్త: రేకము రామానుజసూరి)

ii) క్రీ.శ. 1895లో చెన్నపురియందు ముద్రితము. (తదితర వివరములు తెలియ లేదు).

iii) క్రీ.శ. 1907లో చెన్నపురి విద్యాతరంగిణీ ముద్రాక్షరశాలయందు ముద్రితము.

iv) క్రీ.శ. 1912లో చెన్నపట్టణమున శ్రీ చిదానంద ముద్రాక్షరశాలయందు ముద్రితము.

v) క్రీ.శ. 1914లో చెన్నపురి వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారిచే ప్రకటితము. (అలూరు వాసుదేవయ్యగారిచే పరిశోధితము.)

vi) క్రీ.శ. 1924లో మదరాసు వెస్టు వార్డు కంపెనీ వారిచే అమెరికన్ డైమండ్ ముద్రాక్షరశాలయందు ముద్రింపబడినది.

vii) వావిళ్ల వారిచే మరల నొక పర్యాయము ముద్రితమైనది. (ముద్రణ వత్సరాదికము తెలియ లేదు).

viii) క్రీ.శ.1955లో శ్రీ వేంకటేశ్వర బుక్ డిపో (తిరుమల) వారిచే 4,5,6 ఆశ్వాసముల గ్రంథ భాగము మాత్రము తిరుపతిలో ముద్రింపబడినది.

౧౪ అష్టాంగ యోగసారము:

క్రీ.శ. 1955లో Sri Venjteswara Oriathal Series No. 52 గాతి.తి.దేవస్థానము వారిచే ప్రకటింపబడినది. పరిష్కర్త :పం. బాలకృష్ణమూర్తి.

౧౫ ముక్తికాంతా విలాసము:

i) క్రీ.శ. 1869లోనే అచ్చయినట్లు ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర (ఆం.య.గా.వా.చ.)లో (ద్వి.భా.పుట 115) తెల్పబడినది.

ii) క్రీ.శ. 1893కు పూర్వము మఱియొకమాఱు చెన్నపురి విద్యాతరంగిణీ ముద్రాక్షరశాలలో ముద్రితమైనట్లు గ్రంథ పట్టికల (Catalogues) వలన తెలియుచున్నది.

iii) క్రీ.శ. 1904లో చెన్నపురి శ్రీరాజరాజేశ్వరీ నికేతన ముద్రాక్షరశాలలో ("వేదాంత జ్ఞానబోధిని" యను సంకలన గ్రంథమున) ముద్రింపబడినది.

iv) తిరుపతి ప్రాంతమున నొక పర్యాయము ముద్రితమైనట్లు ఒకానొక శిథిల ప్రతి వలన తెలియుచున్నది.

౧౨ తత్త్వ కీర్తనలు:

ఇవి మొదటి నుండియు ముక్తికాంతా విలాసము చివర ముద్రింపబడుచు వచ్చుచున్నవి.

తిరుపతి ప్రాంతములో ముద్రితమైన ప్రతియందు మాత్ర మివి చేరలేదు.

ఇవిగాక "ఆత్మబోధామృత తత్త్వములు", "కాలజ్ఞాన తత్త్వములు," "సుజ్ఞాన రత్నావళి"- వంటి వేదాంత కీర్తనల సంకలన గ్రంథములలో వెంగమాంబ కీర్తనలు కొన్ని కలగాపులగముగ ముద్రింపబడియున్నవి.

౧౦ వాసిష్ఠ రామాయణము:

క్రీ.శ.1925 లో చెన్నపురి వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారిచే ముద్రితము.

అముద్రితములు-వ్రాతప్రతుల వివరములు

౩ శివ నాటకము:

కాకినాడ ఆంధ్రసాహిత్య పరిషద్గ్రంథాలయమున నం. i) 2175, ii) 2176 iii) 2177 (మూడును కాగితపు ప్రతులు) iv) నం. 1493 (తాళపత్రప్రతి) అను నాలుగు వ్రాతప్రతులు కలవని తెలియుచున్నది.

(చూ. ఆం.య.గా.వా.చ. ద్వి.భా.పు 112)

v) 32 (E) 19, vi) 32 (H) 8- అను సంఖ్యలు గల రెండు తాళపత్రప్రతులు చెన్నపురి అడయారు గ్రంథాలయమున కలవు.

vi)మదరాసు వాస్తవ్యులు. సుగృహీత నామధేయులు శ్రీరాపూరి దొరస్వామిశర్మగారి కడ నొక వ్రాతప్రతి కలదు.

౧౫కృష్ణనాటకము

i)కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషద్గ్రంథాలయమున నొక ప్రతి (నం. 1566 తాళపత్రప్రతి) కలదని తెలియుచున్నది.

(చూ. ఆం.య.గా.వా.చ. ద్వి.భా.పు 113)

ii)దీని శిథిలప్రతి యొకటి చిన్న తిప్పసముద్రము (మదనపల్లి తాలూకా) గ్రామమున డాకరాజు వారియింట వ్యాసకర్తకు లభించినది.

౧౬శ్రీ భాగవతము.

i)మ.ఓ.మే.లై.లో మొదటి ఆరు స్కంధములు గల డి నం. 1013 (కాగితపుప్రతి) కలదు.

ii)యస్.వి.యూ.ఓ.రీ.ఇ.లై.లో ఆర్ నం. 2347 (కాగితపు ప్రతి) యున్నది. ఇది పై ప్రతికి పుత్రిక.

iii)నం. 7410 (a) (తాళపత్రప్రతి) యస్.వి.యు.ఓ.రీ.ఇ.లై. ఇందు ప్రథమ స్కంధము మాత్ర మున్నది.

iv)నం 7419 (తాళపత్రప్రతి) యస్.వి.యు.ఓ.రీ.ఇ.లై.

ఇందు ద్వితీయ, తృతీయ స్కంధములు కలవు.

౧౭ జలక్రీడావిలాసము

నం.7627 (తాళపత్రప్రతి) యస్.పి.యు.ఓ.రీ.ఇ.లై.

గమనిక :- శ్రీ భాగవతము కొంత అలభ్యము, కొంచెముగా ముద్రితము, కొంత అముద్రితము నగుటవలన ఇది యీ మూడు విభాగములయందును పేర్కొనబడినది. ఐనను ప్రధానముగా నిది "అముద్రితము"గా పరిగణింపబడ దగియున్నది. అటులైనచో పూర్తిగా అలభ్యములైన కృతులు మూడు[3]; పూర్తిగా ముద్రింపబడినవి పదునొకండు; అముద్రితములు నాలుగు- అని తేలినది.

పైన పేర్కొనిన పదునెనిమిది రచనలుగాక, ఈ కవయిత్రి ఆ యా సందర్భములలో కొన్ని పద్యములను, పాటలను ఆశువుగా చెప్పిన దని జనశ్రుతివలన తెలియుచున్నది. కాని, అవి నే డలభ్యము లైనవి.

వెంగమాంబ సృజించిన సారస్వతమును ప్రక్రియ, ఛందస్సు, ఇతివృత్తస్వభావము, ప్రతిపాదిత విషయము-అను అంశములనుబట్టి నాలుగు తెరగుల వింగడింప వచ్చును.

## ప్రక్రియను బట్టి
వింగడింపు

ఈ కవయిత్రియొక్క వాఙ్మయ వాహిని శతకము, యక్షగానము,[4] కావ్యము, పురాణము- అను నాలుగు విధములగు సాహిత్య ప్రక్రియా సరణులలో జాల్వారినది.

**శతకములు:**

వెంగమాంబ రచించిన శతకములు రెండు. అందు మొదటిది "తరిగొండ నృసింహ! దయావయోనిధీ!" అను మకుటముతో చంపకోత్పలములలో రచింపబడిన వృత్తశతకము. రెండవది ప్రతి రెండవ పాదము చివర "కృష్ణ" యను మకుటము కూర్పబడిన మంజరీ శతకము. "కృష్ణమంజరి" యనునది దీని ప్రసిద్ధనామము.

**యక్షగానములు:**

నృసింహ విలాసకథ, శివనాటకము, బాలకృష్ణనాటకము, పారిజాతాపహరణము (విష్ణుపారిజాతము), చెంచు నాటకము, రుక్మిణీ నాటకము, గోపికానాటకము, జలక్రీడా విలాసము, ముక్తికాంతా విలాసము-అనెడి నవరత్నములవంటి తొమ్మిది యక్షగానములను వెంగమాంబ వెలయించినది.

**కావ్యములు:**

ఈ తాత్త్విక కవయిత్రి రాజయోగసారము, రమాపరిణయము, వేంకటాచల మాహాత్మ్యము, అష్టాంగ యోగసారము, వాసిష్ఠ రామాయణము- అనెడు కావ్యపంచకమును రచించినది. వీటిలో రాజయోగసార, అష్టాంగ యోగసార, వాసిష్ఠ రామాయణములు మూడును అందలి వస్తుతత్త్వమునుబట్టి "ఆధ్యాత్మిక కావ్యము" (వేదాంత కావ్యము) లనెడి యుపవిభాగముచే నెన్నదగియున్నవి.

**పురాణములు:**

పరమ భాగవతోత్తమయైన వెంగమాంబ విరచించిన ఏకైక పురాణము శ్రీ భాగవతము.

వింగడింపు

ఈ కవయిత్రి కృతులను ఛందోవైవిధ్యము ననుసరించి, ద్విపద, పద్యము, గేయము -అని త్రిభంగిగా వింగడింపవచ్చును.

**ద్విపద :**

వెంగమాంబ సృజించిన వాఙ్మయరాశి ప్రాయికముగా ద్విపద చ్ఛందోమయమైయున్నది. సాహితీవేత్తలనుగాక, సామాన్యుల నుద్దేశించి కవితను చేపట్టినందువలన అట్లైయుండుట సమంజసమేగాక, సహజము కూడ. రాజయోగసారము, రమాపరిణయము, శ్రీకృష్ణ మంజరి, శ్రీ భాగవతము, వాసిష్ఠరామాయణము-అను అయిదును ద్విపద రచనలు. ఇవియే గాక ఈయమ రచించిన యక్షగానము లన్నిటియందును ద్విపదలు మెండుగా గలవు.

**పద్యక**

తరిగొండ నృసింహశతకము, వేంకటాచల మాహాత్మ్యము, అష్టాంగయోగసారము-అనునవి వెంగమాంబ రచియించినవద్య కృతులు.[5] మఱియు నీమె రచించిన యక్షగానములయం దెడనెడ పలురకముల పద్యములు కూర్పబడియున్నవి.

**గేయము :**

తత్త్వకీర్తనలు, ఈ కవయిత్రి యక్షగానములందలి దరువులు, ఏలలు, సువ్వాలలు, ధవళములు, శోభనములు, జావళీలు, మంగళములు-మున్నగు పలురకముల గేయరచన లన్నియు ఇందులకు లక్ష్యములే. ఇట్లు గ్రంథస్థములైనవేగాక, ఈ భక్తకవయిత్రి ఆ యా సందర్భములందు ఆశువుగా వచించిన పాటలు పెక్కులున్నట్లు జనశ్రుతి సాక్ష్య మిచ్చుచున్నది.

## ఇతివృత్త స్వభావమును బట్టి

వింగడింపు

ఈ కవయిత్రి రచనలను ఇతివృత్త స్వభావము ననుసరించి స్వతంత్రములు, అనుసరణములు, అనువాదములు - అని ముత్తెరగుల విభజింప వీలుకలదు.

**స్వతంత్రములు :**

తరిగొండ నృసింహ శతకము, శివనాటకము, బాలకృష్ణ నాటకము, రమా పరిణయము, చెంచునాటకము, కృష్ణమంజరి, ముక్తికాంతా విలాసము- ఇవి యేడును వెంగమ లేఖిని నుండి వెలువడిన స్వతంత్రకృతులుగా వానియందలి వస్తుతత్త్వమునుబట్టి నిర్ధారింపబడినవి.

**అనుసరణములు :**

నారసింహ విలాసకథ, రాజయోగసారము, పారిజాతాపహరణము, రుక్మిణీ నాటకము, గోపికానాటకము, జలక్రీడా విలాసము-ఈ యాఱు రచనలు భాగవతాదులందలి కథావస్తువు ననుసరించి రచింపబడిన కృతులు.

**అనువాదములు :**

శ్రీ భాగవతము, వేంకటాచల మాహాత్మ్యము, అష్టాంగయోగసారము, వాసిష్ఠ రామాయణము- ఈ నాలుగును తరిగొండ వెంగమాంబ అనువదించిన కృతులు. ఇవియే గాక, ఈమె యక్షగాన ములలో అచ్చటచ్చట "శ్రీకృష్ణ కర్ణామృతము" వంటి స్తోత్రముల యందలి సంస్కృత శ్లోకములకు చక్కని అనువాదములైన ఘట్టములు గోచరించుచున్నవి.

## ప్రతిపాదిత విషయమును బట్టి

**వింగడింపు**

ఈ కవయిత్రి వెలయించిన కృతు లన్నిటియందును భక్తి, శృంగార, వైరాగ్యభావ సంపద నిండారి యున్నది. అయినను ఆ యా కృతుల యందలి "వస్తు" స్వభావము ననుసరించి కొన్నింట భక్తి, కొన్నింటిలో శృంగారము, మఱి కొన్నిటియందు అష్టాంగయోగాది

ఆధ్యాత్మిక వేదాంత విషయములు అతిశయముగ వర్ణితములై యున్నవి. ఈ హేతువును పురస్కరించుకొని ఈ విభజనము కావింప బడినది.

**భక్తి :**

ఈ కవయిత్రియొక్క కృతికదంబమున మొట్టమొదటి దగు తరిగొండ నృసింహ శతకము, కృష్ణమంజరి, శ్రీ భాగవతము- అను మూడును భక్తిసౌందర్యము పొలుపారుచున్న మనోహర రచనలు.

**శృంగారము :**

రమా పరిణయము, వేంకటాచల మాహాత్మ్యము, యక్షగానములలో ముక్తికాంతా విలాసముతప్ప తక్కిన యెనిమిదియు- ఈ పది కృతులును శృంగారరస ప్రధానములైన రసవత్కావ్యములు.

**వేదాంతము :**

వెంగమ ద్విపద రచనలలో మొదటిదైన రాజయోగసారము, పద్యకృతులలో చివరిదైన అష్టాంగ యోగసారము, యక్షగానములలో చివరిదగు ముక్తికాంతా విలాసము, ద్విపద కృతులలోనే గాక, మొత్తము రచన లన్నింటిలోను చిట్టచివరిదైన వాసిష్ఠ రామాయణము - ఈ నాలుగు వెంగమాంబ కృతు లన్నింటిలో నెల్ల తాత్త్విక విషయగుంఫితములై తనరారుచున్నవి.

ఈ వేదాంత విషయక కావ్యములను వాటి యందలి "వస్తు" తత్త్వమునుబట్టి క్రిందిరీతిని మరల రెండు విధములుగా వింగడింప వచ్చును.

ప్రతిపాదిత విషయము మాత్రము వేదాంత సంబంధియై యుండునవి: రాజయోగసారము, అష్టాంగయోగసారము, వాసిష్ఠ రామాయణము- ఈ తెగకు చెందునవి.

ప్రతిపాదిత విషయముతో పాటు అందలి పాత్రలు (కథ) కూడ వేదాంతశాస్త్ర సంబంధులై యుండునవి: ముక్తికాంతా విలాస యక్షగాన మీ తరగతికి చెందియున్నది.

ఈ రీతిని సాహితీప్రక్రియ, ఛందస్సు, ఇతివృత్త స్వభావము, ప్రతిపాదిత విషయము- అను పలుతెరగుల వైవిధ్యము కలిగి విలసిల్లుచున్న ఈ కవితా తపస్విని యొక్క సారస్వతమును పరిశీలించిన యెడల ఈమె యొక్క సమున్నత సాహితీమూర్తిమత్త్వము స్పష్టరేఖలతో సాక్షాత్కరింప గలదు.

ఇంతవర కిట్లు వింగడింపబడిన వెంగమాంబ కృతు లన్నియు శతకములు, యక్షగానములు - ఇత్యాది క్రమమున ఒక్కొక్క ప్రకరణముగా ఇటుమీదటి ప్రకరణములలో పరిశీలింపబడును.

## వింగడింపు - జ్ఞాపికలు

1. చూ. ద్విపదభాగవతము; ఆర్ నం. 2347 (కాగితపుప్రతి), పుటలు 4 & 5, యస్.వి.యు.ఓ.రీ.ఇ.లై: తిరుపతి.

2. ఈ కృతికి ఒకే యొక తాళపత్రప్రతి యస్.వి.యు.ఓ.రీ.ఇ.లై.లో కలదు.

3. నృసింహవిలాసకథ, రుక్మిణీనాటకము, గోపికానాటకము- అను మూడు కృతులు అలభ్యము లయినను, వాటి పేళ్ళనుబట్టి, మఱికొన్ని ఆకరములనుబట్టి వీటిని యక్షగానములుగా, అనుసరణములుగా, శృంగారవిషయకములుగా ఆ యా చోటుల ఈ ప్రకరణమున వింగడించుట జరిగినది.

4. "యక్షగానము" దేశీయరూప మగుటచే దృశ్యకావ్యశ్రేణికి చెందినది. అందువలన దానిని కావ్యములలో ఉపవిభాగముగా పరిగణింప వీలున్నను, యక్షగాన శాఖకు తెనుగు వాఙ్మయమున గల విశిష్టతనుబట్టియు, వెంగమ రచించిన యక్షగానముల సంఖ్యను, గుణాధిక్యమునుబట్టియు ఇందు వేఱుగాపేర్కొనుట జరిగినది.

5. వేంకటాచల మాహాత్మ్య, అష్టాంగయోగసారములందు ఆ యా సన్నివేశములలో ఉచితములగు చిన్న పెద్ద వచనములు గలవు. కావున ఈ రెండు కృతులును "గద్యపద్యోభయమయం కావ్యం చమ్పూ రిత్యభిధీయతే" (ప్రతాపరుద్రయశోభూషణము.

కావ్యప్రకరణము, 72 శ్లో.) అను సంస్కృతాలంకారిక నిర్వచనము ననుసరించి "చంపువు" లైయున్నను, తెలుగులో రూఢి గాంచిన సాహితీ సంప్రదాయము ననుసరించి పద్యకావ్యములుగా పరిగణింపబడినవి.

## వెంగమాంబ కృత శతకములు

ఆంధ్ర సారస్వతమునందలి యనేక దేశిరచనా ప్రక్రియలకు సాంస్కృతికములగు నామధేయము లుండుట యొక విశేషము. అట్టివానిలో నొకటి "శతకము". ఈ ప్రక్రియ ఎంత ప్రాచీనమైనదో అంత నవీనమైనది. తెలుగు కవులు పెక్కురు ఇష్టదేవతా స్తుత్యాత్మకములను రచించుటతో తన కవితావ్యవసాయమునకు శ్రీకారము చుట్టియున్నారు. ఈ ప్రాచీన సంప్రదాయము నిక్కముగ దేశీయమైనది.

"శతకము"నకు కావ్యతుల్యమగు గౌరవము లభించుట, అది యొక విశిష్ట వాఙ్మయశాఖగా గుర్తింపబడుట ముఖ్యముగా తెనుగుననే జరిగినది. శతక లక్షణములలో అత్యంత ముఖ్యమైనది మకుట నియమము. మకుటము శతకనామమై పరగుట తెనుగు శతకముయొక్క ప్రత్యేకత.

వెంగమాంబ రచించిన శతకములు రెండు: 1) తరిగొండ నృసింహ శతకము 2) శ్రీకృష్ణమంజరి. ఈ శతకద్వయములో మొదటిదగు తరిగొండ నృసింహ శతకమునకు, రెండవదైన శ్రీకృష్ణమంజరికి కాలికముగా మిగుల అంతరము కలదు. మొదటిది ఈ కవయిత్రి తరిగొండలో నున్న కాలమున రచించిన తొట్టతొలి రచన. రెండవది వెంగమ తిరుమల చేరినపిమ్మట అచ్చట విష్ణుపారిజాత, రమాపరిణయ, చెంచునాటకములను వెలయించిన అనంతరము రచించిన కృతి. ఈ శ్రీకృష్ణమంజరికి అవ్యవహితపూర్వమందు వెలసిన చెంచునాటకము వెంగమాంబ తుంబురుకోనలో తప మొనరించుచుండిన కాలమున రచించిన కృతి యని ఆ యక్షగానమందలి ఇతివృత్తము, వర్ణనలు మున్నగు నంశములు స్పష్టముగా చాటుచున్నవి.

ఈ సందర్భమున, వెంగమ తుంబురు కోనలో తపస్సిద్ధినొందిన యంశమును పురస్కరించుకొని ఆమె సాహిత్య కృషిలో రెండుదశలను గుర్తింపవచ్చును. ఆదినుండి చెంచునాటకమువరకుగల రచనలు ప్రథముదశకు, అటు తరువాతి రచనలు ద్వితీయదశకు చేరును. రచనా చమత్కృతి, భక్తిభావన, ఆధ్యాత్మిక దృక్పథము-మొదలైన విషయములు పై రెండు దశల రచనలలో సమానములే యైనను, ఆ యా విషయముల యెడ వెంగమాంబ సాధించిన సాధనక్రమము ప్రథముదశ యందలి కృతులలోను, ఆ విషయములయందు ఆ కవయిత్రి పడసిన పరిపూర్ణత్వ సిద్ధి ద్వితీయదశకు చెందిన కృతులలోను ప్రచురముగా ప్రతిబింబించి యున్నవి.

## తరిగొండ నృసింహ శతకము

**రచనోద్దేశము:**

వెంగమాంబ లేఖినినుండి వెలువడిన ప్రప్రథమ కృతి యీ శతకము. స్వగ్రామ మగు తరిగొండలో వెలసి, తనకు ఇష్టదైవమైన శ్రీ లక్ష్మీ నృసింహస్వామివారియందలి భక్తిని అక్షరాత్మకముగా వెల్లడించు పూనికతోడను, తన రచనావ్యాసంగమునకు ప్రథమ ప్రయత్నముగను వెంగమాంబ రచించిన శతక మిది.

"తరిగొండ నృసింహ! దయాపయోనిధీ!" అనునది యిందలి మకుటము. ఈ శతకమున గల నూటమూడు పద్యములలో 65 ఉత్పలములు 38 చంపకమాలలు, ఈ శతకమును రచించుటలో కవయిత్రి యుద్దేశము క్రింది పద్యమున స్పష్టముగా వెల్లడి యగుచున్నది.

"అతులిత మైన మీ పదవి నందఁ దలంచి విశాల భక్తిచే
వితరణగాను మీ రిపుడు వేడ్కను వాక్కుల నిచ్చి నంతలో
శతకముగాను జెప్పెదను సద్గురుస్వామి కటాక్ష మేర్పడన్
కుతుకము మీఱఁగాను తరిగొండ నృసింహ! దయాపయోనిధీ!"

3ప

ఈ పరమ లక్ష్యమును (అతులితమైన పదవిని-మోక్షమును-) ఉద్దేశించియే వెంగమ సారస్వత మెల్ల వెల్లివిరిసినది. ఈ ధ్యేయము ఆమె తొట్టతొలి రచనలోనే ఇట్లు వ్యక్తమగుట ఇందలి విశేషము.

**ప్రతిపాద్య విషయములు :**

ఈ శతకమునందు ఆ యా పద్యముల మూలమున ప్రబోధింపబడిన విషయములనుబట్టి ఇందు భక్తి, వేదాంతము, సంఘవిమర్శ, నీతి, ఆత్మీయాంశ- అనునవి ప్రధానముగా ప్రతిపాదింప బడినవని గుర్తింపవచ్చును.

భక్తి:వెంగమాంబయొక్క "అచ్చపుభక్తి"కి నిదర్శనములైన పద్యము లీ శతకమున ఇరువదియెనిమిది కలవు.[1] వాటిలో దశావతారస్తుతి యనున దొక ఘట్టము. ఈ ఘట్టమున శ్రీ మహావిష్ణువుయొక్క దశావతారములు పది పద్యములలో వర్ణింపబడియున్నవి.[2] మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, పరశురామ, శ్రీరామ, కృష్ణ, బుద్ధ, కల్కి-అను ఇందలి అవతార క్రమమునుబట్టి వెంగమాంబ బలరామావతారమునకు మాఱుగ కృష్ణావతారమునే గణించె నని తెలియును. ఈ శతకమున వ్యక్తమగుచున్న ఈ కవయిత్రి భక్తిలో కొన్నిచోటుల నాయికాభావనయు గోచరించుచున్నది.

ఉదా:

"వినుము మహానుభావ! మది వేడుకతోడుత విన్నవించెదన్
మొనసెడు స్వాతివానకు ముత్యపుఁజిప్ప లవెట్టు లుండు న
"ట్లనిశము భక్తియుక్తి నిను నాత్మవిభుండవు నీ వటంచు నీ
కును నెదు రేను చూతు దరిగొండ నృసింహ! దయాపయోనిధీ!" 17ప.

"మరిగితి నీ పదాబ్జములు మానసమం దెడఁబాయ జాలకన్
గరిమను భానుఁ డొచ్చుటకుఁ గంజము లెల్ల నపేక్ష సేయు నా
కరణిని నీవు వచ్చుటకు గట్టిగ నా హృదయాంబుజంబు మేల్
గుఱుతుగఁ గోరు నయ్య! తరిగొండ నృసింహ! దయాపయోనిధీ!"
19ప.

"హరి హరి! రమ్ము ర మ్మనుచు నార్భాటమందుచు నేను పిల్చినన్
పరువున రావ దేమి? నినుఁ బట్టుగ భక్తులు కట్టివేసిరో

మఱచితొ నన్ను నొల్లక, రమాపతి ని న్నిటు చేరనీయదో
గుఱిగొని రావ దేమి తరిగొండ నృసింహ! దయాపయోనిధీ!" 20ప.

"మానక నేను పిల్చినను మక్కువ లేక పరాకు సేసితో
వీనుల సోఁక లేక తగ విశ్వము పాలన సేయఁ బోతివో
పూని మహావినోదమున భోగము మీఱఁగఁ జెంచుభామతోఁ
గోనలనుండి రావొ...... .............................................." 21 ప.

శ్రవణము, కీర్తనము, స్మరణము, పాదసేవనము, అర్చనము, వందనము, దాస్యము, సఖ్యము, ఆత్మనివేదనము- అను నవవిధ మార్గములన్నియు[3] వెంగమ నిజజీవితమున సమన్వితములై యున్నను, మొత్తముమీద ఆమె సృజించిన సారస్వతమున "కీర్తనము" అనెడు భక్తిలక్షణ మన్నిటికన్న మిన్నగా నెలకొనియున్నటుల సుస్పష్ట రేఖలతో గోచరించుచున్నది.

గీతలో భగవాను డొకచో "అర్తుడు, జిజ్ఞాసువు, అర్థార్థి, జ్ఞాని- అను నలుతెరగులవారు నన్ను భజింతురు. వారిలో జ్ఞాని యుత్తముడు నాకత్యంతప్రియతముడు" అని వక్కాణించియున్నాడు.[4] వెంగమాంబ అట్టి జ్ఞానుల కోవకు చెందిన భక్తురాలు. అందువలననే ఆమె అధ్యాత్మికోపదేష్టయైన సద్గురువునకు, ఇష్టదైవ మైన తరిగొండ నృసింహునకు క్రింది విధమున అభేదమును ప్రకటించి, ఆ భగవానునే గురునిగా ప్రార్థింప గలిగినది.

"గురునకు నీ కభేదములు కోరి పఠించితి నంచుఁ జిత్తమం
దరయఁగఁ గోపమున్ వలదు అంబుజబాంధవ సోమనేత్ర!నీ
కరుణను నిన్న నేఁడు పొడఁ గాంచితి నిం కనుమాన మేల? మ
ద్గురుఁడవు నీవె కావె తరిగొండ నృసింహ! దయాపయోనిధీ!" 42 ప

వేదాంతము: ఈ శతకమున వేదాంతముకూడ ప్రతిపాద్య విషయమే. ఇందు ముప్పదియేడు పద్యములలో సాంసారిక విషయ విరక్తి, యోగవిశేషములు, జీవుడు, ఆత్మ, పరమాత్మ, సద్గురు మహిమ-మున్నగు అనేక తాత్త్విక విషయములు ప్రవచింపబడియున్నవి.[5] ఈ వేదాంత

విషయముల ప్రాశస్త్యమునుబట్టియే కొందరు విమర్శకులు దీనిని వేదాంత శతకములశ్రేణికి చెందినదిగా వింగడించిరి.[6] ముఖ్యముగా యోగవిశేషములు పదునాలుగు పద్యములలో మార్మిక (mystic) ధోరణిని రచింపబడినవి.[7]

ఉదా :-

"కొలఁకుల మధ్యమందు నొక కోమలి యున్నది దానిలోపలన్
సలలిత వహ్నిమండలము చంద్ర దివాకరమండలంబులున్
అలవడ నాఱు చక్రముల కావల నం దొక సారసంబులోఁ
గులుకుచు నుండు హంస తరిగొండ నృసింహ! దయాపయోనిధీ! 47 ప.

"వేషము లెల్ల మాని సువివేకముఁ జెంది విచారహీనుఁడై
రోషముఁ జంపి భావమున రూఢిగఁ జూచుచు నుండు వానికిన్
భూషణ మైన యట్టి యొక పువ్వులతోటకుఁ బళ్ళిమాన మేల్
ఘోష వినంగ వచ్చుఁ దరిగొండ నృసింహ! దయాపయోనిధీ!" 54 ప.

ఈ శతకమునందలి వేదాంత భావగర్భితములగు కొన్ని పద్యములు తరువాతి కాలమున ఈ కవయిత్రి రచించిన రాజయోగసారాది గ్రంథములలో వివరింపబడిన తాత్త్విక విషయములకు బీజభూతములగు ప్రాతిపదికలుగా తోచుచున్నవి.

వటమూలుడు,[8] పరమానంద యతీంద్రుడు[9] మున్నగువారు రచించిన వేదాంత శతకములలోని తాత్త్విక భావములు కొన్ని ఈ తరిగొండ నృసింహ శతకములో గోచరించుచున్నవి. ఇందులకు హేతువు యోగ, వేదాంతశాస్త్ర విషయము లెవరు ప్రతిపాదించినను ఒక్కటిగ నుండుటయే యని తలంప దగును.

సంఘవిమర్శ: ఈ శతకమున సమకాలీన సంఘమందలి చిత్త శుద్ధి లేని యాచారములను, ఐహిక భోగలాలసతను కవయిత్రి సూటిగా విమర్శించి యున్నది. ఆత్మశుద్ధి లేని యాచారములను విమర్శించిన తీరునకు క్రింది పద్యము మచ్చుతునక.

"మన సొక శుద్ధి లేక ఘనమాయకు లోఁబడి యుండి నీళ్లలో
మునిఁగి శరీర మున్న దని పొందుగ నందఱు చూచుచుండఁగాఁ

గను లటు తేలవేసి కరకంజములన్ ముకుళించి మంత్రముల్
గొనిఁగిన ముక్తి రాదు తరిగొండ నృసింహ! దయాపయోనిధీ!" 99 ప.

జ్ఞాని యగు వెంగమాంబ తాత్త్వికదృష్టితో చేసిన కర్మమార్గపుటాచారముల విమర్శనము కొన్నిచోట్ల కుండ బ్రద్దలు గొట్టినట్లుండి, వేమనయోగి విమర్శను తలపించును.

ఉదా:

ఉ. "ముట్టని దూర మేగి యట మూఁడు దినంబులు బైటనుండి యా
ముట్టెడఁ బాపఁ బూని బహుముఖ్యతరంబుగ బొంది నీళ్లలోఁ
బట్టుగ ముంచి వేసినను పన్నుగ దేహికి ముట్టు పోవునే?
గు ట్టొక టుండఁగాను తరిగొండ నృసింహ!దయాపయోనిధీ!" 85 ప.

ఇది "కూడు విడిచి మలము గుడుచురా ఉపవాసి" అను వేమనార్యుని యభిప్రాయమును పోలియున్నది.

అత్యంత స్వాభావిక మగు ఐహిక సౌఖ్య విమర్శనమునకు ఈ క్రింది పద్య మొక చక్కని తార్కాణము.

"ఎక్కడి రొక్కయోజనము లెక్కడి భాగ్యము లెక్క డింతులున్
ఎక్కడి పాడిపంటలును ఎక్కడి బాంధవు లెల్ల నాటికిన్
తక్కక వృద్ధరూపమును దాల్చినఁ బుత్రకు లింటివాకిటన్
కుక్కలఁ దోలుమండ్రు తరిగొండ నృసింహ! దయాపయోనిధీ!" 63 ప

నీతి :- వెంగమ లేఖినినుండి అలవోకగా వెలువడి మిగుల సహజముగా భాసించుచున్న నీతిపద్యములు కొన్ని యిందు గలవు.

మచ్చున కొకటి:

"పాటిగ నగ్నిసాక్షిగ వివాహము యైన పతివ్రతామణిన్
నీటున నొల్లకన్ మిగుల నేరము లెన్నుచుఁ గొట్టి తిట్టుచున్
దాటిగ నన్యకాంతను ముదంబున రక్షణ చేసి దానితోఁ
గూటమి పాపహేతు తరిగొండ నృసింహ ! దయాపయోనిధీ!" 95ప

ఈ తాత్త్విక కవయిత్రి నీతులలో అచ్చట సున్నితపు హాస్యమును మేళవించి యుండుట మిగుల ముదము గొలుపును. ఈక్రింది లోభివాని స్వభావమిందుల కొక యుదాహృతి.

"బొందియె శాశ్వతం బనుచు బోరున రొక్కము గూర్చు లోభి నిం
పొందఁగ నూరిలోఁ గినిసి భోజుఁడ వంచును భట్లు వేడినన్
ఎందుకు వీరు వచ్చి రిది యేమి మహాప్రళయం బటంచు బల్
గొందుల దూరు నయ్య తరిగొండ నృసింహ ! దయాపయోనిధీ !" 92ప

ఆత్మీయాంశ: రచయితయొక్క ఆత్మయాంశను ప్రతిబిం బించుటలో "శతకప్రక్రియ" అగ్రగణ్యమైన దనుటకు ఈ శతకము ప్రకృష్ట నిదర్శనము. వెంగమ ఆత్మీయాంశ అద్దమునందువలె ఇందు సుస్పష్టరేఖలతో ప్రతిఫలించుచున్నది. ఈ ప్రథమ రచన నాటికే కవయిత్రి వివాహితయనియు, భర్తపేరు ఇంజేటి వెంకటాచలపతి యనియు ఇందలి చివరి పద్యమువలన తెలియుచున్నది.

"ఎలమిని పెంపుసొం పొదవ నింజేటి వంశజుఁడైన వెంకటా
చలపతి నామధేయుని నిజాంగన వెంగమ సత్కవీంద్రు లి
మ్ముల ముద మంద నీ శతకమున్ రచియించి యొసంగె మీకుఁ గో
ర్కులు సమకూర్ప వయ్య తరిగొండ నృసింహ! దయాపయోనిధీ!" 103 ప

గురువు సుబ్రహ్మణ్య దేశికుడు ఆయన యంఘ్రిమూలమున తను నుదుటివ్రాతను మార్చి, సాంద్రకటాక్షమును ఉండ బనిచెనని ఈ కవయిత్రి యొక పద్యమున గురుమహిమను కొనియాడియున్నది, (చూ. 41 పద్యము). ఇందువలన విగతభర్తృకయైన వెంగమాంబ జీవితమునకు ఆధ్యాత్మికోపదేశముచే ఆ గురువు నూతనోత్తేజమును కల్గించె నను అర్థము సూచిత మగుచున్నది.

మఱియు ఈ కవయిత్రి యీకృతి రచించు కాలమునకే ఇష్టదైవము (తరిగొండ నృసింహుని) యొక్క కటాక్షమును బడసి యున్నట్లును, ఆ దివ్యానుభూతితో యోగసాధనపథమున పురోగమించుచు ముక్తిలక్ష్యమును చూఱగొని యున్నట్లును ఈ క్రింది పద్య భాగములు ఘోషించుచున్నవి.

"రూఢిగ నాత్మనాయకుని రూపము గాంచెను నాఁడు" 32 ప.
"నీదు రూపమును నీ గతి నాదు మనంబులోనఁ గన్గొన్న
విధంబు దోఁచె" 42 ప.

"నీ పదములు నేడు గంటి హరి పట్టుగ నా కిటు
బ్రహ్మవిద్యలోఁ గొదవలుఁ సేయ కయ్య" 86 ప.

"నిన్ననె కంటి నీ మహిమ నీరజలోచన! దివ్యతేజ! నీ
సన్నిధి దగ్గ రాయెను విచారము మానెను ముక్తి కల్గె నా
పన్నుగ నివ్విధంబునను భావములోపల నీదు మూర్తిఁగ
న్గొన్నదె భాగ్య మయ్య" 102 ప.

**రచనావైచిత్రి :**

తరిగొండ నృసింహ శతకము వెంగమాంబ తొలిరచనయైనను, ఇందులో కమనీయమగు కవితావైచిత్రికి కొదువ లేదు. "నల్లకల్వలల చంద్రునిఁజూడఁ దలంచు భంగి" (18ప) "జాలగు నీపదాబ్జముల సారము లెల్ల మిళింద భాతిగన్" (23ప) వంటి ఉపమలతో, "కదళీఫలంబు తగమక్కువతోడ భుజించు కీరముల్ కొఱుకునె ముష్టికాయ" (78 ప.) వంటి దృష్టాంతాలంకారములతో, "కొలఁకుల మధ్యమందు నొక కోమలి యున్నది, దానిలోపలన్ సలలిత వహ్నిమండలము" (47 ప.) వంటి ఆధ్యాత్మికభావ చమత్కృతులతో, "మోహమహావని" (32), "ఆసలనేటి తీగలు" (40), "ఆత్మదేశము" (45), "ముక్తి పుష్పము" (48) వంటి అసంఖ్యాక రూపకములతో, "ఆత్మకున్ కులమును గోత్రమేది!" (79), "వెన్నయుఁ జేతఁ బట్టుకొని వేమఱు నే యని కూయనేటికో?" (100) ఇయ్యది సూక్తులతో, సరళమైన భాషలో, సహజ శైలితో ఈ కృతి విలసిల్లుచున్నది.

ఈ శతకమున కంచెర్ల గోపనార్యుని దాశరథి శతకము, బమ్మెర పోతన భాగవతము మున్నగు ప్రాచీన గ్రంథముల ఛాయలు స్పష్టముగా గోచరించుచున్నవి. ఇందులకు కారణములు రెండు. వెంగమ ఆ గ్రంథములను బాల్యమునుండియు భక్తితో పఠించు చుండుటవలన తత్ప్రభావము అప్రయత్నముగనే తన రచనలో ప్రతిఫలింప జేసియుండుట. రెండు: దాశరథి శతకమువంటి ప్రసిద్ధ భక్తి శతకముల యొరవడిలో తాను శతకరచన గావింప దలంపుగొని యుండుట.

ముఖ్యముగా దాశరథి శతకముయొక్క ప్రభావముద్ర ఈ శతకముపై అనేకాంశములలో కన్పట్టుచున్నది. ఆ యంశము లివి:
1. దాశరథి శతకమువలెనే ఇదియు "శ్రీ రఘురామ!" అను సంబోధనతో ఉపక్రమింపబడినది.

"శ్రీ రఘురామ! చారుతులసీదళదామ!" (దా.శ.)
"శ్రీ రఘురామ! మీ కృపను చెల్వము మీఱంగ" (త.నృ.శ.)

2. ఈ శతకముయొక్క మకుటము అర్థతః శబ్దతః దాశరథి శతకముతో సాదృశ్యము గల్గియున్నది.

"భద్రగిరి దాశరథీ! కరుణాపయోనిధీ!" (దా.శ.)
"తరిగొండ నృసింహ!దయాపయోనిధీ!" (త.నృ.శ )

3. దాశరథి శతకమువలెనే ఇదియు ఉత్పల, చంపకమాలలలో రచింపబడియున్నది. అంతేగాక పద్య సంఖ్య (103 పద్యములు) అందును, ఇందును సమానము.

4. కొన్ని పద్యముల యెత్తుగడలు, పదబంధములు, భావములు మున్నగువానిలో ఈ రెంటికిని సన్నిహిత సామ్యము గోచరించుచున్నది.

i) నృసింహావతార వర్ణన.
"పెట పెట నుక్కుగంబమున" (దా.శ.72 ప.)
"ఫెళ ఫెళ నుక్కుకంబమున" (త.నృ.శ. 12 ప.)

ii) పరశురామావతార వర్ణన.

"ఇరువది యొక్కమాఱు ధరణీశుల నెల్ల వధించి" (దా.శ 74 ప )
"ఇరువదియొక్కమాఱు సుర లెల్ల నుతింపఁగఁ ద్రుంచి"(త నృ.శ 12ప)

పోతనామాత్యుని భాగవతము, ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర శతకము మున్నగు రచనలతోడి పోలికలకు ఈ క్రిందివి యుదాహరణలు.

i) "మందార మకరంద మాధుర్యమునఁ దేలు
మధుపంబు వోవునే మదనములకు" భాగ. VII స్కం 150 ప.
షషమతి కదళీఫలంబు తగ మక్కువతోడ భుజించు కీరముల్
కొఱకునె ముష్టికాయ" త.నృ.శ. 78 ప.

పై రెండు పద్యముల దృష్టాంతముల యందలి భావసామ్యము పరికింప దగినది.

ii) ఒకే విధమైన పదముల కూర్పులవలన సిద్ధించిన శైలీసామ్యమునకు నొక యుదాహృతి.

"అచ్చపుఁ జీఁకటింబడి గృహవ్రతులై విషయప్రవిష్టులై
చచ్చుచుఁ బుట్టుచున్ మరలఁ జర్వితచర్వణు లైన వారికిన్"
భాగ., VII సం., 181 ప.

"పుట్టుచు గిట్టుచున్ మఱియు బోధశరీరునిఁ గాన నేరకన్
వట్టి దురాశలం దగిలి వారిజగంధుల మీఁది ప్రేమచే" త.నృ.శ.61 ప.

iii)రాజసేవా తిరస్కారము నెడల ఈ కవయిత్రి పోతన ధూర్జటుల ననుసరించిన దనెడు విషయము ఈ క్రింది పద్యభాగములు చాటుచున్నవి.

"ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులున్
సొమ్ములుఁ గొన్ని పుచ్చుకొని చొక్కి శరీరమువాసి కాలుచే
సమ్మెట పోటులం బడక సమ్మతితో" భాగ ; I స్కం 13 ప.

"రాజుల్ మత్తులు వారిసేవ నరకప్రాయంబు వా రిచ్చు నం
భోజాక్షీ చతురంతయాన తురగీభూషాదు లాత్మవ్యధా
బీజంబుల్ తదపేక్ష చాలు" శ్రీకాళహస్తీశ్వర శతకము, 18 ప.

"మనుజులు మందబుద్ధిఁ జని మానవనాథుల నాశ్రయించుచున్
ఒనరఁగఁ దర్కవాదముల నూరక చేసి ధనంబు తెచ్చి యా
తనయుల కంచు గొందులను దాతురు లోభముచేత నేర్పడన్
గొనకొననీదు ముక్తి"త.నృ.శ. 65 ప.

"మించులవంటి భోగములు మేఘమువంటిది రాజచిత్తమున్" త.నృ.శ.72 ప.

మానవల్లి రామకృష్ణకవిగారు ఈ శతకము యొక్క పీఠికలో పేర్కొనినట్లు లాక్షణిక దృష్టికి వ్యాకరణ దోషములుగా, ఛందో దోషములుగా గోచరించునవి అటనట కలవు. "తెచ్చుక, అనేటి, సాదృశము, యెవ్వనము"-వంటి వ్యావహారిక రూపములు, "వట్టానలు, కావలుందురు, వాసగు, భానుడొచ్చుటకు"- వంటి వ్యావహారిక సంధులు, "దుష్కోరికలు, రొక్కయోజనములు"-వంటి వైరినమానములు. "బలుయాకలి, మహాయసహ్యాము"- వంటి దుస్సంధిరూపములు మొదలైనవి ఇందలి వ్యాకరణ దోషములు.

"యెవ్వనమందు నాథులకు నింతులు మే లుపచార మేర్పడన్"
త.నృ.శ. 64 ప.

ఇట్లు వ్యావహారిక రూపములతో యతిమైత్రి గూర్చుట, మఱికొన్ని పాదపూరణలు ఇందలి ఛందోదోషములుగా చెప్పదగియున్నవి. ఇక "ముడ్డి" (71 ప.), "మిండడు" (75 ప.), "గుట్టు" (85 ప.) మున్నగు నొకటి రెండు పదము లీ శతకమున గనుపట్టు అశ్లీలపదములు.

**వైశిష్ట్యము :**

ఈ శతకమున బమ్మెర పోతరాజాది ప్రాచీనకవుల కవితా రీతులు ప్రతిఫలించియున్నను, కొన్ని విశిష్టగుణములచే నిది స్వతంత్ర వ్యక్తిత్వము గలదై యలరారుచున్నది. ఆ విశిష్టగుణము లివి.

1. వెంగమాంబ యీ తరిగొండ నృసింహ శతక రచనలో ఇష్టదేవతా, గురు వందనాదికము మొదలుకొని ఆద్యంతము నిర్మల భక్తి నిష్ఠమైన మనఃక్షేత్రమున అంకురించిన భావములనే సంతరించినది. ఇందుచేతనే ఈ శతకమున దశక, వింశత్యాది విభజన కానబడదు.

2. ఈ శతకశైలి ఒడిదుడుకులు లేక, నిరాడంబరమై, నిర్మలముగా, అనర్గళముగా సాగుచు, అటనట పూర్వకవుల కవితా రీతులను సమన్వయించుకొని, ఒకానొక ప్రత్యేకతతో ఒప్పుచున్నది.

3. మిగుల స్వాభావికములైన భక్తిభావములు,అనుభవ జనితములైన తాత్త్వికభావములు ఈ శతకమున ఓతప్రోతముగా మిడియుండుటచే ఇది యపూర్వమగు వేదాంత శతకముగా విరాజిల్లుచున్నది.

ఈ శతక వైశిష్ట్యమును గూర్చి మానవల్లి రామకృష్ణకవిగారు పీఠికలో తెల్పిన వాక్యములు తిలకింప దగియున్నవి,

"...........ఈ శతకము లఘుకావ్యమైనను స్వగ్రామ దేవతాస్తుతి యగుటచే వేంగమాంబ కున్న యిష్టదేవతాభక్తిని వెల్లడించుచున్నది. ఒక్క తాళపత్రప్రతిఁ జూచి దీనిని ముద్రించినారము. భగవద్భక్తుల కిది యింపు గొంపు గొలువు ననుట నిక్కము.....దీనిలో రాజయోగసారాది గ్రంథములలో వివరింపఁబడిన షట్చక్రాది శరీర యోగముద్రా రహస్యములు చూపఁబడినవి. ఇందుఁ గొన్ని చోటుల వ్యాకరణ చ్ఛందోదోషములును, నశ్లీల పదప్రయోగమును గానవచ్చుచున్నవి. వస్తుస్వరూపము ననుసరించి తదధికారులకు దోషగణనము ప్రధానము కానేరదు."

ఒక్కమాటలో, ఆంధ్రమున నృసింహదేవు నుద్దేశించి వెల్వడిన భక్తిశతకములలో నిర్మలభక్తి చేతను, నిసర్గరచనా సౌందర్యము చేతను తరిగొండ నృసింహ శతకమునకు ప్రత్యేకస్థానము కలదు.

**వికల్పకవిత్వము :**

వెంగమాంబ శతక రచనకు సంబంధించిన యొకటి రెండు ప్రత్యేకాంశము లిట పేర్కొనబడుచున్నవి. ఆ కాలమున తాత్త్విక ధోరణితో గూడిన వెంగమ వర్తనమును విమర్శించు వారివలెనే, ఆమె కవిత్వమును సైతము విమర్శించు వా రుండి రని ఈ పద్యము తెలుపుచున్నది.

> "కరుణయు లేక కొందఱు వికల్ప కవిత్వ మటంచుఁ బల్కినన్
> సరగున నీవు వారలకు సమ్మతిఁ జెప్పి పరాకు సేయకే
> పరువడితోను నీ శతకపద్యము లింక ధరిత్రి మీఁదటన్
> గుఱుతుగ నిల్ప వయ్య దరిగొండ నృసింహ! దయాపయోనిధీ!"

4 ప.

వికల్ప గుణము కలది వికల్పకవిత్వము. వికల్ప మనగా భ్రాంతి యని యర్థము. అనగా కవిత్వము కాక పోయినను, కవిత్వమువలె కనిపించు రచన యని అట్టి కొందరు విమర్శకుల పలుకుల యభిప్రాయమై యుండును. కాని, ఆ విమర్శ అసూయతో గూడిన సని లేని విమర్శయనుటకు ఈ శతకమే సాక్ష్యము.

వెంగమాంబ రచించిన జలక్రీడా విలాసము (యక్షగానము) ప్రారంభమున ఈ శతక మకుటముతో గూడిన యీ క్రింది పద్యము వ్రాయబడియున్నది.[10]

"శ్రీ రమణీ మనోరమణ! చిన్మయ! విశ్వశరీర! ఘోర సం
సారలతాలవిత్ర! నవసారసనేత్ర! పవిత్ర! భక్తమం
దార! కృపాంతరంగ! పరతత్త్వము నీ వని నమ్మి ముక్తికై
కోరి భజింతు నిన్ను తరిగొండ నృసింహ! దయాపయోనిధీ!"

కాని, పై పద్యము తరిగొండ నృసింహ శతకమున కన్పట్టదు. దీనిని బట్టి ఈ కవయిత్రి ఇదే మకుటముతో మఱి కొన్ని పద్యములను రచించుచుండిన దని తలంప దగును.

**సంస్కృతమున శతకరచన (?) :**

ఈ కవయిత్రి వేంకటాచల మహాత్మ్య ప్రబంధమునందును, జలక్రీడావిలాస, ముక్తికాంతా విలాసాది యక్షగానముల యందును అచ్చటచ్చట శార్దూలవిక్రీడిత వృత్తమున సంస్కృత శ్లోకములను రచించినది. అవి "తరిగొండ శేషకుధరాధ్యక్షం భజే హం సదా" అను మనోజ్ఞ మకుటముతో విలసిల్లుచున్నవి. ఈ మకుటముతో ఆమె శతకమును రచించెనో, లేదో తెలియ రాకున్నను, వెంగమాంబ సంస్కృతమున శతక రచన చేయవలంతి యను విషయము మాత్ర మా శ్లోకములవలన రూఢి యగుచున్నది. ఈ క్రింది శ్లోకము అట్టి వాటిలో నొకటి.

"సత్యం జ్ఞాన మనంతరూప మమలం చక్రాయుధం శ్రీకరం
నిత్యం నిర్మల మవ్యయం నిరుపమం నిర్వాణ బోధప్రదమ్।
ప్రత్యక్షానుభవామృతం శుభకరం పాపాద్రి వజ్రాయుధం
దైత్యారిం తరిగొండ శేషకుధరాధ్యక్షం భజే ఽహం సదా॥" 11

# కృష్ణమంజరి

వెంగమాంబ రచించిన శతకములలో ద్వితీయమైనది, మంజులతా గుణముచే అద్వితీయమైనది కృష్ణమంజరి. మంజరీ ఛందస్సు ద్వివదకు తోబుట్టువు. ప్రాసనియమము లేని ద్విపదయే మంజరి. నిజమున కీకృతి మంజరీ ఛందమున రచియింపబడినను, ఇందు ప్రతి రెండవ పాదము చివర నియతముగా నిల్పబడిన "కృష్ణ!" యను సంబోధనము మకుటలక్షణమును పుణికిపుచ్చుకొని శతక స్వరూపమును ప్రసాదించినది. ఈ కారణముచేతనే వంగూరి సుబ్బారావుగారు దీనిని ద్విపద శతకముగా పరిగణించిరి. [12]

**ప్రత్యేకత:**

వెంగమాంబకు ప్రాచీనులైన తెలుగు కవులలో మంజరీ ఛందమును చేపట్టి కృతులు వెలయించినవారు లేకపోలేదు గాని, ఈమె వలె అందు శతక లక్షణమును ప్రవేశ పెట్టినవారు లేరు. ఒక్క 'భక్తి శతకశాఖ' యందే గాక, తదితర శతక వాఙ్మయ శాఖలయందును ద్విపదలో శతకములు వెలువడలేదనియే చెప్పవలెను. [13] కావున కృష్ణమంజరి ఆంధ్ర వాఙ్మయమునందలి భక్తి శతకశాఖలో వెలసిన ఏకైక 'మంజరీ ద్విపద శతక' మని విదితమగుచున్నది.

మకుటమును బట్టి దీనిని 'కృష్ణశతక' మనియో, లేదా 'కృష్ణ మంజరి శతక' మనియో వ్యవహరింపవచ్చును. లాక్షణికులు 'మంజరి' యొక్క ఉపయోగము నిట్లు నిర్వచించి యున్నారు.

"శ్రీ మందిరాకారు జిత దైత్యధీరుఁ

బూజింపవలయు వాక్పుష్ప మంజరుల" ఛందోదర్పణము, III 49.

"పద్మాక్షుఁ దెపుడు చేపట్టు మంజరుల
చందాన నలరారు జగతి మంజరుల" అప్పకవీయము, IV 468.

ఈ దేశీయచ్ఛందము దేవతాస్తుతికి మిగుల అనువైనదని పై లాక్షణికోక్తుల తాత్పర్యము. ఆ పలుకులు ప్రత్యక్షర సత్యములని వెంగమాంబ రచన నిరూపించుచున్నది.

**ప్రపత్తి :**

ఈ శతకము వెంగమాంబ యొక్క శ్రీకృష్ణభక్తికి, పరిపూర్ణ శరణాగతికి నిర్మల నిదర్శనము.

"చెలరేఁగి నాకుఁ దోఁచిన వెల్ల మనవి
చేసితి నింక నీ చిత్తమో కృష్ణ!" 133ద్వి.

అని కవయిత్రి కడు వినయముతో వాక్రుచ్చినను, ఇందలి భక్తి భావన మొదటినుండి చివరి వరకు అప్రయత్నసిద్ధమగు ఒకానొక క్రమము ననుసరించి ధారగా జాల్వారి యున్నదని పఠితలకు విశదమగును.

శ్రీ మద్భాగవతమున పేర్కొనబడిన తొమ్మిది తెరగుల భక్తి పద్ధతులలో పాద సంసేవనము, దాస్యము, ఆత్మ నివేదనము - అనెడి మూడును క్రమముగా ప్రపత్తి (శరణాగతి) యందు పర్యవసించు నట్టివి. ఈ మూడింటిలో ఏ యొక్కటి యున్నను, అది తక్కిన రెండు పద్ధతులను వెంట నిడుకొని ఉపాసకునకు పరిపూర్ణ ప్రపన్నత్వమును ప్రసాదింప సమర్థమె యుండును.

నవవిధ భక్తిమార్గము లీ కవయిత్రికి కరతలామలకములే యైనను, వాటిలో 'పాదసేవన' మనునది అన్నిటికన్న అతిశయించి యున్నదను సత్యమును శ్రీకృష్ణమంజరి చక్కగా చాటుచున్నది. ఈ శతకము యొక్క ఎత్తుగడలోనే ఈ యంశము వెల్లడి యగుచున్నది.

"శ్రీ వేంకటేశ! నా చిత్తంబునందు
నీ పాదయుగళంబు నిలుపవే కృష్ణ!" 1 ద్వి.

"హరి! నీ పదాంబుజం బను నావ నిచ్చి
మాయాబ్ధి దాటించి మనుపవే కృష్ణ!" 5 ద్వి.

ఇట్లే ఈ శతక మధ్యముననను సందర్భోచితముగా పాదసంసేవన విషయము ప్రస్తావింపబడి యున్నది.

"పాదంబు లెవరైనఁ బట్టిన, పట్టు-కొంకక విడిపించుకో రాదు కృష్ణ!
ఇపుడు నీ పాదంబు లేను పట్టితిని-నీ వింక విడిపింప నేరవే కృష్ణ!"
75, 76 ద్వి.లు.

ఈ 'పాదసేవ' తరిగొండ నృసింహ శతకమునందును ఒకచో ఉగ్గడింపబడినది.

"సత మగు సామి! ని న్నిఁకను సారెకు నే నెటు పోవ నిత్తు నా
యితముగ నీ పదాబ్జముల నేర్పడ గట్టిగఁ బట్టి వేగ శ్రీ
పతి! ఘనభక్తి మార్గ మను పగ్గమునన్ బిగఁ గట్టి, నిన్ను నా
కుతికకుఁ గట్టుకొందుఁ దరిగొండ నృసింహ! దయాపయోనిధీ!" 43 ప.

తరిగొండ నృసింహ శతకమున వ్యక్తమగు కవయిత్రి భక్తి భావము కృష్ణమంజరిని రచించునాటికి ప్రపత్తిలో పర్యవసించినది. మూలమంత్రము, ద్వయము, చరమశ్లోకము, కపికిశోర, మార్జాల కిశోర న్యాయములు, పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చావతారములు, శేష శేషి భావము - మున్నగు విశిష్టాద్వైత దర్శన సంబంధి సంకేతపదము లిందు తరచుగ ప్రయోగింపబడి యున్నవి.

మిక్కిలి వినయశీలయగు ఈ కవయిత్రియందు ప్రపత్తి భావము ఆదినుండియు సహజాతము(Instinct) గ నున్నను, తిరుమల క్షేత్రము చేరిన పిమ్మట విశిష్టాద్వైత దర్శనముతో ఈమె కేర్పడిన పరిచయము వలన, హృద్గతమైన ఆ ప్రపత్తిభావనకు బలము చేకూరగా, వెంగమాంబ ఆళ్వారుల వంటి మనఃపరిపక్వతను, పరమ ప్రపన్నతను పొందినది.

**ఆత్మాశ్రయత:**

అడుగడుగున అప్యాయతతో శ్రీకృష్ణుని సంబోధించుచున్న ఈ కృతిలో వ్యక్తమగుచున్న వెంగమ ఆత్మాశ్రయ తత్త్వము 1) స్వరూప సందర్శ నాభిలాష 2) ఆత్మనివేదనము 3) భర సమర్పణము 4) మోక్ష కాంక్ష - అనెడు నాలుగు విధములుగ గోచరించుచున్నది.

స్వరూప సందర్శనాభిలాష యనగా ఉపాస్యదైవముయొక్క మూర్తిని దర్శింప గోరి ప్రార్థించుట. ' కల నైన నీ మూర్తి గాని యన్యంబు, నేమైనఁ గనిపింప నీయ కే కృష్ణ!' అని ప్రార్థించుచో ఈ కవయిత్రి శ్రీకృష్ణుని దివ్యమంగళ విగ్రహమును చూప గోరినది. అట్లు చూపగోరుటలో దాదాపు ఇరువదియైదు ద్విపదలలో శ్రీకృష్ణుని మూర్తియందలి మకుటము మొదలుకొని పాదాంగుష్ఠము వరకు గల వివిధాంగములను వేర్వేర పేర్కొనినది. ఆ ద్విపద పంక్తులు కవయిత్రి దర్శించిన శ్రీకృష్ణుని స్వరూపమును పఠితల కనులకు గట్టించుచు, ఆమె కవితానైపుణికి, అనన్యభక్తికి నిదర్శనములుగా వెలసి యున్నవి. మచ్చునకు కొన్ని:

1) "కనకరత్న ప్రభాకలిత మై నట్టి - సురుచిర మకుటంబు చూపవే కృష్ణ!
తళుకైన కుటిల కుంతలయుక్త మైన-సలలిత ఫాలదేశము చూపు కృష్ణ!
ఘనసార కస్తూరికామిశ్ర మైన- కలితోర్ధ్వ పుండ్రంబు గాన్పింపు కృష్ణ!
సుందర భ్రూలతాశోభితం బైన-కనుగవ బెళుకు చక్కఁగఁ జూపు కృష్ణ!
ముదిరిన సంపెంగ మొగ్గకైవడిని-కమనీయ మగు నాసికము చూపు కృష్ణ!
నిరుపమ కుంద సన్నిభ దంతచయము-రమణీయ బింబాధరముఁ జూపు కృష్ణ!
మెఱుఁగైన కురి కురి మీసంబు అమర-సొగసైన చుబుకంబుఁ జూపవే కృష్ణ!

13-19 ద్వి.లు.

పై ద్విపద పంక్తులలో శ్రీకృష్ణుని మొలక మీసములు గల వానిగా భావించుట మిగుల దేశీయమైన అంశము. 14

2) "గంగాతరంగ సంగత వామపాద-భాసురాంగుష్ఠ మేర్పడఁ జూపు కృష్ణ!
క్షీరవారిధియందు శేషతల్పమున-శయనించి యున్న ముచ్చటఁ జూపు కృష్ణ!

అష్టభుజములతో నమృతాబ్ధి నడుమ-కొలు వున్న మహిమ మక్కువఁజూపు కృష్ణ!
బాలుండవై వలపత్రంబుమీఁదఁ-బవళించు రీతిఁ దప్పక చూపు కృష్ణ!
32-35 ద్వి.లు.

ఆత్మనివేదన మనగా సర్వసమర్పణబుద్ధితో తన దురితములను విన్నవించుకొనుట. 'పావనుండవు నీపు పతితను నేను, పఱఁగ నేఁజేయు పాపము లిన్ని యనుచు గుఱి చేసి లెక్కింపఁగూడ దే కృష్ణ! ' అదిగాక భాగవతాపచారముల, నుడుగక కావించుచుందునే కృష్ణ!' అని యీ రీతిని కవయిత్రి భగవంతునకు నివేదించుకొన్నది. ఈ నివేదనలో తా నెంతో పాపియని చెప్పుకొనినది. విశిష్టాద్వైత సంప్రదాయమున దీనిని 'నైచ్యానుసంధాన' మందురు. సర్వేశ్వరుడగు స్వామి సన్నిధిని తన తక్కువ దనమును వీలైనంతగా విన్నవించుటయే ఇందలి సారాంశము. రామదాసు దాశరథి శతకములో నిట్లే అచ్చటచ్చట నైచ్యానుసంధానము గోచరించును.

"పరధనముల్ హరించి పరభామల నంటి పరాన్న మబ్బినన్" దా.శ. 48 ప.
"చేసితి ఘోరకృత్యములు చేసితి భాగవతాపచారముల్" దా.శ. 49 ప.

కనుక, ఈ చెప్పినవన్నియు ఆ యా భక్తికవులు ఆచరించినవని భావించుటకన్న, అట్టి నైచ్యానుసంధాన పూర్వక ఆత్మనివేదనము ద్వారా వారు ఆనందము పొందెడు ఒకానొక పద్ధతి యిది యనితలంచుట లెస్స. ఆధునిక మనస్తత్త్వశాస్త్రమున ఈ నైచ్యానుసంధాన ధోరణి Auto psychosis అని పేర్కొనబడినది.

భరసమర్పణ మనగా తన నుద్ధరింపవలసిన బాధ్యత భగవంతునిదే యని సహేతుకముగా నిరూపించి, భక్తుడు తాను ధైర్యము నవలంబించి యుండుట. 'భరన్యాస' మనియు దీనికి విశిష్టాద్వైత సంప్రదాయమున నామాంతరము. 'నీవు నా స్వామివి. నీ సొమ్ము నేను ..... శేషభూతను నేను' శేషివి నీవు. కావున బాధ్య మెక్కడ పోదు. నీవు బాధ్యుఁడవని నే నిన్ని నాళ్లు కనలేకపోతిని. నేఁటికైనను నీ కటాక్షమున

నీ బాధ్యమెఱింగితి .... కాన నన్నెట్టైనఁ గడతేర్పఁ దగిన భారంబు నీకుఁదప్పదు సుమ్మి, వసుధ నీ పతిత పావనకీర్తి బిరుదు, పట్టితి నాకింక భయ మేమి?..... కాన, నీ బిరుద నన్ గడతేర్చు ననెడి ధైర్యము మదిని సిద్ధం బయ్యె .......... ధర నొప్పు మంత్రరత్న ద్వయార్థంబు చెలఁగి యీ ధైర్యంబు చేసెడి. ఈ ద్వయ మాదియం దిందిర కీవు తెలిపితి, విపుడు ఫందియ మేల? ......... సర్వ ధర్మముల నెంచక నన్నె శరణుఁ బొందఁ బాపము లన్ని పొలియింతునని చరమ శ్లోక మపుడు బోధించి తిరు గేమి చెప్పవైతివి నీవు. కాన, సిద్ధాంత వాక్యం బిదే యనుచు నా మదిలోఁ జాల నమ్మితి ........ కపికిశోర న్యాయమాత్రమేని స్వశక్తి నా యెడ లేదు.... మార్జాలకిశోరంబు వలెనె' నన్ను కాపాడుము. 'అవ్యయమై పునరావృత్తిలేని యున్నత పదము నా కొసఁగవే' అని వెంగమాంబ శ్రీకృష్ణుని వేడికొనినది. ఈ వేడికోలులో శరణాగతి పూర్వకమగు భరసమర్పణవిధ మంతయు ఇమిడి యున్నది.

మోక్షకాంక్ష యనగా సంసారమునుండి జన్మకర్మ బంధముల నుండి తరింపజేసి, అవిద్యను పారద్రోలి మోక్షము నొసంగుమని ఇష్ట దైవమును ప్రార్థించుట. ప్రాపంచిక విషయ విరక్తులైన వేదాంతుల పలుకులలో 'అవిద్యా' ప్రసక్తి పదేపదే విన్పించుచుండును. ' అవిద్య' ను పోద్రోలి సద్విద్యా పరమార్థమైన భగవత్తత్త్వమును ఎరుగ దలంచుట యోగుల, యోగినుల దీక్షగా వారివారి జీవిత చరిత్రములను పరిశీలించినచో గోచరించును. అదే ప్రకారముగ వెంగమాంబ ఈ శతకములో 'నే నింక దుష్కర్మముల్ సేయ వెఱతు'ను; ఐనను 'అవిద్య నన్ విడువ' కున్నది. 'బలిసి యవిద్య పాపముల నా చేత నుడుగక కావించుచున్న'ది. 'తెమలక నన్ను వేధించుచున్నట్టి యమితమైన యవిద్య నణచవే' 'మాయాబ్ధి దాటించి మనుపవే' అని పరిపరివిధముల శ్రీకృష్ణునకు విన్నవించుకొనినది.

'దివ్యలోకంబులు దివ్యదేహముల నిచ్చెద నంటివేని ఇవుడొల్ల'ను. 'అవ్యయ బ్రహ్మమైనట్టి నీ లోన పొందక నా జాలి పోదు,' 'అ రీతిఁ

ప్రాణప్రయాణ కాలమున నీవు నా ముందర నిలువవే కృష్ణ!' అని కవయిత్రి ప్రాధేయపడినది. 'పరమాత్మ! నీవు నీ పాదంబులోన, ముక్తిఁ బొందింపు మిమ్ముగ నన్నుఁ గృష్ణ!' అని ప్రార్థించినది. వెంగమ సాహితీసృష్టికి పరమలక్ష్యము ఈ సాయుజ్యముక్తియే!

ఈ మంజరీశతకమున కవయిత్రి యైహికజీవితమునకు సంబంధించిన ముఖ్యాంశములు కొన్ని యప్రయత్నముగా దొరలి యుండుట ఇందలి యింకొక విశేషము.

"ఘనుడవై నిర్హేతుకంబుగాఁ దొలుతఁ-కరుణ నేలితివి తక్కక నన్ను కృష్ణ!
ని న్నొల్ల కావల నేఁబోవు తఱిని-పో నీక ప్రోచి తెప్పుడు నీవు కృష్ణ!
లలితంబులైన లీలలు చూపి నన్ను-కోరి మాలిమి చేసికొంటివే కృష్ణ!
మద్గురు స్వామివై మంత్రోపదేశ-మిచ్చితి వాదియం దిరవుగాఁ గృష్ణ!
అటుమీఁద నాత్మ తత్వార్థ సంగతులు-ప్రియము దీపింపఁ జెప్పితి వీవు కృష్ణ!
తలఁచిన యపుడె ముందఱ వచ్చి నిలిచి-యెడలేని సంతోష మిత్తువే కృష్ణ!
తల్లిదండ్రులు సహోదరులైన నన్ను-లీల నీ కరణి లాలించరే కృష్ణ!
చెలరేఁగి నాకు వచ్చిన యాపదలకు-పరఁగ నీ వుండగా బ్రతికితి కృష్ణ!
నీ వంటి మిత్రు లీ నిఖిలలోకములఁ-జేరి నే వెదకినఁ జిక్కరే కృష్ణ!
ఎపుడేని రూఢి నీ ఋణము నిక్కముగఁ-గోరి నే నీఁకఁ దీర్చికోలేను కృష్ణ!

106 - 115 ద్వి లు

పై పంక్తుల వలన వెంగమాంబ మొదటి నుండియు కృష్ణభక్తు రాలనియు, ఆమెకు వచ్చియుండిన యాపదలు శ్రీకృష్ణుని యనుగ్రహ ముచే తొలగి పోయినట్లును, ఆమెకు సోదరులుండినట్లును, శ్రీకృష్ణుని మిత్రునిగా భావింప గల పరిపూర్ణ భక్తిస్థాయి నామె అందుకొని యుండిన దనియు తెల్లమగుచున్నది. శ్రీకృష్ణునితో ముఖాముఖిగా సంభాషించుచు వెంగమాంబ ఈ రచన గావించిన దేమోయను నంతటి యనుభూతి ఇందలి ప్రతిపదమున పఠితులకు గోచరించుచున్నది.

వెంగమ యీ కృతిని రచియించుటలో తాళ్లపాకవంశ కవుల మంజరీ రచనలు 15 ప్రేరకములై యుండునని తోచును. అయినప్పటికిని వారల మంజరీ కృతులు దివ్య శృంగారవస్తు సమన్వితములై యుండగా, ఈమె రచన భక్తిరసపూరితమగు స్తోత్రముగా జాల్వారినది. ఇది యీ రచనయందలి ప్రత్యేకత. చిట్టచివరి తొమ్మిది ద్విపదలలో కూర్చబడిన అంకితము, ఫలశ్రుతి-ఇత్యాద్యంశములు ఈ లఘుకృతికి చక్కని సమగ్రతను, పరిపూర్ణతను సమకూర్చినవి.

సహజమైన భాషలో, సరళమైన శైలిలో, సామాన్య జనులకును సుబోధమగు రీతిని, పలుకు పలుకున భక్తిరసము చిప్పిలునట్లు రచింప బడిన ఈ మంజరీస్తుతి తెనుగు భాషకు పారాయణ యోగ్యతను ప్రసాదించుచున్న అనర్ఘకృతులలో అగ్రగణ్యమై యున్నది.

'మంగళ మలమేలుమంగ చిత్తాబ్జసారంగ! యిదె నీకు జయ మంగళంబు' అని శ్రీకృష్ణునకు మంగళాశాసనము పల్కుచున్న శ్రీకృష్ణమంజరి కవయిత్రియే తెల్పినటుల 'కృష్ణ జపతుల్యము.'

## వెంగమాంబ కృత శతకములు - జ్ఞాపికలు

1 ఆ పద్యములు ఈ క్రింది సంఖ్యలు గలవి.

1,3 నుండి 24 వరకు, 42,43,44,87, 102

2 చూ. 7 నుండి 16 వరకు గల పది పద్యములు.

3. "శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనమ్।
అర్చనం వందనం దాస్యం సఖ్య మాత్మనివేదనమ్॥
ఇతి పుంసార్పితా విష్ణౌ భక్తిశ్చే న్నవ లక్షణా!"
-శ్రీ మద్భాగవతమ్, VII స్కం; 5 అధ్యా; 23 & 24 శ్లో.

4. "చతుర్విధా భజంతే మాం జనా స్సుకృతినోఽర్జున।
ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ॥
తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తి ర్విశిష్యతే।
ప్రియో హి జ్ఞానినోఽత్యర్థ మహం స చ మమ ప్రియః॥
-భగవద్గీత; VII అధ్యా; 16&17 శ్లో.

5. ఆ పద్యము లీ క్రింద సంఖ్యలు గలవి.
2, 25 నుండి 41 వరకు,45 నుండి 54వరకు, 57,58,78, 79, 80, 84,94,97,98.

6. చూ. శతక సంపుటము (ఆం.ప్ర. సా. అకాడెమీ ప్రచురణ) ప్రథమభాగము, పుట X VIII.

7. చూ. 2, 45 నుండి 54 వరకు 57, 84, 98 - ఈ సంఖ్యలు గల పద్యములు.

8. ఈతడు 'వటమూలమందిరా!' అను మకుటము గల వేదాంత శతకమునకు కర్త. వేమన యోగి యీతనిని తన గురువులలో నొకనిగా పేర్కొనెను. ఈతని కాలము క్రీ.శ. 16వ శతాబ్ది ఉత్తరార్ధమని 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం'లో భావింపబడినది.

చూ. సంపుటము 8, పుట 268

కాని భాషాశైలినిబట్టి ఈత డంతకంటె మిగుల ప్రాచీనుడుగా తోచుచున్నాడు.

9. ఈతడు దత్తాత్రేయ సంప్రదాయానుసారి యగు మహాకవి. పరమానందశతకము, సంపగిమన్న శతకము, దత్తాత్రేయ శతకము - అనునవి ఇతడు రచించిన వేదాంతశతకములు. ఈ కవికాలము క్రీ. శ. 16వ శతాబ్ది ఉత్తరార్ధము.

చూ. ఆంధ్రకవి తరంగిణి, సంపుటము 10, పుట 193.చ

10. చూ. జలక్రీడా విలాసము, సం. 7627 (తాళపత్రప్రతి), యస్.వి.యు.ఓ.రీ.ఇ.లై; తిరుపతి.

11. ఈ శ్లోకము జలక్రీడావిలాస, ముక్తికాంతావిలాస యక్షగానము లలో కలదు.

12. చూ. శతకకవుల చరిత్రము, పుట 320.

13. చిల్లరిగె యోగానందకవి యను ఆధునిక రచయిత రచించిన 'బాలనీతి ద్విపద శతకము' (1915) ఇందుల కపవాదము.

చూ. ఆంధ్ర శతక సాహిత్య వికాసము, పుట 395.

14. శ్రీకృష్ణభక్తురాలైన వెంగమాంబ పేర్కొన్న ఈ యంశము "ఇతడు (శ్రీకృష్ణుడు) మీసములు కలవాడుగా నుండి యుండును" అను సురవరము ప్రతాపరెడ్డి గారి సుదృఢాభిప్రాయమునకు ఉపబలక ముగా నున్నది.

చూ. 'హిందువుల పండుగలు', పుట 67.

15. తాళ్ళపాక అన్నమయ్య రచించిన 'శృంగారమంజరి', ఆయన కుమారుడు పెదతిరుమలయ్య రచించిన 'చక్రవాళమంజరి' -ఈ రెండును తాళ్ళపాక కవుల మంజరీరచనలు.

## యక్షగానములు

తరిగొండ వెంగమ చేపట్టిన సారస్వత ప్రక్రియలలో 'యక్షగానము' నకు ఒక ప్రత్యేకత కలదు. కవితారచన ప్రారంభించిన నాటినుండి చివరి వరకును వెంగమ యక్షగానములను రచించుచు వచ్చినది.

ఈ కవయిత్రి రచించిన యక్షగానములు తొమ్మిది. అవి:

1. నారసింహ విలాసకథ (అలభ్యము)
2. శివనాటకము (శివవిలాసము, లేక శివపారిజాతము)
3. కృష్ణనాటకము (బాలకృష్ణ నాటకము)
4. పారిజాతాపహరణము (విష్ణుపారిజాతము)
5. చెంచునాటకము (చెంచుచెలికథ)
6. రుక్మిణీ నాటకము ( అలభ్యము)
7. గోపికానాటకము (గొల్లకథ, లేక గొల్లకలాపము. అలభ్యము)
8. జలక్రీడా విలాసము
9. ముక్తికాంతా విలాసము

పై తొమ్మిదింటిలో 1,6,7 సంఖ్యలు గలవి నేడు అలభ్యములు. తక్కినవానిలో కొన్ని ముద్రితములుగను, మఱికొన్ని అముద్రిత వ్రాతప్రతుల రూపమునను లభించుచున్నవి. వెంగమ యక్షగాన కృతులలో పెక్కింటికి రెండు, మూడు పేళ్ళుండుట గమనింపదగిన

యంశము. పై తొమ్మిదిటిలో మొదటి మూడు తరిగొండలో నుండిన కాలమున రచింపబడినవి. తక్కిన ఆఱు ఆమె తిరుమల చేరిన పిమ్మట రచితములు. వీనిలో కొన్ని స్వతంత్రములు, కొన్ని అనుసరణములు. శివనాటకము, చెంచునాటకము, ముక్తికాంతావిలాసము - వీనియందలి కథావస్తువు కవయిత్రిచే స్వతంత్రముగా కల్పింపబడిన దగుటచే ఈ మూటిని స్వతంత్రములుగా పేర్కొన వచ్చును. భాగవతాది పురాణముల యందలి కథలను గ్రహించి వ్రాసిన యక్షగానములను అనుసరణములుగా పేర్కొనవచ్చు. ఇవి నారసింహ విలాస కథ, కృష్ణ నాటకము, పారిజాతాపహరణము, రుక్మిణీ నాటకము, గోపికా నాటకము, జలక్రీడా విలాసము అను ఆఱు.

వెంగమాంబ యక్షగానములను కథాస్వరూపమును బట్టి నాలుగు విధములుగా విభజింపవచ్చును.

1. నృసింహ కథాత్మకములు రెండు: i) నారసింహ విలాస కథ
ii) చెంచు నాటకము.
2. కృష్ణకథాత్మకములు నాలుగు: i) కృష్ణ నాటకము ii) పారిజాతాప హరణము iii) రుక్మిణీ నాటకము iv) జలక్రీడా విలాసము.
3. శివ కథాత్మకము ఒక్కటి: శివ నాటకము.
4. వేదాంత విషయకములు రెండు: i) గోపికా నాటకము ii) ముక్తికాంతా విలాసము.

## నృసింహ కథాత్మకములు

నృసింహ కథాత్మకములైన యక్షగానములలో చెంచునాటక మొక్కటి లభ్యము. నారసింహ విలాసకథ అలభ్యము. అలభ్యమైన యీ నారసింహ విలాసము వెంగమ రచించిన తొలి యక్షగానము. తరిగొండలో వెలసియున్న నృసింహుడు హిరణ్యకశిపుని సంహరించి ప్రహ్లాదుని పరిరక్షించిన వృత్తాంత మిందు ఇతివృత్తముగా స్వీకరింప బడియుండును. 'నృసింహ నాటక' మని దీనికి నామాంతర మున్నట్లు తెలియుచున్నది. వెంగమాంబ తరిగొండ నృసింహ శతకమును రచించిన అనంతరము ఈ యక్షగానమును రచించినది[1]. శతకమును రచించిన వెంటనే

యక్షగాన ప్రక్రియను స్వీకరించుటలో ఈ ప్రక్రియ యెడల ఆమెకు గల అభినివేశము, నైపుణ్యము తెల్లమగుచున్నవి.

ఈ 'నారసింహ విలాసకథ' ద్విపద కావ్యమని నిడుదవోలు వేంకటారావుగారి యభిప్రాయము.2 కాని ఈ యూహ కేయాధారమును కానిపింపదు.

## చెంచునాటకము

'చెంచునాటక' మను పేరు చెవిని బడగానే ఆంధ్రదేశమందలి ఆబాలగోపాలమునకు చెంచులక్ష్మి, అహోబల నారసింహుల ప్రణయగాథ స్ఫురణకు వచ్చును. కాని వెంగమాంబ రచించిన యీ చెంచునాటకము ఆ కథ కలది కాదు అయినను తరిగొండ లక్ష్మీ నృసింహుని మరదలైన చెంచుచెలియొక్క కథ యగుటచే ఇది నృసింహ కథాత్మకముగా పరిగణింపబడినది ఇందలి కథ స్వకపోల కల్పితము చెంచులక్ష్మికి సాక్షాత్తు చెల్లెలైన చెంచిత, ఆమె పెనిమిటి యగు చెంచు నాయుడు ఇందు ప్రధాన పాత్రలు. చెంచువారి ఆచార్య వ్యవహారములు ఇందత్యంత సహజముగా, సమగ్రముగా వర్ణింపబడి యుండుట చేత 'చెంచునాటక' మను నామధేయం మీ యక్షగానమునకం సార్థకముగనున్నది.

**కథాస్వరూపము :**

శేషాచలమందలి 'తుంబురుకోన' యను కోనలోని చెంచు గూడెమునుండి ఒకనా డొక చెంచు యువతి జాతిశృంగార ముట్టిపడునట్లు చక్కగా ముస్తాబై, కొడుకును పైటలో కుదురుగా గట్టుకొని, విల్లమ్ములు దాల్చి, తన పతి యైన చెంచునాయునితో గూడి వేటకై బయలుదేరును. అట్లు వేటాడుచు, కొంతసేపటికి తన పెనిమిటిని పొడగానక అందందు వెదకుచు తిరుమలపురికి వచ్చి మగనిని ఎలుగెత్తి పిలుచును.

శ్రీ వేంకటేశ్వర మందిర ద్వారపాలురు (జయ విజయులు) చెంచితను పిలిచి యామె వృత్తాంతము నడుగుదురు. ఆ యువతి యిట్లు చెప్పదొడగును. చెంచుల కెల్ల ముఖ్యుడు శిఖినాయకుడు. అతని కిద్దరాడుబిడ్డలు. అందు పెద్దది యైన చెంచులక్ష్మిని తరిగొండ నృసింహుడు పరిణయమయ్యెను. రెండవ కూతురు తాను. వింధ్యాద్రి నుండి యేతెంచిన చెంచుయువకుడు తనను పెండ్లాడెను. తా నాతనికొరకే వెదకుచుంటి ననియు, చూచి యున్నచో చెప్పుడనియు చెంచిత ద్వార పాలకుల నడుగును. వారాతని గురుతు లెట్టివో తెల్ప గోరుదురు.

పేడిగడ్డము, మిట్టనొసలు, కుంటిచేతులు, గొంటుమాటలు, పిల్లికన్నులు, ఉంటపొక్కిలి, టూసపిఱ్ఱలు, దొప్పచెవులు, బానకడుపు గలిగి గూనిగా, పొట్టిగా నుండుననీ, గట్టివిల్లమ్ములు పట్టియుండునని.తరిగొండ హరికి షడ్డకుడని చెంచిత తన పతి లక్షణములను తెల్పును. తా మట్టి వానిని జూడలే దనియు, చెంచువారు విహరించెడి , చోటులను దెల్పవలసిన దనియు ద్వారపాలకు లడుగుదురు. చెంచిత తమవారి నివాసస్థలములను, విహారభూములను, ఆ యా దీవుల, సంబ్రముల వృత్తాంతములను, అందలి విశేషములను వారలకు వివరించును.

అనేక పర్వతములు చూచి వచ్చిన తన కీ పర్వతము మహా వింతయై యున్నదని చెంచిత అచ్చెరు వందును. నాల్గుదిక్కుల చదరమై, ఇరువైపుల పెట్టెలు చేర్చినట్లున్న యీ కొండ లేవి?' అని చెంచిత ప్రశ్నించును. 'ఇవి కొండలు కావు. స్వామి వేంచేశే తిరువీధులకుఉభయ పార్శ్వములయందు పరమభాగవతులు నివసించియుండే మందిర శ్రేణు'లని తెల్పుదురు. ఇట్లే కోవెల ప్రాకారములను పలక కొండ లని, కోవెల గోపురములను నిడివికొండ లని, 'ఆనంద నిలయము'ను నిగనిగ మెరసే కూచగుట్ట లని భ్రాంతి నొంది ప్రశ్నించిన చెంచితకు ద్వార పాలకులు వాటి నిజస్వరూపమును వివరింతురు. ముగ్ధయగు చెంచితయొక్క మఱొక ప్రశ్నకు సమాధానముగా, అచ్చట తిరుగాడే వా రందరు హరికి సేవ జేయు పరమభక్తులనియు, వేటాడ దగిన రెండుకాళ్ల మృగములు గారనియు జయవిజయులు పల్కుదురు.

అటుపిమ్మట ఆ చెంచుచెలి తమ కొలమువారి పెండ్లిండ్ల విధములను విశదీకరించును. 'ఓ రన్నా! నేను మా తుంబురుకోనలో నొక వేంకటేశ్వరుని జూచుచుందును. ఆ వేంకటేశ్వరు డధికుడో? ఈ వేంకటేశ్వరు డెక్కు డో? చూతును గాక' యని తెలివిగా అడుగును. వారంతకంటె తెలివిగా ప్రసంగమును మార్చి తుంబురు కోనలో నుండు విశేషములను. ఆ కోనకు వేంచేసెడు వేంకటేశ్వరుని స్వరూపమును, చెంచులాయనను సేవించు విధమును తెల్ప గోరుదురు.

అటుపిమ్మట జయవిజయులు స్వామివారిని సందర్శింప ననుమతింతురు. ఇంతలో చెంచునాయుడు వచ్చి చెంచితను దర్శనమునకు పోనీయ్యక నివారించును. బుడుతని పెనిమిటి కిచ్చి చెంచిత గెనుసు గడ్డలు దెచ్చుటకై అడవిలోనికి పోగా, పులి వచ్చి నాయుని బెదరించి బిడ్డ నెత్తుకొనిపోవును. నాయుని పెడబొబ్బలు విని వేటనుండి పరువిడి వచ్చిన చెంచిత పుత్రశోకవివశయై మూర్ఛిల్లును. 'నీ విట్లు బడిపోతే నాకూటి కెట్లు?' అని నాయు డామెను బట్టి యూడ్చును. తెప్పిరిల్లిన చెంచిత 'కొడుకును దెచ్చియి'మ్మని పరిదీనయై వేంకటేశ్వరుని పరిపరి విధముల వేడుకొనును.

వేంకటేశ్వరుడు ద్వారపాలకునిపై నా వేశమై 'ఓ చెంచుభామా! నన్ను చూచెద నని పల్కి చూడకపోయి నందులకు పులి నీ కొడుకు నెత్తుకొని పోయినది. బుద్ధి దెచ్చుకొని శీఘ్రముగా ముడుపు దెచ్చి ముందరబెట్టి కొడుకు నెత్తుకొని గూడెము చేరుకొనుము' అని వాక్రుచ్చును. సద్రూపబలములు స్థాపించియున్న చిద్రూపధన మున్న చోటును, అది సాధించు విధానమును చెంచితకు సంగ్రహముగా దెలియజేయును. 'ఎంత సాహస మొనర్చియైనను ఆ ధనమును సంపాదించి యిత్తు'నని చెంచిత అంగీకరింపగా, శ్రీనివాసుడు చెంచిత కుమారుని తెచ్చి యిచ్చును. చెంచుముద్దుగుమ్మ మిగుల హర్షించి, సుతుని ముద్దులాడుచు, మ్రొక్కుబళ్లన్నియు నెరవేర్చి, స్వామివారు కోరిన మూలధనమును సాధించి సమర్పించును. ఆనందనిలయస్థుడగు శ్రీనివాసునకు మంగళములు పాడుచు చెంచిత తన భర్తతోగూడ గూడెము జేరుకొనుటతో నాటకము సుఖాంతముగా సమాప్తమగును.

ఇందలి యితివృత్తము పూర్తిగా కల్పితము. లోకములో అది వరకు సుప్రసిద్ధమై యున్న చెంచునాటకమునకు దీటుగా, శేషాచలము కథారంగముగ నొక 'చెంచు నాటకము' ను కవయిత్రి సృజింప సంకల్పించినటులు దీనిని బట్టి తోచుచున్నది. ఇందలి నాయిక 'చెంచులక్ష్మి'కి చెల్లెలనుట యూహ కాధారము. చెంచులక్ష్మి యొక్క చెల్లెలిందు నాయిక యన్నప్పుడు వేంకటేశ్వరుడిందు నాయకుడేమో యని తొలుదొల్త స్ఫురింపక మానదు. కాని ఈ కవయిత్రి యిందు వేంకటేశ్వరు నొక పాత్రగా గాక, పరమపురుషుని గానే ప్రదర్శింప దలచినది. కావుననే వింధ్యాద్రి నుండి దిగి వచ్చిన ఒకానొక చెంచుయువకు డిందు నాయకుడుగా కావింపబడినాడు. ఇందువలననే ఈ యక్షగాన నాటకము శ్రీవేంకటేశ్వరుని 'శృంగారలీల' గా గాక ఆ జగన్నాయకుని 'అనుగ్రహలీల' గా అవతరించినది. ఇది ఈ కవయిత్రి స్వతంత్ర కల్పనాశక్తి కొక నదమల నిదర్శనము!

కథను కల్పించుటవలెనే కథను పెంచుటకూడ ఈ కవయిత్రికి కరతలామలకమైన విద్య. ఏదే నొక ప్రశ్నచేతనో, వాక్యముతోనో, అవకాశమును సృష్టించి, తద్వారా కథను పొడిగించుట ఈ యక్షగానమున రెండు మూడు స్థలముల గన్పట్టును. ఇందుల కొకటి రెండుదాహృతులు.

చెంచిత వేంకటేశ్వరమందిర ద్వారపాలురకు తన భర్తయొక్క ఆనవాళ్లన్నియు తెలిపి, అట్టివానిని 'మీరు చూచిన చెప్పరే ధీరులార!' (పుట 3) అని యర్థించును. వా రటువంటి వ్యక్తిని చూడ లే దందురు. అంతటిలో నూరుకుండక.

"మంచి దామాట లిటు లుంచు; చెంచువారు
నిలిచి విహరించు చోటుల నిజముగాను
నీవు దెలుపవె వరుసగా నీరజాక్షి!" 4. పుట.

అని యడుగుదురు. ఇట్లడుగుటచే తరువాతి కథావిస్తృతికి చక్కని అవకాశము చేకూరినది.

నందిని 'మీ ప్రొద్దున జాడేదీ కనుబడదా!' (పుట 20) యని ద్వారపాలుర ప్రశ్నింపగా, దాని 'మీ మెప్పుకై వృత్తాంతములు చెప్పి మురియుట యెట్టిదే.

ఇట్టే చెంచిత తన విద్దెను పొట్టన పెట్టుకొన్న పులిని సమయించ దలచి, అది యెటువైపు పోయెనో చెప్పు గోరగా 'వినవె చెంచుభామా! ఆ పులి పోయినజాడ నే చూడలేదే' (పుట 24) యని చెంచునాయుడు పల్కెను. ఈ వాక్యము ఆ పాత్రకు ఉచితమై యుండుటే గాక, ఈ నాటకములో 'నిర్వహణా'నుకూలమగు మలుపు ఏర్పడుటకు హేతువై యొప్పినది.

పరిశీలించి చూచినచో ఈ కథలో రెండు ప్రధాన భాగములు గోచరించును. అందు మొదటిది ఆరంభమునుండి చెంచునాయుని ప్రవేశమువరకు గల కథాభాగము. రెండవది అటనుండి చివరివరకు గల కథాభాగము.

**పాత్రచిత్రణము :**

కథను చక్కగా, నాటకోచితముగా సంవిధాన మొనర్చుటలో పాత్రలకు మిగుల ప్రాధాన్యము గలదు. ఈ దృష్టితో ఇందలి పాత్రచిత్రణ పరికింపదగియున్నది. ఈ కథయందలి పాత్రలు నాలుగు. అందు చెంచిత, చెంచునాయుడు అనునవి ప్రధాన పాత్రములు; మానుషములు. తక్కిన రెండును ద్వార పాలుర (జయవిజయుల) దివ్యపాత్రలు.

చెంచిత: తుంబురుకోనయందలి ప్రకృతి సౌందర్యము చిదిమి పెట్టినట్లు చూపరులకు గోచరించెడి సహజసుందరాకృతి గల చక్కని చుక్క. విల్లమ్ములు దాల్చి వేటాడుటలో ఈమె కడుదిట్ట. పెనిమిటి యెడల ప్రేమాదరగౌరవములు గల ఉత్తమయిల్లాలు. తమ కులస్థుల ఉనికిపట్టులను, విహారసీమలను, ఆచారవ్యవహారములను అభిజ్ఞతతో, అభినివేశముతో వర్ణించి చెప్పగల కథకురాలు. అయినను తా నెఱిగిన ప్రపంచము దక్క తక్కిన లోకము తెలియని ముగ్ధనాయిక. కావుననే

వేంకటేశ్వరుని కోవెలను, తత్పరిసర గృహములను వేర్వేరు కొండలు గాను, వృషభావేషములతో ఒప్పుచున్న నానాదేశాగత భక్తులను రంగురంగుల మృగములుగాను భ్రమపడినది. ఐనను ఈ యువతి సందర్భోచితముగా స్త్రీ సహజమైన చమత్కార చాతుర్యమును ప్రదర్శింప వలంతియే! తన సోదరిని ప్రేమించి పెండ్లి యాడిన తరిగొండ నరమృగేంద్రుని గూర్చి 'మిక్కిలి వగకా'డని, 'మీ సాల పో' తని ద్వారపాలురతో పల్కిన పల్కుల యందు ఆమెలోని ' పరియాచకాల మఱదలితనము' ప్రస్ఫుట మగుచున్నది.

కానుకలు దేకుండగా వేంకటేశ్వరుని జూడ నీయ మని ద్వార పాలకులు అడ్డు పెట్టినపు డీమె 'ఓ రన్నా! మీ వేంకటేశ్వరు డధికుడో, మా వేంకటేశ్వరు డెక్కు డో చూతము గాక!' యని సమయస్ఫూర్తి యుట్టిపడ బల్కినది. తుంబురుకోనలో తాను జూచుచుండెడి వేంకటేశ్వరుని స్వరూపమును వర్ణించుటలో ఆ స్వామి కిరీటమును 'మినమిన మెరసేటి' దని మకరకుండలములను 'మొసలిపిల్లల వంటి వేవో' అని, చక్ర శంఖములను 'గుండూటి దొక్కటి కూసేటి దొకటి' అని, పీతాంబరమును 'పసపుబూసిన పాత'యని పేర్కొనుటవలన ఆమె సహజ ప్రాకృత స్వభావము చక్కగా వెల్లడి యగుచున్నది.

భర్త వేంకటేశ్వరుని దర్శింపనీయక పోయినను ఈవిడ అతని యాజ్ఞ మీరక అతని కొరకు గెనుసుగడ్డలు తేబోవుటలోను, పులి బిడ్డ నెత్తుకొని పోయినను చలింపని మగని వెఱ్ఱితనమునకు అవేశము గల్గినను అతని మందలింప కుండుటలోను ఆమె పతివ్రతా ధర్మము ప్రకటిత మైనది. పులిని జంపబూనుటలో సాహసగుణము, 'కొడుకో! కొడుకో!' యని కలవరించి పడుటలో అచ్చమగు మాతృత్వము, చివరకు వేంకటేశ్వరుని వేడుకొనుటలో తీవ్రభక్తి విశ్వాసములు, పుతుడ్రు లభించిన పిమ్మట మ్రొక్కుబళ్ల నన్నిటిని నెఱవేర్చుటలో చెంచిత యొక్క నిజాయతీ వ్యక్తమగుచున్నది.

ఇట్లు వెంగమాంబా కవయిత్రి ఈ 'మొలక నవ్వుల చెంచు ముద్దులగుమ్మ'ను పులుగడిగిన పుట్టురత్నముగా సృజియించి, తత్కాంతి పుంజముచే ఈ నాటకకుంజమును ప్రకాశింపజేసినది.

చెంచునాయుడు: ఇతడు వింధ్యాద్రినుండి దిగివచ్చినవాడు. చెంచుచెలిని చేపట్టుటవలన తిరిగొండ నరహరికి షడ్డగుడై ఉత్కృష్ట బంధుత్వమును బడసిన అదృష్టశాలి! ఈతని యాకృతి చెంచిత నోట ఇట్లు చెప్పింపబడినది.

"వాఁ డెట్టి వాఁ డంటె పేడిగడ్డము వాఁడు
మిట్టకొనలు వాఁడు, పొట్టి వాఁడు
కుంటిచేతుల వాఁడు, గొంటుమాటల వాఁడు
పిల్లికన్నుల వాఁడు, కల్లరీఁడు
ఉంటపొక్కిలి వాఁడు, ఊచపిళ్ళల వాఁడు
దొప్పచెవుల వాఁడు, దుండగీఁడు
బానకడుపు వాఁడు, గూనిపోయిన వాఁడు
గట్టివిల్లమ్ములు పట్టినాఁడు" 3 పుట.

ఇక ఈతని స్వభావముకూడ స్వరూపమునకు దగినట్లుగానే యున్నది. అడవిలో ఉడుత వెక్కిరింపగా వెరచి గడగడ వణకిన పిఱికివాడితడు. కలికి చూపుల చెంచిత తన ప్రక్క నుండినచో ఇతనికి కొండంత ధైర్యము, వేంకటేశ్వరుడు చెంచితను చూచినచో ఆకర్షించు కొను ననెడి దిగులుగుండె యతనిది. అందుచేతనే ఆ స్వామిపై ఈ క్రింది విధమున దోషారోపణ చేసినాడు.

"వావి వర్తన లేక యీ వేంకటేశుండు
పరఁగ మేనత్తను బట్టె నంట
అది గాక బహువల్లవాంగనామణులను
కరఁగించి సిగ్గులు చెఱచె నంట
చక్కని పడుచులై మ్రొక్క వచ్చిన తాను
మెడఁ బొట్టు గట్టక విడువ డంట

ఆ నాడు మీ యమ్మ, యగు వెంకటేశు జూచి
మోహించి పట్టక పోయె నంట

గాన నీ పుట్టిల్లు వాయించు గొంచెమేని
నమ్మ మంటివిందు. వారిని విన్న మగడి
యుంట టక్కేటి? తరిగొండ హరిని జూడ
వింత పోకలు, ఏటు నాకు చెంచుభామ! 20 పుట.

ఇంతటి యమహాయోపుడు, అనుమానపు పక్షి యీతడు! కన్న కొడుకును పులి యెత్తుకొని పోవుచుండగా కన్నులారా గాంచు చుండియు కాపాడుకో జాలని అసమర్థు డీతడు. ఇందుచే నితనికి పిల్లమ్ముల్లు కేవలాలంకారములే యని తెలియును. ఆకలికి తాళజాలని వారిలో మాత్రము ఈ చెంచునాయు డగ్రగణ్యుడు. కావుననే పుత్రదుఃఖితయై మూర్ఛిల్లిన భార్యను కనికరించుటకు మాఱు కూటి కక్కుర్తితో 'గుటికెడు తేటగంజి యైనను తెచ్చి పోయు' మని పట్టి యీడ్వ గలిగిన ఘనుడైనాడు! ఇన్ని యవలక్షణము లున్నను ఈతడు తరిగొండ నృసింహునియందు అంతో యింతో కులక్రమాగతమైన భక్తిప్రపత్తులు గలవాడే!

ఈ లక్షణము లన్నిటినిబట్టి చూడగా ఈ కథయందు ప్రాముఖ్యము వహించిన చెంచుయువతి పాత్రమును మఱింత ప్రస్ఫుటముగా దీపింప జేయు నిమిత్తము ఈ రచయిత్రి చెంచునాయుని పాత్రను పని బూని యింతటి వైరూప్యము (contrast) గలదిగా కల్పించి పోషించినదని నిశ్చయింప వీ లగుచున్నది.

జయ విజయులు: వీ రిరువురు శ్రీ వేంకటేశ్వరుని మందిర ద్వారపాలకులు. చెంచితను తమ యొద్దకు రప్పించి, కుతూహలముతో ఆమె వృత్తాంతమును, వారి కులాచారాదికమును వరుసగా అడిగిన వారు వీరు. వీ రిరువురు లేనిచో ఈ కథకు పెంపే లేదు. అట్లే ఈ దివ్య పాత్రలకు బదులుగా ఆలయాధికారులో, ఆచార్యులో అయిన ఇంకొక యిర్వురను (మానవ పాత్రములను) ఆ స్థానమున నిలిపి యుండినచో ఈ నాటక మింత సొంపుగా అలరుచుండెడిది కాదు.

శ్రీరాగ అంబుజాక్షిబాల ముచ్చట ప్రవేశము ఈ కథారంగమై రాణించుటకును ఈ పరమార్థ కారణభూతములు. స్వామివారు ఈ యిద్దరిని గెలిచి 'ఆవేశము' వచ్చు చెంచెతతో భాషించుట యను కథాంశము వలన వీరి దివ్యత్వము ఏదడ మగుచున్నది. రెంగనాంబ ఈ చెంచెత ఈ యిద్దరును ద్వారపాలకులను ఈ కృతియందలి నాయికయును పనాతుప్ప అగు నవరసపాత్రయుబుగా తీర్చి దిద్దినది.

**వర్ణనలు :**

ఈ యక్షగానమందలి వర్ణనలలో ముఖ్యమైనవి: i) చెంచెత స్వరూపవర్ణన (పుటలు 1,2), ii) చెంచువారల పెండ్లిండ్ల వర్ణన (పుట 11), iii) తుంబురుకోన వర్ణన (పుట 14) iv) తుంబురు కోనకు వచ్చేయు వేంకటేశ్వరుని స్వరూపవర్ణన (పుటలు 15,16), v) చెంచులు వేంకటేశ్వరుని సేవించు విధము (పుటలు 16-18). ఈ వర్ణనలలో రెండవ దగు చెంచువారి పెండ్లిండ్ల వర్ణన అలతి పలుకులలో దాదాపు ఇరువది ద్విపదలలో సహజ సుందరముగా వర్ణింపబడి యున్నది. మచ్చునకు ఈ క్రింది పంక్తులు తిలకింప దగియున్నవి.

"పెండ్లికుమారుని పెండ్లికూతురును-పెండ్లిపందిటిలోకి పిలుచుక వచ్చి
పళ్లైన దంతిదంతముల కమ్మలును-కళ లీను సంకుంగరములు, బంది
గురిగింజదండలు, కోరదండలును-విరజాజి, కస్తూరి, వెల లేని పునుగు
కోరిన పారుటాకుల చీర లిచ్చి-గారవం బెసఁగ శృంగారంబు చేసి
పల నొప్ప తప్పెట్లు వాయించికొనుచు-పాలుపొంద నడిమింటి పొద్దుందఁ జూచి
మెఱయు దంతపుబొట్టు మెడను గట్టించి-పఱఁగ పువ్వుల తలంబ్రాలు పోయించి
గూడె గూడెము వారు కూడందు గుడిచి-కూడఁగట్టుదురు మక్కువను దీవించి
తరిగొండ నరహరి దయచేత మేము-నెళవుగా పెండ్లిండ్లు నెఱవేర్తు మెపుడు

11 పుట.

ఈ వర్ణన కవయిత్రి లోకానుభవమున కొక చక్కని నిదర్శనము. చెంచునాటకమందలి వర్ణనలలో కెల్ల మకుటాయమాన మైనది తుంబురుకోన

వర్ణన. ఇందు ప్రకృతి రామణీయకమే గాక పుణ్యాశ్రమోచిత వాతావరణము కూడ ప్రతిబింబించుచున్నది. ఇది యొక ముఖ్యవిశేషము. సహజవైరము గల ప్రాణులు తమ జాంతవ స్వభావమును వీడి మైత్రితో కలిసి మెలసి సంచరించుచున్నట్లిందు వర్ణితమైనది. ఇది నన్నయాది ప్రాచీన మహాకవుల రచన లందలి పుణ్యాశ్రమ వర్ణనములను జ్ఞప్తి కెలయించుచున్నది.[3]

"........కమ్మనైన తుంబురుకోనలో నెపుడు
వల నొప్పఁగా జాతివైరముల్ విడిచి-పులులు నావులుగూడి పొదలలో మెలఁగు
కరి సమూహములును కంఠీరవములు సరసంబు లాడుతు చరియింపుచుండు
శశఖడ్గ వరాహ శరభ భల్లూక గండభేరుండాది ఘనమృగావళులు
పరువడి నానావిధ భుజంగములు-గరుడాదిగా విహంగ సమూహములును
గొనకొని నిరతంబు కూడి యాడుచును-వన మెల్ల విహరించు వైరంబు లేక'

4పుట.

ఇట్లు క్రూర, సాధు జంతువులు వైరభావము వీడి విహరించుటకు అక్కడ నివసించుచుండిన మునుల అహింసా ప్రభావమే మూల కారణము.[4] ఆ మునులు కూడ ఇందు వర్ణింపబడియున్నారు. చూడుడు:

"మహిమ నొప్పు గంగాసమానంబు లగుచు-బహుపుణ్యతీర్థముల్ ప్రవహించునచట
మును లంద రా తీర్థములయందు మునిఁగి-పనిఁ బూని తమ తమ పర్ణశాలలను
కొందరు కనుమూసి గొణుఁగు చుండుదురు-కొందర రం దేమేమొ కూయు చుండుదురు
కొంద రచ్చట గుమిగూడి కుంపట్లు-ముందర నిడుకొని మ్రొక్కు చుండుదురు
కొందరు వాయువుల్ కుంభింపుచుంద్రు-కొందరు కనుగ్రుడ్లు కూర్చి నిల్చుదురు"

14 పుట.

తుంబురుకోన ఈ 'కవితా తపస్విని' తప మొనర్చిన దివ్యస్థలము. కావున పై వర్ణన యంతయు ఈమె స్వానుభవజనితము. ఇం దెంత మాత్రము అతిశయోక్తి లేదనియు, తుంబురుకోన అట్టి సిద్ధక్షేత్రమే యనియు ఈ శతాబ్ది ప్రథమ పాదమున (క్రీ.శ. 1913 కు పిమ్మట)

ఆ తుంబురుకోనయందు తప మొనరించియున్న శ్రీ మళయాళస్వాముల వారి వాక్యములు నిరూపించుచున్నవి.[5]

తుంబురుకోనకు వేంచేయు వేంకటేశ్వరుని స్వరూపమును ఈ కవయిత్రి చెంచిత కలవాటైన పలుకుబడిలో ఆ పాత్ర స్వభావాను గుణముగ ముగ్ధమోహనముగ వర్ణించి నేర్పు చూపినది.

"విన రన్న నే జూచు వేంకటేశ్వరుఁడు-మినమిన మని చాల మెరసేటి దేమొ
ఘట్టిగా తలమీద గదియించి దాని-చుట్టు పూదండలు చుట్టుకున్నాఁడు
లలి మించు మొసలిపిల్లలవంటి దేమొ-తళుకుగా చెవులకు తగిలించినాఁడు
పచ్చప్రచ్చటి దేమొ బహుశాన మేన-నచ్చుగా నందుండు నతికించినాఁడు
నల్లని కూసేటి గట్లు శ్రీపాద-పల్లవములయందు భరియించినాఁడు
గుండూటి దొక్కటి కూశేటి దొకటి-రెండుచేతులను ధరియించి యుండాఁడు
యెడమచేతను కత్తి యిరవందఁబట్టి-కుడిచేత ధరణిపై గురిబెట్టినాఁడు
నల్లని మొయిలు వర్ణము గలవాఁడు-తెల్లనై తగు పట్టె తిరుమణి వాఁడు
కలికి చూపుల గొప్ప కన్నులవాఁడు-మొలక నవ్వులవాఁడు ముద్దులవాఁడు
పసపుఁ బూసిన పాత పై హెూయల్-మీఱ విసువక వలెవాటు వేసి వేడుకను
ప్రాకటంబుగ నొక్క పక్షిపై నెక్కి-మా కోనలకు వచ్చు, మ మ్మెల్ల మెచ్చు'
నలు వొప్ప తరిగొండ నరసింహుఁ డంచు-వెలయ మ మ్మేలు
నా వేంకటేశ్వరుఁడో" 15,16 పుటలు.

ఇట్లు చెంచిత వర్ణించిన పై వేంకటేశ్వర వర్ణనలో 'వర్ణనీయ వస్తువొకటే యైనను వర్ణించెడు వ్యక్తినిబట్టి వైవిధ్యము గోచరించు' ననెడి విమర్శక సూత్రము సృష్టియైన పాత్రకు, స్రష్టయగు కవయిత్రికి చక్కగా సయన్వయించుచున్నది.

ఇందలి వర్ణనలలో చిట్టచివరిది వేంకటేశ్వరుని చెంచులు సేవించు విధము. చిఱునవ్వులు నవ్వుచు తుంబురుకోనలోనికి విహరింప వేంచేయు వేంకటేశ్వరుని అచ్చటి చెంచులు ఆహ్వానించి పాదములు గడిగి, పొరుటాకుల పందిరిలోనికి తోడ్కొని పోయి, మల్లెపూవుల పాన్పుపై గూర్చుండ జేసి, పొగడపూలందండలు వేసి, తియ్యని మామిడి పండ్లరసము, తేటజుంటి తేనెలు భుజింప నిచ్చుచుందురు. వేంకటేశ్వరుడు తా నొడిగట్టుకొనివచ్చిన కర్పూరపు విడెమును కరకర నమలి చెంచితల



The Lord of Seven Hills with His Consorts

కిచ్చి కోడెగాడై వారందరితో గూడి కొండలలో కోనలలో వేటాడబోవు చుండును. ఆ దేవుడు వేటలో అలసి నపుడు వారు అలరుల శయ్యను పరచి, అందాయనను పరుండ జేసి, పునుగు పుప్పొడులతో మై పూతలు బూసి, పూలలో పూజించి ఫలము లర్పించి నెమలీకె కుచ్చెలను విసరుచు పాదసేవ చేయుచుందురు.

బడలిక దీరిన వేంకటేశ్వరుడు చెంచు సుబ్బెతలతో సరసాలాడుచు, ఏలలో పాడుచు, మదనతంత్రాసక్తితో వారలను కదియుచు కేకలు వేసి నవ్వుచుండును. మనసు రంజిలగా చెంచుగూడెమును జేరుకొని, కస్తూరి పునుగుచట్టలు జాజిపూల చెండ్లు, సక్కకొమ్ము మున్నగు కానుకలను గై కొని గరుడునిపై నెక్కి తిరుమల ప్రాంతమున కరుగుచుండును. అని యీ రీతిని చెంచిత తాను కనులార గాంచిన విధమును నోరార వర్ణించి చెప్పినది.

వెంగమాంబ తుంబురుకోనయందు తప మొనర్చుచుండిన కాలమున వేంకటేశ్వరు డామె కడకు వచ్చి ఆ తపస్విని పూజలను అందుకొని యేగెడి వాడని ఐతిహ్యము కలదు. ఆ స్వానుభవమునే కవయిత్రి పై వర్ణనమున ధ్వనింప జేసియుండెనని భావింపవచ్చును. ఈ దృష్టిని ఈ వర్ణన కొక ప్రత్యేకత కలదు.

**ఇతర విశేషములు :**

ఈ కృతి మొదట ఈ కవయిత్రియొక్క తదితర యక్షగానము లందు వలెనే కవి కావ్యనామాంకిత మగు పద్యము కలదు. కాని ఇష్ట దైవప్రార్థనాదికము లేదు. ఈ ముద్రితప్రతికి ఆధారమైన ప్రతిలో వ్రాయసకాని యేమరుపాటు వలన ఆ యిష్టదేవతా ప్రార్థన లోపించి యుండును.

ఇందలి దరువులు తాళప్రధానములై శ్రావ్య మగు శైలిలో నినదించుచున్నవి. ద్విపదలు ఆ యా విషయముల కథనమునకు, వర్ణనమునకు చక్కగా ప్రయుక్తములై యున్నవి. వచనములు నాతిదీర్ఘములై సంవాద లక్షణమును చక్కగా పరిపోషించుచున్నవి. సీస, గీతాది పద్యములు అలతి యలతి పలుకులతో నలరుచు అర్థావగతికి

దోహద మొనర్చుచున్నవి. మొత్తముమీద ఈ యక్షగానము పాత్రోచిత భాషావైవిధ్యముతో, చక్కని 'నాటకపువాటము' గలిగి నిరాడంబర నిర్మలశైలిలో అలరుచున్నది.

'వ్రాలా శబ్ధలు తప్పులు చాలంగా గలవు' అన్నట్లు ముద్రితప్రతి పద, పాద లోపములకు, అక్షర స్ఖాలిత్యములకు నెలవై యున్నను, రసాస్వాదనకు అవి అవరోధములు గానేరవు.

**కృతిసందేశము:**

వెంగమాంబ ఈ యక్షగానమును రచించుటలో ఉద్దేశించిన ప్రయోజనముల నీ క్రిందివిధముగా క్రోడీకరింపవచ్చును.

1) తన తపోభూమియైన తుంబురుకోనను, తత్పరిసరములను రమ్యముగా చిత్రించుట. తానెరిగిన చెంచుల ఆచార వ్యవహారములను స్వభావ మనోజ్ఞముగా వర్ణించుట.

2) తిరుమల క్షేత్రమందలి మ్రొక్కుబళ్లు మొదలగు పద్ధతులను, ఇష్టదైవమగు వేంకటేశ్వరుని ప్రభావ మహిమా విశేషములను ప్రపంచించుట.

3) తరిగొండ నరహరికి, తిరుమల వేంకటేశ్వరునకు అభేదమును ప్రకటించుట.

4) అన్నిటిని మించి, భక్తి రసగుంఫితములైన దివ్యశృంగార యోగ విశేషములను కవితాకళచే రంజింపజేయుట.

సప్తసముద్ర వృత్తాంతములు, జంబూద్వీపాది ద్వీపముల, ఉప ద్వీపముల విశేషములు, నక్కకొమ్ము (సృగాలశృంగి) వంటి ఆసక్తి దాయకములగు ననేకాంశములు పేర్కొన బడియుండుట ఈ చిన్ని యక్షగానమునందలి ప్రత్యేకత.

తుంబురుకోననుండి తిరుమల మందిరమువరకు కొనసాగిన కథానూత్రము గలిగి, శ్రీ వేంకటేశ్వరు కరుణచే భూచక్రమున ఆచంద్రతారార్కమై యుండుగాక!' అని కవయిత్రిచే ఆశంసింపబడిన ఈ 'చెంచుచెలికథ' రసపూర్ణమగు రమణీయకృతి.

## కృష్ణకథాత్మకములు

కృష్ణకథాత్మకములైన యక్షగానములు నాలుగు. వాటిలో లభ్యములు మూడు మాత్రమే. అవి బాలకృష్ణనాటకము, పారిజాతాప హరణము, జలక్రీడా విలాసము అనునవి. రుక్మిణీనాటక మొకటి అలభ్యము. బాలకృష్ణ నాటకము కవయిత్రి తరిగొండలో రచించిన కృతులలో చివరిది. ఆమె యక్షగాన కృతులలో మూడవది. కవయిత్రి దీనిని ప్రారంభమున 'బాలకృష్ణ నాటక' మనియు, కృతిచివర సంక్షిప్తముగా 'కృష్ణనాటక' మనియు రెండు విధముల పేర్కొన్నది. 6 వెంగమ తిరుమల చేరి రచించిన తొలికృతి పారిజాతాపహరణము. ఈ యక్షగానమునకు విష్ణుపారిజాతమను నామాంతరము కలదు. వెంగమ చరమ జీవిత కాలములో రచితమైన వాటిలో జలక్రీడావిలాస మొకటి.

## బాలకృష్ణనాటకము

కథ: శ్రీకృష్ణుడు బృందావనమున అనేక లీలలను సల్పుచు, ఒక వెన్నెలరాత్రి యమునాతీరమున వేణుగానము గావించుచుండగా అచటి కీశ్వరుడు (తలకోన సిద్ధేశ్వరుడు) నక్కజోగివాని వేషము ధరించి కాకివేటకు వచ్చును. 'కాకులు లేచిపోవునట్లు నా కడ వేణువూద దగునా?' అని ప్రశ్నించును. 'నీ వెవడవురా?' అని శ్రీకృష్ణుడు ప్రశ్నింపగా, 'నీ వెవరో ముందుగా దెల్పుమురా' అని నక్కజోగి ప్రశ్నించును. ఒకరి వృత్తాంత మును మఱియొక రెఱిగిన పిదప, శ్రీకృష్ణుడాతనిని విశ్వాస పూర్వకముగా జూచును. నక్కజోగి తనదారిని తా నేగును.

వేణునాదముచే ఆకర్షితులై వ్రేపల్లెయందలి గోపభామ లందరచటికి వత్తురు. అట్లు వచ్చి భక్తితో తనను స్తుతింపగా, వారల జూచి శ్రీకృష్ణుడు, అట్లు వచ్చుట తగదని, నింద కల్గునని, పతుల కడకు మరలి పొమ్మని హెచ్చరించును. ఇట్లు కొంతసేపు వారి మానసిక స్థైర్యమును మాటలచే పరీక్షించి, పిమ్మట వారి నాదరించి సుఖము లొసగును. కృష్ణుడు నృత్యమాడుచు అదృశ్యుడు కాగా ఆ గోపికలు చింతిలుచు అన్నివైపుల వెదకుదురు. వారి దీనాలాపములను విని కరుణించి హరి ప్రసన్నుడై, యొక కమలాకరమున వారితో జలక్రీడ లాడుచుండును.

ఇంతలో రాధ మేల్కొని, జలక మాడి ముస్తాబై చెలికత్తెలతో బృందావనమున కేతెంచును. పూర్వముండెడి చోట కృష్ణుడు లే నందున, తరులు, గిరులు, ఖగములు మున్నగు వానిని అతని జాడ లడుగును. నవ్వుల కెందైనా దాగి యున్నా డేమో యని తలచి రాధ గోపాలుని పిలుచుచుండగా 'మాయిక' యను వికారస్వరూపిణి (హరియొక్క యోగమాయ) తన పతి యగు నక్కజోగిని వెదకుచు అక్కడకు వచ్చును.

శ్రీకృష్ణుడు గోపాంగనలతో జలక్రీడ లాడుచున్నట్లు మాయిక వలన తెలిసికొని, రాధ పరిపరివిధముల పరితాపపడుచు మూర్ఛిల్లును. మూర్ఛనుండి తెప్పిరిల్లి రాధ, కృష్ణుని బిలుచుకొని రమ్మని మాయికను పంపును. శ్రీకృష్ణుడు రాగా బిగువులు పోవును. పిమ్మట గోపిక లచటికి రాగా రాధ వారితో కలహించును. సాయము వచ్చిన మాయికను గోపభామలు కట్టి వేసి కొట్టు చుండగా, రాధ మాయికను విడిపించును.

శ్రీకృష్ణుని పలుకుల వలన గోపికలకు, రాధకు సయోధ్య ఏర్పడును. 'రాధిక యొకనాడు, గోపిక లొకనాడు బృందావనమునకు వచ్చి హరిని పొందవలయు' నను మాయిక నియమమునకు ఇరుపక్షము లంగీకరించును. లీలావినోది యగు కృష్ణునకు దృష్టితాకకుండ రాధ మంగళహారతి యొసగుటతో నాటకము ముగియును.

ఈ యక్షగానమందలి కథ కాధారము ఆంధ్ర మహాభాగవత దశమస్కంధ పూర్వభాగమున గలదు. అందు 'శరద్రాత్రిం గాన మొనర్చు కృష్ణ సన్నిధికి గోపికలు వచ్చుట, గోపికాగీతలు, రాస క్రీడాభివర్ణనము' - జలక్రీడాభి వర్ణనము అను నాలుగు ఉపశీర్షికలతో "ఇట్లు వాడిచి నవ కుంకిమాంకిత రమా ముఖ మండలంబునుం బోలె" అను 966 వ వచనము మొదలుకొని "సతులుం దానును నీటిలో వెడలి" అను 1100 వ పద్యమువరకు గల 135 గద్య పద్యములలో ఈ కథ విస్తరించి యున్నది. వెంగమ యీ ఘట్టమందలి విషయమును సంగ్రహీకరించి, దానికి రాధావృత్తాంతమును న్వయముగా కల్పించి జతపరచినది. ఈ ప్రధానేతివృత్తమునకు సహాయకముగా నక్కజోగి దంపతుల వృత్తాంతమును సృష్టించినది.

వెంగమాంబ భాగవతమునుండి కథాసూత్రమును మాత్రమే గై కొని, అందలి 'గోపీకాగీతలు, రాసక్రీడ, జలక్రీడ' - అను ఘట్టముల వర్ణనలను పరిహరించి స్వతంత్రముగా వస్తునిర్వహణ మొనర్చినది.

**పాత్రచిత్రణ :**

ఈ నాటకమున గల పాత్రము లైదు: శ్రీకృష్ణుడు; రాధ; గోపికలు; నక్కజోగి దంపతులు. పాత్రల స్వభావ చిత్రణలో వెంగమకు గల నేర్పునకు ప్రకృష్టోదాహరణము రాధ. శ్రీకృష్ణుడు తన్ను వీడి తక్కిన గోపికలను; లాలించుచుండె నని పరితపించుటలో స్త్రీ సహజ మగు ఈర్ష్యసూచిత మైనను అది తాత్కాలికము. కృష్ణవిరహము నోర్వ జాలక మూర్ఛిల్లుటలో ఆమె సుకుమార హృదయము వ్యక్తమగుచున్నది. తనయెుద్దకు వచ్చి బ్రతిమాలుచున్న శ్రీకృష్ణుని 'దొంగ' యని తిరస్కరించుటలో ఆమె కోపనస్వభావము వెల్లడి యైనను, చివరకు.

"ముద్దుగోపాల! యీ ముగ్ధలను గోరితివి
వొ ద్దనిన విడుతువా? వొట్టి భ్రమ గాని ౧
సామి। నీ మదికి దోచని నీతు లికనులే
వే మికను జెప్పదును నిభరాజవరదా! ౨
నీకు సమ్మతమైన దే కార్యమైన మఱి
నాకు సమ్మతి గాదె నలినాయతాక్ష!" (జంపె) ౩

అని సమ్మతపడుటలో రాధాదేవికి శ్రీకృష్ణునియెడ గల ప్రణయ గౌరవము ప్రకటితమైనది.

పిమ్మట నాటకాంతమున శ్రీకృష్ణుడు గోపికలను పిలిచి రాధ కప్పగించుటలోను, గోపికలు రాధ నాజ్ఞాపింప వేడుటలోను ఆ పాత్ర యెుక్క పెద్దరికము నిరూపితమైనది. రాధ మాయికను పిలిచి రాధ మాయికను పిలిచి 'మాకు నొక్క నియమంబు జేయు' మని యడుగుటలో నిర్గర్వత, శ్రీకృష్ణునకు దృష్టిదోషము తగులకుండ మంగళహారతి యొసగుటలో ఆమె యనన్య భక్తిభావము ఆవిష్కృతము లైనవి. వీటి నన్నిటినిబట్టి చూచినచో ఈ 'రాధ పాత్ర చిత్రణ' కొరకే ప్రధానముగా కవయిత్రి ఈ యక్షగానమును సృజించె ననిపించును.

పాత్రల స్వరూపచిత్రణమున, స్వభావావిష్కరణమున వెంగమ ప్రదర్శించిన నేర్పు నిరుపమానము. ఇందులకు మాయిక పాత్రయొక్క స్వరూపవర్ణన మొక మచ్చుతునక:

"జడివాన బురదలో జలకంబు లాడి-చెడుజిడ్డుకంబడి చింపి గట్టుకొని
ఎఱ్ఱనై నెత్తిన హేయమైనట్టి-చిఱ్ఱవెంద్రుకలలో జింజిరిగూడుఁ
బెట్టి కొ ప్పొనరించి, బెరయఁగా నుల్లి-పాట్లుదండలు గట్టి పొసఁగ దీపంపు
వత్తి ముక్కు నలంచి వైపుగా చుక్క-హత్తించి ఫాలంబునందుఁ జెన్నొంద
మంటి గంధము దీసి మైఁబూసి, యొక్క-కంటిలో నీ రొక కంటిలో మంట
గ్రక్కఁగా నిక్కుచు కడు బుస లెసఁగ-చక్కగా మే నెల్ల చదలు బుట్టంగ
మూఁడు కుంపెట్లొక మూట గట్టుకొని-కోడిగు డ్లొక దండ గూర్చి ధరించి
నిక్కుచు నీల్గుచు నెళవైన తఱిని-గ్రక్కున విడిబడి కడు వికారముల
మడియ లెల్లను మెచ్చ మాయిక రాధ-కడ కేగుదెంచె చొక్కంపు వైఖరిని"

పరిశీలించి చూచినయెడల కృష్ణుడు, రాధ-వంటి పౌరాణిక పాత్రముల చిత్రణ ఒకయెత్తు; సంఘజీవనములో అట్టడుగున అతి నికృష్టవేషముతో మసలుకొనెడి పై మాయిక వంటి పాత్రను చిత్రించుట ఒక యెత్తు. ఇట్టి పాత్రల స్వాభావిక చిత్రణ సిద్ధహస్తులగు కవులకు దక్క, సామాన్యులకు జరుగని పని.

**నాటకీయత:**

యమునాతీరమే కథా రంగముగా, శరద్రాత్రియే సమయముగా పరిమిత కథావస్తువుతో సాగిన, ఈ యక్షగానము దేశైక్య, కాలైక్య, కథైక్యము లనెడు 'ఐక్యత్రయము' తో నొప్పుచు, నాటిక వలె రూపకధర్మ సంశోభిగా సాగినది. శ్రీకృష్ణుడు - గోపవనితలు, రాధ- మాయిక, రాధ -కృష్ణుడు, రాధ-గోపికలు ఈ రీతిగా ఆ యా పాత్రల నడుమ అనతి విస్తృతములుగా సాగిన సంభాషణలు, గోపికలు, రాధ శ్రీకృష్ణుని గానక లతలను, చెట్లను, గుట్టలను, పిట్టలను ప్రశ్నించిన సంవాద కళావిలసిత సన్నివేశములు- ఇత్యాదులు ఇందలి నాటకీయతా గుణాతిశయమునకు తార్కాణములు.

ఇందలి త్రిపుట, జంపె, కురుచ జంపె రేకులు, కందదరువులు, సీసదరువులు, కందము, సీసము, ఉత్పలమాల మున్నగు పద్యములు- వీ టన్నిటితో గూడిన ఛందోవైవిధ్యము సైతము నాటకీయతను ప్రోదిసేయుచున్నది. ముఖ్యముగా ఇందలి కొన్ని దరువులకు రాగ, తాళములే గాక, ఆ తాళములకు 'రెండో కాలం', 'మూడో కాలం', 'నాలుగో కాలం'- ఇత్యాదిగా కాలనిర్దేశముకూడ చేయబడినది.

ఈ లక్షణము ఇది ప్రదర్శనోద్దిష్టమై వెలసిన దను విషయమును నిరూపణ సేయుచున్నది.

**శైలి :**

ఈ నాటక మందలి శైలి శ్రవణ పేయమై, ప్రతి పాద్య వస్తువున కనుగుణమై రమణీయముగా దీపించుచున్నది. గోపికలు శ్రీకృష్ణుని స్తుతించు ఘట్టమున గల ఈ క్రింది దరువు ఇందుల కొక యుదాహృతి.

"... ... ... ... ... ... ... ... ... ... ... శరణు శరణూ
శరణు శరణు త్రిలోకనాయక! శరణు పురహరసాయకా!
శరణు ముక్తిఫలప్రదాయక! శరణు భక్తసహాయకా! ౧
శరణు యోగిమనోబ్జబంభర! శరణు శరణు చిదంబరా!
శరణు ప్రవిమలకాంచనాంబర! శరణు మాయాడంబరా! ౨
శరణు శ్రీ తరిగొండ మందిర! శరణు వత్సధృతేందిరా!
శరణు మోహనదివ్యసుందర! శరణు దరనిభకంధరా!" ॥ త్రిపుట॥ ౩

ఈ నాటక మందలి పద్యములు కొన్ని పోతన భాగవతము నందలి మొల్ల రామాయణములోని పద్యములకు సమర్థవంతములగు ప్రకృష్టానుకరణములుగా నెలకొని యున్నవి.

ఉదా:- 1) గోపికలు శ్రీకృష్ణు నన్వేషించు ఘట్టమందలి పద్యము.

"నవ్వు ముఖంబువాఁ డు మృదునాదసువేణువుఁ బూనినాఁడు వాఁ
డివ్వసుధావధూరమణుఁ డిందిరకున్ ప్రియుఁడైనవాఁడు మా

యవ్వన మూల్య మీప్పు డతఁ డంతయు ముచ్చిలి తెచ్చినాఁడు ఐల
రవ్వలు జేసినాఁడిటకు రాడు గదా గిరులార! చెప్పరే."

పద్యము పోతనామాత్యుని పద్యరత్నములలో సుప్రసిద్ధమైన దగు 'నల్లనివాఁడు పద్మనయనంబులవాఁడు' (దశమ స్కంధము, పూర్వభాగము 1010 ప.) అను పద్యమున కన్వర్థమైన యనుసరణ యని చెప్పక చెప్పుచున్నది. ఇట్టి వీ నాటకము మఱికొన్ని యున్నవి.

2) రాధ మాయికకు శ్రీకృష్ణుని స్వరూపమును దెల్పుట గల పద్యము:

"నీలనీరదమునుబోలు దేహమువాఁడు
రమణీయ హేమాంబరంబు వాఁడు
తేటైన పింఛకిరీటంబు గల వాఁడు
నవరత్న మయభూషణముల వాఁడు
వనమాలికాయుక్త వక్షస్థలము వాఁడు
ముసిముసి నవ్వుల మోము వాఁ డు
కమలోపమంబు లౌ కన్నులు గల వాఁడు
చొక్కించి కాంతలఁ జూచు వాఁడు

మోహనంబైన ముద్దు కెమ్మోవి వాఁడు
చెల్వమున వేణునాదంబుఁ జేయు వాఁడు
ధీరుఁడై యెప్పు డిచ్చటఁ దిరుగు వాఁడు
జూటు విటకాఁడు న న్నేలు నీటుకాఁడు."

పై సీసము మొల్ల రామాయణమునందలి 'నీల మేఘచ్ఛాయం బోలు దేహమువాఁడు, ధవళాబ్జపత్ర నేత్రములవాఁడు' (సుందర కాండము. 102 ప.) అను పద్యమున కనుకృతి యనుట సుస్పష్టము.

ఈ రీతిగా ఈ యక్షగానశైలి ఇందలి శృంగారరసమును పరిపోషించునదై, సరసములగు సంస్కృతాతంధ్ర పదముల సమ్మేళనముచే సరళమై ప్రకాశించుచున్నది.

ఈ యక్షగాన రచనానంతరము కొంతకాలమున కీ కవయిత్రి తిరుమలను చేరుకొన్నది. ఆ క్షేత్రము చేరిన కొంతకాలమునకు గాని ఈమె రచనా వ్యాసంగమును కొనసాగించినట్లు కన్పట్టదు. తిరుమలలో వెంగమ రచించిన మొదటి కృతి పారిజాతాపహరణము (విష్ణు పారిజాతము). ఈ రెండు యక్షగానములకు మధ్య విరామకాలము (gap) కనీస మైదు వత్సరములైన నుండి యుండును.

సహజముగా తాత్త్విక కవయిత్రియైన వెంగమాంబ తిరుమల క్షేత్రమున తనకు సమృద్ధిగా లభించిన ఆధ్యాత్మికోత్తేజముచే నూతన స్ఫూర్తి నంది భవ్యావేశముతో రచనకు గడంగినది. ఈ హేతువు చేతనే తరిగొండలో రచించిన రచనలకు, తిరుమలలో వెలువడిన రచనలకు కవితాశిల్ప పరిణతియందు సూక్ష్మమగు భేదము గోచరించుచున్నది. ఈ బాలకృష్ణ నాటకము, దీని తరువాతి రచన యగు పారిజాతాపహరణము -అను నీ రెండు యక్షగానకృతులే ఇందులకు సాక్షులు.

## పారిజాతాపహరణము

ఈ కృతికి 'విష్ణు పారిజాత' మను నామాంతరము వ్యవహారమున గలదు. ఈ కవయిత్రి రచించిన శివనాటకమునకు ' శివ పారిజాత' మను నామాంతర ముండుటచే తద్భిన్నత గుర్తింపబడుట కిది యిట్లు 'విష్ణు పారిజాతముగా' వ్యవహరింపబడి రూఢి నొందినది. ఈ నామధేయ మీ యక్షగానమునకు అన్వర్థముగా కనబడుచున్నది. విష్ణువు సంపాదించిన పారిజాతముయొక్క కథ యిందు ప్రధానమగుటచే నిది విష్ణు పారిజాతము. లేక, విష్ణువే పారిజాతమై, భక్తులకు సర్వప్రదుడై, లీలామానుష విగ్రహుడై భూమిపై విహరించి నందునను, అట్టి విష్ణువు (శ్రీ కృష్ణుడు) కథానాయకుడై యుండుట చేతను దీనిని 'విష్ణు పారిజాత' మనవచ్చును.

శ్రీకృష్ణుని పారిజాతాపహరణ వృత్తాంతము తెలుగువారికి సుపరిచితములైన పౌరాణిక గాథలలో నొకటి.7 ఈ గాథను గైకొని ఎందరో కవులు, రచయితలు వేర్వేరు వాఙ్మయ ప్రక్రియలలో రచలను

వెలయించిరి. వెంగమకు పూర్వమున వెలువడిన అట్టి రచనలలో నంది తిమ్మన రచించిన పారిజాతాపహరణము, సిద్ధేంద్ర యోగి రచించిన భామా కలాపము మిగుల ప్రఖ్యాతి వహించినది. ఈ కవయిత్రి, తిమ్మన సిద్ధేంద్రుల కృతులయందలి విశేషములను వలసిన పట్టుల గైకొని స్వతంత్రత యుట్టిపడురీతిని చక్కని యక్షగానమును సంతరించినది.

**కథా సంగ్రహము :**

శ్రీకృష్ణుడు సత్యభామకు పారిజాత వృక్షమునే తెచ్చియిత్తునని పలికి యామె నోదార్చి కొంతసే పామె మందిరమున గడుపును. ఆమె నిద్రలో మునిగి యుండగా, చెప్పకుండ శృంగారవనమున కరుగును. ఆ వనపాలకుడగు వికటభాషణునితో కొంతసేపు భాషించి, వానిని బంపించి రుక్మిణీ, రాధ మున్నుగా గల తక్కిన ప్రియురాంద్ర నచటికి పిలిపించును. వారంద రా వనమునకు వచ్చి, ఆ వనపాలుని భార్యయగు వక్రభాషిణితో కొంతతడవు ప్రసంగించి పిమ్మట శ్రీకృష్ణుని గను గొందురు. ఆయన వారందరితో హాయిగా వనవిహారము సల్పదొడగును.

ఇంతలో సత్యభామ నిదుర లేచి, చక్కగా ముస్తాబై కేళివనము లో వాసుదేవుని వెదుకుచుండగా వక్ర (వికట) భాషిణి యెదురు పడును. సత్యభామ ఆమెతో కొంతసేపు మాటాడును. శ్రీకృష్ణుడు రుక్మిణి మొదలైన జలజముఖులను గూడి శృంగారవనములో క్రీడించుచున్న సంగతి తెలిసి చింతిల్లును. సత్యభామ కోరగా వక్రభాషిణి శ్రీకృష్ణుని దోడ్కొని రా నేగును. శ్రీకృష్ణుడు సత్యాసదనమున కేతెంచి యామెచే తిరస్కృతు డగును. మరలిపోయి ఆయన రుక్మిణ్యాది కాంతలతో వనమున ఇష్టాగోష్ఠి నుండును.

సత్యభామ ఘనతర తాపముతో కుందుచు పసిడి కేతకి రేకుపై కొనగోటితో నొక లేఖ వ్రాసి యిచ్చి వక్రభాషిణిని కృష్ణుని కడ కంపును. వచ్చుటకు నిరాకరించి ఆయన ప్రత్యుత్తర మంపును. వక్రభాషిణి వెంట సత్య స్వయముగా నేగి, రమ్మని కృష్ణుని పరిపరి విధముల ప్రార్థించును. ఫలితము లేక పోగా సంతాపముతో తన మందిరము సేరును.



Sri Malayappaswami, the Lord of Infinite Grace

అటుపిమ్మట సాత్రాజితి మలయానిల, చంద్ర, మన్మథులను దూషించి, అవశయై వ్రాలి, కనుమూసి నిద్రించు కైవడినుండగా ఒక కల గాంచును. ఆ కలలో నలినాక్షుడు తన కడకువచ్చి పూలచెండ్లను చేతి కిచ్చినట్లు, కౌగిలించి మిగుల ఆదరించినట్లు, కృష్ణ జపము చేయు మని సూచించినట్లు, కంటినని సత్య చెలికత్తెకు వివరించును. చివరిసారిగా సత్య సఖితో కృష్ణుని కడ కరుగును. పలు తెరగుల ఉపాలంభించినను ఫలితము లేక పోగా, మందిరమునకు మరలి వచ్చి శ్రీకృష్ణ జపము దీవ్రముగ నొనరించుచుండును. తత్ప్రభావమున కృష్ణుడు ప్రసన్నుడై వచ్చి, కౌగిట జేర్చుమని ప్రార్థించును. 'సుర మహీజమును కన్నుల జూచుదాక నిన్ను పొందను పొ 'మ్మని సత్యభామ ఖండితముగా బల్కును, 'అయినచో నా ప్రాణ జూడుము పారిజాతమును తెచ్చి యిచ్చుదనుక గంగ ముట్టను' అని శపథ మొనర్చి శ్రీకృష్ణుడు ప్రాగ్జ్యోతిషపురిపై దండెత్తును. వలదన్నను సత్యభామ వెంటరాగా, గరుడవాహనారూఢుడై యేగి, నరకుని జయించి, అటనుండి అమరేంద్రపురి కరిగి, అదితికి కుండలము లిచ్చి, నందనవనమందలి పారాజాత తరువును గరుడుని మీద నిడుకొని వచ్చుచుండగా దేవేంద్రుడు వచ్చి యెదిరించును. కొంతసేపటికి శంకరుడు గౌరీసమేతుడై వచ్చి ఇంద్రోపేంద్రుల నడుమ నిలిచి, యుద్ధము నుపశమింప జేయును. శివుని ప్రేరణచే ఇంద్రుడు పారిజాతమును శ్రీ కృష్ణునకు సంకల్పపూర్వకముగా ధారవోయును. శ్రీకృష్ణుడందలి సుమములను కోసి యీయగా, సత్యభామ పార్వతీపరమేశ్వరులను పూజించును. ఆ యాదిదంపతు లామె నాశీర్వదింతురు.

శ్రీకృష్ణుడు పారిజాతమును సత్యభామ పెరటిలో నాటిన విషయ మెఱిగి, రుక్మిణి గాక తక్కిన సవతులు వచ్చి 'దాని కిచ్చినట్లతరు వొక్కటొక్కటి మా కియ్యక నిన్ను వదల' మని అడ్డగించి రవ్వ చేయుదురు. అప్పుడు సవతుల కయ్యము నడచును. శ్రీ కృష్ణుడు రుక్మిణిని బిలిపించి యామెచే వారందరిని శాంతింపజేయును. సత్యభామ పతి యానతి ననుసరించి సవతులకు, కృష్ణునకు చందన తాంబూల సమేతముగ పారిజాత

ప్రసూనముల నొసగి సత్కరించును. ఎల్లరును శ్రీకృష్ణునకు మంగళహారతు లొసగుటతో కృతి సమాప్త మగును.

**కథా సంవిధానము :**

ఈ సత్కృతియొక్క ఉత్కృష్టతకు ప్రముఖకారణము ఇందలి కథా సంవిధానము. దీని నారయుటకు ముందు ఆ యా గ్రంథముల యందు గల పారిజాతాపహరణ వృత్తాంతమును సంగ్రహముగా పరికించుట ఆవశ్యకము. ఈ కథ పోతన భాగవతమున నిట్లున్నది:

శ్రీకృష్ణుడు నరకాసుర వధానంతరము సత్యభామతో అమరావతి కేగి దేవమాత యగు అదితికి కుండలముల నిచ్చిన పిదప వారు నందనో ద్యానమును జూడ నేగిరి. ఆ తరుణమున సత్యభామకు పారిజాత వృక్షముపై కోరిక గలిగెను. తోడనే శ్రీకృష్ణుడా దివ్య ద్రుమమును పెకలించి గరుడునిపై నిడి ప్రియురాలి కోరికను నెరవేర్చెను. ఇది భాగవతమందలి కథ. ఈ కథానుసారము అదితికి కుండలములను సమర్పింపదలంచిన శ్రీకృష్ణుని సంకల్పమే ఆయన తలవని తలంపుగ పారిజాతము నపహరించుటకు దారి తీసినది.

సంస్కృత హరివంశము ననుసరించి నంది తిమ్మనచే రచింపబడిన పారిజాతాపహరణ ప్రబంధము నరకాసుర సంహారానంతర కథతో ప్రారంభమగుచున్నది. నరకుని జయించిన పిమ్మట శ్రీకృష్ణుడట్లే అమరావతి కరుగక ద్వారకకు మరలివచ్చెను. ఆయన రాగరసనిమగ్నుడై, దక్షిణ నాయకుడై కాలము గడుపుచుండిన ఆ దినములలో నొకనాడు నారదు డేతెంచి పారిజాత ప్రసూనమును కాన్కగా నొసగెను. ఈ 'పారిజాత ప్రసూన సన్నివేశము' వలన ఏర్పడిన వ్యవధిలో ఈ ప్రబంధ కథ చక్కగా విస్తరింపబడినది. అటు తర్వాత సత్యభామ కోరికను తీర్చుటకై అదితికి కుండలము లిచ్చు నెపముతో సత్యాసమేతుడై శ్రీకృష్ణు డమరావతి కేగుట, పారిజాతము నపహరించుకొని వచ్చుట జరిగినవి.

ఇక సిద్ధేంద్రుని భామాకలాపమున నరకాసుర వధకు, అదితి కుండలములకు ప్రసక్తి లేదు. నారదుడు పారిజాతపుష్పమును దెచ్చి

యిచ్చుటకు మిగుల పూర్వమందే ఈ కథ ప్రారంభమగును. శ్రీకృష్ణుడొకనాడు సత్యాదేవితో నిలువుటద్దము నెదుట నిలువబడి "సత్యా! నీవు చక్కనిదానవా? నేను చక్కనివాడవా?" అని ప్రశ్నించెను. అందుల కామె 'నేనే చక్కని దాన' నని పల్కెను. అందువలన కృష్ణుడలుకతో సత్యమందిరమునుండి వెడలిపోయెను. అది మొదలు విరహాతురయైన సత్యభామయొక్క కలాపము (హృదయావేదన వెల్లడింపు) ప్రారంభ మగును. సత్యభామ స్వప్నము, మాధవి (దూతిక) స్వామికడకు పలుమారులు వెళ్లివచ్చుటలు, అట్లు వెళ్లి వచ్చుటలో నొక పర్యాయము, నారదు డిచ్చిన పారిజాత ప్రసవమును శ్రీకృష్ణుడు రుక్మిణి కొసంగెనను విషయమును యజయానురాలగు సత్యతో తెలుపుట, సత్య స్వయముగా వెళ్లి పతితో వివాదపడుట, సవతుల కయ్యము, మూర్ఛ మొదలగు మన్మథావస్థలు ఇత్యాదిగా కొనసాగి, చివరకు సత్యభామ శ్రీకృష్ణుని జడతో కొట్టినది. చిట్టచివరకు రుక్మిణి పల్కులవలన సత్య కలకదేరినది. అష్టభార్యలు మున్నుగా గల అంతఃపుర మచటజేరి స్వామికి మంగళ హారతి యొసగుటతో భామాకలాపము సమాప్తి నొందుచున్నది.

వెంగమాంబ ఈ యక్షగాన కథను భాగవతానుసారిక శుకయోగి పరీక్షిత్తునకు దెల్పినట్లు ఉపక్రమించినది. ఆ యుపక్రమములోనే నంది తిమ్మనార్యుని పారిజాతాపహరణములోని పుష్పవృత్తాంతమును ఈ క్రింది రీతిని కడుసంగ్రహముగా ఇమిడించినది.

" విను రాజచంద్ర! యీ విధ మెల్లఁదెలియ-ననిమిషమునిచంద్రుఁడమరావతికిని
జని పారి జాతపుష్పము గొని తెచ్చి-కనకాంబరునకు మేల్కాన్కగా నిచ్చె
పనిఁబూని కృష్ణు డా పారిజాతమును-నెనరు మీఱఁగ రుక్మిణీదేవి కొసఁగె
నందుకు పద్మాక్షు వా సత్యభామ - పొందక కోపించి పొమ్మన్న శౌరి
సతి నీకు నే పారిజాతవృక్షమును-హితవు మీఱఁగఁ దెచ్చి యిచ్చెద ననుచు
సమ్మతపఱచి యా జలజాక్షి నెనసి- నెమ్మది నందుండి నీరజాక్షుండు."

-విష్ణు పారిజాతము, 3 పుట.

అట్లు సత్యభామ శ్రీకృష్ణుని సలలితోక్తులకు సంతోషించి, భూరిరతిశ్రమమున జొక్కి యామె నిదుర చెంది యుండగా గికురించి

పద్మాక్షుడు శృంగారవనమున కేగుటతో ఈ యక్షగానము ప్రారంభమగు చున్నది. తరువాతి కథ యంతయు చాలవరకు ఉద్యానవనము నందే కొనసాగినది. ఇట్లు ఉద్యానవనమును కథారంగముగ జేయుటలో ఈ కవయిత్రి యుద్దేశము నిట్లూహింప వచ్చును.

-పారిజాతము కల్పవృక్షము లైదింటిలో అత్యంత ముఖ్యమైనది. ఆ దివ్యద్రుమమును భువికి గొనివచ్చి సత్యభామ యొక్క శృంగార వనమున నాటుట యిందు ప్రాధానాంశము గనుక ఈ కథ యంతయు అంతఃపురోద్యానములలో జరిగినటుల వర్ణించుట సముచితము-

ఆంధ్ర మహాభాగవత, పారిజాతాపహరణములందలి ఈ క్రింది పద్యములు సైతము ఈ యక్షగానమున ఉద్యానవనమును ప్రధాన రంగముగా నొనరించి యుండుటలో ప్రేరకములై యుండును.

i) "ఆ రామలతో నెప్పుడుఁ
బోరాములు సాల నెఱిపి పురుషోత్తముఁడున్
గారామునఁ దిరిగెను సౌ
ధారామలతాసరోవిహారముల నృపా!"

-దశమ స్కం; ఉత్తరభాగము 225 ప.

ii) 'ఆ రమణీలలామముల నందఱఁగూడి యదూద్వహుండు త
ద్ద్వారవతీపురోపవనవాటికలం గృతకాద్రి సీమలన్
వారిధి తీరకుంజ సదనంబులఁ గేళితరంగిణీ తటీ
కైరవిణీ సహాయమణి కల్పిత సౌధములన్ వసించుచున్."

-పారిజాతాపహరణము,I ఆశ్వా; 39 ప.

మఱియు సిద్ధేంద్రుని భామాకలాపమునందలి 'సత్యభామ వనవిహారము' (శ్రీకృష్ణునికొరక కన్వేషించుట) కూడ పై అంశమునకు ఇంకొక ప్రేరకముగా గణింప దగియున్నది.

సత్యభామ కోపమునకు హేతువుగా పారిజాత సుమ వృత్తాంత మును ఆదిలో స్వీకరించిన ఈ కవయిత్రి అటనుండి ఈ యక్షగాన కథా

సూత్రమును స్వీయరచనా ప్రణాళికకు అందినంత మేర (అనగా ఇంచుమించు సగము పరిమితివరకు) సిద్ధేంద్రుని భామాకలాపపు బాణీలో కొనసాగించినది. అట్లు కొనసాగించుటలో సముచితము, ప్రజ్ఞావిలసితమునైన కవితానైపుణి ప్రస్ఫుటముగా గోచరించుచున్నది.

సిద్ధేంద్రుని భామాకలాపముi) సత్యభామా లఘువిచారము ii)ఘనవిచారము iii) వనవిహారము iv) రాయబారము v) ఘనతర విచారము - కృష్ణనిరాకరణ సందేశము vi) ఘనతమ విచారము - కృష్ణనిరసనము vii) భామా నిరసనము viii) సవతుల సంవాదము ix) సత్యభామ తెగువ - దుర్భర విచారము x) ఉద్యానలీల xi) సమాగమము - అనునవి ప్రధాన విభాగములుగా నున్నవి.8

భామా కలాపములో తొలుత సత్యభామ చెలికి తన పుట్టు పూర్వోత్తరములను తెలిపినట్లుండగా, వెంగమాంబ సత్యచేతనేగాక, శ్రీకృష్ణుడు, రుక్మిణ్యాద్యష్ట భార్యలు, రాధ - వీరందరిచేతను సముచితముగా వారి వారి వృత్తాంతములను పల్కించి, పిమ్మట సత్యభామచే నామె యుదంతమును చెప్పించినది. కలాపములోని మాధవి (మాధవుడు) పాత్రకు బదులుగా వికటభాషణుడు, వక్రభాషిణి - అను వనపాలక దంపతులను సృజించి, ఆహ్లాదకరములైన సంభాషణ లను నెలకొల్పినది.

శ్రీకృష్ణుడు తన కేమవునో సత్యభామ వక్రభాషిణికి వివరించు సన్నివేశము భామాకలాపమునందు కంటె ఈ నాటకమున విపులముగా, వక్రోక్తి సమన్వితముగా నున్నది. మచ్చున కొక యుదాహృతి:

'చక్రధరుడు, శంఖము దాల్చినవాఁడు, కస్తూరి తిలకము గలవాడు' ఇత్యాది విశేషణములకు వక్రభాషిణి 'కుమ్మరివాడు, సంక్రాంతి జంగము, గారడివాడు' అను విపరీతార్థములను దీయు సందర్భము.

స.భా: "ఇంతి యిట్టి యపార్థంబు లిపుడు జేసి
పాపములఁ బొంద నేటికే భక్తి కలిగి
తెలివితో విను కస్తూరి తిలక మతఁడు
నిటలమునఁ దాల్చి వగ గుల్కు నీటుకాఁడె.

వ.భా: పరఁగ గారడీఁడు గుఱుతుగా నల్లని
తిలక మెపుడు నదుటఁ దీర్చి యుండు
గారడంపు విద్య లారూఢిగాఁ జూపు
నట్టి విద్య వాఁడె యబల! వీఁడు.

స.భా: కాంత విను వాఁడు నల్లనికావు నుదుట
తిలకముగఁ దీర్చుకొనఁగానె దేవదేవుఁ
డైన కృష్ణునితో సాటి యనఁగ దగునె?
బర్హి బర్హి కిరీటుఁడే భామ యతఁడు.

వ.భా: బర్హి బర్హ మనఁగ భావింప నెమలీకె
లమర నవియె శిరమునందుఁ దాల్చి
చెలఁగు చున్నవాఁడు చెంచునాఁబడు ధాత్రి
నితఁడు నట్టివాఁడె యిందువదన?

స.భా: ఎన్ని చెప్పిన వికటోక్తు లీ విధమునఁ
జెప్పుచెన్నావు నీకు నేఁ జెప్పలేను
సకియ నీ మందె మేళంబు చాలు పోవె
యనిన విని చాల నగుచు నిట్టనియె చెలియ."

-విష్ణు పారిజాతము, 29 పుట.

భామా కలాపమున లఘువిచారము, ఘనవిచారము, ఇత్యాది విభనతో పెక్కంశములతో చిలువలు పలవలుగానున్న 'సత్యభామా విచారము'ను సంక్షేపించి స్వతంత్రముగా రచించి యుండుట ఈ యక్షగాన కృతి యందలి ఇంకొక విశేషము.

ఈ యక్షగానమందలి సత్యభామ రాయబారము భామా కలాపములోవలెనే నాలుగు తడవలుగా సాగినది, ఐనను రెంటికి ఇంచుక భేదము కలదు. సిద్ధేంద్రుని కృతిలో మొదటి పర్యాయము చెలికత్తె లేఖను గైకొని శ్రీ కృష్ణుని కడ కేగును. ఆ పై మరలి వచ్చులోగా చంద్ర మన్మథాది దూషణలు, నాయిక రెండు పర్యాయములు కల గనుట జరుగును. చెలి వచ్చి పారిజాత సుమ వృత్తాంతమును వినిపింపగా సత్య

మూర్ఛిల్లును. రెండవమారు చెలి యేగి విషయము నాయకునకు చెప్పగా ఆయన వచ్చి నాయికచే నిరాకృతుడై వెళ్లును. మూడవ పర్యాయము చెలితో నేగి నాయిక నాయకునితో వివాదపడి, రుక్మిణితో సవతి కయ్యమాడి వచ్చును. నాల్గవ పర్యాయము నాయిక ప్రాణత్యాగము చేయ సిద్ధపడుచుండుటను గాంచి భీతి నొంది చెలి పరువిడిపోయి నాయకుడు వచ్చునట్లు చేయును.

వెంగమ రచనలో మొదట చెలికత్తె యొకతెయే వెళ్లి చెప్పగా శ్రీకృష్ణుడు వచ్చి, సత్యభామచే తిరస్కృతుడై మరలును. రెండవ పర్యాయము చెలి ద్వారా లేఖను పంపగా శ్రీకృష్ణుడు ప్రత్యుత్తరమంపును. మూడవమారు చెలి వెంటరాగా నాయిక స్వయముగా నేగి, ప్రార్థించి ఫలితము గానక మరలివచ్చును. ఆమె అవశయై నిద్రించినట్లుండగా ఒక కల గనును. ఆ స్వప్నమును చెలికి చెప్పుచుండగా కొరవంజి (సింగి) యొకతె వచ్చి సత్యభామకు ఎఱుక చెప్పి పోవును. నాల్గవ పర్యాయము సత్య సఖీ సమేతయై వెళ్లి శ్రీకృష్ణుని పలుతెరగుల ఎత్తి పొడిచి, ఇలుసేరి శ్రీకృష్ణ జపము సేయదొడగును.

సిద్ధేంద్రుని కృతిలోని రెండవ, ఒకటవ, మూడవ పర్యాయములు క్రమముగా విష్ణు పారిజాతమున ఒకటవ, రెండవ, నాల్గవ పర్యాయములుగా మారియుండుట గమనింపదగును. శ్రీకృష్ణుడు ప్రత్యుత్తరము వ్రాయుట, ఎఱుక వృత్తాంతము అనునవి ఈ సందర్భమున కవయిత్రి కావించిన నూత్నకల్పనలు. 'సత్యభామ ప్రాణత్యాగమునకు సిద్ధపడుట' యను నాల్గవ అంశమును వెంగమ స్వీకరింపలేదు. తరువాతి పారిజాతాపహరణ వృత్తాంతముతో కవయిత్రి కథను పొడిగింప దలంచుటయే అందులకు కారణము.

కలాపములో సత్యభామ ఒక (మూడవ) పర్యాయము మాత్రమే స్వయముగా వెళ్లినట్లుండగా ఈ యక్షగానమున రెండు (మూడవ, నాల్గవ) పర్యాయములు స్వయముగా నేగి మరలి వచ్చినది. నాల్గవ పర్యాయము కూడ నాయకుడు రానందున సాత్రాజితి శ్రీ కృష్ణజప మొనరింప దొడగినది. ఇది యిందు తర్వాతి కథకు లంకెగా అమరి యున్నది.

ఈ యక్షగానమున ఇటుపై కథ యంతయు శ్రీ కృష్ణుడు పారిజాత వృక్షయును గొనివచ్చు వృత్తాంతమే. సంస్కృత హరి వంశమున, పోతన భాగవతమున, నంది తిమ్మన పారిజాతాపహరణమున నరకాసురవధ, నారదుడు పారిజాత కుసుమమును తెచ్చియిచ్చుటకు మున్నే జరిగినట్లు పేర్కొనబడియుండగా ఈ యక్షగానమున నారదుడా సుమమును కాన్కగా నొసగి కొంతకాలమైన పిమ్మట జరిగినట్లు వర్ణింపబడినది. సుప్రసిద్ధ వాగ్గేయకారుడగు నారాయణతీర్థులు (క్రీ. శ. 1580-1680) రచించిన 'పారిజాతాపహరణ' యక్షగానములోను ఇట్లే ముందు నారదుడు పుష్పమును తెచ్చి యిచ్చుట, తరువాత శ్రీ కృష్ణుడు నరకునిపై దండెత్తిపోవుట కలదు. ఆ కృత్యారంభమున గల ఈ క్రింది కథా సంగ్రహ శ్లోకపంక్తు లిందులకు నిదర్శనములు.

"... ... ... ... ... ... ... ... ... ... ... ... ...
నారదాగమనం పశ్చాత్ పారిజాత సమర్పణం
తతః శ్రీకృష్ణ సంవాదౌ రుక్మిణీ సత్యభామయోః
కృష్ణేనాపి కృతం సత్యభామా యా శ్చిత్తరంజనం
సత్యమయా వైనతేయేన గగనం గమనే పథిం
సత్యభామాం పురస్కృత్య నరకాసుర మంథనం
నందనోద్యాన గమనం పారిజాత సమర్పణమ్
... ... ... ... ... ... ... ... ... ... ... ... ... ..."

-ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము, 178-179 పుటలు.

కథానాయకుని పరాక్రమాతిశయమును ప్రకాశింప జేయుటకై తీర్థులు, వెంగమాంబ తమ తమ రచనలలో పై రీతిని మార్పు గావించి యుందురు.

ఈ యక్షగానమందలి ఇంద్రోపేంద్రుల యుద్ధఘట్టము ఈ కవయిత్రి వర్ణనావైశారద్యమునకు సదముల నిదర్శనము. ఈ యుద్ధవర్ణన తిమ్మన కృతిలో సైతము విపులముగా గలదు.9 వెంగమ దాని ననుసరింపక, స్వతంత్రముగా, సంవాద శిల్పశోభితముగా కన్నులకు గట్టినట్లు వర్ణించినది. ఈ ఘట్టమున యుద్ధనివారణకై ఇంద్రునికి హరికి మధ్య పరమేశ్వరుని ప్రవేశపెట్టుట ఈ కవయిత్రి కావించిన అపూర్వ కల్పనము. ఇంద్రోపేంద్రుల నడుమ 'రజత నగము విధము దలిర్ప'గా

నిలిచిన ఈ క్రింది శంకరుని కమనీయాకృతి ఈ కవయిత్రి యొక్క స్వరూపచిత్రణా నైపుణికి మచ్చుతునక.

"అని యిట్లు రజతాచలాధీశ్వరుండు-ననఘుండు తరిగొండ హరిప్రాణసఖుఁడు
మనమునఁ జింతించి మనలక లేచి-ఘనకరిచర్మంబు కాసెగాఁ గట్టి
వలనొప్ప పులితోలువలె వాటు వేసి-లలి మీరగా త్రిశూలంబు చేపట్టి
సారంగడ మరుక చాపబాణములు-నారూఢిగాఁ బూని యద్రిజ తోడ
నరుదైన నందివాహనముపై నెక్కి సురుచిరంబగు జటాజూటంబు నడుమ
నలఘు గంగా ప్రవాహంబు ఘోషింప-పొలుపొందగా చతుర్భుజములమీద
కుఱుచజడ ల్గాని కునిసి యాడగను- మఱియును తజ్జటామకుటంబుమీద
క్రమ మొప్పగా భాషికంబుచందమున-కమనీయ మగు చంద్రఖండంబు మెఱయ
నిటలమం దొక కెంపు నిలిచిన రీతి-స్ఫుటముగా ననలభాసురనేత్ర మొప్ప
నీలాలహారముల్ నెఱిఁ జుట్టినటుల-కాలకూటము చాల గళమందు వెలుగ
మొనసి ముప్పిరిగొన్న ముత్తెంపుసరము- లన దగు ఫణిభూషణావళి గదల
శరదభ్రశుభ్రలసత్కాంతి మేన-పరిపూర్ణచంద్రికపగిది దీపింప
పనిఁబూని ప్రమథులు భక్తితోఁ గొలువ-వనజాక్షు పాలికి వాయువేగమున
(వచ్చె నందివాహనుఁడై వామదేవుఁడూ)"

-విష్ణుపారిజాతము, 131-132 పుటలు.

తన యజమాని యభిప్రాయమును గుర్తించి నడచుకొనిన ఈ క్రింది నందీశ్వరుని (నందివాహనము) చర్య దర్శనీయమై యున్నది.

"చెలరేఁగి నంది కరిగరు
డుల నటునిటు ద్రోసి యుండె డంబగుచోటన్
బలము కొనియుండె ఖేచరు
లెలమి శివున్ వినుతి చేసి రిట్లని వేడ్కన్"

-విష్ణుపారిజాతము, 133 పుట.

యుద్ధాంతమున పరమశివుని ప్రేరణచే దేవేంద్రుడు పారిజాత తరువును శ్రీకృష్ణునకు సంకల్ప పూర్వకముగా ధారాగృహీతము గావించి

నట్లు కల్పించుటద్వారా ఈ కవయిత్రి ఇష్టదైవమునకు అపహరణ (చౌర్య) దోషమును నివారించినది.

అటు పిమ్మట దివిజతరువు సత్యభామ పెరటిలో నెలకొనగానే సవతుల కయ్యము వర్ణింపబడుట యక్షగానోచితముగా నున్నది. ఈ నాటకము చివర సత్యభామ పారిజాత పుష్పములతో గూడిన చందన తాంబూలములచే సవతులను సమ్మానించిన కథాంశము హరివంశము నుండి గైకొనబడినది10.

**పాత్రచిత్రణము :**

పాత్రచిత్రణమున ఈ కవయిత్రి సిద్ధహస్త యనుటకు ఈ నాటక మందలి చిన్న, పెద్ద పాత్రము లన్నియు దృష్టాంతములే. ఈ కథా నాయకుడుగు శ్రీ కృష్ణుని దక్షిణనాయకత్వము ఇందు స్పష్టరేఖలతో దిద్ది తీర్పబడినది. ప్రధాననాయిక యగు సత్యభామ కోపన యైనను, తిమ్మన సిద్ధేంద్రుల కృతులలో నున్నంతటి తీవ్రస్వభావగా గాక, శృంగార వైరాగ్య రసములు ముఖమున దీపించు పతిదేవతగా, భక్తురాలుగా చిత్రింప బడినది. జాంబవత్యాది తదితర నాయికలు, రాధ మున్నగు పాత్రములును ఈ యక్షగానమున సముచిత ప్రాముఖ్యముతో పోషింపబడి, వారి వారి మానసిక భావములు చక్కగా ఆవిష్కరింప బడియున్నవి.

ఇక ఈ కవయిత్రి సృష్టించిన సహాయక పాత్రలగు వక్రభాషిణీ వికట భాషణులు సార్థక నామధేయులు; సరళ స్వభావులు.

వికటభాషణడు శ్రీకృష్ణుని గాంచి యిట్లు పల్కెను:

"అన విని యా వనపాలుఁడు
వనజాక్షునిఁ జూచి వికటవాక్యంబులచే
నిను నవ్వింపం బలికెద
కనకాంబర! తప్పు నొప్పుగాఁ జూడ కయా!

దండదాసరి యగు వాని తప్పు లన్ని
దండమునఁ దీరుఁ గనుక ముందరనె నీకు
దండములను సమర్పించి తప్పు లొప్పు
లైన వికటోక్తు లడిగెద నాదరింపు"

-విష్ణుపారిజాతము, 5,6, పుటలు

పై రీతిగా విన్నవించుటలో ఆతనికి స్వామియెడ గల భయ భక్తులు వెల్లడి యగుచున్నవి.

ఆ వనపాలకుని భార్యయగు వక్రభాషిణి వక్రముగా మాటాడుటలో భర్తకన్న ఏడాకు లెక్కువ చదివినది. జాంబవతి తన వృత్తాంతమును దెల్పగా ఇట్లు పరిహసించినది:

"తల్లి పుష్పగంధి తండ్రి భల్లూకమే
యీడుజోడుఁ జూడ వేడు కయ్యెఁ
గాని వెలుముగొడ్డు గన్నకూతురును ని
న్నెట్లు తెచ్చె కృష్ణుఁ డిందువదన?" -విష్ణుపారిజాతము,13 పుట

ఈ వక్రభాషిణికి 'వికటభాషిణి' యని నామాంతరము కూడ కలదు. సత్యభామ ' నీ పేరే మని పిలుతురే ఓ కొమ్మా!' అని ప్రశ్నింపగా, 'నన్ను కలహకంటకి యందురే ఓ తుమ్మా' అని వెటకారముగా ప్రత్యుత్తర మొసగినది. సత్యభామ పాలిటికి నిజముగా కలహకంటకిగానే తొలుదొల్త గోచరించినను, అటు తరువాత ఆమె సందేశమును స్వామి కందజేయు దూతికగా వక్రభాషిణి సాత్రాజితికి మిగుల సహకరించినది.

'శ్రీ కృష్ణుని తోడ్తెచ్చినచో లంచ మే మీయ గల' వని వక్రభాషిణి యడుగగా సత్యభామ పలురకముల ఆభరణములను ఏకరువు పెట్టును. వక్రభాషిణి అవి యెల్ల అక్కర లేదనును. అట్లని భామాకలాపమునందలి 'మాధవి' వలె ఏడువారాల సొమ్ము లడుగక, శాశ్వతములైన ఈ క్రింది భూషణముల నిప్పింప గోరినది.

"అనిశంబు తరిగొండ హరికథల్ వినుటలే
పొలతి! కర్ణములకు భూషణములు

ఏ వేళ శేషాచలేంద్రునిఁ జూచుటే
పొసఁగ నేత్రములకు భూషణములు
ఘనవిష్ణు నామకీర్తనములు చేయుటే
పొలుపొంద వాక్కుకు భూషణములు
పూని కల్గినవేళ దానముల్ సేయుటే
బోటి! హస్తములకు భూషణములు

కనుక యీ నాల్గు గోరెద కమలగంధి!
శాశ్వతము గాని భూషణచయము లొల్ల
దేవదేవుని నిటకు నేఁ దెచ్చినపుడు
చెప్పి యిప్పించు మని యెల్ల చిగురుబోణి!"

-విష్ణుపారిజాతము, 49, 50 పుటలు.

పై పల్కులలో ఈ పాత్రయొక్క సరళ స్వభావము వ్యక్తమగుచున్నది. ఇట్లే ఇంద్రుడు మున్నగు పాత్రముల చిత్రణము తత్తత్స్వభావానుగుణముగా సముచిత రీతిని గావింపబడినది.

**నాటకీయత:**

రచనలో నాటకీయతాగుణమును పాదుకొల్పుటయందు సిద్ధహస్తురా లీ కవయిత్రి. ఈమె రచించిన యక్షగానకృతు లిందులకు పెట్టినది పేరు ఈ కృతియందలి ప్రతి సన్నివేశము సముచిత సంభాషణలతో విలసిల్లుచు చకచక సాగినది. సత్యభామ శ్రీకృష్ణును పాలంభించుట, ఇంద్రోపేంద్రుల యుద్ధము-వంటి విపుల ఘట్టములలో సైతము సంవాదశిల్పము నిండారియుండుట కొనియాడదగినది. ఈ గ్రంథ పరిమాణమును బట్టియు ఇది శ్రవ్య కావ్య తరగతికి చెందిన యక్షగాన మని తోచును ఐనను ఇందు ప్రదర్శనానుకూల్యమునకు కొదవ లేదు. ఇందలి పాత్రముల పలుకువ లెల్ల నాటకీయగుణ మహితములుగా తీర్పబడియున్నవి.

రాగతాళయుక్తములై దరువులు, రేకులు, ద్విపదలు, కందార్ధములు, ఏలలు మున్నగు దేశిచ్ఛందస్సుల వైవిధ్యముతో,

తత్సమాచ్ఛిక పద సముచిత సమ్మేళనముతో, శిష్టవ్యావహారికమందలి పలుకు బళ్ల పసందుతో ఇందలి నాటకీయ శైలి రసప్లుతముగా శోభిల్లుచున్నది. హాస్య, వీరము లీ నాటకమున అంగరసములై, ఇందలి ప్రధాన (అంగి) రసమగు శృంగారమును చక్కగా పోషించుచుండుట వలన ఈ యక్షగాన కృతి రసవత్తరమగు రమణీయ దృశ్యకావ్యముగా రాణించుచున్నది.

**కావ్యసందేశము:**

ఈ యక్షగానములో ప్రధానమైన కథ పారిజాతాపహరణ వృత్తాంతము. పరికించి చూడగా నిందు శ్రీకృష్ణుడు తన ప్రియురాండ్రను కలిసికొనుటకై పొందెడి తహతహ ఒకవైపు చెరలాడగా, ఆ ప్రియురాండ్రు సర్వసమర్పణ బుద్ధితో ప్రాణప్రియుని చేరుకొనుటకు పడు ఆరాటము ఇంకొకవైపున ప్రత్యక్షమగుచున్నది. ఇందులో పరస్పరానురక్తులైన స్త్రీ పురుషుల ప్రగాఢప్రణయము వాచ్యముగా నున్నను, భగవంతునకు, ఆయన భక్తులకు నడుమ నున్న ఆధ్యాత్మి కానుబంధము వ్యంగ్యముగా భాసించుచున్నది.

ఈశ్వర సాన్నిధ్యమునకై నిరంతరము తపించెడి జీవులు ఆ దివ్యసాక్షాత్కార మగుటతో బ్రహ్మానందము నందినట్లు సత్యభామాది పత్నులు శ్రీకృష్ణ సమాగమముతో పరమానందము నొందిరి. ఇందు మూలముగా మానవజీవితముయొక్క చరమలక్ష్యము పరమాత్మ సాక్షాత్కారమే యనెడి సందేశము ధ్వనిత మగుచున్నది.

**సిద్ధేంద్రయోగి కృతిపై ప్రభావము:**

తరిగొండ వెంగమాంబ ఈ యక్షగానమున కొంతమేర భామా కలాపమునందలి కథాసూత్రమును స్వేచ్ఛగా అనుసరించి యున్నది. తదనుసరణ ప్రభావము పరావర్తితమై సిద్ధేంద్రుని భామాకలాపముపై ప్రతిఫలించినది. అనగా విష్ణుపారిజాతమందలి దరువులు, పద్యములు, చూర్ణికలు మున్నగునవి భామాకలాపములోని కెక్కి తత్ప్రదర్శకులచే ప్రదర్శింపబడుచు వచ్చుచున్నవని తాత్పర్యము. ఇది యొక విచిత్రమైన సారస్వత సన్నివేశము! ఇందుల కొకటి రెండు నిదర్శనములు:

1 ఇంతకు ముందు పేర్కొనిన మరింగంటి వారి భామా కలాపము (వ్రాతప్రతి)లో సత్యభామ శ్రీకృష్ణునకు లేఖ వ్రాయు ఘట్టమున ఈ క్రింది వచనము, పద్యములు కలవు.

**సత్య:** "ఇక వెళ్లుచున్నావు గన్క నా స్వయముగా కొద్ది
ఉత్తరము వ్రాసి యిస్తాను పట్టుకొని వెళ్ళవే వోయమ్మా!
అనుచు తన కొనగోటితో నందముగను
పసిఁడి కేతకి రేకుపై పంక్తు లమరఁ
దన యభిప్రాయ మెల్లను దనర వ్రాసి
అపుడె తన చెలి కిచ్చి యి ట్లనియె తరుణి
చెలియా! లిఖితమ్మును మా
జలజాక్షున కిచ్చి చాల సమ్మతి మీరన్
పిలుచుక రమ్మన నది చని
యెలమిని పద్మాక్షుఁ జేరి యి ట్లని పలికెన్."
-మరింగంటి వారిప్రతి, 69, 70 పుటలు

పై రెండు పద్యములు 11 విష్ణుపారిజాతమున యథాతథముగా దర్శన మిచ్చుచున్నవి. (చూ. 51, 52 పుటలు)

2) విష్ణుపారిజాతమునందలి సత్యభామా యుత్తరము 12 (ద్విపద) (53, 54 పుటలు) మరింగంటి వారి ప్రతిలో "తరిగొండవారి యుత్తరము" అను శీర్షికతో తు,చ తప్పక దర్శన మిచ్చుచున్నది.

3) సత్యభామ శ్రీకృష్ణును పాలంభించు ఘట్టమున గల 'వైరివార గజసింహ! తరిగొండ నారసింహ!,' 'చాలు నిక పోవె నీ ప్రేమ సత్యభామ!' అను మకుటములతో గూడిన సీసపద్యములు13 కొన్ని (చూ. 90-98 పుటలు) మరింగంటివారి ప్రతిలో ఆ యా చోటుల అట్లట్లే కన్పట్టుచున్నవి.

4) ఇంతేగాక, విష్ణుపారిజాతమున గాన్పింపని ఈ కవయిత్రి రచించిన మఱికొన్ని దరువులు, కీర్తనలు భామాకలావవు వ్రాతప్రతిలో గన్పట్టుచున్నవి. ఈ విషయమునే బందా కనకలింగేశ్వరరావు గారు

ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడెమీవారు ప్రచురించిన 'భామా కలాపము' నకు వ్రాసిన ఉపోద్ఘాతములో క్రింది రీతిని తెల్పినారు.

"ఈ నాడు మేము వెతుకగా సుమారు నూరు ప్రతులు లభించాయి. అనేక పాఠాంతరా లున్నాయి ... ... ... ... ... ... కూచిపూడిలో వేదాంతం పార్వతీశం మరొక ప్రతిని రచించారు. బందరు మరంగంటి శేషాచార్యులవారి వద్ద మరియొక ప్రతి ఉన్నది. తరిగొండ వెంగమాంబ గారు ఇందు కొన్ని కీర్తనలను రచించారు. అందుకు నిదర్శనంగా వేంకటేశ్వర మకుటంతో కొన్ని దొరికాయి ... ... ... ... ..."

-ఉపోద్ఘాతము, 111 పుట.

మచ్చుకు ఈ క్రింది కీర్తన అట్టివానిలో నొకటి.

"మా వేంకటేశునకు మంగళం। మదభీష్టదాయికీ మంగళం
సరసీజానేత్రునకు, వనమాలాగాత్రునకు।
మరకతాభరణునకు మంగళం ॥మా వేంకటేశునకు॥
మునిజవాపాలూనకూ, వనమాలాధారునకూ
మరుపారివారునకూ మంగళం ॥మా వేంకటేశునకు॥
ఉరగశైల వాసునకూ, గరుడవాహనునకూ
మరునీ జనకునకూ మంగళం." ॥మా వేంకటేశునకు॥

- మరింగంటి వారి భామాకలాప ప్రతి, 197 పుట.

పై నుదాహరించిన మంగళహారతి నేడు విష్ణుపారిజాతమున కాన రాదు. కాని అది తరిగొండ వెంగమాంబ రచనయే యని అందలి వేంకటేశ మకుటము, 'ఉరగశైల వాసునకూ' ఇత్యాది పదములు చెప్పక చెప్పుచున్నవి. బహుశః పై కీర్తన ఈ కవయిత్రి రచించిన రుక్మిణీ నాటకము వంటి అలభ్య యక్షగా నములందలిది గాని, ఆమె ప్రత్యేకముగా అప్పుడప్పుడు చెప్పిన కీర్తనల సముదాయములోనిది గాని అయి యుండును.

ఫలితార్థ మే మనగా సిద్ధేంద్రుని భామాకలాపము నాదర్శముగా గొని అనేక రచయితలు 'భామాకలాపము'లను 'పారిజాతము' లను, రచించినను, వాటిలో నే యొక్కటియు తరిగొండ వెంగమాంబ ప్రణీతమగు విష్ణు పారిజాతమువలె ఉపజ్ఞావిలసితముగా ప్రభావమును ప్రసరింపజేసినది కాలేదు. ఇందులకు ఈ యక్షగాన కృతిలో ప్రతిఫలించిన ఆ కవయిత్రి కవితా మహత్త్వమే ఆది కారణము.

కవయిత్రి ఈ కృతి చివర తిరుమల క్షేత్రముపై గల నకల వస్తువాహనాది విశేషములకు, సేవకులు మున్నగు సమస్తమునకు మంగళముల నాకాంక్షించుచు రచించిన 'జయమంగళ' గీతిక నిర్మల భక్తికి నిదర్శనమై, అలమేల్మంగాపతి కామె యర్పించిన అక్షర నీరాజనముగా అలరారుచున్నది.

## జలక్రీడావిలాసము

ఈ కృతి ఇటీవలనే బయల్పడిన వెంగమాంబ రచన. ద్విపద భాగవతారికలో ఈ గ్రంథము పేర్కొనబడనందున ఇది తదనందతర రచన యనుట నిశ్చయము. ఈ కవయిత్రి ద్విపద భాగవతమునకు పిమ్మట వేంకటాచల మాహాత్మ్యము, ముక్తికాంతా విలాసము, వాసిష్ఠ రామాయణము అను గ్రంథములను రచించినది. వీటిలో వేంకటాచల మాహాత్మ్యము ద్విపద భాగవతమైన వెనువెంటనే వెలువడిన రచన యని అందలి అవతారిక సాక్ష్య మిచ్చుచున్నది. ఇక ముక్తికాంతావిలాస, వాసిష్ఠ రామాయణములు ఈ కవయిత్రి చివరి రచన లనుటకు వాటియందలి వస్తుతత్త్వ, రచనారీతులే తార్కాణములు. కావున ప్రకృత జలక్రీడా విలాసకృతి వేంకటాచల మాహాత్మ్య, ముక్తికాంతా విలాసములకు నమిడి కాలమున రచింపబడినట్లు నిశ్చయింపవచ్చును. ఈ నిశ్చయము ననుసరించి, ఇది యీమె రచించిన యక్షగానములలో ఎనిమిదవ దగుచున్నది.

**కథావస్తువు :**

ఇందలి కథావస్తువునకు బమ్మెరపోతనామాత్యుని భాగవత దశమస్కంధ పూర్వభాగము ఆధారము. ఈ భాగము దాదాపు 1800

గద్యపద్యములలో విస్తరించి యున్నది. అందుండి వెంగమ ఆవశ్యకములైన కథాభాగములను గైకొని, వాటిని నాటకోచితముగా తీర్చిదిద్ది, 'కలికికృష్ణుని' బాల్యలీలలను కడు మనోజ్ఞరీతిని స్వేచ్ఛగా గాన మొనరించినది. కవయిత్రి దశమస్కంధ పూర్వభాగమునుండి స్వీకరించిన వాటిలో అత్యంత విపులముగా వర్ణించిన ఘట్టములు మూడు. అందొకటి శ్రీకృష్ణావతార ఘట్టము. ఇది కంసుడు తేరునడపుట మొదలుకొని, పురోహితుడు జన్మఫలమును దెలుపుటవరకు ఈ యక్షగానమున ఇంచుమించు మూడవ వంతు విస్తరించియున్నది. రెండవది బాలకృష్ణుడు గోకులమున జేయు దుడుకుపనులు, గోపకాంతల ఫిర్యాదులు, వలసపోయెదమని యశోదతో పల్కుటలు- వీటన్నిటితో ఈ గ్రంథమున దాదాపు ఇంకొక మూడవ వంతు పరిమితితో విస్తరిల్లి యున్నది. మూడవది గోపికలు జలక్రీడ లాడుచుండగా శ్రీకృష్ణుడు వారి చేలముల నప హరించిన ఘట్టము.

పూతనాహరణము, శ్రీకృష్ణు డావులించి వదన గహ్వరమున బ్రహ్మాండములను చూపిన ఘట్టము, గోపికలు పార్వతీ వ్రత మొనర్చుట- అనునవి ఇందు విపులీకరింపబడిన మఱికొన్ని సన్నివేశములు. శకటాసురభంజనము, తృణావర్త విదళనము, బలరామ కృష్ణుల నామకరణము, మృద్భక్షణ సన్నివేశము, యమళార్జున భంజనము, కాళీయమర్దనము మున్నగు సన్నివేశములను ఈ కవయిత్రి నాతి విస్తరముగ, నాటకానుగుణముగ వర్ణించినది.

వత్స, బక, అఘాది రాక్షసుల సంహరించుట, జలక్రీడానంతర కథలగు బ్రాహ్మణస్త్రీల రక్షణము, గోవర్ధనోద్ధరణము, చాణూర కంసాది దుష్టుల దునుమాడుట, ద్వారకా నిర్మాణము, అష్టభార్యలందు పుత్రుల గనుట- అను నంశములు ఇందు మాటమాత్రమున సూచింపబడినవి.

ఇక ఈ కవయిత్రి స్వీకరింపనివి: శ్రీకృష్ణ బలరాముల బాల క్రీడాభి వర్ణనము, యశోదానందుల పూర్వజన్మ వృత్తాంతము, నందాదులు బృందావనమునకు వచ్చుట, శ్రీకృష్ణుని చల్దులు, బ్రహ్మ గోవత్సములను, గోపబాలురను అంతర్ధాన మొందించుట, బలరాముడు ధేనుక ప్రలంబులను వధించుట, కాళీయుని పూర్వకథ, గోగోపగోపికా సంఘమును కార్చిచ్చు చుట్టుకొనుట, శ్రీకృష్ణుడు దావాగ్నిని మ్రింగుట,

గ్రీష్మవర్షాది ఋతువర్ణనలు మున్నగునవి. కవయిత్రి యీ ఘట్టములను నాటకీయతా దృక్పథముతో పరిత్యజించినది.

**పాత్రచిత్రణము :**

ఇతివృత్త స్వభావము ననుసరించి ఈ యక్షగానము పాత్ర బాహుళ్యము గలదై ప్రకాశించుచున్నది. కంసుడు, దేవకీ వసుదేవులు, బలరామ కృష్ణులు, యశోదానందులు, రోహిణి, పురోహితుడు, గోపికలు, వృద్ధులగు గొల్ల దంపతులు మున్నగువా రందు ముఖ్యముగా పేర్కొనదగియున్నారు. ఈ పాత్రలలో పురోహితుడు, గొల్లదంపతులు - కవయిత్రి సృష్టి. ఇంతటి పాత్ర వైవిధ్య మున్నను ఇందలి ప్రతి పాత్రయు పఠితల హృదయరంగమున సుస్పష్ట రేఖలతో ప్రత్యేకముగా ప్రతి ఫలించు నట్లు తీర్చిదిద్దిన ఈ కవయిత్రి కౌశలము స్తుతిపాత్రయై యున్నది. కొలది పల్కులలోనే పాత్రల స్వరూప, స్వభావములను అవిష్కరించు నేర్పునకు ఈ క్రిందివి కొన్ని యుదాహృతులు.

ఉదా:-i) దేవకి యెన్మిదవ శిశువును గనె నని విని వచ్చుచున్న కంసుడు:

"... ... ... ... ....
కోరమీసము దీడుకుంట - గ్రుడ్లు బిక్కరించుకుంట
శూరుఁడై, దేవకి యున్న - సూతికాగృహములోకి
తల విరియ బోసుకూని - దాక్షిణ్య మంతయు మాని
చెలియలి బిడ్డను పూని - శిక్షించేను విడువనావి
"కంసుఁడు వచ్చెనూ, కాల - కంసుఁడు వచ్చెనూ॥
... .... .... ... ... ..."

ii) ముదుసలి గొల్లదంపతులు:

"అనుచు కోడలు బిల్వ నాయత్తవేగ-విని, చిఙ్ఞి వెంట్రుకల్ గదల
తోలుతిత్తుల రీతి తొడరిపాలిండ్లు-తూలి యాడగ, నోటతుప్పరల్ గురియ
తల వణకింపుచు తబ్బిబ్బు పడుచు-నులుకుచు, తన కోడలున్న చోటికిని
తరిగొండ నరహరి దాక్షిణ్య మేమి?-తరిమి కొట్టెద నంచుఁ దలఁచి తా వచ్చె."
"ఆ లోన ముసలివాఁడగు గొల్లగౌడు-పాలకావడి మూపుపైన నుంచికొని
గొంగడి ముసుగుతో గూను వంచికొని-యుంగరముల కట్టె యూతచేసికొని

కసరుచు రెండు కుక్కలు వెంటరాఁగ-మునలిది యున్నట్టి ముంగిటి కపుడు పోయి, తా దాని నప్పుడు గాన కలిగి-యాయెడ తరిగొండ హరి సేయుపనుల కొరకు గోపెమ్మతో కొట్లాడుచోటి-కరిగి యి ట్లనియె కోపావేశముననను."

**వర్ణనలు :**

ఈ నాటకము అనతిదీర్ఘములు, ఆహ్లాదకారులు నగు వర్ణనలకు నెలవై యున్నది. వెంగమాంబ కవితాప్రజ్ఞకు నిదర్శనములైన అట్టి వర్ణనలలో ముఖ్యమైనది శ్రీకృష్ణావతార వర్ణనము. ఇది సంస్కృత భాగవతమున రెండే రెండు శ్లోకములలో ఇమిడి యున్నది.

"తమద్భుతం బాలక మంబుజేక్షణం, చతుర్భుజం శంఖగదాద్యుధాయుధమ్।
శ్రీవత్సలక్ష్మం గళశోభి కౌస్తుభం. పీతాంబరం సాంద్రపయోద సౌభగమ్॥
మహార్హ వైడూర్య కిరీట కుండల, త్విషాపరిష్వక్త సహస్రకుంతలమ్।
ఉద్దామ కాంచ్యం గద కంకణాదిభిః, విరోచమానం వసుదేవ ఐక్షత॥"

-X స్కం: 3 అధ్యా; 9, 10 శ్లో

పై రెండు శ్లోకముల భావము పోతన రచనలో ఈ క్రింది సీసపద్యముగా పెంపొందినది.

"జలధరదేహు నాజానుచతుర్బాహు
సరసీరుహాక్షు విశాలవక్షుఁ
జారుగదాశంఖచక్రపద్మవిలాసుఁ
గంఠకౌస్తుభమణికాంతిభాసుఁ
గమనీయకటిసూత్రకంకణ కేయూరు
శ్రీవత్సలాంఛనాంచితవిహారు
మరుకుండలప్రభాయుతకుంతల లలాటు
వైడూర్యమణిగణవరకిరీటుఁ
బాలుఁ బూర్ణేందు రుచిజాలు భక్తలోక
పాలు సుగుణాలవాలుఁ గృపావిశాలుఁ
జూచి తిలకించి పులకించి చోద్య మంది
యుబ్బి చెలరేఁగి వసుదేవుఁ డుత్సహించె."

- X స్కం; పూర్వభా; 112 ప.

వెంగమాంబ పోతన వర్ణనను యథాతథముగా స్వీకరింపక, ఇష్టదైవమగు శ్రీకృష్ణుని దివ్యమంగళ స్వరూపమును మణిమకుటము మొదలుకొని పాదాంగుష్ఠము షర్యంతము మహనీయముగా భావనచేసి, ఆ భావనను ఈ క్రింది ద్విపద పంక్తులలో మనోజ్ఞముగా ఆవిష్కరించినది. చూడుడు.

"అపుడు పరబ్రహ్మమైన విష్ణుండు-కపటరాక్షసగజ కంఠీరవుండు
శ్రీ పన్నగాచల శిఖరవాసుండు-నాపాలి తరిగొండ నారసింహుండు
గణనాధిక ప్రభాకలితమై, దివ్య-మణిమయంబగు హేమమకుటంబుతోడ
అలకల నొప్పు ఫాలార్ధాబ్జుతోడ-తళుకైన భ్రూలతా ద్వంద్వంబుతోడ
విమలావృత కటాక్షవీక్షలతోడ - కమనీయమగు టెక్కు గల నాసతోడ
దళమైన కెంజాయ దగు మోవితోడ-ధళధళ వెలిగెఁడి దంతాళితోడ
అందంబు గులికించు హాసంబుతోడ-నైందవబింబోపమాస్యంబుతోడ
నురురత్నకుండల యుగళంబుతోడ-సిరులజొంపము లీను చెక్కిళ్ళతోడ
దరసుదర్శనగదాతామరముల- భరియించు పటుచతుర్బాహులతోడ
ఘనకౌస్తుభాంచిత కంఠంబుతోడ- వనమాలికా హారవారంబుతోడ
వనధిజ కిరవైన వక్షంబుతోడ - వనద సంకాశమౌ వర్ణంబుతోడ
అపరిమితాబ్జ భవాండంబు లొప్ప-నుపమింప సూక్ష్మమౌ నుదరంబుతోడ
ఘనుఁడైన హాటకగర్భున కనిశ-మునికియౌ నాభిపయోజంబుతోడ
నాదిత్య నిభమేఖలావృతదివ్య-దేదీప్యమాన దీధితికటితోడ
భూరి తటిల్లతా పుంజ విస్ఫూర్తి- వారించు కాంచనవసనంబుతోడ
మరకత స్తంభసమానమై చాల -నొఅపు గల్గిన యూరుయుగళంబుతోడ
వారిధి కన్యకావరహస్తయుగళ-సారోపచరిత సజ్జంఘలతోడ
నార్తరక్షణ బిరుదాంకంబు లగుచు- స్ఫూర్తితో మ్రోయు నూపురములతోడ
నిగమాంతవీధుల నిరతంబు దిరుగఁ-దగియున్న పాదపద్మంబులతోడ
మొనసి వామాంగుష్ఠమున సంతతంబు - దనరుచున్నట్టి మందాకినితోడ
శతకోటి మన్మథసౌందర్యధుర్య-వితతి విభ్రమమూర్తి విభవంబుతోడ
నారూఢకోటి చంద్రార్కహుతాశ-తారాతటిత్ప్రభాతతులకు మూల
కారణమైన ప్రకాశంబుతోడ-ధీరుఁడై దేవకీదేవి గర్భమున

అలర శ్రావణ బహుళాష్టమినాడు-నలు వొప్ప రోహిణినక్షత్రమందు
సగమురాతిరివేళ సంపూర్ణకళల-జగదీశుఁడుదయించె జగతీతలమున."

మీది 'శ్రీకృష్ణజనన' వర్ణనకు పిమ్మట పేర్కొనదగినవి ఇందలి దుడుకుచేతలు. పోతన భాగవతమున సంగ్రహముగా నున్న బాలకృష్ణుని చిలిపిచేష్టలను కవయిత్రి ఈ నాటకమున జానపద జీవనానుగుణముగ విస్తరించి వర్ణించినది. ఇట్లే గోపికల జలక్రీడలు కూడ విపులముగా వర్ణితములైనవి. కాళీయుని పడగలపై శ్రీకృష్ణుడొనర్చిన ఈ క్రింది దివ్యనాట్యవర్ణన ఈ యక్షగానమందలి వర్ణనలలో మకుటమణియై వరలుచున్నది.

"ఆడెనే! కృష్ణుఁ - డాడెనే!
పాడుచు నా గో - పకులందరు తన
వేడుక చూడగ - వింతగ నగుచూ ॥ఆడెనే॥

తతకిట తకఝుం- తధిమిధిమిత యని
గతులు చొల్లు లతు - లితముగ మెఱయా ॥ఆడెనే॥

అలరుచు చిరుగ - గజ్జెలు, నూపురములు
ఘలు ఘలు ఘలు ఘలు - ఘ ల్లని మ్రోయా ॥ఆడెనే॥

ధాణు ధణం ధణు - ధణిత యనుచు గీ
ర్వాణులు నభమున - వరుసగఁ బొగడా ॥ఆడెనే॥

మణిభూషణములు - మఱి మఱి కదలగ
ఘణ ఘణ యని మొల - ఘంటలు మొరయా ॥ఆడెనే॥

తారి తకిణ ఝుం - తకకిణ తక ఝుం
తారి తకిట తక - తాతై యనుచూ ॥ఆడెనే॥

వర తరిగొండ ని - వాసుడు వేంకట
గిరి నిలయుండగు - కృష్ణుఁడు చెలఁగీ ॥ఆడెనే॥

వెంగమ ఈ యక్షగానములో నొకటి రెండుచోట్ల లీలాశుకుని శ్రీకృష్ణ కర్ణామృతమునందలి శ్లోకముల భావములను స్వీకరించి, వాటిని స్వీయభావనచే పెంపొందించి వర్ణించినది. వాటిలో ఈ క్రిందిది యొకటి.

యశోద చిన్ని కృష్ణుని నిదుర పుచ్చుటకై రామాయణ కథను చెప్పు సందర్భమందలిది:

"రామోనామ బభూవ హుం; తదబలాసీతేతి హుం; తాం పితు
ర్వాచా పఞ్చవటీతటే విహరత స్తస్యా హర ద్రావణః
నిద్రార్థం జననీ కథా మితి హరే ర్హు ఙ్కారతః శృణ్వతః
సౌమిత్రే! క్వ ధను ర్ధను ర్ధను రితి వ్యగ్రా గిరః పాంతు నః॥"
శ్రీ కృష్ణ కర్ణామృతమ్, II అశ్వా; 72 శ్లో.

ఈ శ్లోకభావ మిది :

"రాము డనువా డొక డుండెను. అతని భార్య సీత. అతడు తండ్రియాజ్ఞ ననుసరించి పంచవటియొద్ద విహరించుచుండగా అతని భార్యను రావణు డపహరించును - అనగానే అంతవరకు హుఁ, హుఁ అని ఊకొట్టుచు వినుచుండిన కృష్ణుడు 'లక్ష్మణా! విల్లు విల్లు విల్లెక్కడ? అని ఆవేశముచే తొట్రుపడుచు పల్కెను. ఆ తొందర పల్కులు మమ్ము రక్షించుగాక!"

పై శ్లోకమున కృష్ణుని నిదుర పుచ్చుటకై (నిద్రార్థం) యశోద కథ చెప్పినట్లున్నది. ఈ యక్షగానమున (తనను పొరుగిండ్లకు పోనీయనందున) ప్రొద్దుబోవుట లేదని, ఒక ఊకుడుకత (ఊకొట్టుచు వినెడు కత) చెప్ప వలసినదని కృష్ణు డడుగగా యశోద కథను చెప్పినట్లు మార్పు గావింపబడినది. మఱియు పై శ్లోకమున కథ ముగియక ముందే కవి " ఆ తొందర పల్కులు మమ్ము రక్షించుగాక!" (ఇతి వ్యగ్రా గిరః పాంతు నః) అను వాక్యముతో శ్లోకమును ముగించి యున్నాడు.

వెంగమాంబ పై శ్లోకభావమును ఇరువదాఱు ద్విపదలలో మనోజ్ఞముగా పెంచి రామకథను వర్ణించి, తదనంతర మొకదరువులో బాలకృష్ణుని వీరావేశపు పల్కులను పల్కించినది. ఆ యావేశము చల్లారుటకై తదనంతర కథను త్వరగా ఎనిమిది ద్విపదలలో నెట్లు చెప్పించినదో తిలకింపుడు:

"అని యిట్లు బాలకుఁ డార్భటింపుచును-మొనసి వీరావేశమున నటింపుచును
అట్టహాసముఁ జేయ నట్టి నందనుని-పట్ట జాలక భీతిపడి యా యశోద
ఇట్టి వీరావేశ మితని కీ వేళ-బుట్టె నిం కెట్లని బుద్ధిఁ జింతించి,
'జలజాప్తకులుఁ డంత జలజాప్త సుతుని-బలముతో నంభోధి బంధించి పోయి
లంక ముట్టడిఁ బెట్టి లలి దశాననుని-మంకురక్కసులను మహిఁ గూల నేసి
ప్రేమతో నచట విభీషణునుంచి-భూమిజఁ గై కొని పొసఁగ సాకేత
పట్టణమునఁ జేరి భరతుఁ జేపట్టి-పట్టాభిషిక్తుఁడై ప్రజలఁ బాలించె'
నని పల్కవిని శాంతుఁడగుచు కృష్ణుండు-తనతల్లి తొడమీద తాను గూర్చుండె."

ఇట్లు లీలాశుకుని భావ మాధారముగా రామాయణ కథను సమగ్రము, సంగ్రహమునైన 'ఊకుడుకత' గా కేవలము ముప్పది నాలుగు ద్విపదలలో వర్ణించిన వెంగమ కవనకౌశలము నిరుపమము!

**శైలి :**

ఈ యక్షగానశైలి ఆదినుండియు ఆహ్లాదకరముగ సాగినది. సహజములైన తెలుగు పలుకులు, సుందరములగు తత్సమములు వీని సముచిత సమ్మేళనముతో సందర్భానుగుణముగా, పాత్రోచితముగా, శ్రావ్యముగా జాల్వారిన జలక్రీడా విలాసమున ప్రతి పట్టును ఒక మధుర ఘట్టమే. ఈ క్రింది లాలిపాట ఇందుల కొక మంజులోదాహరణము.

"లాలి ముద్దుల బాల ! - లాలి గోపాలా!
లాలి కాంచనచేల ! - లలితగుణజాలా ! ॥లాలీ॥

ప్రవిమలాచార ! యా - దవకులోద్ధారా!
కవిబృందమందార ! - కలికలుషదూరా! ॥లాలీ॥

నందనందన ! సదా ! - నంద! గోవిందా!
సౌందర్యవదనార - వింద! ముకుందా! ॥లాలీ॥

వరచిన్మయాకార ! - వనధిగంభీరా!
నిరుపమగుణహార ! - నిగమసంచారా ॥లాలీ॥

శైలజస్తుతనామ ! - సంపూర్ణకామా!
నీలమేఘశ్యామ ! - నిర్జర (లలామా!) ॥లాలీ॥

తరిగొండపురవాస ! - తారకవిలాసా
చిరరమ్యదరహాస ! - శ్రీ శ్రీనివాసా! ॥లాలీ॥

ఈ కృతియందలి కొన్ని సన్నివేశములలో స్తుతిసుభగములైన సంస్కృత శ్లోకములు, చూర్ణికలు మొదలగునవి రచింపబడియుండుట, పురోహితుడు, గొల్ల దంపతులు మున్నగు పాత్రలయెడ పాత్రోచిత వ్యావహారికమును ప్రయోగించి యుండుట, అంతేగాక బలరామ కృష్ణులకు వయోనుగుణమగు 'బాలభాష' ను కూర్చియుండుట ఇత్యాది భాషావైచిత్రివలనను, పెక్కురీతుల దేశిమార్గచ్ఛందో వైవిధ్యముచేతను ఈ యక్షగానశైలి భావస్ఫోరకమై రసానుగుణముగా నినదించుచున్నది.

## శివనాటకము

వెంగమాంబ రచించిన యక్షగానములలో శివనాటక మొక్కటి శివకథాత్మకము. 'శివవిలాస' మనియు దీనికి నామాంతరము. తరువాతి వారు కొందరు 'శివపారిజాత' మనియు వ్యవహరించిరి. నిజమునకు ఈ నాటకమున 'పారిజాతము'నకు ప్రసక్తి లేకున్నను, విష్ణుపారిజాతమున నారదుడు తెచ్చియిచ్చిన పుష్పము కారణముగా సత్యభామకు ఆమె సపత్నులకు మధ్య మచ్చరము పెంపొందినట్లే, ఈ కృతియందును ఆ నారదుడే తెచ్చి యిచ్చిన రత్నాలహారము కారణముగా గంగాగౌరులనడుమ సవతికయ్యము సాగుటవలన, 'పారిజాత' మను పేరు, తద్వృత్తాంత సామ్యముచే అన్వర్థముగానే స్ఫురించుచున్నది. వెంగమ యక్షగాన రచనలలో రెండవ దగు ఈ కృతియందలి కథా స్వరూపము సంక్షేపముగా నిట్లున్నది:

### కథాసంగ్రహము:

నైమిశారణ్యమున శౌనకాది సన్మునులు సూతుని గాంచి యిట్లు ప్రశ్నింతురు: 'సూతా! నారదుడు పారిజాత ప్రసవమును దెచ్చి నారాయణుని కీయగా, ఆతడు రుక్మిణి కొసగగా, సత్యభామ అందుల కోర్వక చనవున కలహించె నని పూర్వము నీవు చెప్పగా వింటిమి.

గంగా,ఉమాదేవులు ఏల వాగ్వాదము సల్పిరో ఆ విధమెల్ల వినగోరుచున్నాము.' అనగా నపుడు సూతుడీకథను చెప్పినట్లు కథ ప్రారంభ మగును.

కైలాస పట్టణమందలి పరమేశ్వరుడు ఒకనాడు గౌరితో అలిగి గంగయిల్లు చేరును. పార్వతి విరహతాపముతో తన కొరకన్వేషించుచున్న విషయము నూహించిన శివుడు గంగను బొంకించి మరల పార్వతి మందిరమును ప్రవేశించును. ఆ సమయమున నారదుడు సూర్యునిచే నొక రత్నహారమును బడసి తెచ్చి శంకరున కిచ్చును. శంకరు డా హారమును పార్వతి కొసగును.

గంగాదేవి యొక్క చెలికత్తె యొకతె శివునికొరకు వెదకుచు వచ్చి, గౌరీమందిరమున నున్న శివుని రమ్మని ప్రార్థించును. శివుడు నిరాకరింపగా, ఆ చెలికత్తె వెళ్లి రత్నాలహారమునుగూర్చి గంగకు దెల్పును. చెలుల ప్రేరణచే గంగ స్వయముగా పార్వతీమందిరమున కేగి శివుని ఆహ్వానించును. శివుడు నిరాకరింపగా గంగ రోషముతో సమస్త లోకములయందలి జలముల నుపసంహరించును. బ్రహ్మాది దేవతలు, మునులు, దిక్పాలురు మున్నుగా గల గ్రహనక్షత్రాది విశ్వ మంతయు గగ్గోలుపడును.

తరిగొండ పట్టణమందలి నృసింహుని పత్ని లక్ష్మీదేవి కొఱవంజి యై గంగ నగరున కేగి సోదె చెప్పును. శివు డొకటి రెండు గడియలలో రా గలడని, అప్పుడు నారదుని రత్నాలహారమును మించిన బ్రహ్మయొక్క మాణిక్యహారమును తెచ్చి యిచ్చునటుల శివుని కోరవలసినదిగా కొఱవంజి గంగకు బోధించి వెళ్లును.

దేవతల ప్రార్థన ననుసరించి శంకరుడు, పార్వతి నెట్లో అంగీకరింప జేసి గంగమందిరమున కేగును. ఎట్టకేలకు బ్రహ్మ శివునకు తెచ్చియిచ్చిన మాణిక్యహారముతో జాహ్నవి ప్రసన్నురాలగును. పార్వతి శివు నన్వేషించుచు అక్కడకు వచ్చును. గంగాపార్వతులు కొంతసేపు తీవ్రముగా సవతుల కయ్య మాడుదురు. అనంతరము శివు డిర్వురను సమాధానపరచును. చెలులు ఆ ముప్పురకును మంగళములు పాడుటతో కృతి సుఖాంత మగును.

నారదుడు శ్రీకృష్ణున కర్పించిన పారిజాతపుష్పము కారణముగా సత్యారుక్మిణుల నడుమ నడచిన కలహవృత్తాంతము ననుసరించి

వెంగమ యీ కథను అపూర్వముగా కల్పించినది. నారదుడు గానముచే సూర్యుని మెప్పించి రత్నాలహారమును బడయుట యనునది ఈ కథలో ముఖ్యమైన కల్పన. జానపద వాఙ్మయమున అనాదిగా ప్రచారములో నున్న గంగా గౌరుల సవతి కయ్యమునకు, నారదుడొసగిన రత్నహారమును హేతువుగా కల్పించి యతుకుటతో ఈ యక్షగాన కథ విస్తరిల్లినది.

ప్రారంభమునుండి పార్వతి భవనమున నున్న శివుని కడకు జాహ్నవి చెలి వచ్చి ప్రార్థించుటవరకు గల కథను మొదటి భాగముగను, అటనుండి తుదివరకు గల కథను రెండవ భాగముగను పరిగణించినచో ఇందు కథా నిర్వహణము మొదటి భాగమునకన్న రెండవ భాగమున పటువుగా సాగిన దని చెప్పదగియున్నది.

మొదటి భాగమున శివుడు భాగీరథిని జూడదలచినవాడై పార్వతితో అలిగి, పంతముతో జాహ్నవి యిల్లు సేరును. పిమ్మట తన కొరక కన్వేషించుచున్న పార్వతి వైనమును ఊహించి, జాహ్నవిని బొంకించి గౌరీమందిరము చేరుకొనును. ఇందువలన శివుని తొందరపాటు, పార్వతియం దాయనకు గల పక్షపాతము వ్యక్తమగుచున్నవి. ఈ పక్షపాతము తరువాత జరుగబోవు సవతి కలహమునకు ప్రాతిపదికగా అమరినది.

వెంగమ యీ కథను నిర్వహించుటలో సిద్ధేంద్రుని భామాకలాప పద్ధతిని ఒరవడిగా గ్రహించినటుల తోచుచున్నది. కోపనయగు నాయిక (జాహ్నవి) పతికడకు రెండుమారులు చెలికత్తెను పంపుట, మూడవ పర్యాయము తానే వెళ్లి పతిచే నిరాకృతయై సవతితో కయ్యమాడి వచ్చుట, పిమ్మట పతికడకు లేఖ నంపుట మొదలగు కథాక్రమ మంతయు భామాకలాపపు బాణీలో ఇందు నెలకొల్పబడినది. దూతికి లంచముగా పలురకముల సొమ్ములను నాయిక ఏకరువు పెట్టుట, భర్త పక్షపాతము నెఱిగి నాయిక విరహాతురయై మూర్ఛిల్లుట -అనెడి కథాంశములును పై విషయమునే చాటుచున్నవి. ఇట్లు ఈ కథను శివసంబంధిగా సృష్టించుట లో ఈ కవయిత్రి కృతకృత్యురాలైనది.

**పాత్రచిత్రణ :**

ఈ యక్షగానము ప్రధానపాత్రలు ముగ్గురు: శివుడు, పార్వతి, జాహ్నవి. వీరు గాక నారదుడు, తామసి, ఎఱుకసాని, బ్రహ్మ - అను సహాయక పాత్రములును, భృంగీశ్వరుడు, బాల, శ్యామల, కాళి, దుర్గి, సింగడు - అను అప్రధాన పాత్రములును ఇందు గలరు. వీరిలో ఎఱుకసాని, సింగడు తప్ప తక్కిన పాత్రము లన్నియు దివ్యములు. ఈ పాత్ర లన్నింటి స్వరూప, స్వభావములను వెంగమ సుస్పష్ట రేఖలతో, అత్యంత సహజముగా, ఉదాత్తముగా తీర్చిదిద్దినది. మచ్చుకు ఒకటి రెండుదాహరణలు:

i) గంగ యింటినుండి వచ్చుచున్న పరమేశ్వరుడు:

"సలలిత నాగభూషణములతోడ-పులితోలుతోడఁ త్రిపుండ్రంబుతోడ
సుమయుక్త మగు జటాజూటంబుతోడ-గమనీయ మగు చంద్రఖండంబుతోడ
శరదభ్రశుభ్రలసత్కాంతితోడ-గరళయుతం బైన కంఠంబుతోడ
సురుచిరం బైన త్రిశూలంబుతోడ-నరు దైన కోమలహరిణంబుతోడఁ
బ్రవిమలబ్రహ్మకపాలంబుతోడ-సవరణ గల నాగచర్మంబుతోడ
నలరారుచున్న ఫాలాక్షంబుతోడ -నలఘుప్రకాశాంగుఁడై వేడ్కతోడ
విమలమై చెన్నొందు వృషభేంద్రు నెక్కి-ప్రమథగణంబులు ప్రార్థించి తొలుత
మనసిజవైరి సమ్మతమున రాగ"

ii) తరిగొండ నృసింహుని యాదేశానుసారము లక్ష్మి సవదరించిన కొరవంజి వేషము:

"వచ్చె నెఱుకో యెఱుక యనుచును వాడవాడల వెంటను
హెచ్చుగా మందాకినికిఁ దా నెఱుకఁ జెప్పెద ననుచును
ఘలు ఘలున పాదంబులను జిఱుగజ్జెలందెలు మ్రోయగా
చెలువు మీఱఁగ పసిఁడి చెఱగుఁల చీరకుచ్చులు జారఁగా
అలరు చందురుకావి రవికెయు నందముగ రాణించగా
వెలయు ధళ ధళ వెలుఁగు భూషణములును వగవగ మించఁగా ॥వచ్చె॥

కలికి వాల్గన్నులను కాటుక కమ్మి సోగలు మీఱఁగా
సులలితముగా బొమలనందున సొగసు నామము వెలుగఁగా
పొలుపుమీఱుచు నుదుట పచ్చని బొట్టు నిగనిగ మెఱయఁగా
విలసితముగా గొప్పకొప్పున విరులసరములు గదలఁగా ॥వచ్చె॥

ప్రమద మలరఁగ విడెము సేయుచు బాలకుని ముద్దాడుచు
సుమహితముగా బుట్టి నెత్తిన నూటి దప్పక నిలుపుచుఁ
గ్రమముగాఁ దన కెదురు వచ్చిన కమలనేత్రలఁ జూచుచు
రమణులారా! యెఱుకఁ జెప్పెద రండురం డని పిలుచుచు
॥వచ్చె॥

కరకమలమునఁ దనరి తగు బంగరుగిలక వాయింపుచు
సురుచిరముగా కొడుకుఁ జూచుచు జోలపాటలఁ బాడుచు
సరవి పోరటు మాన్పుచును నిజజాతి సుద్దులు సెప్పుచు
మురిపెమునఁ దరిగొండపుర నరహరికి శరణని మ్రొక్కుచు"
॥వచ్చె॥

ఇక పాత్రల స్వభావచిత్రణకు ఇందలి తామసి పాత్ర మొక చక్కని దృష్టాంతము. 'రుద్రుని తామసగుణంబు స్త్రీ రూపధారిణియై వచ్చి పార్వతితో నిట్లనుచున్నది' అనెడి కవయిత్రి వాక్యముద్వారా ఈ పాత్ర స్వభావము చక్కగా సూచిత మగుచున్నది. వెంగమలేఖిని నుండి స్వతంత్రముగా అవతరించిన ఈ పాత్ర పేరునకు దగినట్లు ఇంచుక పరుషభాషిణి యైనను నిజ మాడునది. పార్వతి 'నీ వెవతెవే అమ్మయ్యా?' అని ప్రశ్నించినప్పుడు తామసి యిట్లు సమాధానించినది:

"ఈ లోకమున ననేకులు నన్నెఱుంగుదురు. ఎఱిగినవారు నా వారు కారు. ఎఱుగనివారే నావారు. నీవు నన్నెఱుంగ నంటివి కావున నీ దగ్గర నిలిచి యుండం గోరుచుండెదనే గిమ్మయ్యా!"

తత్త్వార్థ గర్భితమైన పై సమాధానము తామసి విజ్ఞానమునకు గీటురాయి.

ప్రారంభమున నించుక కఱకుగా మాటాడినను, తామసి హృదయము పరోపకారపరాయణము. అందువలన జాహ్నవియొక్క దూతికగా పార్వతిమందిరమున కేగి పెక్కుభంగుల, సానునయముగా శివుని ఆహ్వానించినది. ఈ విషయమున నీమె భామాకలాపమందలి 'మాధవి' ని తలపించుచున్నది. ఒక్కమాటలో, తామసి విష్ణుపారిజాతము నందలి వికటభాషిణికి సర్వవిధముల అక్కయో చెల్లెలో అనునట్లు సృజింపబడినది. ఈ రీతిగా ఈ యక్షగానమందలి పాత్ర లన్నియు వాటి ప్రవర్తన పరిధుల కనుగుణముగా పరిపోషితములై యొప్పుచున్నవి.

**వర్ణనలు:**

ఇది యక్షగాన మగుటచే పద్యకావ్యములందలి విస్తరవర్ణనల వంటి సుదీర్ఘవర్ణనలకు అవకాశము లేకున్నను ఆ యా సందర్భోచితములగు సంగ్రహవర్ణనల కిందు కొదువలేదు. కృతి ప్రారంభముననే గల ఈ క్రింది కైలాసపురవర్ణన అట్టివానిలో నొకటి.

"... ... ... పావనకైలాస పర్వతాగ్రహమునఁ
గోటలు రత్నాల కొత్తళంబులును-వాటంపు వజ్రాల వాకిళ్లు, మంచి
తేటైన కడపలు, దివ్యాలయములు- కోటిభానులదీప్తి గోపురంబులును
పాటింపఁ బసిఁడి దీపస్తంభములును-నాటకశాల లున్న తరధావళులు
కోటికోటులు మేటి ఘోటకతతులు-గాటంపు వీధుల ఘనఘన ధ్వనులఁ
గాటుగ కొండలగతికుంజరములు-నీటుమీఱఁగ నొప్పు నిండు కొలంకు
లూటబావులు, మంచి యుద్యానవనము-రేటి కాల్వలతోడ నింపొందుచుండు
నట్టి పురంబులో నమితంబుగాను-బట్టుగా నిరతంబు ప్రమథులు గొలువ
ఘనత మీఱంగ గంగా పార్వతులను-జనవుగా చేపట్టి చంద్రశేఖరుఁడు
అగజాత కౌఁగిట నలరార నిల్చి-పగలు రేల్మఱచి నిర్భరవృత్తి నుండె."

ఇట్లే గంగ స్వయముగా నేగి శివుని స్తుతించిన సందర్భమందలి, నారదుడు శివుని స్తుతించిన సందర్భమందలి చూర్ణికలు, గంగ యొనర్చిన మన్మథ, చంద్ర, మలయానిల దూషణము గల దరువులు, పద్యములు, గంగ, శివుడు పరస్పరము పంపుకొనిన యుత్తరములు, ఎఱుకత ఘట్టము

పుసున్నగునవి ఈ యక్షగాన కృతియందలి వర్ణనాత్మకతకు నిదర్శనములు. ఈ నాటకమందలి వర్ణనాంశము చాలభాగము ద్విపదలలోనే ఇమిడియుండుట ఒక విశేషము. ఈ వర్ణనలన్నియు ఇందలి నాటకీయ లక్షణమును ప్రోదిసేయుచుండుట ఇంకొక విశేషము.

ఇట్లొకవంక వర్ణనాత్మకమై యుండుటతో పాటు, ఇంకొక వైపు వేర్వేరు దరువుల వైవిధ్యముతో గూడిన చక్కని సంవాదగుణము గల దగుటచే ఈ యక్షగానము దృశ్య, శ్రవ్య ఉభయప్రయోజనాత్మకముగా వెలసినట్లు నిశ్చయింపవచ్చును.

**ఇతరవిశేషములు:**

ఈ కృతికి సంబంధించిన మఱి కొన్ని విశేషము లిచట పేర్కొనబడుచున్నవి.

1) ఈ యక్షగాన కథానాయకుడగు పరమేశ్వరుని గంగ యొకటి రెండుచోటుల 'సోమశేఖరుఁడెంతొ చులుకఁగఁ జూచెన్,' 'చూచినపుడు మా సోమశేఖరుఁడు చూచెనటే నిన్ను' ఇత్యాదిగా సోమశేఖరుడని పేర్కొనినది. ఈ 'సోమశేఖరుడు' మదనపల్లిలో వెలసియున్న 'సోమేశ్వరస్వామి'కి పర్యాయనామమే కాని వేరుకాదు. ఈ విషయమును ఈమె తరువాతి కృతులగు రాజయోగసారాదులు బలపరచుచున్నవి.[15] ఇట్లు మదనపల్లి యందలి సోమేశ్వరుని పేర్కొనుచున్న వెంగమ కృతులలో ఈ శివనాటకము మొట్టమొదటి దగుటచే, కవయిత్రి ఆధ్యాత్మికోపదేశము నిమిత్తము మదనపల్లియందలి సుబ్రహ్మణ్యయోగి యొద్ద కేగియుండిన కాలమున ఈ కృతిని రచించె నేమో యని యూహించుట కవకాశము కలదు.

2) గంగా గౌరుల సవతికయ్యము నాధారముగా గొని ఆంధ్ర వాఙ్మయమున మఱికొన్ని శివనాటకములు, శివపారిజాతములు వెలువడి యున్నను, 16 ఈ రీతిగా కథానిర్వహణమున భామాకలాపమును పుణికి పుచ్చుకొని, శ్రీకృష్ణుని పారిజాత వృత్తాంతమునకు దీటుగా, రసోత్తరముగా ఆవిర్భవించిన యక్షగాన నాటకములరుదు.

3) శివకథాత్మక మగుటచే వెంగమాంబ యీ కృతిని రాచవీటి (రాయచోటి) యందు వెలసియున్న వీరభద్రస్వామికి అంకిత మొనర్చినది.

## వేదాంతవిషయకములు

వెంగమాంబ రచించిన వేదాంతవిషయక యక్షగానములు రెండు. అవి గోపిక నాటకము, ముక్తికాంతా విలాసములు. వాటిలో రెండవదగు ముక్తికాంతావిలాసము మాత్రము నేడు లభ్యము.

## ముక్తికాంతా విలాసము

ఈ యక్షగానమందలి యితివృత్తము వేదాంత సంబంధి యని ఆ పేరే తెల్పుచున్నది. ద్విపద భాగవతారికలో కవయిత్రి పేర్కొనిన స్వీయరచనలలో ఇది లేదు. ద్విపద భాగవత రచనా ప్రసక్తి వేంకటాచల మాహాత్మ్యమున గలదు. అందలి కృత్యాదిలో ఈ యక్షగానము పేర్కొనబడలేదు. కనుక నిది వేంకటాచల మాహాత్మ్యానంతర రచన యని సులభముగా నూహింపవచ్చును. అట్లే వెంగమ రచించిన యక్షగాన కృతులం దెల్ల నిది చిట్టచివరిది యని తలంపవచ్చును. ఇట్లిది ఈ కవయిత్రి చివరి దశలో రచించిన యక్షగాన కృతులలో నొకటైనను వాటిలో తొట్టతొలుత (క్రీ. శ. 1869లో) ముద్రణ భాగ్యమునకు నోచుకొని యుండుట ఒక విశేషము.

**కథాసంగ్రహము :**

సృష్టిస్థితిలయ వ్యాపార నిర్వాహకుడైన జగదీశ్వరు డొకనాడు ముక్తిమందిరము కడ కేగి అచ్చటి ద్వారపాలురలో విచారాత్మకుడను వానిని బిలిచి, కవాటము దీయ గోరును. వాడు స్వామివారి పేరు వచ్చిన కారణము మున్నగువాని నడిగి 'మీరు మాయావరణ మనెడు తెరనుండి యీవలకు వచ్చినచో ముక్తిమందిరములోనికి బోవచ్చు' నని పల్కును. స్వామివారట్లే 'మఱపు' అను తెర నుత్తరించి యీవలకి రాగా వాడు బహిర క్ష్యాంతఃపురకవాటము దీయును. అందుండి స్వామి ముందున కేగుచుండగా విచార, శమ, సంతోష. సత్సంగములనెడు నల్వురు ద్వార పాలకులు బహుపరాకులతో హెచ్చరికలు విన్నవించుచుందురు. అపుడు జ్ఞానశక్తి మధ్య లక్ష్యాంతఃపుర కవాటమును బంధించును. తాను ముక్తికాంతను వలచి రాగా, అట్లు కవాటమును బంధించుట తగ దని

స్వామి పల్కును. ముక్తికాంత నిర్వికల్పసమాధి నిష్ఠతో చిత్పదమునంటి యున్నదనియు సకలపరివారముతో సందడించుచు వెళ్ళరాదనియు జ్ఞానశక్తి వాకొనును. తలుపు దీయకయే స్వామితో సంభాషణ సాగించు చుండగా, నచటికి భక్తికాంత వచ్చి, జీవుని పరీక్షించిన విధమున ఈశ్వరుని పరీక్షింపరాదని జ్ఞానకాంతను గద్దించి, వాదించును.

'మాయను గూడి యున్నందున ఆయనను పరీక్షింపక లోపలికి విడువ' నని ఖండితముగా బలికి జ్ఞానకాంత వైరాగ్యకాంతను బిలిచి పరీక్షింప నాజ్ఞాపించును. అపుడా వైరాగ్యశక్తి వివేకశక్తి సాహాయ్యముతో 'నేతి నేతి వాక్యము' లనెడు భటులచే త్రిగుణ కార్యాది సకల పరివార మును తీవ్రముగా తొలగ ద్రోయించును. అపుడా యీశ్వరుడు నిర్విచారుడై పరమశాంతి వహించి యుండును. 'స్వామి నింకను పరీక్షింప దలంచు చుంటివా?' అని భక్తికాంత మందలింపగా 'నవ్వుటాలకు పరీక్షింతు నంటినే కాని, యీ దేవు నెవరు పరీక్షింప గల?' రని పలికి, జ్ఞానకాంత భక్తికాంత కోరిన మేరకు శ్రద్ధాశక్తిచే ముక్తికాంతకు జా బంపును. అందులకు బదులుగా ముక్తికాంత ప్రత్యుత్తర మంపును.

జగదీశ్వరు డిచ్ఛాశక్తిచేత ప్రత్యుత్తరము వ్రాయించి పంపును. అందులకు ముక్తికాంత శ్రద్ధాశక్తిచే జవాబంపును. పునః స్వామి ప్రత్యుత్తర మంపగా అందులకు సమ్మతించి ముక్తికాంత కవాటము దీయ నాజ్ఞా పించును. విచారాత్మకుడు చమత్కారముగా మాటాడుచు ద్వితీయ కవాటము దెరచును. స్వామి మధ్యలక్ష్యాంతఃపురంబులో జొచ్చి పోవు చుండగా ముక్తికాంత అంతర్లక్ష్య కవాటమును బంధించును. అప్పుడు ముక్తికాంతకు జగదీశ్వరునకు ఏలల లో ప్రశ్నోత్తరరూపమున సంభాషణ నడచును. చిట్టచివరకు ముక్తికాంత జగదీశ్వరుని సమాధానములకు తనిసి, కవాటము దీసి, ఆయనను గూడి యుండును. భక్తి, జ్ఞాన, వైరాగ్య శక్తులు మంగళముల బాడుచు హారతు లిత్తురు.

జగదీశ్వరు డిట్లు మోక్షకామినిని గూడి నిస్పృహుడై యుండగా ఎక్కడి సృష్టి యక్కడ నిలిచి పోవును. అట్లగుటకు చింతించుచు మాయాశక్తి చిత్తసఖితో గూడి జ్ఞాన వైరాగ్య, భక్తి, కాంత లున్న చోటికి వచ్చి 'నా నాథు డెక్కడ నున్నాడో తెల్పు'డని మంచిగా నడుగును. జ్ఞానశక్తి

గడచిన వృత్తాంత మంతటిని తెలుపును. అపుడు మాయాశక్తి తన బిడ్డల నందరిని చెఱబెట్టుకొనిన వైరాగ్యశక్తిపై విఱుచుకపడును. జ్ఞానశక్తి, వైరాగ్యశక్తి నావలనుంచి, మాయతో వాదించి గెలిచి తరుమును.

అట్లు తరుముచుండగా భక్తికాంత అడ్డము వచ్చి 'పిచ్చుకమీద బ్రహ్మాస్త్ర'మని పల్కి జ్ఞానకాంతను సముదాయించును. పిమ్మట మాయాశక్తి వైపు దిరిగి, 'ఓ మాయా! ఆ పరమపురుషుడు ముక్తి మందిరములో ప్రవేశించునపుడం తన ప్రభుత్వమంతయు శ్రీ వేంకటేశ్వరున కొప్పగించినాడు. నీ వా స్వామిని శరణొందినచో నీబిడ్డ లుండే చోటు చెప్పి, నిన్ను తనవశము జేసికొని రక్షించును'అని పల్కి భక్తికాంత మాయను స్వామిసన్నిధికి దోడ్కొనిపోవును.

మాయా శక్తి స్వామిని స్తుతింపగా వేంకటేశ్వరుడు భక్తికాంతపై ఆవేశము వచ్చి మాయాశక్తి యొక్క భయ, సందేహములను తీర్చి యోదార్చి పంపివైచును. తక్కిన జ్ఞాన, వైరాగ్య, భక్తి, వివేక శక్తులును వేంకటేశ్వరుని సన్నిధినుండుదురు. వైరాగ్యశక్తి స్వామికి హారతి యిచ్చుచు మంగళము పాడును. శ్రీ స్వామివారు భక్తికాంతపై తన ఆవేశము నుపసంహరించి, స్వస్వరూప మొంది సకల పరివారముతో గూడి జగముల నేలుచుండును.

**కథాకల్పనము :**

దురవబోధములగు తాత్త్విక విషయములను సుబోధము గావించెడు ప్రయత్నములో మనప్రాచీనులు కనిపెట్టిన రచనాప్రక్రియ 'ఆధ్యాత్మిక కావ్యము'. కాంతా సమ్మితమగు కావ్యప్రక్రియ వేర్వేరు ధర్మములను, లోకనీతులను రసవంతముగా ఉపదేశింప గల్గినటులే శాశ్వతికములగు ఆధ్యాత్మిక సత్యములను సైతము సుకుమారముగా, సూటిగా ఉపదేశింప సమర్థమైనదని మన పూర్వు లేనాడో గుర్తించిరి. తత్ఫలితముగావే జ్ఞానవాసిష్ఠము, 17 ప్రబోధ చంద్రోదయము 18 వంటి తత్త్వగర్భితకావ్యములు, సాధ్యవసాయ రూపకములు (Allegorical Poems) భారతీయ వాఙ్మయమున అవతరించినవి.

ముక్తి, జ్ఞానము, పుణ్యము, జీవుడు, బుద్ధి- ఇత్యాది తాత్త్విక భావన(Philosophical concepts) లకు పాత్రరూపమైన మూర్తికల్పనచేసి,

ఆ పాత్రలలో లౌకికముగా భాసించు ఇతివృత్తముల నల్లి, వేదాంతార్థ గర్భితములగు రసవత్కావ్యములను రచించు పద్ధతి సంస్కృతమునందు వలెనే తెలుగులోను అవలంబింపబడినది. ఆ పద్ధతిలో వెలువడిన ఆధ్యాత్మిక కావ్యములలో వెంగమాంబ సృజించిన ఈ ముక్తికాంతా విలాసము అగ్రగణ్యమై యున్నది. జగదీశ్వరుడు ముక్తికాంతను గూడుట ఇందలి ప్రధానేతివృత్తము.

ఈ విధముగా ఆధ్యాత్మిక సంబంధి వస్తువును ఐహిక కథారీతియను చట్రము (frame) లో ఇమిడ్చి రూపొందించిన రచనలు తెలుగులో ఈ రచనకన్న పూర్వానివి కొన్ని ఉన్నవి. అట్టివానిలో నందిమల్లయ, ఘంటసింగయ లనెడు జంటకవులు (క్రీ.శ. 15వ శతాబ్ది) రచించిన ప్రబోధ చంద్రోదయము పేర్కొనదగినది. అయినను అది పద్యప్రబంధము. అందులోను అనువాదము.

ఇదిగాక, 'ముక్తికాంతా పరిణయ' మనుపేరుతో రెండు యక్ష గానములు, 'ముక్తికాంతా విలాస' మను పేరుతో మఱియొకటి మొత్తము మూడు ఇతర కవుల రచనలు కాన్పించుచున్నవి.19 ఆ మూడును ముక్తికాంతయొక్క వివాహమును ప్రదర్శించునవే! అందు మొదటిది క్రీ.శ. 16వ శతాబ్దమున నుండిన పరమానంద తీర్థయతి రచన. మోక్షకాంత సద్గురుడే దైవమని విశ్వసించెడి వేదాంతమతస్థుడగు వివేకజీవేశ్వరుని స్వయంవరమున వరించుట ఇందలి కథ. రెండవ దానిలో ముక్తికాంత జీవుని వివాహమాడుట కలదు. దీని రచయిత యెవరో తెలియదు. మూడవదైన ముక్తికాంతా విలాసమున మనః కాంత ముక్తికాంత (ఎఱుకత) ప్రేరణచే ఓంకారమును (ప్రణవ పురుషుని) పెండ్లియాడుట కలదు. దీని రచయిత క్రీ.శ. 18వ శతాబ్దమున నుండిన కాటమరాజు వెంకటజోగి.

పై మూడు సజాతీయ రచనలలో పరమానందతీర్థయతి రచన యొక్కటే వెంగమకన్న పూర్వకాలీనమైనది. రచనా నైపుణ్యము విషయమునను పరమానందతీర్థుల రచన యొక్కటే ఈ కవయిత్రి రచనకు దీటైనది. కాని దాని ప్రభావమిందు మృగ్యము. తక్కిన రెండు కేవలము సామాన్యరచనలు. ఇట్లు ఈ పేరిటి రచన యొకటి ఇంతకు పూర్వమే వెలసియున్నను, కథాకల్పన, కథావిస్తృతి, రచనా కౌశలము-అను వాని విషయమున వెంగమకృతి అపూర్వమై, అద్వితీయమై అలరారుచున్నది.

ఈ యక్షగాన కృతియందలి కథాసంవిధాన నైపుణికి సంబంధించిన ముఖ్యవిషయ మొకటి ఇట పేర్కొనదగియున్నది. కథా నాయకుడైన జగదీశ్వరుడు ప్రథమ, ద్వితీయ, తృతీయ ద్వారములను గడచిన పిమ్మట నాయిక యగు ముక్తికామినిని గూడుకొనును. ఆ సమయయున భక్తి, జ్ఞాన, వైరాగ్యకాంతలు ఆ దంపతులకు హారతి లిచ్చుచు మంగళములు పాడుదురు. ఈ యక్షగానమును ప్రథమ పర్యాయము పఠించువారికి ఇంతటితో ఈ కృతి ముగిసినదగు అభిప్రాయ మేర్పడును. కాని,

"అని వారంతు లిచ్చిన

వెనుకను దరిగొండపురిని వెలసిన మోక్షాం

గన నహిపర్వతమునఁ జే

కొని జగదీశ్వరుండు దానిఁ గూడి సుఖించెన్.

శ్రీకరచరితుండు చిదచిదీశ్వరుఁడు - ప్రాకట తరిగొండ పట్టణాధిపుఁడు

తానైన శేషాద్రిధాముని చెంత-సానందుఁడై మహాజగదీశ్వరుండు

మమ్మోల కోనలో మోక్షకామినిని-నెమ్మదిగాఁ గూడి నిస్పృహుం డయ్యె

నప్పు డెక్కడి సృష్టి యక్కడ నిలిచె -నొప్పుగా సకలజీవులు జ్ఞాను లగుచు

ఘనమైన మోక్షమార్గముఁ జూచు టెఱిఁగి-తనలోనఁ దాని ట్లు దలఁచె

నమ్మాయి"

అని కథాక్రమము కొనసాగుటనుబట్టి ఇది యీ కృతియందలి రెండవ భాగమని స్ఫురించును. ఈ ద్వితీయభాగము భక్తికాంతపై ఆవిష్టుడై యున్న వేంకటేశ్వరునకు వైరాగ్యశక్తి మంగళహారతు లిచ్చి స్తుతించుటతో ముగియుచున్నది. ఈ రెండవ భాగమును "భక్తికాంతావిలాస"మని (కవయిత్రి పేర్కొనకున్నను) అనవచ్చును.

ప్రథమ భాగమున జగదీశ్వరుని (నాయకుని) వెంట ముక్తి మందిరమునకు వచ్చి, వైరాగ్యశక్తిచే ఆవల త్రోయబడిన త్రిగుణములు మొదలైన పరివారముయొక్క తదనంతర స్థితిగతులు, వారి తల్లియగు

మాయాశక్తికి శ్రీవేంకటేశ్వరుడు శరణొసంగుట-మున్నగు విశేషములు ద్వితీయభాగమున తెల్పబడియుండుటచే ఈ రెండవ భాగము మొదటి భాగముయొక్క అనంతర కథగా భాసించుచున్నది. ఇట్లు ఈ రెంటికి చక్కగా లంకె కుదిరియుండుటచే మొత్తము కృతికి "ముక్తికాంతా విలాస" మనెడు నామధేయము సార్థకమై వెలసినది.

**నాటకీయత :**

నాటకీయతకు ప్రాణతుల్యములు సంభాషణలు, పాత్రల మూలమున నడచునవి. ఈ నాటకమున వేదాంతశాస్త్రమునకు సంబంధించిన సంకేతములే పాత్రలుగా నెలకొల్పబడియుండుటవలన ఆ యా పాత్రల స్వరూపములను సుస్పష్టరేఖలతో చిత్రింపవలసిన ఆవశ్యకత గాని, అవకాశము గాని అంతగా లేకున్నను, వెంగమాంబ తాను రచించిన తదితర యక్షగానములయందువలెనే ఈ కృతి యందును ఆ యా పాత్రల స్వభావములను సంభాషణల ద్వారా ఆవిష్కరింప జేయుటలో తన సిద్ధహస్తతను చక్కగా ప్రదర్శించినది. విచారాత్మకుడను ద్వారపాలుడు (విచారము), వైరాగ్యశక్తి (వైరాగ్యము), భక్తికాంతా (భక్తి)-మున్నగు పాత్రల పల్కులే ఇందులకు ముఖ్యోదాహరణలు. మఱియు ఆ యా పాత్రల సాభిప్రాయ సంభాషణల మూలముగా నిందు వివిధ తాత్త్వికవిషయములు సంగ్రహముగా, సుబోధముగా, శిష్ట వ్యావహారిక భాషలో (వచనమున) వివరింపబడియున్నవి.

ఈ కృతియందలి ఆ యా పాత్రల స్వభావానుగుణ భాషణము నకు ఒకటి రెండుదాహరణలు:

i) ముక్తిమందిర ద్వారము కడకు వచ్చిన జగదీశ్వరుని గాంచి ద్వారపాలకుడు (విచారుడు) "మఱి నీవెవ్వరైనది దెలుప వయ్యా స్వామీ!" యని అడుగును. "ఓరీ ద్వారపాలకా! నేను జగదీశ్వరుడనురా!" అని స్వామి పల్కును. "నీవు జగదీశ్వరుడ వయితే జగముల నేలుచుండవలె గాని, ఇక్కడికి యేల వచ్చినా వయ్యా?" అని వాని ప్రశ్న. "నేను మోక్ష సుందరిని వలచి వచ్చితిని. జాగుసేయక కవాటము తీయరా! సత్కరుణ మీఱు వరము లిత్తును." అని స్వామి సమాధానము. అప్పుడా ద్వారపాలుడు

ఈ క్రింది రీతిని నిర్భయముగా ప్రత్యుత్తర మొసగును. "అహెూ స్వామీ! నా మనస్సున కోరికలు లేవు గనుక నీ విచ్చెడు వరములు నే నొల్లను. ముక్తిని బొందెద ననెడు కోరిక నీకున్నది. నా కది లేదు.కావున నేనే నీకంటె దొడ్డవాడను. నీ వీశ్వరుడవై యనేకజీవు లనెడు బిడ్డల గని దొడ్డ సంసారివై, మాయావరణ మనెడు తెరలో నున్నందున ముక్తికాంత చెంతకు రాకూడదు. ఆ మాయావరణమును గడచి యీవల వచ్చినచో నీవు ముక్తి మందిరములోనికి బోవచ్చును."

పై రీతిగా ద్వారపాలకుడు జగదీశ్వరుని అధిక్షేపించుటలో ఈ విచారనామకుని విమర్శనా స్వభావము వ్యక్తమగుచున్నది. అట్లధిక్షేపింప జేయుటలో ఔచిత్యమునకు భంగము వాటిల్లని సరణిని సంభాషణము సమకూర్చుటలో కవయిత్రి చూపిన చాకచక్యము శ్లాఘనీయము.

ii) జ్ఞానకాంత మధ్యలక్ష్యాంతఃపురకవాటమును మూసివైచినప్పుడు జగదీశ్వర స్వామిని "నీ వెవ్వరది చెప్పవోయీ!" అని ప్రశ్నించును. "విరాట్పురుషుడనే జ్ఞానకాంతా!" అని స్వామి సమాధానము. అందుల కా జ్ఞానకాంత "అల విరాట్పురుషుడ వయితే జాగ్రత్ప్రపంచమం దంటియుండు పోవోయీ!" అని ఎకసక్కెమాడును. ఇదే విధముగా "హేమగర్భుడు, అవ్యాకృతుడు, తుర్యుడు"- అను స్వామివారి నామధేయములకు అర్థాంతరములు కల్పించి ఆయనను "అటనుండి మరలిపొ"మ్మనును. ఈ సన్నివేశము భామాకలాపమున సత్యాదేవీ శ్రీకృష్ణులకు జరిగిన "తలుపు దగ్గరి సంవాదము"ను స్మరింపజేయును. ఇట్టి చమత్కార సంవాదములు ఈ కవయిత్రి రచించిన విష్ణుపారిజాతము నను గలవు.[20]

ఈ యక్షగానమందు నెలకొన్న సంవాదఘట్టములలో నెల్ల అత్యంత ముఖ్యమైనది, ఈ కృతికి ఆయువుపట్టని చెప్పదగినది ముక్తికాంతా జగదీశ్వరులకు అంతర్లక్ష కవాటము కడ ప్రశ్నోత్తర రూపమున నడచిన సంభాషణము. ఇది పదునెనిమిది చరణములు (Stanzas)

సుదీర్ఘమగు ఏలగా ఈ కవయిత్రి గంటమునుండి జాల్వారినది. అందుండి మచ్చుకుగా నాలుగు చరణములు:

"తెలసీ నా వాఁడా వైతే నీ దేహామూలో నుండే మహిమా
సలలితముగా నాకూఁ దెల్పారా - ఓ యోగిచంద్రా!
సమ్మతముగా నిన్నూఁ బొందేరా
అంచాలంచాల పద్మమూలూ ఆ ఉన్నావి వాటి కవలా
మంచితేనేకొలనూ వున్నాదే-ఓ ముక్తికాంతా!
పొంచి పా మూ కొలనూ గన్నాదే
మిన్నూ లైదూ దాఁటి, పండూ వెన్నెలా జూడంగా నందూ
కిన్నెరానాదా మా దేమిరా-ఓ యోగిచంద్రా!
కినిసి దానీలో నే ముండూరా
ఓహెూ వినుమా కిన్నెరాలో వోంకారస్వారూపమైనా
సోహ మానే భావ మున్నాదే-ఓ ముక్తికాంతా!
సొలసి పవనూఁ డందే యున్నాఁడే."

ఏగంటి లక్ష్మప్ప, పోతులూరి వీరబ్రహ్మము మున్నగు వేదాంతుల "తత్త్వము"లలో గోచరించెడి మార్మికత (Mysticism)పై యేలలలో పుష్కలముగా ధ్వనించుచుండుట గమనింపదగినది.

జ్ఞానకాంతకు భక్తికాంతకు సంవాదము, మాయాశక్తికి జ్ఞానవైరాగ్యకాంతలతో కొనసాగిన సంవాదము మున్నగునవి ఈ యక్షగాన నాటకమందలి మఱికొన్ని సంవాద ఘట్టములు. ఈ ఘట్టములయందలి సంభాషణలు భక్తి, మాయ మున్నుగా గల ఆ యా పాత్రల స్వభావములను చక్కగా సమున్మీలింపజేయుచున్నవి. ముఖ్యముగా జ్ఞాన, వైరాగ్య కాంతలకు మాయాశక్తితో సాగిన సంవాదము రుక్మిణీ సత్యభామల, గంగాగౌరుల నడుమ నడచిన సవతి కయ్యమున పోలియున్నది.

మఱియు ఈ నాటకమందలి రచనాంగములైన దరువులు ద్విపదలు, ఏలలు, పద్యములు మొదలగు వెల్ల నాటకీయ లక్షణమును ప్రోదిసేయుచున్నవి. అటనట కొన్ని పెద్ద వచనములు, వర్ణనలు ఉన్నను అవి ప్రదర్శనౌచితికి ఆటంకములుగా లేవు. చాలవరకు తాళనిర్దిష్టములైన

ఇందలి దరువులలో హెచ్చరికలు, తలుపుతీయు పాటలు, పాత్ర ప్రవేశ సూచకములు-ఇత్యాదిగ పలు రకములు గలవు.

ఈ కృతి తాత్త్విక విషయ ప్రధానమైనను, ఇందలి రచనా సరణియంతయు "శృంగారముగా," తలుపుదగ్గరి సంవాదములతో, ఒకదాని వెంట నొకటిగా నడచిన ఉత్తర ప్రత్యుత్తరములతో నాటకీయముగా, సరసము, "లలితము"నగు "శృంగార సత్కృతి"గా అవతరించినది.[21]

### ఇందలి రచనావిశేషములు

వెంగమాంబ యీ కృతిలో కొన్నిచోట్ల ఒక విధమగు చిత్ర కవితాధోరణిని చమత్కారముకొరకు ప్రదర్శించినది. ముక్తిమందిర మందలి మధ్య లక్ష్యాంతఃపుర కవాటమును దీయుటకు ముందు విచారాత్మకుడను ద్వారపాలకుడు జగదీశ్వర స్వామివారి సమచిత్తతను పరీక్షించు సన్నివేశమున వినోద సంభాషణలో దిగువ నుదాహరించిన రీతిని కొన్ని అక్షరములపై గుణితమును కూర్చి చిత్రముగా, గూఢార్థస్ఫోరకముగా పల్కినాడు.

"............ఓ స్వామీ! మీరు రాజయోగుల మని యనుకున్నారు గదా! రాజయోగికి మానావమానములయందు దోషరోషములు లేక సమచిత్తుడై యుండవలెను. గనుక యీ పరీక్ష చూడక నేను వాకిలి దియ్యను. అది యేమి పరీక్ష యంటి రేని మీరు బాకేత్వం బియ్యవలెను. మీరు బాకేత్వ మిచ్చితిరేని మా ముక్తికాంత రాకు దీర్ఘ మిచ్చుచున్నది. మీరు బాకేత్వ మియ్యకుంటే మా ముక్తికాంత ఛాకుగుడి యిచ్చి పాకోత్వ మిచ్చుచున్నది. గనుక ముక్తికాంత కావలసియుంటే బాకేత్వ మియ్య మనిన నవ్వియాస్వామి వినోదముగా నిట్లనుచున్నాడు. వినరావోరి హాస్య గాడా! మాకు మాన రోషాది ప్రకృతి వికారంబులు లేవు గనుక బాకేత్వ మిచ్చే ముక్తికాంత చెంతకు వచ్చే నోయ యని యాస్వామి వినోదంబుగా నిట్లనుచున్నాడు.

బాకుం గుడు సిచ్చిన బీ
బా కొనరఁగఁ గొమ్ము నిడినఁ బరువడి నది బూ
బాకేత్వం బిచ్చిన బే
బాకోత్వం బిచ్చి చూచి పలికిన నది బో
అనిన విని వాఁడహెూ స్వామీ! మీరు బాకు గుడుసు,
కొమ్ము నేత్వము రెండేసి మా ర్లుచ్చరించితిరి రైనా నా కది
సంతోష మని నవ్విన యా స్వామి యి ట్లనుచున్నాడు."

-వేదాంత జ్ఞానబోధిని (ము.కాం.వి.) ౪౧-౪౨పుటలు

అక్షర గుణితముపై నిట్టి చమత్కార కల్పన మీమె కృతులలో మఱెచ్చటను గోచరింపని విశేషము. ఇది "ఛీ,పో" ఇత్యాదులను మఱుగుగా పేర్కొనుచు వినోదదాయకమై యున్నది.

సామాన్య దృష్టికి శుష్కములుగా, నీరసములుగా గానిపించెడి తాత్త్విక విషయములను, తాను మనోజ్ఞముగా సృష్టించిన లౌకిక కథాసూత్రముతో గూర్చి యక్షగాన రామణీయకముతో రంజింపజేసి ప్రజానీకమునకు అందింపవలెనను కవయిత్రి యుదారాశయ మీ కృతిలో ప్రతి పదమున ధ్వనించుచున్నది. ఈ గ్రంథాంతమందలి ఫలశ్రుతి యిందుల కొక తార్కాణము.

"ఇది పఠించినవారు నిది విన్నవారు
నదరక మోక్షార్హులై సుఖింపుదురు
భూచక్రమున నిది పూర్ణమై వెలసి
యాచంద్రతారార్క మై యొప్పుఁ గాత."

-వేదాంత జ్ఞానబోధిని (ము.కాం.వి.) ౫౮ పుట.

ఈ కృతి మొదటి భాగములో తరిగొండ లక్ష్మీనృసింహుడు జ్ఞానస్వరూపుడు, విరక్తుడు నైన యోగి యని, రెండవ భాగములో శ్రీ వేంకటేశ్వరుడు భక్తిప్రధానుడు, విశ్వసంసారరక్షుడు నగు భోగియని లౌకిక వ్యవహార దృక్పథము ననుసరించి సూచితమైనది. ఈ యిరువురకు

అభిన్నుడైన జగదీశ్వరుడు ఇందు నాయకుడగుట వలన, భక్తి జ్ఞానముల సమ్యక్ఫలిత మగు ముక్తియే నాయిక యగుటవలన ఈ నాటకము అన్వర్థాభిధానమై యొప్పుచున్నది.

శ్రీ వేంకటేశ్వర పదభక్తివలన జీవులు జ్ఞాన, వివేక, వైరాగ్యములు గలిగి, మాయను దాటి ముక్తినందుకొనగలరనునదే ఈ యాధ్యాత్మిక కావ్యమందలి విశిష్ట సందేశము. మొత్తముమీద ఈ యక్షగానము ఈ కవితా తపస్వినియొక్క కవితా కౌశలము, ఆధ్యాత్మిక జ్ఞానము సంగమించిన సారస్వత తీర్థముగా విరాజిల్లుచున్నది.

## గోపికా నాటకము

వెంగమాంబ రచించిన యక్షగానములలో అలభ్యమైన వాటిలో గోపికానాటక మొకటి కలదు. (అలభ్యమైన ఇతర యక్షగానములు 1) నృసింహ విలాసకథ 2) రుక్మిణీ నాటకము. ఇది వేదాంత విషయకమైన యక్షగానము. అలభ్యమైనను కొన్ని ఆధారములనుబట్టి దీని వైనము నూహింప వీలగుచున్నది. ద్విపద భాగవతారికలో వెంగమ పేర్కొన్న స్వీయరచనలలో గోపికానాటక మొకటి. మఱి యీమె "గొల్లకథ"ను చెప్పినట్లు బ్రౌనుదొర వాక్యము సాక్ష్య మిచ్చుచున్నది.[22] ఈ కవయిత్రి "గొల్లకలాపము"ను రచించియున్నట్లు ఇంకొక ఆధారమువలన తెలియ వచ్చినది.

"గొల్లకలాపం అని చెప్పబడుతున్న భాగవతములు రెండు మూడున్నాయి. వాటిలో యజ్ఞపు పుట్ట గురించి చెప్పేది తరిగొండ వెంగమాంబ రచన."[23]

పై ఆధారములను పరికించినచో వెంగమాంబ "గోపికా నాటకము" లేక "గోపీ నాటకము" అను పేరున ఒక "గొల్లకలాపము"ను రచించినదనియు, అదియే బ్రౌనుదొరచే "గొల్లకథ"గా పేర్కొనబడిన దనియు తలంపవచ్చును. ఈమె యక్షగాన కృతులలో పెక్కిటికి ఇట్లు ఒకటికన్న నెక్కువ పేళ్లుండుట యను అంశము పై యభిప్రాయమునకు ఉపబలకమై యున్నది. కావున సిద్ధేంద్రుని "భామాకలాపము" ననుసరించి "విష్ణుపారిజాతము"ను రచించినట్లే, ఈ కవయిత్రి ఆతని మఱియొక రచనయగు గొల్లకలాపము ననుసరించి గోపికా నాటకమును రచించెనని చెప్పదగును.

ఈ కృతి నేడు మృగ్యము. ఐనను సిద్ధేంద్రుని కృతియందలి ఇతివృత్తమునుబట్టి వెంగమ కృతియందలి కథాసరణిని చూచాయగా ఊహింపవచ్చు. ఈ యుద్దేశముతోనే ఆతని కృతియందలి కథాంశ మీ దిగువ సంగ్రహముగా ఈయబడినది.

సిద్ధేంద్రుని గొల్లకలాపమందలి కథ:

"గొల్లకలాపంలో నాయిక వ్రేపల్లెవాడలోని గొల్లభామ. చల్లోయమ్మ చల్ల అంటూ యాదవ ("గొల్ల") కాంతల సహజసుందరమైన ధోరణిలో ప్రవేశించి హాస్యసంభాషణా చతురుడైన బ్రాహ్మణ విద్వాంసునితో వివాదానికి దిగుతుంది. ఆ వివాదంలో పిండోత్పత్తి "మానవ శిశుజననం" మొదలు మరణం వరకూ చల్లనుంచి వెన్నతియ్యడం మొదలు జీవాత్మ పరమాత్మ సంబంధంవరకూ మానవజీవితం గురించిన, బ్రహ్మాండ సృష్టిని గురించిన సకల విషయాలనూ ఆధ్యాత్మికంగా వా రిద్దరూ చర్చిస్తారు."[24]

ఆధ్యాత్మికతత్త్వమును ఆహ్లాదకరముగా చెప్పెడి రచనారీతి యగుటచే కాబోలు తరిగొండ వెంగమ "గొల్లకలాపము" సరణిలో గోపికా నాటకమును రచించినది. అందులో తన స్వతంత్రత ప్రస్ఫుటమగు నట్లుగా "యజ్ఞపుపట్టు"ను చేర్చినది. ఆ యా లిఖితప్రతుల గ్రంథాలయము లలో గల "గొల్లకలాపము" వ్రాతప్రతుల నన్నిటిని తఱచి పరిశీలించిన యెడల ఈ యనర్ఘకృతి బయల్పడవచ్చును.

వెంగమాంబ యక్షగానములకు సాధారణములైన ముఖ్య లక్షణము లీ దిగువ క్రోడీకరింపబడినవి.

1) ఈ కవయిత్రి యక్షగానకృతు లన్నిటికిని "నాటకము", పెక్కిటికి "విలాసము," "కథ"- అనునవి పర్యాయవాచకములుగా గానిపించుచున్నవి.

ఉదా: శివ నాటకము, బాలకృష్ణ నాటకము, నృసింహ విలాసము, జలక్రీడా విలాసము, సురపారిజాత తరుకథ, చెంచుచెలికథ మున్నగునవి.

2) ఈమె యక్షగానములలో పెక్కింటి మొదటి కవి కావ్యనామాంకిత పద్యము కూర్పబడియుండుట యొక విశేషము.

"శ్రీకరముగాను దరిగొండ శ్రీ నృసింహుం
డైన శేషాచలేంద్రుని యనుమతమున
లలిత మగు ముక్తికాంతా విలాసకృతిని
వెలయ రచియించెఁ దరిగొండ వెంగమాంబ."

-ముక్తికాంతా విలాస ప్రారంభము.

3) సహాయపాత్రల సృష్టి. నాయికానాయకులకు సన్నిహిత పరిధిలో మెలగదగువారి నూహించి, సార్థకములైన పేళ్లతో కవయిత్రి సహాయపాత్రలను సృష్టించినది. శివనాటక, విష్ణుపారిజాతముల యందలి వికటభాషిణీ వికటభాషణులు, బాలకృష్ణ నాటకమందలి మాయిక, నక్కజోగి-సార్థకనామధేయులగు నటువంటి కొన్ని సహాయపాత్రలు.

4) అ యా ఎఱుక ఘట్టములో ఎఱుకత స్వవిషయమును భంగ్యంతరముగా, చమత్కార చారువుగా చెప్పుట యింకొక విశేషము. శివనాటకమున లక్ష్మి యెఱుకతయై గంగకు సోదె చెప్పెడు సన్నివేశము, విష్ణుపారిజాతమున సరస్వతి సింగియై సత్యభామ కెఱుక చెప్పు ఘట్టము ఇందుల కుదాహరణములు. విష్ణుపారిజాతమున "పలుకు సింగి" స్వవిషయమును సత్యాదేవితో తెలుపు సందర్భమున నిట్లు పల్కును:

"వివిధదేశంబులు వింతగాఁ దిరిగి-వివిధంబులైనట్టి విద్యలచేత
పరఁగ నందఱినోళ్లఁబడి విజృంభించి-?యిరవుగానే రచ్చకెక్కి యుండు దును
గాన మాయత్తయౌ కలుముల సింగి-నానావిధంబుల ననుఁ బరీక్షించు
నే నున్నచోటుల నిలువక తిరుగుఁ-దా నున్నచోట్లకే తరుణి నన్ బిలుచు
నేను తానొక దిక్కు నిలుచుట యరుదు-పూని నిల్చిన మహాద్భుతముగా
నుండు" విష్ణు 75-76 పుటలు

పై ద్విపదలలో కవయిత్రి లక్ష్మీసరస్వతుల స్వభావములను భంగ్యంతరముగా వెల్లడించినది.

5) దక్షిణాదిని భజన సంప్రదాయమున "తోడయ మంగళము" (తొలిమంగళము)[25]గా ప్రసిద్ధి గాంచిన తాళ్లపాక కవుల కీర్తనలకు స్పష్టమైన అనుకరణలు దాదాపు ఈ కవయిత్రి రచించిన యక్షగానము లన్నింట కన్పట్టుచుండుట గమనింపదగిన ముఖ్యవిశేషము. ఇందుల కొక యుదాహృతి.

"నారాయణ! తే నమో నమో
భవ-నారద సన్నుత!నమో నమో -తోడయ మంగళము
నాగాభరణ! తే నమో నమో
భవ-నాగమృగేంద్ర! తే నమో నమో (శివనాటకము)
నందాత్మజ, తే నమో నమో
సా-నందహృదయ! తే నమో నమో (విష్ణుపారిజాతము)
నందనందన! తే నమో నమో
సా-నందహృదయ!తే నమో నమో (జలక్రీడా విలాసము)

ఇట్లే తోడయ మంగళమందలి "జయ జానకీరమణ! జయ విభీషణ శరణ!", "శరణు శరణు సురేంద్రసన్నుత!" - ఇత్యాది కీర్తనలకును ఈమె యక్షగానములలో చక్కని యనుకరణలు, అనుసరణలు ఎడనెడ గోచరించుచున్నవి. పై రీతిని తరిగొండ వెంగమాంబ తన యక్షగాన కృతులలో తోడయ మంగళకీర్తనలను సమర్థవంతముగా అనుకరించి, తాళ్లపాక కవుల కృతులయెడ తనకు గల గౌరవాదరములను వెలడించినది.

6) వెంగమాంబ యక్షగాన రచనలలో ఇంచుమించు అన్నిటి యందు కూచిపూడి వారి భామాకలాపపు పోకడలు (నాయికా నాయకుల మధ్య ఉత్తర ప్రత్యుత్తరములు, వాదోపవాదములు మొదలగునవి) గోచరించుచుండుట యెన్నదగిన విశేషము.

7) ఈ యక్షగాన రచనలలో శివనాటకము, జలక్రీడా విలాసము అను రెండిటి మొదట విఘ్నేశ్వరపాత్రకు ప్రవేశము కల్పింపబడియుండుట యింకొక ప్రత్యేకత. ఇష్టదేవతా స్తుత్యనంతరము విఘ్నేశ్వరుడు నటింపుచు రంగముమీదికి వచ్చి, తత్రత్యులచే పూజితుడై తన వృత్తాంతమును దెలుపును. విఘ్నకారుల నెల్ల నాటకమునకు దూరముగా జనునట్లా జ్ఞాపించును. ఇది యీ పాత్ర ప్రవేశమునకు గల ప్రధాన ప్రయోజనము. ఈ పద్ధతి శహాజీ (క్రీ.శ. 1684-1712), మేరత్తూరు వేంకటరామశాస్త్రి (18వ

శతాబ్ది) మొదలగు దక్షిణాంధ్ర యక్షగాన కవుల రచనలయందు తఱచు కానవచ్చును. వెంగమ ఈ పద్ధతిని తత్ప్రదర్శనముల నుండియే స్వీకరించి యుండును.

మఱొక విషయము. మదరాసు అడయారు గ్రంథాలయమున గల వెంగమ శివనాటక ప్రతులలో పై "విఘ్నేశ్వర పాత్రము" లేదు. పైగా అడయారునందలి ప్రతులు పరిమాణమున, రచనయందును ఇంచుక సంగ్రహముగా కన్పట్టుచున్నవి. ఇందువలన ఈ కవయిత్రి తాను తరిగొండలో నుండినపుడు సంగ్రహముగా రచించియుండిన శివనాటకమును తిరుమల చేరిన పిమ్మట విఘ్నేశ్వరపాత్రను ప్రవేశపెట్టి, విస్తృతపరచినదని యూహింపదగియున్నది.

8) ఈ యక్షగానములలో బాలకృష్ణ నాటకము, జలక్రీడా విలాసము- అనువానియందలి దరువులలో పెక్కింట పల్లవి, ఉపపల్లవి, చరణముల విభజనము కానవచ్చుచున్నది. ఇది యింకొక ప్రత్యేకత. సంకీర్తనలకు సహజమైన ఈ లక్షణమును దరువులలో ప్రవేశపెట్టుటవలన ఈ కవయిత్రి స్వతంత్రత వ్యక్త మగుచున్నది.

9) కవయిత్రి ఈ యక్షగానములందలి భాషలో పాత్రోచితమగు వైవిధ్యమునే గాక, అటనట వయోనుగుణమగు వైచిత్రినిగూడ ప్రదర్శించియున్నది. ఇది యీామె భాషావేత్తృత్వమునకు పరమ నిదర్శనము.

10) వెంగమ యక్షగానములు దృశ్య, శ్రవ్య-ఉభయ ప్రయోజనాత్మకములుగా రచింపబడినవి.

మొత్తముమీద వస్తువైవిధ్యము, రచనారామణీయకము వెంగమాంబ యక్షగానములకు ప్రధానలక్షణములు. అవే పేళ్లతో, ఇంచుమించు అవే ఇతివృత్తములతో ఆమెకు పూర్వాపరములలో మఱికొందఱు కవులు యక్షగానములను రచించియున్నను వెంగమ

యక్షగానములు నిసర్గదేశిలక్షణముననుు, నిస్తులశైలీ సౌందర్యము నందును అగ్రగణ్యములై, క్రీ.శ. పదునెనిమిదవ శతాబ్దపు యక్షగాన వాఙ్మయాభ్యున్నతికి సదమల నిదర్శనములై ప్రకాశించుచున్నవి.

ఈ సందర్భమున విద్యారత్న నిడుదవోలు వేంకటరావుగారి ఈ క్రింది యాంగ్లవాక్యము లుట్టంకింప దగియున్నవి.

"In this branch of literature Vengamamba occupies a prominent place. No doubt there are some poets and poetesses who compiled Yakshaganas.....................These works reveal her proficiency not only in Sahitya but also in Sangita, as Yakshagana is a combination of the two arts...............All the above works of Vengamamba strictly adhere to the technique of Yakshagana. They contain different varieties of musical compositions like Daru, Dwipada, Manjari, Yela, Gobbillu, Suvvalalu, Dhavalamulu, Sobhanamulu, Mangala haratulu. The style and nature of the conversations employed by the poetess reveal her mastery over the Telugu language."[26]

ఆచార్య యస్.వి. జోగారావుగారు పేర్కొనినట్లుగా వెంగమ యక్షగాన కృతు లన్నియు తుంచి నాటకపు వాటము గల్గి యుండును. అందలి దరువు లెక్కువగాఁ బ్రసిద్ధ తాళప్రధానములు. అటనట రాగములు పేర్కొనబడినవి.

ద్విపదలు, మంజరి, పద్యములు, సీసార్ధములు, వచనములు, ఏలలు, గొబ్బిళ్ళు, సువాలలు, ధవళ, శోభనములు, మంగళహారతులు, చూర్ణికలు, దండకములు మొదలగు పలురకముల రచనావిశేషములు ననేకములుగలవు..................................ఆటవిక జాతుల జీవిత విశేషములనుండి గహనములైన యోగశాస్త్ర రహస్యముల వరకుఁగల యనేకవిషయము లామె కధిగతార్థములు..................ఆమెవలె నిన్ని యక్షగానము లింత సమర్థముగా రచించిన కవయిత్రులు లేరు. సరికదా కవులు నరుదు."[27]

## యక్షగానములు-జ్ఞాపికలు

1. చూ. ఈ సిద్ధాంత వ్యాసము 3.0

2 See 'Literary and philosophical works of Tarigonda Vengamamba, A woman Saint', The Madras University Journal, Vol.XXX, pages 18 & 23.

* క్రీ'శ. 1927లో ముద్రితమైన ఈ చెంచునాటక ప్రతి (113వ పుట) డా.మద్దూరి సుబ్బారెడ్డిగారు సౌజన్యమువలన ఈ వ్యాసకర్తకు లభించినది. ఇది ఆచార్య శ్రీ యస్.వి. జోగారావుగారు సేకరించిన అమూల్య యక్షగాన సంకలనములోనిది. ఇందులకు ఆ యిరువురు విద్వాంసులకు ఈ వ్యాసరచయిత మిగుల కృతజ్ఞుడు.

3. చూ. "శ్రవణసుఖంబుగా సామగానంబులు" అను సీసపద్యము, ఆదిపర్వము, VI ఆశ్వా , 23 ప.

4. "అహింసా ప్రతిష్ఠాయాం తత్సన్నిధౌ వైరత్యాగః" (అహింసావ్రతనిష్ఠులైన మహాత్ము లుండెడిచోట స్వభావవైరము గల జంతువులు సైతము వైరము లేక సంచరించును.) చూ. పాతంజల యోగదర్శనము, 2 పా 35 సూ.

6 i) కృతి ప్రారంభము

"ప్రకటముగ బాలకృష్ణ నాటక మనంగ
నొక్కకృతిఁ దగ యక్షగానోక్తిగాను
వెలయ రచియించె యింజేటి వెంగమాంబ
ఇమ్మహిని దత్కథాక్రమం బెట్టి దనిన"

ii)కృతి చివర

"గురుతరంబుగ తరిగొండ నృసింహు-వరలాభమునను సుబ్రహ్మణ్యయోగి
కరుణా కటాక్ష వీక్షణ మహత్త్వమున-నరులెన్న శ్రీకృష్ణనాటకంబనెడు
వరకృతి గావించి వాసుదేవునకు-పరమభక్తిని సమర్పణముగాఁ జేసె
భూచక్రమున నిట్టి పుణ్యప్రబంధ-మాచంద్రతారార్కమై యొప్పగాత"

చూ బాలకృష్ణ నాటకము (తాళపత్రప్రతి)

* ఈ యక్షగానముయొక్క తాళపత్రప్రతి తరిగొండ వెంగమాంబ బంధువుల వంశమునకు చెందినవారును, మదనపల్లి తాలూకా చిన్నతిప్ప సముద్రము గ్రామకరణమును అయిన శ్రీ డాకరాజు వెంకటరమణ రావుగారి యొక్క సౌహార్దమున ఈ వ్యాసకర్తకు లభించినది. అందులకు ఈ వ్యాసకర్త వారికి మిగుల కృతజ్ఞుడు.

7. "సురేంద్రకల్పకంబు గరములీలఁదెచ్చె"

-ఆంధ్ర మహాభారతము, ఉద్యోగపర్వము, II) ఆశ్వా., 310 ప.

"సత్యభామకుఁబారిజాతంబుపైఁగల కోర్కిదీర్చిన రసికుం డితండె"

-ఉద్యోగపర్వము, III) ఆశ్వా., 175 ప.

మఱియు ఈ గాధ ఎఱ్ఱాప్రెగడ హరివంశము (ఉత్తర భాగము -చతుర్థాశ్వాసము) న.పోతనామాత్యుని భాగవతము (దశమస్కంధము - ఉత్తర్థా భాగము) న. వెన్నెలకంటి సూరన విష్ణుపురాణము (అష్టమాశ్వాసము) నగలదు.

8. బందరు వాస్తవ్యులు శ్రీమాన్ మరింగంటి శేషాచార్యులుగారి భామాకలాపము (కాగితపు వ్రాతప్రతి) యిందుల కాధారము. వారి కూతురు తిరుపతి శ్రీ వేంకటేశ్వర సంగీత నృత్య కళాశాలలో ఉపన్యాస కురాలు అయిన శ్రీ మరింగంటి కాంచనమాలగారి సౌహార్దమున ఈ వ్రాతప్రతిని పరిశీలించు అవకాశ మీ వ్యాసకర్తకు లభించినది. ఇందులకు శ్రీయుత కాంచనమాలగారికి ఈ వ్యాసకర్త మిగుల కృతజ్ఞుడు. శ్రీమాన్ శేషాచార్యులుగారు, కూచిపూడి నివాసులును, సుప్రసిద్ధ నాట్యా చార్యులును అయిన వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రులుగారి యొద్ద నుండిన వ్రాతప్రతిని చూచి (అందలి హాస్యభాగము లను మాత్రము మినహాయించి) ఈ ప్రతిని వ్రాసికొన్నట్లు శ్రీమతి కాంచనమాలగారు తెల్పినారు.

9. చూ. పారిజాతాపహరణము, v) ఆశ్వా., 3-42ప.

10. చూ. ఎఱ్ఱన హరివంశము, ఉత్తరభాగము iv) ఆశ్వా., 271 ప.

11. 12,13, ఆ పద్యములు, ఉత్తరము మున్నగునవి తరిగొండ వెంగమాంబ రచన లని చాలమందికి తెలియదు. అందును అవి ఆమె రచించిన విష్ణుపారిజాతము నుండి గైకొనబడినవను విషయము నింతవర కెవ్వరెఱుగరు.

* ఈ శివనాటకపు వ్రాతప్రతి (161 వ పుట) సుగృహీతనామధేయులు శ్రీ రావూరి దొరసామి శర్మగారియొద్ద నుండినది. పూజ్యులు, శిష్యవత్సలు లునైన ఆచార్య శ్రీ జి.యన్.రెడ్డిగారి సౌహార్దమున ఈ వ్యాసకర్తకు లభించినది. సుహృదయ వరేణ్యులగు ఆ యిరువురు విద్వాంసులకు ఈ వ్యాసకర్త మిగుల కృతజ్ఞుడు.

14 చూ. 32 (E) 19 తాళపత్రప్రతి, చెన్నపురి అడయారు గ్రంథాలయము.

15 i) "రహిమీఱ సోమేశ్వరస్వామిఁ దలఁచి'-రాజయోగసారము, పుట4.

ii)"ఇది సోమనాథ విశ్వేశుని పేర" - రాజయోగసారము, పుట 21.

iii) "ఇది సోమనాథ విశ్వేశ్వరస్వామి.

పద పద్మ భక్త సుబ్రహ్మణ్యయోగి" - వాసిష్ఠరామాయణము, పుట 379. పై నిదర్శనములనుబట్టి " "సోమశేఖరుడు", "సోమేశ్వరుడు, "సోమనాథ విశ్వేశుడు", " సోమనాథ విశ్వేశ్వరుడు" అనునవి వెంగమ గురువైన సుబ్రహ్మణ్య యోగికి ఇష్టదైవమగు సోమేశ్వరస్వామికి పర్యాయనామములని నిశ్చయింప వీలగుచున్నది.

16. క్రీ.శ. 18వ శతాబ్ది పూర్వార్ధమున నుండిన లింగమూర్తి యనుకవి రచించిన శివపారిజాతము, క్రీ.శ. 19వ శతాబ్ది పూర్వార్ధమున నుండిన వెంకట కృష్ణాజెట్టి తంజావూరు రాజాస్థానమున రచించిన శివపారిజాతము, వీరభద్ర కవి రచించిన శివభాగవతము -అనునవి అట్టివానిలో ముఖ్యమైనవి. ఈ రచన లన్నియు కథాకల్పము, నాటకీయ నిర్వహణానైపుణి-మొదలగు అంశముల యందు వెంగమాంబ రచనకు తీసికట్టుగా నున్నది.

చూ. అం.య.గా.వా.చ.ద్వి.భా., పుటలు 64, 346, 435.

17. ఇది వాల్మీకి మహర్షి ప్రణీతము.

18 క్రీ.శ. 11వ శతాబ్దమున నుండిన కృష్ణ మిశ్రుడను కవి రచించినది.

19 చూ. ఆం.య.గా.వా.చ.ద్వి.భా., పుటలు24, 81, 451

20. చూ. విష్ణుపారిజాతము, పుటలు 28, 29.

21 i) "శ్రీకరముగాను దరిగొండ శ్రీ నృసింహుం
డైన శేషాచలేంద్రుని యనుమతమున
లలితమగు ముక్తికాంతా విలాస కృతిని
వెలయ రచియించెఁ దరిగొండ వెంగమాంబ"
ii) "లలి ముక్తికాంతావిలాస సత్కృతిని
శృంగారముగ విరచించి మోక్షంబు
నంగీకరించి మహాగురుండైన
హరి కర్పితము సేతు..................."

-వేదాంత జ్ఞానబోధిని (ముక్తికాంతా విలాసము) ౨౭ పుట.

22. చూ ఇదే గ్రంథము ద్వితీయ ప్రకరణము, పుట 70, 20వ అంశము.

23 చూ. ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము, పుట 187.

24. చూ. ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము, పుటలు 185,186

25. "తోడయ మంగళము" ఐదు కీర్తనలు. చూ. ఆం.య.గా.వా.చ. అనుబంధము. పుట 339. ఇవి తాళ్ళపాక కవుల రచన లనుటకు నిదర్శనముగా వీటిలో నొకటగు 'నారాయణ తే నమో నమో' అను కీర్తన అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలలో కనిపించుచున్నది. చూ. 'అధ్యాత్మ సంకీర్తనలు' వాల్యూమ్xl, పుటలు 183 - 184

26 The Madras University Journal, Vol. XXX, No I, Pages 24 &25.

27 చూ. ఆం. య. గా. వా. చ. ద్వి. భా. పుట 115, 116.

## ద్విపద రచనలు

సంస్కృతమునకు అనుష్టుప్ ఛంద మెట్టిదో, తమిళమునకు కురళ్ ఛంద మెటువంటిదో, కన్నడమునకు షట్పది యెట్టిదో, తెలుగునకు ద్విపద అట్టి జాతీయచ్ఛందము. ఈ ఛందస్సు చదువుటకును, పాడుటకును అనువైనది. మఱియు నిది సామాన్యప్రజానీకమును సైతము సులభముగా ఆకర్షించు స్వరూప, స్వరూప, స్వభావములు గల దైనందున చతుర్విధ కవితలలో మధురకవితాశాఖకు జెందినదిగా పరిగణింపబడినది.[1]

తరిగొండ వెంగమాంబ రచించిన ద్విపద కృతులు నాలుగు. అవి.

1. రాజయోగసారము. (రాజయోగాకృతసారము)
2. రమా పరిణయము.
3. శ్రీ భాగవతము.
4. వాసిష్ఠ రామాయణము.

పై నాలుగు కృతులలో మొదటిది అనుసరణము. తరిగొండలో రచితము. మిగిలినవి తిరుమలలో రచింపబడినవి. రెండవది స్వతంత్ర రచన. మూడవ, నాల్గవ కృతులు అనువాదములు. నాల్గవదైన వాసిష్ఠ రామాయణము వెంగమ చివరి రచన.

## రాజయోగసారము

కృత్యారంభములో ఇది 'రాజయోగసార' మని పేర్కొనబడినను,2 ఆయా ప్రకరణముల చివరి పంక్తులలో 'రాజయోగామృతసారము' గా చెప్పబడినది.[3] ఇట్లు ఈ కృతికి పర్యాయముగా రెండుపేళ్లు గలవు. వెంగమాంబ రచనలలో పెక్కింటికి ఇది యొక ప్రత్యేక లక్షణము.

రాజయోగసారము ఇంచుమించు 900 ద్విపదలలో రచింప బడిన తాత్త్వికకావ్యము. ఇది ప్రథమ, ద్వితీయ, తృతీయ ప్రకరణములని మూడు ప్రకరణములుగా విభజింపబడియున్నది. మొదటి ప్రకరణమున 200 ద్విపదలు, రెండవ ప్రకరణమున 180 ద్విపదలు, మూడవ ప్రకరణమున 480 ద్విపదలు గలవు. తృతీయ ప్రకరణము గ్రంథ పరిమితిలో సగముకన్న నెక్కువ భాగమున విస్తరించియున్నది.

**ఇతివృత్తము :**

కర్దముడు ప్రజాపతి. ఆయన భార్య దేవహూతి. పుత్రికలే గాని, పుత్రుడు లేని కర్దముడు పుత్రార్థియై గొప్ప తపస్సు చేసెను. విష్ణువు వరప్రభావమున కర్దమునకు దేవహూతి యందు ఏకైక పుత్రుడుగా కపిలుడు జన్మించెను. జనియించిన పిమ్మట కొంతకాలమునకు కర్దముడు భార్యను సమ్మతింపజేసి తపోవనమున కేగెను.

తండ్రియానతి ననుసరించి కొన్ని వత్సరము లుండిన పిమ్మట, కపిలుడును మునివృత్తి నవలంబించి కాననమున కరుగ సంకల్పించెను. తన్ను వారించిన తల్లికి విరక్తిమార్గము నుపదేశింపదొడగెను. తల్లియడుగు ప్రశ్నలకు సమాధానముగా వేదాంతవిజ్ఞానము సంతతిని సంగ్రహముగా, సూటిగా తేటపరచెను. ఆ విధముగా కపిలుడు జీవులయుత్పత్తి (పిండోత్పత్తి ఘట్టము), ప్రపంచముయొక్క ఉత్పత్తి (విశ్వోత్పత్తి ఘట్టము) స్థూలశరీరమందలి పంచవింశతి తత్త్వములు అను విషయములను వివరించుటతో ఇందలి ప్రథమ ప్రకరణము ముగియుచున్నది.

ద్వితీయ ప్రకరణమున స్థూలశరీరమునందు గల ఆధారాది సప్తకమలములు, వాటిస్థానములు, అధిదైవములు మున్నగు వివరణములు, నరునకు జీవన్ముక్తి కలిగెడి విధము - చక్కగా విశదీకరింపబడి యున్నవి.

తృతీయ ప్రకరణమున పంచవింశతి ప్రకరణములు తారక, అమనస్కపూర్వకమైన రాజయోగవిశేషములు, పంచకోశ ప్రభావములు విపులముగా వివరింపబడినవి. కపిలుడు వివరించిన ఈ బ్రహ్మవిద్యచే సుజ్ఞానియై దేవహూతి సంతృప్తి నొందుటతో ఈ గ్రంథము పరిసమాప్తి నొందుచున్నది.

ఇందలి యితివృత్తమునకు భాగవత తృతీయ స్కంధము నందలి 'కర్దమ ప్రజాపతి వృత్తాంతము ఆధారము. ఈ వృత్తాంతము ఆంధ్రమహాభాగవతము. తృతీయ స్కంధమున 746వ పద్యము మొదలుకొని ఆ స్కంధాంతమువరకు (1051 వ వచనమువరకు) అనగా

306 గద్య పద్యములలో విస్తరిల్లి యున్నది. ఇది సౌకర్యార్థము రెండు భాగములుగా పరిగణింపదగియున్నది. అట్లు పరిగణించినచో ఆదినుండి కర్దముడు తపోవనమున కేగువరకుంగల ఉదంతము (746 వ పద్యమునుండి 866 వ వచనమువరకు) మొదటి భాగముగను, కపిలుడు తల్లికి తత్త్వజ్ఞానము నుపదేశించుట మొదలుకొని దేవహూతి మోక్షము నొందిన పిమ్మట కపిలుడు తపమున కేగుటవరకు గల వృత్తాంతము (867 వ పద్యము నుండి 1051వ వచనము వరకు) రెండవ భాగముగను ఏర్పడుచున్నవి.

పై రెండు భాగములనుండి కథాంశములను స్వీకరించుటలో ఈ కవయిత్రి ఒకానొక ప్రత్యేకతను ప్రదర్శించినది. మొదటి భాగమున 121 గద్యపద్యములలో నున్న కథాంశములలో కొన్నింటిని మాత్రమే గైకొని, వాటిని కేవలము 25 ద్విపదలలో పూర్తిగా సంక్షేపించినది.[4] రెండవ భాగమున కపిలుడు తన తల్లికి తెల్పిన విషయములు 185 గద్యపద్యములలో వివరింపబడియున్నవి. వీటిలో భక్తియోగము మిగుల విపులముగను, తాత్త్విక విషయములు చాల సంగ్రహముగను చెప్ప బడినవి. అట్లు సంగ్రహముగా నున్న ఆ తాత్త్వికాంశములను స్వేచ్ఛగ స్వీకరించి, వెంగమ వాటిని స్వానుభవ జనిత జ్ఞానముతో సమన్వయించి సులభశైలిలో 835 ద్విపదలలో వెలయించినది. పై రీతిని ఈ కవయిత్రి మూలమును మిగుల సంక్షేపించుటలోను, స్వేచ్ఛగా అనుసరించుటలోను కావ్యోచితములగు మార్పులను, చేర్పులను కథలో గావించియున్నది. ఆ మార్పులు, చేర్పులు, వాటి ప్రయోజనములు వరుసగా ఈ దిగువ నీయబడుచున్నవి.

**మార్పులు, చేర్పులు :**

1) భాగవతమున కర్దముడు సమానశీలయగు కన్యను పరిణయమాడ గోరి తప మొనర్పగా హరి ప్రత్యక్షమై 'నీకు తొమ్మండుగురు కూతులు కలుగుదురు. పిమ్మట మత్కళాంశమున నేను నీకు పుత్రుడనై జన్మించి తత్త్వ సంహిత నుపదేశింతు' నని పల్కెను.

రాజయోగసారమున కర్దముని వివాహ వృత్తాంతము అనావశ్య కమని విడువబడినది. తొలుత కూతులు కల్గినపిమ్మటనే కర్దముడు

పుత్రార్థియై తప మొనర్చెననుట యొకమార్పు. ప్రత్యక్షమైన పరమాత్ముని తో 'నీవు నా పట్టివి గావలయు' నను కర్దముడే కోరుట మఱొకమార్పు. ఈ రెండు మార్పులు అవతార పురుషుడగు కపిలుని జననమునకు కావ్యోచితమగు ప్రాధాన్యమును కల్పించుచున్నవి.

2) భాగవతమున కర్దముడు అరణ్యముల కేగుచుండగా 'కూతులకు వివాహము లొనర్చి, తత్త్వసంహిత నుపదేశింపగల సుతుని ప్రసాదించి యేగు' డని దేవహూతి ప్రార్థించును.

రాజయోగసారమున కపిలుడు జన్మించిన తరువాతనే ఒకనాడు కర్దముడడవుల కేగ దలంపగా ' నే నొంటరిగా నుండజాలను. మీవెంటవత్తు' నని దేవహూతి వేడుకొనినది. ఈ మార్పును దేవహూతి పాత్రపోషణకై కవయిత్రి కావించినది.

3) భాగవతమున కర్దము డడవి కేగిన యనంతరమే తత్త్వ జ్ఞానమునుగూర్చి దేవహూతి కపిలు నడుగును.

రాజయోగసారమున పెక్కువత్సరములు కడచిన పిమ్మట కపిలుడును తండ్రివలెనే కానల కేగ దలంపగా, దేవహూతి 'ఆ నాడు మీ తండ్రి చెప్పిన మాటలు విస్మరించితివా? నీ విపు డడవి కేగిన నెట్లు?' అని పల్కెను. అప్పుడు కపిలుడు 'తల్లీ! ఏల నీకీ పామరము?' అని ప్రారంభించి తానే తత్త్వముపదేశింప దొడగెను. ఇట్లు తండ్రి వలెనే కపిలుడును అడవి కేగ దలంచె నను ఈ మార్పువలన పుత్రుని యెడబాటు కోర్వజాలని దేవహూతి మాతృహృదయము ఆవిష్కరింప బడుటతో పాటు, కపిలుని తత్త్వబోధకు సహజమగు అవకాశమును కల్పించిన ట్లైనది.

4) భాగవతమున కర్దముడు, దేవహూతి ఆ యా సందర్భములలో కపిలుని భగవంతునిగా భక్తితో స్తుతింతురు.

రాజయోగసారమున ఆ దంపతులు తమ కుమారునిపై భక్తి కంటె వాత్సల్యమునే ఎక్కువగా ప్రదర్శించిరి. ఈ మార్పు కాంతా సమ్మితమగు కావ్యమునకు ఉచితమై, అత్యంత సహజమై యొప్పుచున్నది.

5) భాగవతములో నరకమున పర్యవసించు మనుజుని జీవిత దశాపరివర్తనము తొలుత (975 వ పద్యమునుండి 989 వ పద్యము వరకు) వర్ణింపబడి, పిమ్మట పిండోత్పత్తి క్రమము (990 వ వచనము నుండి 992 వ వచనమువరకు) తెల్పబడినది. సులభావగాహనకై వెంగమ ముందుగా పిండోత్పత్తి లక్షణమును, అనంతరము మానవ జీవిత దశాపరిణతిని దాదాపు 50 ద్విపదలలో సంగ్రహముగా, సూటిగా వివరించినది.6

6) రాజయోగసార ద్వితీయ ప్రకరణమున దేవహూతి 'జీవన్ముక్తి నరునకే విధమున గల్గు?' నని ప్రశ్నించినది. ఈ ప్రశ్నకు సమాధానముగా కపిలు డిందు తెల్పిన 'గురూపదేశ విధానము' భాగవతములో లేదు. ఇది యీ కవయిత్రియొక్క స్వానుభవజనిత జ్ఞానమునకు ఒక ఉదాహరణ. గురువు శిష్యుని సిద్ధాసనాసీనుని జేసి, నొసట విభూతి బొట్టుపెట్టి రాజయోగ ప్రకారమును ఉపదేశింప వలెనని కపిలుడు తల్లికి తెల్పిన ఆ పద్ధతి యంతయు వెంగమాంబ సుబ్రహ్మణ్యగురునివలన పడసిన ఉపదేశానుభవమును సూచించుచున్నది.7

7) భాగవత కథయందును, రాజయోగసార కథయందును దేవహూతి కపిలులే ప్రధానపాత్రలైనను, రెండు గ్రంథములయందలి సంభాషణాధోరణిలో తేడా కనిపించును. భాగవతములో దేవహూతి కపిలుని కుమారుడను భావనతో గాక, దేవుడను తాత్పర్యముతోనే ప్రశ్నింపగా, అందుకు దగినట్లే కపిలుడు ప్రత్యుత్తరము లొసంగును. రాజయోగసారమునందలి దేవహూతి కపిలుల సంభాషణ మాత్రము ఆదినుండియు లోకస్వాభావికమగు ఆప్యాయతతో కొనసాగినది.

8) వెంగమాంబ భాగవత కథలోని ప్రశ్నోత్తరక్రమమును యథాతథముగా పాటింపక, తాను ప్రతిపాదింప దలంచిన సాంఖ్య, తారక, అమనస్కరూపమైన 'రాజయోగ' ప్రణాళిక కనుగుణముగా ప్రశ్నలను దేవహూతి ముఖమున పల్కించి, పటువైన వాకోవాక్య పద్ధతిని స్వతంత్రముగా నెలకొల్పినది.

9) భాగవతమునందలి కపిలుని సమాధానములలో భక్తి విషయములు, యోగవిశేషములు కలగాపులగముగా కలిసియున్నవి.

వెంగమాంబ అందలి యోగవిషయములను మాత్రము వలసినట్లు గైకొని వాటిని క్రమపరచి, కపిలుని వాక్కులలో సుబోధముగా విశదీకరించినది.

10) భాగవత కథాంశములలో ఈ కవయిత్రి స్వీకరింపక వదలినవి కొన్ని గలవు. అట్టివానిలో గర్భస్థుడగు జీవుడు భగవంతుని స్తుతించి సన్నివేశము (903 వ పద్యమునుండి 1004 పద్యమువరకు), అంగనాసంగమము దోషమును నీతికి నిదర్శనముగా చెప్పబడిన సరస్వతీబ్రహ్మల ఇతిహాసము (1006, 1007 పద్య గద్యములు) - ముఖ్యమైనవి. ఈ రెండిటిలో మొదటిది అనావశ్యకమగు తలంపునను, రెండవది ఔచిత్యదృష్టితోడను పరిహరింపబడినవి.

11) ముగింపులో సైతము ఈ రెండు గ్రంథములకు భేదము కానబడుచున్నది. భాగవతమున కపిలుడు తల్లికి బ్రహ్మవిద్య నుపదేశించిన పిదప తన దారిని తా నేగును. పిమ్మట దేవహూతి గురుయోగ శక్తిచే శ్రీహరిని గలియును. రాజయోగసారమున ఈ రెండు విషయములును పేర్కొనబడలేదు.

"సంతతం బీ రహస్యము భావమందుఁ-జింతింపుచుండు సుస్థిరముగ జనని!
ఇల భానుఁ డస్తాద్రి కేగినవేళఁ-గళలచే వెల్గఁ దక్కక జాల మెల్ల
అమర నాతనియందు ననువొందుమాడ్కి-నమనస్కమున నడఁగా విశ్వమెల్ల
గనుక యీయమనస్క ఘనతరాభ్యాస-మున నీవు పరిపూర్ణముగ నిండియుండు"

-తృతీయ ప్రకరణము, 84 పుట.

అని యీ కృతి ముగింపబడినది. 'శ్రీకృష్ణార్జున సంవాద' మగు భగవద్గీతవలెనే, 'కపిల - దేవహూతి సంవాద' మగు ఈ రాజయోగామృత సారము సైతము నిత్యమనెడి శాశ్వతిక భావనను స్ఫురింపజేయుటకై అట్లు కథను ముగింపకయే ఈ కవయిత్రి కృతిని ముగించినదని భావింపవచ్చును.

**అనువాదనైపుణ్యము :**

ఈ కృతి ప్రధానముగా అనుసరణమే యైనను, వేదాంతగ్రంథ మగుటచే ఇందు అటనట కొన్ని శ్లోకములయొక్క, శ్రుతి సూక్తుల యొక్క, ఉపనిషద్వాక్యముల యొక్క అనువాదములు చోటు చేసికొని యున్నవి. మచ్చుక ఒకటి రెండుదాహరణలు:

i) ద్వితీయ ప్రకరణమున కపిలుడు దేవహూతికి షట్చక్రములను వివరించు ఘట్టమున కవయిత్రి ఈ క్రింది శ్లోకముల భావమును చక్కగా సంగ్రహీకరించినది.

"ఇడా భాగీరథీ గంగా పింగళా యమునానదీ।
తయో ర్మధ్య గతా నాడీ సుషుమ్నాఖ్యా సరస్వతీ॥
ధ్యానహ్రదే జ్ఞానజతే రాగద్వేష మలాపహే।
య స్స్నాతి మానసే తీర్థే స యాతి పరమాం గతిమ్॥
కాశీక్షేత్రం శరీరం త్రిచతను వ్యాపినీ జ్ఞానగంగా।
భక్తి శ్రద్ధా గయేయం నిజగురుచరణ ధ్యానయోగః ప్రయాగః॥
విశ్వేశోఽయం తురీయం సకల మభిమతం వ్యాప్యతే చాంతరాత్మా॥"
"భాసురమతి నిట్టి భావంబుగాను-శ్రీ సద్గురుని మేటిరీతి నీ లాగు
కాశి గయా ప్రయాగలు నందయుండు-దేశికుఁడట మహాదేవుఁడై యుండు
పొడిమిమీఱఁ బెంపొందుచు మధ్య-నాడి సహస్రారనాళమై యుండు
నదియు సరస్వతి యదె పరంజ్యోతి-యదె యూర్ధ్వకుండలి యదె సుధాధార
యదె భూతతతి హేతు వడె తటిద్వల్లి-యదె చిద్విలాసంబు నదె పరమంబు."

-ద్వితీయ ప్రకరణము, 25, 26 పుటలు.

ii) తృతీయ ప్రకరణమున తారకయోగమును వివరించు సందర్భమున వెంగమ ఈ క్రింది ఉపనిషద్వాక్యములను చక్కగా స్పష్టముగా, మూలమునకు దీటగునట్లు అనువదించినది.

"నీలతోయద మధ్యస్థా విద్యుల్లేఖేవ భాస్వరా
నీవార శూకవత్తన్వీ పీతాభాస్వ త్యణూపమా
తస్యా శ్శిఖాయా మధ్యే పరమాత్మా వ్యవస్థితః
సబ్రహ్మ సశివ స్సహరి స్సేంద్ర స్సోక్షరః పరమ స్స్వరాట్,"

-తైత్తిరీయారణ్యకమ్, 10 ప్రపాఠకమ్, 11 అనువాకమ్.

"ఆ రీతి నుపనిషదర్థ సూచకము-వేఱుచిత్తము లేక విను దృఢంబుగను
అలరార నీలతోయద మధ్యమందు-వెలుఁగు విద్యుల్లేఖ విధమున మఱియు
సురుచిర నీవారు శూకంబు పగిది-నరయ పీతచ్ఛాయ నణు తుల్య మగుచుఁ
జెలువందు పావకశిఖ, దాని నడుమ-బలముగా వ్యాపించి పరమాత్మ యుండు
నిదె బ్రహ్మ మిదె శివుం డిదియె విష్ణుండు-నదియె దేవేంద్రుండు
నదియె యక్షరము అదియె పో పరమంబు నదియె స్వరాట్టు"

-తృతీయ ప్రకరణము, 50,51 పుటలు.

పై రీతిగా ఈ వేదాంత కావ్యమున నెన్నో తాత్త్వికసూక్తులు ఈ కవయిత్రి యుపజ్ఞచే చక్కని ద్విపదల రూపము నొందియున్నవి.

**నామౌచిత్యము:**

కవయిత్రి ఈ కృతియందలి ఇతివృత్తానుసారముగ 'కపిల దేవహూతి సంవాద'మని పేరిడక, తదాధారమున తాను ప్రపంచించిన తాత్త్విక విషయము ననుసరించి రాజయోగామృతసార (రాజయోగసార) మని ఈ కావ్యమునకు నామకరణ మొనర్చినది. నిజమునకు ఈ నామకరణ విధానము ప్రౌఢతాస్ఫోరకము. వెంగమకు పూర్వము వెలువడిన 'బ్రహ్మవిద్యా సుధార్ణవము,'8 'పరతత్త్వరసాయనము'9 వంటి ఏ యొకటి రెండు వేదాంత కావ్యములయందో ఇట్టి నామ నిర్దేశ విధానము గోచరించును. సకృత్తుగా నున్న ఆ పద్ధతియందలి ఔచిత్యమును గుర్తించియే తాత్త్విక కవయిత్రి యయిన వెంగమతన కృతి

కిట్లు నామకల్పన గావించెనని. తలపనగును. ఈ పేరునందలి అక్షర సంపుటీకరణ మహిమ యేమోగాని అనంతర కాలమున తత్తుల్య నామధేయములగు తాత్త్విక రచన లనేకము తెలుగులో వెలసినవి. ఈ 'పేరు సొంపు'నకు విషయ సౌలభ్యము తోడగుటవలన ఈ ద్విపద కృతి ఆవిర్భవించిన అనతికాలముననే సుగృహీత నామధేయమై, అంతకు పూర్వము మిగుల ప్రసిద్ధి వహించియుండిన 'సీతారామాంజనేయ సంవాదము'తో సమమగు ప్రశస్తి నొందగల్గినది. ఒక్క 'రాజయోగసార' రచయిత్రిగానే తరిగొండ వెంగమాంబ నెఱిగిన తాత్త్వికు లనేకులు తెలుగుసీమయందు గల మారుమూల జనపదములలో ఈనాటికిని కలరు.

**ఇతరవిశేషములు :**

ఈ కృతి యందలి మఱికొన్ని విశేషము లీ క్రింద వివరింప బడుచున్నవి.

1) వెంగమాంబకు విద్యాగురు వెవ్వరును లేకున్నను. బ్రహ్మవిద్యాగురువు మాత్రము కలడు. ఆయన పేరు సుబ్రహ్మణ్యయోగి. ఈ కవయిత్రి ఆ గురువర్యుని తాను రచించిన కృతులన్నింటియందును కొనియాడినది. ఈ కావ్యారంభమున మాత్రము ఆ సుబ్రహ్మణ్య దేశికునకు పూర్వమందలి గురుపరంపరను గూడ స్తుతించినది. ఈ స్తుతి పద్ధతి పరశురామపంతుల లింగమూర్తి (క్రీ. శ. 18వ శతాబ్ది పూర్వార్ధము) రచించిన 'సీతారామాంజనేయ సంవాద' మందలి గురుస్తుతి పద్ధతిని పోలియున్నది.10 ఈమె రచించిన ఆధ్యాత్మిక కావ్యములలో నిది తొలుతటి దగుటచే ఈమె యిందు తన 'బ్రహ్మవిద్యా వంశము' నందలి వారి నెల్ల పేర్కొనెనని భావింపవచ్చును.

ఈ కృత్యారంభమున పేర్కొన్న గురుపరంపర ఇది: i) సుబ్రహ్మణ్య గురుడు ii) సోమేశ్వరస్వామి iii) విద్యారణ్య గురుడు iv) పరబ్రహ్మేంద్రులు v) స్వయంప్రకాశులు vi) సచ్చిదానందగురుడు vii) మల్లికార్జునుడు viii) అవధూత దేశికోత్తముడు ix)పరమహంసాఖ్య సద్గురుడు x) బడబానలగురుడు xi)యోగా నందగురుడు xii) జితేంద్రియ గురుడు xiii) దిగంబరగురుడు xiv) పరకాయ ప్రవేశగురుడు

xv) నిత్యానందగురు రాజచంద్రుడు xvi) నిరంజన గురుడు xii) బోధానందగురుడు.

పై గురుపరంపరలో మొదట పేర్కొనబడిన సుబ్రహ్మణ్య గురుడు ఈకవయిత్రికి సాక్షాద్దేశికుడు. ద్వితీయుడగు 'సోమేశ్వర స్వామి' మానవమాత్రుడగు గురువు గాడు. ఆయన మదనపల్లి గ్రామమున వెలసి యున్న ఈశ్వరుడు. ఈ దేవుని ఆలయము మదనపల్లికి దాదాపు మైలుదూరమున బెంగుళూరు రోడ్డుపై కలదు. ఈ దేవాలయము నేడు "మడికయ్యల శివాలయ" మని వ్యవహరింపబడుచున్నది.[11] ఇందలి 'సోమేశ్వరస్వామి' ఈ కృతియొక్క ప్రకరణాంత పంక్తులయందు "సోమనాథ విశ్వేశుడు" గాను,[12] వాసిష్ఠ రామాయణము నందలి ప్రకరణ మున చివర "సోమనాథ విశ్వేశ్వరస్వామి" గాను పేర్కొనబడి యున్నాడు.[13] ఈ సోమేశ్వరస్వామి వెంగమాంబ గురువగు సుబ్రహ్మణ్యయోగియొక్క ఆరాధ్యదైవముగా వాసిష్ఠ రామాయణమందలి ఈ ద్విపదపంక్తులవలన తెలియ వచ్చుచున్నాడు.

> "ఇది సోమనాథ విశ్వేశ్వరస్వామి - పదపద్మభక్త సుబ్రహ్మణ్యయోగి
> చరణాంబుజాత షట్చరణాయమాన-పరిపూర్ణ నిత్యసద్భావ నిమగ్న
> మానసాంబుజ వెంగమాంబికారచిత-మై నిత్యమై సత్యమై ధన్య మగుచు
> సామార్థసార సుజ్ఞాన వాసిష్ఠ-రామాయణం బను రమ్య సద్ద్విపద
> యందంత పంచమంబగు ప్రకరణము"
>
> -వాసిష్ఠ రామాయణము, 370పుట.

మఱియు పై సుబ్రహ్మణ్యయోగి వంశీయులే ఈనాటికిని ఆ శివాలయ ధర్మకర్తలుగా నున్నా రను విషయము, ఆయన కా దేవునితో గల సంబంధమును ధ్రువీకరించుచున్నది.[14]

పైన పేర్కొన్న గురుపరంపరలోని తొలి యిరువురుగాక తక్కిన వారిలో ప్రథముడు విద్యారణ్యగురుడు. ఈయన విద్యానగర (విజయ నగర) సామ్రాజ్యస్థాపకుడుగా ప్రసిద్ధుడైన విద్యారణ్యస్వామి. వెంగమాంబ గురుపరంపరకు మూలపురుష డాయనయే యని భావింప

దగును.అటుపిమ్మట పేర్కొనబడిన గురువుల పేళ్లతో అద్వైతమతాచార్యు లనేకులు కన్పట్టుచుండుటచేతను, వారినిగూర్చిన సరియైన చారిత్ర కాధారములు లేనందుననను, వారెవ్వరో, వారి జీవితకాలము లేవో నిర్ణయించుట దుశ్శకమైనది.

నిడుదవోలు వేంకటరావుగారు పై గురుపరంపరలోని ii)సోమేశ్వర స్వామిని బమ్మెర పోతనచే, వేమనచే నుతింపబడిన 'సోమశేఖరగురుని గను, Vi) సచ్చిదానందగురుని 'నారద పురూరవ సంవాద' రచయిత యగు'అఖండ సచ్చిదానందావధూత' గను, Vii)మల్లికార్జునని 'శ్రీరామ స్తవరాజ' రచయిత యగు 'ముమ్మడి మల్లన' గాను, Viii) అవధూతదేశి కోత్తముని, అల్లూరు పుండరీకాక్ష కవిచే 'పురుషోత్తమ దేశికోత్తమా !' అను మకుటము గల శతకమున కొనియాడబడిన 'శ్రీపురుషోత్తమ దేశికోత్తముని' గాను, 'Xi) యోగానంద గురుని 'ఆత్మైక్యబోధ' రచయిత యగు యోగానందావధూత' గను XVi) నిరంజనగురుని 'హర విలాసము'లో శ్రీనాథుడు పేర్కొనియున్న 'నిరంజన రామనాథయోగి'గను గుర్తించినారు. ఐనను ఈ విషయమై ఇంకను పరిశోధింపవలసి యున్నట్లు అభిప్రాయ పడినారు.15 ఈ గుర్తింపులలో ii) సోమేశ్వరస్వామి పోతన, వేమనలు పేర్కొన్న సోమశేఖరగురుడు కానేరడు. ఇంతకు ముందు తెల్పినట్లు ఆయన మదనపల్లిలో వెలసియున్న సోమేశ్వరస్వామియే. తక్కిన గుర్తింపులు నిశితముగా పరిశీలింప నర్హములై యున్నవి.

2) తరువాతి కాలమున ఈ కవయిత్రి రచించిన ద్విపద భాగవతము (తృతీయ స్కంధము)న కపిల దేవహూతి వృత్తాంతము భాగవతానుసారిగనే సాగినది. 16 ఈతాత్త్వికరచన మాత్ర మట్లు గాక, మార్పులు, చేర్పులు, కూర్పులతో స్వతంత్ర కావ్యముగా అవతరించినది. అందువలననే ఇది కేవలము ' కపిల దేవహూతి సంవాదము' గాక, 'రాజయోగామృతసారమై' రాణించినది.

అపూర్వమగు ఈ నామధేయముతో ఈ వేదాంత కావ్యము అవతరించిననాటినుండి మిగుల ప్రచారము నొందినది. తిరుపతి, చెన్నపురి మున్నగుచోట్ల గల లిఖితప్రతుల గ్రంథాలయములలో గన్పట్టుచున్నవియు, తెనుగునాట నేటికిని అచ్చటచ్చట లభించుచున్న వియు నైన అనేక రాజయోగసార వ్రాతప్రతులు ఇందుకు నిదర్శనములు.

అనంతరకాలమున ఈ కృతి కొందరు కవులచే యక్షగానముగను,17 వచన కావ్యముగను18 పరివర్తితమై యుండుట, పండితులీ ద్విపద కావ్యమునకు చక్కని వ్యాఖ్యను19 సమకూర్చియుండుట మున్నగునవి ఈ గ్రంథప్రశస్తికి మఱికొన్ని నిదర్శనములు.

## రమాపరిణయము

ఈ ద్విపదకృతి వెంగమాంబ స్వతంత్ర రచన. నాలుగువందల ద్విపదలలో రచితమైన కమనీయ కావ్యము.

**ఇతివృత్తము:**

శ్రీమన్నారాయణుడు యోగనిద్రలో నుండగా బ్రహ్మాదులు వచ్చి ప్రార్థింతురు. విష్ణువు మేల్కని, వారు వచ్చిన కారణమడుగును. 'మిమ్ము పతిగా బడయ దలంచి జన్మించిన జలరాశిపట్టిని పరిణయ మాడు' డని విన్నవింతురు.

వేంకటేశ్వరుడను పేర వేంకటాద్రిపై నెలకొన్న విష్ణువు లగ్న నిశ్చయమునకై బ్రహ్మాదులను క్షీరవార్ధికడకు పంపును. సముద్రుడు ముహూర్తము నిశ్చయించి సమ్మాన పూర్వకముగా వారిని వీడ్కొల్పును.

శ్రీవేంకటేశ్వరుడు గరుడ వాహనారూఢుడై, సపరివారముగ జలరాశి చెంత విడియును. క్రమముగా వరపూజ, పేరంటములు, మంగళస్నానము, స్నాతకవ్రతము, కాశీయాత్రల అనంతరము కశ్యపుని ఆధ్వర్యమున రమావేంకటేశ్వరులకు మహావైభవముగ కల్యాణము జరుగును. నాల్గవనాటి రాత్రి బువ్వంబంతి. భోజనానంతరము పెండ్లికొడుకు బంగారుకలశ మెత్తుకొని విడిది చేరును. పిమ్మట పెండ్లికూతురు వచ్చి ప్రార్థింపగా అలుక మానును.

వేంకటరమణుడత్తమామలను, బంధువులను వేంకటశైలమున కాహ్వానించును. విందులు, వినోదములు పూర్తియైన పిమ్మట సముద్రుడు వకుళ యభిప్రాయానుసారము కూతును, అల్లునియింటనే విడిచి, సకుటుంబముగ తన నివాసమునకు తరలిపోవును. శ్రీ వేంకటేశ్వరుడు

రమాసతిని అలమేల్‌మంగ యను పేర వక్షస్థలమున ధరించి, సులలిత లీలలతో ఆనందనిలయమున సుఖింపు చుండును.

శ్రీమన్నారాయణుడు సముద్రుని కూతురైన లక్ష్మిని పరిణయమాడిన కథ భాగవతములో నున్నది. 20 దేవదానవులు అమృతము కొఱకు పాలసంద్రమును మథించుచుండగా ఆవిర్భవించిన లక్ష్మీదేవి శ్రీమన్నారాయణుని స్వయముగా వరించినటుల అందు చెప్పబడినది. వెంగమాంబ ఆ కథను స్వీకరింపక, 'విష్ణువు లక్ష్మిని పెండ్లాడె' నను పౌరాణిక సత్యమును మాత్రము గైకొని, దానిని భవిష్యోత్తర పురాణమందలి పద్మావతీ వేంకటేశ్వర కల్యాణ వృత్తాంతము21 చాయలలో కల్పించినది. ఈ కావ్యమందలి కల్పనలలో శ్రీ మహావిష్ణుని అవతారమగు శ్రీనివాసుడు వరుడై యుండుట అత్యంత ముఖ్యమైనది. ఈ మార్పు ద్వారా కవయిత్రి తన యిష్టదైవమగు వేంకటేశ్వరుని కల్యాణమును మనోజ్ఞముగా వర్ణించి తనిసినది.

**పాత్రచిత్రణ:**

నిజమునకు ఇందలి కథావస్తువు పరిమితిలో అంత విస్తృతమైనది గాకపోయినను, పాత్రల బాహుళ్యముండుట ఈ కృతియందలి విశిష్టత. ఈ కావ్య కథా గమనమునకు హేతువులుగా వెలసిన పాత్రములలో బ్రహ్మాదిదేవతలు, నాయికానాయకు లగు రమా వేంకటేశ్వరులు, కన్యాదాత యగు సముద్రుడు, ప్రధాన బంధువులగు పార్వతీ పరమేశ్వరులు, వరుని పెంపుడు తల్లియైన వకుళమాలిక ముఖ్యమైనవారు. ఈ చిన్ని కృతిలో ఆ యా పాత్రల స్వరూప, స్వభావములను సుస్పష్టరేఖలతో చిత్రించుటలో కవయిత్రి అనుసరించిన పద్ధతు లివి:

i) దివ్యపాత్రలకు అదివ్యములగు (మానుషములగు) భావము లను మురిపముగా ఆరోపింపజేయుట.

ii) ప్రతి పాత్రయొక్క స్వరూప స్వభావములను వాటి పలుకుల మూలముననను, చేష్టల ద్వారాను సమున్మీలింపజేయుట.

ఇందులకు క్రమముగా నుదాహరణములు

1) బువ్వంబంతిలో పరమేశ్వరుడు వరుని పరిహసింపగా, పార్వతి వరుని సమర్థించుచు, వధువును మేలమాడినది. ఆ సందర్భమున ఆ ఆదిమదంపతుల సంభాషణ యిట్లున్నది.

"అని కేరడముఁ జేసినటువంటి విభుని - గనుఁగొని హిమ శైలకన్య యిట్లనియె
స్వామి! మా జలజాక్షు సంపద దెలిసి - యీమాడ్కి మీరంటె యేమి చెప్పుదునండి
మా యన్న తిరుపణామధు సంతతంబు - పాయక భుజియించు భక్త్యాళితోడ
తెఱఁ గొప్ప నటుగాన తిరుపణాచారు - హరికి సహింప వయ్యావి యెందుఁగాని
తెప్పింపుఁ డటువంటి తిరుపణాచారు-మెప్పుగాఁ గ్రోలును మీ చెల్లె లనిన
నగి యిట్లు పలికెనా నాగకంకణుఁడు - 'నగజ ! మా లక్ష్మి నిట్లనినందు కిపుడు
సుదతి మీ యన్న చూచుచు నుండఁగానె - యదె చూడు నీచెంపలదర వేసెదను',"

-శ్రీవేంకటేశ్వర లఘుకృతులు, 168,169 పుటలు.

తన అన్నయగు వేంకటేశ్వరుని పరిహసించుచున్న భర్తయొక్క అభిప్రాయమును 'స్వామి ! మా జలజాక్షు సంపద దెలిసి, యీమాడ్కి మీ రంటె యేమి చెప్పుదును ?' అని సుకుమారముగా నిరాకరించుచున్న పార్వతి పలుకులలో వ్యక్తమగుచున్న వినయపూర్వక సంయమనము ఆమె యుత్తమగృహిణీత్వమును చాటుచున్నది. అట్లే తన చెల్లెలగు లక్ష్మిని మేలమాడినందులకు శంకరుడు తెచ్చుకొన్న కోపముతో నవ్వులాటలకు పార్వతిని 'చెంప లదర వేసెద' ననుటలో వెల్లడి యగుచున్న ఆప్యాయత సహృదయైక వేద్యము. పై ద్విపద పంక్తులలో పార్వతీ పరమేశ్వరులు బంధు ప్రీతి, అన్యోన్యత, లోకానుభవము మున్నగు మానవోచిత గుణములు గల దంపతులుగా వ్యక్తీకరింపబడియున్నారు.

2) గంగ మొదలైన సాగరుని పత్నులు రమాదేవిని వరుని విడిదికి పిలుచుకొనిపోయి ఆమెచే వేంకటేశ్వరుని బిలిపించుచున్న సన్నివేశ మింకొక యుదాహరణము.

"విహితంబుగా నాదివిష్ణుదేవునకు - రహిని సర్వోపచారములు చేయించి
'పిలువు నీ పతి'నని ప్రేరేపఁ దాను - కిలికించి తాపాంగ కించిదానమిత
యగుచు నాయకుని మో మల్లనఁజూచి-వగ గుల్కఁ బిలిచె నవ్వనిత
యిట్లనుచు"

-శ్రీ వేంకటేశ్వర లఘుకృతులు, 172 పుట.

నూత్నవధు వగుటచే రమాదేవి లజ్జావతి, ఐనను పతియెడల ప్రేమగౌరవములు కల దగుటచే, చూడవలెనను ఇచ్ఛగలది. ఈ లజ్జాప్రేమ గౌరవభావములు ముప్పిరిగొన్న హృదయముతో ఆహ్వానించుచున్న రమాదేవియొక్కముగ్ధమోహన వినమిత వదన సౌందర్యమును, ఆ పలుకు తేనెలతల్లి పలుకరించుటలోని సొబగుదన మును వెంగమాంబ (కిలికించి...వగగుల్కఁబిలిచె) కేవలము రెండున్నర ద్విపద పంక్తులలోనే సాక్షాత్కరింప జేసినది. అల్పాక్షరముల ననల్పార్థ రచనకు ఇది ముఖ్యోదాహృతి. ఈ తీరున ఈ కావ్యమందలి పాత్రములన్నియు స్మితపూర్వభాషలతో, సుస్పష్టరేఖలతో విలసిల్లునటుల తీర్చబడినవి.

సంభాషణలు:

ఈ లఘుకృతి సరసములు, ఆహ్లాదకారులు నగు సంభాషణలకు నెలవైయున్నది. ఇందులకు ఇందలి బువ్వంబంతి ఘట్టము ప్రకృష్టోదాహరణము. ఈ ఘట్టమున శంకరుడు పెండ్లికుమారుని, ఆపెండ్లికొడుకు శంకరుని, పార్వతి పెండ్లికూతురును, యమున పార్వతిని, పార్వతి యమునను, శంకరుడు పార్వతిని - భోజనవేళ చమత్కారోక్తులతో పరస్పరము పరిహసించుట మిగుల సుకుమారముగా, సముచితముగా సాగినది. మొత్తము కావ్యములో మూడవవంతు (నూటముప్పదియైదు ద్విపదలు )గా విస్తరించియున్న ఈ రమణీయ ఘట్టము[22] నుండి ఒకటి

రెండుదాహరణలు:

1) బువ్వముబంతిలో శంకరుడు తన భుక్త శేషమును వేంకటేశ్వరుని పళ్లెరములో వేసినపుడు ఆ యిరువురకు నడచినసరస సంభాషణ:

"అది సూచి శ్రీ విష్ణుఁడానంద మొంది-మదనారి నీక్షించి మగుడి

యిట్లనియె

'పరమేశ ! నీ శీలభావంబు పూర్వ - మరుదుగా బోయకన్నప్పకే తెలుసు
నిపుడు నేఁ జెప్పిన నిందున్నవారు - నిపుణత దీపింప నిన్ను నవ్వెదరు
తనరార నా సహెూదరిని పార్వతిని - గనుఁగొని కాతు నీ గౌరవం
బిచట
అని పల్క విని శివుఁ డంబుజోదరుని - గనుఁగొని పల్కె నుత్కంఠ
నిట్లనుచు
'జలజాక్ష ! వినుము నీ చపలత్వసరణి - గనుఁగొన గోపసుందరులకే
తెలుసు
నే నిందుఁ జెప్పిన నిన్ను నవ్వెదరు - గాన చెప్పను రమాకన్యనుజూచి
కాచెద నేఁడు నీ గౌరవం' బనుచు - సూచింప, హరి హరుఁజూచియి
ట్లనియె
'నిటలాక్ష ! వినుము నీ నిశ్చలత్వంబు - దిటమైన మోహినీదేవికేతెలుసు
చలపాది నీ కామసంకల్ప సరణి - లలి మీఱ బ్రహ్మాదులకు
నెల్లఁదెలుసుఁ
జెలఁగి యిందా మాట చెప్పిన, నీకు - తలవంపు లని నేఁడు
-తాళియున్నాఁడ'
అని యిట్లు హరిహరు లన్యోన్యముగను - మొనసి భాషింపుచు
మురియు నత్తఱిని."

-శ్రీవేంకటేశ్వర లఘుకృతులు, 164 పుట.

2) పార్వతీదేవి పెండ్లికూతురును పరియాచకమాడు ఘట్టము నందలి ఈ క్రింది ద్విపదలు ఇంకొక యుదాహరణ:

"సిరి కిట్టు లనియె 'నో చిగురాకుబోణి - శిర మరవాంచి బోసేయకున్నావు
చక్కెర పొంగలి సకల భక్ష్యములు - మెక్క సంకోచ మేమిటికి ? నీ విపుడు
కులుకు ముద్దుల పెండ్లికూతుర వీవె-పాలుపొందనివి యెల్ల
భుజియింపవలయు

అని నవ్వుచుండఁగా నది చూచి యమున - పనిఁబూని హిమశైలబా[illegible]
'నే మమ్మ పార్వతి ! యీ పసిబిడ్డ - నీ మాటలన్న నిన్నెవరు మెచ్చెదరు?
పిన్నది నీవు చెప్పిన పదార్థములు - పన్నుగా నొకటైన భక్షింప లేదు
మునుకొని బ్రహ్మాండముల నీనినావు - కనుక నీ కడు పతిఘనముగానుండు
అటుగాన భక్ష్యభోజ్యాదు లెన్నైన - పటుతీవ్రముగ నీవు భక్షింపఁగలవు
కొంకక నీ విందుఁగోరిన వెల్ల - నింక వడ్డించెద మిపు డారగించు'
అనినఁ బార్వతి నవ్వి యమున నీక్షించి - యెనలేని ముదముతో నిట్లనిపలికె."

-శ్రీ వేంకటేశ్వర లఘుకృతులు, 165 పుట.

పైని పేర్కొన్న సంభాషణలే గాక, ఈ ద్విపద కావ్యమున మఱి కొన్ని సంవాదములు, మఱికొందరి మంజుల భాషణములు కలవు. అట్టివానిలో బ్రహ్మాదిదేవతలు - శ్రీమన్నారాయణుడు; సముద్రుడు - బ్రహ్మాదిదేవతలు వీరల పరస్పర సంభాషణలు, రమాసతి, వేంకటేశ్వరుడు, వకుళమాలిక, సముద్రుడు మున్నగు పాత్రలా యా సందర్భములలో పల్కిన పల్కులు మొదలగునవి ముఖ్యములు. వీటన్నిటివలన ఈ కావ్యమాద్యంతము నాటకీయతాగుణమహితమై, పఠితల, శ్రోతల మనోనేత్రమున కొక చక్కని చలన చిత్రమువలె భాసించుచున్నది.

**వర్ణనలు :**

ఈ వరకృతియందలి సన్నివేశోచితములు, సంగ్రహములునైనకొలది వర్ణనలలో ప్రధానమైనది రమావేంకటేశ్వరుల కల్యాణ వర్ణన. ఇది దాదాపు నలువది ద్విపదలలో చక్కగా, సంగ్రహముగా వర్ణింపబడియున్నది.[23] ఈవర్ణనమున పేరంటము పిలుపులు, పెండ్లియేర్పాట్లు, పుణ్యాహవాచనము, స్నాతకవ్రతము, కాశీయాత్ర, కన్యాదానము, పాణిగ్రహణము, మంగళసూత్రధారణము, తలంబ్రాలు (అక్షతారోపణము), లాజహోమాది కృత్యములు - మున్నగు పెండ్లితంతంతయు క్రమ మగు అనుపూర్వి యొప్పునటులు నాణ్యముగా, నాజూకుగా, తెనుగుదన ముట్టిపడు రీతిని వర్ణితమై యున్నది. దీని తరువాత పేర్కొనదగినది, ఈ కావ్యమందలి వర్ణనలలో విస్తృతమైనది బువ్వముబంతి వర్ణన. ఇది ఇంతకుమున్ను తెలిపినట్లుగా మొత్తము కృతిలో మూడవవంతునకు

విస్తరించి యున్నది. ఇంతేగాక ఈ కావ్యమునకు "వేంకటేశ్వరుల బువ్వంబంతి" అను నామాంతరము ప్రచారములో నుండుట యను విషయము[24] ఈ వర్ణనయొక్క ప్రాశస్త్యమును చక్కగా చాటుచున్నది. ఇందలి ఈ క్రింది దశావతార వర్ణనము తిలకింపదగియున్నది. బువ్వముబంతి సందర్భమున శివుడు పెండ్లికుమారుని మేలమాడు నెపమున ఆయన యవతారముల నెట్లు వర్ణించుచున్నాడో చూడుడు :

"మీనరూపముఁ దాల్చి మెండుగా జలము - పానంబుఁ జేసి
నప్పటివలెఁ గాదు
ఈ నిర్మలాన్నంబు లిచ్చుట నీవు - పూని యాకలి దీర భుజియింపవోయి!
పరఁగ తాఁబేలివై స్వల్పజంతువుల - నరుదుగా భక్షించి నటువలెఁగాదు
అలర నీ కుడుముల నతిరసంబులను - పొలుపొంద తృప్తిగా
భుజియింపవోయి!
దొరకొని పందివై తుంగగడ్డలను - గరగర నమలిన కైవడి కాదు
కరిజకాయలు వడల్ గారెలిడ్డెనలు - పొరిపొరి రుచులుగా
భుజియింపవోయి

పూని నృసింహరూపున దైత్యు రక్త - పానంబుఁ జేసి నప్పటి రీతి గాదు
తెలివితో నిప్పుడు తేనెపానకము - నలుపొప్ప నీవు పానము సేయవోయి
సలలితంబుగ బ్రహ్మచారి వ్రతముల - నలరి యీ వరకు గృహస్థుఁడైనావు
విమలాత్మ ! నియమముల్ విడిచి యీ వేళ - భ్రమ దీర నన్నియు
భక్షింపవోయి!
లలిని బ్రహ్మఋషిత్వ రాజఋషిత్వ - ములఁ గాయ పండ్లు నిమ్ముగ
మెక్కిదానఁ
దనియక వెన్నముద్దలు ముచ్చిలించి - తిని, దిగంబరుఁడవై తిరిగిన నాటి
బడలిక దీర నీ పరమాన్న మెల్ల - తొడరి నీ వా చేరతోఁ ద్రావవోయి !
కలికితనమున నాకలి దీరఁబోదు - కులుకుతో నిపుడు సంకోచింప వలదు."

-శ్రీవేంకటేశ్వర లఘుకృతులు. 161, 162 పుటలు.

పై ద్విపద పంక్తులందలి శంకరుని పల్కులలో వేంకటేశ్వరుడు వేర్వేరు అవతారములలో భుజించి యుండిన ఆహారములను, వాటితో సారూప్యము కలిగి, వాటికన్న ఉత్కృష్టములై, మిగుల రుచ్యములై యున్న వివిధములైన వంటకములను ఆ యా అవతారానుగుణముగా

సముచితముగా పేర్కొనుటలో వ్యక్తమగు ఈ కవయిత్రి వర్ణనానైపుణి మిగుల కొనియాడదగి యున్నది.

అసలు ఈ కావ్యమంతయు నాయకుడైన వేంకటేశ్వరుని అభ్యుదయమును అహ్లాదకరముగా వర్ణించున దగుటచే నాయకాభ్యుదయ వర్ణనాత్మకమై, వెంగమ వర్ణనా నైపుణ్యమును కమనీయముగా చాటుచున్నది.

**ఇ.తరవిశేషములు:**

ఈ యితివృత్తమును ఇంతకు ముందు తెల్పినటుల "పెండ్లి పాట" గా ద్విపద ఛ్ఛందస్సులో రచించుటయం దీ కవయిత్రికి తాళ్లపాక తిమ్మక్క రచించిన 'సుభద్రా కల్యాణము' ప్రేరణనొసంగిన దని అందలి యీ క్రింది పంక్తులు సాక్ష్య మిచ్చుచున్నవి.

> "అవనిలో తాళ్లపా కన్నయ్యగారి
> తరుణి తిమ్మక్క చెప్పె తాను సుభద్ర
> కల్యాణమును పాట కడుమంచి తేట
> పలుకుల నీ పాట పాడినా విన్న
> శ్రీహరి వారికి చేరువై యుండు."
>
> \- సుభద్రా కల్యాణము, 54 పుట.

తిమ్మక్క తన కృతిని 'సుభద్రా కల్యాణ మను పాట' అన్నట్లే వెంగమ తన కావ్యమును "రమా పరిణయం బను పెండ్లిపాట" అనినది.

పై రీతిని ఈ కవయిత్రి సుభద్రా కల్యాణమును 'కల్యాణపు పాట' చే స్ఫూర్తినంది ఈ 'పెండ్లి పాట'ను సృజించినను, కమనీయ కథా కల్పనముచేతను, దేశీయ సంప్రదాయముల సొంపైన ప్రతిపాదనము చేతను చక్కని పలుకుబళ్లతో విలసిల్లెడు శైలీ విశేషము చేతను, తెలుగు సాహిత్యమున వెలసిన వివిధ 'పరిణయ కావ్యముల'లో విశిష్టమై, స్వతంత్రమై, చతురస్రశోభి (symmetrical) గా రాణించుచున్నది.

# శ్రీభాగవతము

తరిగొండ వెంగమాంబ రచించిన రచనలలో నెల్ల పరిమితి లోను, కవితా పరిణతిలోను అగ్రగణ్యమైన గ్రంథము శ్రీభాగవతము. అందు పండ్రెండు స్కంధములను పూర్తిగా తాను రచించినట్లు తదనంతరము రచన యగు వేంకటాచల మాహాత్మ్యమున ఈ కవయిత్రి కంఠోక్తిగా నుడివియున్నది.[25] ఐనను నేడు మనకు అందు సగభాగము (అనగా మొదటి ఆఱుస్కంధములు) మాత్రమే వ్రాత ప్రతుల రూపమున లభ్యమగుచున్నది. ఆ యాఱు స్కంధములలోను ఆదినుండి నాలుగవ స్కంధమువరకు సమగ్రముగను, ఐదాఱు స్కంధములలో అచ్చటచ్చట కొన్ని భాగములు లుప్తములుగాను లభియించుచున్నవి.[26]

**వెంగమ భాగవత కథ:**

ప్రథమ స్కంధము : సూతుడు నైమిశారణ్యమందలి శౌనకాది మహర్షులకు చెప్పినట్లు ఉపక్రమింపబడినది. పిమ్మట నారాయణ కథాప్రశంస, భగవంతుని ఇఱువదియొక్క అవతారములు, వేదవ్యాసుడు భాగవతమును రచించుటకు కారణము, నారదుని పూర్వజన్మ వృత్తాంతము - అను విషయములు కలవు. అటుపిదప అర్జునుడు పుత్రఘాతి యగు అశ్వత్థామను అవమానించుట మొదలుకొని, విప్రశాపము దెలిసి ప్రాయోపవిష్టుండైన పరీక్షిత్తుకడకు శుకమహర్షి వచ్చుటవరకు గల కథాంశము లీ స్కంధమున నెలకొన్నవి.

ద్వితీయ స్కంధము: శుకమహర్షి పరీక్షిత్తునకు ముక్తి, భక్తిమార్గములను దెల్పి, అందు భక్తియే ముఖ్యమని వివరించుట, శ్రీమన్నారాయణుని లీలావతారములను అభివర్ణించుట, ప్రపంచము యొక్క ఉద్భవము మున్నగువానిని దెలుపుట - అను విషయము లీ స్కంధమున గలవు.

తృతీయ స్కంధము: విదురుని తీర్థయాత్ర, అత డుద్ధవుని వలన కృష్ణాదుల వృత్తాంతమును దెలిసికొనుట, విదురుడు మైత్రేయముని నడిగి

వరాహావతార వృత్తాంతమును, కపిల దేవహూతి సంవాదమును గూర్చి సవివరముగా నెఱుంగుట - అను విషయము లిందు చెప్పబడినవి.

చతుర్థ స్కంధము: ఈ స్కంధమున దక్షప్రజాపతి యజ్ఞ వృత్తాంతము, ధ్రువోపాఖ్యానము, పృథుచక్రవర్తి చరిత్రము, పురంజనో పాఖ్యానము - అను విషయములు ప్రధానములై యున్నవి.

పంచమ స్కంధము: ఈ స్కంధమున ప్రియవ్రతుని చరిత్రము, ఋషభావతార వృత్తాంతము, జడభరతోపాఖ్యానము, శుకుడు పరీక్షిత్తునకు భూగోళ, నరక లోకములను గూర్చి వర్ణించుట అను విషయము లున్నవి.

షష్ఠ స్కంధము: ఇందు అజామిళోపాఖ్యానము, దక్షుడు హరిని గూర్చి తప మొనరించుట, దక్షుని ప్రజాసృష్టి, వృత్రాసుర వృత్తాంతము, చిత్రకేతూపాఖ్యానము, మరుద్గణముల జన్మప్రకారము అను విషయములు వర్ణితములై యున్నవి.

**పూర్వానువాదములు :**

వెంగమాంబ రచించిన ద్విపద భాగవతముయొక్క విశిష్టతను గుర్తించుటకు, తత్పూర్వము తెలుగులో వెలసియుండిన భాగవతము లను గూర్చి క్లుప్తముగా నిట పరామర్శించు టావశ్యకమైనది. భాగవత మును తెనిగించినవారిలో సకల విధముల అగ్రగణ్యుడు బమ్మెర పోత రాజు. భక్తి రసప్రచురమగు భాగవతమును అనువదించు కవికి భక్తిరసార్ద్రచిత్తత ఆవశ్యకమను సత్యమును ఆ మహాకవి యాంధ్రీ కరణము లోకమునకు చాటినది. అందువలననే పోతనకు తరువాత భాగవతమును రచించిన తెలుగు కవులలో పెక్కురు ఆయన రచన కానట్టి 5,6,11,12 స్కంధములను మాత్రమే యథాశక్తి అనువదింప బూనినవారుగా కన్పట్టుదురు. ఏర్చూరి సింగన, బొప్పరాజు గంగన, వెలిగందల నారయ, హరిభట్టు, సంజీవరాయకవి మున్నగువారట్టివారు.

పైన దెల్పినరీతిని పోతన రచనను పూరించెడి యుద్దేశముతో గాక, భాగవతమునందలి ఏ కొన్ని స్కంధములనో, లేక పూర్తిగానో అనువదించిన తెనుగు కవులును మఱికొందరు గలరు. వీరిని ఈ క్రింది రీతిని రెండువర్గములుగ వింగడింపవచ్చును.

i) భాగవతమును సంగ్రహీకరించి రచించినవారు. ii) ద్విపద వచనము వంటి సులభతర ప్రక్రియలలో భాగవతమును వెలయించిన వారు. తరిగొండ వెంగమాంబ యీ రెండవ తెగకు చెందినది. మొత్తముమీద ఎవరెన్ని తెరగుల భాగవతమును తెనిగించినను ఆ కవు లెల్లరకును సహజపాండిత్యుని ఆంధ్రమహాభాగవత కల్పతరువే ఒజ్జబంతియై అలరె ననుట నిక్కము.

భాగవతమును ద్విపదీకరించిన తెలుగు కవులలో మొదటివాడు మడికి సింగన (క్రీ.శ.1375-1435).27 పోతన కించుక పూర్వుడగు నీతడు దశమ స్కంధమును మాత్రమే ద్విపద కృతిగా రచించినాడు. ద్వితీయుడు దోనూరి కోనేరు నాథుడు ప్రబంధయుగమునకు చెందిన యీతడు క్రీ.శ.1547 వ సంవత్సరమున భాగవతము నంతటిని సంగ్రహముగా 'బాలభాగవత'మను పేర ద్విపదీకరించియున్నాడు. క్రీ.శ.16వ శతాబ్ది చివరి భాగమున నుండిన రత్నాకరము గోపాల కవి దశమ స్కంధము మాత్రము ద్విపదగా రచించెను. క్రీ.శ.17వ శతాబ్దమున నుండిన తేకుమళ్ల రంగశాయి ధూర్జటి లింగరాజు అను కవులు వేర్వేరుగా ద్విపద భాగవతములను వెలయించిరి. కాని లింగరాజు రచన[28] నామావశిష్టము కాగా, రంగశాయి రచన[29] మాత్రము మొదటి నాలుగు స్కంధములవరకు వ్రాత ప్రతిరూపమున మిగుల శిథిలస్థితిలో నిలిచియున్నది. ఇక, క్రీ.శ.18వ శతాబ్ది ఉత్తరార్ధమున వెలసినది తరిగొండ వెంగమాంబ రచన. ఇట్లు వ్రేళ్లపై లెక్కిడదగిన ద్విపద భాగవతములలో కొన్ని యేక దేశములుగా మిగిలినవి. మఱికొన్ని యుత్పన్నములై పోయినవి. ఇంకను కొన్ని అసమగ్రములు. వీటిలో పోయినవి పోగా, మిగిలియున్న వానిలో నైనను

ఏ యొక్కటి యైన నేటివరకు ముద్రణభాగ్యము నొందకుండుట మిగుల వింతైన సత్యము !

పరిశీలింపగా, వెంగమాంబ భాగవతమును ద్విపదలో రచించుటలో అంతకు మున్ను తెలుగున వెలసియున్న ద్విపద భాగవతములేవియు అందులకు ప్రేరకములు కావని తెలియును.స్వభావతః వెంగమాంబకు బాల్యమునుండియు భాగవతము అభిమానపాత్రమైన గ్రంథము. ఈ విషయమును ఆమె యక్షగాన రచనలు చక్కగా చాటుచున్నవి. అవి చాలమట్టుకు భాగవత కథాత్మకములేయై యున్నవి. ఇంతేగాక, వెంగమ తొలిరచనలలో నొకటగు రాజయోగసారమును రచియించిననాడే ఆమెయొక్క ద్విపద భాగవత రచనకు అంకురార్పణ జరిగినట్లు భావింపవలెను. భాగవత తృతీయ స్కంధమందలి కపిలదేవహూతి సంవాద కథ నాధారముగా గైకొని రాజయోగామృత సారముగా వెలయించిననాటి రచనానుభవమే, వెంగమాంబ తిరుమల చేరిన పిమ్మట పెక్కేండ్లకు ఆమె లేఖినినుండి వెల్వడిన ద్విపద భాగవతముగా ఫలియించినది.

**కృతిరచనా హేతువు :**

ఈ గ్రంథారంభమున అవతారికగా అమరియున్న అఱువదియైదు ద్విపదలలో ఈ కవయిత్రి ఇష్టదేవతా ప్రార్థనను, ఏ తత్కృతి రచనా ప్రసక్తిని, తన పూర్వరచనలను, అంకిత విషయమును సవినయముగా విశదీకరించియున్నది. అందు ముఖ్యముగా ఈ కృతి రచనకు హేతువును పేర్కొనుచున్న ఈ క్రింది సన్నివేశము పరికింపదగియున్నది.

"......................-ముదము దీపింప సన్మోక్షచింతనము
చేయఁగా భూసురశ్రేష్ఠుని మాడ్కి - నా యంబుజోదరుఁ డాదరంబెసఁగ
ఘనతరంబైన భాగవతంబునందు - మొనసిన తత్త్వార్థములను
పామరులు

తెలియలే రటుగాన దేటగాఁదత్త్వ - ముల నెల్ల సంక్షేపముగరచియించి
హరి పర్మాక్రమములు హరి విహారములు-హరి యవతారముల్ హరి
మహత్త్వంబు
పొలుపొంద విస్తరింపుము నీ వటంచుఁ - బలికినందున, నిట్టి భాగ్యంబునాకు
కలిగించు మనుచు వేంకటగిరీశ్వరునిఁ - దలఁచగాఁదరిగొండధాముఁడై
యతడు
నీలాభ్రవర్ణుఁడై నిరుపమ హేమ - చేలుఁడై మోముపైఁ జిఱునవ్వు
మెఱయఁ
గరుణా కటాక్ష వీక్షణము దీపింప - సరసుఁడై మధ్యాహ్న
సమయంబునందుఁ
జిన్నికృష్ణుని రీతిఁ జెంతకు వచ్చి - పన్నుగాఁ దెచ్చి శ్రీ భాగవతంబు
నన్నుఁ జేకొమ్మని నా చేతి కిచ్చి - సన్నసైఁగల నిది సారంబుగాను
వరుసగా ద్విపద కావ్యముఁ జేయు మనుచుఁ - జిరమైన దయను
సూచించి యున్నాఁడు."
-ద్విపద భాగవతము, ఆర్ నం.2347, (వ్రాతప్రతి) 3,4 పుటలు.

ఒక మధ్యాహ్న సమయమున వేంకటేశ్వరుడు చిన్నికృష్ణుని రూపమున చెంతకు వచ్చి భాగవత గ్రంథమును చేతికిచ్చి, ద్విపద కావ్యముగా రచింపుమని దయతో సూచించెనట ! ఇది యామె ద్విపద భాగవతమును రచించుటకు హేతువు పై నుదాహరింపబడిన ద్విపద పంక్తులలో రచనా హేతువుతోపాటు రచనోద్దేశములుకూడ తెల్పబడినవి. ఆ హేతువు లివి :

1) భాగవతమందలి తత్త్వార్థములను పామరులకు సుబోధమగు తీరున తేటగా, సంక్షేపముగా రచించుట.

2) హరి పరాక్రమములు, హరి విహారములు, హరి యవతారములు, హరి మహత్త్వము - తెల్పబడిన ఘట్టములను సుబోధముగా విస్తరించి రచించుట.

3) భాగవతముయొక్క సారమును కావ్యముగా రచించుట.

పై మూడు లక్ష్యములు సమగ్రముగా సిద్ధించుటకు అనువైన ఛందము ద్విపద. అందుచేతనే కాబోలు ఈ కవయిత్రి యిష్టదైవము కూడ 'ద్విపద కావ్యము జేయు' మని దయతో సూచించినాడు. వెంగమ భాగవతమును పరిశీలించినపుడు దానికి మూలము పోతన భాగవతమని స్పష్టమగును. కాబట్టి చిన్నికృష్ణుడు వెంగమకు అనువదింపుమని యిచ్చిన భాగవతము పోతన భాగవతమే.

పోతనార్యుని గ్రంథమే ఈమె రచనకు ఒజ్జబంతి యనుటకు నిదర్శనముగా అందలి గద్యపద్యములు ఈ కృతిలో ద్విపదల రూపమున దర్శన మిచ్చుచున్నవి. ఇందులకు భాగవత కథా ప్రారంభమే ప్రథమోదాహరణము.

"విశ్వజన్మ స్థితి విలయంబు లెవ్వని
వలన నేర్పడు ననువర్తనమున
వ్యావర్తనమునఁ గార్యములం దభిజ్ఞుఁడై
తాన రాజగుచుఁ జిత్తమునఁ జేసి
వేదంబు లజునకు విదితముల్ గావించె
నెవ్వఁడు, బుధులు మోహింతు రెవ్వ
నికి నెండమావుల నీళ్లఁ గాచాదుల
నన్యోన్య బుద్ధి దా నడరునట్లు

త్రిగుణసృష్టి యెందు దీపించి సత్యము
భంగిఁ దోఁచు స్వప్రభానిరస్త
కుహకుఁ డెవ్వఁ డతనిఁ గోరి చింతించెద
ననఘు సత్యుఁ బరుని ననుదినంబు."-I స్కం34
పద్యము.

"వెలయ సృష్టి స్థితి విలయంబు లెవని - వలన నేర్పడు
ననువర్తనంబునను

వ్యావర్తనమునఁ గార్యములం దభిజ్ఞుఁ - డై వేడ్కఁ దా రాజ ననుచు సూహించి
యెచఁడిచ్చె వేదంబు లెలమిఁ బద్మజున - కెవనికై మోహింతు లెలమి సద్బుధులు
అట్టి పరబ్రహ్మమైన మాధవునిఁ - బట్టుగా నమ్మి నేఁ బ్రార్థింతు నిట్లు."
-ఆర్ నం.2347, 6 పుట.

పోతన పద్యమందలి తొలి మూడుపాదములు, మీది మొదటి ద్విపదలలో నెట్లు కుదురుకొని యున్నవో తిలకింపదగినది. తక్కిన పద్య భాగము యొక్క భావమంతయు చివరి ద్విపదలో స్వేచ్ఛగా సంగ్రహింపబడినది. వెంగమ ద్విపద భాగవత రచన యంతయు ఇట్లే పోతనామాత్యుని కృతి ననుసరించి వెలసియున్నది.

ఇట్లు భక్తి గౌరవములతో ఆంధ్రమహా భాగవతమును ద్విపదలోని కనువదించినను, ఈ కవయిత్రి ఇందచ్చటచ్చట కొన్ని మార్పులను, చేర్పులను గావించియున్నది. పరిశీలించినచో ఆ మార్పులు, చేర్పులు ప్రతియొక్కటియు సన్నివేశరంజనము, ఔచిత్యపోషణ, పాత్రపోషణ, దేశీయత మున్నగు ప్రయోజనములలో, ఏదో యొక దాని నుద్దేశించి చేయబడినటుల తెల్లమగును.

**మార్పులు, చేర్పులు :**

1) పోతన నైమిశారణ్యమును సమాసభూయిష్ఠము, అలంకారికమునైన సుదీర్ఘవచనమున వర్ణించియున్నాడు. (చూ. Iస్కం; 39వచనము). భట్టబాణుని 'కాదంబరి' యందలి అటవీ వర్ణనలను పోలిన ఆ వర్ణనమును అనుకరింపక, వెంగమాంబ ఆ ధర్మారణ్యమును మున్యాశ్రమోచిత వాతావరణ ముట్టిపడురీతిని నిసర్గసుందరముగా, నూత్నభావ మనోజ్ఞముగా వర్ణించిన తీరు గనుడు.

"ప్రవిమల మునులు తప్పక నాచరించు-సవనాగ్ని ధూమంబు జలధరంబటంచు
వెలయ హెూతలు సేయు వేద హెూ... -చగర్జనము నిశ్చయముగా ననుచు

వారక కేకారవములు గావించి-గౌరవం బెసఁగ రెక్కలు విప్పి విప్పి
లాలిత పర్ణశాలల చుట్టు నిలిచి-నీలకంఠంబులు నృత్యముల్ సలుపుఁ
బంకజాకరముల పజ్జల వ్రాలి-పొంకంబులైన పుప్పొడి కుప్పలందు
నొప్పుగాఁ జేరి సముజ్జ్వల గతుల-నప్పుడప్పుడు హంస లాడుచునుండు
మొనసి రామాయణమ్ములు పఠింపుచును-మునుల కర్ణములకు
ముదములిచ్చుచును
వన్నెఁ కెక్కిన యజ్ఞవాటంబులందు పన్నుగా బహుకీరపంక్తులు మెలఁగు
బూఁ బొదరిండ్ల నమరన్నాశ్రయించికొని-రమణీయ కమలాకరములఁ
జేరికొని
బడలక మకరంద పానంబుఁ జేసి-కడుఁ గ్రొవ్వి యళులు ఝుంకారముల్
సేయుఁ
దిరములై యచ్చట ధేనువుల్ పులులు-కరిరాజ బృందముల్
కంఠీరవములు
మొదలైన బహుమృగమ్ములు జాతివైర-మదములు వీడి సమ్మత
విహారముల
వరుసగా నందందు వర్తింపుచుండుఁ-బరమ పావన తీర్థపటల మచ్చోట
నమర గంగాప్రవాహంబు చందమున-నమలమై యఘముల
హరియింపుచుండు
బలుసెలయేళ్ల దిబ్బల కొండచరుల-లలిమించు కంధమూల ఫలాదు లెపుడు
గలుగ నీ కాల మా కాలంబు ననక-పొలువగుచుండు, నెప్పుడు
సుగంధంబు
భూరి దిగంతరంబుల నిండుచుండు-నారూఢి నా నైమిశారణ్య భూమి."

-ఆర్ నం.2347. 8,9 పుటలు.

పురివిప్పి యాడుచున్న నెమళ్లు, పుప్పొడి కుప్పలలో నడయాడు చున్న హంసలు, రామాయణము చదివెడు రామచిలుకలు, సహజ వైరము వీడి సంచరించు గోవులు, పులులు, ఏనుగులు, సింహములు

మున్నగు వీటన్నిటితోగూడిన పావిత్ర్యము పై వర్ణన యందలి ప్రత్యక్షమున పరిమళించుచున్నది. సన్నివేశమును సందర్భోచితముగా రంజింపజేయుటకై రచయిత్రి పై రీతిని వర్ణనను మార్చి వైచెనని భావింపదగును.

2)అర్జునునిచే బంధితుడై కొనిరాబడిన అశ్వత్థామను హింసింప వలదని ద్రౌపది కృష్ణార్జునులతో నుడువగా, ఆమె పల్కులకు ధర్మరాజు మున్నగువారు సంతసించిరి. భీముడు మాత్రము కోపమునణచుకొనలేక అశ్వత్థామను జంపుటకై విజృంభించెను. ఆ సందర్భమున సంస్కృత భాగవతమున నిట్లున్నది :

"నిశమ్య భీమగదితం ద్రౌపద్యా శ్చతుర్భుజః ।
ఆలోక్య వదనం సఖ్యు రిదమాహ హస న్నివ ॥"
- I స్కం; 7 అధ్యా; 52 శ్లో.

పై శ్లోకమందలి 'చతుర్భుజః' అను పదమును శ్రీధరాచార్యుడు 'భీమే తం హంతుం ప్రవృత్తే ద్రౌపద్యాం చ అనిచ్ఛంత్యాం సహసా తన్ని వారణే ప్రవృత్తాయహం ఉభయో స్సన్నివారణాయ ఆవిష్కృత చతుర్భుజః'అని వ్యాఖ్యానించెను. ఈ శ్రీధర వ్యాఖ్య ననుసరించియే పోతన "వ. అని పలికిన నశ్వత్థామకు ద్రౌపది యడ్డంబు వచ్చె. భీముని సంరంభంబు సూచి హరి చతుర్భుజుండై రెండు చేతుల భీముని వారించి కడమ రెంటను ద్రుపద పుత్రికను దలంగించి నగుచు భీమున కిట్లనియె" (I స్కం; 169వ.) అని తెనిగించినాడు.

పై సన్నివేశములో శ్రీకృష్ణుడు 'కడమ రెండు చేతులతో ద్రుపద పుత్రికను దలంగం ద్రొబ్బె'ననుట సముచితముగా లేదని తలంచి, ఈ కవయిత్రి ఆ తక్కిన రెండు హస్తములచే అశ్వత్థామను ఆవలకు ద్రోయించినది. చూడుడు.

"వారింప మీరు రావలదంచుఁ బలికి-వీరుఁడై ద్రౌణిపై విడిబడి గవిసె
అప్పు డశ్వత్థామ కడ్డంబుగాను-తెప్పున ద్రౌపదీదేవి తా వచ్చె
నంతట నిలువ కయ్యనిలనందనుఁడు-పంతంబుతోడ ద్రౌపది నట్టుద్రోసి
చనుచున్న భీముని సంరంభమపుడు-గని చతుర్బాహుఁడై కమలలోచనుఁడు

రెండుచేతుల భీము రెట్టలుబట్టి-నిండిన బలముతో నిల్పి శీఘ్రముగఁ
దక్కిన రెండు హస్తముల నాద్రౌణి-నక్కరగాఁ బట్టి యావలఁ ద్రోసె."
-ఆర్ నం.2347. 61, 64 పుటలు.

ఈ మార్పు సన్నివేశమునకు స్వాభావికమై, శ్రీకృష్ణుని సమయ స్ఫూర్తిని ప్రకటించుచు, పోతన రచనకు మెరుగుపెట్టుచున్నది.

3) అటుపిమ్మట శ్రీకృష్ణుడు భీమునితో పల్కిన మాటలను వెంగమాంబ ద్రౌపది భీమునితో ననిన పల్కులుగా మార్చి, ద్రౌపది యుదారహృదయము నావిష్కరించి చక్కగా పాత్రపోషణ గావించినది.

శ్రీకృష్ణుడు భీమునితో పల్కిన మాటలు అవి.

"అవ్వఁడు గాఁడు వీఁడు శిశుహంత దురాత్మకుఁ డాతతాయి హం
తవ్యుఁడు బ్రహ్మబంధుఁ డగుఁ దప్పదు నిక్కము 'బ్రాహ్మణో న హ
న్తవ్య' యటంచు వేదము శ్రుతం బగుఁ గావు ధర్మదృష్టిఁ గ
ర్తవ్యము వీనిఁ గాచుట యథాస్థితిఁ జూడుము పాండవోత్తమా !"
- Iస్కం; 170 పద్యము.

పై మాటలు ద్రౌపది నోట ఈ క్రింది రీతిని మార్పు నొందినవి.

"ఆ వేళ పాంచాలి యనిలజుమోము-భావించ నవ్వుచుఁ బలికె నిట్లనుచు
ఇది యేమి పుణ్యాత్మ ! యీ మహీసురుని-పదరి వధించుట పాడియే నీకు ?
ధర 'బ్రాహ్మణో న హంతవ్య' యటంచు-నిరవొందు వేదార్థ మెఱుఁగవే నీవు
మాన్యుఁడీ బ్రాహ్మఁడే మాడ్కిఁ జూచినను-ధన్యాత్మ ! నీకింత తామసంబేల ?
బాలకులు ఋణానుబంధముల్ లేక-కూలిపోయిరి మన కొడుకులే వారు ?
అక్కట శిశుహత్య కతఁడు లోనయ్యె -నిక్కడ మనకేల యీ బ్రహ్మహత్య ?
నీ వన్ని దెలిసిన నిర్మలాత్ముఁడవు-గావున ద్రౌణిని గాచి రక్షించు
మని యిట్లు మృదుమధురాలాపములను- చనవున భీముని శాంతిఁ
బొందించె."
-ఆర్. నం.2347, 64 పుట.

4) భాగవత పురాణ కథా ప్రధానస్రోత పరీక్షిత్తు. కావున ఆతని జన్మవృత్తాంతమును పురస్కరించుకొని ప్రథమ స్కంధమున మహాభారత యుద్ధానంతర కథ ప్రసక్తమైనది. అశ్వత్థామ అర్జునునిచే బద్ధుడగుట మొదలుకొని ధర్మరాజు పరీక్షిత్తునకు పట్టాభిషేకము గట్టి మహాప్రస్థానమున కేగుటవరకు గల ఆ కథ అందు సంగ్రహముగా తెలుపబడినది. వెంగమ ఈ కథాభాగమును రచించుటలో భాగవతమున లేని కథాంశములను మహాభారతమునుండి స్వీకరించి తన భాగవత రచనలో జోడించి సన్నివేశములను సముద్దీపింప జేసినది. మచ్చునకు ఒకటి రెండుదాహరణలు.

అ) ధర్మరాజు తా నొనరించిన బంధువధమునకు, జీవహింసకు పశ్చాత్తాపతప్తుడైన ఘట్టము పోతన భాగవతమున చాల సంగ్రహముగా నున్నది. (చూ. I స్కం; 201-204). ఇదే ఘట్టము భారతమున మిగుల విపులముగా, సంభాషణాత్మకమై యున్నది (చూ.శాంతిపర్వము,I ఆశ్వా; 43-142ప.).ధర్మజుడు అర్జునునితో నిట్లనును.

> "రాజ్యపరిగ్రహ పరత్వంబు మచ్చిత్తంబునం గలిమిం జేసి కిల్బిషం బత్యంతంబు నాచరింప వలసె;బరిగ్రహ దోషంబు పరిత్యాగంబునం గాని పోదు; . . అపరిగ్రహం బొక్కటన శుద్ధుండ నయ్యెద;మీరు భూమిపాలన పరిగ్రహ తత్పరత్వంబున వర్ణాశ్రమ ధర్మరక్షణంబు సేయుండు; ఏను గాననంబునకుఁ జని మునిజన సకాశంబున సుఖియై యుండెద " (చూ శాంతిపర్వము, I ఆశ్వా 47 వచనము)

ఇది వినిన తమ్ములును, ద్రౌపదియు తమ తమ పలుకులచే ధర్మజుని మనస్తాపము నుపశమింపజేయ యత్నింతురు.

పై సన్నివేశమును ఈ కవయిత్రి ద్విపద భాగవతమున పాదుకొల్పి, యుధిష్ఠిరుని మనస్తాపమును, ద్రౌపది, కుంతి అనువారి యొక్కమనోభావములను విశదముగా, అందముగా ఆవిష్కరించినది. ధర్మరాజు "అటుగాన మన భీము నభిషిక్తుఁజేసి, నే వనమున కేగ

నిర్మలత్వంబు కలుగుఁగాక" అని పల్కగా, భీమసేనుడు "నీ కన్న ముందర నే విరక్తుఁడను, కావున నీ వెంటఁ గాననంబునకు, నే వత్తు నీ మాట నిక్కంబు గనుక, పట్టంబు గట్టుము పార్థున కనుచు" గట్టిగా బల్కను. ఆ సమయమున అర్జునుడు పల్కిన పల్కులివి.

"... ... ... ... ... ... -గట్టిగాఁ బల్క నా కవ్వడి నవ్వి
దనుజారి,వ్యాసుండు,ధౌమ్యుండు వినఁగ-యనిలనందనుఁ జూచియపు
డిట్టులనియె
మంచిమాటంటివి మారుతపుత్ర-మంచివిరక్తి నిమ్మెయి నన్న, నీవు
వనవాసముల యందు వర్తింపవలయు-జనులలో నేను రాజ్యము
సేయవలయు
నను నాశతోఁ గాదె హరితోడ శత్రు-జనుల సంగరమందుఁ జంపినదెల్ల
నా కోర్కి దెలిసియున్నా వందుచేత-నాకు పట్టము గట్టి నన్నిందునిలిపి
పోద మంటివి నాకుఁ బొందె సౌఖ్యంబు-వాగు లంకేల నే వత్తు మీవెంట
నాకు రాజ్యం బేల నకులునిఁ బిలిచి-ప్రాకటమతిని మీ పట్టంబు గట్టి
హరి నింక ద్వారక కనిపి ముప్పురము- నరుగఁగా వలయు ఘోరాటవి కనిన."
-ఆర్. నం.2347. 78 పుట.

అటుపిమ్మట నకులుడును, సహదేవుడును అదే ధోరణిలో తమ తమ యభిప్రాయములను వెల్లడింతురు. పిదప ద్రౌపది, కుంతి తగిన విధముగా శ్రీకృష్ణునితో ధర్మజుడు వినునట్లే పల్కుదురు. ఇట్లు ఆ యా పాత్రలను సహజముగా, సందర్భోచితముగా, దేశీయముగా, పఠితల హృదయములలో నాటుకొనునట్లుగా పల్కించు నైపుణ్యమున ఈ కవయిత్రి సిద్ధహస్తురాలు.

ఆ) భాగవత ప్రథమ స్కంధమున శిఖరాయమాణమైన ఘట్టము ధర్మజ భీష్మ సమాగమము. ఈ ఘట్టము పోతన భాగవతమున సంగ్రహముగా నిట్లున్నది.

ధర్మరాజు ప్రజాహింస వలని పాపభీతి చలితాత్ముడై, కురుక్షేత్రమున శరతల్పగతుడై యున్న భీష్ముని కడకు జనును. తక్కిన పాండవులును, శ్రీకృష్ణుడును ఆతని వెంట అచటికి వత్తురు. అచ్చోటి కనేక రాజర్షి

బ్రహ్మర్షిదేవర్షులు శిష్యసమేతులై చనుదెంతురు. భీష్ముడా వచ్చిన ఋషీశ్వరులను పూజింపజేసి, శ్రీకృష్ణుని మనస్సున అర్చించి, పాండవులను కూర్చుండ నియోగించును. పిమ్మట కుంతికి పాండవులకు గల్గిన కష్టముల నేకరువు పెట్టి కురుపితామహుడు 'దైవతంత్రమునకు వగవఁ బనిలే'దని వారల నోదార్చి భగవద్భక్తిని గూర్చి ప్రశంసించును. అవసానవేళకు తన పుణ్యవిశేషమున శ్రీకృష్ణుడరుదెంచినందులకు సంతోషించి, ఎల్లరు వినుచుండ ధర్మరాజునకు వివిధ ధర్మముల నెఱిగించును. అంతలో నుత్తరాయణము వచ్చును. ఆ పుణ్యకాలమున గాంగేయుడు శ్రీకృష్ణుని భక్తిపూర్వకముగా స్తుతించుచు స్వచ్ఛందమరణము నొంది వాసుదేవ పరబ్రహ్మమున గలియును. (చూ.I స్కం; 205-227వ.)

ఈ ఘట్టమును వెంగమ తీర్చిదిద్దిన తీరు అరయదగినది. తత్సారమి ట్లున్నది.

శ్రీకృష్ణుడు వ్యాస ధౌమ్యుల జూచి 'మీరు వీరి (పాండవుల యొక్క ద్రౌపదీ కుంతుల యొక్క) మాటలు వింటిరిగదా ! ఇందులకేమి చేయదగు'నని యడుగును. వారలు 'శ్రీరుక్మిణీశా ! నీకు దెలియని యర్థము గలదా ? ఐనను మాకు తోచినంతలో తెల్పెదము. శరతల్పమున ఉత్తరాయణము వచ్చువరకు జీవింప నిశ్చయించిన భీష్మని కడకు ఈ ధర్మనందనుని పిలుచుకొనిపోయిన ఆ మహానుభావుడితనికి సమస్త ధర్మములను బోధించును' అని పలుకుదురు. శ్రీకృష్ణ 'డీ పని మే' లనును. అప్పుడు ధర్మరాజు 'మా నిమిత్తంబున మహియందు వ్రాలి, కరఁగుచు శరతల్పగతుఁడైన వేళ, పరదేశిపై నేలఁ బడితివి నీవు, దొరనైతి పొందుగ నంచును బోయి, గుఱుతుగా నాకు సంకోచంబు లేక, యే మోముతో జూతు నిప్పుడా ఘనుని" అని చింతాక్రాంతుడు కాగా, శ్రీకృష్ణు డతని నూరడించి తన విడిదికేగును. మఱునాడు సూర్యోదయ సమయమున ధర్మజుడు శ్రీకృష్ణుని మందిరమున కరుగగా ఆయన సుమతల్పమున కన్నులు మూసి, ధ్యానముద్రలో నుండును. "సకలాత్ముఁ డిట్లుండు చందమే" మనుచు ధర్మరాజు వెరగొందుచుండగా శ్రీకృష్ణుడు కన్నులు దెరచి చూచి, చిఱునవ్వు నవ్వుచు ధర్మనందనునితో నిట్లనును.

"సత్యవ్రతుండైన జాహ్నవీసుతుఁ డు-ప్రత్యక్షముగ నన్ను భావించి పట్టి
చిక్కించికొని తన చిత్తవల్లికను-తక్కక బంధించె దానిచే నేను
కదలగూడక యుంటి గాంగేయుఁ డిప్పుడు-వదలించె నాపట్టు వసుధేశ ! దాన
నెమ్మదిగా లేచి నిన్నుఁ జూచితిని-యమ్మహామహుని మహాప్రభావంబు
భావించి పొగడ గీప్పతికైన తరమె- కావు నీవు శీఘ్రంబుగా నతని
కడగేగి సంశయగ్రంధి విచ్ఛేద-మడరఁ గావించి కొమ్మనఘాత్మ యనిన."
- ఆర్. నం. 2347.83,84 పుటలు.

ధర్మరాజు ధ్యానాసక్తుడైన శ్రీకృష్ణుని గాంచి ఆశ్చర్యపడిన పై సన్నివేశము భారతము శాంతిపర్వమున గలదు. (చూ.శాంతి పర్వము, II ఆశ్వా; 3-14 ప.). వెంగమాంబ పై కథాంశమును అందుండి స్వీకరించి ప్రకృత సందర్భమును రంజింపజేసినది. దీనికి తరువాతి కథ పోతన రచనానుసారిగనే సాగినది. ఇట్లు భాగవత కథాగమన సరణికి విరోధముగాని, తారుమారుగాని కలుగకుండగనే గ్రంథాంతరమునుండి కైకొనిన భావములతో ఘట్టములను రంజింప జేయు నేర్పు ఈ భాగవత కవయిత్రి కవితకు ముఖ్య లక్షణమై భాసించుచున్నది.

**పాత్రపోషణ :**

మూలమున పోతన రచనలో స్త్రీ పాత్రల విషయమై కొన్ని యెడల కన్పించు అసమగ్రతను, తక్కువదనమును తొలగించి, ఈ కవయిత్రి ఆ పాత్రములను చక్కగా పోషించి, న్యాయము చేకూర్చియున్నది. ఇందులకు వరుసగా నుదాహృతులు.

1) కుంతి పరమపదించిన సమయమున పాండవు లామెకు పరలోకవిధులు నెఱవేర్చిన సంగతి పోతన భాగవతమున లేదు.

ఈ క్రింది ద్విపదలలో-

"అను వంద ధర్మరాజాది పాండవులు-పనిఁ బూని తల్లికిఁ బరలోకవిధులు
కరుణతో విహిత ప్రకారంబుగాను-నిరుపమ శ్రద్ధతో నెఱవేర్చి రిటుల"
-ద్విపద భాగ;I స్కం,(ఆర్. నం.2347), 147 పుట.

అని, కుమారులుగా పాండవులు తల్లియెడల తమ కర్తవ్యమును నిర్వర్తించినట్లు రచించి, కుంతీదేవియొక్క ఉత్తమగతిని స్పష్టీకరించి యున్నది.

2) ద్రౌపది తన పతులచే ఉపేక్షితయైన పిమ్మట "జగత్పతియైన వాసుదేవునందునఁ జిత్తంబు సేర్చి తత్పదంబు సేరె" (I స్కం;388 వ.) అని మూలమున చెప్పబడినది. అట్లు పాండవులు తనను ఉపేక్షించిన పిమ్మట ద్రౌపది ఐహికవిరక్త యైన దనుటకన్న, ఆమె స్వయముగానే విరక్తురాలైన దనుట సముచిత మని తలచి వెంగమ ఈ క్రింది విధమున రచించినది.

... ... ... ... పాంచాలి మాధవుని
మనమునఁ జింతించి, మగలపై మమతఁ
దా వీడి హరి పదద్వయమందుఁ జెందె."

-ద్విప. భాగ; I స్కం; (అర్.నం.2347), 150పుట.

3) పరీక్షిత్తు కలిపురుషున కొసగిన స్థానములలో మూలమున స్త్రీ కూడ కలదు. "(ప్రాణివధ, స్త్రీ, ద్యూత, పానంబు లనియెడు నాలుగు స్థానంబుల నిచ్చి" I స్కం;436 వ).వెంగమాంబ యీ భావమును సవరించినతీరు అరయదగియున్నది.

"ఎప్పుడు ప్రాణుల హింసించుచోటు-పొరిఁ బరస్త్రీలను పొందెడిచోటు
నారూఢిగా జూదమాడెడుచోటు-తగ మద్యమే వేళ త్రాగెడిచోటు
నగుబాటు లగు నిట్టి నాల్గుచోటులను-చరియింపు మన నవి
చాలకవాఁ డు."

-ద్విప భాగ I స్కం;(అర్.నం.2347), 169పుట.

స్త్రీజాతి యంతయు కలిస్థాన మని పోతన భాగవతమున చెప్పబడియుండగా వెంగమాంబ దానిని పై ద్విపద పంక్తులలో "పొరిఁ బరస్త్రీలను పొందెడుచోటు" గా మార్చియుండుట మిగుల సముచితమై యొప్పినది. పై నుదాహరించిన రీతిని స్త్రీల విషయము ప్రసక్తమైనపుడు పురుషపాత్రలతో తుల్యమగు ప్రతిపత్తిని కవయిత్రి కల్పించియుండుట ఈ యనువాదమందలి విశేషములలో నొకటిగా నెన్నదగియున్నది.

4) చతుర్థ స్కంధమున సతీదేవి శివద్వేషియు, తన తండ్రియు నగు దక్షునితో వివాదపడి శరీరమును దగ్ధము గావించుకొనిన సందర్భమున ఆమె తల్లియైన ప్రసూతి పొందిన మనోవేదన హృదయము నుదిల గొనునట్టిది. ఆ మాతృ హృదయమందలి యావేదనను స్త్రీ సహజముగా, కరుణరస పూరితముగా కవయిత్రి క్రింది ద్విపదలలో ఆవిష్కరించినది.

"కనలుచు భయ మొందఁగా. నా ప్రసూతి-తన తనూభవలతోఁ
దానొక్కదిక్కు
పతి చేసి నటువంటి పాపంబునకును - సుత దగ్ధ యగుటకు శోకించె
నిటుల
హా సతీదేవి ! నీ వభవునిఁ బాసి - యీ సవనంబున కేల వచ్చితివి ?
కట్టిడినైన నా కనుల ముందఱను-పుట్టినింటికి నీవు పొలియ వచ్చితివె
నేటి కీ సవనంబు నీదుపాలికిని - పాటింప మృత్యురూపం బయ్యెనటవె
వరపుత్రి ! నీ విందు వచ్చిన నేను - పరగ సద్భూషణాంబరము లిచ్చితినొ
పసమీఱ నిచట నా భ్రమదీర నీకు - పసుపుగుంకుమ లిచ్చి పార
జూచితినొ
పొలుచు నా కడుపునఁ బుట్టి నీవిచట - నలఘు సుఖంబు లే
మనుభవించితివె
సరకుగాఁ గనని నీ జనకుపై నలిగి - పరఁగ నీ రోషాగ్నిపాలైతి వకట

నా తల్లి ! నెనరింత నా మీఁద లేక - నీ తీరుగ తెగు వేల చేసితివె ?
నీ వణంగుటకును నీ తండ్రి లోక - పావనుఁడై నిందపాలైన గతికి
నే మని వగతు నే నే మందు విధిని - నీ మీఁది జాలింక నే నెట్టు
మఱతు
నని వగుచుచునున్న యవసరంబునను-మొనసి మహోత్పాతములు
పుట్టెననుచు."

-ద్విప. భాగIV స్కం; (ఆర్. నం.2347),472-473 పుటలు.

అమూలకమగు పై ఘట్టము తరిగొండ వెంగమాంబ కవితా హృదయమునకు అక్షర నిదర్శనము.

**వర్ణనలు :**

ఈ కావ్యమున పరిస్ఫుట మగుచున్న వెంగమ వర్ణనానైపుణ్యము నకు ఈ క్రిందివి కొన్ని నిదర్శనములు.

1) మూలకథా సరణికి అనుగుణముగ సన్నివేశమును వర్ణించి మనోజ్ఞముగా రంజింపజేయుట వెంగమాంబ లేఖినికి వెన్నతో బెట్టిన విద్య. అట్టి చోటుల ఈ కవయిత్రియొక్క కవితామూర్తి సుస్పష్టరేఖలతో దర్శన మిచ్చుచుండును. జడభరతుడు పెంచిన జింకపిల్ల యొక్క చేష్టల వర్ణన మిందుల కొక సదమలోదాహరణ.

"పారిని నిజాశ్రమమునకుఁ గొనిపోయి - పొందుగను లాలించి పోషింపఁ బెరిఁగి
యందుండి వరుసగ నా జింకపిల్ల - ఆ నాటి కా నాట నాటలు మరగి
పూని బల్ ముద్దులు పొలుపుగాఁ జూపి - పారుచుఁ గేరుచు బలియు పూఁ బొదల
దూరుచు, మీఱుచు దొలఁ గ కందుండి - వచ్చుచు హెచ్చుచు వగను గొమ్ములను
వ్రచ్చుచుఁ గ్రచ్చుచు వరుసఁ గంతంబు - ద్రిప్పుచుఁ ద్రిప్పుచుఁ దెగి భరతాజ్ఞ
డప్పుచు నొప్పుచుఁ దగ చెంతఁ జేరి-మురియుచు నొరయుచు ముద్దుగఁ జెవులు
బెరుఁ గఁ బొందింపుచు బింకరింపుచును-మొనసి పూజాద్రవ్యములను ద్రొక్కుచును
గని గదిమినఁ బోయి కడను నిలుచును - అందందు తృణము నెయ్యమున మేయుచును
మందెమేళంబుగ మరలి నచ్చుచును - భరతుని తొడమీఁదఁ బవ్వళింపుచును
మురియుచుఁ బలుమఱు ముద్దుఁ బెట్టుచును - ఈ రీతి నతనిఁ దానెడఁ బాయకుండె.'

ద్విప.భాగ .V స్కం; (ఆర్. నం. 2347), 650-51 పుటలు.

2) ఆ యా భక్తులు భగవంతుని స్తుతించు సందర్భములను వర్ణించుటలో ఈ కవయిత్రి పెక్కుచోట్ల పోతననే అనుసరించియున్నను, ఆ సహజపాండిత్యునివలెనే ఈ సహజకవయిత్రియు భక్తిపారవశ్యము కలదగుటచే ఒక్కొక్కచో స్వతంత్రముగానే భగవన్నుతిని సమకూర్చి యున్నది. ధ్రువుడు శ్రీమన్నారాయణుని స్తోత్రము చేయు ఘట్ట మిందుల కొక తార్కాణము.

"శరణు రమాధీశ ! సారప్రకాశ ! - శరణు పాపవినాశ ! జలదసంకాశ !
శరణు పావననామ ! జగదభిరామ ! - శరణు సత్పరధామ ! సంపూర్ణకామ !
జయ నిగమవిహార ! జయ మేరుధీర ! - జయ సుజనాధార ! జగదేకవీర !
జయ పరమపవిత్ర ! సత్యచరిత్ర ! - జయ వికుంఠక్షేత్ర ! సన్మునిస్తోత్ర !

విశ్వాత్మకుఁడ వీవు విశ్వంబు నీవు - విశ్వేశ్వరుఁడ వీవు వేదార్థ మీవు
నిన్ను సన్నుతిఁ జేయ నీలకంఠునకుఁ - బన్నగభర్తకు, బ్రహ్మదేవునకు
నలవిగా దన నే నతి బాలకుఁ డను - జలజలోచన ! నిన్ను సన్నుతించుటకు
నే నెంతవాఁ డను నిజము భావింప - దీనవత్సల ! భవదీయ సత్కరుణ
క్రన్నన నిర్హేతుకం బగుగాన - నన్ను రక్షింపవె నా తండ్రి ! యనుచు
గొనకొని వేదాంత గుంభితోక్తులను - వినుతింపఁ గరుణ నవ్విష్ణుఁ డిట్లనియె"

-ద్విప. భాగ. IV స్కం; (ఆర్. నం.2347), 508 పుట.

పై సంబోధనలలో ఈ భక్త కవయిత్రి యొక్క భక్తిరసభరిత హృదయము స్పందించుచున్నదని పల్కుట పునరుక్తమే యగును.

3) కవయిత్రి మూలమున కొన్నిచోట్ల విపులముగా నున్న వర్ణనలను మిగుల సంక్షేపించినది. ద్వితీయ స్కంధమందలి 'శ్రీమన్నారాయణుని లీలావతారముల అభివర్ణన' ఘట్టము ఇందుల కొక యుదాహరణము. పోతన రచనలో దాదాపు 90 గద్య పద్యములలో విస్తరించియున్న ఈ యవతారముల వర్ణనమును [30] వెంగమాంబ 25 ద్విపదలలో క్లుప్తీకరించినది. [31] అట్లు క్లుప్తీకరించుటలో కొన్ని

యవతారముల నసలు పేర్కొనక విడిచిపైచినది. అట్లు విడిచినను ఆ ఘట్టముయొక్క సారమును మాత్రము సముచితముగా నుపన్యసించినది. భాగవతముయొక్క సారమును వీలైనంత సంగ్రహముగా, సుకరముగా లోకమున కందజేయవలెనను సంకల్పమే ఈ కవయిత్రి యిట్లుకొన్ని వర్ణనలను సంక్షేపించుటలో మూలకారణమై యుండును.

ఇక ఈ కవయిత్రి భాగవతమునందలి తత్త్వార్థములను సంక్షేపించి తేటగా రచించినందులకు చతుర్థ స్కంధమందలి పురంజనోపాఖ్యానము, 32 పంచమ స్కంధమున జడభరతుడు రహూగణునకు తత్త్వోపదేశ మొనర్చిన ఘట్టము 33 ప్రకృష్ట నిదర్శనములు. వెంగమ ఈ రెండు ఘట్టములను పరిమితిలో పోతన రచనకు సగపాలుగా కుదించియున్నది. అట్లు సంగ్రహీకరించినను కవయిత్రి తత్సారాంశమును తేట తెలుగున సులభశైలిలో ఆవిష్కరించియున్నది.

**ఇతర విశేషములు :**

1) రంగనాథ రామాయణమున తద్రచయితయైన గోన బుద్ధరాజు దేశీయములగు రామాయణ గాథలను స్వీకరించినట్లే, భాగవతమునకు సంబంధించిన కొన్ని దేశీయ కథాంశములను వెంగమాంబ తన రచనలో నెలకొల్పినది. ముని శాపతప్తులైన జయవిజయులతో శ్రీహరి భాషించు ఘట్టమిందుల కొక యుదాహరణము.

> "ఇల నాకు మిత్రులై యేడుజన్మంబు-లెలమి నచ్చట ధరియించి వచ్చెదరొ?
> చలము రెట్టింపఁ గా శత్రువు లగుచు-నిల మూఁ డు జన్మంబు లెత్తి వచ్చెదరొ?
> దెలుపు డన్నను విని దీనాస్యులగుచుఁ - గలగుచు వారు తక్కక నిట్టులనిరి;
> మహనీయ చరిత ! నీ మైత్రి గావించి - మహిమీద సప్తజన్మము లెత్తలేము
> ప్రాకట శత్రుత్వపటిమచే నైన - మాకందు మూఁడు జన్మంబులు చాలు
> నా మూఁడు జన్మంబులందు నీ మీఁ ద-మేము మచ్చరపట్టి మించిన కతన

పాపంబు మాకు సంప్రాప్తమాెఁ గాన - నీ పాద మెటుగన నేర్తు మవ్వలను
చేసిన పాప విశేషంబుచేత - నాసలచేఁ జిక్కి యట్టట్టు జరిగి
పోవ నియ్యక వేగ పారిగొని యిటకు - దేవ ! క్రమ్మఱ మమ్ముఁ దెచ్చు కార్యంబు
మఱి నీవు మఱచిన మాకు దిక్కెవరు - పరఁగ దీనికి పూఁటఁ బడు వారలెవరు?
దయచేసి తెల్పుమో తండ్రి యటంచు-జయవిజయులు పల్కు శాంతవాక్యములు
విని హరి శంఖమున్ వీక్షించి, సిరిని-గని, చక్రమును గాంచి కనుసన్నసేయ
'నొక్క జన్మంబున కొనరనే'ననుచుఁ -దక్కక శంఖంబు తాఁబూఁటఁ బడియె
'మొగిని రెండవ జన్మమునకు నే'ననుచుఁ -దనర మహాలక్ష్మి తాఁ బూటఁబడియె
'మఱి యట మూఁడవమాఱు నే'ననుచు-పరఁ గఁ జక్రము పూఁటఁబడియె నీరీతి
వారి పూఁటల నమ్మి వనజోదరునకు - సారభక్తిని మ్రొక్కి సంస్తుతింపుచును
హరిచేత సెలవంది, యా రమాసతికిఁ-గరమర్థి శంఖ చక్రములకు మ్రొక్కి
హరి వియోగంబున కారటపడుచుఁ- గరఁగుచుఁ గన్నీరు కాల్వలై పారఁ
బురపురఁ బొక్కుచు భూమిపైఁ బడిరి ... ... ... ... ..."

-ద్విప.భాగ .III స్కం; (ఆర్. నం. 2347), 354, 355 పుటలు.

పై ద్విపదలలోని మూడు,ఏడు జన్మల విషయము, శంఖము, లక్ష్మి, చక్రము జయవిజయులకు పూటబడుట - అను కథాంశములు అమూలకములు, దేశీయములు. ఈ కవయిత్రిమతల్లి చేతిచలువచే పై ఘట్టమున సుందరముగా చోటు చేసికొన్నవి.

2) పద్య భాగవతమున పంచమ స్కంధమును బొప్పరాజు గంగన రచించెను. అత డీ స్కంధమును రెండాశ్వాసములుగా విభజించియున్నాడు. వెంగమాంబ తన ద్విపదీకరణములో గంగనార్యుని రచననే ఆధారముగా గైకొనినను, అతనివోలె ఆశ్వాస విభజనమును పాటింపక మొత్తము స్కంధము నొకటిగానే రచించినది.[34] ఈ కవయిత్రి యనువాద విధానములో నిదియు నొక విశేషము.

3) కథయందలి అంశములను ముందు వెనుకలుగా సర్దుబాటొనర్చి కావ్యోచితముగా తీర్చుట, అట్లు తీర్చినందుల కనువుగా కథలో కొన్ని యంశములను కల్పించుట - ఈ కవయిత్రి భాగవతానువాదమున గోచరించు మఱికొన్ని విశేషములు. షష్ఠ స్కంధమందు గల అజామిళోపాఖ్యాన మిందుల కొక సదమల నిదర్శనము. ఆ యుపాఖ్యానము ఏర్చూరి సింగనచే నిట్లు ఉపక్రమింపబడినది.

"నరనాథ ! వినుము కన్యాకుబ్జ పురమునఁ
గలఁడు బ్రాహ్మణుఁ డజామిళుఁ డనంగఁ
బాతకుం డతులనిర్భాగ్యుం డవజ్ఞుండు
నష్టసదాచారి కష్టరతుఁడు
జూదంబులందు దుర్వాదంబులందును
శౌర్యంబునందు మచ్చరము గలిగి
తొత్తాత్మపత్నిగా మత్తుడై వరియించి
కొడుకులఁ బదుగురఁ బడసి చాల
మోహజలధిలోన మునిఁగి ముచ్చట దీఱ
బాల లాలనాది లీలఁ దగిలి
పెద్దకాల మతఁ డుపెంపార సుఖియించి
ఫలిత మెల్ల వదలి పతితుఁ డయ్యె -VI స్కం; 60ప

ఈ యుపాఖ్యానమునే వెంగమ యీ క్రింది రీతి నుపక్రమించినది.

"చిరతరంబైన లక్ష్మీకరంబగుచు - ధరనిపై వివిధ చిత్రంబులతోడఁ
బొలుచు కన్యాకుబ్జ పురమన నొకటి -గలదందు భూసుర్యాగణి కుమారుండు
సకల శాస్త్రంబులు చదివినవాఁడు - ప్రకట వేదాభ్యాస పరుఁ డైన వాఁ డు
కమనీయ గుణములు కలిగినవాఁడు - శమ దమ సద్గుణాచారవర్తనుఁ డు
అనఘుఁ డజామీళుఁ డనియెడు నతఁడు - జనకాజ్ఞ వడసి భాస్వర వనంబునకు
జని పుష్పఫలముల సంగ్రహించుకొని - పెనుపొందఁ గను నెండ పెట్టున బడలిఁ
నీ రొక్కయెడఁ గ్రోలి నీడను నిలిచి - సారార్థమంత విచారింపు చున్న
తఱి నెన్నడుండుట దైవయోగమున - నిరవైన పూఁబొదరింటి లోపలను "
-ద్విప భాగ VI స్కం; (ఆర్ నం 2347), 746, 747 పుటలు

పై సింగన యుపక్రమము పౌరాణిక కథన ధోరణిలో నుండగా వెంగమ ప్రారంభము కావ్యోచితముగా, వర్ణనాత్మకముగా వెలసినది. అజామీళుని జీవితములో నొక సంఘటన యగు 'అరణ్యమున కేగుట'తో నిది యుపక్రమింపబడినది. 'అజామీళుడు తొలుత దురాచారియే కావచ్చుగాక i) ఆతడు పరమార్థతః శ్రీహరి నామమహిమచే సుగతి నొందిన పరమభాగవతోత్తముడు.' అను నభిప్రాయము ధ్వనించునట్లుగా ఈ కవయిత్రి అజామీళుని సద్గుణాచార సంపన్నతను ప్రారంభముననే చక్కగా ప్రపంచించినది.

ఈ రీతిని స్వకీయ కవన కౌశల ముట్టిపడునటుల తరిగొండ వెంగమాంబ ద్విపద భాగవతమును సంతరించియున్నది. ఈ కృతి సమగ్రముగా లభించియుండిన యెడల తరువాతి స్కంధముల (7-12 స్కంధముల) యందు, అందును ముఖ్యముగా దశమ స్కంధమున ఈ కవయిత్రి శ్రీహరి యవతారములను తత్పరాక్రమ విహార మహత్త్వములను విస్తరించినతీరు సుహృద్విమర్శకులరసి యానందించు నవకాశ ముండెడిది.

ఈ కృతియొక్క విశిష్టతను సింహావలోకన సరణిలో ఈ క్రింది విధముగా క్రోడీకరింపవచ్చును.

1) పోతనామాత్యుని పద్యకృతివలెనే, ఈ ద్విపద కృతి దైవ ప్రేరణయే ముఖ్యకారణముగా అవతరించినదై యుండుట.

2) తెలుగున ద్విపద భాగవతము లనేకము వెలసినను, వాటిలో ఈ కృతి యొక్కటే పోతనార్యుని రచనను ఆద్యంతము సమర్థవంతముగా అనుసరించిన ప్రశస్తికి, భక్తిగౌరవములకు నోచుకొన్నది. ఈ హేతువుచే ఈ ద్విపద కృతి యాధారమున ఆనాడు వెంగమ కందుబాటులో నుండిన పద్య భాగవత ప్రతియందలి పాఠముల నెఱుగుటకు చక్కని యవకాశ మేర్పడినది. ఈ విధముగా పోతన భాగవత పాఠ నిర్ణయమునకు పరోక్షాధారముగా వెలసి యుండుటలో ఈ ద్విపద కృతి విలువ ఇనుమడించుచున్నది.[35]

3) ఈ కవయిత్రి తదితర కృతులలో దేనియందును రచింపని సుదీర్ఘావతారికనుఈ కృత్యాదిలో కూర్చియున్నది. ఈ కృత్యవతరణికవలన ఆమె పూర్వరచనలు, రచనోద్దేశములు మున్నగు ననేకాంశములు తెలియుచున్నవి. ఇందువలన ఈ కవయిత్రి సారస్వతమును పరిశీలించువారికి ఈ గ్రంథావతారిక మార్గదర్శకమగు కరదీపికయై వెలుగొందుచున్నది.

4) ఇంతకు మున్ను తెల్పినట్లుగా, ఈ కృతి వెంగమాంబ సృజించిన కృతు లన్నింటిలో పరమితి యందును, కవితా పరిణతి యందును అగ్రగణ్యమైన గ్రంథము. కవయిత్రి కవితానుభవము పండిన అపరవయస్సున రచించిన ఉద్గ్రంథములలో నిది మొదటిది. దీని అనంతర రచన వేంకటాచల మాహాత్మ్యము. ఈ రెండు గ్రంథముల అవతారికలకు గల సామ్యమును బట్టి నిశితముగా పరికించి చూచినచో ఈ ద్విపద భాగవత రచనానుభవమే ఈ కవయిత్రి వేంకటాచల మాహాత్మ్యము నాంధ్రీకరించుటకు ముఖ్యప్రేరక మయ్యెనని విశదము కాగలదు.

## వాసిష్ఠరామాయణము

తరిగొండ వెంగమాంబ రచించిన ద్విపద కావ్యములలోనే గాక, ఆమె రచించిన కృతు లన్నిటియందును చిట్టచివరిది వాసిష్ఠ రామాయణము. సంస్కృత భాషలో ఈపేరున రెండు గ్రంథములు గలవు. అందొకటి 'బృహద్వాశిష్ఠ రామాయణము'. రెండవది 'లఘుయోగ వాసిష్ఠము'. దీనికే 'యోగవాసిష్ఠ సార' మని నామాంతరము. అందు మొదటిది ఆదిలో వాల్మీకిచే రచింపబడి, రాను రాను ఆ యా కాలములలో అనేక ప్రక్షిప్తములు చేరగా ఏర్పడిన బృహద్గ్రంథము. ఈనాడు మనకు లభించుచున్న బృహద్వాసిష్ఠ రామాయణము క్రీ. శ. 6వ శతాబ్దినాటి కేర్పడినట్టిదని పరిశోధకుల నిశ్చితాభిప్రాయము.[36]

## మూలగ్రంథము

రెండవదగు 'లఘు యోగ వాసిష్ఠము' మొదటిదాని యొక్క సంగ్రహరూపము (Epitome). క్రీ.శ.9వ శతాబ్ది పూర్వార్థమున నుండిన గౌడ అభినందుడను కాశ్మీరపండితుడు37 32వేల శ్లోకముల బృహద్వాశిష్ఠ రామాయణ గ్రంథమును ఇంచుమించు ఆఱువేల శ్లోకముల పరిమితి గల ఈ గ్రంథ రూపమున సంక్షేపించెను. ఈ గ్రంథము పరిమిత పరిధిలోనే మూలముయొక్క సారమును, తత్సందేశమును లోకమున కందించుచు, సర్వవిధముల ఆ బృహద్గ్రంథమునకు ప్రాతినిధ్యము వహించుచున్నది.

వాసిష్ఠ రామాయణము నాంధ్రీకరించిన తెలుగు కవులలో ప్రథముడు మడికి సింగన (క్రీ.శ. 1375-1435), సింగన బృహద్వాసిష్ఠ రామాయణమును గాక, అభినందపండితుని 'లఘు యోగ వాసిష్ఠము'నే అనువదించెనని, ఆతని గ్రంథమందలి ఈ క్రింది వాక్యమువలన తెలియుచున్నది.

"అని పరబ్రహ్మోపాసనంబును, నిష్టదేవతాభివందనంబును,
సుకవి విద్వజ్జన ప్రార్థనంబును, ... ... .... ...
చిత్తశాంతియ జీవన్ముక్తి యనియును బెక్కువిధంబు
లుపన్యసించునట్టి వాసిష్ఠ సంగ్రహ ప్రబంధం బాంధ్ర
భాష నఖిల లోకోపకారార్థంబుగా రచియించెద'"
-వాసిష్ఠ రామాయణము, I ఆశ్వా, 10వచనము.

పై వాక్యములో సింగనార్యుడు పేర్కొనిన 'వాసిష్ఠ సంగ్రహ ప్రబంధము' 'లఘు యోగవాసిష్ఠమే' కాని మఱొక్కటి కాదు.

సింగన వలెనే వెంగమయు అభినందపండితుని 'యోగ వాసిష్ఠ సారము' నే మూలముగా స్వీకరించినది. ఇందులకు ఆమె కావ్యారంభ మందలి ఈ క్రింది ద్విపద పంక్తులు నిదర్శనములు.

"ధరణి మీద మదాత్మ తరియించు కొరకు
సామోదమతిని సుజ్ఞాన వాసిష్ఠ
రామాయణార్థ సారమును గ్రహించి

వరుసగా ద్విపద కావ్యముగా రచించి
యర లేక మీకు సమర్పింతు నిపుడు
శ్రీ తారకోల్లాస ! శ్రీశ్రీనివాస !
శ్రీ తరిగొండ నృసింహ ! ధూతాంహ !"

- వాసిష్ఠ రామాయణము, 3 పుట.

పై పంక్తులందలి 'సుజ్ఞాన వాసిష్ఠ రామాయణార్థ సారము' అను మాటలో మూలగ్రంథ సూచన యున్నది. ఇంతేగాక, ఈ కవయిత్రి రచన యంతయు ఈ యంశమును నిరూపించుచునే యున్నది.

ఈ కవయిత్రి 'లఘు యోగ వాసిష్ఠము' నే అనువదించిన దనుటకు ఇంకొక ప్రబలమైన నిదర్శనము కలదు. అభినంద పండితుడు సంక్షేపించి తయారు చేసిన పై 'లఘు యోగ వాసిష్ఠ ము'లో చివరి ప్రకరణమగు 'నిర్వాణ ప్రకరణము'న ఉత్తరార్థము లేదు. తదనుసారముగ సింగన వెంగమల అనువాదములందును నిర్వాణప్రకరణ ఉత్తరార్థము కనబడదు. ఇందువలన ఈ యిరువురును లఘుయోగ వాసిష్ఠమునే తెనిగించి రనుట స్పష్టము.

వాసిష్ఠ రామాయణమును కామినేని ఎల్లారెడ్డి (క్రీ.శ. 1550-1580) 38 మున్నగు మఱికొందరు కవులును ఆయా కాలములలో అనువదించి యున్నను వారి రచనములలో కొన్ని నే డలభ్యములు, మఱి కొన్ని అముద్రితములునై లోకమున కందు బాటులో లేవు. లభించియున్న వాటిలో నొకటి పద్యకావ్యము కాగా, మఱొకటి ద్విపద కావ్యమై వెలసినది.

మీద తెలిపినట్లు సింగన పద్య రచనకు, వెంగమ ద్విపద రచనకు సంస్కృతమూల మొకటేయై యున్నను, అనువాద విషయమున ఈ కవయిత్రి సింగనను అనుసరింపక స్వతంత్ర విధానము నవలంబించినది. ఈ విషయ మీ యిరువురి కృతుల యందలి కథాసంవిధానమును పరికించినచో తేటపడ గలదు.

**వస్తుసంవిధానము :**

మూలమైన లఘుయోగవాసిష్ఠ గ్రంథమున i) వైరాగ్య ii) ముముక్షు iii) ఉత్పత్తి iv) స్థితి v) ఉపశమ vi) నిర్వాణ ప్రకరణము లనెడి ఆఱు ప్రకరణములు గలవు. వెంగమాంబ ఈ యాఱు ప్రకరణముల యందు గల కథా వస్తువును ఆది, ద్విస్థితి ,తృతీయం, చతుర్థ, పంచమ ప్రకరణము లనెడు ఐదు ప్రకరణములలో ఇమిడించినది. మడికి సింగనయు ఇట్లే తన రచనను ఐదాశ్వాసములుగా వింగడించియున్నాడు. ఐనను కథా వస్తువును సంవిధానించుటలో ఇరువురకు భేదము గోచరించు చున్నది. ఈ విషయ మీక్రింది పట్టికలలో చూపబడినది.

పై రెండు పట్టికలను తులనాత్మకముగా పరిశీలించినచో మూల కథా వస్తువును వింగడించుటలో ఈ కవయిత్రి కడు స్వతంత్రతను ప్రదర్శించినటుల తెలియును. సింగనార్యుడు మూలమందలి తొలి రెండు ప్రకరణములను ప్రథమాశ్వాసముగా అనువదింపగా, వెంగమ మొదటి మూడుప్రకరణముల వృత్తాంతమును ఆది ప్రకరణమున ఇమిడ్చి రచించినది. ఆఱవ దగు నిర్వాణ ప్రకరణ కథను వెంగమాంబ చివరి రెండు (చతుర్థ, పంచమ) ప్రకరణములుగా తీర్చియున్నది. ఇట్లు మూలములోని ఒకే ప్రకరణమందలి వస్తువును తెనుగున రెండు ప్రకరణములుగా విస్తరింపజేయుటలో మొత్తము గ్రంథమున ఆ ప్రకరణమునకు గల ప్రాముఖ్యమును లోకమునకు సూచించుటయే రచయిత్రి ముఖ్యోద్దేశమని భావింపవలెను.

**కథాసంగ్రహము :**

ఇది యైదు ప్రకరణములు. అందు మొదటిది ఆది ప్రకరణము. భరద్వాజు డొకనాడు మానవులు సంసారసాగరమును తరించి ముక్తిని పొందు మార్గము నుపదేశింపుడని గురువగు వాల్మీకిని ప్రార్థించును. భోగములను నిరసించి, తగిన గురుని సేవించి, యెవరైనను ముక్తి

తరిగొండ వెంగమాంబ రచన

| | ఆది ప్రకరణము | ద్విస్థితి ప్రకరణము | తృతీయ ప్రకరణము | చతుర్థ ప్రకరణము | పంచమ ప్రకరణము |
|---|---|---|---|---|---|
| ఒక్కొక్క అశ్వాసములో ఇమిడియున్న సంస్కృత మూలము | i) వైరాగ్య ii) ముముక్షు iii) ఉత్పత్తి ప్రకరణము | iv)స్థితి ప్రకరణము | v)ఉపశమున ప్రకరణము | vi) నిర్వాణ ప్రకరణములో 'శిఖిధ్వజ (చూడాల) ఉపాఖ్యానము' వరకు | vi)నిర్వాణ ప్రకరణములో 'కచోపాఖ్యానము' నుండి చివరి వరకు |

మడికి సింగన రచన

| | ప్రథమాశ్వాసము | ద్వితీయాశ్వాసము | తృతీయాశ్వాసము | చతుర్థాశ్వాసము | పంచమాశ్వాసము |
|---|---|---|---|---|---|
| ఒక్కొక్క ఆశ్వాసములో ఇమిడియున్న సంస్కృత మూలము | i) వైరాగ్య ii) ముముక్షు ప్రకరణములు | iii) ఉత్పత్తి ప్రకరణము | iv) స్థితి ప్రకరణము | v) ఉపశమన ప్రకరణము | vi)నిర్వాణ ప్రకరణము |

నొందవచ్చుననియు, ఆ రీతిగా సద్గురు నాశ్రయించి జీవన్ముక్తులైన వారలలో అగ్రగణ్యుడు శ్రీరాము డనియు వాల్మీకి తెల్పగా, భరద్వాజు డా రామ చరితమును వినిపింపవేడును. వాల్మీకి చెప్పిన ఆ రామ కథ యిది.

శ్రీమన్నారాయణుడు సూర్యవంశమున శ్రీరాముడుగా జనించి వర్ధిల్లుచుండగా, దేవత లిట్లు ప్రార్థించిరి. 'దేవా ! మనుజుల నుద్ధరించుటకై మానవజన్మ మెత్తితివి. కావున వసిష్ఠు నాశ్రయించి వేదాంత జ్ఞానసారము నాలకింపుము. లోకులు మిమ్ము ఆదర్శముగా అనుసరించి, గురు శశ్రూష యొనర్చి కృతార్థు లగుదురు.' దేవతల ప్రార్థన నంగీకరించి యైహికవిరక్తుడై రామచంద్రుడు తీర్థయాత్ర లొనరించుచు, మున్యాశ్రమముల జూచుచు కొన్నాళ్లు గడపెను. పిమ్మట రాజధానిని జేరి, తనకు మోక్షార్హత ప్రసాదించు నద్గురువును గూర్చి చింతించుచుండెను.

ఆ సమయమున అయోధ్యకు వచ్చియుండిన విశ్వామిత్రుడు శ్రీరాముని విచారమును, అందులకు హేతువును తెలిసికొని, రామునూరడించి యిట్లు పల్కెను. 'అన్నా ! రఘురామా ! నీకు తెలియని జ్ఞానము లేదు. ఐనను గురుముఖముగా వినదలచితివి. ఇట్టి కోరిక నీకు బాల్యముననే కలుగుట విశేషము. కావున నీకు తప్పక మోక్షము సిద్ధించును. నీవలెనే పూర్వము శుకుడు మోక్షధర్మములు తెలిసియు, తండ్రి యగు వ్యాసు నడిగెను. తన సమాధానము కొమరుని సందియమును తీర్పకుండుటను గమనించిన వ్యాసుడు శుకుని జనక మహారాజు కడ కంపెను. శుకుడు జనకుని వాక్కులచే చిత్తసంశయము తీర్చుకొని నిర్వికల్ప సమాధి ద్వారా మోక్షము నొందెను '

అని చెప్పి విశ్వామిత్రుడు వసిష్ఠుని జూచి 'యోగివర్యా ! మీ ప్రియశిష్యునకు తత్త్వము నుపదేశింపు'డని పలికెను. వసిష్ఠుడందుల కంగీకరించి, పూర్వము తనకు బ్రహ్మదేవు డుపదేశించిన జ్ఞానమును క్రింది విధముగా వివరింప దొడగెను.

పురుషప్రయత్నము ఉచ్ఛాస్త్రము, శాస్త్రితము - అని రెండు విధములు. అందు 'ఉచ్ఛాస్త్రము' పరమార్థ సౌఖ్యమును సంప్రాప్తింప జేయునది.'శాస్త్రితము' ఐహికమునకు సంబంధించినది. మొదటిదానిచే రెండవదానిని అణచి చిత్తశాంతిని పొందవలయును. మోక్షమను పట్టణమునకు శాంతి, విచారము, తృప్తి, సత్సహవాసము అను నల్వురు ద్వారపాలకులు గలరు. వీరిలో ఏ యొక్కరు స్వాధీనమైనను తక్కిన మువ్వురు వశులగుదురు. అటుపిమ్మట క్రమముగా సంసారబంధము తొలగిపోవును. ఈ మోక్షశాస్త్రము నెరుగుటవలన జన్మరాహిత్యముతో పాటు పూర్ణాయువు, ఆరోగ్యము, కీర్తి మున్నగు ఐహిక ఫలితములును ప్రాప్తించును.

పిమ్మట కొన్ని కథల మూలమున విశ్వముయొక్క ఉత్పత్తి విధము నిరూపింపబడినది. ఆ కథలలో మొదటిది ఆకాశజోపాఖ్యానము. ఆకాశజుడను విప్రుడు ఏలాటి కర్మములు చేయనందున మృత్యువాతనిని కబళింపజాలక పోయినది. రెండవదైన లీలోపాఖ్యానమున పరమాత్మ మాయచే జగములు కల్పించు సరణి చెప్పబడినది. కర్కటి కథ, ఇందు పుత్రోపాఖ్యానము,కృత్రివేంద్రోపాఖ్యానము, చిత్తోపాఖ్యానము, బాలకోపాఖ్యానము,లవణ శాంబరికోపాఖ్యానము వీటి ద్వారా విశ్వోత్పత్తికి సంబంధించిన వేదాంత విషయములు వివరింపబడినవి.

ద్వితీయ ప్రకరణము: భార్గవో (శుక్రో) పాఖ్యానము,దామ, వ్యాళ, కటోపాఖ్యానము, భీమాద్యుపాఖ్యానము, దాశూరోపాఖ్యానము మున్నగువాని మూలమున ఈ ప్రపంచముయొక్క స్థితి తత్త్వ ముపదేశింపబడినది.

తృతీయ ప్రకరణము: ఈ ప్రకరణమున జనకోపాఖ్యానము, పుణ్యపావనుల కథ, బల్యుపాఖ్యానము, ప్రహ్లాదోపాఖ్యానము మొదలగు ఉపాఖ్యానముల ద్వారా అజ్ఞానము ఉపశమించిన వెంటనే శాంతి కలిగి, జ్ఞానోదయమగు ననెడు సత్యము ప్రపంచింపబడినది.

చతుర్థ, పంచమ ప్రకరణములు: ఈ చివరి రెండు ప్రకరణ ములలో అవిద్యానాశముచే సుజ్ఞానోదయమై ఆత్మానందము సిద్ధించు విధము, ధారణాయోగము (ప్రాణాయామము) వలన చిరంజీవిగా వర్ధిల్లు విధమున్నగు నంశములు భుశుండోపాఖ్యానము, అంతఃపూజోపాఖ్యానము,

బిల్వోపాఖ్యానము, శిలోపాఖ్యానము, అర్జునోపాఖ్యానము, శిఖిధ్వజోపాఖ్యానము, కచోపాఖ్యానము-మున్నగు కథల ద్వారా దృష్టాంతపూర్వకముగా నిరూపింపబడినవి.

**కావ్యప్రశస్తి :**

సంస్కృత వాఙ్మయమున వెలసిన తాత్త్విక కావ్యములలో వాసిష్ఠ రామాయణము అగ్రశ్రేణికి చెందినది. అద్వైత వేదాంత ప్రతిపాదకమగు ఈ కావ్యమునకు జ్ఞానవాసిష్ఠము, యోగవాశిష్ఠము,మహారామాయణము, ఉత్తర రామాయణము మున్నగు నామములు పరంపరగా వ్యవహారములో నున్నవి. భక్తులకు భాగవతమువలె, కర్మయోగులకు భగవద్గీతవలె, జ్ఞానమార్గానుయాయులకు వాసిష్ఠ రామాయణము ఆరాధ్యమగు గ్రంథము. ఇందు కర్మయోగ,జ్ఞాన యోగములు రెండును రసవంతములైన ఉపాఖ్యానముల దృష్టాంతముల మూలమున కావ్యశైలిలో సోపానక్రమమున వివరింపబడినవి.

ఈ గ్రంథమునకు భగవద్గీతతో కొన్ని పోలికలు కన్పట్టును. 'గీత'భారత కథా సంబంధి కాగా 'వాసిష్ఠము' రామాయణ కథా సంబంధియైనది. శ్రీకృష్ణోపదేశానంతరము అర్జునుడు కర్తవ్యోన్ముఖుడైనట్లే, ఇందు వసిష్ఠుని ఉపదేశానంతరము శ్రీరాముడు రాజ్యపాలనము నెడల ప్రవృత్తు డయ్యెను. 'గీత' సర్వోపనిషత్సారమైనట్లే వాసిష్ఠ రామాయణము అనేకోపనిషత్తుల హేతువై వెలసినది.[39] మఱియు వాసిష్ఠ రామాయణమునందలి నిర్వాణ ప్రకరణములో గల 'అర్జునోపాఖ్యానము'న భగవద్గీత యందలి శ్లోకములు దాదాపు ముప్పది కలవు.[40]

సుప్రసిద్ధ తత్త్వవేత్త, జ్ఞాని యైన స్వామి రామతీర్థ (క్రీ.శ. 1873-1906) వక్కాణించిన ఈ క్రింది యాంగ్ల వాక్యములు ఈ యాధ్యాత్మిక కావ్యముయొక్క ప్రశస్తిని వేనోళ్ల చాటుచున్నవి.

"One of the greatest books, the most wonderful according to me ever written under the Sun is Yoga Vasistha which nobody on Earth can read without attaining

God-consciousness, nobody can read it through without becoming one with All"[41]

**అనువాద పద్ధతి :**

ఇంతటి ప్రసిద్ధి గల ఈ కావ్యమును, తన ఆత్మ తరించుట కొరకు రచించుచున్నట్లు వెంగమ ఈ కృత్యారంభమున అత్యంత నిరాడంబరముగా పేర్కొనినది. ఐనను ఇందలి ప్రకరణాంత ద్విపదల యందు "సదమలులై వ్రాసి చదివిన నరులు వారు తాపత్రయ వన నిధి దాటి, పరమైన నిర్వాణ పదము నొందుదురు" (చూ.పుట 96) అని ఫలశ్రుతి వ్యాజమున ఈ కావ్య ప్రయోజనమును ప్రవచించి యున్నది. ఇట్లు సకల పురుషార్థము, విమల మోక్షాకరమునైన ఈ యాధ్యాత్మిక కావ్యము ననువదించుటలో కవయిత్రి ఒక ప్రత్యేక పద్ధతి నవలంబించినది.

వసిష్ఠ మహర్షి ఆకర్షణీయములగు వేర్వేరు కథల ద్వారా వేదాంత విజ్ఞానము నుపదేశించి యుండుటచే ఈ కావ్యము విచిత్రములైన కథలకు నిలయమై వెలసినది. ఇట్టి కథలు చిన్నవి, పెద్దవి కలిసి ఈ కృతిలో దాదాపు నలువది యున్నవి. ఇట్లు కమనీయ కథావ్యాజమున తాత్త్విక సందేశమును లోకమున కందించుచున్న ఈ గ్రంథమును తెనిగించుటలో ఈ కవయిత్రి ప్రతి కథను వీలైనంత మేరకు సంగ్రహించి, తత్సందేశమును స్వానుభవమిళితముగా, సూటిగా, సులభముగా తెలియబల్కినది.

'లవణ శాంబరికోపాఖ్యానము' ఇందుల కొక చక్కని యుదాహరణ.[42] లవణుడను రాజొకనాడు తన కొలువు కేతెంచిన ఐంద్రజాలికుని మాయచే జవనాశ్వము నెక్కి పోయి ఘోరారణ్యమునందు వసించు చండాల యువతిని పెండ్లాడును. ఆమెయందు పెక్కు సంతానమును గని యనేక వత్సరములు జీవించి వృద్ధుడై, కఱవుచే బాధపడుచు నొకనా డగ్నిని బ్రవేశించును. ఈ యనుభవమంతయు

ఆ రాజు సింహాసనము పై కనుమూసి నిద్రించిన ట్లున్నంతలో కలవోలె జరిగిపోయినది. పిమ్మట లవణుడు తన సింహాసనముపై నులికిపడి మేల్కనును. సింహాసనముపై నిద్రించినట్లుండి యొక్కుమ్మడిగా నట్లు ఉలికిపడుటకు కారణమే'మని మంత్రు లడుగుదురు. గారడివాని ప్రభావమువలన తనకు గలిగిన ఆ స్వప్నానుభవమును రాజు వివరించును. ఈ వృత్తాంతము మూలములో తొంబది శ్లోకములలో నున్నది.[43] కవయిత్రి ఈ కథను కేవలము 28 ద్విపదల లోనికి సంక్షేపించినది.[44]

దేశకాలములు మనస్సున' కధీనములు. మనోవిలసనమే జీవునకు బంధము. దానిని నిరసించుటే ముక్తి. ఆ మానస విలాసవైభవము వలన గోష్పాదమంత ప్రదేశము ఆమడగా తోచును. క్షణకాలము బ్రహ్మకల్పముగా భాసించును. ఈ శాశ్వతసత్యమును బోధించుటకే వసిష్ఠుడు రామునకు లవణోపాఖ్యానమును[45] దెల్పినాడు. ఈ సందేశమును వెంగమ యీ క్రింది ద్విపదలలో సంగ్రహముగా, సూటిగా ప్రతిపాదించి యున్నది.

"... ... ... ...జలజాప్తకులదీప! స్వల్పకాలమునఁ
జాలఁగా బెక్కేండ్లు జరిగిన యింద్ర - జాలంబు గాని నిశ్చయ మనరాదు
చింతించి యెంతజేసిన మనోమాయ-లంత హెచ్చుచునుండు నణఁచిన నణఁ గు
నలువొప్పు సంయమనంబున శాంతి-గలుగుఁ దచ్ఛాంతిని గట్టిగాఁ బట్టి
మదిని నిరోధించి మానితజ్ఞాన-మెద నుంచి ధ్యానసమేతుఁ డై దినము."

- వాసిష్ఠ రామాయణము, 85,86 పుటలు.

మఱియొక యుదాహరణము శిఖిధ్వజోపాఖ్యానము, 'చూడాలకథ' యనునది దీనికి నామాంతరము. మాళవదేశాధిపతి శిఖిధ్వజుడు. ఆతని భార్య చూడాల. బహుకాలము రాజ్యసుఖముల ననుభవించిన పిమ్మట ఆ రాజదంపతులకు ఆత్మజ్ఞానమును గూర్చిన జిజ్ఞాస యుదయించినది. చూడాల అచిరకాలమున తత్త్వజ్ఞానమును బడయుగా శిఖిధ్వజుడు తన కది సిద్ధింపనందువలన విరక్తుడై యరణ్యమున కేగి తపస్సు గావింప దొడగెను. రాజ్యభారమును వహించిన

చూడాల యోగశక్తిచే అప్పుడప్పుడు శిఖిధ్వజుని ఆశ్రమమున కేగి, కుంభుడను ఋషికుమారుని రూపమున ఆ రాజునకు తత్త్వజ్ఞానము నుపదేశించు చుండినది. తనకు జ్ఞానోదయమగుటకు కారణమైన ఋషికుమారుడు తన పత్నియే యని రాజు చివరకు గుర్తించెను. ఇట్లు పరిపూర్ణ జ్ఞానవంతులై వారిరువురు రాజధానిని ప్రవేశించి మునుపటి రాజభోగముల ననుభవించుట ద్వారా ప్రారబ్ధమును ముగించి పరమపదవి నొందిరి.

ఈ యుపాఖ్యానము జ్ఞానవాసిష్ఠముయొక్క స్వరూప స్వభావములకు సంగ్రహరూపేణ ప్రాతినిధ్యము వహించుచున్నది. ఈ గ్రంథము ఉపాఖ్యాన ప్రచురమైనట్లే ఈ కథలోను కిరాట, చింతామణి, గజేంద్రోపాఖ్యానము లనెడు చిన్న చిన్న ఉపాఖ్యానములు అంతర్గతములై యున్నవి. ఇట్టీ యుపాఖ్యానము మొత్తము గ్రంథము యొక్క తాత్త్విక సందేశమునం దీయంజాలియున్నది. జ్ఞానవాసిష్ఠములో ఈ యుపాఖ్యానమున కింతటి ప్రాముఖ్య ముండుటచేతనే వెంగమాంబ దీనిని మఱింత సంగ్రహపరుపక, పరిమితిలో మూలమునకు కుడియెడమగా అనువదించినది.

మూలమున 640 శ్లోకముల పరిమితిలో నున్న[46] ఈ కథను కవయిత్రి దాదాపు 600 ద్విపదలలో వెలయించి యున్నది.[47] వెంగమాంబ వాసిష్ఠ రామాయణానువాద పద్ధతికి ఈ యుపాఖ్యాన మొక ప్రకృష్టోదాహరణము. వాసిష్ఠములో శ్రీరాముడు తీర్థయాత్రల గావించినట్లే ఇందు శిఖిధ్వజుడును తీర్థయాత్రలు చేసివచ్చును.[48] ఈ శిఖిధ్వజుని తీర్థయాత్రా వృత్తాంతము కవయిత్రి కల్పించినదే.

ఈ కల్పనవలన ఈ యుపాఖ్యానమునకు ప్రధాన కథతో చక్కని సామ్యము సిద్ధించినది.

ఈ కావ్యమున ప్రతిఫలించిన పాత్రచిత్రణకు, సన్నివేశముల చక్కదనమునకు, సంభాషణల తీర్మానమునకు ఈ యుపాఖ్యాన మొక మచ్చుతునక. ఇందులకు చూడాల ధరించిన కుంభుడను బ్రహ్మచారి రూపము, కుంభుడు శిఖిధ్వజుని ఆశ్రమములో కలిసికొన్న సన్నివేశము, కుంభుని జ్ఞానోపదేశము-అనునవి వరుసగా నుదాహరణలు.[49]

ఈ యాధ్యాత్మిక కావ్యముయొక్క సందేశమంతయు ఇందు కుంభుడు (చూడాల) శిఖిధ్వజునకు దెల్పిన గజోపాఖ్యానమున నిక్షిప్తమై యున్నది.[50] మొత్తముమీద వెంగమాంబ వాసిష్ఠ రామాయణానువాదము మూలకథా సూత్రము అలంబనముగా, అవశ్యకమైన పట్టుల గావింపబడిన చిఱుమార్పులతో, తాత్త్విక సందేశ ప్రధానముగా, సహజమైన భాషలో, సరళమగు శైలిలో, సంగ్రహముగా, స్వేచ్ఛగా సాగినది.

**స్వతంత్ర కల్పనలు :**

కవయిత్రి యీ కావ్యమున కల్పించిన వానిలో దేవతలు వచ్చి రాముని ప్రార్థించుట యొకటి. దేవత లొకనాడు శ్రీరామునితో 'దేవాదిదేవా! నీవు దశరథ పుత్రుడవుగా జన్మించిన విష్ణుదేవుడవు. మానవులను మోహాబ్ధిలోబడి మునిగిపోనీక కడతేర్చు కారణకర్తవు. కావున వసిష్ఠసంయమిని ఆశ్రయించి సరస వేదాంత విజ్ఞాన ధర్మములను ఆలకింపవలెను' అని బహువిధముల ప్రార్థింతురు.[51] శ్రీరాముని పరాత్పరత్వమును ప్రకటించు నిమిత్తము కవయిత్రి యీ కల్పనను గావించినది.

వెంగమ యిందు కావించిన స్వతంత్ర కల్పనలలో పూర్వ రామాయణ కథా సంగ్రహము ముఖ్యమైనది. వసిష్ఠు డట్లు జ్ఞానోపదేశము చేసిన పిమ్మట, రాముడు లక్ష్మణునితో యాగసంరక్షణార్థము విశ్వామిత్రుని వెంట నేగును. అది మొదలుకొని శ్రీరాముడు రావణుని వధించి సీతా సమేతుడై అయోధ్యను జేరి పట్టాభిషిక్తుడై ప్రజలను బాలిచుంటవరకు గల యావద్రామాయణ కథ యిందు సంగ్రహముగా దాదాపు నలువది ద్విపదలలో రచింపబడినది.[52] ఈ వృత్తాంతము ఈ కథను మంగళాంతము గావించుచు, ఈ కృతికి మకుటాయమానమై యొప్పుచున్నది. ఈ విధముగ ఈ అవకాశము లభించినచోట్ల నెల్ల రామకథను సమగ్రముగా, సంగ్రహముగా వర్ణించుట ఈ కవయిత్రికి మిగుల అభిమానపాత్రమైన విషయము.[53]

**రాజవిద్య :**

పరిశీలింపగా, ఈ తాత్త్విక కావ్యమందలి ఉపాఖ్యానము లన్నియు చాలమట్టుకు రాజన్యుల వృత్తాంతములే యైయున్నవి. దీనినిబట్టి యువరాజగు శ్రీరాముడు సంశయనివృత్తి నొంది స్వధర్మమగు రాజ్యపాలనమున ప్రవృత్తు డగుటకై వసిష్ఠ మహర్షి అటువంటి క్షత్రియుల గాథలనే గైకొని, దాశరథికి తత్త్వబోధ గావించెనని తలపవనగును. ఇందువలననే ఇందు ప్రబోధింపబడిన ఆధ్యాత్మిక జ్ఞానము 'రాజవిద్య'గా పేర్కొనబడినది. ఈ యభిప్రాయమే బృహద్వాశిష్ఠ రామాయణమందలి ఈ క్రింది శ్లోకమున స్పష్టముగా పేర్కొనబడినది.

"అధ్యాత్మవిద్యా తే నేయం పూర్వం రాజసు వర్ణితా।
తదనుప్రసృతా లోకే రాజవిద్యే తు కదా హృతా॥"[4]

'ఈ అధ్యాత్మవిద్య పూర్వకాలమున రాజులకు చెప్పబడినది. అటుపిదప లోకమున ప్రచారము గావింపబడినది. కావుననే ఇది రాజవిద్య యనబడినది.'

పైన తెల్పిన విధమున ఇది 'రాజవిద్య' యైనను, రాజులకే గాక తదితరులకును ఆవశ్యకమైనదే. మఱియు, 'రాజైన (శ్రేష్ఠమైన) విద్య' యగు ఈ దివ్యజ్ఞానమును ప్రచరింపజేసి, లోకమును ఉద్ధరించుటకే బ్రహ్మదేవుడు వసిష్ఠుని సృజించినట్లు ఈ క్రింది ద్విపదలలో వెల్లడింపబడినది.

"సదమల నాభికంజమున విరించి-సదయుఁడై జనియించి సకల భూతములఁ
బుట్టించె నతని తపో మహత్త్వమునఁ -బట్టుగా సర్వప్రపంచమ్ము వెలసె
సరస భారతవర్ష సంభవులైన-నరులు పామరులు నానావిధా న్యాయ
కలితులు లోభులు కాముకుల్ జడులు-బలహీనులును మోహపరవశుల్ శఠులు
గురువంచకులును మూర్ఖులు దాంభికులును-పరధనాసక్తులు,
పరసతీరతులు కావున బహు నారకములందు మునిఁగి-పోవుదురని తన బుద్ధి నూహించి
శోకింపుచుండెడి సుతులకై తాను-శోకించు జనకుని చొప్పన నజుఁడు

చింతించి జప హెూమ శీల ధర్మములు-వంతు కెక్కిన తపోవ్రతములు
జనుల
శాంతిని బొందింపఁజాల వందరికి-సంతోష మిచ్చు సుజ్ఞానం బటంచు
మది నిశ్చయించి సమ్మతముగా నన్ను-ముదమొప్పఁదనమనంబుననె
సృజించె."

-వాసిష్ఠ రామాయణము, ఆది ప్రకరణము. 26,27 పుటలు.

**ఇతర విశేషములు :**

ఇంతకు ముందు తెల్పినట్లు వెంగమయొక్క 'ద్విపద వాసిష్ఠము' పై సింగనయొక్క 'పద్య వాసిష్ఠము' ప్రభావము నామమాత్రమేయైనను, ఈ యిరువురి కృతులను నిశితముగా పరిశీలించి చూడగా ఈ కవయిత్రి సింగన యనువాదమును చూచినదని భావించుటకు నిదర్శనము లొకటి రెండు కన్పట్టుచున్నవి.

i) మిథిలాధిపతి యగు జనకుడు శుకున కొసగిన ఈ క్రింది సమాధానము మూలమున లేనిది; సింగన సమయోచితముగా కల్పించినట్టిది.

"అనఘ! చిత్పురుషుఁ డొక్కఁడె;
విను మన్యము లేదు; తత్త్వవిధ మిట్టి దగున్;
దన సంకల్పమె బంధము
తన సంకల్పక్షయంబ తగ ముక్తి యగున్.
ఇది తత్త్వ నిశ్చితార్థము
విదితం బిది తప్పఁ లేదు వేఱొక్కటి నీ
మది దృశ్యము డిగినాఁడవు
పదిలంబుగ నిదియపట్టి భ్రాంతిఁ దొఱఁగుమీ!"

-వాసిష్ఠ రామాయణము, I ఆశ్వా; 143,144 ప.

పై పద్యములందలి భావము వెంగమ కృతిలో ద్విపదరూపము నొందిన విధమును తిలకింపుడు.

"... ... ... -సులలిత చిత్పురుషుం డొక్కరుండు
దక్క నన్యము లేదు తత్సార్థ మింత-నిక్కంబు, నీవు దీనికి సంశయింప
వలదాత్మ సంకల్ప వాంఛ బంధంబు-వెలయు సంకల్పంబు విడుచుటే ముక్తి
ఇది యథార్థము సంశయింపకు మీవు-మది దృశ్యముడిగి సమ్మతిఁ బొందినావు
పదిలంబుగా నిదే పట్టి భావింప-మది యందె లయమొందు మఱి సంశయములు."
-వాసిష్ఠ రామాయణము, అదిప్రకరణము, 21 పుట.

ii) లవణ శాంబరికోపాఖ్యానములో గారడివాని మాయచే లవణరాజు తా నెక్కిన గుఱ్ఱము వేగమునకు తాళలేక అడవిలో నొక చెట్టుకొమ్మను బట్టుకొనును. ఆ సమయమున నటు వెళ్లుచున్న చండాలదారిక యొకర్తు కొన్ని ఱాళ్లు పేర్చి, చెట్టునకు వ్రేలుచున్న అతనిని బట్టి మెల్లగా క్రిందకు దించును.[55] మూలమున లేని ఈ సన్నివేశమును సింగన రసానుగుణముగా కల్పించినాడు. వెంగమాంబ ఈ కల్పనను గైకొనినది.[56]

ఈ యిరువురి 'వాసిష్ఠ రామాయణములు'ను లక్ష్మీనృసింహ దేవునకే[57] అంకితములై యుండుట సహజముగా సిద్ధించిన సామ్య విశేషము. మొత్తముమీద ఇరువురి రచనలను సంగ్రహ ధోరణిలో నడచినవే యైనను, సింగన 'చంపూ పద్ధతి'లో కంటె వెంగమ 'ద్విపదరీతి'లో విషయముయొక్క ఇమడిక, స్వతంత్రత బాగుగా గోచరించుచున్నవి.

వెంగమాంబ వాసిష్ఠ రామాయణముయొక్క ఉపక్రమోప సంహారములు, ఆ యా ప్రకరణాంతములు మిగుల నిరాడంబరములై ఆ కావ్యమునకు నిండుకుండతోటి సామ్యమును సంతరించియున్నవి. అతి గహనములగు ఆధ్యాత్మిక విశేషములను తేట తెలుగు ద్విపదలలో సులభశైలిని సుబోధము గావించుచున్న ఈ కృతికి, తెలుగున వెలసిన వేదాంత కావ్యములలో విశిష్టస్థానము కలదు.

వెంగమాంబ పై నాలుగు గ్రంథములను ద్విపదలో వెలయించుటతోపాటు, ఆమె యక్షగాన కృతు లన్నింట ప్రచురముగా

ద్విపదను ప్రయోగించి యున్నది. దీనినిబట్టి ఈ కవయిత్రి సృజించిన సారస్వతమున అత్యధిక భాగము ద్విపద చ్ఛందోమయమని విదిత మగుచున్నది.

పై ద్విపద కృతులయందలి వస్తు విస్తృతి, శైలీ వైవిధ్యము, రచనా రామణీయకము-ఇత్యాది గుణవిశేషములనుబట్టి , ఆంధ్ర సారస్వతమున ద్విపద కావ్య స్రష్టలగు మహాకవుల శ్రేణిలో తరిగొండ వెంగమాంబకు సముచిత స్థానము కలదనుట నిశ్చయము. ఒక్క మాటలో ద్విపద వెంగమ 'వాఙ్మయ జీవితము'.

## ద్విపదరచనలు - జ్ఞాపికలు

1.“మధుర కవిత్వం బన్నది నాటకాలంకారంబులు, కళికోత్కళికలు .............ఏకపద, ద్విపద. త్రిపద, చతుష్పద, షట్ప, దాష్టపదులు నివి యాదిగా నన్నియు......”

ఈ వాక్యభాగము వార్తాకవి రాఘవయ్య యను లాక్షణికుడు (క్రీ.శ.1600 ప్రాంతము) రచించిన 'లక్షణ దీపిక' యందలిదిగా నిడుదవోలు వేంకటరావుగారిచే నుదాహరింపబడినది.

చూ. ఉదాహరణ వాఙ్మయ చరిత్ర, 10 పుట.

2. “సర్వయోగీంద్రులు సంతసింపంగ-నుర్వియం దీ రాజయోగసారంబు వఱనే ద్విపద కావ్యముగ రచించి”

-ప్రథమ ప్రకరణము, 3 పుట.

3. “పరిపూర్ణ నిత్య సద్భావ నిమగ్న-మానస యగు వెంగమాంబికా రచిత మైనట్టి రాజయోగామృతసార-మం దెన్నఁగాఁ బ్రథమాఖ్య ప్రకరణ మొందు.”

-ప్రథమ ప్రకరణము, 20 పుట.

తక్కిన రెండు ప్రకరణముల చివర నిట్లే'రాజయోగామృతసార'మని పేర్కొనబడినది.

4. చూ. రాజయోగసారము, ప్రథమ ప్రకరణము, 4-6 పుటలు.

5. చూ. రాజయోగసారము, 6-84 పుటలు.

6. చూ. రాజయోగసారము, ప్రథమ ప్రకరణము, 8-13 పుటలు.

7. చూ. ఇదే గ్రంథము, ప్రథమ ప్రకరణము, 26వ అంశము, 43 పుట.
8. ఈ గ్రంథకర్త పరమానందతీర్థయతి. కాలము క్రీ.శ.16 వ శతాబ్ది.
9. ఈ గ్రంథ రచయిత ఈశ్వరఫణిభట్టు. కాలము క్రీ.శ.16 వ శతాబ్ది మధ్య. చూ. ఆంధ్రకవి సప్తశతి, 138 పుట.
10. చూ. సీతారామాంజనేయ సంవాదము, I ఆశ్వా; 20-34 ప.
11. ఈ రెండు విషయములను తెల్పినవారు 'ఆడిట్ ఇన్‌స్పెక్టర్' శ్రీ జి. సుబ్రహ్మణ్యముగారు. వీరు వెంగమాంబ దత్తుతో చేరిన దౌహిత్రుల వంశమునకు చెందినవారు.
12. చూ. రాజయోగసారము, 20,38 పుటలు.
13. చూ. వాసిష్ఠ రామాయణము, 96,130,212,310,370 పుటలు.
14. చూ. పైని 11వ అంశము.
15. See: The Madras University Journal. Vol XXX, No.I pages 20& 21.
16. చూ. ద్విపద భాగవతము, ఆర్ నం. 2347 (కాగితపు వ్రాతప్రతి). 378-436 పుటలు. యస్.వి.యు.ఓ.రీ.ఇ.లై; తిరుపతి
17. తిరునగరి వెంకటదాసు కపిల దేవహూతి సంవాద మను పేరుతోను, వాసిలి సుబ్బయ 'రాజయోగసార నాటకము' అను పేరుతోను యక్షగానములను రచించిరి. ఈ యిరువురి రచనలకును ఈ కవయిత్రి రచనయే ప్రేరకము, ఆధారము అగుట నిస్సంశయము.
చూ. ఆం.య.గా.వా.చ. ద్వి భా 380, 434 పుటలు.
18. 'రాజయోగసారము' వచనముగా రచితమై ముద్రింపబడినట్లు, నమ్మి త్యాగ రాయసెట్టి అండ్ సన్స్ (చెన్నపట్టణము) వారి ప్రాత 'కేటలాగు'ల వలన తెలియ వచ్చినది. అందొకచో ఇట్లున్నది-

వేదాంథ గ్రంథములు 3 పుట.

రాజయోగసారము ౦-౨-౦

19. వ్యాఖ్యతో ముద్రితమైన ఈ రాజయోగసారపు ముఖపత్రమున ఇట్లు కలదు.
"ఇది ప్రసిద్ధురా లగు తరిగొండ వెంగమాంబచే రచియింపబడెను. ఈ సమగ్రమగు వేదాంత వ్యాఖ్యానము బ్ర॥ శ్రీ॥ వేలమూరి కామశాస్త్రుల వారి సహాయమున బ్ర॥శ్రీ॥ దామర ...భనాచలముగారిచే

వ్రాయబడి ఏలూరు మంజువాణీ ముద్రాక్షరశాలలో ముద్రింపబడియె - 1908."

20. చూ. శ్రీ మదాంధ్ర భాగవతము, VIII స్కం; 265-289 ప.
21. చూ. శ్రీ వేంకటాచల మాహాత్మ్య గ్రంథః ౩౮౬-౪౦౬ పుటలు.
22. చూ. శ్రీ వేంకటేశ్వర లఘుకృతులు, 160-170 పుటలు.
23. చూ. శ్రీ వేంకటేశ్వర లఘుకృతులు, 158-160 పుటలు.
24. ఈ విషయమును తి. తి. దేవస్థాన అన్నమాచార్య వాఙ్మయ ప్రాజెక్టు స్పెషల్ ఆఫీసర్, సుగృహీత నామధేయులు, గురువర్యులు నైన శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు తెల్పినారు. ఇందులకు ఈ వ్యాసకర్త వారికి మిగుల కృతజ్ఞుడు.
25. "బలికించు గావున, భాగవత పురాణ మమర నే ద్విపద కావ్యంబుగాను ద్వాదశ స్కంధముల్ తగఁజెప్పి హరికి సమర్పించి, శ్రీవేంకటాద్రి మహిమ."

-శ్రీ వేంకటాచల మహాత్మ్యము I ఆశ్వా 22 ప.

26. చూ. శ్రీ భాగవతము (ద్విపద), కాగితపు ప్రతి ఆర్.నం. 2347, యస్.వి.యు.ఓ.రీ.ఇ.లై. ఈ ప్రతి షష్ఠ స్కంధమున ఇంద్రుడు వృత్రాసురుని సంహరించు ఘట్టముతో ముగియుచున్నది. క్రీ.శ. 1958-`59 లో ఈ ప్రతిని వ్రాసిన లేఖకుడు " The next mostly injured"అని ముగించి యున్నాడు. చూ. పుట 841.

ఈ ప్రతికి మూలమైన ప్రతి మ.ఓ.మే.లై.లో నున్నది. దాని సంఖ్య డి నం. 1013 (కాగితపు ప్రతి). ఇది చాల శిథిలస్థితిలో నున్నది.

27. మడికి సింగన దశమ స్కంధమును పోతన భాగవత రచనకు ముందే ద్విపదలో రచించెననియు, ఆ ద్విపదానువాదము వ్యాసకృత భాగవతమునకు అనువాదము కాదనియు నిడుదవోలు వేంకటరావుగారు పేర్కొనిరి. చూ. `పోతన' పుట 219.
28. తిరుపతి శ్రీ వేంకటేశ్వర ఓరియంటల్ రీసర్చి ఇన్స్టిట్యూట్ నిమిత్తము కీ.శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు శ్రీకాళహస్తి రాజాగారి యాస్థాని నుండి సేకరించిన తాళపత్ర గ్రంథ సముదాయములో లింగరాజు ద్విపద భాగవత ప్రతులు నుండినవి. ఇటీవల అవి శిథిలములై క్రమముగా నామావశిష్టములై పోయినవి.

29. చూ. ఆర్:నం. 697 (కాగితపు ప్రతి) యస్.వి.యు.ఓ.రీ.ఇ లై
తిరుపతి.
30. i) శ్రీ మదాంధ్ర భాగవతము, II స్కం 113-199 వ.
31. ii) ద్విపద భాగవతము, II స్కం (ఆర్.నం. 2347) పుటలు 246-249.
32. శ్రీ మదాంధ్ర భాగవతము, IV స్కం 742-855 వ. ద్విపద భాగవతము, IV స్కం (ఆర్.నం. 2347) పుటలు 575-606
33 శ్రీమదాంధ్ర భాగవతము, V స్కం; I ఆశ్వా 159-178 వ. ద్విపద భాగవతము, V (ఆర్ నం. 2347) పుటలు 673-678.
34 ద్విపద భాగవతము, (ఆర్.నం. 2347), పుట 678.
35 This Telugu work is not a rendering of the sanskrit original but a Dwipada verson of the Champu or Padya Kavya of the immortal Andhra Bhagavatamu by Bammera Potana. Vengamamba had a great regard for Potana and she pays homage to him in her Venkatachala Mahatyamu. She has meticulously followed Potana and preserved the text of Bhagavatamu" -N. Venkata Rao
See. The Madras University Journal, Vol.XXX, No.1, page 23.
36. See. 'The Philosophy of The Yogavasistha', page 26.
37. 'యోగవాసిష్ఠ ఔర్ ఉస్ కే సిద్ధాన్త', పుట 9,
38. ఆంధ్రకవి సప్తశతి, పుట 27.
39 'See. The Philosophy of The Yogavasistha', p p 41-56.
40 See. Ibid, Page 26.
41. ఈ యుల్లేఖము 'శ్రీ వసిష్ఠ గీత' అను గ్రంథము యొక్క ఉపోద్ఘాతములో నుండి కైకొనబడినది. చూ. 'శ్రీ వసిష్ఠ గీత', (అను) శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు, ఉపోద్ఘాతము, పుట 14, 1వ కూర్పు (1972)
42. వాసిష్ఠ రామాయణము, ఆదిప్రకరణము, పుటలు 83-85
43. లఘు యోగవాసిష్ఠః III ప్రకరణమ్, 8 సర్గః, పుటలు 234-245.
44. వాసిష్ఠ రామాయణము, ఆదిప్రకరణము, పుటలు 83-85.
45. ఈ లవణోపాఖ్యానమే కీ.శే. గురజాడ అప్పారావుగారి "లవణరాజు

కల`` అను గేయ రచనకు ఆధారము. ఇట్లొక ఆధునికయుగ మహాకవిని ప్రేరేపింప గల్గిన కథా వస్తు విం దుండుట దీని ప్రత్యేకతగా చెప్పదగును.

46. లఘు యోగవాసిష్ఠః VI ప్రకరణమ్, 9 సర్గః పుటలు 669-864.

47. వాసిష్ఠ రామాయణము, చతుర్థ ప్రకరణములు. పుటలు 258-311.

48. అందే, పుటలు 268, 269.

49. వాసిష్ఠ రామాయణము, చతుర్థ ప్రకరణము. పుటలు 272,274,275-279.

50. అందే, పుటలు 283-286.

51. అందే ఆదిప్రకరణము. పుట 8.

52. వాసిష్ఠ రామాయణము, పంచమ ప్రకరణము, పుటలు 367-369.

53. i) వేంకటాచల మాహాత్మ్యమున వైకుంఠ గుహా వృత్తాంత సందర్భమున కవయిత్రి సూతునిచే రామకథను సంగ్రహముగా జెప్పించినది.

చూ. I ఆశ్వా ; 242-244 ప.

ii) జలక్రీడా విలాసము (య,గా,)నను వెంగమాంబ యశోదచే బాలకృష్ణునకు రామాయణ గాథను 'ఊకుండుకత'గా చెప్పించినది.

చూ. ఈ సిద్ధాంత వ్యాసము, ఐదవ ప్రకరణము, పుట 159.

54. శ్రీ యోగవాసిష్ఠము, పూర్వార్థము, ప్రథమ సంపుటము, ముముక్షు వ్యవహార ప్రకరణమ్. సర్గ 11, శ్లో. 17.

55. వాసిష్ఠ రామాయణము, II ఆశ్వా 225-230 ప.

56. వాసిష్ఠ రామాయణము, ఆదిప్రకరణము, పుటలు 83, 84.

57. మడికి సింగన తన పద్య రచనను ఇష్టదైవమగు అహోబల లక్ష్మీనృసింహ స్వామి కంకిత మొనర్పగా, తరిగొండ వెంగమ్మ తన ద్విపద కృతిని శ్రీ తరిగొండ నృసింహు డనంగ ఖ్యాతిగా వెలయు వేంకటరాయనికి' అభేదముగా అంకితము గావించినది.

## పద్య కావ్యములు

తరిగొండ వెంగమాంబ రచించిన పద్యకావ్యములు రెండు. 1) వేంకటాచల మహాత్మ్యము. 2) అష్టాంగ యోగసారము. రెండవది మొదటి కృతియందు ఏకదేశమే యైనను, కవయిత్రియే దీనిని ప్రత్యేక కృతిగా పృథక్కరించినందున ఈ పరిగణనము ఆవశ్యకమైనది.

## వేంకటాచల మాహాత్మ్యము

వెంగమాంబ రచించిన కృతు లన్నింటిలో అన్నివిధముల మకుటాయమానమైనది వేంకటాచల మాహాత్మ్యము. ఈ కృతి పరిశీలనమునకు మున్ను, ఇందుకు మూలమైన సంస్కృత వేంకటాచల మాహాత్మ్యమును గూర్చి, తత్స్వరూప, విశేషములగూర్చి, సంగ్రహముగా చర్చించు టావశ్యకము.

**మూలగ్రంథ స్వరూపము :**

నేడు మనకు ముద్రితరూపమున అందుబాటులో నున్న సంస్కృత వేంకటాచల మాహాత్మ్యము పండ్రెండు పురాణములనుండి స్వీకరింపబడిన 157 అధ్యాయములు గలిగి ఇంచుమించు 12,000 శ్లోక సంఖ్యతో విస్తరిల్లియున్నది.[1] ఇట్లు వేర్వేరు పురాణముల యందు వేంకటాచల మహిమాత్మకములగు భాగములను తొట్టతొలుత ఎవరు ఎప్పుడు సంకలనము గావించిరో నిశ్చయముగా తెలియదు.

తిరుమల దేవస్థాన శాసనములలో ఈ 'వేంకటాచల మాహాత్మ్యము' క్రీ.శ. 1491 నాటి యొక శిలాశాసనములో మొట్టమొదట పేర్కొనబడినది.[2] శాసనదాత పసిండి వేంకటత్తురైవార్. ఈతడు శ్రీవేంకటేశ్వరునకు, తదితర దేవతలకు ఏర్పరచిన అనేక-ఉభయములను ఉట్టంకించుచున్న ఆ సుదీర్ఘ తమిళ శాసనములో చివరి భాగమున నిట్లు కలదు.

> "తిరువేంగడ ముడయాన్ ఇంద తిరువోలక్కం కండరుళ కిఱపోదు
> ఇవర్ విణ్ణప్పం శెయ్‌ద తిరువేంకట మాహాత్మ్యత్తుక్కు
> అరుళప్పాడిట్టు కేట్టరుళక్కడ వరాహావుం"

ఈ తమిళ వాక్యమునకు ఆంగ్లానువాద మి ట్లున్నది.

"God Tiruvenkatatamudaiyan will, while presiding at the said tiruvolakkam, be graciously pleased to hear, after honourable announcement made therefore the TIRUVENKATA MAHATMYAM compiles and humbly presented by him (the donor)"

దేవస్థాన శాసన పరిశోధకుడుగా నుండిన సాధు సుబ్రహ్మణ్య శాస్త్రిగారు పై శాసనమందలి "ఇవర్ విణ్ణప్పం శెయ్ద" (వీరు విన్నపం చేసిన) అను విశేషణ మాధారముగా గొని, వేంకటాచల మాహాత్మ్యమును మొట్టమొదట సంకలన మొనర్చిన వ్యక్తి పసిండి వేంకటత్తురైవార్ పండితుడే యని నిరూపించిరి. అట్లు వివిధ పురాణములనుండి సేకరించిన అధ్యాయములతోపాటు మఱికొన్ని భాగములను ఈతడు (ఆళ్వారుల మంగళాశాసన పాశురములందలి భక్తిభావములవంటి వానిని) కల్పించి అందు చేర్చి యుండవచ్చు ననియు సుబ్రహ్మణ్యశాస్త్రిగారు అభిప్రాయపడిరి. ఈ యూహలోని సత్యాసత్యము లెట్లున్నను, వేంకటాచల మాహాత్మ్యము ఒక గ్రంథముగా క్రీ.శ. 15వ శతాబ్ది చివర భాగమునకే రూపొందియుండినట్లు మాత్రము నిశ్చయింప వీలైనది.

క్రీ.శ. 1491కి ముందటి దేవస్థాన శాసనములలో 'తిరువేంకట మాహాత్మ్యము' యొక్క ప్రసక్తి లేకున్నను, స్వామివారి సన్నిధిని పురాణములు పఠించెడి 'పురాణ భట్టరులు' ఉండెడివా రనుటకు శాసనాధారము కలదు.[4] అట్టి 'పురాణ భట్టరులు' తదితర పురాణములతోపాటు, వేంకటాచల మహిమను ప్రకటించెడి ఆ యా పురాణ-భాగములను పారాయణము చేయుచుండెడి వా రని యూహింప వచ్చును.

పద కవితా పితామహుడు, సంకీర్తనాచార్యుడు అయిన తాళ్లపాక అన్నమాచార్యుడు (క్రీ.శ. 1408-1503) "దివ్యభాష నా వేంకటాద్రి మాహాత్మ్యమంతయును" గావించియున్నట్లు ఆయన మనుమడగు చిన్నన్న పేర్కొనినాడు.[5] అన్నమయ్య సంస్కృత భాషలో రచించిన ఆ 'వేంకటాద్రి మాహాత్మ్యము' నే డలభ్యము. ఐనను ఆయన సంకీర్తనలలో అట నట వివిధ పురాణములందలి వేంకటేశ్వర మాహాత్మ్య కథాంశములు సూచితములైనవి. మచ్చునకు ఒకటి రెండుదాహరణలు.

"శ్రీవేంకటేశ్వరుడు శ్రీపతియు నితఁడె
పావనపు వైకుంఠపతియును నితఁ డె
భాగవతములోఁ జెప్పె బలరాము తీర్థయాత్ర
నాగమోక్తమైన దైవ మాతం డితఁ డె
బాగుగా బ్రహ్మాండ పురాణ పద్ధతి యాతఁ డితఁ డె
యోగమై వామన పురాణోక్త దైవ మీతఁ డే
వెలయ సప్తఋషులు వెదకి ప్రదక్షిణము
లలరఁ జేసిన దేవుఁ డాతఁ డితఁ డె
నెలవై కోనేటి పొంత నిత్యముఁ గుమారస్వామి
కలిమిఁ దపము సేసి కన్నదేవుఁ డితండె" ॥శ్రీవేంక॥

-తాళ్లపాక సంకీర్తనలు నం.6609ఎ,(కాగితపు వ్రాతప్రతి),పుట౪౨ యస్.వి.యు.ఓ.రీ.ఇ.లై.

"శ్రీనివాస! జగదేక నాయక! ఆశ్రితకల్పతరువ!"

ఇత్యాది కీర్తనలోని క్రింది పంక్తులు వేంకటాచల మాహాత్మ్య గాథా స్ఫోరకములు.

"తొండమాం జక్రవర్తిపై శేసిన దయ శేయుమయ్య!"
కురువనంబిగారి మీద నుంచిన కూర్మి నాపై నుంచుమయ్య"
-నం 6609 ఎ, ౪౨ పుట.

"కురువనంబి తిరుమల కురువనంబి నీ
చరణములే కొలిచి బ్రదికె కిరీటము గల రాజు"
(మఱియు ఈ కీర్తన యంతము కురువనంబి భక్తిని ప్రశంసించుచున్నది.)
-నం. 6609 ఎ,౧౩౪, ౧౩౫పుటలు.

పై యుదాహరణలనుబట్టి అన్నమాచార్యుడు వరాహ, బ్రహ్మాండ, వామనాది వివిధ పురాణములయందలి వేంకటాద్రి మాహాత్మ్య సంబంధి కథాంశములను సమన్వయించి, సంస్కృతమున నొక గ్రంథమును రచించెనని నిశ్చయింపవచ్చును. చిన్నన్న రచించిన పై ద్విపద పంక్తిలోని 'అంతయును' అనుమాట ఇందుకు ఉపబలకముగా నున్నది. ప్రకృతము లభించు సంస్కృత వేంకటాచల మాహాత్మ్య గ్రంథము అన్నమాచార్యుని రచనయే యని నిరూపించుటకు తగిన ఆధారములు లేవు.

ఈ వేంకటాచల మాహాత్మ్య సంబంధి పౌరాణిక కథాంశములు 'శ్రీ వేంకటేశ సుప్రభాత' రచయిత కాలము (క్రీ.శ. 1361-1453) నాటికే[6] అవిరళ ప్రచారము నొందియుండిన వనుటకు ఈ క్రింది శ్లోకములు సాక్ష్యములు.

"బ్రహ్మాదయ స్సురవరా స్స మహర్షయస్తే
సంత స్సనందన ముఖా స్త్వథ యోగివర్యాః
ధామాంతికే తవ హి మంగళ వస్తు హస్తాః
శ్రీ వేంకటాచలపతే! తవ సుప్రభాతమ్ ॥
-శ్రీ వేంకటేశ్వర సుప్రభాతము, 27 శ్లోకము.

శ్లోక భావము వేంకటాచల మాహాత్మ్య గ్రంథమున గల వరాహ పురాణ ప్రథమ భాగమందలి 46వ అధ్యాయములోని 'బ్రహ్మాది దేవతల వేంకటేశ్వరమందిర ప్రవేశ' కథాంశమును సూచించుచున్నది.[7]

"శ్రీ వైకుంఠ విరక్తాయ స్వామి పుష్కరిణీతటే ।
రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళమ్" ॥
- మంగళమ్. 12 శ్లోకము.

"శ్రీ వేంకటేశ్వరుడు వైకుంఠమునందలి విరక్తితో స్వామి పుష్కరిణీ తీరమున లక్ష్మీసహితుడై విహరించుచున్నాడు" అను ఈ శ్లోకభావము వేంకటాచల మాహాత్మ్య గ్రంథమున పలుచోట్ల ప్రకటితమై యున్నది.[8]

పై రెండే గాక శ్రీ వేంకటాచల మహాత్మ్యాంతర్గత కథాంశములను ధ్వనింపజేయు శ్లోకములు 'శ్రీవేంకటేశ్వర సుప్రభాతము' న మఱి కొన్ని యున్నవి.[9]

వీటన్నిటినిబట్టి వేంకటాచల క్షేత్ర మహిమమును చాటెడి పౌరాణిక గాథలు శ్రీవేంకటేశ సుప్రభాతమునకు మున్నే ప్రచారములో నుండినవనియు, ఆకాశరాజు కొమరితను శ్రీనివాసుడు పరిణయమగుట, తొండమాన్ చక్రవర్తి వృత్తాంతము-వంటి దేశీయగాథలు, వాటితోపాటు వనుడను నిషాదుడు, కురువనంబి - వంటి స్థానికగాథలు సంస్కృతీకరింపబడి, ప్రాచీన కాలముననే ఆ యా పురాణాంతర్గతములు గావింపబడినవనియు భావింపనగును.

అట్లేర్పడిన ఆ యా పురాణ భాగములను ఆ యా కాలములలో పారాయణ, ప్రవచనములు గావించుచుండిన 'పురాణ భట్టరుల' కైవాడమువలన, క్రమముగా అందు కొన్ని ప్రక్షిప్తములు చేరుచు వచ్చినవి. అట్టి పురాణభట్టరుల కోవకు చెంది, అనుభవజ్ఞుడై, క్రీ.శ. 15వ శతాబ్ది చివరి భాగమున తిరుమలలో నివసించుచుండిన పండితుడగు పెరిండి వేంకటత్తురైవార్ చేతనో, లేక అంతకు పూర్వమే అట్టి మఱియొక పండితుని చేతనో అదివరకు విడివిడిగా నున్న ఆ యా పురాణభాగము లన్నియు 'శ్రీ వేంకటాచల మాహాత్మ్య' (తిరువేంకట మాహాత్మ్య)మను పేర ఒకే గ్రంథముగా తొలుదొల్త రూపొందింపబడిన వని చెప్పదగును.

**ప్రశస్తి ప్రచారములు :**

క్రీ.శ.16వ శతాబ్ది చతుర్థ దశకము (క్రీ.శ.1540) నుండి వేంకటేశ్వరస్వామి వైభవముతోపాటు, 'వేంకటాచల మాహాత్మ్య గ్రంథ' వైభవముకూడ మిక్కిలిగా పెంపొందిన దనుటకు శాసనాధారములుగలవు.[10] వేంకటేశ్వరుని సన్నిధికి వేర్వేరు ఉభయములను, కైంకర్యములను, సేవలను ఏర్పాటుచేయు దాతలు వేంకటాచల మాహాత్మ్య పాఠకులకు దక్షిణలను, ప్రసాదములలో భాగములను కేటాయించుచుండిరి. మఱి కొందరు భక్తులు వేంకటాచల మాహాత్మ్యము చదివెడి వారికే గాక, వినెడివారికి సైతము చందన తాంబూలాదులు సమర్పించు ఏర్పాటులు గావించుచుండిరి. ఇంకను కొందరు నూతనముగా స్వామివారి సన్నిధిని తిరుమంజన వేళలో ప్రతిదినము వేంకటాచల మాహాత్మ్య పారాయణము జరుగునటుల తత్పాఠకులకు సంవత్సరపు జీతముల నేర్పాటు చేయుచుండిరి. ఇట్టి వేంకటాచల మాహాత్మ్య పారాయణ నిత్యసేవలు తిరుమల యందేగాక, తిరుపతిలో శ్రీగోవిందరాజస్వామివారి సన్నిధియందును, తిరుచానూరులో వరద రాజ పెరుమాళ్ సన్నిధిలోను, అచ్యుతరాయపురము నందలి అచ్యుత పెరుమాళ్ సన్నిధియందును ఏర్పాటు చేయబడుచుండినవి. ఈ చెప్పిన కైంకర్యపరులలో దేవదాసీలు మొదలుకొని సంపన్నులైన వైశ్యులు, రాజ బంధువులు, రాజన్యులు మొదలగు పలు తెరగులవారు గలరు. వీరి కైంకర్యములు క్రీ.శ.16వ శతాబ్ది యుత్తరార్ధము నుండి వేంకటాచల మాహాత్మ్యమున కేర్పడిన ప్రశస్తి, ప్రచారములకు ప్రవిమల నిదర్శనములు.

**వేంకటాచల మాహాత్మ్యము, పూర్వానువాదములు :**

'సంస్కృత వేంకటాచల మాహాత్మ్య గ్రంథము'నకు 16వ శతాబ్ది ఉత్తరార్థములోనే ఆంధ్రీకరణముకూడ ఆరంభమైనది.తెనాలి రామకృష్ణుని అల్లుడును, చతుర్వాటికా మాహాత్మ్యా ద్యనేకమాహాత్మ్య గ్రంథ రచయితయునైన లింగమకుంట రామకవి (కీ.శ. 1520-1580)[11] వేంకటాచల మాహాత్మ్యానువాదకులలో ప్రథముడుగా కనబడుచున్నాడు. ఈతడు రచించిన 'వేంకటాచల మాహాత్మ్యము'[13] నేటికి తెలియవచ్చినంతలో మొట్టమొదటిది. విజయనగర రాజవంశీయుల కోవలోని వాడగు పూసపాటి కొండరాజు[13] (క్రీ.శ.16వ శతాబ్ది చివరి భాగము) రచించిన 'వేంకటాచలమాహాత్మ్యము[14] రెండవది. శ్రేష్ఠలూరి వేంకటార్యుడు (క్రీ.శ.17వ శతాబ్ద్యారంభము)[15] రచించిన 'శ్రీనివాస విలాస సేవధి' (ద్విపద) మూడవది. మొదటి రెండును నే డలభ్యములు. కావున మూడవదగు శ్రీనివాస విలాస సేవధియే ఉన్నవాటిలో ప్రాచీనమైనది. దీనికి తరవాతి కాలమున (క్రీ.శ. 18వ శతాబ్ది చివరి పాదమున) వెలువడిన రచన తరిగొండ వెంగమాంబ వేంకటాచల మాహాత్మ్యము.

వెంగమాంబకు పూర్వమున వెలువడిన వేంకటాచల మాహాత్మ్యానువాదములు మూడింటిలో మొదటి రెండలభ్యములు గావున వాటి ప్రభావము ఈమె కృతిపై నెట్టిదో తెలియరాదు. వెంగమరచనకు, శ్రీనివాస విలాస సేవధికి కథా సంవిధానము, రచనా ప్రణాళిక మున్నగు విషయములో దేనియందును పోలికలేదు. కావున ఈ కవయిత్రియొక్క వేంకటాచల మాహాత్మ్యముపై పూర్వరచన యొక్క ప్రభావము మృగ్యము.

**వెంగమాంబ స్వీకరించిన మూలము :**

ఇంతకు ముందు తెలిపినట్లు (సంస్కృత వేంకటాచల మాహాత్మ్యము పంద్రెండు పురాణ భాగము సంకలన గ్రంథము.)ఆ పురాణ భాగములలో మూడిటిని వెంగమ తన కృతికి మూలముగా స్వీకరించినది. వాటి వివర మిది.

| క్రమ సంఖ్య | సంస్కృత మూలము | వెంగమ వేంకటాచల మాహాత్మ్యము |
|---|---|---|
| 1. | వరాహ పురాణ ప్రథమ | మొదటి మూడాశ్వాసములు. |
| | భాగము (30 అధ్యాయములు) | చతుర్థ, |
| 2. | భవిష్యోత్తర పురాణము (14 అధ్యాయములు)* | పంచమాశ్వాసములు. |
| 3. | పద్మపురాణము (ఒక(34వ) అధ్యాయము) | షష్ఠాశ్వాసము. |

* వెంగమ భవిష్యోత్తర పురాణ భాగమందలి అధ్యాయ సంఖ్యను పదమూడని పేర్కొనినది. చూ. వేంకటాచల మాహాత్మ్యము, VIఆశ్వా; 3 పద్యము.

వేంకటాచల క్షేత్రముయొక్క మహిమనుగూర్చి ప్రస్తావించునపుడు 1) ఆదివరాహస్వామి 2) వేంకటేశ్వరుడు 3) అలమేలు మంగమ్మ- ఈ ముప్వురు దైవతములు ప్రాధాన్యము వహింతురు. ఈ ముప్వురకు, తక్షేత్ర మహిమములకు సంబంధించిన కథాంశములు ముఖ్యముగా పై మూడు పురాణ భాగములలో నెలకొనియున్నవి. తదితర పురాణ భాగముల యందును ఇంచుమించు అవే అంశములు పునరుక్తములై యున్నవి. ఉదాహరణమునకు భవిష్యోత్తర పురాణ మందలి 'శేషాచల నామ నిరూపణ వృత్తాంతము,తొండమాన్ చక్రవర్తి యుపాఖ్యానము' మున్నగు కథాంశములు బ్రహ్మాండ, బ్రహ్మపురాణములలో పునరుక్తములై యున్నవి. అట్లు పునరుక్తములుగాని వానిలో కొన్ని తీర్థములు ప్రభావ కథనములు, మఱికొన్ని ఉపాఖ్యానములును ఆ యా పురాణ భాగములలో గలవు. వాటి అన్నింటియొక్క తాత్పర్యార్థమగు, మాహాత్మ్య సందేశము' పై మూడు పురాణ భాగములలో సమగ్రముగా నిమిడియే యుండుటచే ఈ కవయిత్రిపై పురాణత్రయమునే ప్రధానముగా స్వీకరించినది.

పై మూడు పురాణముల అనువాద భాగములు ప్రత్యేక కృతులని స్ఫురింపజేయుటకై వెంగమ మొదటి విభాగమున (అనగా ప్రథమాశ్వాసా

రంభమున) వలెనే, రెండవ, మూడవ విభాగముల యందును (అనగా చతుర్థ, షష్ఠ - ఆశ్వాసారంభముల యందును) ఇష్టదేవతా ప్రార్థనలో గూడిన'కృత్యాది'ని వేర్వేర సంగ్రహముగా సమకూర్చి యున్నది.

ఇట్లొకవంక పృథక్త్వమును నిరూపించినను, ఇంకొకవంక ఈ మహాత్మ్య ప్రబంధముయొక్క 'ఏకాకృతి'ని ఈమె ఈ క్రింది యంశముల ద్వారా పరిపోషించి భాసింపజేసినది.

1) ఈ గ్రంథావతారికలో

i) "శ్రీవేంకటాద్రి మహిమ మవనిపై రమ్య పద్య కావ్యం బొనర్చి"
- Iఆశ్వా; 23 ప.

ii) "అంకితంబుగా నా యొనర్పం బూనిన వేంకటాచల
మాహాత్మ్యంబునకుఁ గథాక్రమం బెట్టి దనిన." -I ఆశ్వా; 31 ప.

అని కంఠోక్తిగా ఏకనామధేయముతో గ్రంథమంతటిని పేర్కొనియుండుట.

2) చతుర్థాశ్వాస (భవిష్యోత్తర పురాణ), షష్ఠాశ్వాస(వీర లక్ష్మీ విలాస) ప్రారంభములయందలి కృత్యాదులలో అంతకుమునుపటి ఆశ్వాసముయొక్క కథాసూత్రమును అందిపుచ్చుకొని తరువాతి కథతో సంబంధము కలిపి, 'అతుకు' కనబడని రీతిగా ఏకసూత్రతను చక్కగా సాధించి యుండుట.

i) "ఆ కథాక్రమం బెట్లన్న వినుఁడు
శ్రీకర నైమిశాటవిని శిష్టమునుల్ పరమాద్భుతంబుగాఁ
బ్రాకట భక్తిమీఱఁగ వరాహ పురాణము విన్నమీఁద సు
శ్లోకుని సూతునే మఱలఁ జూచుచు వేంకటశైల మిద్ధరన్
జోఁకగ నే యుగంబునను శోభితమై పొగడొందు జెప్పవే."
- VI ఆశ్వా; 8,9 ప.

ii) "తత్కథా ప్రారంభం బెట్టిదనిన భవిష్యోత్తర పురాణంబునం దొప్పుచున్న శ్రీనివాసస్వామి చిత్రచారిత్రంబులు విని శౌనకాది మహామునులు మఱియు నొక్కనాడు ప్రాతఃకాలంబున స్నాన సంధ్యాద్యనుష్ఠానానంతరంబున సూతుం జూచి యిటనిరి.

ఓసూత ! శ్రీశ్రీనివాసుని చరితంబు
లెన్ని విన్నను తృప్తి నెనయ దాత్మ
కావున నీవు తత్కథలను క్రమ్మఱ
మనుజ వేషమున రమావిభుండు
ధీరుఁడై పద్మావతిం బెండ్లియాడిన
వెనుక మహాలక్ష్మి విశ్వసించి
హరి వక్షమందుండ కరిగి కొల్లాపుర
మందున్న పిమ్మట నబ్ధిసుతను
దలఁచునో లేక శౌరి నిర్దయతచేత
దలఁప కాకాశపతిసుతన్ దాను గూడి
మఱచి యూరకె యుండెనో మఱల లక్ష్మి
నెదను జేర్చెనొ లేదా? మాకెఱుఁగఁజెపుమ."

- VIఆశ్వా; 7,8 ప.

3) ఇందలి ఆశ్వాసాంత గద్యలలో "శ్రీవేంకటాచలమాహాత్మ్యం బను వరాహ పురాణంబునందు", "శ్రీ వేంకటాచల మాహాత్మ్యం బను భవిష్యోత్తర పురాణంబునందు", "శ్రీవేంకటాచల మాహాత్మ్యంబను వీరలక్ష్మీ విలాసంబునందు" - అని మూడు విభాగములయందలి ఆశ్వాసముల కన్నింటికి శ్రీవేంకటాచల మాహాత్మ్యాంతర్భాగతను స్పష్టముగా ప్రవచించియుండుట.

4) ఆశ్వాస సంఖ్యను మూడు విభాగములకు కలిపి వరుసగా పరిగణించుట.

ఇట్లు ఈ మాహాత్మ్య కావ్య కథా సంవిధానమున ఈ కవయిత్రి అనిదం పూర్వ మగు వస్త్వైక్యమును "భాస్వద్భక్తి యోగక్రమ శ్రీరమ్యం బుగా"[16] పాదుకొల్పినది.

## వెంగమాంబ కృత వేంకటాచలమాహాత్మ్యము కథాసంగ్రహము :

ప్రథమాశ్వాసము: సూతుడు నైమిశారణ్యమందలి శౌనకాది మహర్షులకు తెల్పినట్లు కథ యుపక్రమింపబడినది. శ్రీరంగము, కాంచి మున్నగు ఎనిమిది స్వయంవ్యక్తస్థలములలో విశేషించి అభీష్టార్థసిద్ధిదము

వేంకటాచలము. పూర్వము శ్వేతవరాహస్వామి వైకుంఠము నుండి క్రీడాచలమును తెప్పించి, అందు స్వామి పుష్కరిణీ తీరమున శ్రీభూ నీళా సమేతుడై సౌమ్య రూపమున నెలకొనెను. ఆ శ్రీహరి ఒకనాడు విటవేషధారియై యేగి వేంకటాచలారణ్యంలో యజ్ఞమొనరించుచుండిన మునులను అనుగ్రహించారు అని చెప్పి సూతుడు, జాబాలిచే పూర్వము తాను విని యుండిన 'కుమారధార మహిమ'ను, ఆత్మారాము డను విప్రుని చరిత్రమును వివరించెను. అనంతరము వెంకటాద్రియందలి వివిధ తీర్థములు, వేర్వేరు యుగములలో వేంకటాద్రి ప్రకాశించు విధము, శ్రీరాము డాంజనేయుని ప్రార్థనమున వేంకటాచలముపై విడియుట, వైకుంఠ గుహావృత్తాంతము - వివరింపబడినవి.

ద్వితీయాశ్వాసము: రావణునిచే బాధింపబడిన దేవతలు శ్రీహరి వేంకటాద్రిపై నెలకొనియుండుటను బ్రహ్మవలన నెఱిగి అందరు అట కేగి స్వామి నారాధించుట, దశరథుడు సంతానార్థియై వేంకటాచలమునకు రావటం, శ్రీహరి వారందరికి ప్రత్యక్షమై కోరిక లొనగుట, బ్రహ్మోత్సవము- అను కథాంశము లిందు తెల్పబడినవి.

తృతీయాశ్వాసము : చక్రరాజైన (సుదర్శనుడు) శ్రీనివాసుని ఆజ్ఞానుసారము దుష్టసంహార మొనర్చి, శాంతి భద్రతలను నెలకొల్పుట, శ్రీవైష్ణవ ధర్మం, జీవబ్రహ్మ ప్రశంస, అష్టాంగ యోగములు ఇత్యాది విషయాలను సూతునివలన అనంతరము ఆ మహర్షులు వేంకటాద్రి కేగి స్వామిని సేవించిరి. మరల నైమిశారణ్యమును జేరుకొని, తమ కట్టి పవిత్ర చరిత్రమును వినిపించినందులకు సూతుని మిగుల కొనియాడు చుండిరి.

చతుర్థాశ్వాసము : సూతుడు శౌనకాదుల కిట్లు చెప్ప దొడగెను, జనకుడు శతానందునివలన వేంకటాద్రి మాహాత్మ్యమును విని, తత్పుణ్య ఫలితముగా తన కూతులకు దగిన వరులను బడసెను. వైకుంఠమందలి ప్రీతితో వేంకటాద్రిని వీడి చనిన శ్రీహరిని రప్పించుటకై నారదాదుల కావించిన ప్రయత్నములో భృగుని పాదతాడనమువలన లక్ష్మి యలిగి

కొల్హాపురి జేరినది. వేంకటేశ్వరుడు వేంకటాచలమునందలి వల్మీకములో తపము చేయ దొడగెను. స్వామి తనకు పాలను పిదుకుచుండిన గోవును గొల్లవాని గొడ్డలిబారి నుండి కాపాడు నిమిత్తమై తాను గాయము నొంది, చోళరాజును శపించెను. వకుళిమాలిక పరిచర్యలచే కోలుకొనిన పిమ్మట, వేంకటరమణు డొకనాడు వేట కేగి ఆకాశరాజుపుత్రిక యగు పద్మావతిని గాంచెను. చనవుగా మాటాడ యత్నించి యామె చెలికత్తెలచే ఱాలదెబ్బలనొంది, నివాసమును జేరెను. వేంకటనాథుని చింతాహేతువు నెఱిగి, వకుళ ఆకాశరాజు పట్టణమునకు పయనమై పోయెను.

పంచమాశ్వాసము : ఇంతలో శ్రీనివాసు డెఱుకతయై వెళ్లి ఆకాశరాజు పత్నికి ఎఱుక చెప్పి వచ్చెను. వకుళ వివాహ నిశ్చయము చేసికొని వచ్చినది. బ్రహ్మరుద్రేంద్రాది దేవతలు స్వామి పెండ్లికి సకుటుంబముగా విచ్చేసిరి. కొల్లాపురమునుండి లక్ష్మి పిలిపింపబడెను. వేంకటరమణుడు కుబేరునిచే అప్పుగైకొని వివాహ సన్నాహముల జేయించెను.నారాయణ వనమున శ్రీనివాస కల్యాణము వైభవోపేతముగా జరిగినది. ఆఱునెల లగస్త్యాశ్రమమున గడపిన పిమ్మట శ్రీనివాసుడు పద్మావతీ సమేతుడై శేషాద్రి జేరెను. అటుపిమ్మట కూర్మని వృత్తాంతము, భీముడను కులాల భక్తునకు స్వామి సాయుజ్యము నొసగుట, తొండమానునకు సారూప్య మిచ్చుట మున్నగు విషయములు తెలుపబడినవి.

షష్ఠాశ్వాసము : లక్ష్మి చెంత లేదను చింత స్వామిని పీడించు చుండెను. అందుచే శ్రీనివాసుడు కొల్లాపురము జేరి, లక్ష్మి కనబడనందున అచ్చట అగస్త్యుడు పూజించియుండిన లక్ష్మీవిగ్రహము నర్చించుచుండెను. పిమ్మట అశరీరవాణి తెల్పిన ప్రకారముగా సువర్ణముఖీ తీరమున గల సిద్ధస్థలమును జేరి, దివ్యసువర్ణకమలమును నాటి,వేంకటేశ్వరుడా పద్మముపై చూపు నిలిపి లక్ష్మీమంత్రమును జపింపదొడగెను. తపోవిఘ్నమునకై దిగివచ్చిన అచ్చరలు స్వామి సృజించిన మోహినీదేవి సౌందర్యమును గాంచి లజ్జతో మరలిపోయిరి. ఇర్వది రెండేండ్లు గడచిపోయినను స్వామివారు రాలేదని దిగులు నొందుచున్న పద్మావతిని వకుళ యూరడించుచుండెను.

పాతాళలోకమునందలి కపిలాశ్రమములోనున్న లక్ష్మి పూర్వరూపము నచ్చటనే వదలి, 'వ్యూహలక్ష్మీ' రూపమున కమలనాళము ద్వారా పైకివచ్చి స్వామియెదుట సాక్షాత్కరించెను. దేవతల, మునుల అభ్యర్థనలచే శ్రీనివాసుడు వ్యూహలక్ష్మిని వక్షమున జేర్చుకొనెను. లక్ష్మియొక్క పూర్వరూపము మఱి కొంత కాలమునకు 'వీరలక్ష్మి' యను పేరుతో అదే పద్మముపైననే, అదే కార్తీకశుద్ధపంచమీ భృగువాసర శుభదినముననే ఆవిర్భవించెను. వేంకటేశ్వరుడేతెంచి వీరలక్ష్మిని వేంకటాచలమునకు రాగోరెను. 'నేనీ శుకాశ్రమముననే యుండెదను. నేనవతరించిన యీ శుభదినమున ప్రతివత్సరము మీ పుష్పహారమును, వస్త్రమును కానుకగా బంపుడు' అని విన్నవించెను. ఆమె ఛాయాశుకునిచే నర్చింపబడుచు భక్తులకోర్కెలీ డేర్చుచుండెను.

పిమ్మట బలరామకృష్ణుల సంభాషణము, శ్రీనివాసుని బ్రహ్మాదులర్చించిన కాలక్రమము, అష్టాదశ పురాణ విభజనము, పుణ్యాత్ములు పొందెడు వివిధగతులు - వివరింపబడినవి.

**కథాకల్పన :**

పై రీతిని వెంగమాంబ పురాణత్రయమునుండి కథను స్వీకరించి ఏకసూత్రమున సంధానించుటలో తన రచనా ప్రణాళిక కనుగుణముగా కొన్ని చోటుల కథా కల్పన మొనరించినది. తొలి యైదాశ్వాసములకు తగినంత సంస్కృతమూల మున్నది. వరాహ, భవిష్యోత్తర పురాణ భాగరూపమైన ఆ మూలమును ఆశ్వాసములుగా విభజించి అనువదించుటలోనే అందు ముఖ్యముగా ఈ కవయిత్రి కవితాకౌశలము అభివ్యక్త మగుచున్నది. ఐనను ఆ భాగమునకు అవకాశ మున్నచోట్ల మనోజ్ఞరీతిని కథను కల్పించియున్నది. అట్టివానిలో ఈ క్రింది 'కపిలతీర్థోత్పత్తి కథనము' ముఖ్యమైనది.

వరాహ పురాణమున కాపిలాది నవ్తదశ తీర్థముల మాహాత్మ్యమును సూతుడు శౌనకాదులకు దెల్పు సందర్భమున కపిలతీర్థ మేర్పడిన విధము ఈ క్రింది శ్లోకములలో నిట్లున్నది.

"గిరే రధః ప్రదేశే తు కాపిలం లింగముత్తమమ్ ।
పాతాళే పూజితం పూర్వం కపిలేన మహాత్మనా ॥
కుత శ్చిత్కారణాత్తత్తు లింగం పరమపావనమ్ ।
భిత్వా తు ధరణీం తస్మా న్నిర్గతం పూజితం సురైః ॥
తల్లింగం స్థాపితం భూమౌ ప్రార్థితం సర్వదైతై ।
తదగ్రే భూమి ముద్భిద్య నిర్గతా కపిలా పురా ॥
తద్బిలం కాపిలం తీర్థం సర్వపాప ప్రణాశనమ్ ॥"

- శ్రీ వేంకటాచల మాహాత్మ్య గ్రంథః,పుట (వరాహ పురాణమ్, 40 అధ్యా.)

'పూర్వము కపిలమునిచే పాతాళలోకమున పూజింపబడిన శివలింగము ఒకానొక కారణముచే భూమిని భేదించుకొని కపిలలింగము వెలువడినది. అట్లు బయల్వెడలగా ఏర్పడిన బిలము సర్వపాప ప్రణాశనమగు కపిలతీర్థ మైనది.'

కాని పై మూలమున కపిలలింగము భూమిని భేదించుకొని వచ్చుటకు కారణము పేర్కొనబడలేదు. అట్లు పాతాళమునుండి పైకి వ్యాపించుటకు హేతువు తదర్చకుడైన కపిలుని తీవ్రతపమే యని కవయిత్రిచే మూలావిరోధముగా కల్పింపబడినది.[17] అంతేగాక ఆ లింగము వెంబడి పాతాళలోకమందలి భోగవతీనది పైకి పెల్లుబికి వచ్చినందున పరమపావనమగు కపిలతీర్థముగా పిలుబడెనని వెంగమాంబ యందులకు చక్కని కారణమును కల్పించినది.[18]

ఇట్లు మూలమును నిమిత్తీకరించుకొని తొలి యైదాశ్వాసములలో నచ్చుటచ్చుట కవయిత్రి కథలో కల్పించిన చిన్నచిన్న కల్పన లన్నియు నొక యెత్తు.షష్ఠాశ్వాసమున ఈమె కల్పించిన కల్పనలు ఇంకొక యెత్తు . కారణము ఈ షష్ఠాశ్వాసమునకు విస్తృతమగు మూలాధారము లేకుండుట. ఈ విషయమును కవయిత్రియే కంఠోక్తిగా క్రింది విధమున నుడివినది.

'.... ... .... ....

... .... ... ....

వెలయు వరాహ భవిష్యోత్తర పురాణ
ములయందు నలువది మూఁడువెన

భాసురాధ్యాయముల్ పద్య కావ్యంబుగ
మొనసి యైదాశ్వాసములు రచించి
హరికి సమర్పించి యవలఁ బద్మ పురాణ
మందు వింతగు వేంకటాద్రి విభుడు
సిరిని గూరిచి తపమును జేసినట్టి
చరితములు కొన్ని లభియింవ సంగ్రహముగ
వేఱ కల్పన కొంత గావింపవలసె."

- వేంకటాచల మాహాత్మ్యము, VIఆశ్వా; 3 పద్యము.

అనగా సంస్కృత వేంకటాచల మాహాత్మ్యాంతర్గత పద్మ పురాణ భాగమున వేరు కథాంశములే లేవని తాత్పర్యము కాదు. వేంకటేశ్వరుడు లక్ష్మినిగూర్చి తప మొనరించిన చరితాంశములను మాత్రమే ఆ పద్మపురాణ భాగమునుండి కైకొని కవయిత్రి ఆశ్వాసముగా రచింపదలంచినది. అట్లు కైకొనుటలో ఆ కథాంశములు ఆశ్వాసమునకు చాలనందున, మూలములో లేకున్నను కొంత అన్యధా కల్పన గావింపవలసి వచ్చినట్లు కవయిత్రి వెల్లడించినది.

సంస్కృత వేంకటాచల మాహాత్మ్యములో పద్మపురాణ భాగము పదునొకండు అధ్యాయములలో (24వ అధ్యాయము నుండి 34వ అధ్యాయమువరకు) దాదాపు తొమ్మిదివందల శ్లోకములలో విస్తరిల్లి యున్నది. అందులో 'వేంకటాద్రివిభుడు సిరిని గూరిచి తపమును జేసినట్టి చరితములు' నూటపదునెన్మిది శ్లోకముల పరిమితి గల పదకొండవ (34వ) అధ్యాయమున గలవు.[19] "పద్మ సరోవర మాహాత్మ్యాది కథన"మని ఈ యధ్యాయము యొక్క నామధేయము. అందలి 92 శ్లోకముల మూలము మాత్రము వెంగమ అనువాదమున 81 గద్య పద్యములుగా అవతరించియున్నది. ఈ భాగము ఆశ్వాసపరిమితిలో మూడిండ నొకవంతు మాత్రమే. తక్కిన రెండువంతుల పరిమితి ఈ కవయిత్రి స్వయముగా సృష్టించిన ఘట్టములతో దాదాపు 160 గద్య పద్యములలో వ్యాపించియున్నది. వెంగమ కల్పించిన ఆ ఘట్టముల వివర మిది.

| ఘట్టములు | గద్య పద్యముల పరిమితి | మొత్తము |
|---|---|---|
| 1. శేషాద్రివిభుని వైరాగ్యము, | 12 నుండి | |
| పద్మావతి పరామర్శ | 30 వరకు | 19 |
| 2. పద్మావతి చింత, | 74 నుండి | |
| వకుళ ఊరడింపు | 80 వరకు | 7 |
| 2. లక్ష్మీ కపిల మునుల | 81 నుండి | |
| సంభాషణ | 113 వరకు | 33 |
| 4. లక్ష్మీ వేంకటేశ్వరులు | 137 నుండి | |
| వినోదముగా సంభాషించుట | 155 వరకు | 19 |
| 5. శుకుడు సూర్యుని స్వరూపమగు | 171 నుండి | |
| జీవతత్త్వమును దెల్పుట | 180 వరకు | 10 |
| 6. వీరలక్ష్మీ పాతాళము నుండి | 181 నుండి | |
| శుకాశ్రమము చేరుట | 199 వరకు | 19 |
| 7. బలరామ కృష్ణుల | 200 నుండి | |
| సంవాదము | 209 వరకు | 10 |
| 8. i) వేర్వేరు యుగములలో | | |
| వేంకటేశ్వరుని పూజించిన వారు | | |
| ii)మోక్షమును గోరి పుణ్యకర్మము | 212 నుండి | |
| లొనర్చెడువారు పొందెడి వివిధగతులు | 244 వరకు | 33 |
| iii) వటపత్రశాయి వర్ణన | | |
| iv)శుభ మంగళము. | | |

తరిగొండ వెంగమాంబ కృతులు

పై కల్పించిన భాగములను పరికించినచో ఈ 'వీరలక్ష్మీ విలాసము' చాల భాగము స్వతంత్ర రచన యని స్పష్టమగును. ఈ యాశ్వాసమునకు కవయిత్రి పెట్టిన పేరులోనే ఆ స్వతంత్రత చక్కగా ధ్వనించుచున్నది. తన నివాసమును (విష్ణువక్షస్థలమును)భృగుడు తన్నగా ఆతనిని మందలింపక, శ్రీమహావిష్ణు వాతనిని సత్కరించి పంపినందులకు లక్ష్మి తన పతిపై నలుక బూని వైకుంఠమును వీడి కరవీరపురము (కొల్లాపురము)ను జేరినది. అట్లు వైకుంఠమును వీడి చనుటలో ఆమెయందు వ్యక్తమైన వీరత్వము ననుసరించి ఆమెకు 'వీరలక్ష్మి' యని పేరిడి, ఆ వీరలక్ష్మి చారిత్ర మిందు వర్ణింపబడుటచే కవయిత్రి దీనికి 'వీరలక్ష్మీ విలాస'మని నామకరణ మొనర్చినది.

**అనువాద విధానము :**

వేంకటాచల మాహాత్మ్యము నాంధ్రీకరించుటలో వెంగమాంబ బమ్మెర పోతనామాత్యునివలె స్వతంత్రమగు అనువాద విధానమును అనుసరించినది. పోతనవలెనే ఇతివృత్తము నెడల ఆర్ద్రమగు భక్త్యభి నివేశముతో ఆంధ్రీకరణమును కొనసాగించుటవలన ఈమె తెనిగింపు, మూలమునకు దాదాపు రెట్టింపు పరిమితి కలదిగా పరిఢవిల్లినది.

ఈ మాహాత్మ్య కావ్య రచనమున ఈ కవయిత్రి అనుసరించిన ప్రధానములగు అనువాద పద్ధతులు పరిశీలింపదగి యున్నవి.

1) మూలమును పెంపు గావించుట : ఈ రచయిత్రి మూలమునందలి ప్రధాన కథాంశములను చక్కగా, రసప్లుతముగా పెంపు గావించియున్నది. మచ్చున కొకటి రెండుదాహరణలు.

i)వరాహస్వామి హిరణ్యాక్షుని సంహరించిన పిదప, గరుడుని బంపి వైకుంఠమునుండి క్రీడాచలమును దెప్పించిన ఘట్టము. ఈ ఘట్టము మూలమున ఇరువదాఱు శ్లోకములలో నున్నది.[20] వెంగమ ఆ శ్లోకములను యథాతథముగా అనువదింపక సారాంశమును మాత్రము గ్రహించి గరుడునకు వరాహదేవునకు, గరుడునకు లక్ష్మికి చక్కని సంభాషణలను సమకూర్చి పెంపొందించియున్నది.[21] తన వికృత

రూపమును గాంచినచో లక్ష్మి నవ్వును గనుక తాను వైకుంఠమునకు రాజాలకున్నట్లు, వరాహదేవుడు గరుడుని ద్వారా చెప్పి పంపిన మాటలను వినిన లక్ష్మి యా గరుడునితో నిట్లు పల్కుచున్నది.

"నేను దనకు నెపుడు నిత్యానపాయిని
నగుచునుండు టెఱిఁగి యద్భుతముగఁ
గ్రొత్తమాటలన్నఁ గ్రోడ విగ్రహమాయ
వింత దోఁచె మదికి విహగనాథ !
తానే రూపముఁ దాల్చిన
నేనా రూపము ధరించి నిశ్చలమతినై
పూని యురంబున నుండుదు
నా నడవడి క్రొత్త ? యీ దినమున ఖగేంద్రా !
తా నిచటికి రాకుండిన
నే నచ్చటికైన వచ్చి నిజముగఁ గిటియై
యానందించు మహాత్ముని
మానిత వక్షమున మందు మహి విహగేంద్రా !
పాఠీనమై తాను బ్రళయాబ్ధిపై నీఁదు
నప్పుడు తన వక్షమందు నుంటిఁ
గూర్మరూపముఁ దాల్చికొని యబ్ధిలో మునిం
గిన యప్డు తన యంద దనరుచుంటి
నంగుష్ఠమాత్రుడై యాకుపై శయనించి,
నప్పుడు నేఁ దనయందు యుంటి
నిప్పు డెదఁ బాసి యుందునె యొప్పుకొంచు,
నిచటి పరివారములతోడ నచటి కేను
వచ్చి యాక్రోడ విగ్రహు వక్షమందు
నిలిచి యుండెద ఖగరాజ ! తలఁగ కెపుడు.
వేడు కలర భూదేవికిఁ
గ్రోడాకారంబు జూపి కులికెడు హరికిం.
గ్రీడాచల మొప్పినచోఁ
గూడుదలయ గాదె యటకుఁ గొని పొ మ్మింకన్."

- I ఆశ్వా: 64-68 ప.

వెంగమ స్వతంత్రముగా సృజించిన పై పల్కులలో లక్ష్మి హృదయముతో పాటు, ఇప్పు డెదఁ బాసియుందునె?........వచ్చి యా క్రోడ విగ్రహు వక్షమందు నిలిచియుండెద" అను వాక్యములలో ఆమె విష్ణువుయొక్క వక్షస్థలము నెడబాసిపోయి మరల చేరుట - యనెడు భవిష్యత్కథ ధ్వనించుచున్నది.

ii) మూలమున క్రీడాద్రిని మోసికొని వచ్చుచున్న వైనతేయుని గూర్చి "కాంచనప్రభః" (20 శ్లో.), "తేజోరూపః"(21శ్లో) అను రెండు విశేషణములు ప్రయుక్తము లైనవి, ఆ రెండింటి భావము తెనుగున మనోహరముగా అలంకరింపబడినది.

"కనకగిరి మీఁద నీలాద్రి గ్రాలుచుండు
కరణి హేమాంగుఁ డనఁ దగు నురగవైరి
శిరమునం గ్రీడనగమును జెలఁగు చుంద
గగన దిగ్భాగములు దివ్యకళల నెసఁగె." -Iఆశ్వా; 69 ప.

పై తేట గీతిలో కవయిత్రి కల్పించిన ఉపమ గరుడుని యుజ్జ్వల రూపమును కనులకు గట్టించుచున్నది.

భృగుని పాదతాడనముచే కుపితయై లక్ష్మి వైకుంఠమును వీగిపోయిన ఘట్టము మఱియొక యుదాహృతి. ఈ ఘట్టము సంస్కృతమున కేవలము నాలుగు శ్లోకములలో నున్నది. చూడుడు.

"తతస్తు భగవాన్ దేవ ఏకాంతే నిజమందిరే ।
సార్ధం చ రమాయాఽతిష్ఠత్త దోవాచ రమా హరిమ్ ॥ ౩౫
గచ్ఛామి దేవదేవేశ! త్యక్త్వా త్వాం జగదీశ్వరః ।
తాడితోఽసి జగన్నాథ ! ఋషిణా త్వం జగన్మయః ॥ ౩౬
మదాలింగస్థలే దేవ పాదేనైవ జగత్పతే।
కరవీరపురం రమ్యం గచ్ఛామి గరుడధ్వజ ॥ ౩౭
ఇతి ప్రేమ్ణా చ కలహం కృత్వా తు హరిణా సహ।
రమా జగామ తత్క్షేత్రం కరవీరపురాహ్వయమ్ ॥"౩౮
- శ్రీవేంకటాచల మాహాత్మ్యగ్రంథః పుట౩౩౯
(భవిష్యోత్తర పురాణమ్, 2అధ్యా.)

పై నాలుగు శ్లోకము భావము వెంగమ తెనుగు సేతలో పం(డెండు గద్యపద్యముల సంవాద సన్నివేశముగా వికసించినది.[22] భృగుడు తన్నిన వెంటనేగాక, అటు పిమ్మట ఏకాంతరమందిరమున గూర్చుండినపుడు లక్ష్మి శ్రీహరికి తీరుబడిగా అసమ్మతిని తెల్పినట్లు పై శ్లోకములందు గలదు. ఇది అస్వాభావికమని తలచి, కవయిత్రి దీనిని ఈ క్రింద పద్యమున చక్కదిద్ది, లక్ష్మియొక్క కోపమును సందర్భానుగుణముగా ఆవిష్కరించినది. చూడుడు.

" వనజాక్షు నా భృగుముని దన్నినప్పు డా
హరి వక్షమున లక్ష్మి యలరుచుండి
తన నివాసమునందుఁ దన్నిన భృగునిపై
నలుక రెట్టింపఁగ హరికి మ్రొక్కి
పలికె నిట్లని నిన్ను బ్రహ్మస్వరూపుఁడ
వని నమ్మి నీ యురంబునను నిల్చి
యిరవుగ నుంటినేఁ డీ భృగువర్యుండు
నన్నెంచకుండఁ దాఁ దన్నెఁ గనుక
యతఁడు తన్నుట సంతోష మయ్యె నీకు
నాకుఁ గోపము పుట్టి యున్నది మునీంద్రు
నేమి సేయుట కిష్ట మొక్కింత లేదు
గానఁ దపమాచరించెదఁ గమలనాభ !"- VIఆశ్వా; 120ప.

భృగుడు తన్నినప్పుడు లక్ష్మి హరి వక్షమున నుండినట్లు పై పద్యమున చెప్పుటచే ఆమె కోపమునకు మరింత బలమగు హేతువు చేకూరినది. ఈ ఘట్టమున విష్ణువునకు, లక్ష్మికి నడచిన సంభాషణలో పాతివ్రత్యభావనా పురస్సరమగు లక్ష్మియొక్క విశిష్ట వ్యక్తిత్వముతో పాటు భవిష్యత్కథాంశ సూచనకూడ ఇమిడి యుండుట రచనాగతమగు ఒకానొక విశేషము. ఈవిషయమై క్రింది పద్యములు పరికింపదగినవి.

పరపురుష పదస్పర్శం
బరుదుగ నురమందు సోఁక బాగగునే? యా
దురుప్రేమ నుండఁదగునే?

వర పాతివ్రత్య ధర్మవర్తన సెడదే?
తన్నిన విప్రుని దండన సేయక
యంపితి భయపడె నంచుఁజెప్పు
చులుకఁదనంబుగఁ జూచి ని న్నెందైన
గొల్లవాఁడైనను గొట్టఁగలఁడు
ధర నాడువారైన దట్టించి నీ మీఁద
నవ్వుచు జూళ్ళతో రువ్వఁగలరు
నిను మ్లేచ్ఛు లీ రీతి విని సడ్డసేయరు
మించి నీ గుణ మ్మాక్రమించఁగలరు
తొలుతఁ బుట్టిన నీ శాంతి తుదకు నన్ను
నిన్ను నెడఁబాపె నెందైన నిన్నుఁ జిత్త
మందుఁ బూజించుచుండెద నంతె గాని
నీ యురంబున నే నెట్లు నిల్తు నధిప!"

-VI ఆశ్వా; 129, 130 ప.

పై పద్యమందలి 'నిను మ్లేచ్ఛులీరీతి విని సడ్డసేయరు' అను వాక్యమునుబట్టి కవయిత్రి కాలమునాటి రాజకీయ పరిస్థితికూడ (ఆర్కాటు నవాబులు తిరుమల క్షేత్రముపై అధికారము వహించి యుండుట) భంగ్యంతరముగా సూచితమైనట్లు భావింపవలెను.

2)మూలమును సంక్షేపించుట: వేంకటాచల క్షేత్రముయొక్క మహిమను ప్రపంచించు నిమిత్తము ఇందు నెలకొన్న పెక్కు చిన్న, పెద్ద ఉపాఖ్యానములను అనువదించుటలోను, ఆ యా ఘట్టములందలి స్తోత్రభాగములను తెనుగు సేయుటలోను, పౌరాణిక ధోరణిలో సాగిన వర్ణనలను, పునరుక్తులను మున్నగువానిని అనువదించునెడలను ఈ కవయిత్రి వీలై నంతమేర సంక్షేపించి కావ్యోచితముగా రచించినది. ఇందులకు వరుసగా నుదాహరణలు :

i) ప్రథమాశ్వాసములోని 'కుమారధారమహిమ' యొకటి. ఇది వేంకటాచలమందలి యొక తీర్థముయొక్క ప్రభావమును చాటుటకై

ప్రసక్తమైనది: మూలమున 23 శ్లోకములలో వివరింపబడిన ఈ వృత్తాంతము [23] తెనుగున 5 గద్య పద్యములలో సంగ్రహింప బడినది.[24]

ii) తృతీయాశ్వాసమున సూతుడు మునులకు దెల్పిన శ్రీ వేంకటేశాష్టోత్తర శతనామ స్తోత్రము మూలమున వరాహ పురాణ ప్రథమ భాగములో 61 వ అధ్యాయముగా 50 శ్లోకములలో నెలకొనియున్నది. కవయిత్రి ఈ స్తోత్రముయొక్క ఉపక్రమణికను, చివరి ఫలశ్రుతిని 6 గద్య పద్యములలో తెనిగించి వేంకటేశ్వరుని 108 దివ్య నామములను మాత్రము అనువదింపక విడిచినది. యథాతథముగా పారాయణార్థము లైన ఆ నామములను తెనిగించుట అనావశ్యకమని ఆమె కవితాదృష్టికి తోచి యుండును.

iii) మూలమును సంక్షేపించిన విషయములో ద్వితీయాశ్వాసము అగ్రస్థానము వహించుచున్నది. ఈ యాశ్వాసమున పెక్కుపట్టులు కావ్యోచితమగు సంగ్రహీకరణము నొందియున్నది. అట్టి వానిలో దశరథుడు దర్శించిన వేంకటాచలవాసులగు మునుల వర్ణన యొకటి. ఇది వరాహ పురాణ ప్రథమ భాగమున 45 వ అధ్యాయమున 41 శ్లోకములలో నున్నది.[25] ఇది ఆ యా ఋషుల జపతపములను, బ్రహ్మ తపస్సును పౌరాణిక సరళిలో వర్ణించుచున్నది. అందువలన ఇందలి సారమును వెంగమ ఏడు గద్య పద్యములలో సంక్షేపించినది.[26] మొత్తము మీద ఇట్టి ఘట్టము లన్నిటియందును ఈ కవయిత్రి సంగ్రహీకరణ చాతురి ప్రతీయమాన మగుచుండును.

3) ఔచిత్య దృష్టితో మూలమును పరిహరించుట :

మూలమున అనౌచిత్యములుగా కొట్టవచ్చినట్లు గోచరించెడి కొన్ని యంశములను కవయిత్రి ఉదాత్త కావ్యకళా దృక్పథముతో పరిహరించినది. మచ్చున కొకటి రెండు దృష్టాంతములు.

i)చెలికత్తెలతో గూడి వనవిహార మొనర్చుచున్న ఆకాశరాజు కూతురగు పద్మావతికడకు త్రిలోకసంచారియైన నారదుడువచ్చి, ఆమె

చేయి చూచి సాముద్రికము చెప్పను. ఆ సందర్భమున నారదమహర్షి పల్కిన పల్కులలో ఈ క్రింది శ్లోకభాగములు నున్నవి.

"... ... ... ... ... ...
స్తనౌ పీనౌ ఘనౌ కుబ్జౌ శుభౌ తే మగ్న చూచుకౌ ౧౦౧
ఉదరం కదలీపర్ణ సదృశం నిమ్ననాభికమ్ ।
కటి స్తవ కరిధ్వంసి కటి సామ్యయుతా శుభా ॥ ౧౦౨
రంభా స్తంభ సమాకారం తవోరుయుగళం రమే ।
పృష్ఠం తే వేది వద్భాతి కిం త్వయా సుకృతం కృతమ్ ॥౧౦౩
- శ్రీవేంకటాచల మాహాత్మ్యగ్రంథః,పుట౩౫౩(భవిష్యోత్తర.6అ ధ్యా.)

బ్రహ్మమానసపుత్రుడు, దివ్యమునియు నైన నారదుడు, వేంకటేశ్వరునకు పత్ని కాబోయెడు కన్యక నుద్దేశించి, ఆమె చెలుల ముందర ఆమె స్తనములను, చనుమొనలను, నాభిని, నడుమును, ఊరువులను, శ్రోణీభాగమునుగూర్చి వర్ణించినట్లు పై శ్లోకములలో చెప్పబడియుండుట మిగుల అనుచితముగా నున్నది. పైగా నారదుడు తొలుత "హస్తం దర్శయ మే పుత్రి ! లక్షణాని వదామి తే"(92శ్లో.), "విద్ధి త్వం పితృతుల్యం మాం మనసా నిర్మలేన చ" (93 శ్లో.), 'అమ్మాయీ ! నీ చేయి చూపుము. నీ లక్షణములను తెలిపెదను. నన్ను నీ తండ్రితో సమానునిగా దలంపుము' అని పల్కినాడు. ఇట్లు నమ్మ బల్కిన నారదుని నోట హస్తసాముద్రిక లక్షణములకు మారుగా పై రీతిని అంగప్రత్యంగ వర్ణనను పలికించుట మిగుల అసమంజసము. భవిష్యోత్తర పురాణమున గల ఈ యనౌచిత్యమును గుర్తించియే వెంగమాంబ ఈ క్రింది పద్యములో ఆ యనౌచిత్యమును పరిహరించి ఉదాత్తరీతిని ఔచిత్యమును పోషించినది.

"శ్రీకరాంచితమైనట్టి రేఖ లలరి
యమ్మహాలక్ష్మి లక్షణా లన్ని చేతి
యందుఁ గన్పట్టుచున్నవి యైన నవియు
నమ్మరో ! విను చెప్పెద నవియు నిపుడు.
స్వస్తికము, పద్మమును,ఛత్రచామరాలు

యవకులిశ మత్స్య శంఖ రేఖాది లాంఛ
నంబు లలరారుచున్నవి యఖిలశుభము
లొనరు నివి చేతఁ గలకాల ముర్వి నీకు.
మఱియు నిట్లనెఁ గిసలయ మార్దవంబు
గలిగి యుండెడు నీ వామకరమునందుఁ
గాంతి నొప్పుచు నిత్యమాంగల్యరేఖ
వఱలుచున్నది చూడు భూవరకుమారి!
ఈ రేఖ లుండు బలమున
నారాయణుఁ డెలమి నీకు నాథుం డగు నీ
కోరిక ఫలియించును పో
శ్రీరామామణిగ నుండు చెలఁగుచు నమ్మా!"

- VIఆశ్వా; 241-244 ప.

ii) ఇట్టిదే మఱియొకటి. పద్మపురాణములో పద్మసరస్సునుండి లక్ష్మి యావిర్భవించిన ఘట్టమున గలదు.

"... ... ... ... ...
విస్మితా స్సస్మితా స్సర్వే దేవా స్త స్థశ్చ సస్పృహాః ॥
దైతేయా దానవా శ్చాపి నాగా పాతాళవాసినః ।
సాభిలాషా రమాం వీక్ష్య స్థితా మదనమోహితాః ॥
మామాశ్రయే న్మామాశ్రయే త్ప్రత్యేకం మేనిరే హృది ।
ఇతి తేషు స్మర త్స్వేవ దేవదానవ భోగిషు ॥

-శ్రీ వేంకటాచల మాహాత్మ్య గ్రంథః పుట౧౪౮ (పద్మపురాణమ్, 11 అధ్యా.)

లక్ష్మిని గాంచి దేవతలు విస్మితులై, నస్మితులై కోరికలు గలవారైరట! దైతేయులు, దానవులు, నాగులు సాభిలాషులై చూచుచు, మదనమోహితులై 'నన్నాశ్రయించును, నన్నాశ్రయించును" అని ఎవరిమట్టుకు వారు మనస్సులో అనుకొనిరట ! కవయిత్రి ఈ యనౌచిత్యమును పరిహరించి, లక్ష్మ్యావిర్భావ ఘట్టమును ఉదాత్తరమణీయముగా దిద్దితీర్చినది.

4) అన్యపురాణ కథాంశములను చేర్చుట : వెంగమాంబ ఈ కృతిని సంతరించుటలో కొన్ని పట్టుల ఇతర పురాణ భాగముల నుండి వలసిన కథాంశములను స్వీకరించి ఈ కావ్యమందలి కథకు సమగ్రతను, స్పష్టతను సమకూర్చియున్నది. చతుర్థాశ్వాసము నందలి తొండమానుని యుదంత మిందుల కొక నిదర్శనము. ఇది భవిష్యోత్తర పురాణమున మూడు శ్లోకములలో మిగుల సంగ్రహముగా నున్నది.[27]

ఆ మూడు శ్లోకములలో తొండమానుడు ఆకాశరాజు సోదరుడనియు, తొండమండలమును స్వర్గతుల్యముగ పాలించుచుండెననియు మాత్రమే తెల్పబడినది. ఆకాశరాజునకు తమ్ముడుగనేగాక, వేంకటాచల క్షేత్రమున స్వామివారికి ఆలయనిర్మాణము గావించిన పరమభక్తుడుగా, భగవంతునితో సారూప్యము నొందిన ధన్యజీవిగా తొండమాన్ చక్రవర్తికి ఈ మాహాత్మ్యకథలో మిగుల ప్రాముఖ్యము గలదు. ఈ ప్రాముఖ్యమును గమనించియే వెంగమ, సుధర్మునకు నాగకన్యయందు జన్మించిన "చక్రవర్తి" యొక్క వృత్తాంతముగా బ్రహ్మాండ పురాణమున విపులముగానున్న ఆ గాథనుండి[28] అనేకాంశములను పరిగ్రహించి ఈతని చరిత్రమును పండ్రెండు గద్య పద్యములలో ప్రకాశవంతముగా పరిపోషించినది.[29]

ఇంకొక నిదర్శనము. ఆఱవ ఆశ్వాసమందు గల 'శుకమార్తాండ సంవాదము'లో కవయిత్రి వాసిష్ఠ రామాయణమునుండి గ్రహించిన యొక కథాంశమును సముచితరీతిని జత గూర్చినది. పద్మపురాణ మూలమున శుకుడు సూర్యమండలమున బడి పోవుచుండగా సూర్యభగవాను డాతనిని నిల్పి 'బ్రహ్మచారి వగు నీవు పితౄణమును దీర్చి మఱి యేగవలసిన'దని కోరును. వెంటనే శుకుడు మార్తాండుని మాట కెదురాడక, తన ఛాయనే పుత్రునిగా సృజించి యేగును.[30]

వెంగమ అనువాదములో శుకుడు సూర్యుని పల్కులకు ప్రత్యుత్తర మొసగి, కొంతసేపు సంభాషించినట్లు గలదు. శుకుడు సూర్యున కొసగిన సమాధాన సార మిది. 'వేదోక్తములైన కర్మ లాచరణీ

యములే. ఐనను దేహము జలబుద్బుదమువలె అనిత్యమై నందున ముముక్షుం డైనవాడు కర్మారణ్యంబునం బ్రవేశింపడు. ఇంతకుముందు నే నీ విషయమై మా తండ్రి యగు వ్యాసు నడుగగా, ఆయన నన్ను జనకమహీపతి దగ్గరకు బంపెను. ఆ మిథిలేశుడు విజ్ఞానమబ్బుటకై చతురాశ్రమములు నడిపింపవలెను. జన్మాంతర వాసనవలన సదమల విజ్ఞాన ముదయించినపుడు వర్ణాశ్రమాతీతుడగుటయే విహితధర్మము - అని నాకు ఉపదేశించెను.'

పై పంక్తులలో తెల్పిన ప్రకారముగ జనకుని కడకేగి సందేహ నివృత్తి గావించుకొనిన యుదంతము వాసిష్ఠ రామాయణమున విశ్వామిత్రునిచే శ్రీరామునకు చెప్పబడినది.[31] ఆ కథాంశము నిచట పొందుపరచుట ద్వారా కవయిత్రి శుకుని సుజ్ఞానవేతృత్వమును చక్కగా ప్రకటించినది.

5) కథాక్రమములో మార్పు గావించుట: వెంగమాంబ యీ కృతిలో అట నట కథాక్రమమును వెనుక ముందులుగ మార్చి కావ్యౌచితముగా కథానూత్రమును క్రమపరచి అనువదించినది. మచ్చునకుగా ఒక యుదాహరణము. భవిష్యోత్తర పురాణమున శ్రీనివాసుడు వేట కేగి ఒకానొక కన్యను జూచినటుల సూతుడు మహర్షులతో జెప్పను. అపుడా మహర్షులు "సా కన్యా కస్య సంబద్ధా? కి మర్థం వనమాగతా?" 'ఏవ రా కన్య ? ఏ మా కథ? అని ప్రశ్నింతురు. అప్పుడు సూతుడు ఆకాశరాజు చరిత్రమును చెప్పుట కుపక్రమించును.[32] కవయిత్రి తెనిగింపులో ముందు ఆకాశరాజు వృత్తాంతమును దెల్పి, అటుపిమ్మట శ్రీనివాసుని వేటను, కన్యను చూచుటను తెల్పినది.[33] మూలమునందలిది కేవల పౌరాణిక పద్ధతి కాగా, అనువాదము కావ్యానుగుణమై వెలసినది. కథాంశముల నిట్లు క్రమపరచుట వెంగమకు వెన్నతో బెట్టిన విద్య.

6) ప్రసక్తాను ప్రసక్తముగ తాత్త్విక విషయములను ప్రపంచించుట: తాత్త్విక కవయిత్రి యైన వెంగమ్మ ఈ కృతిలో అనువైన చోటుల యోగవిషయములను, తాత్త్విక విశేషములను, స్వానుభవముతో

జోడించి అనువదించియున్నది. వరాహ పురాణమున 28వ (60 వ) అధ్యాయమున 30 శ్లోకములలో అష్టాంగ యోగ స్వరూపము రేఖామాత్రముగా తెల్పబడినది.[34] కవయిత్రి యీ భాగము నాధారముగా జేసికొని 84 గద్య పద్యములలో యోగాభ్యాస విశేషములను సుబోధముగా రచించి యున్నది.[35]

షష్ఠాశ్వాసమున సూర్యుడు శుకునితో 'నా స్వరూపం బగు జీవతత్త్వం బెద్ది చెప్పు' మనగా శుకమహర్షి వివరించిన సృష్టి తత్త్వ విశేషములు ఈ కవయిత్రి ఆధ్యాత్మిక విజ్ఞానమునకు సదమల నిదర్శనములు. అమూలకములగు నివి ఎనిమిది గద్య పద్యములలో విపులముగా వివరింపబడియున్నవి.36 ఆ యా స్తుతి సందర్భములందును ఆశ్వాసాద్యంత పద్యములందును ఈ కావ్యమున ఆధ్యాత్మిక ధ్వని నిండారియుండుట ఒక విశేషము.

ఇంతకు వివరించినవి గాక, ఈ కవయిత్రి రచనలో మూల మందలి పదమునో, వాక్యమునో, భావమునో యథాతథముగాగాక, సముచితముగా మార్చి తెనిగించుటవంటి చిన్న చిన్న అనువాద విశేషములు అడుగడుగున గోచరించుచున్నవి. మొత్తముమీద వెంగమాంబ వేంకటాచల మాహాత్మ్యానువాదము సర్వత్ర ఔచిత్యగుణ విలసితముగా, ఎడనెడ ఆత్మీయాంశ ఉట్టిపడుచుండునటులు మనోజ్ఞరీతిని వెలసినది.

**వర్ణనలు :**

వర్ణనలు చైతన్యవంతముగా సాగెడి కథా చిత్రమునకు 'పశ్చాద్భూమిక' వంటిది. ప్రబంధములలో నుండదగునట్టి ప్రసిద్ధ వర్ణనలు ప్రధానముగా పదునెనిమిది యని, 'వస్తు' తత్త్వము ననుసరించి అందు కొన్ని తక్కువయైనను మహాకావ్యత్వమునకు లోటు వాటిల్లదని ఆలంకారికుల యభిప్రాయము.[37]

అట్లు కావ్యమున నుండవలసినవిగా లాక్షణికులు నిర్వచించిన ప్రసిద్ధ వర్ణనలకు తన కావ్యమున నేదో యొక విధముగా గతి

కల్పించుటకు ప్రయత్నించినట్లుగాక, ఈ కవయిత్రి తాను స్వీకరించిన కథాసూత్రము ననుసరించి ఘటనపడిన వర్ణనలను స్వతంత్రముగా, సముచితముగా, సరసమనోరంజకముగా వర్ణించియున్నది.

ఈ మాహాత్మ్య ప్రబంధమున పేర్కొనదగిన అట్టి ప్రసిద్ధ వర్ణనలలో మొట్టమొదటిది వేంకటగిరిపుర వర్ణన. ఈ పుర వర్ణన ఇంచుక అపూర్వమైనది. కవయిత్రి దీనిని అవతారికలో షష్ఠ్యంతములకు ముందు ఎనిమిది గద్య పద్యములలో వర్ణించియున్నది.[38] సాధారణముగా పుర వర్ణనకు కావ్యావతారికలో ఆస్కారముండదు. అయినను ఈ కవయిత్రి అందులకు అవకాశమును కల్పించిన తీరు మిగుల ప్రశస్తమై యొప్పినది.

"... .. ... ... శ్రీవేంకటాద్రి మహిమ
మవనిపై రమ్య పద్య కావ్యం బొనర్చి
శ్రీనివాసునికే సమర్పింప నంటి
నీఁగ తోయధి దాఁటఁ బోయిన విధమున
నా స్వతంత్రత కిల బుధుల్ నవ్వి పొరె !
నవ్వినను సమ్మతం బని నన్నుఁ బ్రోచు
చున్న శ్రీవేంకటేశ్వరుఁ డున్నతముగ
నిరవు కొనియున్న వేంకటగిరి పురంబు
నిపుడు వర్ణింతు నించుక యెట్టు లనిన."

- Iఆశ్వా, 22, 23 ప

వేంకటేశ్వరు డీ కృతిపతి యగుటచేతను, తనను బ్రోచు ఇష్టదైవమగుటచేతను, ఆయనకు నెలవైన వేంకటగిరిపురమును కవయిత్రి అవతారికలో వర్ణించినదని పై పద్యములను బట్టి స్పష్టపడుచున్నది.

ఈ పురవర్ణనను తరువాతి షష్ఠ్యంతములతో ముడిపెట్టినతీరు క్రింది పద్యములలో విదితమగుచున్నది.

"అప్పురియందు దివ్యతరహాటక కుంభవిరాజమానమై
యొప్పు విమాన మధ్యమున నుత్తమ పూరుషుడై, మహాత్ముడై

యొప్పుల కుప్పయై ధర మహోన్నతుఁడై వెలుఁగొందుచుండు మా
యప్పఁడు వేంకటేశ్వరుఁ డహర్నిశముం గమలా సమేతుఁడై
అమ్మహాత్ముని చరితంబు లాదిమునులు
సంస్కృతంబునఁ జెప్పి రా సరణి నృహరి
తెలియఁ జేసిన యంతనేఁ దెనుఁగుగాను
పద్య కావ్యంబు రచియింతు భక్తి మెఱయ."

-Iఆశ్వా; 30, 31ప.

అని పలికి, కవయిత్రి షష్ఠ్యంతముల కుపక్రమించినది.

ఇక ఈ వర్ణన అమూలకము, స్వకపోల కల్పితము, వెంగమాంబ స్వానుభవజనితము. ఎత్తుగడలోనే వేంకటాచల పట్టణము యొక్క సమగ్రదృశ్యమును చలనచిత్రమునందు వోలె పఠితల మనోనేత్రములకు గోచరింప జేయుచున్న ఈ క్రింద పద్య మొక చక్కని దృష్టాంతము.

"ఘన గోపురములు ప్రాకారమంటపములు
తేరులు సత్పుణ్య తీర్థములును
కమలాప్త కిరణ సంకలితంబులై ప్రకా
శించుచుండెడు హేమశిఖరములును
పావన పరివార దేవాలయంబులు
మహిమ నొప్పు విరక్త మఠవరములు
రంగదుత్తుంగ మాతంగ తురంగముల్
కొమరారు బహుసాధు గోగణములు
ముద్దుగాఁ బల్కు శుకపికములును నీల
కంఠములును మరాళసంఘములు మఱియు
ఫలవనంబులు తులసికాదళ సుమములు
క్రిక్కిఱిసి యుండు వేంకటగిరిని నెపుడు." -Iఆశ్వా; 24ప.

అటుపిమ్మట సీసపద్యమున ప్రబంధ కవుల వర్ణనలలో వలెనే ఇందును చాతుర్వర్ణ్యము క్రమానుసారముగ వర్ణింపబడినను, తేరువీథులు, శృంగారవనములు, పంకజాకరములు, స్వామి పుష్కరిణి, అందు స్నానమాడు వివిధ దేశాగత జనులు, వారలు వేంకటదేవునకు

సమస్త వస్తువులు సమర్పించి సంతోషముతో ఆడుచు పాడుచుండుట, ఆ వేంకటాఖ్యపురమున ఎల్లయెడల వివిధ పుష్పములు, మృగమదము, పునుగుతైలము మున్నగువాటి పరిమళములు అలరుచుండుట-ఇత్యాది వర్ణనాంశములు మాత్రము కవయిత్రి స్వానుభవజనితములు, సహజములునై విలసిల్లుచున్నవి.

ఈ మాహాత్మ్య కావ్యమందలి వర్ణనల నన్నిటిని i) ప్రకృతి వర్ణనలు ii) ఆకృతి వర్ణనలు iii) సంకీర్ణ వర్ణనలు అని స్థూలముగా ముత్తెరగుల వింగడింపవచ్చును. కావ్యారంభమున గల నైమిశారణ్య వర్ణన (I ఆశ్వా; 38-39 ప.), వైకుంఠమునుండి తేబడిన క్రీడాచల వర్ణన ( I ఆశ్వా; 70 ప.), ఆయా సందర్భములలో ప్రసక్తములైన వేంకటాచల వర్ణనలు, అట్లే స్వామి పుష్కరిణి వర్ణనలు, వసంతఋతు వర్ణనము, పద్మావతి వనవిహార వర్ణనము (VI ఆశ్వా; 222-234ప.) సూర్యాస్తమయ చంద్రోదయ సూర్యోదయ వర్ణనలు (Vఆశ్వా; 167-194 ప.), శ్రీనివాసుని తపోభంగమునకై రంభాదులు విహరించిన తీరు (IV ఆశ్వా; 56-63 ప.)- ఇత్యాదు లన్నియు వర్ణింపబడిన విషయముయొక్క ప్రాచుర్యమును బట్టి ప్రకృతి వర్ణనలుగా పరిగణింపబడినవి.

వెంగమ ప్రకృతి వర్ణనా నైపుణ్యమునకు నిదర్శనముగా పంచమాశ్వాసమున గల సూర్యాస్తమయ, చంద్రోదయ, సూర్యోదయ వర్ణనల ఘట్టము తిలకింప దగినది. దాదాపు ముప్పది గద్య పద్యములలో విస్తరించియున్న ఆ ఘట్టమునుండి మచ్చుతునకలుగా కొన్ని పద్యములు.

"అబ్జబాంధవుఁ డిట్టు లపరాబ్ధిఁ గ్రుంకఁగ
నవు డహిగిరి నుండునట్టి లక్ష్మి
మొదలైన సతులను ముచ్చటగాఁ జూడ
హేమాంబరము ధరియించి పద్మ
రాగ భూషణములు రక్తచందనమును
బసుపు కుంకుమ దాల్చి భక్తి మెఱయఁ
బశ్చిమాశాకాంత పైనమై వచ్చెనో
యనఁగ సంధ్యారాగ మ౯శయిల్లె

నందుచేఁ బార్వతీ ప్రముఖాబ్జముఖుల
మణుల భూషణముల రక్తిమములు మించెఁ
బక్షు లా రత్నములు చూచి ఫలము లనుచు
మెక్కుటకుఁ బొంచు గతిఁ జెట్లమీద వ్రాలె." -V ఆశ్వా; 169 ప.

పై పద్యమున సంధ్యారాగమును పశ్చిమ దిశాకాంతగా నూహించుటచే ఉత్ప్రేక్షాలంకారము, ఆ సంధ్యారాగముచే ఎఱ్ఱబడిన అభరణములయందలి మణులను గాంచిన పక్షులు ఫలములని భ్రాంతివొందినవని చెప్పుటచే భ్రాంతిమదలంకారము చక్కగా కుదిరియున్నవి.

అటుపిమ్మటి నక్షత్రోదయ మీక్రింది తేటగీతిలో ఉదాత్తమగు ఉపమచే అలంకరింపబడినది.

"విపుల నీలాంబరము నిండ విమలమౌక్తి
కముల గుమి గూర్చి శేషనగంబు పైనఁ
గట్టు నటువంటి చందువా కరణిఁ దార
కంబు లంత నభంబునఁ గ్రాలె నపుడు." -V ఆశ్వా; 17ప.

ఈ క్రిందిది చంద్రోదయ వర్ణనము.

"జలధి నుప్పొంగించి జలరుహపంక్తుల
నీక్షించి నోళ్ల మూయించి మించి
కుముదసంతతులను బ్రమదంబు నొందించి
తొలఁగక శుభ్రకాంతులను బెంచి
విరహుల నలయించి విరసము ల్గలిగించి
చక్రవాకుల వేడ్క లాక్రమించి
చీఁకటిఁ గబళించి చిగురుటాకుల దీప
ములమాడ్కి వెల్గించి మొనసి మించి
చలువ చీరలు సానుదేశముల నిండఁ
బఱచినటువలె వెన్నెల బ్రబలఁ జేసి
పూర్వ దిక్కాంత నీక్షింపఁ బొసఁగు కరణి
సరగ వచ్చుచు నుండె నా చంద్రుఁ డంత." -V ఆశ్వా; 171 ప.

పై పద్యమందలి అనమాపక క్రియలు చంద్రోదయమువలన గలుగు ఫలితములను క్రమానుసారముగ వాకొనుచున్నవి. (చిగురుటాకుల) దీపములు, చలువచీరలు - అను ఉపమానములు సహృదయాహ్లాద కారులుగా ఘటింపబడినవి.

ఇఁక సూర్యోదయ వర్ణన మిది.

"పసపు సున్నము బంగరుపళ్లెరాన
నీటితోఁ గల్పి చక్రికి నెమ్మి యార
తియు నొసంగుటకై ఛాయదేవి తెచ్చె
ననఁగ నరుణోదయం బయ్యె నంత కింత.
కలకల ధ్వను లెసఁగ ఖగంబు లెల్లఁ
జక్రి పెండ్లికి రమ్మంచు సరవిగాను
బొసఁగ దిగ్దేవతలఁ బిల్వఁబోవు నటులఁ
జెలఁగి కూయుచు నెల్ల దిక్కులకుఁ బాతె."

- V ఆశ్వా; 185, 192 ప.

పై రెండు గీత పద్యములందలి యుత్ప్రేక్షలు ఈ కవయిత్రి యొక్క భావనాశక్తికి, కాళిదాసునివలె ప్రవర్తమాన కథాంశ సన్నిహితముగా, కమనీయముగా ప్రకృతి వర్ణనలను కూర్చు నేర్పునకు నిర్మల నిదర్శనములై యున్నవి.

రెండవ తెగకు చెందిన 'ఆకృతి వర్ణనల'లో వేంకటేశ్వరుడు భక్తులయెడ కరుణించి సాక్షాత్కరించిన సందర్భములందలి దివ్య స్వరూప వర్ణనలు, ఆ యా భక్తులు తన్మయులై స్వామిని స్తుతించిన సన్నివేశములు, మఱికొన్ని మనోహర స్వరూపవర్ణనలు పేర్కొన దగినవి. వెంగమాంబ సృష్టించిన ఆకృతివర్ణనలలో బ్రహ్మ ధరించిన ఈ క్రింది ధేనుస్వరూప వర్ణన ఆసేచనకమై మంగళకరముగా వెలుగొందుచున్నది.

"కపిల వర్ణంబుతోఁ గర మొప్పు దేహంబు
మంగళకరమైన శృంగములును
కాటుక కనులు సింగారంపుఁ జెవులును
నల్లనై ఘుమసెడు నాసికయును

గురుతరకంఠంబు గోపుర ముదరంబు
తగు దీర్ఘవాలంబు తళ్కుచూపు
ద్విరదతుండములట్ల దీపించు తొడలును
పూర్ణకలశాభమై పొసఁగు పొదుగు

బటువులైనట్టి కదళికాఫలములట్ల
నునుపుగా నొప్పు నాల్గు చన్నులును కలిగి
క్షీరవారిధిలోఁ బుట్టి చెలఁగినట్టి
కామధేనువువలె లక్ష్మి కడకు వచ్చె" - IVఆశ్వా; 148 ప.

ఈ మహాకవయిత్రి సృజించిన పై 'గోపిదేవి' తెలుగు సాహిత్య మున్నంతకాలము అద్వితీయముగా విరాజిల్లుచుండగలదు.

తరిగొండ కవయిత్రియొక్క అపూర్వభావుకతను వెలార్చెడి ఆకృతి వర్ణనలలో ఈక్రింది వటపత్రశాయి వర్ణన అనుపమోదాహృతి.

"పటు తరంగాహతిన్ వటపత్ర మటు నిటు
ఉయ్యాలవలె నూఁగుచుండఁ గాను
జిరజిర నెగిరెడు శీకరమాలిక
లుయ్యేల చేరుల ట్లొప్పఁగాను
ఫేనంబు చుట్టు గప్పి విశాలమయ్యది
యుయ్యేల తెరవలె నుండఁగాను
ధ్రువమండలం బడ్డ దూలంబుకై వడి
నుయ్యేల చేర్లతో నొలయఁగాను
పరమపదకాంతు లుప్పొంగి పద్మరాగ
ముఖ్యమణి జాలములరీతి ముద్దుగుల్క
చెండ్లవలెఁ జూడ్కి కెదురుగఁ జెలఁగ దానిఁ
జూచుచును బాలుఁ డాత్మలోఁ జొక్కుచుండ.
బాలకుండు దానిఁబట్ట నుద్యుక్తుఁడై
మురిసి మురిసి కరము మొరసి సాచి
పట్టికొనుదు ననుచు నట్టిట్టు జునుఁగుచు
నుబ్బి బాల్యలీల నొప్పుచుండు.

ఘనపద్మజాండకోటులఁ
దన సూక్ష్మోదరమునందు దాఁచి యెలమితోన్
వనరాశి మీఁదఁ దేలుచు
నొనరఁగ డోలోత్సవంబు నొంది సుఖించున్."

-VIఆశ్వా;243-245 ప.

పై పద్యములయందలి డోలోత్సవ వర్ణన తాళ్లపాక అన్నమాచార్యుని "అలర జంచలమైన ఆత్మలందుండనీ అలవాటు సేసె నీ వుయ్యాలా" (చూ. అధ్యాత్మ సంకీర్తనలు XIవ సంపుటము, పుట 216)అను సంకీర్తనను జ్ఞాపకపరచుచున్నది.

ఇక మూడవ తెగకు జెందిన 'సంకీర్ణవర్ణనలు' తొలి రెండిటి కన్న విపులతరములు; బహువిషయ గుంఫితములు. వాటిలో స్వామి బ్రహ్మోత్సవ వర్ణన(IIఆశ్వా;107-122 ప.) చక్రరాజు దిగ్విజయము (IIIఆశ్వా; 2-50 ప.), శ్రీనివాసుని వివాహము (Vఆశ్వా; 81-243 వ.), వసుదాన తొండమానుల యుద్ధము (Vఆశ్వా; 266-268 వ.) మున్నగునవి ముఖ్యములు.

పై సంకీర్ణ వర్ణనలలోనేగాక, ఈ కావ్యమునందలి వర్ణన లన్నింటిలోను అన్నివిధముల అగ్రగణ్యమైనవి రెండు. అందొకటి స్వామి బ్రహ్మోత్సవము. రెండవది పద్మావతీ శ్రీనివాస కల్యాణము. ఈ రెండు వర్ణనలు మూలములో నున్నను వెంగమ వాటి భావమును నిమిత్తమాత్రముగా గైకొని, ఆ రెంటిని మిగుల దేశీయముగా, స్వాభావికముగా, స్వతంత్రముగా పునఃసృష్టి గావించినది. బ్రహ్మోత్సవము మూలమున 68 శ్లోకములలో నుండగా[39] కవయిత్రి తత్సారమును స్వేచ్ఛగా స్వీకరించి, వలసిన పట్టులందు స్వేచ్ఛగా, రమణీయముగా పెంపొందించి మన కన్నుల యెదుట నిల్పినది. ఈ యుత్సవములలో ముఖ్యగణ్యమైన రథోత్సవము మూలమున ఆఱు చిన్న శ్లోకములలో ముక్తసరిగా చెప్పబడినది. ఆ శ్లోకముల భావమును కవయిత్రి ఈ క్రింది పద్యమున స్వేచ్ఛగా ఆవిష్కరించినది.

"ఘనతరోన్నతముగఁ గనకాద్రి తుల్యమై
 రంగు నిగ్గుల నొప్పు రథమునందు
నెలవుగ శ్రీభూమి నీళలతోఁ గూడి
 హరి నుంచి బ్రహ్మాదు లలఘురథము
సాగించుచుండగ, సకల దిక్పాలకుల్
 గరుడ గంధర్వ కిన్నర గణములు
సిద్ధ విద్యాధరుల్ సేవింప, దేవదుం
 దుభులు మ్రోయఁగ మహాద్భుతము దనరఁ
బారిజాత సుమంబు లా బ్రహ్మరథము
పైన రంభాదు లటఁ జల్లి పాడి యాడి
కనుల పండువుగాఁ జూడఁగా ధరిత్రి
యందుఁ గల మానవులు వేంకటాద్రి మీద."

- IIఆశ్వా; 115 ప.

తదుపరి ఆనాటి భక్తజనుల ఆరాధన తత్పరతను ఆనందోత్సాహకోలాహలములను అత్యంత సహజముగా వెంగమ యీ క్రింది పద్యమున వర్ణించినది.

"పరమ భాగవతులు భక్తిమైఁ బాడుచు
 నుప్పొంగి యాడుచు నుండఁ గాను
గరములు ద్రిప్పి భోగస్త్రీలు ముందఱ
 జతలుగ నృత్యముల్ సలుపఁగాను
గ్రమముగ వందిమాగధ సూతబృందముల్
 పురుషోత్తముని కీర్తిఁ బొగడఁగాను
శిరములఁ గలశముల్ జేర్చి కొందఱు భక్తు
 లొక్కెడఁ బ్రేంఖణ ల్ద్రొక్కఁగాను
మొనసి కొందఱు గోవింద యనుచు భక్తి
పరవశత్వముచే మించి పలుకఁ గాను
రథముపై నక్షతల ననురాగయుక్తి
సతులు మేడలపై నుండి చల్లఁగాను."-IIఆశ్వా; 117 ప.

ఈ భక్తబృందముల సందడి వర్ణన యంతయు అమూలకము; కవయిత్రి స్వానుభవజనితము.

సంకీర్ణ వర్ణనలలో రెండవదగు స్వామి వివాహము ఈ మాహాత్మ్య కావ్యమునందలి మధురాతి మధుర రసఖండము. మూలమున715 శ్లోకములలో విస్తరించియున్న ఈ ఘట్టము[40] కవయిత్రి యాంధ్రీ కరణమున 163 గద్య పద్యములుగా రూపొందియున్నది. ఈ తెనిగింపు, పరిమితియందు మూలముకంటె మూడింట నొకవంతు తక్కువగ నున్నట్లు స్థూలదృష్టికి తోచుచున్నను. పరికింపగా కవయిత్రి మూలమును రేఖామాత్రముగా గైకొని మిగుల స్వేచ్ఛగా రచించెనని తెలియగలదు.

చాలమంది కవులు వివాహ వర్ణన ఘట్టములలో మంగళసూత్ర ధారణ, తలంబ్రాలు మొదలగు నొకటి రెండు ముఖ్యాంశములను విస్తరించి, వధూవరుల హావ భావ చిత్రణలచే ఆ సన్నివేశమును రంజింపజేసి కృతకృత్యు లగుచుందురు. కాని వెంగమ్మ ఈ కావ్యమున, ఆకాశరాజు శుభలేఖకు హరిద్రాలేపన చిహ్నములు సేయించుట మొదలుకొని, పెండ్లికొరకు ధనము లేదని వకుళ వరాహస్వామి కడ కేగి ఆలోచన సేయుట, బ్రహ్మ రుద్రేంద్రులు సపరివారులై కొండకు తరలి వచ్చుట, స్వామి యభ్యంగనము, ముత్తైదువుల పెండ్లి పాటలు, కులదేవతా పూజనము, కుబేరునకు వేంకటేశ్వరుడు వడ్డీ పత్రము వ్రాసి యిచ్చుట, వేంకటాచలమునుండి శ్రీశైలమువరకు బారులు తీరి కూర్చొనిన బంధువర్గముల భోజనములు, సకల పరివార పరిఢవముతో స్వామి పెండ్లి ప్రయాణము, నారాయణ వనమున వైభవోపేతముగా వివాహము జరుగుట, స్వామి కలశము గైకొనిపోయి పొరుగు వారిల్లు సేరుట, వధువు వచ్చి వరుని రమ్మని భయభక్తులతో ప్రార్థించుట, తల్లిదండ్రులు అప్పగింతలవేళ తమ కూతునకు బుద్ధులు చెప్పుట - వరకు గల విందులు, వినోదములు మున్నగు కల్యాణాంశము లన్నియును దేశీయత తొణికిసలాడునటులు, ఆహ్లాదకరముగా, రసప్లావితములుగా వర్ణితములై యున్నవి.

మొత్తముమీద ఈ కావ్యమునందలి వర్ణన లన్నియు నాతిదీర్ఘములై, ఔచితీ గుణభాసురములై, వెంగమాంబ లోకజ్ఞతకు, భావనాశక్తికి నిదర్శనములై వర్ణితములై ప్రకాశించుచున్నవి.

**సన్నివేశచిత్రణము :**

పఠితల, శ్రోతల హృదయములకు ఊరటను, ఉత్తేజమును ఎప్పటి కప్పుడు కల్గించునట్టి సన్నివేశములు ఈ మాహాత్మ్య కావ్యమున పెక్కులు. వేంకటేశ్వరుడు శ్రీ భూ నీళా సమేతుడై బ్రహ్మాదులకు సాక్షాత్కరించిన సన్నివేశము అట్టివానిలో అగ్రగణ్యమైనది. ఇది మూలమున 32 శ్లోకములలో ఇంచుమించు ఒక అధ్యాయముగా విస్తరించి యున్నది.[41] మూలమున "బ్రహ్మాణం తే పురస్కృత్య దదృశుః" (9 శ్లో.), "దదృశుః బ్రహ్మ రుద్రాద్యా స్త్రిదశా మునిసత్తమాః" (19శ్లో.), దదృశుః దేవగంధర్వాః ప్రత్యక్షం సురసత్తమాః (35శ్లో.),దదృశుః ప్రీతమానసాః" (37 శ్లో.) - ఇత్యాదిగా పలుమార్లు 'దదృశుః' (చూచిరి) అను క్రియాపదము పునరుక్తమైనది.

అంతేగాక తొలుత దక్షిణ పార్శ్వస్థయు పద్మాసనస్థయునైన లక్ష్మీదేవి, అటుపిమ్మట వామపార్శ్వస్థయు, స్వర్ణపద్మాసనస్థయునైన భూదేవి, మరల ఆ యిరువురి నడుమ నున్న స్వామియు వేర్వేరుగా వర్ణింపబడియున్నారు. పై పునరుక్తులవలనను, విడివిడిగా నున్న వర్ణనముల వలనను ఈ సన్నివేశము మూలమున బంధురతా గుణమును కోల్పోయిన సామాన్య కథనముగా సాగినది.

వెంగమాంబ పై పునరుక్తులను పరిహరించినది. మున్ముందుగా వేంకటేశ్వరుని దివ్యమంగళాకృతిని కన్నులపండువుగా నొక సీసమున వర్ణించినది. అటుతరువాత వక్షస్థలమున లక్ష్మి, కుడిప్రక్కన నీళాదేవి, ఎడమవైపున భూదేవి యున్నా రని యొక కంద పద్యమున పేర్కొనినది. ఈ ముగ్గురు పత్నులనే తర్వాతి సీసపద్యమునందును, వచనమునను చక్కగా, సమన్వయ పూర్వకముగా వర్ణించి దేవేరీ సమేతుడైన వేంకటేశ్వరునకు ఛత్రచామరంబులు పట్టిన సుందరీమణులను సృజించి,

ఆ దృశ్యము నంతటిని సమగ్రముగా పఠితల కన్నుల యెదుట ప్రత్యక్షము గావించినది. మూలములో కుడిప్రక్కనున్న లక్ష్మిని, తెనిగింపులో వక్షస్థలమున నున్నట్లు వర్ణించుట వేంకటేశ్వర స్వరూపానుగుణమైన మార్పు. అట్లే వైకుంఠమందలి నీళను దక్షిణ పార్శ్వమున నిల్పుట వేంకటేశ్వరుడు శ్రీమహావిష్ణువు యొక్క సంపూర్ణ స్వరూపమని ధ్వనింప జేయుటకే- ఇట్లు మూల మాధారముగా గైకొనియు, స్వతంత్రముగా, మనోహరముగా కవయిత్రి ఈ సన్నివేశమును కన్నులకు గట్టినటుల తీర్చియున్నది.[42] వెంగమ దర్శించిన ఈక్రింది వేంకటేశ్వరాకృతి నాటికి, నేటికి, రేపటికిని నిత్యనూతనముగా విరాజిల్లుచునే యున్నది.

"మకుట కౌస్తుభ రత్న మకరకుండలములు
ఘన మేఖలాంగద కంకణాలు
వర వనమాలికా వైజయంతుల దీప్తి
నలరు గ్రైవేయక హారములును
కనకాంబరం బొగిఁ గాంతుల నీను దే
హమునందు వెలుఁగగా నభయదాన
కలిత దక్షిణ కరకమలంబు పావన
చరణంబు లర్చించు సరవిఁ జూప
వామహస్తాం బుజము కటిసీమ నొప్ప
దక్కిన కరంబులను శుభదమగు శంఖ
చక్రములకాంతు లెసరార శస్త్రశాంతి
సర్వతోముఖుఁడై దయాస్వాంతుఁ డగుచు.
హరి ముద మొందుచు నుండఁగ
వరవక్షమునందు సత్యవరభూషణమై
సిరి దనరఁగ నిరుగడలను
ధరణియ నీళయు వసించి తద్దయు మెఱయన్."

-IIఆశ్వా; 59, 69 ప.

కవయిత్రి చిత్రించిన మఱియొక మనోజ్ఞ సన్నివేశము లక్ష్మి పద్మసరోవరమున సాక్షాత్కరించిన ఘట్టము. ఇది మూలమున 24

అనుష్టుప్ శ్లోకములలో నున్నది.[43] ఈ సన్నివేశము తెలుగున వధూవరుల ఎదుర్కోలు సన్నివేశమువలె, ఇరువదియొక్క గద్య పద్యములలో విస్తరించియున్నది.[44] లక్ష్మియు, వేంకటేశ్వరుడును నవవధూవరులవలె ఒకరు చూచినపుడు మఱొకరు లజ్జచే తల వాల్చుట, బ్రహ్మ కనుసన్న చేయగా భృగుమహర్షి లక్ష్మిని సమీపించి క్షమింప వేడి, హరి యురమున శీఘ్రముగా జేరు మని ప్రార్థించుట, పిమ్మట లక్ష్మి వచ్చి తన పతి గళమున పూలమాల వైచి యురమున నెలకొనుట - మొదలైన అంశములు క్రమముగా నాటకీయముగా వర్ణింపబడి యున్నవి.

లోకేశ్వరుడగు వేంకటేశ్వరుని వక్షముపై జేరుటకు పద్మ సరోవరము వెడలి వచ్చుచున్న ఈ క్రింది లక్ష్మీ స్వరూపము అపూర్వమై, ఆసేచనకదృశ్యమై అలరారుచున్నది.

"ఘల్లుఘల్లనికాళ్ల గజ్జెలందెలు మ్రోయ
మొలనూలు గజ్జె లిమ్ముగను మొరయఁ
జెలువారు పసిఁడి యంచుల నొప్పు తెల్లని
చీర నిద్దపుఁ గాంతి చెన్నుమీఱ
రహిని చందురు కావి అవికెను బంగారు
గిండ్ల భంగిగను బాలిండ్లు దనరఁ
జాఱు కొప్పునఁ బూలసరులు సొంపును జూప
ముంగురుల్ నుదుటను మురువు దెల్పఁ
గర్ణ కంఠాభరణ కరకంకణములు
వరశిరోభూషణంబులు సురుచు లెసఁగ
మందహాసంబు సేయుచు మహిత వినయ
ధన మొసంగుచుఁ జూచుచుఁ దనవు మెఱయ.
ఖాసుర నాసికాభరణంబుతోఁ గూడి
బింబాధరము కాంతి పిక్కటిల్లఁ
దీ రగు కస్తూరితిలకంబుతోఁ గూడి
నిటల తటద్యుతుల్ నివ్వటిల్ల
నెలవంకబొమలును నేత్రాంజనము సరి
గా సొగసై నీలకళల నీనఁ

బరిమళగంధలేపనముతో నెనసి స
త్కుసుమసౌరభము దిక్కులను నెఱయ
హంసగతి నొప్ప నుదధి దుగ్ధాబ్ధినుండి
వెడలి మును వచ్చి హరిఁ జేరు విధముగాను
రమ్యతరమైన పద్మసరస్సు వెడలి
శ్రీరమాసతి పతి చెంతఁ జేరి నిలిచె." -VIఆశ్వా; 131-132 ప.

ఇట్లే శంఖణ మహారాజునకు, ఆత్మారామునకు, శౌనకాదులకు శ్రీవేంకటాద్రీశుడు సాక్షాత్కరించిన సన్నివేశములు, శ్రీనివాసుడెఱుకతయై ధరణీదేవి కెఱుక చెప్పిన సన్నివేశము మున్నగునవి ఆ యా ఆశ్వాసములలో ఈ కవయిత్రిచే సముచితముగా చిత్రీకృతములై ఈ కావ్యకమనీయతను పెంపొందించుచున్నవి.

**నాటకీయత :**

కావ్యమందలి కథాసూత్రముయొక్క కదలికను ద్యోతింపజేయు చైతన్యలక్షణము నాటకీయత. సంభాషణ నాటకీయతకు జీవగఱ్ఱ. వెంగమ వేంకటాచల మాహాత్మ్యమున సంభాషణాత్మకములైన సన్నివేశములు నిండారియున్నవి. మూలమున సూచనామాత్రముగా నున్న సంవాద ఘట్టములను పెంపొందించుట ద్వారాను, పెక్కు సంవాద ఘట్టములను స్వయముగా సృజించుట ద్వారాను కవయిత్రి ఈ మాహాత్మ్య కావ్యమును నాటకీయ గుణమహితముగా తీర్చిదిద్దినది.

ఇందలి సంవాద ఘట్టములలో ప్రముఖమైనవి ఇవి:- 1) గరుడుడు వరాహస్వామితో, లక్ష్మితో సంభాషించిన ఘట్టము (Iఆశ్వా; 50-68 ప.) 2) శ్రీహరి బ్రహ్మాదిదేవతలకు, అగస్త్యాదిమహర్షులకు, దశరథునకు ప్రత్యక్షమై వరుసగా వారలతో సంభాషించి సంభావించిన ఘట్టము (IIఆశ్వా; 65-104 ప.), (121-141 ప.), 3) భూదేవీ శ్వేతవరాహ సంవాదము (IIIఆశ్వా; 68-165 ప.) 4) శేష మారుత సంవాదము (IVఆశ్వా; 42-66 ప.), 5)మాధవకుంతలా సంవాదము (IVఆశ్వా; 69-81 ప.), 6)భృగుడు వక్షమున తన్నిన యనంతరము శ్రీహరికి లక్ష్మికి జరిగిన సంవాదము (IVఆశ్వా; 120-130 ప.), 7) శ్రీనివాస చోళరాజ సంవాదము (IVఆశ్వా;

164-172 ప.), 8) శ్వేతవరాహ, వేంకటేశ్వర సంవాదము (IVఆశ్వా;183-194 ప.), 9)పద్మావతీ శ్రీనివాస సంవాదము (IVఆశ్వా;262-285 ప.) 10) ఎఱుకత చెలులతో ధరణీదేవితో భాషించి యెఱుక చెప్పిన ఘట్టము (Vఆశ్వా: 8-38 ప.), 11) వేంకటేశ్వరుడు తన చింతను గూర్చి పద్మావతికి తెల్పు ఘట్టము (VIఆశ్వా; 19-29 ప.), 12) లక్ష్మీ కపిల సంవాదము (VIఆశ్వా; 82-112 ప.), 13) వ్యూహలక్ష్మీ వీరలక్ష్మీ వేంకటేశ్వరుల సంవాదములు (VI ఆశ్వా; 137-154 ప; 194-198 ప.), 14) శుక మార్తాండ సంవాదము (VIఆశ్వా; 156-179 ప.), 15) బలరామకృష్ణుల భాషణము (VIఆశ్వా; 200-209 ప.)

ఈ రీతిని వేంకటాచల మాహాత్మ్య మందంతట పడుగు పేకలుగా అల్లుకొనియున్న పై సంభాషణలలో కొన్ని మూల మాధారముగా రూపొందినవి; మఱికొన్ని కవయిత్రి కమనీయముగా కల్పించినట్టివి. వెంగమాంబ పై సంవాద ఘట్టము లన్నింటిని సముచితములగు సంభాషణలచే సమున్మేషింప జేసి, ఈ కృతియం దెల్లయెడలను నాటకీయతాలక్షణమును ప్రత్యగ్రముగా భాసింప జేసినది.

శేష మారుత సంవాద మిందుల కొక యుదాహృతి. ఇది మూలమున 42 శ్లోకములలో నున్నది.[45] కవయిత్రి దీనిని 25 గద్య పద్యములలో మూలమునకు రెట్టింపుగా పెంపొందించినది. అట్లు విస్తరింప జేయుటలో సంభాషణలను మూలములో కంటె పాత్రోచితముగ, ఉదాత్తముగా, సహజముగా సమకొల్పియున్నది. మూలమున శేషుడు ద్వారము కడకు వచ్చిన వాయుదేవుని వెంటనే బంగారు దండముతో అడ్డగించినట్లు ('ద్వారే తం రోధయామాస రుక్మ దండేన సర్పరాట్' - 88 శ్లో.) చెప్పబడగా, తెనుగున తొలుత శేషుడు 'పవనుఁడా ! నీవు పోవలదు లోనికి, నిందె నిలువుము' (42 ప.) అని వాగ్రూపముగా నిషేధించి, పిమ్మట లోనికి జొచ్చుచున్న వాయుదేవుని మెడ బట్టి త్రోసినట్లు తెల్పబడినది. ఇందువలన వారి నడుమ వైరభావము క్రమముగా పెరుగుటను సూచించినట్లైనది. మూలమున వాయువు పల్కులకన్న శేషుని మాటలు స్వాతిశయ పూరితములుగా నిట్లు వర్ణింపబడినవి.

"అహం సమర్థో భగవాన్ బలే జ్ఞానే తవ ప్రియే ।
మత్సమో నాస్తి భూలోకే నాకే వా బ్రహ్మసద్మని ॥
సరీసృప వచశ్శ్రుత్వా ప్రహసన్ ఫణినం హరిః ॥" -106,107శ్లో.

తెనిగింపులో పై శేషుని ప్రగల్భములను పరిహరించుటేగాక, కవయిత్రి ఆ యిరువురు పాత్రములను సన్నివేశానుగుణముగా ఉదాత్త రీతిలో సమున్మేషింప జేసియున్నది.

శేష మారుతులు తమ తమ పట్టుదలలను వీడక యున్నప్పుడు మూలమున బ్రహ్మాదిదేవతలు వాయువును పట్టు విడువవలసినదిగా యాచించినట్లును, అట్లాతడు పట్టినపట్టు విడువక వీచుచుండుటచే, శేషుడు భగవానుని భావము నూహించి, ఆ దేవతల సంతోషము కొరకు స్వయముగానే తన పడగలలో నొకదానిని సడలించెనని చెప్పబడినది.

"తతో బ్రహ్మాదిభి. ర్దేవైర్యాచితోఽపి యదా మరుత్ ।
ప్రపేదే న శమం కించి త్తదాఽసౌ ఫణినాం పతి: ॥
జానన్ భగవతశ్చాపి భావం, దేవాంశ్చ తోషయన్ ।
క్వచి త్ఫణాంతరం కించి చ్ఛ్లథయామాస వై లఘుః॥-117,118శ్లో.

వెంగమ యట్లుగాక, బ్రహ్మాదులచే వాయుదేవుని ప్రార్థింప జేసినట్లే శేషుని సైతము ఈ క్రింది రీతిని సానునయముగా ప్రార్థింప జేసినది.

"వినుమో భుజగ కులాధిప !
కినిసి మహాశక్తి హేమగిరివర తనయున్
ఘనముగ బిగఁబట్టిన, ని
న్ననిలుఁడు గదలింప నోపఁడయ్య మహాత్మా !
అనుజులు మూర్ఖు లంచు విడనాడి సుసాత్త్వికమూర్తి యైన వె
న్నుని పదమాశ్రయించితి వనూనమతుండవు నీకుఁ గోప మే
లను? నిజశుద్ధ సాత్త్వికబలంబున నీవు చలం బడంచి నీ
ఘన ఫణ మెత్తి మా కొఱకు గాడ్పుకు గెల్పు నొసంగ మే లగున్."
-VIఆశ్వా; 59, 61 ప.

ఇట్లు మూలములో రేఖామాత్రముగా నున్న శేష మారుత సంవాదమును నమప్రాధాన్య ముట్టిపడునటుల ఈ కవయిత్రి తీర్చిదిద్దినది.

ఈ కవయిత్రి అమూలకముగా కల్పించిన సంవాద ఘట్టములలో షష్ఠాశ్వాసమునందలి వ్యూహలక్ష్మీ వేంకటేశ్వరుల సంభాషణ అత్యంత ముఖ్యమైనది. ఈ వినోద సంభాషణము శ్రీనివాసావతారోద్దేశమును భంగ్యంతరముగా ప్రకటించుచు, ఈ మాహాత్మ్య ప్రబంధ సందేశమును చక్కగా చాటుచున్నది. ఆ మనోహర సంభాషణము నుండి కొన్ని పంక్తులివి.

"కలుముల చెలి నీవు గావునఁ గలుము లి
చ్చెడు పని నీ వంతు చెలఁగి వారి
మెండు రూకల నాక్రమించి యాపదల ని
వారించి సంతాన వరము లొసఁగి
సంతసించుటకు నా వంతని పల్కఁగ
హరిని వీక్షించి యిట్లనియె లక్ష్మి
మనుజులు దాన ధర్మ పరోపకారముల్
చేయరు వారికి సిరుల నొసఁగు

టెల్ల వా రది తెచ్చి నీ కిచ్చు టెల్ల
ధనము గల్గఁగనే దంభ దర్ప లోభ
ములను బెంచుదు రా ద్రవ్యమును నిజముగ
నీకు నొగిఁ దెచ్చి యిత్తురే నీరజాక్ష!"

అనిన విని హరి శ్రీలక్ష్మిం జూచి, నీవు చెప్పినయట్ల కలియుగమునందుఁ బుట్టిన నరు లట్ల లోభు లగుటకు సందియంబులేదు. నిక్కం బగు. అందొక్క యుక్తి గల దది యెట్లంటివేని జనులు పాపంబులు సేయుదురు. దాన రోగాది బాధలననుభవింతురు. అట్టి కాలంబున నన్నుఁ దలంతురు. అపు డవ్వారి స్వప్నంబులం బ్రత్యక్షంబై వారి కలిమి కొలదిగ ముడుపులు గట్టించి తద్విత్తంబు' నకు నధికంబుగ వడ్డి పెచ్చు పెఱుఁగ నిచ్చి ప్రతి వత్సరంబును వారిని దండించి

యీ వేంకటాద్రికిఁ దోడ్కొని వచ్చి వారు దెచ్చిన ధనంబు నీక్షించి పుణ్యపాప విత్తంబుల నేర్పరించి, సుజన దుర్జనులకుఁ బంచిపెట్టించి, నాకు సంతర్పణ సేయుం డని యాచించి, వారిచేత నన్నదానంబులఁ జేయింపుచు, నందున వారు ద్రవ్యాన్నదానంబులు చేసినవా రగుచుందురు గావున వా రొనర్చిన స్వల్పదానంబైన నధికంబుగ నెంచి నీవు వారికి ధన ధాన్యంబులు ఇచ్చుచుండవలయు, నేను వారికి నయభయంబులం జూపి తద్ద్రవ్యాన్నంబు లిచ్చుటకిఁ దెప్పించి వారిచేత దానంబులు చేయింపు చుండవలయు. ఈ వేంకటాద్రియందుఁ జేసిన దానంబులకు నధిక ఫలంబు లిచ్చు నందు నేనీ యుక్తిపన్నితి. ఈ యుక్తి చేయకుండినఁ గలిపురుషుండు సకల ధర్మంబులం జెఱచి ప్రజల ననేక విధంబుల బాధించు, నరకంబుల ద్రోయించుఁ గావున, మదంశ సంభవులైన జీవుల కలికాలంబునం దీ ప్రకారంబు రక్షించుకొఱకు నేనీ యద్రియందు నిలిచితి........"

- IV ఆశ్వా; 152, 153 వ.

ఈ తీరున ఈ కృతియందలి సంవాదఘట్టము లెల్ల నాటకీయ గుణమును ప్రోది సేయుచున్నది.

**పాత్రోన్మీలనము :**

క్షేత్ర మాహాత్మ్యమును ప్రతిపాదించు పలుతెరగుల యుపాఖ్యానములకు నెల వగుటచే ఈ కృతియందలి కథావస్తువు పాత్రబాహుళ్యము గలదై యొప్పుచున్నది. కథాగమనమునకు హేతువులుగా ఈ కావ్యమున వెలసిన పాత్రములు చాలమట్టుకు భక్తిభావగుంఫితములై ఒకే లక్ష్యమువైపు పయనము సాగించుచున్నట్లు స్థూలదృష్టికి కనబడినను, పరికించినచో ఇందలి పాత్రలలో వలసినంత వైవిధ్యము గోచరించుచున్నది.

ఇది యనువాదము గనుక ఇందలి పాత్రములన్నియు మూలమున నున్నవే యైనను, వాటి స్వరూప స్వభావములను సహజసుందరముగా సమున్మీలింపజేసి, పాఠకుల హృదయఫలకములపై వాటిని సుస్పష్ట రేఖలతో భాసింపజేయుటలో ఈ కవయిత్రి చూపిన కవన కౌశలము నిరుపమానము.



Gorgeously decorated Srinivasa



A graceful and enchanting view of Lord Srinivasa

ఈ కావ్యపాత్రల నన్నింటిని 1) దివ్యపాత్రములు 2) అదివ్యములు 3) దివ్యాదివ్యములు - అని త్రివిధముగా వింగడింపవచ్చును. వరాహస్వామి, శ్రీనివాసుడు (వేంకటేశ్వరుడు), బ్రహ్మారుద్రేంద్రాది దేవతలు, ఆదిశేషుడు, వాయువు, వసిష్ఠ, నారద, భృగు, కపిల,శుకాది మహర్షులు, కుబేరుడు, బలరామకృష్ణులు మున్నగువారు దివ్యపాత్రములు. శంఖణ మహారాజు, ఆత్మారాముడు, దశరథుడు, జనకుడు, మాధవద్విజుడు, కుంతల యను చండాలయువతి, చోళరాజదంపతులు, ఆకాశరాజ దంపతులు, వసుదాన తొండమానులు, భీముదను కులాలభక్తుడు, కూర్మవిప్రుడు మొదలగువారు అదివ్యములైన మానవపాత్రలు. విటీవిటులు, శేషాద్రియందలి కొందరు మునులు, వకుళమాలిక, ఎఱుకత మున్నగువారు దివ్యత్వాదివ్యత్వములు రెండును సమన్వితములైయున్న దివ్యాదివ్యపాత్రములు.

పై మూడు విధముల పాత్రలు ఈ కావ్య కథలో పరస్పరమైత్రీ సహజీవనములచేతను, సంబంధ బాంధవ్యములచేతను ముడివడి యుండుటచే వాటిని సముచిత పరిధులలో సుస్పష్టరేఖలతో సమున్మీలింప జేయుటలో ఈ కవయిత్రి ప్రదర్శించిన మెలకువ మిగుల మెచ్చదగియున్నది.

శ్రీహరి యాజ్ఞచే లక్ష్మి ధరించిన వేశ్యపాత్రముయొక్క స్వరూపోన్మీలనము ఇందుల కొక ఉత్తమోదాహృతి. ఆ విటీవేషము మూలములో నిట్లున్నది.

"వేశ్యావేషం ధారయంతీం లీలాంబుజ కరాంబుజామ్।
తప్తహాటక సంకాశాం పంకజోదర సప్రభామ్॥ ౧౪

హరిద్రాంతర తుల్యాభాం దీవ్యంతీం కుటిలాలకామ్।
శరత్పూర్ణేందు వదనాం తాంబూలేన మనోహరామ్॥ ౧౫

కర్ణాంత నేత్రయుగళాం విడంబిత రవిప్రభామ్।
అభూతపూర్వ సౌందర్యాం సాక్షాల్లక్ష్మీ మివ స్థితామ్॥
-శ్రీవేంకటాచల మాహాత్మ్యగ్రంథః, పుట ౯ (వరాహపురాణమ్, 37 అధ్యా)

పై మూడు శ్లోకములలో లక్ష్మి వేశ్యావేషధారిణి యైనట్లున్నదే కాని, ఆ వేష మెట్టిదో స్పష్టపరుపబడలేదు. అందుకు మారుగా ఐదాఱు ఉపమానములతో ఆమె శరీరకాంతి విశదీకరింపబడినది. లక్ష్మి దివ్యపాత్ర యైనను, వేశ్యాస్వరూపమును తాల్చుటచే దివ్యాదివ్యపాత్రగా పరిగణితయైనది. ఆ పాత్రకు స్వాభావికమగు స్వరూపమును కనులకు గట్టినట్లు ఆవిష్కరించుచున్న ఈ క్రింది పద్యములు పరికింప దగియున్నవి.

"అన విని సిరి మందహాసాస్యయై కామ
రూపిణియై కుల్కుచూపు లెసఁగఁ
బరఁగఁ జందురు కావిపావడపైఁ జల్వ
జిలుఁగు బంగరుపూల చీర మెఱయ
ముత్యముల్, ముకురముల్ ముద్దుముద్దుగఁ గూర్చ
రంగు మించిన పట్టుఱవికె వెలుఁగఁ
గుచభారమున వడంకుచునుండు మధ్యంబు
నొగి మేఖలాబంధ మొప్పుచుండఁ

గనులఁ గాటుక గంధలేపనము మేన
నుదుటఁ గస్తూరితిలకంబు కుదుర నీల
కుటిలకుంతలములు ముద్దు గొలుపఁ బైఁడి
బొమ్మవలె నొప్పె లక్ష్మి సంపూర్ణకళల."

"జటువు ముత్యముల పాపటబొట్టు, రాకిడి
జడబిళ్లలును గుచ్చు లదరి వేలుఁగ
బంగరు కడియముల్ పచ్చల చేకట్లు
రత్నాల వంకీ ల్కరముల వెలయ
మగఱాల కమ్మలు పగడాల పేరులు
చెవుల గళంబునఁ జెన్ను మీఱ
వ్రేళ్ల నుంగరములు వివిధకాంతుల నీన
మీఁజేత గొలుసులు మెఱయుచుండ
నాసికాగ్రంబున న్జిగి నత్తు వెలుఁగఁ

జిలుతగజ్జెల మొలనూలు చిందుఁ ద్రొక్క
ఘల్లు ఘల్లని పదహంసకములు మొరయ
శ్రీవనిత విశ్వమోహినిదేవి యయ్యె." - I ఆశ్వా., 129, 130 ప.

మూలమున శ్రీహరి విటవేషమును ధరించిన పిదప లక్ష్మి విటీ వేషమును దాల్చియుండగా, తెలుగున వెంగమాంబ ముందుగా సిరియొక్క వేశ్యావేషమును, అటుపిమ్మట - విష్ణుని విట వేషమును వర్ణించి ఔచిత్యమును పోషించినది.

ఈ కావ్యమందలి అదివ్యపాత్రములలో కుంతల యను చండాలయువతి ఎన్నదగిన పాత్ర. 'వేంకటాచల' మనుపే రేర్పడుటకు హేతువుగా నెలకొన్న ఒక యుపాఖ్యానములో ఈ 'కుంతల పాత్రము' ప్రసక్తమైనది. శ్రీకాళహస్తి క్షేత్రమున వసించు పురందరసోమయాజి కుమారుడు మాధవుడు. ఈతడు గుణనిధి, నిగమశర్మ, నుకుమారుడు మున్నగువారల కోవకు జెందినవాడు. భార్యయగు చంద్రరేఖతోడి దివాసంగమమునకై స్వర్ణముఖీ తీరమును జేరి, అచ్చట కుంతలను గాంచి ఆ మాలెతయందు మరులుగొన్నాడు. తెలుగులో వెలసిన మాహాత్మ్య కావ్యములలో మాధవునివంటి పాత్రములు తరచుగా కన్పించినను, కుంతలను బోలిన పాత్రములు మాత్ర మరుదు. కవయిత్రి ఈ పాత్రను సమున్మేషింప జేసిన తీరు అపూర్వము! మూలమున కుంతలా మాధవుల సంవాదము 41 శ్లోకములలో వివరింపబడినది.[46] ఈ ఘట్టము తెనుగున పదమూడు గద్యపద్యములలో రచింపబడినది.[47] వారిరువురి పలుకుల ద్వారా వారి స్వభావముల నున్మీలింప జేయుటలో వెంగమాంబ ప్రదర్శించిన పాత్రపోషణప్రజ్ఞ ప్రశంసనీయమై యున్నది.

కథాకాలమునాటి సాంఘిక జీవన పరిస్థితి ననుసరించి అట్టడుగున మసలుకొను కొలమునకు జెందిన కుంతల, విప్రుడును దుశ్శీలుడును అగు మాధవునకు హితోపదేశ మొనరించుటలో ఆమెయందలి ఔదార్యగుణము వ్యక్త మగుచున్నది. అగ్రవర్ణమునకు చెందిన ఆతని నీచస్వభావము విచక్షణా మహితమగు కుంతల వ్యక్తిత్వమునకు పశ్చాద్భూమిక యై ప్రోది సేయుచున్నది. కుంతల పాపభీతిచే రోదనము సేయుచు దిగ్దేవతాదులను దలచి పలికిన క్రింది పలుకులు ఆమె నిర్మల హృదయమునకు నిదర్శనములు.

"... .... .... ఈ బ్రాహ్మణుడు పాపజాతినైన నన్నుఁబొంది కులహీనుడై నరకంబునం బడుటకు బ్రయత్నించి సముద్ర మున్పొంగి వచ్చునట్లు నాపైఁ బడవచ్చుచున్నాడు. నా వలన నించుకేని దోషంబు లేదు. మీ రెల్లరు నాకు సాక్ష్య మిచ్చువా రగుదురు గాక ... ... ..."

- IV ఆశ్వా., 74 వ.

ఆమె యెంత హితబోధ చేసినను వినక వా డా యబలపై బడి కట్టుకొని యిష్టంబు పరిపూర్తి గావించుకొనెను. వెంటనే ఆమె 'నీ వింక యజ్ఞోపవీత పరిత్యాగంబు చేసి మదీయ చండాల జాత్యాహారాదులు చేసి, నాకుఁ బరిణయంబు లేనికతన నిఁక వేఱ నాకు వివాహంబు పనిలేదు గావున నాతోడ నుండుము' అని యాతనిని శాసించినది. జన్మతః చండాల స్త్రీ యైనను కుంతల యుక్తాయుక్త వివేకముతో వర్తించినది. తద్వర్తనము మూలములోకంటె అనువాదమున చక్కగా స్పష్టీకరింపబడినది. పేరును బట్టియే దీర్ఘనీలకుంతములు గలదిగా తెలియుచున్న లక్షణవతి యగు కుంతలను 'పద్మినీజాతి యగు చండాల స్త్రీ' యని అమూలకముగా అనువాదములో (చూ. IVఆశ్వా; 89 వచనము) పేర్కొనుటలో ఈ కవయిత్రి లోకజ్ఞత, సమభావము విదితము లగుచున్నవి.

పాత్రోన్మీలనము నెడల కవయిత్రి యీ కృతిలో ప్రవేశపెట్టిన రెండు ముఖ్యవిశేషము లిట ప్రస్తావింపదగియున్నవి. ఆ విశేషములు

1) దివ్యపాత్రములయందు మానవభావములను సుకుమారసుందరముగా పాదుకొల్పి కావ్యేతివృత్తమున సహృదయాహ్లాదకారి యగు ఆర్ద్రవాతావరణమును సృజించుట.

2) ఆయా ఘట్టములలో ప్రధాన పాత్రములతోపాటు తదితర పాత్రలను సందర్భోచితముగా పరామర్శింప జేసి, వాటి యునికిని పఠితల, శ్రోతల జ్ఞప్తి కెలయించుట - అనునవి.

పై రెండు ముఖ్యవిశేషములకు స్థాలీపులాకముగా ఉదాహరణలు.

లక్ష్మిని మరల వక్షమున జేర్చుకొనదలచిన వేంకటేశ్వరుడు, అది పద్మావతికి ఖేదజనక మగునని ఆమెతో తన సందియము నిటుల వెలిబుచ్చెను.

తరిగొండ వెంగమాంబ కృతులు

"విను పద్మావతి యొంటి కాపురము నీవే చేయుచున్ వేడ్కఁగా
నను నర్ధ క్షణమైనఁ బాయక సదానందాత్మవై యుంటి వా
వనజాతాలయ వచ్చి సంతతము నా వక్షస్థలంబందు ని
ల్చిన నీ వప్పుడు చూచి యోర్వఁగలవే చింత న్మదిం బొందకన్.
నీ విచ్చట ననుఁ గూడుట
కై వననిధితనయ వచ్చినప్పుడు తిరుగా
నా వక్షస్థలి నిడుకొన
కా వేళనె పంచి తచటి కబ్జదళాక్షీ!" - IV ఆశ్వా., 24, 25ప.

పై సందేహమునకు పద్మావతి యొసగిన సమాధానమిట్లున్నది.

"అన విని చింతించి యపుడు పద్మావతి
పలికె నిమ్మెయి రమాభామ యిటకు
వచ్చియున్నపుడు మీ వక్షస్థలంబునం
దిడికొన్న కొదువ నా కేల గల్గు?
నా లక్ష్మి మీకు నా కన్యోన్యముగఁ జేసి
యంతటికి గర్త యగుచునుండు
శ్రీ రమాకాంతయై సీతయై ననుఁ బెండ్లి
యాడు మటంచు నీకాప్తముగను

జెప్పినందుననే కదా చిత్తగించి
నన్నుఁ జేపట్టితిరి సదానంద మొదవె
నింత భాగ్యంబు కృపను నా కిచ్చినట్టి
సిరికిఁ బ్రత్యుపకృతి నేను జేయగలనె?
ఏ రీతిగ నిచ్చటికిని
గూరిమితో సిరిని దోడుకొని వచ్చిననే
నా రామామణి పదములు
గౌరవమునఁ గొల్చియుందుఁ గమలదళాక్షా!"

IV ఆశ్వా., 26, 27ప.

అమూలకమైన పై వృత్తము ద్వారా ఈ కవయిత్రి హరియవతారమగు శ్రీనివాసునియొక్క మందిరమున బహుపత్నీకుడు,

దక్షిణనాయకుడునైన సంపన్నగృహస్థుని యింటియందలి సాంసారిక వాతావరణమును సొంపుగా సృష్టించి, సహృదయానందకరమగు ఆప్యాయతను వెలార్చినది.

ఇక ప్రధానేతర పాత్రముల పరామర్శ కొక యుదాహరణ. శ్రీరాముడు వానరసైన్య సమేతుడై లంకపై దండెత్తి యేగుచు, దారిలో వేంకటాద్రిని దరిసిన తరుణమున అంజనాదేవి వచ్చి, సపరివారముగా వేంకటాచలమునకు విచ్చేయవలసినదని ప్రార్థించును. ఆంజనేయుడు తల్లి కోరికను బలపరచును. అప్పుడు శ్రీరామచంద్రుడు 'అబ్జాప్తసుతుని, లక్ష్మణునిఁ గాంచి మందహసితాస్యుఁడై హనుమంతుఁడనుట వింటిరే?' యనును. అది విని వారు 'దేవా! మీ యిష్ట' మని ప్రత్యుత్తర మొసంగుదురు. (చూ. I ఆశ్వా; 219ప.) ఇట్లు రాముడు సుగ్రీవుని, లక్ష్మణుని జూచుట, వారి యభిప్రాయమును వాంఛించుట మూలమున లేనివి. పై విధముగా రామునిచే సుగ్రీవుని, లక్ష్మణుని మాట్లాడింపజేయుట ద్వారా కవయిత్రి సుగ్రీవాది వానరుల యునికిని సూచించినది. అంతేగాక సుగ్రీవుని యనుమతితో హనుమంతుడు రామలక్ష్మణులను భుజములపై నిడుకొని నడచుటయను అమూలక కల్పనవలన ఆ పాత్రలు (సుగ్రీవుడు, లక్ష్మణుడు మొదలగువారు) పాఠకులకు ప్రస్ఫుటీకరింపజేయబడినారు. వే యేల వెంగమలేఖినిచే సమున్మీలితములై ప్రాణప్రతిష్ఠ నొందిన పాత్రములెల్ల పులు గడిగిన ముత్యములు; స్మితపూర్వాభిభాషులు.

**రసపోషణ :**

వేంకటాచల మాహాత్మ్య కావ్యరచనకై వెంగమాంబ స్వీకరించిన 'మూలవస్తువు' యొక్క తత్త్వమునుబట్టి ఆమె రసపోషణ దృక్పథము తెలియుచున్నది. ద్వాదశ పురాణ భాగాత్మకమగు సంస్కృత వేంకటాచల మాహాత్మ్యమున రసోచితమగు తీర్మానమున కనుకూలించు ఏకసూత్రత గల ఉదాత్త కథాసామగ్రి వరాహ, భవిష్యోత్తర, పద్మపురాణము లనెడు మూడు పౌరాణిక భాగములలో అధికముగా గలదు. కవయిత్రి యీ మూడు పురాణములనుండి స్వీకరించిన కథాభాగములను ఒకదానితో నొకటిని చక్కని యానుపూర్వి యుట్టిపడునటుల సంధానించి, ఉపాఖ్యానములకు, ప్రధాన కథకు అంగాంగీభావ ముట్టిపడునటుల మలచుకొని, ఈ కావ్యమూర్తిని అఖండముగా, రసపరిప్లుతముగా తీర్చి దిద్దినది.

ఈ కావ్యమందలి ప్రధాన (అంగి) రసము శృంగారము. సహాయ (అంగ) రసములలో మొదటిది భక్తిరసము.[48] వరాహస్వామి వృషభాసురుని సంహరించిన కథలోను, చక్రరాజు చోరులను జయించిన వృత్తాంతమందును వ్యక్తమగు వీరము, కుమారధారమహిమ, శంఖణుని వృత్తాంతము మున్నగు ఘట్టములందు వెల్లడియగు కరుణము, శ్రీనివాస కల్యాణ ఘట్టమున సూచితమగు సుకుమార హాస్యము మున్నగునవి తదితర సహాయ (అంగ) రసములు.

ఈ మాహాత్మ్య ప్రబంధమందలి నాయకుడు వేంకటేశ్వరుడు. ఈయన దక్షిణ నాయకుడు. పద్మావతి, లక్ష్మి (అలర్ మేల్ మంగ) ప్రధాన నాయికలు. వైకుంఠమును వీడిపోయిన లక్ష్మి మరల స్వామి వక్షస్థలమును చేరుటలో 1) వ్యూహలక్ష్మి (వక్షస్థలమందలి అలమేల్మంగ) 2) వీరలక్ష్మి (నేడు తిరుచానూరులో వెలసియున్న అమ్మవారు) - అను ద్వివిధ రూపముల నొందినది. ఎడనెడ భూదేవి, నీళాదేవి - అను నాయికలును సూచనామాత్రముగ పాఠకులకు గోచరింతురు.

నాయకుడగు వేంకటేశ్వరునకు నిలయ మగుటచే వేంకటాచలము, తద్వైభవ విశేషములు తొలి మూడాశ్వాసములలో ప్రచురముగా ప్రపంచింపబడినవి. తరువాతి మూడాశ్వాసములలో భృగుపాద తాడనము కారణముగా నాయికా నాయకుల కేర్పడిన యెడబాటు, ఆ మధ్యలో నాయకునకు మఱియొక నాయిక (పద్మావతి) తో ఘటిల్లిన కల్యాణము, చివరన నాయిక (అలర్ మేల్ మంగ) తో నాయకునకు పునస్సమాగమము - సముదంచితముగా, ఉదాత్త మనోహరముగా వర్ణితములైనవి.

ఈ మహాత్మ్య కావ్యమున శృంగారముయొక్క ప్రధాన విభాగములైన వియోగ, సంయోగములు రెండును పొదుకొల్పబడినవి. తన నివాసమగు శ్రీహరి వక్షస్థలమును భృగుడు తన్నుటచే లక్ష్మి యలుక వహించి వైకుంఠమును వీడి భూలోకమందలి కొల్లాపురమును జేరినది. విష్ణు డప్పుడు విరహ తాప మతిశయింపగా 'ఎప్పటికైనను లక్ష్మిని మరల వక్షమున జేర్చుకొందునుగాక' యను తలంపుతో వేంకటాద్రిని జేరెను. ఇట్లు నాయికానాయకుల కేర్పడిన ఈ యెడబాటు నారదుడు పన్నిన పన్నాగముయొక్క ఫలితము. అదియు లోక క్షేమంకరమగు దృష్టితో గావింపబడుటచే ఆహ్లాదకారియే అయినది. ఈ విషయము ఈ క్రింది విష్ణుని పలుకులలో వ్యక్తమగుచున్నది.

"కట కటా! యేమి సేయుదు కర్మమునకుఁ
గాల మెంతటివారైనఁ గడపలేరు
శ్రీయువతి యిప్డు నన్నెడఁ బాయుకొఱకుఁ
గలిగె నద్భుతముగ నెన్ని కారణములు!
మంచి దిది యొక కొఱఁతగ నెంచు టేల?
చంద్రబింబమునం దుండు చంద్రికవలె
విమలయై లక్ష్మి నాయందు వెలయుఁ గాని
పఱఁగ నను వీడ దెందు సౌభాగ్యలక్ష్మి.

సిరి యెదలో నే నెప్పుడు
కరము ప్రియంబార నుండి క్రమ్మఱి నా హృ
త్సరసిజమున నివసింపఁగ
దిరముగఁ జేసికొని ప్రోతుఁ ద్రిజగంబులలోన్."

IV ఆశ్వా; 136-138 ప.

ఈ విప్రలంభ శృంగార మిట్లుండగా నడుమ నాయకునకు మఱియొక నాయిక (పద్మావతి) తో కల్యాణము జరుగుట ఈ కథాగతమగు వైచిత్రి. కవయిత్రి ఈ వైచిత్రిని రసవత్తరముగా దిద్దితీర్చిన తీరు రమణీయము! నాయక్షుడు తన రెండవ పెండ్లికి ప్రథమనాయికను కొల్లాపురమునుండి పిలిపించి, ఆమె సమ్మతితోనే ఆకాశరాజసుతను పరిణయ మయ్యెను. ఆ ఘట్టమున నాయకుడు నాయిక (లక్ష్మి) మనస్సు ప్రసన్న మగుటకై పలికిన పల్కులు, అందుల కనుగుణముగా నాయిక (లక్ష్మి) ప్రవర్తించిన తీరు 'సుకుమారభావ సంపద కునికిపట్టులై రసానుకూలముగా విలసిల్లుచున్నవి. వారి మనోజ్ఞ సంభాషణనుండి మచ్చునకు కొన్ని పల్కులు.

నాయకుని పల్కులు :

"శ్రీవనితామణి! నాపై
నీ వలుగుట మొదలుగాను నేటివఱకు ని
న్నే వేళఁ దలఁచు చుండుదు
నీ వల్మీకంబులోన నిరవుగ నుంటిన్.
పటుకుఠారము తలపైఁ దాఁకు నప్పటి
బాధకు నే నోర్చి బ్రదికినట్టి

మహిమ యే మనిన నీ మంగళసూత్ర న
        న్మహిమయ గాని, నా మహిమ కాదు
వనజాక్షి నీ పతివ్రత విఘ్నచే నేను
        జీవించితిని యది సెప్ప నేల?
అది యటు లుండని మ్మాకాశనృపకన్య
        నన్ను మోహించెను నన్నుతించి
గాన దానిని నేఁ బెండ్లి కరము ప్రీతి
నాడ నెంచితి నీ వాడు మంటివేని
పెండ్లియాడెద లేకున్నఁ బెండ్లి వలదు
తొంటి సంగతి మది నెంచు తోయజాక్షి!" - V ఆశ్వా; 119, 121ప.

## నాయిక (లక్ష్మి) పల్కులు :

"కమలాక్ష మంగళకరముగఁ బసపుజా
        బింపుగఁ దొల్తఁ జంపించ కీవు
మొగి నశక్తుఁడ నని మోము చూచుటకు ర
        మ్మని నన్నుఁ బిలిపించి నందువలన
ఛీతిల్లి వచ్చితి ఖ్యాతిగ నే వచ్చు
        రీతి రానైతి సంప్రీతి మెఱయ
నేఁ దొల్త వచ్చిన నీ పెండ్లి కిపు డొప్ప
        నని సంశయించితి నందుచేత
నింతపని చేసితివి మంచి దీ వివాహ
కారణముచేత నైన నిక్కడకు నన్ను
నేఁడు పిలిపించినందున నీ ముఖంబు
గంటి నా కింతయే చాలుఁ గమలనాభ!

వసుధపై నీవు పెండ్లి కావలయు ననిన
నేను విఘ్నము సేయను నీకు నేను
గలిగియును లేక యుండెడు కారణంబు
చే వివాహేచ్ఛ పుట్టె నీ చిత్తమునను.

నా కిది సమ్మత మైనది
నీ కిఁక సంశయము వలదు నెమ్మదిగా నిం
దా కన్యను జేపట్టుము
ప్రాకటముగ నాకు సుఖమ రహి నీ కదియే." -V ఆశ్వా: 123-125 ప

పై రీతిని పద్మావతీ పరిణయం నిమిత్తముగా లక్ష్మి సన్నిహితయైనను వేంకటేశ్వరు డామెను వక్షమున జేర్చుకొన డయ్యెను. ఈ యంశ మీ క్రింది పద్యమువలన స్పష్టపడును.

"వకుళయొద్ద లక్ష్మి వల్మీక వివరంబు
చెంతఁ జక్రియును వసించి యొక్క
రొకరి నంటకుండుటుండ రాజుఁ గని క
లంక మొంది రోష మంకురింప." -V ఆశ్వా; 173
ప.

ఇంతవరకు వర్ణింపబడిన వియోగ శృంగారము పద్మావతి వివాహానంతరము నాయకునియందు మరల ప్రబుద్ధమైనది.

"నిరతము న్మదిఁ జింతఁ జేయుచు నీరజేక్షణుఁ డార్తుఁడై
నరునిచందముగా విరక్తుఁడనంగ నొప్పుచు సర్వమున్
మఱచి తాఁ దనుఁ జూచుచుండెడి మౌనిమాడ్కిని పద్మమం
దిర విలాసగుణంబు లెల్ల మదిం దలంచుచు నుండఁగన్." - VI
ఆశ్వా; 13ప.

ఇట్లు వర్ణింపబడిన యీ విరహమే నాయకుని ఇఱువదిరెండేండ్లు తప మొనర్పఁ జేసినది. ఆయన తపము ఫలించి నాయిక ప్రత్యక్షమై నాయకుని వక్షమును జేరుటతో నాయికా నాయక సమాగమము సిద్ధించినది. అటు పిమ్మటగాని అంతకు పూర్వము పద్మావతీ వివాహఘట్టమున గాని ఈ కావ్యమున సంయోగ శృంగార వర్ణన వాచ్యము గావింపబడలేదు. ఇందలి నాయికా నాయకులు దివ్యులగుటచే కవయిత్రి వారి సంయోగ శృంగారమును సూచనామాత్రముగ నొనర్చి కథను పూర్తి గావించినది.

మొత్తముమీద వెంగమ రసపోషణ, అందును ప్రధానమగు శృంగారరస నిర్వహణము అవతారికలో ఆమెయే తెల్పినట్లు 'సారము' గా, 'గూఢము' గా సాగినది. ఆ శృంగారోక్తులన్నియు భగవానుడగు శ్రీకృష్ణుడు పల్కినవే యని కవయిత్రి విన్నవించినది. [49] ఈమె రస నిర్వహణమునుగూర్చి 'కవిత్వవేది' కీ.శే. కల్లూరు వేంకటనారాయణరావుగారు వక్కాణించిన వాక్యము లీ సందర్భమున తిలకింప దగియున్నవి.

"ఈ కవయిత్రిలో నొక్కవిశేషం బే మనిన, షష్ఠాశ్వాసపరిమితంబగు వేంకటాచలమాహాత్మ్యమున ... ... నొకించుకేని యంగాంగ సంభోగ శృంగారము లేకునికి. అది యామె వైరాగ్య వృత్తికి నానవాలు. వరాహాది రూపచరిత్రంబు లవాంతరంబుల నెన్నేని చెప్పినను, లక్ష్మి యనపాయిని యనియు, హరి యొక్కండ యనుటయు నామె యేమఱ లేదు ... .... షష్ఠాశ్వాసమున వీరలక్ష్మీ విలాసము, హరి వడ్డికాసులవాడైన విధమును, శుకచరిత్రంబును గలవు. ఏ చోటగాని, కవిత సరసముగ శ్రుతిరంజకంబుగ నున్నది కాని రసోద్వేగము, మహాకవి కృతులలో నున్నట్లు లేదు. చండాలీ మాధవకథ యందైన నించుకేని యతిక్రమంబు లేదు. ఇంత నిరాడంబరముగ రసాతిక్రమములు లేని కవితను సాగించిన క్రమము తిక్కన్న తరువాత లేదన్నది తనుకుగాదు, తాటోటు మాటగాదు."

- శ్రీ వీరేశలింగ యుగము, పుటలు 131-133.

**శైలి :**

కావ్యమునకు శబ్దార్థములు శరీరము. [50] ఆ 'కావ్యశరీరము' నుండి ప్రసరించు లావణ్యము శైలి. పాఠకులను, శ్రోతలను ఆకర్షించుటలో కావ్యసామగ్రియందు అగ్రగామియై వరలునది శైలియే. వెంగమాంబ కవితాశైలి వేంకటాచల మాహాత్మ్యమున మిగుల పరిపక్వస్థాయి నొంది వీనులవిందు గావించుచున్నది. అందలి ముఖ్యాంశము లీ క్రింద పేర్కొనబడుచున్నవి.

i) శ్రావ్యములు, సుబోధములునైన తత్సమ పదములయొక్క సొంపైన తెలుగు పల్కులయొక్క సముచిత సమ్మేళనమువలన ఏర్పడిన అక్షర రమ్యత.

ఉదా :

"నీవే బ్రహ్మను గన్నతండ్రివి మహానిర్వాణసంధాత నీ
వే విష్ణుండవు రామచంద్రుఁడవు నీవే కృష్ణదేవుండ వీ
వే వేదాత్మవు సర్వతోముఖుఁడ వీవే కర్తవాభోక్త నీ
వే విశ్వంబు వరాహదేవుఁడవు నీవే శేషశైలాధిపా!"

-IV ఆశ్వా; , 340ప.

ii) ఆ యా పద్యముల పాదములు యతిమైత్రి స్థానములకడ స్పష్టముగా విడివడియుండి మాధుర్య గుణోపేతములై పఠనానందమును ప్రసాదించుట.

ఉదా :

"కుండలు చేసి చేసి యొక గూటను బెట్టుచు నప్పుడప్పుడున్
రెండు కరంబులం బులిమి రేఁగిన మట్టిని చిత్రపుష్పముల్
దండిగఁ జేసి నా వలెనె దారుకరూపము నేర్పరించి తా
నిండిన భక్తి మీఱఁగను నిత్యము నర్చన సేయుచుండఁగన్."

V ఆశ్వా; 335 ప.

iii) గద్యములు దీర్ఘసమాస రహితములై లలితపద విన్యాసముతో విలసిల్లుచుండుట. ఇందులకు తాళ్లపాక పెదతిరుమలాచార్యుల 'వేంకటేశ్వర వచనములు' ధోరణిలో సాగిన ఈ క్రింది వచన మొక చక్కని తార్కాణము.

"క్రమ్మర నిట్లనియె. 'దేవా! భవదీయ చక్రప్రభావం బెంతని వర్ణింప నా బ్రహ్మాదులకే యశక్యంబు. కీర్తియు నంబరీషాది రాజప్రముఖులకు విజయంబు లిచ్చిన దఁట! అదియునుం గాక భవచ్చక్రతప్తులైన వారలకుం బునర్జన్మంబులు రావఁట! కావున నట్టి యప్పరమచక్రంబునం దెగి ముక్తి నొందెద. మన్నా మంబీ యద్రి కిడినం జాలు' నని ప్రార్థింప నా నృసింహుం డా రక్కసుని నాలింగనంబు చేసి ముక్తి నిచ్చి యప్పర్వతంబున కా యమరవైరినామం బిడియె. అక్కారణంబునం గృతయుగంబునందు వృషభాద్రి యని పేరొందు."

IV ఆశ్వా; 32 వచనము.

iv) నన్నయ, పోతన, మొల్ల, గోపన్న మొదలగు ప్రాచీన కవుల, కవయిత్రుల పద్యముల పోకడ లిందట నట కన్పట్టినను, అవి ఈ కవయిత్రియొక్క స్వతంత్రశైలీ సౌందర్యమును ఇనుమడింపజేయుచున్నవి. ఇందులకు ఈ క్రింది సీస మొక మచ్చుతునక.

"చందన జంబీర చంపక వకుళాది
　　పాదపంబులతోడఁ బ్రబలుదాని
కనక రత్నాదుల కాంతులచే మించి
　　కనిపించు నమిత శృంగములదాని" -I ఆశ్వా; 70 ప.

ఇట్లే చివరివరకు ద్వితీయాంతముగా సాగిన ఈ పద్యము,

"కమనీయ ధర్మార్థ కామ మోక్షములకు
　　నత్యంత సాధనం బయిన దాని"
- ఆదిపర్వము, III ఆశ్వా; 9 పద్యము.

ఇత్యాది నన్నయభట్టు పద్యమును స్మరింపజేయుచున్నది.

ఇట్లే తదితర కవుల పద్యచ్ఛాయలును ఈ కృతియం దచ్చటచ్చట అందగించి యున్నవి.

v) ఆయా కథాంశానుగుణమగు ఛందౌచిత్యము, మహాకావ్యోచితమైన
ఛందోవైవిధ్యము ఈ కృతియం దెల్ల యెడల నెలవుకొని యున్నవి.

iv) కథా నిర్వహణము ననుసరించి యేర్పడిన కథనాత్మకశైలి (ఆఖ్యానక శైలి), వర్ణనాత్మక శైలి, నాటకీయ శైలి - అను త్రివిధ శైలీ విశేషములును ఈ కబ్బమున సముచితముగా చోటుచేసికొని యున్నవి. ఇందలి ప్రధాన కథా నిర్వహణమున నాటకీయవర్ణనాత్మక శైలులను, ఉపాఖ్యానముల విషయమున కథనాత్మకశైలిని కవయిత్రి పాటించినది. మొత్తముమీద వెంగమ కవితాశైలి ప్రాయికముగా నాటకీయమైనది. 'కవిత్వవేది' కీ.శే. కల్లూరి వేంకట నారాయణరావుగారు ఈ మాహాత్మ్య కావ్యశైలిని గూర్చి వెలిబుచ్చిన అభిప్రాయ మిట అనుసంధేయమై యున్నది.

'16 నూర్లకు పైబడిన బృహత్కావ్యములో నెచటనేని తొట్రుపాటు గాని, తన కబ్బిన ధారలో లోపమేని కానరాదు. మొదటినుండి తుదివరకు (పంటకాలములో చూపుమేర వరకు పచ్చగ బఱచిన శయ్యవలె నుండు పంట పఱుపుబోలిన) యొకే శైలి తనరారుచున్నది పేలవము కాదు, కఠినము కాదు. విదుషీమణికి దగినట్లు వినయనమ్రముగా, కథ విసుగెత్తింపక సాగిపోవుచుండును."

- శ్రీ వీరేశలింగ యుగము. 131 పుట.

## వేంకటాచలమాహాత్మ్య రచనలు
## వెంగమ కృతిప్రభావము :

పుణ్యక్షేత్రము లన్నింటిలో తిరుమల కొక ప్రత్యేకత యున్నట్లుగనే తెలుగున వెలసిన మాహాత్మ్య కావ్యములలో వెంగమాంబ రచించిన వేంకటాచల మాహాత్మ్యమున కొక విశిష్టత కలదు. ఇది వెలువడిన నాటినుండి దీనికి వ్రాతప్రతులు తయారగుచు క్రమముగా తెలుగునేల నలుగడల వ్యాపించి వేంకటాచల క్షేత్రముయొక్క వైభవమును ప్రజానీకమున ప్రబోధింపజేసినవి. ఈ కృతియందలి రచనా వైశిష్ట్యము తెనుగున మఱికొన్ని వేంకటాచలమాహాత్మ్యానువాదములకు ప్రేరకమై వెలసినది.

1) వెంగమాంబ వేంకటాచల మాహాత్మ్యమునకు అనంతర కాలమున వెలువడిన అట్టి రచనలలో మొదటిది ములుపాక బుచ్చన్న శాస్త్రి విరచిత 'వేంకటేశ్వర మాహాత్మ్యము'. ఇతడు సి.పి. బ్రౌను దొర కాశ్రితుడై యుండిన విద్వత్కవి. కడప జిల్లా రాజంపేట తాలూకాయందలి గుండ్లూరు నివాసి. తిరుమల క్షేత్రమునకు సన్నిహిత ప్రాంతమందలివాడై యుండుటవలనను, వెంగమాంబకు లేబ్రాయపు సమకాలికుడుగా స్పష్టపడుచుండుటవలనను, తొలుత మాఘమాహాత్మ్యాద్యనేక ప్రబంధములను భాషించి, అటుపిమ్మట ఈ యనువాదమును చేపట్టి యుండుటచేతను, వెంగమ రచించిన వేంకటాచల మాహాత్మ్యమును వినిన, కనిన పిదపనే ఈతడు వేంకటేశ్వర మాహాత్మ్యమును రచించెనని దృఢముగా నిశ్చయింపవచ్చును.

2) బుచ్చయకవికి ఇంచుక తరువాతి కాలమున (క్రీ.శ. 1837 ప్రాంతమున) వెలువడిన రచన దామెర చిన వేంకటరాయకవికృత 'వేంకటాచలమాహాత్మ్యము'. ఇందలి అశ్వాస విభజనము, కథా సంవిధానము - ఈ కవి వెంగమ రచనను చూచియుండెనని చెప్పక చెప్పుచున్నవి.

3) క్రీ.శ. పందొమ్మిదవ శతాబ్ది పూర్వార్థములో వేంకటాచల మాహాత్మ్యము నాంధ్రీకరించిన మఱియొక కవి శిష్టు కృష్ణమూర్తిశాస్త్రి (క్రీ.శ. 1790 - 1870)[52] కాళహస్తి సంస్థానాశ్రితుడై యుండిన ఈ పండితకవి క్రీ.శ. 1840 - 1845 సంవత్సరముల నడిమి కాలమున వేంకటాచల మాహాత్మ్యమును రచించెను. పరిశీలింపగా ఈతని యనువాదము దామెర చిన వేంకట రాయకవి రచనకు పూరకముగా వెలసినదని అందలి కథావస్తువు సాక్ష్యమిచ్చుచున్నది. ఈ రీతిగా వెంగమాంబ విశిష్ట కృతిచే ప్రభావితములై వెలసిన మఱికొన్ని రచన లీ దిగువ నుదాహరింప బడుచున్నవి.

4) క్రిందటి శతాబ్దమున హైదరాబాదు నవాబు కొలువులో ఉన్నతోద్యోగిగా నుండిన తాడిపర్తి లక్ష్మణరాయడను కవి వెంగమాంబ రచించిన వేంకటాచల మాహాత్మ్యమునందలి తొలి యైదాశ్వాసముల కథను గైకొని 'శ్రీవేంకటేశ్వర నాటకము'[53] అను యక్షగానమును రచించియున్నాడు. ఈ విషయ మా యక్షగానావతారికయందలి ఈ క్రింది స్వప్న వృత్తాంతమున స్పష్టముగా నుట్టంకింప బడియున్నది.

"దీనికి నొక్క విశేషం బెఱింగించెద నెట్లనిన నే నొకనాటి రాత్రి శయ్యాతలంబున నిద్రించు సమయంబున హైదరాబా దా రాజ్యాధ్యక్షు ముఖ్యమంత్రియగు సర్ధాధికారి స్వరూపంబున నొక్క పరమ పురుషుండు సాక్షాత్కరించి కటాక్షేక్షణంబుల నన్నాదరవించుచు శ్రీ రఘు వీరశతకంబున కందపద్యపాదాంత్య పాదంబు నొసంగి, యీ శతకంబును, వరాహ పురాణ, భవిష్యోత్తర పురాణములయందు చెప్పబడిన వేంకటాచల మాహాత్మ్యము తరిగొండ వెంగమ్మయను భక్తురాలిచే బద్యకావ్యంబుగా రచియింపబడియున్నది. అది యక్షగానంబు నాటకం బొనరింప వినవేడుక యయ్యెడు గావున తదనుగుణ్యంబుగా పద్మావతీ పరిణయంబను వేంకటేశ్వర నాటకంబు సీతారామ పురధాముడగు సీతారామున కంకితంబు జేసి యక్షగానంబుగా రచియింపు మనవుడు నప్పురుషవరేణ్యునకే నిట్లంటి." - శ్రీ వేంకటేశ్వర నాటకము, అవతారిక, 2 పుట.

పై రీతిని 'పరమ పురుషునకును విన వేడుక యైనదిగా' గా తరువాతి కవుల స్వప్న వృత్తాంతములయందు చోటు చేసికొనిన వెంగమాంబ కవితా మహత్త్వము మిగుల ప్రశంసనీయమై యలరినది.

రసవంతమగు ఈ 'శ్రీవేంకటేశ్వర నాటక' యక్షగానమున వెంగమ వేంకటాచల మాహాత్మ్యమందలి పద్యములు, గద్యములు, భావములు సందర్భానుసారముగ స్వీకరింపబడి అందగించి యున్నవి. మచ్చుకు ఆకాశరాజు బంగారురేకుపై వ్రాయించిన ఈ క్రింది 'లగ్నపత్రిక' యొకటి.

"శ్రీమదఖండ లక్ష్మీప్రసన్నేక్షణా
 లంకృతులైన సల్లలితులైన
యఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకులైన
 సర్వజ్ఞులైన శ్రీ స్వామివారి
కాకాశ నృపుఁ డా యురారోగ్య పుత్ర పౌ
 త్రాభివృద్ధులు గల్గునట్లుగాను
నేను దీవించితి నేటిదినంబున
 కుశలంబు మాకు. మీ కుశల మచట

వ్రాసి పంపించవలయు నా వ్యాససుతుఁడు
గురుఁడు చెప్పఁగ మీకు నా కూతురైన
పద్మవతి నిచ్చి చేసెద పరిణయంబు
చిత్తగింపు చిదుల్లాస! శ్రీనివాస!"

-శ్రీ వేంకటేశ్వర నాటకము.134 పుట.

పై 'శుభలేఖ' వెంగమాంబ రచించిన వేంకటాచల మాహాత్మ్యమున యథాతథముగా నున్నది. (చూ.V ఆశ్వా; 81 ప.)

గత శతాబ్ది చివరి భాగమున, ఈ శతాబ్ద్యారంభకాలములోను తిరుపతి క్షేత్రముయొక్క మహిమను ప్రజాబాహుళ్యమున ప్రచారము గావింపవలె ననెడి తలంపుతో కొందరు రచయితలు వచనములో వేర్వేరు పేళ్ళతో కృతులను వెలయించిరి. అట్టి రచనలన్నింటికి వెంగమాంబ రచించిన వేంకటాచల మాహాత్మ్యమే మూదలయై కథావస్తువును ప్రసాదించి యుండుట ముఖ్యముగా గమనింపదగియున్నది. ఇందులకు ఈ క్రింది రచనలు కొన్ని యుదాహృతులు.

5) శ్రీ వేంకటాచల మాహాత్మ్యము - వచనము. ఈ గ్రంథ రచయిత చిత్తూరు వాస్తవ్యుడైన ఊటా యతిరాజదాసు. ఈ వచనకృతి తొలుత క్రీ.శ. 1903లోను, అటుతరువాత మఱి కొన్ని వత్సరములకును-మొత్తము రెండు పర్యాయములు చెన్నపట్టణము శ్రీ రాజరాజేశ్వరీ నికేతన ముద్రాక్షరశాలలో ముద్రితమైనది. ఇది వెంగమ పద్యకావ్యమునకు అచ్చుముగా వచనానువాదము. వెంగమాంబ పద్యకృతితో ఆఱాశ్వాసము లున్నట్లే ఇందును ఆఱధ్యాయము లున్నవి. ఒక్కొక్క ఆశ్వాసమందలి కథ ఒక్కొక్క అధ్యాయముగా అవతరించినది. చివరి అధ్యాయమునకు వెంగమ కృతిలో వలెనే ఇందును 'వీరలక్ష్మీవిలాస' మను పే రుంచబడినది. ఈ కవి తా నెచ్చటను వెంగమాంబ రచననుగూర్చి ప్రస్తావింపకున్నను, ఆ అనుకృతి విషయమున ఈ వచన కావ్యమే ప్రత్యక్షసాక్షిగా నున్నది.

6) శ్రీ తిరుపతిస్థల మాహాత్మ్యము - వచనము. ఈ చిఱుపొత్తముయొక్క
రచయిత, యెవరో తెలియరాదు. ఇది వేంకటేశ్వర భక్తసమాజము వారిచే 'గ్రీవ్స్ కుక్సన్ అండ్ కో' వారి స్కాటిష్ ముద్రణాలయమున మదరాసులో ముద్రితము. క్రీ.శ. 1917 ప్రాంతముననే ఇది మూడవ పర్యాయము ముద్రింపబడినది. ఇందలి కథ వెంగమాంబ కావ్యము ననుసరించి "శ్రీ వరాహ, భవిష్యోత్తర, పద్మపురాణాంతర్గతము" గానే అతిసంగ్రహముగా సాగినది. పద్యకావ్యమున కవయిత్రి కూర్చియున్న రెండు దండకములు "శ్రీ మన్మహాశ్వేత సత్క్రోడ రూపాయ," "శ్రీమత్పరంధామ! జీవావళిస్తోమ!" అనునవి54 ఈ వచనరచనలో 'శ్రీవరాహస్వామి దండకము,' 'శ్రీనివాస దండకము' అను పేళ్లతో చేర్పబడినవి. ఐనను ఈ గ్రంథ రచయిత కూడ ఈకవయిత్రి పేరును గాని, ఆమె కృతినిగూర్చి కాని పేర్కొనలేదు.

7) శ్రీవరాహ వేంకటేశ్వర మాహాత్మ్యము. ఇదియు పై దాని వలెనే చిన్నపుస్తకము. ప్రకటనకర్తలు శ్రీవేంకటేశ్వర భక్త సమాజమువారు. తదితర వివరములు పై దానివలెనే. ఇది వెంగమాంబ కృతియందలి తొలి మూడాశ్వాసముల కథకు సంగ్రహవచనరూపము. వెంగమకృతిలో తృతీయాశ్వాసమున శౌనకాది మహర్షులు వేంకటేశ్వరుని స్తుతించు ఘట్టమున గల నాలుగు శ్లోకములు "స్మరామి వేంకటేశ్వరం చ సాగరాత్మజేశ్వరమ్" అను మకుటముతో గూడినవి. [55] ఇందు శ్రీ వేంకటేశ్వర

స్తోత్రము అను పేర ప్రారంభమున కూర్పబడియున్నవి. ఇందును వెంగమ కృతి స్మరింపబడలేదు.

8) శ్రీ వెంకటాచల మాహాత్మ్యము. ఈ వచన గ్రంథమున అధ్యాయ విభజన లేకున్నను, ఇది వెంగమాంబ కావ్యము ననుసరించి వెలువడిన దనుటకు ఇందలి కథాక్రమముతోపాటు, ఎడనెడ ఉట్టంకింపబడిన పద్యములు చక్కని దృష్టాంతములు. మచ్చునకు ఒక పద్యము.

"ఎఱుకవారల-కెల్ల గుఱి కట్టుగా నిల్వ
నొక్క చో టున్నది నిక్కముగను

మేటి కరువలిఁ దనరారి మెఱయు కొండ
తొంటి మా పెద్ద లున్నట్టి దొడ్డకొండ."

ఈ పద్యము ఎఱుకత (వేంకటేశ్వరుడు) తన నివాసమును గూర్చి ధరణీదేవికి తెల్పు సందర్భమందలిది. వెంగమ కావ్యమునుండి యథాతథముగా స్వీకరింపబడినది. ఇక కథ యంతయు వెంగమ కావ్యానుసారియై సంక్షేపరూపమున వెలసియున్నది. 'ఇయ్యది పండితులచే చక్కగా సవరింపబడి, టి.కె. గోవిందరాజులునాయుడుచే తిరుపతి శ్రీ పద్మావతి ముద్రాక్షరశాలయందు ముద్రించి ప్రచురింపబడి'నట్లు ముఖపత్రమున గలదు. క్రీ.శ. 1939 నాటికి పదవకూర్పు నొందినదనినచో దీని ప్రచారవ్యాప్తిని సులభముగా నూహింపవచ్చును. ఇందులోను తరిగొండ వెంగమాంబ నామధేయ మెచ్చటను ప్రస్తావింపబడలేదు.

ఇట్లు వేంకటాచల మాహాత్మ్య పద్య కావ్యము నాదర్శముగా జేసికొని ప్రచార దృక్పథముతో సంగ్రహ వచన రచన లనేకము వెలువడినవి. అట్టివానిలో ఏ యొక్కటైనను వెంగమాంబ రచనను పేర్కొనక పోవుటకు కారణము ఆ పద్య కావ్యము ఆంధ్రదేశమున అత్యంత ప్రసిద్ధమై యుండుటయే. ఈ హేతువుచేతనే కాబోలు తిరుపతిలో ముద్రితమైన వెంగమ పద్యకావ్యముయొక్క ముఖపత్రమునందు 'ఫలానా కవయిత్రి రచించిన'దను మాటయే లేదు.[56]

9) ఇక ఈ పద్య కృతియందలి శ్లోకములను, పద్యములను ఆసక్తితో అనుకరించినవారును గలరు. అట్టివారిలో యమ్మనూరి వేంకటసుబ్బకవి యొకడు. క్రీ.శ. 19 వ శతాబ్ది ఉత్తరార్ధమున నుండిన ఈ కవి 'వేములపల్లె నాటకము' లని ప్రసిద్ధి గాంచిన యక్షగానములను రచించినవాడు. ఆ యక్షగానములలో నొకటగు 'విరాటపర్వనాటకము'[57] మొదట నున్న ప్రార్థనా శ్లోక మిది.

"శ్రీకాంతా ముఖపద్మపద్మ సుహృదం శీతాంశుబింబాననం
శ్రీకంఠార్చిత పాదపద్మయుగళం శేషాహి రాట్శాయినమ్।
లోకాతీత మనేక గోపయువతీలోలం పరం సర్వగం
శ్రీమద్వేములపల్లె వాస మనిశం శ్రీ వేంకటేశం భజే॥"

పై శ్లోకము వెంగమాంబ వేంకటాచల మాహాత్మ్య ప్రారంభమందలి ఈ క్రింది శ్లోకమునకు స్పష్టమైన అనుకరణము.

"శ్రీకాంతాత్మ సరోజచండకిరణం
శీతాంశుబింబాననం
శ్రీకంఠాబ్జజ సన్నుతాంఘ్రియుగళం
చిన్మాత్ర మప్రాకృతమ్।
లోకాతీత మనేకగోపయువతీ
లోలం పరం సర్వగం
స్వాకారం తరిగొండ శేషకుధరా
ధ్యక్షం భజేఽహం సదా॥"

పై రెండు శ్లోకములలో (శీ-లో-లోలం) పద్యచరణ భాగము లొకటిగా నుండుటను బట్టియు, సుబ్బకవి శ్లోకములోని నాల్గవపాదములో ప్రాసనియమము తప్పియుండుటనుబట్టియు అతడు వెంగమ శ్లోకము ననుకరించినట్లు స్పష్టపడుచున్నది. చివరి పాదమున స్వగ్రామనామమును కూర్పవలసి వచ్చుటచే అట్లు ప్రాస తప్పినది. పైగా ఈ కవి వెంగమాంబకు మిగుల తరువాతి కాలమున నుండినవాడు[58]

ఈ రీతిని ఈ మాహాత్మ్య కావ్యము అవిర్భవించిన నాటినుండి వేంకటాచలక్షేత్ర మహిమను తెలుగుసీమలో నలుదిశల ప్రచారము

గావించుచు, పెక్కు వేంకటాచల మాహాత్మ్య రచనలకు ఆదర్శమై, కథావస్తువును ప్రసాదించు కల్పతరువై, అనుకరణీయమగు ఒజ్జబంతియై వరలినది.

10) ఇటీవలి కాలమున శ్రీ బులుసు వేంకటేశ్వరులుగారు బహుపురాణ కథా సంకలితముగా రచించిన 'శ్రీవేంకటేశ్వర విజయము' (నిర్వచన పురాణ ప్రబంధము) నకును ఈ కవయిత్రి కృతి అనుసరణీయమై వరలినదని చెప్పినచో దీనికి గల ప్రశస్తి యెంతటిదో ఊహింపవచ్చును. వెంగమాంబ షష్ఠాశ్వాసము (వీరలక్ష్మీ విలాసము) న కల్పించిన కథాంశములను శ్రీవేంకటేశ్వర విజయకర్త ఒకటి రెండు చిన్న మార్పులతో యథాతథముగ స్వీకరించి యుండుట ఇందుల కొక నిదర్శనము.[59] ఈ కవి వెంగమాంబ రచనయందలి పద్యములను సైతము చక్కగా అనుసరించినా డనుటకు ఒక యుదాహరణ.

వ్యూహలక్ష్మి పద్మసరోవరమున నావిర్భవించిన ఘట్టము.

"ఘల్లు ఘల్లని కాళ్ల గజ్జె లందెలు మ్రోయ
మొలనూలు గజ్జె లిమ్ముగను మొరయఁ
జెలువారు పసిఁడియంచుల నొప్పు తెల్లని
చీర నిద్దపుఁ గాంతి చెన్నుమీఱ
రహిని చందురుకావిఱవికను బంగరు
గిండ్ల భంగిగను బాలిండ్లు తనరఁ."

- వేంకటాచల మాహాత్మ్యము, VI ఆశ్వా; 131 ప.

పై సీసపాదములు మూడు ఈ క్రింది సీసముగా నెట్లవతరించినవో పరిశీలింపదగినవి.

"గలుగలు గల్లను సలలితధ్వనులతో
గజ్జె లందియలును గాళ్ల నొప్ప
ముద్దులమూటలై మొలనూలి చిఱుగంట
లత్యంత మృదురావముల నొనర్ప
శుద్ధ సువర్ణరాసుల సుందర సువర్ణ
కాంతు లీనెడు నంచుకల మనోజ్ఞ
ధవళాంబరంబు నెంతయు నందముగఁ గుచ్చు
పోసికట్టి మిగులఁ బొలుపు నిలుప

చక్కనైన బంగరుగిండ్ల చందమునను
మెఱయఁ బాలిండ్లు చందురు మించినట్టి
రంగు గల రైకలో నిక్కి పొంగి క్రుంగి
సంగతంబుగ డంబు మీఱంగ మిగుల."

- శ్రీ వేంకటేశ్వర విజయము, V ఆశ్వా; 759 ప.

పై రీతిగా ఈ ఘట్టమునందంతట ఈ కవి వెంగమాంబ పద్యములను అనుసరించియున్నాడు. ఇట్లు 'వేంకటాచల మాహాత్మ్య' మనినచో తరిగొండ వెంగమాంబ రచనయే యను భావన యావదాంధ్రమున బహుళ ప్రశస్తిని, ప్రచారమును పొందియున్నదనుటకు పైన దెల్పిన వన్నియు చాలినన్ని నిదర్శనములు.

కవయిత్రి, కృతి, కృతిపతి - అను ఈ త్రిపుటి ఏకనామధేయాన్వితమై పరగుటేగాక, ఇట్లు ఏకత్ర (వేంకటాచలముపై) వెలయుట మన సారస్వతమందలి విశేషములలో అపూర్వమైనది; అద్వితీయమైనది.

ఒక్కమాటలో క్రీ.శ. పదునెనిమిదవ శతాబ్దపు చివరి పాదమనెడి బ్రాహ్మముహూర్తము (రాత్రి నాల్గవజాము) లో తిరుమల శిఖరముపై ఉదయించి, ఆంధ్ర సాహిత్యాకాశమున ఉజ్జ్వలముగా వెలుగు లీనుచున్న వేగుచుక్క వేంకటాచల మాహాత్మ్యము.

## అష్టాంగయోగసారము

వెంగమాంబ వెలయించిన పద్యకృతులలో అష్టాంగ యోగసారము రెండవది. తా నంతకు పూర్వము రచించియుండిన వేంకటాచలమాహాత్మ్యము నుండి కొంత భాగమును వేరుగా తీసి, అందుల కుచితమగు ఉపక్రమోప సంహారములను ఘటించి ప్రత్యేక కృతిగా కవయిత్రి దీనిని సంతరించినది. ఇట్లొనరించుటకు హేతువు నీమె క్రింది విధముగా వివరించినది.

"వన్నె కెక్కిన నందవర చౌడమాంబను,
శ్రీనివాసుని, విరించిని నుతించి

శ్రీ తరిగొండ నృసింహునిఁ గీర్తించి
యీ వరాహపురాణ మలఘు పద్య
కావ్యంబుఁ జేసి యోగములందు విస్తార
ముగ రచించితిఁ గాన మొనసి సభల
నీ యోగమర్మంబు లెఱిఁగి చెప్పం దగు
ననుచుఁ గొందఱు పల్కురందువలన

నా వరాహపురాణమం దమరు యోగ
సరణి నీవలఁదీసి యెచ్చటను భక్తి
యోగమే యుంచి యష్టాంగయోగసార
మనఁగ నీ కృతి రచియింతు నార్యులార!"

- అష్టాంగయోగసారము, 2 ప.

వేంకటాచల మాహాత్మ్యాంతర్గత వరాహ పురాణ భాగమునందలి అష్టాంగ యోగముల వివరములు ప్రత్యేక కృతిగా అందుబాటులో నుండినచో, బృహద్గ్రంథమగు వేంకటాచల మాహాత్మ్యమును ప్రతి పర్యాయము వెదకికొను శ్రమ లేకుండ, వాటి మర్మములను తెలిసికొని సభలలో చెప్పుటకు అనువై యుండునని కొందరు (భక్తులు) పల్కిరట! ఆ 'కొందరు' బహుశః జిజ్ఞాసువులగు శిష్యులైయుందురు. దీనినిబట్టి ఆమె కృతులకు లోకమున గల ప్రఖ్యాతి, ప్రచారములు వెల్లడి యగుచున్నవి.

**కథాసూత్రము :**

ఈ కృతి వేంకటాచల మాహాత్మ్యమున ఏకదేశమే యగుటచే అందలి కథాసూత్రముయొక్క కొంతమేర ఈ కృతియం దంతర్వాహినిగా చేతికందును. అట్లు ఈ కృతిలో కొనసాగియున్న కథాస్వరూపము సంగ్రహముగా నిట్లున్నది.

సూతునివలన ఆయా పురాణ ధర్మములను వినిన శౌనకాదు లొకనాడు బహుదుస్తర యోగ విధాన మర్మములను తెల్పవలసినదిగా కోరుదురు. అపుడు సూతు డిట్లు చెప్పుట కుపక్రమించును. మునులారా! పూర్వము వరాహదేవుడు భూదేవికి దయతో ఉపదేశించిన అష్టాంగ యోగములను గురుడగు వేదవ్యాసుని వలన విని యున్నాను.ఆ ప్రకారము మీ కిపు

డెఱిగింతును. భూదేవి వరాహస్వామి నిట్లడిగినది. 'మానవులు జ్ఞానాభినివిష్టులై మోక్షమందే లక్ష్యము నిల్పినపుడు సత్కర్మల నాచరింపక పోయినను ఫరవాలేదు కదా? లేక ఆ సత్కర్మములను వారాచరించియే తీరవలెనా? తెల్పుడు' అని.

అందులకు వరాహస్వామి 'భాసుర విజ్ఞాన భక్తివైరాగ్యములు గల్గిన వారైనను వేదోక్తకర్మలను విడువజనదు. యజ్ఞయాగాది సత్కర్మల ఫలమును హరి కర్పించి ఫలము నొందవలెను. అట్టివారు బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్న్యాస, అవధూతాశ్రమములను క్రమముగా నొంది, బ్రహ్మసాయుజ్యమును పడయుచుందురు. మఱికొందరు కర్మఫలమును భగవంతున కర్పింపక, పుట్టుచు, గిట్టుచు, మఱల పుట్టుచు నుందురు. కొందఱు యోగాభ్యాసనిష్ఠులై మోక్షపదవి నొందుదురు.' అని తెల్పెను. అటుపిమ్మట భూదేవి ఘనతరములైన యోగప్రకారములను వివరింప ప్రార్థింపగా వరాహస్వామి అష్టాంగ యోగములను వివరించెను. అట్లు సూతుడు వివరించుటతో ఈ కృతి ముగియుచున్నది.

సంగ్రహములు, సుబోధములునైన ఇట్టి తాత్త్వికకృతులను వ్రాయుట ఈ కవయిత్రికి మొదటినుండియు అలవాటులో నున్నదే. వెంగమ వేదాంత కావ్యము లన్నియు సంవాదాత్మక వస్తుకములు. ఆ ప్రకారముగ ఇది ధరణీవరాహ సంవాదాత్మకము 'కపిలదేవహూతి సంవాదము' న స్వానుభవమును ప్రవేశపెట్టి 'రాజయోగసారము' గా తీర్చినట్లే వెంగమ ఈ 'ధరణీ వరాహ సంవాదము' ను 'అష్టాంగయోగసారము' గా తీర్చిదిద్దినది. ఇట్లు నామకరణములోనే కవయిత్రి ఈ కృతియొక్క ప్రత్యేకతను ధ్వనింపజేసినది. ఈ లఘుకృతికి దగిన ఉపక్రమోపసంహారములను సైతము కూర్చుటవలన ప్రత్యేక కృతిగా దీని అస్తిత్వమున కొక సమగ్రత సమకూరినది.

**అనువాదపద్ధతి :**

సంస్కృత వేంకటాచల మాహాత్మ్యమునందలి వరాహపురాణ ప్రథమ భాగమున 59,60 అధ్యాయములలో గల దాదాపు నలువది

యైదు శ్లోకము[60] లీ కృతికి మూలమని పరిశీలనవలన తేలినది. కవయిత్రి ఆ నలుబదియైదు శ్లోకముల భావమును ఈ గ్రంథ పరిమితిలో మూడవవంతున[61] స్వేచ్ఛగా ఇమిడించి, తక్కిన రెండువంతుల గ్రంథమున[62] మంత్ర, లయ,హఠ, సాంఖ్య, అమనస్క, రాజయోగములను, ఉత్తమ రాజయోగియొక్క సచ్ఛిష్యునియొక్క లక్షణములను స్వానుభవ పూర్వకముగా, స్వతంత్రముగా సులభశైలిలో వివరించినది.

ఆత్మయోగానుభవమే యజ్ఞముగా, ఆత్మయే సోమయాజిగా రూపించిన ఈ క్రింది సీసపద్యములు ఈ కవియోగిని యొక్క ఆధ్యాత్మికానుభూతికి, లోకజ్ఞతకు జగాదివ్వటీలు.

"అల బుద్ధియును జిత్త మాయహంకృతి మాన
సంబును బుత్విగ్గణంబు గాఁగ
ప్రణవ వర్ణంబు యూపస్తంభమును గాఁగఁ
బ్రాణదశేంద్రియ పంక్తి యచటఁ
బశుసమూహము గాఁగ భాసురానాహత
నాదంబు విహిత మంత్రంబు గాఁగఁ
బొసఁగఁ దప్పశువుల బోధాగ్నిలో వేల్చి
జ్ఞానామృతము సోమపానముగను
ద్రావి జొక్కుచు మోక్షకాంతా సమేతుఁ
డగుచు వేదాంత సూత్రంబు లనెడు కర్ణ
కుండలంబులు వెలుఁగఁ ద్రికూట మార్గ
మందు శాంత ప్రముఖ మిత్రు లలరి కొలువ.

ప్రకటితాచారముల్ బండికమ్ములు గాఁగ
శమదమాదులు సుచక్రములు గాఁగ
ప్రాణపంచకము నేర్పడఁ గాఁడి గాఁగ న
నూన హృద్వనజంబు నొగయుఁ గాఁగ
వరకర్ణ నేత్రముల్ వాహనంబులు గాఁగఁ
రహి వివేకంబు సారథియుఁ గాఁగఁ

దగు నిస్పృహత్వమె త్యాగ ధ్వజము గాఁగఁ
ప్రబలు యోగ రథంబుపైన నెక్కి
పోయి నడిమి సరస్వతిన్ బొంది గంగ
యమునయును నిల్చు నాల్గు మార్గముల నడుమ
నవభృథ స్నాన మొనరించి యాత్మ సోమ
యాజి యన నొప్పుచుండు నీ యవని మీద."

- అష్టాంగయోగసారము, పుటలు 37.38.

మూలమున "సితేన భూవరాహేణ ధరణ్యై భాషితాః పురా" (వరాహ పురాణ ప్రథమ భాగః, 59 అధ్యా; 4 శ్లో.) అని సూచనామాత్రముగా నున్న ధరణీ, వరాహ సంవాదాత్మకతను కవయిత్రి యీ కృతిలో చక్కగా పెంచి ఒక్కొక్క విషయమును భూదేవి యడుగగా శ్వేతవరాహ స్వామి వచించినట్లు సంభాషణాత్మకముగా తీర్చి యున్నది.

ఈ కృతియందలి విషయము తాత్త్వికము, యోగ సంబంధియగుటచే సామాన్యులకును సుకరముగా అర్థమగుటకై కవయిత్రి వచనమునే యిందు విరివిగా రచించినది. ఇందుల కొక యుదాహరణము:

"యదా తు యోగినోజి హాసా వర్తతే తదా।
ఓ మిత్యుచ్చారయే ద్యోగీ వేఙ్కటేశ మనుస్మరన్॥
బ్రహ్మరంధ్రా ద్వినిర్గచ్ఛన్ ప్రవిశే దర్చిరాకృతిమ్।
అర్చిరాది సుమార్గేణ ప్రవిశ్య పరమం పదమ్॥
సాయుజ్యం వేఙ్కటేశస్య లబ్ధ్వాఽ నందీ భవేచ్చిరమ్।
యది స్యాద్వేఙ్కటేశస్య కైఙ్కర్యే ధీర్బలీయసీ॥
తదా యోగం స్థిరః కుర్యా దుపదేశా ద్గురో స్స్వయమ్।
... ... ... ..."

- శ్రీ వేంకటాచలమాహాత్మ్యగ్రంథః, పుట ౬ ౨
(వరాహ పురాణమ్ 60 అధ్యా; 19-22 శ్లో)

పై శ్లోకముల భావ మీ క్రింది వచనభాగమున నెంత సుబోధముగా, సమన్వయ పూర్వకముగా, స్వేచ్ఛగా, మూలమునకు వ్యాఖ్యాన ప్రాయముగా అనువదింపబడినదో విజ్ఞు లరయ దగినది.

> "ఇంక సచ్ఛిష్యుం డెవ్వఁ డనిన సాధనచతుష్టయసంపన్నుండై వంచన లేక, జారచోరక్రూర గుణంబులు విడిచి, పరమశాంతి గలవాఁడై, గురుసేవఁ జేసి తద్గుర్వనుగ్రహంబునకుఁ బాత్రుఁడైనవాఁడు దేహాభిమానంబు విడిచి ప్రణవపూర్వకంబుగా వేంకటేశానుస్మరణంబుఁ జేయుచు నిజయోగ బలంబున సుషుమ్నాది ద్వారంబు భేదించుకొని యర్చిరాది మార్గంబునం జని పరమ పదంబుఁ జెందు. ఇట్టి యోగాభ్యాసంబుఁ జేయలేకున్నను అత్యంత గురుభక్తి కలవాఁడై తత్కటాక్షంబున భక్తిజ్ఞాన వైరాగ్యంబు లభ్యసించి యుపశాంతిఁ బొంది జ్ఞాని నని యహంకరింపక యుండవలయు నది యె ట్లనిన"
>
> - అష్టాంగయోగసారము, పుట 9.

**కృతి వైశిష్ట్యము :**

'కర్మయోగ జ్ఞానయోగములలో దేని ననుసరింపదగు?' నను ప్రశ్నకు సమాధానముగావెలసిన ఈ వేదాంత కావ్యము ఆ రెండుమార్గములను భక్తిమార్గముతో చక్కగా సమన్వయించుచున్నదై యమ నియమాద్యష్టాంగ యోగమునకు లక్ష్యభూతుడైన యోగపూరుషుడు వేంకటేశ్వరుడే యని ప్రతిపాదించుచున్నదై, తెలుగున వెలసిన వేదాంత వాఙ్మయమున విశిష్టస్థానమును గడించియున్నది. వెంగమాంబ తన రచన లన్నింటిలోను అవకాశము కల్గిన చోటులం దెల్ల తాత్త్విక విశేషములను పాదుకొల్పియున్నది. ఆ రీతిని ఈ కృతిభాగము వేంకటాచల మాహాత్మ్య రచనలో ఈ కవయిత్రికి లభించిన అట్టి యవకాశములలో నెల్ల మిగుల పెద్దది. అందువలననే ఇది ప్రత్యేక కృతిగా పరిణతి నొందజాలినది.

భాగవతమున ఏకదేశమగు కపిలదేవహూతి సంవాదము నాధారముగా గొని రాజయోగసారమును ద్విపదలో రచించిన వెంగమాంబ అనంతర కాలమున ఆ భాగవతము నంతటిని ద్విపదీకరించినది. అటు పిమ్మట వేంకటాచలమాహాత్మ్యమును పద్యకావ్యముగా అనువదించిన

ఈ కవయిత్రి అందుండి ధరణీవరాహ సంవాదాత్మకముగా నున్న ఈ అష్టాంగ యోగసారకృతిని సంతరించినది. ఇట్లు ఈ రెండు 'యోగసార' కృతులకు ఇది అనుద్దిష్టముగా నేర్పడిన ఒక విధమగు సామ్యము.

తరిగొండ వెంగమాంబ వెలయించిన ఈ పద్యకావ్యములు రెండును అవతరించిన నాటినుండి సభలలో పఠన పాఠన ప్రచారముల నొందుచు, వేంకటాచల క్షేత్రముయొక్క మాహాత్మ్యమును భక్తిబంధురమైన, సుందరమైన శైలిలో తెలుగునాడు నలుగడల ప్రపంచించి చరితార్థము లైనవి.

**పద్యకావ్యములు - జ్ఞాపికలు**

1. చూ. శ్రీ వేఙ్కటాచల మాహాత్మ్య గ్రంథః, (తెలుగులిపి), శ్రీ మహంతు ప్రయాగదాసజీ వారిచే 1928 లో ప్రకటితము.
2. Vide : Tirumala - Tirupati Epigraphical series, Vol II - Inscriptions of Saluva Narasimha's Time, pp 193 - 198.
3. Vide : "Sri Venkatachala - Mahatmya An Epitome" by S. Subrahmanya Sastry, B.A., Devasthanam Archaeologist, published in TIRUMALAI VENKATESWARA (Monthly Journal), - Vol, No. I. pp. 13-16
4. తక్కినవారితోపాటు 'పురాణభట్టరు' కు. పణమును పేర్కొనుచున్న ఈ శాసనము క్రీ.శ. 1464 జనవరి 18వ తేదీనాటిది. సాళువ మల్లమదేవ మహారాజు వేయించినది. Vide : T.T.D Epigraphical series, Vol II Inscriptions of Saluva Narasimha's Time, p. 285
5. చూ. అన్నమాచార్య చరిత్రము, పుట 46.
6. కాంచీ ప్రాంతీయుడగు "ప్రతివాది భయంకరం అణ్ణ" అను శ్రీ వైష్ణవపండితుడు (క్రీ.శ. 1361 - 1453) తన గురువగు అళఘియ

మణవాళ మహాముని వెంట తిరుమలకు విచ్చేసినపుడు ఆ గురువర్యుని అజ్ఞానుసారము 'శ్రీవేంకటేశ సుప్రభాత స్తోత్రము' (సుప్రభాతము, స్తోత్రము, ప్రపత్తి, మంగళాశాసనము) ను రచించెను. Vide : Souvenir in commemoration 616th birth anniversary of Sri Vadhibheekara Mahaguru Anna, pp 13.

7. చూ. శ్రీ వేంకటాచల మాహాత్మ్యగ్రంథః , పుట 30, శ్లో. 33 -38

8. చూ. శ్రీ వేంకటాచల మాహాత్మ్యగ్రంథః పుట 5, శ్లో. 11. 12 (వరాహపురాణమ్, ప్రథమోభాగః )

   చూ. అందే, పుట 129 శ్లో. 61, 64, (పద్మపురాణమ్)

   చూ. అందే, పుట 140, శ్లో. 30,31 (పద్మపురాణమ్)

   చూ. అందే, పుట 156, శ్లో. 14,15, (హరివంశాంతర్గత శేషధర్మా)

   చూ. అందే, పుట 161, శ్లో 18, 19,20,27,28

   చూ. అందే, పుట 162, 163, శ్లో 53 -61

   చూ. అందే, పుట 521, శ్లో. 19 - 21 (స్కాందపురాణమ్)

9. చూ. శ్రీ వేంకటేశ సుప్రభాతం - 6,9,14,15 శ్లోకములు
   స్తోత్రం శ్లో .2

10. Vide : T.T.D Epigraphical series, Vol V, Inscriptions of Sadasivaraya's time, pp. 30, 79, 126, 134, 136, 138, 188, 264.

11. చూ. ఆంధ్రకవి తరంగిణి, 9వ సంపుటము, పుట 180.

12. వినుము మత్స్య పురాణ, వామన పురాణ
    ములను, వేంకట మాహాత్మ్యమును, ఫలప్ర
    దము చతుర్వాటికా మహత్త్వమును దెనుఁగు

చేసి వెలసితి వవనిఁ బ్రసిద్ధి దనర"
చూ. మ. ఓ. మే. లై. ట్రై. కే వాల్యూం IV పార్ట్ 3,
పుటలు 1697, 1698.

13. చూ. 'ఆంధ్ర సంస్థానములు - సాహిత్య పోషణము' పుట 404.

14. " .... ... కళలు గాంచుచు బుధకులమును బోషింప

సర్వజ్ఞ మణి యనఁ జాటు టరుదె
వేంకటాచల మాహాత్మ్య విపులకృతిని
... ... రచియింప బుధవరుఁ డితఁ డం టంచుఁ
బలుకఁ జెల్లదె యని జనుల్ బ్రస్తుతింపఁ
గొరలె తతకీర్తి జితరాజు కొండరాజు"
- రామకృష్ణార్జునరూపనారాయణీయము, అవతారిక, పుట 8,
చూ. 'ఆంధ్ర సంస్థానములు - సాహిత్య పోషణము,' పుట 437.

15 చూ. శ్రీనివాస విలాస సేవధి, పీఠిక, పుట 7.

16 చూ. వేంకటాచల మాహాత్మ్యము, I ఆశ్వా; 20 ప.

17 చూ. వేంకటాచల మాహాత్మ్యము, I ఆశ్వా; 189 ప.

18 చూ. అందే, 191 ప.

19 చూ. శ్రీవేంకటాచల మాహాత్మ్య గ్రంథః పుటలు ౧౪౫ - ౧౫౧

20 శ్రీ వేంకటాచల మాహాత్మ్య గ్రంథః, పుటలు 3, ౪ (వరాహ పురాణం 34 అధ్యా.)

21 చూ. వేంకటాచల మాహాత్మ్యము, I ఆశ్వా; 49 - 72 వ

22 చూ. వేంకటాచల మాహాత్మ్యము IV ఆశ్వా; 120 -131 వ.

23 చూ. శ్రీ వేంకటాచల మాహాత్మ్య గ్రంథః, పుటలు ౯, ౧౦ (వరాహ పురాణం 37 అధ్యా; 31 - 53 శ్లో)

24 చూ. వేంకటాచల మాహాత్మ్యము, I ఆశ్వా; 152 - 156 వ.

25 చూ. శ్రీ వేంకటాచల మాహాత్మ్య గ్రంథః ; పుటలు ౨౭ - ౨౮

26 చూ. వేంకటాచల మాహాత్మ్యము, I ఆశ్వా; 152 - 156 వ

27 చూ. శ్రీ వేంకటాచల మాహాత్మ్య గ్రంథః, పుట ౩౪౯ (భవిష్యోత్తర - 6 అధ్యా. ౨౫-౨౭ శ్లో)

28 చూ. అందే, పుటలు ౧౭౮ ౧౮౧ (బ్రహ్మాండ పురాణం - 7 అధ్యా; ౧- ౫౪ శ్లో).

29 చూ. వేంకటాచల మాహాత్మ్యము IV ఆశ్వా; 198 -210 వ.

30 చూ. శ్రీ వేంకటాచల మాహాత్మ్య గ్రంథః, పుట ౧౫౦ (పద్మపురాణం, 11 అధ్యా ; 94 - 104 శ్లో)

31 వాశిష్ఠ రామాయణము, ఆదిప్రకరణము, పుటలు 19-22.

32 చూ. శ్రీ వేంకటాచల మాహాత్మ్య గ్రంథః, (భవిష్యోత్తర పురాణం, 6 అధ్యా.1 - 29 శ్లో) పుటలు ౩౪౮ - ౩౪౮

33 చూ. వేంకటాచల మాహాత్మ్యము IV ఆశ్వా; 198 - 244 ప ; 245 - 256 వ.

34 చూ. శ్రీ వేంకటాచల మాహాత్మ్య గ్రంథః, పుటలు ౬౧ - ౬౩ వరాహ పురాణం 60 అధ్యా; 1 - 30 శ్లో)

35 వేంకటాచల మాహాత్మ్యము, III ఆశ్వా; 80 - 164ప.

36 వేంకటాచల మాహాత్మ్యము VI ఆశ్వా; 171 -178 వ.

37 "నగరార్ణవ శైలర్తు చంద్రార్కోదయ వర్ణనం ।
ఉద్యాన సలిలక్రీడా మధుపాన రతోత్సవాః ॥

విప్రలంభో వివాహశ్చ కుమారోదయ వర్ణనం ।
మంత్రద్యూత ప్రయాణాజి నాయకాభ్యుదయా అపి॥

ఏతాని యత్ర వర్ణ్యంతే తన్మహా కావ్యముచ్యతే।
ఏషా మష్టాదశానాం యైః కైశ్చిదూనమపీష్యతే॥"
ప్రతాపరుద్ర యశోభూషణం, కావ్య ప్రకరణం 68 -70 శ్లో.

38 శ్రీ వేంకటాచల మాహాత్మ్యము, I ఆశ్వా; 24 - 31 వ

39 శ్రీ వేంకటాచల మాహాత్మ్య గ్రంథః, పుటలు ౩౯ - ౪౨ (వరాహ పురాణం, 50 అధ్యాయమున 39 శ్లోకమునుండి 51 వ అధ్యాయము పూర్తి)

40 శ్రీ వేంకటాచల మాహాత్మ్య గ్రంథః, పుటలు ౩౬౨ - ౪౦౮ (భవిష్యోత్తర పురాణం 9 అధ్యాయము 165వ శ్లోకమునుండి 11వ అధ్యాయము పూర్తి.)

41 శ్రీ వేంకటాచల మాహాత్మ్య గ్రంథః, పుటలు ౩౧ -౩౨ (వరాహపురాణం, 47 అధ్యా ; 9-41 శ్లో.)

42 వేంకటాచల మాహాత్మ్యము, II ఆశ్వా; 58 - 62 ప.

43 శ్రీ వేంకటాచల మాహాత్మ్య పుటలు ౧౪౮ - ౧౪౯ (పద్మపురాణం, 34 అధ్యా ; 56 - 79 శో)

44 వేంకటాచల మాహాత్మ్యము, VI ఆశ్వా; 114 -134 వ.

45 శ్రీ వేంకటాచల మాహాత్మ్య గ్రంథః, పుటలు ౩౩౦ - ౩౩౨ (భవిష్యోత్తర పురాణం,1 అధ్యా.89 - 130 శ్లో)

46 శ్రీ వేంకటాచల మాహాత్మ్య గ్రంథః, పుటలు ౩౩౩ - ౩౩౫ (భవిష్యోత్తర పురాణం,1 అధ్యా.157 - 192 శ్లో)

47 వేంకటాచల మాహాత్మ్యము IV ఆశ్వా; 69 -81 వ.

48 భక్తికి రసత్వమును స్థాపించిన ఆలంకారికులలో అగ్రగణ్యుడు మధుసూదనసరస్వతి. ఇతడు తాను రచించిన 'భక్తి రసాయన' మను గ్రంథమున నిట్లు వచించి యున్నాడు:

" పరిపూర్ణరసా క్షుద్రరసేభ్యో భగవద్రతిః।
ఖద్యోతేభ్య ఇవాదిత్య ప్రభేవ బలవత్తరా॥"

'కాంతాది విషయములగు తక్కిన రసము లన్నియు క్షుద్రములు, అసంపూర్ణములు: భగవద్రతి పూర్ణరసము. తక్కిన రసములు మిణుగురు పురుగులవంటివి. భక్తిరసము సూర్యకాంతి వంటిది'

- చూ. కావ్యాలంకార సంగ్రహము, పుట 308.

49 "శృంగారాకృతితోడ వచ్చి 'పదముల్ శృంగార సారంబుతో
డం గూఢంబుగఁ జెప్పు నీ' వనఁగ, 'నట్లేఁ జెప్పులే' నన్న నన్
ముంగోపంబునఁ జూచి లేచి యట నే మ్రొక్కంగ మన్నించి త
చ్ఛృంగారోక్తులు తానె పల్కికొను నా శ్రీ కృష్ణు సేవించెదన్."
- వేంకటాచల మాహాత్మ్యము, I ఆశ్వా; 13 ప.

50 "తను వగు శబ్దార్థంబులు, ధ్వని జీవ మలంక్రియావితానము సొమ్ముల్
తనరు గుణంబులు గుణంబులు, ఘనవృత్తులు వృత్తు లౌర కావ్యేందిరకున్."
- కావ్యాలంకారసంగ్రహము, II ఆశ్వా; 53 ప.

51 మ. ఓ. మే. లై. డి. కే. వాల్యూం I, పుటలు 393 -398.

52 ఆంధ్రకవుల చరిత్రము, తృతీయ భాగము, పుటలు 585 -589.

53 ఈ యక్షగానము క్రీ.శ. 1882 సంవత్సరమున చెన్న పట్టణము ఆదికళానిధి ముద్రాక్షర శాలయందు ముద్రితమైనది.

54 వేంకటాచల మాహాత్మ్యము, I ఆశ్వా; 72 దండకము: VI ఆశ్వా; 119 దండకము.

55 అందే, III ఆశ్వా; పుట 89

56 శ్రీ వేంకటాచల మాహాత్మ్యము, తిరుపతి తిరువేంకటేశా ముద్రణాలయమందు ముద్రితము (1955).

57 'విరాటపర్వ నాటకము' యన్.వి. గోపాల్ అండు కంపెనీవారి ఆనంద భారతీ ముద్రాక్షరశాల (చెన్నపురి) యందు ముద్రితము (1941).

58 ఆం. య. గా. వా. చ. ద్వి. భా. పుట 172. (ఈ కవి క్రీ.శ. 1894 ప్రాంతమున జీవించియుండిన ట్లిందుమూలముగా తెలియుచున్నది.)

59 శ్రీ వేంకటేశ్వర విజయము, V ఆశ్వా; 642 - 955 ప.

60 శ్రీ వేంకటాచల మాహాత్మ్య గ్రంథః, పుటలు ౫౯ ౬౦ (59 అధ్యా; 4,5 శ్లో; 60 అధ్యా; 25-35 శ్లో.)

61 అష్టాంగ యోగసారము, పుటలు 2 -15.

62 అందే, పుటలు 15-39.

## తత్త్వ కీర్తనలు

**ఉనికి :**

తరిగొండ వెంగమాంబ పెక్కు గ్రంథములను రచించుటతోపాటు ఆయా సందర్భములలో పెక్కు కీర్తనలను, గేయములను ఆశువుగా అల్లుచు ఆలాపించుచుండెడిది. ఆమె అట్లు సృజించిన అనర్ఘగేయ సంపదలో నేటి తరమునకు దక్కినది చాలకొలది. నిన్న మొన్నటివరకు సజీవులైయుండిన వృద్ధులు కొందరికి ఆమె రచించిన పాట లెన్నో కంఠస్థములుగా నుండెడివని తెలియుచున్నది. ఆ రాశిలోనుండి కొన్ని మాత్రమే ఈ నాడు ముద్రితరూపమున లభించుచున్నవి.[1] మఱికొన్ని తాళపత్రములలో సకృతుగా దర్శన మిచ్చుచున్నవి. ఇవన్నియు వేదాంతభావగుంఫితము లగుటచే 'వేదాంత కీర్తన' లని, 'తత్త్వకీర్తన' లని, 'తత్త్వము' లని, 'వచనము' లని పేర్కొనబడినవి.

**నిర్వచనము :**

'తత్త్వ' మనగా ఒకానొక వస్తువుయొక్క నిజస్థితి. ధ్యానాసక్తులగు మహనీయులు కొందరు సృష్టియొక్క, తత్సృష్టికర్తయొక్క తత్త్వమును భావన చేసి, ఆ భావనాసరణిలో తమకు కలిగిన అనుభూతిని ఆ యా కాలములయందు సామాన్యజనులకు సుబోధమైన భాషలో పాటల రూపమున వెలువరించుచు వచ్చిరి. పరబ్రహ్మము యొక్క తత్త్వమును తెలుపునవి యగుటచే అట్టి పాట లన్నింటికి 'తత్త్వము' లనెడు వాడుక లోకమున నేర్పడినది.

మొత్తముమీద నేటికి లభించిన వెంగమాంబ కీర్తనలు ఇరువదికి మించుట లేదు. ఇవి అల్పసంఖ్యావశిష్టము లైనను వేర్వేరు నడకల వైవిధ్యముచేతను, సుబోధమగు భాషలోఇమిడిన యున్నత భావములచేతను వేంగమాంబ గేయరచనా ప్రావీణ్యమునకు ప్రాతినిధ్యము వహించుచున్నవి. వెంగమ రచించిన యక్షగానములలో సమృద్ధిగా నున్న వేర్వేరు గేయములు ఆమె కవితాకౌశలమును చక్కగా చాటుచునేయున్నను, అవి ఆయా కథాసందర్భముల ననుసరించి విభిన్న రసభావానుగుణముగా అవతరించినట్టివి. ప్రకృత పరిశీలనలో నివి మాత్రము ముక్తకములు; ఆధ్యాత్మిక భావభరితములు.

**తరిగొండముద్ర :**

వెంగమాంబ రచించిన తత్త్వకీర్తన లన్నియు 'తరిగొండ' ముద్రాంకితములు. వీటిలో చివరి చరణమున 'తరిగొండ నరహరి', 'తరిగొండాధిపుడు', 'తరిగొండపతి' ఇత్యాది పదములు తప్పనిసరిగా కూర్పబడియుండును. ఉదాహరణకు "బ్రహ్మ మేదో తెలుప రయ్యా బ్రాహ్మణులారా!" అను తత్త్వమున చివరి చరణ మిట్లున్నది.

"నిండు వేడుకతో 'తరిగొండ భ్రమరాంబ ఊర్ధ్వ
కుండలి ప్రణవ మాహాత్మ్యం సుబ్రమణ్య గురుడని మీ రెఱిగి నందు
॥ బ్రహ్మమేదో ॥

పై చరణములలో పేర్కొనబడిన 'తరిగొండ భ్రమరాంబ' ఒకానొక వ్యక్తికాదు. తరిగొండ గ్రామమున వెలసియున్న పార్వతీ దేవియే. ఇట్లే ఇష్టదైవమగు తరిగొండ నృసింహుని, ఆధ్యాత్మిక గురువగు సుబ్రహ్మణ్యుని ఈ కవయిత్రి మఱికొన్ని కీర్తనల చివర ఉట్టంకించినది. వెంగమ తదితర తత్త్వకీర్తన కర్తలవలె స్వనామధేయమును గాక, తన గ్రామమందలి దైవతముల తనయొక్క, గురునియొక్క పేళ్ళను కీర్తనలలో ముద్రించుటవలన ఆ పేర్లు గల వ్యక్తులే ఈ కీర్తనలను రచించి రని పరిశోధకులు భ్రాంతి నొందుటకు కారణమయ్యెను.[2] ఈ రీతిని భ్రాంతికి హేతువులైన ఈ కీర్తనలన్నియును "సుజ్ఞాన రత్నావళి" యను వేదాంత కీర్తనల సంకలన గ్రంథములో 'తరిగొండ వెంగమ్మగారి కీర్తనలు' అని స్పష్టముగా నిర్దేశింపబడియే యున్నవి. (చూ. పుటలు 67 -74).

మీద తెల్పినట్లుగా 'తరిగొండ' ముద్రాంకితములై యుండుట వెంగమాంబ కీర్తనలకు గల ముఖ్య లక్షణము. ఒక్కొక్కచో ఈమె రచించిన ద్విపదార్థములవంటి కొన్ని గేయములలో ప్రతిదాని చివర తరిగొండ ముద్ర లేకున్నను, అట్టి గేయ సముదాయములలో చిట్టచివరి గేయము (ద్విపదార్థము) నందైనను తరిగొండముద్ర తప్పకయుండును. 'వేదాంత జ్ఞానబోధిని' యను సంకలన గ్రంథమున ముక్తికాంతావిలాసమునకు పిదప చేర్చబడిన ఎనిమిది ద్విపదార్థము లిందు కొక యుదాహరణము.[3] వాటిలో చివరిదగు ఈ క్రింది ద్విపదార్థమున తరిగొండ ముద్ర కూర్చబడియుండుట తిలకింపదగును.

కపట మార్గంబును కడఁజిమ్మి వేగ।
అపరోక్ష లక్ష్యార్థ మనుభవంబునకు॥
నెపముచే తరిగొండ నేర్పునఁ జేరి।
తపము సాధించ బొయ్యేరే॥

ఓంకార గురుని కృప గలిగి నిపుణు లయ్యేరే।
విపరీతమైన విషయచాపల మణఁచి, మంచి॥
వృపము దెలిసి జన్మఫలమ నేటి శాంత।
తపము సాధించఁ బొయ్యేరే॥"

పైన పేర్కొన్న ఎనిమిది ద్విపదార్థములతో గలిపి వేదాంత జ్ఞానబోధినిలో ముద్రితములైన వెంగమ ఆధ్యాత్మిక గేయములు మొత్తము పదునెనిమిది. ఇవిగాక ఇటీవల ఒకానొక తాళపత్ర (గేయ సంకలన) గ్రంథములో ఈ కవయిత్రి రచించిన మఱిరెండు కీర్తనలు క్రొత్తగా లభించినవి.[4] వీటి చేరికతో పండ్రెండు తత్త్వకీర్తనలు, ఎనిమిది ద్విపదార్థములు వెరసి ఇరువది పారమార్థిక గేయములైనవి. తత్త్వ కీర్తనలకు, ద్విపదార్థములకు రాగతాళ నిర్దేశము, పల్లవి, అనుపల్లవి చరణములు - అను విభజన యుండుట, అవి, లేకుండుట ఇత్యాది స్వరూప భేదమే కాని వాటిలో వర్ణితమైన 'వస్తువు' లో అంతగా భేదము లేదు.

**జీవితాంశముల సూచన :**

ఈ రెండు రకముల గేయములలోని విషయము వేదాంతమే. ఐనను ఒక అంశమున నివి రెండును వేరగుచున్నవి. ద్విపదార్థములు సర్వసాధారణమగు వేదాంతమునుగూర్చి వివరించుచుండగా, తత్త్వకీర్తనలు ఈ కవయిత్రియొక్క ఆత్మీయాంశను ప్రకటించుచున్నవి. దీనిని బట్టి పరిశీలింపగా తత్త్వకీర్తనలు ద్విపదార్థములవలె గాక,

వెంగమాంబ జీవితమునందలి వేర్వేరు సన్నివేశములలో వెలువడినవిగా గోచరించుచున్నవి. మచ్చునకు ఈ క్రింది కీర్తన ఒక యుదాహృతి.

"చెడు దంటె నేమి - మంచిది యంటే నేమి - నీవు
తడబడుచును నింత తపియించే దేమి॥

దేహముఁ జూచి నిందించితే నేమి
దేహి నెవ్వరు చూచి తిట్టిరి భూమి
సాహసకులకు నీకు సంవాద మేమి
సాహాయ్యుఁ డీ స్వామి సర్వాంతర్యామి ॥ ॥చెండు దంటె॥

చిత్తమా నిన్నుఁ జూచినవా రున్నారా
చిత్తు లక్షణము లక్షించి కన్నారా
సత్తు అసత్తులను విచారించినారా
ఉత్తమాటల కింత వులికేది మేరా ॥ ॥చెండు దంటె॥

దూషణంబుల విని దుఃఖించే వేలా
భూషణంబుల గని పొంగెదవె బేలా
ద్వేషులే హితు లని తెలియవే బాలా
రోషముఁద్రుంచి పోరుట మాను మబలా॥ ॥చెడు దంటె॥

ఆశకన్నా శత్రు వవనిలో లేదు
క్లేశమూలము దాని గెలువగ రాదు
నా శత్రు వీయాశ నను వీడ లేదు
శ్రీశుఁడే దానిని శిక్షింపక, పోదు॥ ॥చెడు దంటె॥

ఉరగాద్రి పతియైన తరిగొండాధిపుడు
సరస ధర్మా ధర్మసాక్షి యైనాఁడు
నరులాడు మాటలు నైజము లనఁడు
సొరిది దబ్బర నిజము జూచుచున్నాఁడు॥ ॥చెడు దంటె॥

పై కీర్తన తరిగొండ వెంగమ్మ తనను జూచి కొందరు 'చెడుది' అని ఆడిపోసికొనుచు న్నందులకు ఊరడింపుగా పల్కికొనిన కీర్తనయని, అందలి తాత్పర్యము చెప్పక చెప్పుచున్నది. ఇట్టిదే మఱియొకటి :

"సోహం సోహం - హం - సోహం సోహం
సోహ మనరా సతతం - హం సోహ మనరా సతతం॥ ॥సోహం॥
దూషణ మేలరా భూషణులకును - నీ మదిలోనే -
రోషపడకురా సతతం ॥ ॥సోహం॥
మానక షడ్వర్గములను ఖండించి - మాయలో మాయ -
గనరా సతతం॥ ॥సోహం॥
పొందుగ నీలో భ్రూమధ్య మందిరమందున - నాదులో నాదు
గనరా సతతం॥ ॥సోహం॥
కలగని మేల్కొని లో నిదానించి- వెలుఁగులో వెలుగు -
గనరా సతతం ॥ ॥సోహం॥
అంబర వీథిని ఆడుచు పాడుచు - నిరాలంబమున
ముక్తిలో ముక్తిని గనరా సతతం ॥సోహం॥
అరయఁగ శ్రీ తరిగొండ నరహరి శంకరాచార్యుడే
యా చార్యు లనరా సతతం" ॥సోహం॥

ఇంతటి వేదాంత భావగుంఫితమైన ఈ కీర్తనలో చివరి చరణమున ఇష్టదైవమగు నరహరినే శంకరాచార్యునిగా రూపించి పల్కుటచే, పుష్పగిరి పీఠాధిపతి యగు అభినవోద్దండ విద్యానృసింహభారతి గ్రామస్థుల ప్రేరణచే తనను బరీక్షింప వచ్చిన తరుణమున వెంగమాంబ యీ కీర్తనను రచించియుండునని తోచుచున్నది.

ఈ సందర్భమునకే చెందినదిగా 'శ్రీతరిగొండ వేంకమాంబ చరిత్రము' (1) న తద్రచయితయగు రంగప్రకాశదాసుచే ఉట్టంకింపబడిన వేదాంత కీర్తన యొకటి ఇట ఉదాహరింపదగియున్నది. తరిగొండకు

వచ్చియుండిన పుష్పగిరి శంకరాచార్యులు వెంగమాంబ మహిమను గుర్తించి అభినందించిన సన్నివేశమున, ఆమె ఆ పీఠాధిపతి యెడల తనకు గల భక్తి, గౌరవములను ఈ క్రింది కీర్తన రూపమున వెల్లడించెనని ఆ చరిత్రమున తెల్పబడినది. (చూ. పుట 24)

"శంకరాచార్య గురుని సన్నుతింపరే
నిష్కళంక పరమయోగ మభ్యసింపరే॥

స్థూల సూక్ష్మకారణముల మూల మరయరే
లలితనీల తోయదమున నిలిచి మెఱయరే॥ ॥శంక॥

మూఁడు రెండు దాఁటిపైన మేడఁజేరరే
పోఁడిమిగను ముక్తికాంత పోఁడు మరయరే॥ ॥శంక॥

చక్కగా త్రివేణి నడుమ జలకమాడరే
చొక్కముగను వెలుగుచున్న చుక్కఁ గాంచరే॥ ॥శంక॥

పన్నుగాను శ్రీ తరిగొండపతిని గాంచరే
పరము నెన్నుకొనుచు బ్రహ్మపదముఁ జేరరే॥ ॥శంక॥

ఈ కీర్తన 'వేదాంత జ్ఞానబోధిని' లో లేదు. కావున దీనితో చేరి ఈ కవయిత్రియొక్క తాత్త్విక గేయములు ఇరువదియొకటైనవి.

**క్రమపరిణతి :**

ఈ కవయిత్రి యొుక్క ఆధ్యాత్మికానుభూతిని చాటుచున్న ఈ తత్త్వకీర్తనలలో క్రమపరిణతి గోచరించు చుండుట యొక విశేషము. ఆ తీరున కీర్తనలలో కొన్ని వెంగమయొక్క ఆధ్యాత్మిక సాధన దశను సూచించుచుండగా మఱికొన్ని తత్సిద్ధి దశను ప్రకటించుచున్నవి. వాటి వివర మీక్రింద నీయబడుచున్నది.

| 'సాధన' దశను సూచించునవి | 'సిద్ధి' దశను సూచించునవి |
| --- | --- |
| గురుని భజించు జీవా! ఓ అనాది జీవా! | 4. శివుఁ డంటే నేమి? కేశవుఁ డంటే నేమి? |

2. చెడు దంటె నేమి? మంచిది యంటే నేమి?

3. యేల నీకు బుద్ధి లేదురా? ఓ రోరి జీవా!

7. జీవా! నీవు నిను గానక లేవా?

8. ఎందుకే నీకింత మోహము? చిత్తమా!

5. జ్యోతి వెలుఁగు చున్న దమ్మా! దానిలోఁతు తెలియ రాదె కొమ్మా!

6. సోహం సోహం - హం -సోహం సోహ మనరా సతతం.

శంకరాచార్యగురుని సన్నుతింపరే!

9. బ్రహ్మ మేదో తెలుప రయ్యా! బ్రాహ్మణులారా!

10. శ్రీ గురుని కొనియాడవే

ఆనందమయ మైనది

సర్వం బ్రహ్మమయం

పై పట్టికయందలి 'సాధన' దశ కీర్తనలకంటె అధికసంఖ్యలో నున్న 'సిద్ధి' దశ కీర్తనలనుబట్టి చూచినచో, ఈ కవయిత్రి కడు పిన్న ప్రాయముననే పరిపూర్ణ జ్ఞానసిద్ధి నొంది యుండె నను విషయము విదిత మగుచున్నది. మొత్తముమీద పై కీర్తనలన్నియు ఆత్మప్రబోధము, గురుభక్తి - అను ఈ రెండిటి సమన్వయ పూర్వకమైన అద్వైతానుభూతిని ప్రపంచించుచున్నవి.

**మఱికొన్ని విశేషములు :**

'తత్త్వమసి' అని మహావాక్యము, 'సచ్చిదానంద' భావము- ఈ రెంటి సమన్వయమును సామాన్యులకు సైతము సుగమము గావించుచున్న ఈ క్రింది కీర్తనభాగము తిలకింప దగి యున్నది.

"శ్రీ గురుని కొనియాడవే వో రాజహంసా!
రాజయోగివై వెలుగుచుండవె వో రాజహంసా!
... ... ... ... ... ...
సచ్చిదానందభావము రాజహంస - నీవు

సత్య మని తెలియవే ఓ రాజహంసా! ॥శ్రీ గురుని॥
చిత్తనగ 'త్వం' పదము రాజహంస - అల్ల
సత్తనగ 'తత్' పదము ఓ రాజహంసా! ॥శ్రీ గురుని॥

ఆనందమే 'అసి' పదము రాజహంస - పూని
తాను తానై యున్నాడే ఓ రాజహంసా! ॥శ్రీ గురుని॥
... ... ... ... ... ...

పైన దెల్పిన కీర్తనల పట్టికలో తొమ్మిదవ సంఖ్యగల "బ్రహ్మమేదో తెలుపరయ్యా బ్రాహ్మణులారా!" అనునది "సంధ్య వార్చే విధము నందు దెలియండీ; సంధ్య తెలియనివాఁడు సద్బ్రాహ్మణుండగునా?" అను ఏగంటివారి కీర్తనను[5] పోలియున్నది. ఈ రెంటి యందును 'ఓమి త్యేకాక్షరం బ్రహ్మ' ఇత్యాది గీర్వాణ వాక్యము లిమిడింపబడియున్నవి. ఇట్లు ఈ రెంటిలో గోచరించెడు భావశైలీ సామ్యములు అప్రయత్న సిద్ధము లని భావింప వచ్చును.

కొందరు వేదాంతుల 'తత్త్వము' లందువలె దురబోధమగు మార్మికత (Mysticism) లే కుండుట, సులభశైలిలో భావములు సూటిగా వెల్లడింవబడియుండుట, ప్రత్యక్షరమున స్వానుభవము ప్రతిధ్వనించుచుండుట అనునవి వెంగమాంబగారి తత్త్వకీర్తనలలో గోచరించెడి సుగుణములు.

తాళపత్రములలో దాగియుండిన ఈ క్రింది కీర్తనలో ఈ తాత్త్విక కవయిత్రి 'నా జననంబున్ సఫలంబుఁ జేసితిఁ బునర్జన్మంబు లేకుండఁగన్'[6] అన్నంతటి ఆత్మవిశ్వాసము నెట్లు ప్రకటించియున్నదో పరికింపుడు.

"సర్వం బ్రహ్మమయం - సద్గురురాయా!
సర్వం బ్రహ్మమయం

సర్వం బ్రహ్మం - సాక్షిరూపం
నిర్మల చిత్తం - నిత్యానందం ॥సర్వం॥

సప్తజలజములు - సరగున దాఁటితి
గుప్తంబగు ఆ - గుతిలో గలసితి ॥సర్వం॥

ముగ్గురి పదమగు - ముక్తిని గాంచితి
త్రిగుణము లణఁచితి - ధీరత గాంచితి ॥సర్వం॥

గురుతరముగను త్రి - కూటముఁ గాంచితి
యెనసి నినుం గని - నేనే నే నైతిని ॥సర్వం॥

గొనకొని ఘన తరి - గొండ నృకేసరి
యెఱుకలోని యెఱు - కే నే నైతిని" ॥సర్వం॥

## నారాయణ శతక కర్తృత్వము (?) :

తెనుగు దేశమున మిగుల ప్రచారము నొందియున్న తాత్త్విక శతకమగు 'నారాయణ శతకము' (గేయ శతకము) తరిగొండ వెంగమాంబ రచించినదే యని ఆధ్యాత్మిక విద్యావేత్తలయిన శ్రీరామకృష్ణానందస్వామివారి నిశ్చితాభిప్రాయము.

> "నారాయణ శతకము శైలి, భావము - ఆ ధోరణి అంతా తరిగొండ వెంగమ్మ రచనే అని నిస్సందేహంగా తెలుస్తుంది. ఆమె రాజయోగసారానికి, నారాయణ శతకానికి చాలా దగ్గరి పోలిక లున్నవి."

నారాయణ శతకము తరిగొండ వెంగమాంబ రచనయే యను విషయమును కీ.శే. తాళ్లపాక సూర్యనారాయణయ్య సతీమణి మున్నగు మఱికొందరును తెల్పియున్నారు. శ్రీరామకృష్ణానందస్వాములవారి నిశ్చితాభిప్రాయము ప్రబలమగు ఆ 'జనవాదుక' ను సహేతుకముగా బలపరచినదైనది. శతక వాఙ్మయ పరిశోధకులగు డా.కె. గోపాలకృష్ణరావుగారు ఈ శతక కాలమునుగూర్చి వెలిబుచ్చిన ఈ క్రింది యభిప్రాయము సైతము వెంగమాంబ ఈ శతక రచయితయై యుండు నను ఊహకు అనుకూలించుచున్నది.

> 'గేయరూపమున నున్న నారాయణ శతక కర్త ఎవరో తెలియదు. కవి కాలమును గ్రహించుటకైనను శతకమున తగిన ఆధారములు లేవు. కాని,శతక వస్తువు రచనా విధానము ననుసరించి తదితర శతకములతో పోల్చి పరిశీలించినచో కవి పదునెన్మిదవ శతాబ్ది అనంతరము జీవించియుండు నని ఊహింప వచ్చును.''
> - ఆంధ్ర శతక సాహిత్య వికాసము, 318 పుట

ఈ గేయశతకమున నెచ్చటను తరిగొండముద్ర గాని, కవయిత్రి యొక్క ఆధ్యాత్మిక గురుడైన సుబ్రహ్మణ్యయోగి ప్రశంసగాని లేనందున, సరియగు ఆధారము లభించినగాని ఈ శతకముతో వెంగమాంబకు గల సంబంధమును నిశ్చయింపవలను పడకున్నది. ఏది యెట్టైనను ఈమె రచించిన రాజయోగసారముయొక్క ప్రభావము ఈ గేయ శతకముపై ప్రసరించియున్నదను మాట మాత్రము సత్యము.

**ఆశుకవితాసంపద :**

వెంగమాంబ పైన వివరించిన వేదాంతకీర్తనలనే గాక, ఆ యా సమయములలో అనేక భక్తికీర్తనలను, పద్యములను ఆశువుగా రచించినది. 'శ్రీతరిగొండ వేంగమాంబ చరిత్రము (1)' లో అట్టి రచన లొకటి రెండు ఉదాహరింపబడినవి. తిరుపతిలో తులసీబృందావనమున తాను త్రవ్వించిన బావిలో బండ అడ్డుపడినపు డీమె "ఓ తల్లీ! గంగాభవానీ! రావే - ఖ్యాతిగ యిచటికి కపటము మాని'అను కీర్తనతో గంగను ప్రార్థించెనట.[8] అట్లు ప్రార్థించిన కొన్ని నిమిషములకే బావిలో జలము ఊటలూరుచు ఉప్పొంగి వచ్చినదట! అదే జీవిత చరిత్రములో చివర శ్రీ వేంకమాంబ ప్రణీతము అను శీర్షిక క్రింద ఒక సీసపద్యము, మఱికొన్ని కీర్తనలు ఇయ్యబడినవి. (పుటలు 84-96). ఏ సందర్భమున చెప్పబడినదో తెలియరాకున్నను, మిగుల భక్తి నీతిభావభరితమై యున్న ఆ సీస పద్య మిది.

"జగతిలో మానవజన్మంబు దొరకదు
        దొరికిన పురుషుఁడై పుట్టు టరుదు
పురుషుఁడై పుట్టిన పొలఁతి మంచిది రాదు
        వచ్చిన భాగ్యంబు లెచ్చు టరుదు
భాగ్యశాలికి పుత్రఫలము చేకూడదు
        కూడిన వితరణ జాడ లరుదు
వితరణ గలిగిన వితతశాంతము సున్న
        శాంతంబు గల్గిన సత్య మరుదు

సత్య మొదవిన శ్రీహరి స్మరణ లరుదు
హరిని దలచిన వాఁడె పో పరమయోగి
పుండరీకాక్ష ! తరిగొండ పురనివాస!
సరస నను( బ్రోవు వేంకటాచల నివాస !"

ఈ పద్యమునకు తరువాత నీయబడిన "హరినామ స్మరణ సేయకుంటే ఆవల గతి యేమి" అను కీర్తన వెంగమాంబ రచించినదికాదు. ఇది కార్వేటి నగర వాస్తవ్యుడగు సారంగపాణి అను వాగ్గేయకారునిది.[9] ఈ గేయమునకు తరువాత నీయబడిన వానిలో "జ్యోతి వెలుగుచున్న దమ్మా" అను కీర్తన తప్ప తక్కిన వన్నియు ఆ గ్రంథ రచయితయైన రంగప్రకాశదాసు రచించినవే.

క్రీ.శ. 1918 లో మదరాసునందలి 'స్కాటిష్ ప్రెస్సు' లో ముద్రితమైన "శ్రీ వేంకటేశ పగడసాల యాలలు" అను నొక సంకలన పుస్తకమున కూర్పబడిన విషయములలో 'శ్రీ తరిగొండ వేంగమాంబ శ్రీనివాస సంవాదములు, కీర్తనలు" అనునది యొకటని, విడిగా లభించిన దాని ముఖపత్రమువలన తెలియుచున్నది. ఇట్లు ఈ కవయిత్రి భక్తికీర్తనలు కొన్ని ఈ శతాబ్ద్యారంభమున ముద్రణ భాగ్యమునకు నోచుకొన్నను, నేడవి మృగ్యములై పోయినవి.

మొత్తముమీద ఈ కవయిత్రీమతల్లి నోట అవతరించిన ఆశుకవితా రచనలు చాలవరకు లిఖితరూపము నొందలే దనియు, ఆమె శిష్యపరంపరలో కొందరు, ముఖ్యముగా స్త్రీలు భద్రపరచిన కొలది గేయములు మాత్రము శేషించిన వనియు, అవియే చెదరు మదరుగా నేటి తరమునకు లభించుచున్న వనియు భావింపవలెను.

వేంగమాంబ మహాకవయిత్రియే గాక, ప్రాచీన తెలుగు వాఙ్మయమున వెలసిన ఏకైక తాత్త్విక కవయిత్రియు ననుట పిండితార్థము.

## తత్త్వకీర్తనలు - జ్ఞాపికలు

1 i) ఈ కీర్తనలు "తరిగొండ వెంగమ్మగారి వచనములు" అను పేర తొలుదొల్త కడిమెళ్ళ నరసయ్య అను నాతనిచే క్రీ.శ. 1902 లో "స్వాంతవర్తిశతకము" అను సంకలన గ్రంథమున చేర్పబడి కడపయందు ముద్రింపబడినవి. చూ. A catalogue of the Telugu Books in the Library of the British Museum (1912) page 132.

ii) ఇవే "తత్త్వకీర్తనలు" అనుపేర క్రీ.శ. 1904 లో "వేదాంత జ్ఞానబోధిని" యను సంకలన గ్రంథమున "ముక్తికాంతావిలాస" యక్షగానముతో పాటుగా పమ్మి త్యాగరాయసెట్టిగారిచే రాజరాజేశ్వరీ నికేతన ముద్రాక్షరశాలయందు (చెన్నపురిలో) ముద్రింపబడినవి.

iii) "సుజ్ఞాన రత్నావళి", "ఆత్మబోధామృత తత్త్వములు", "కాలజ్ఞాన తత్త్వములు" మున్నగు మఱికొన్ని ఆధ్యాత్మిక కీర్తనల సంకలన గ్రంథములందు వెంగమాంబ పేరును కొన్నింట పేర్కొనియు, మఱికొన్నిటిలో పేర్కొనకయు పై తత్త్వకీర్తనలలో కొన్ని ముద్రింపబడియున్నవి.

i) "తరిగొండ నారసింహులు అను కవి కొన్ని వాగ్గేయాలను రచించేడు" చూ. 'ఆంధ్రజానపద గేయ వాఙ్మయ చరిత్ర - స్త్రీలపాటలు' పుట 159 - టేకుమళ్ళ కామేశ్వరరావు

ii) "శ్రీవీరబ్రహ్మముగారి కాలజ్ఞాన తత్త్వములను పేర గల కీర్తనల సంపుటి యొకటి యున్నది ... ... దీనిలోని కృతులు కొన్ని వీరబ్రహ్మముగారు స్వయముగా చెప్పినవి. కొన్ని యాయన శిష్యులలో ముఖ్యుడు దూదేకుల సిద్ధయ్యగారు చెప్పినవి ... ... ... తాడిచర్ల చలమయ్యగారు, మహమ్మదు హుశేనుగారు, నానరయ్యగారు, తరిగొండ భ్రమరాంబ, నరహరిగార్లు మున్నగువారు చెప్పిన తత్త్వములనుగూడ చేర్చి పరిమి వీరాచార్యులను నతడిది కూర్చినట్లు కనబడును." 'అచల బోధలు' (వ్యాసము) -కపిల వెంకటరావు. చూ. ఆంధ్రపత్రిక, సర్వజిత్తు ఉగాది సంచిక Vol 38, 72 -79 పుటలు.

iii) "బ్రహ్మం ఏదో తెలుపండయ్యా బ్రాహ్మలు మీరయితే - అనే తత్త్వంలో బ్రహ్మజ్ఞానం గలవాడే బ్రాహ్మణుడని, తరిగొండ భ్రమరాంబా, ఈ జన్మ మిక దుర్లభమురా, ఓరి సాజన్మ సాకార సద్గురుని గనరా - అన్న తత్త్వంలో యోగసాధనా విధానాన్ని పోతులూరీ చక్కగా వివరించారు."

చూ. 'జానపదగేయ వాఙ్మయ పరిచయము' - హరి ఆదిశేషువు 240 పుట.

iv) "ఇంకా బ్రహ్మంగారి శిష్యులో భక్తులో అయిన పూదోట రామన్నగారు, - - - తరిగొండ భ్రమరాంబా నరహరిగార్లూ, జక్కులేటి కంబగిరి, ఘంటయ్య అనువార్లు రచించిన తత్త్వాలన్నిటినీ చేర్చి, కాలజ్ఞాన తత్త్వాలు - అనే పేర పరిమి వీరాచార్లు అనే అచలమతావలంబి, తన రచనలతో కూడా చేర్చి, కూర్చినాడు. ఆత్మబోధామృత తత్త్వాలు - అను పేరుతో మరొక తత్త్వాల పుస్తకం గుజిలీ ప్రతులలో ఉంది. అందులోని తత్త్వాలు రచించినవారు ఎడ్ల రామదాసు, తరిగొండ సుబ్రహ్మణ్యం, సుబ్బకవి, - - - నారాయణ హరిదాసు."

చూ. 'ఆంధ్రవాగ్గేయకార చరిత్రము', - బాలాంత్రపు రజనీకాంతరావు, 412 పుట.

3. చూ. వేదాంత జ్ఞానబోధిని, ౫౯ - ౬౦ పుటలు

4 ఈ రెండు కీర్తనలు తిరుమల - తిరుమల దేవస్థాన పౌరసంబంధాధికారి (Public Relations Officer)శ్రీరావుల సూర్యనారాయణ మూర్తిగారు, వారి సిబ్బంది నారాయణ వనములో సేకరించి యుండిన తాళపత్ర గ్రంథములలో నొకదాని యందు గన్పట్టినవి వారి సౌజన్యముతో ఈ వ్యాసకర్త పై రెండు కీర్తనలను సేకరించుకొన్నాడు.

\+ ఈ గుర్తు గల కీర్తన 'శ్రీతరిగొండ వేంకమాంబ చరిత్రము (1)' నందలిది.

ఈ గుర్తు గల కీర్తనలు తాళపత్ర గ్రంథము నందలివి.

5. చూ. 'కాలజ్ఞాన తత్త్వములు', 48 పుట

6 చూ. శ్రీమదాంధ్ర భాగవతము, I స్కం; 21 ప.

7 ఈ స్వామివారు కడపజిల్లా పులివెందుల తాలూకాయందలి 'గండి' క్షేత్రమున గల శ్రీభూమానందాశ్రమమున కధిపతులు. వీరు బహుభాషాకోవిదులు, పెద్దలు, సహృదయులు. వీ రిటీవల ఆధ్యాత్మికోపన్యాసముల నిమిత్తము తిరుపతి కాహ్వానితులైన

తరుణమున, 11 - 9 -1979 న కలిసికొను భాగ్యము ఈ వ్యాసకర్తకు కలిగినది. ఇందులకై శ్రీ స్వామి వారికి రచయిత మిగుల కృతజ్ఞుడు.

8 చూ. ఇదే గ్రంథములో 26 పుట.

9 చూ. 'సారంగపాణి పదములు', కీర్తన సంఖ్య 167, 154 -155 పుటలు.

## భాష

వెంగమాంబ తన కృతులలో ప్రయోగించిన భాష ప్రధానముగా గ్రాంథికమే యైనను, అది తరిగొండ ప్రాంతమున వాడుకలో నుండిన శిష్టవ్యవహారము ఆధారభూమిగా గలది. ఇందులకు కారణములు రెండు. ఒకటి: ఆ ప్రాంతము ఈ కవయిత్రి యభిజనమైయుండుట. రెండు: పరంపరగా వచ్చుచున్న లక్షణ గ్రంథములతోగాని, తల్లక్షణముచే ప్రభావితములై వెలువడిన గ్రాంథికభాషామయ కావ్యజాలముతో గాని వెంగమకు ప్రగాఢమైన పరిచయము లేకుండుట. ఈ యంశమును కవయిత్రి ద్విపద భాగవత, వేంకటాచల మాహాత్మ్యముల యవతారికలలో కంఠోక్తిగా నుడివియే యున్నది.

వెంగమాంబ జన్మించిన వ్యవహార భాషామండలము స్థూలముగా నేటి చిత్తూరుజిల్లాయందలి వాయల్పాడు, మదనపల్లి తాలూకాలు, కడపజిల్లాయందలి రాయచోటి తాలూకా, అనంతపురముజిల్లాలోని కదిరి తాలూకా- అను నాలుగు తాలూకాలలో విస్తరించి, ఇంచుమించు నేటి రాయలసీమ భాషకు చక్కగా ప్రాతినిధ్యము వహింపజాలియున్నది. ఈ ప్రాంత మంతయు క్రీ.శ. 1911 వరకును ఒకే పరిపాలనా విభాగము క్రింద నుండినది.[1]

వెంగమ్మ 'పూర్వేతిహాస విస్ఫురితాంధ్ర సత్కృతులను శోధించి వరుసగా జూడ' క పోయినను ఆమె పుట్టినిల్లు చక్కని సారస్వత వాతావరణము కలదగుటవలన[2] వినికిడివలననే తగినంత సాహిత్యసంస్కారమును

బాల్యమున పొందియుండు ననియు, ఆ సంస్కారమే అనంతరకాలమున అధ్యాత్మికానుభూతి పూర్వక స్వయంకృషి మూలమున సహజమైన వికాసము నొందిన దనియు భావింపవచ్చును.

తరిగొండ వెంగమాంబ తనకు కరతలామలకమై యుండిన శిష్టవ్యావహారికభాషా విజ్ఞానపరిధినుండి ఆ ప్రాంతమున చెల్లుబడిలో నున్న సామాన్యజన వ్యవహారభాషా స్వరూపమును కూలంకషముగా ఆకళించుకొన గల్గినది. ఈ సమస్త వ్యావహారికభాషా పరిజ్ఞానమామెకు యక్షగాన రచనయందు, భాగవతాది గ్రంథములను పామరులకు సైతము తేటపడురీతిని ద్విపదలో రచియించుటయందును మిగుల నుపకరించినది.

వెంగమకు సుపరిచితమై యుండిన శిష్టవ్యావహారికముపై ప్రాచీన గ్రాంథికభాషా ప్రభావ మంతంత మాత్రమే యగుటచే ఆమె లేఖినినుండి వెలువడిన భాష అకృత్రిమ మగు పలుకునుడికారమునకు, సహజమగు ప్రయోగవైచిత్రికి నెలవుపట్టై విలసిల్లుచున్నది. వేంకటాచల మాహాత్మ్యమువంటి పద్యకావ్యమును సైతము 'ప్రజకుఁ దెలియంగ తేటగ' రచించుటలో ఈ కవయిత్రికి వాచో విధేయమైయుండిన ఆ పలుకునుడికారపు పొంకమే మూలకారణమై వరలినది. ఒక్కమాటలో ఈ కవయిత్రి భాష సముచితములగు నియమములకు లోగియుండి, సలక్షణ భాషాస్వరూపమునకు సన్నిహితమై, జాతీయమై యొప్పుచున్నది.

వెంగమాంబ కృతులలోని భాషయందలి విశిష్టతను చాటెడు ముఖ్యాంశము లీ దిగువ దిక్ప్రదర్శకముగా ఉదాహరింపబడుచున్నవి.

## పదజాలము

ఈ కవయిత్రి కృతులు సముచితములు, అర్థవంతములు నగు పదములకు నిలయములు. అట్టి శబ్దములలో కొన్ని నిఘంటువుల కెక్కినవి. మఱికొన్ని నిఘంటువుల కెక్కినను వేఱొక అర్థమున ప్రయోగింపబడి నట్టివి. ఈ పరిశీలనలో శబ్దరత్నాకరము, సూర్యారాయాంధ్ర నిఘంటువు - ఈ రెండు మాత్రమే సంప్రతింపబడినవి. తక్కిన నిఘంటువులను పరికింపలేదు.

**నిఘంటువుల కెక్కని పదములు :**

మచ్చునకు ప్రధానమైనవి కొన్ని మాత్రమే ఇట ప్రదర్శితములు.

1) ఉరి మంటలు: 'ఉరియు = చలించు'. అనగా చలించు మంటలవంటి తీవ్రమైన బాధ లని భావము.

"తెఱవల లోఁదొడలందును
కరములతో నెత్తి మండ్రగబ్బల నెపుడో
చొరఁదోలుచుఁ గరిపింపఁగ
నురిమంటలచేతఁ గొంత లొరలుదు రమ్మా!" - జల

2) కందడు, కందవాడు: బిడ్డడు. ఇవి 'కందు' పై నేర్పడిన మహద్వాచక రూపములు.

"కందనికి ఇంపుల మద్దికాయ లిచ్చేవా? - శివ
"నా బొజ్జ కందవా డిన్ని పనులు జేయ నెఱుగు నటరె?" -జల

3) గంజరము: గోమూత్రము.

"పని బూని వేల్పులపై నెవ్వ డుమిసెనో
మొనసి గంజరము నిమ్ముగ జల్ల రమ్మా!" - - జల

4) చులుకు: బెత్తము, సన్ననికఱ్ఱ.

"గోపాలూడూ వచ్చే ననుచూ వాపోయి పిల్చితివీ నన్నూ
చూపావే వా డిం దెందున్నాడో వోహెూ కోడలా!
చులుకు తీసి లెస్సా కొట్టేనూ" - జల

5) దెమ్మాలు: దేవతలు, 'దేవమ్మలు' అను పదమునకు మాండలిక రూపము.

"దెమ్మాల కెల్లాను మొదటి దెమ్మానాని నాకు వెన్న
కొమ్మాని పెట్టాక నంతా గోర దెమ్మాల కొప్పించి
మా యమ్మతో జెప్పుతారతే?" - జల

6) పల్లరి: 'ప్రల్లదము' యొక్క మాండలిక రూపము 'పల్ల.' పల్ల (వాక్పారుష్యము, దుష్కృత్యము మొదలైనవి) కలవాడు' అను అర్థమున 'అరి' వర్ణకము వచ్చి పల్లరి' అను తద్ధితాంత మేర్పడినది.

"కల్లరి కేల నిక్కమును, ఘాతుక మర్త్యున కేల ధర్మమున్
పల్లరి కేల నీతులును, బాపశరీరున కేల మోక్షమున్." -త.నృ.శ.70ప.

7) బల్త (?): ధాన్యము కొలుచు పాత్ర. రాయలసీమ మాండలికములో 'బల్త' అనే పదము లేదు. చిత్తూరు మాండలికమున 'బల్ల = రెండుసేర్ల మానిక.' ప్రాతకాలములో కఱ్ఱతో చేసినట్టిది.

"మానిని! యిపు డిన్ని మాట లేమిటికి? - ఆనంద మెసఁగ నన్నడుగనే యెఱుక

... ... ... ... ... ... ... ... ... ... ...

బంగరు చేటతో బల్తతోఁదెచ్చి - పొంగుచు ముత్యముల్ పోయవే దుండి!"

- విష్ణు, 76 పుట.

8) భూతకి: దుష్టయగు రక్కసి. ఇది 'బాలకి, నాయకి' వంటి ఆభాస గ్రాంథిక రూపము. 'పూతన, శూర్పణఖ' వంటి పాత్రలకు పర్యాయముగా వ్యవహరింపబడునది.

"భూతకి వచ్చెనూ, ప్రాణఘాతకి వచ్చెనూ
మహాపాతకములాకు మూలపాథేయమై
పుట్టినట్టి భూతకి వచ్చెనూ" - జల

9) ముఖాంతరము: 'ద్వారా' అను నర్థములో శిష్టవ్యవహారమున రూఢి నొందియున్నది.

"పరుసపాపమును భూసుర ముఖాంతరముగాఁ
దెప్పించి యగ్నుల కొప్పగింతు" - విష్ణు; పుట 102.

10) రామరసము: గంజాయి మున్నగు వస్తువులు కలిపిచేసిన తియ్యని పాయసము.

"పాచాలు దెచ్చినారూ రామరచమూ చేశినారూ
నాకూ దాగించినారూ తా మదే తాగినారూ
చాలా మత్తిల్లినారూ"

- జల

11) సళుకు = తేలు విషమువలని పోటు.

"సళుకు నాడి వీపులకు కళుకు మాని యెక్కె
నళుకు లేక దిగ మంత్రించే నంటావాడు చేతులు సాచె" -జల

12) హంగ: భీతితో గూడిన దుః ఖము, అంగలార్పు.

"ఆడకు హంగ పుట్టగను నార్భటమందుచు నింటిలోనఁ బో
రాడుచు నుండి నంతటను నంతకు కింకరు లొచ్చి వేగఁ ద
న్నీడిచి తన్నగాను తన కెవ్వరు నడ్డముగాను రారు."

- త.నృ.శ. 34 ప.

## నిఘంటువుల కెక్కినను భిన్నార్థమున ప్రయోగింపబడిన కొన్ని పదములు :

1) అంచు: సమీపము. ఈ పదమునకు నిఘంటువులలో అగ్రము, ఓర, బండికన్ను ఆకు - మున్నగు అర్థము లీయబడినవి. వ్యవహారము ననుసరించి కవయిత్రి దీనిని 'సమీపము' అను అర్థములో ప్రయోగించినది..

"కారణమై యహంకార పూరుషుడు - తా నన్నిటికిని గర్త నటంచు మూఢ
మానవులకు వృథా మాయాబ్ధియందు - ముంచు నంతియె కాని ముక్తపూరుషుల
యంచున నిల్వలే కణగు మి ధ్యనుచు" - వాసిష్ఠ; 5ప్రక; పుట 321

2) ఆకట : అటు తరువాత. ఇది. శ.ర.లో 'అక్కట'కు రూపాంతరముగా నీయబడినది.

" ...        ... వనజాక్షుఁ డనియె నవ్వా! పూర్వమందు మలయు
స్వాయంభువ మన్వంతరమునఁ - దెలియ పృశ్నియనె పతివ్రత నీవు శౌరియె
సుతప ప్రజాపతి  యప్రడు - మీ రిద్దరును నియమించి తపంబు కావింపనే వచ్చి
కరుణతో మెచ్చి-కావలసిన దేమి కామింపుఁ డనిన ...        ...        ...
ఆ కాలమందు మీయందు బుట్టితిని - ఆకట కశ్యపుఁ డదితి యనంగ మేదినీ
తలమున మీరు జనింప - నాదరం బెసఁగ నే నప్పుడు మీకు వసుధపైఁ బుట్టితి
వామనుఁ డనఁగ"

- జల

3) కుండ: శరీరము. పై నిఘంటువుల లోనిది 'మట్టిపాత్ర' యను నర్థమున నున్నది. వెంగమ యీ పదమును 'శరీరము' అను నర్థమున ప్రయోగించియున్నది.

"కండలు ప్రేవులున్ బలు వికారపు టస్థులు చీమునెత్తురున్
నిండిన మూత్రమున్ మలము నెప్పుడు మూగి మహాయసహ్యామై
యుండును గుక్షిలోన నిఁక నో హరి యే మని విన్నవింతు నీ
కుండకు  భోగ మేల?"                                        - త.నృ. శ. 36 ప.

4) గూడు: దేహము. నిఘంటువులలో దీనికి పై వేదాంతార్థ మీయబడలేదు.

"కాడునఁ జేరి వేగ లయకాలుని చెట్టను బట్టి క్రమ్మఱన్
గూడునఁ జేరు జీవి"                                        - త.నృ.శ. 33ప.

5) ఘటము: శరీరము. నిఘంటువులలో లేకున్నను, తత్త్వవేత్త యగుటచే వెంగమ యీ పదమును వేదాంతార్థమున తఱచుగ ప్రయోగించియున్నది.

"నీ తపోబలమున నీ శరీరాస్థి - ఖ్యాతిగను సుర లంటఁగా యోగ్య మయ్యె
పరపురుషార్థంబు భవతారకంబు - పరమేష్ఠి లోకసంప్రాప్తి కారణము
అటుగాన పరపురుషార్థంబుకొఱకు - ఘట మిచ్చి పుణ్యమును గైకొను టరుదె."
                                        - ద్విప. భాగ; 6స్కం; పుట 818.

6) ఘటికుడు : అసాధ్యుడు. 'ఘటకుడు' అను దాని వ్యావహారిక రూపము 'ఘటికుడు'. నిఘంటువులలో పై శబ్దమునకు 'ఘటిల్లజేయువాడు' అని కలదు.

"అలఘుఁ డాయుష్మంతుఁ డను విప్రు దొకఁడు - గలఁడు మృత్యువు వానిఁ
గదిసి కొంపోవ
వలె నంచు డగ్గఱ వచ్చి దా నతని - బలము తేజముఁ జూచి భయ మొంది
మదిని
దలఁచె నిట్లనుచు భూతంబుల నెల్ల - మెలపుగా నే దిగమ్రింగుచుండుదును
అటువంటి నాకు నీ యవనీసురుండు - ఘటికుఁడై చిక్కఁడెక్కడివాఁడితండు!
అని వితర్కింపుచు నంతకు కడకుఁ - జని మ్రొక్కి నిలిచి యా చంద మంతయును."
- వాసిష్ఠ; I ప్రక; 36 పుట.

7) నాయకము: నడికట్టుముడి. నిఘంటువులలో ఈ పదమునకు 'హారము నడిమిమణి' అను నర్థ మీయబడినది.

"ఆ యశోదాదేవి కా చెలు లెల్ల - నాయకం బొప్పగా నడుము బిగించి
గట్టికారపు గుట్టికెల మ్రింగ నిచ్చి - గట్టిగా తల నంటగా కొంగు గట్టి."

- జల.

8) నిరుద్ధము: హద్దు, అవధి. నిఘంటువులలో దీనికి 'నిరోధింపబడినది, అడ్డగింపబడినది' అను నర్థములు కలవు.

"శ్రీ సత్యభామ కాశీర్వాదములు పెక్కు
రూఢి జేసితి మీ నిరుద్ధమునకు
కుశలంబు మాకు, నీ కుశలాతిశయములు
వ్రాసి పంపుచును రావలెను తెలియ." - విష్ణు; 55 పుట.

పై పదము తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనల తొలిరేకులో గలదు. దీని యర్థనిర్ణయమున ఆ వాఙ్మయ పరిష్కర్తలకు ఈ ప్రయోగము సహాయపడియుండుట గమనింపదగిన యంశము.[3]

9) నిర్వాణము: దిగంబరము. దీనికి నిఘంటువులలో 'ముక్తి, సుఖము, చల్లాఱినది' ఇత్యాద్యర్థము లీయబడియున్నవి.

"సమ్మాతముగా తారిగొండా స్వామీ! నిర్వాణముగా నీవూ
మమ్ము చూడావలే నేమిరా? మంచిదైతే వత్తూ మేమిరా!" - జల.

10) బాధ్యము : వివాహము కారణముగా నేర్పడిన బాంధవ్యము. అట్టి బాంధవ్యము కలవాడు 'బాధ్యుడు.' నిఘంటువులలోనిది 'బంధింపదగినది' అను నర్థమున నున్నది.

"నీవు నా స్వామవి నీ సొమ్ము నేను
కావున బాధ్య మెక్కడ బోదు కృష్ణ!"

కవయిత్రి పై వాక్యమున ఇష్టదైవమగు శ్రీకృష్ణునకు ఆత్మీయమగు 'బాధ్యము' ను జ్ఞాపకపఱచుచున్నది.

11) బొజ్జ : 'ముద్దైన' అను విశేషణార్థమున ప్రయోగింపబడి యున్నది.

'నా బొజ్జ కందవా డిన్నిపనులు జేయ నెఱుగు నటరె?' - జల.

12) లిఖితము : ఉత్తరము. నిఘంటువులలో ఈ పదమునకు 'వ్రాయబడినది, వ్రాయబడిన పత్రము' అను అర్థము లీయబడినవి. వ్యవహారములో విపరిణామము నొందిన 'లేఖ' యను నర్థము వాటిలో పేర్కొనబడలేదు.

"శ్రీ మానినిలోల! చెలువలరగను మా
లేమ నీ కిపు డేమొ లిఖిత మంపినది॥
ఆ లిఖిత మిటు దేవె మేలిమిగ జూచి ప్రతి
గా లిఖిత మొకటి యా కలికి కంపుదము॥
అఖిలేశ! తరిగొండ హరి వేంకటేశ ! ప్రతి
లిఖిత మేటికి? నీవె లేచి రావయ్యా!" - విష్ణు; 52 పుట.

పై నుదాహరించిన పదములవంటివే గాక, ఈ కవయిత్రి కృతులలో "అఖండము (పరబ్రహ్మము), గుఱి (లక్ష్యము), ఎఱుక (జ్ఞానము), ముమ్మూలకోన (సహస్రారము)" వంటి వేదాంత పరిభాషా పదములు, "తిరుచ, తిరుమంజనము, చక్రత్తాళ్వారు, తిరువీథి, తిరుమణి" వంటి శ్రీ

వైష్ణవ సంప్రదాయానుగుణ ద్రావిడపదములు, "సవాలు, మద్దతు, రౌతు, జవాబు, ఫరవ, జాబు, మోజు" వంటి స్వల్ప సంఖ్యాకములగు అన్యదేశ్యములును సముచితముగా నెలకొని యున్నవి.

## సమాసములు

కవియొక్క భాషాకల్పనా స్తోమతను, వైయక్తిక లక్షణమును పుణికి పుచ్చుకొని యుండునవి సమాసములు. సహజ సుందరములగు సమాసములను సృజించి సందర్భోచితముగా ప్రయోగించుటలో ఈ రచయిత్రి సిద్ధహస్త యని ఈమె కృతులు చాటుచున్నవి. ఆ సమాస సముదాయమునుండి 'మాసరా' కు కొన్ని.

### సిద్ధసమాసములు :

వెంగమ సమాస విన్యాసమున ప్రథమ గణ్యములు సిద్ధసమాసములు.

"అహంకారాణువు (వాసిష్ఠ ; పుట 61) ; కుసుమశరారిమిత్రుడు (త.నృ.శ;13ప.); గణనాధికానందఖని (శివ.) ; చిత్తజసామజరాజ కేసరి (బాలకృష్ణ.); పాపాహివిహగేంద్రుడు (రమా; పుట 176); పరమపావన తీర్థపటలము (చెంచు; పుట1); ఫాలార్ధాబ్జుడు (జల.) ; మృత్యుదేవి (వాసిష్ఠ; పుట 36); యోగీంద్ర దేవమహీరుహుడు (శివ.); శరదభ్ర శుభ్రలసత్కాంతి (వేం. మా; IV ఆశ్వా: 116ప.); సుజ్ఞాన ఖడ్గము (వాసిష్ఠ; పుట 170); హరిద్రాలేపన చిహ్నములు (వేం. మా; V ఆశ్వా; 82 వ.)" మొదలగునవి అట్టివానిలో కొన్ని. ముఖ్యముగా స్తుతిఘట్టములలో ఇట్టి సుందర సమాసములు శ్రుతి సుభగముగా నినదించుచుండును.

ఈ సమాసకల్పనలో కొన్నిచోట్ల ఈ కవయిత్రి కొంత ప్రత్యేకతను ప్రదర్శించినది.

"ఆయురారోగ్య మైశ్వర్య మమర." - వేం. మా; I ఆశ్వా; 184 ప.

"సంతోషాశ్చర్యమూను విస్తారముగా గల్పించిన" - జల

"రోష ద్వేషంబున" - శివ

పై ద్వంద్వసమాసములు ఏకవచనాంతములై యుండుట యొక విశేషము.

"అప్పుడు బ్రహ్మ శివాదులు తప్పక యచ్చటికిఁ బోయి."
- వేం. మా; IV ఆశ్వా; 191 ప.

"దుఃఖ సుఖంబు లనుభవించు." - వేం. మా; III ఆశ్వా;153 ప.

'శివ బ్రహ్మాదులు'; 'సుఖదుఃఖంబులు' - అను క్రమములో నుండవలసిన పై ద్వంద్వములు వ్యతిక్రమముగా ప్రయుక్తములైనవి.

"నెనరు భక్తియు మీఱ నిటలాక్షుఁ జూచి
వినయ విధేయుఁడై వినుతించె నిటుల." - ద్విప.భాగ; 4 స్కం

కవయిత్రి ఈ సమాసమును 'వినయవిధేయతలు కలవాడు' అను బహువ్రీహ్యర్థమున ప్రయోగించినది. ఇట్టి ప్రత్యేక స్వతంత్ర ప్రయోగము లీమె రచనలలో ఎడనెడ కనిపించుచుండును.

**సాధ్య సమాసములు :**

వెంగమ తన కృతులలో అచ్చటచ్చట పనిబూని సాధ్యసమాసములను ప్రయోగించి యుండుటను బట్టి సాధ్యసమాసము లీమె కిష్టము లని తోచుచున్నది.

1) క్రీడ నగము:

"శిరమునం గ్రీడనగమును జెలఁగుచుండ."
- వేం. మా; I ఆశ్వా; 68 ప.

2) గౌరి కుమారుడు:

"అలరార తరిగొండ హరికి సోదరియైన
గౌరికుమార! శ్రీగణనాయకా!" - జల

3) ఛాయదేవి:

"నీటితోఁ గల్పి చక్రికి నెమ్మి యార
తియు నొసంగుటకై ఛాయదేవి తెచ్చె - వేం.మా; V ఆశ్వా; 185 ప.

4) నాభి ప్రయోజము :

"ఘనుఁడైన హాటకగర్భున కనిశ - మునికియౌ నాభిప్రయోజంబుతోడ,

- జల

5) భూమిదేవి :

"వినుడి సంయములార! మును భూమిదేవి కీ
యష్టాంగ యోగంబు లా వరాహ
దేవుండు దయ నుపదేశించిన విధంబు." - అష్టాంగ; 2 పుట

6) సవనపు వాటము :

"వీణ మీటుచు గానధురీణుఁ డైన
వరమునీంద్రుఁడు సవనపు వాటమునకు
రాఁగ గశ్యపముఖులు నారదునిఁ జూచి." - వేం.మా; IV ఆశ్వా; 106 ప

**ఆచ్ఛిక సమాసములు :**

అచ్చ తెనుగు సొంపును పుక్కిలించెడి ఆచ్ఛిక సమాసములు వెంగమ సారస్వతమున కోకొల్లలు.

"అంచపిల్లలు (ద్విప. భాగ ; I స్కం): చిఱుగజ్జెలు (జల); చిలుక తేజికాడు (శివ); చేయిదమ్మి (వేం.మా; V ఆశ్వా; 44 ప.); జిలిబిలి సుద్దులు (శివ); పదునుగేదగి కత్తులు (బాలకృష్ణ); పసగలసావు (త. నృ. శ. 39 ప); ముమ్మూలకోన (ముక్తి; పుట 45); మొలకనవ్వుల చెంచుముద్దులగుమ్మ (చెంచు, పుటI ); మొలకనవ్వుల ముద్దుకలికి గోపాలుడు (బాలకృష్ణ.) మున్నగువాని అట్టివానిలో కొన్ని -

ఈ యాచ్ఛిక సమాసములలో ప్రసిద్ధ పౌరాణికపాత్రల నామధేయములకు సమానార్థకములుగా కవయిత్రి కల్పించినవి యింకొక తెగ.

'కలుముల సింగి (లక్ష్మి) - శివ.

చిలుక తేజికాడు (మన్మథుడు) -బాలకృష్ణ.

చివ్వదిండి బుడుతడు (నారదుడు) -విష్ణు,79 పుట

| | |
|---|---|
| నీటి చేరువవాడు (సముద్రుడు) | - శివ. |
| పడిగె కొండల రాయడు (వేంకటేశ్వరుడు) | - విష్ణు, 73 పుట |
| మిత్తిగొంగ సింగడు (శివుడు) | - శివ. |
| వడిసుళ్ల మారి (గంగ) | - శివ. |
| వేయిసాపల గుడిసె (సహస్రారము) " | - శివ. |

మూలమున గల సంస్కృత సమాసములకు దీటుగా రచింపబడినవి మఱియొక తరగతి.

| వెంగమ అనువాదము | సంస్కృత మూలము |
|---|---|
| "చల్వ చేసిన పైడి సరిగంచు దోవతి" ... | 'సువర్ణ చిత్రితం వస్త్రం' |
| - వేం. మా, I ఆశ్వా; 134 ప. | (వరాహ, 37 అధ్యా 99 శ్లో. |
| "పసపు జాబు" ... | 'శుభపత్రికా' |
| - వేం. మా, VI ఆశ్వా; 123 ప. ... | (అమూలకము) |
| "వేడి చూడ్కులు" ... | 'భృకుటీకుటి లేక్షణ' |
| - వేం. మా, I ఆశ్వా; 73దండకము ... | (వరాహ, 35 అధ్యా, 4 శ్లో.). |

**మిశ్రమ సమాసములు :**

ఈ కవయిత్రి ప్రయోగించిన సమాసములలో ఎక్కువపాలు మిశ్రమసమాసములే. వాటిలో "కృష్ణ వలస (జల); మెడబిగువతిశయము (శివ); జీవి తెఱువు (వేం. మా, IVఆశ్వా; 279 ప.)" వంటి వ్యాకరణ యుక్తములకన్న లక్షణ విరుద్ధములుగా నెన్నబడు వైరిసమాసములే అధికము.

"కల్యాణపాటలు (వేం.మా, 5-131), ఘనపట్టుచీర (జల), దండదాసరి (విష్ణు. పుట 6), దుష్కోరికలు (త.నృ.శ. 29 ప), పొట్టుదళము (విష్ణు, పుట 66), బహునాళ్లు (జల), బాలపోటుములు (విష్ణు, పుట 55), బీగముద్రలు (ద్విప. భాగ,II స్కం,) మంగళారతులు (వేం.మా, 5-131), రొక్క యోజనములు (త.నృ.శ. 63 వ.) విష్ణురాయడు (శివ), హస్తకడియములు (శివ)." - ఇత్యాదులు లాక్షణికదృష్టిలో విరుద్ధ

ములైనను, శిష్టవ్యవహారమున రూఢములై, అర్థవంతములై యున్నవి.

మొత్తముమీద వెంగమ వాఙ్మయమందలి సమాససంయోజనము స్వాభావికమై శ్రవణానంద సంధాయకమై యొప్పుచున్నది.

## క్రియలు

వెంగమ క్రియాప్రయోగ కౌశలము నిరుపమానము. 'కొండ అద్దమందు కొంచెమై తోపదా' అన్నట్లు ఆమె భాషాపాటవము క్రియా ప్రయోగ వైచిత్రిలో చక్కగా గోచరించుచున్నది. ఇందులకు తార్కాణలైన వానిలో ఈ క్రిందివి మచ్చునకు కొన్ని. 'పదజాలము' లో వలెనే ఇందును నిఘంటువుల కెక్కనివి, ఎక్కినవి - అను విభజనము పాటింపబడినది.

**నిఘంటువుల కెక్కని క్రియలు :**

1) కడమీటు : దూరముగ విడుచు.

"ఏ దేవుఁ డో వచ్చె నిచటి కటంచుఁ - బాదుకల్ కడమీటి బహుతీవ్రగతిని
నెదురేఁగి తో డ్తెచ్చి యిష్టాసనమునఁ - గుదురుగా నతనిఁదాఁ
గూర్చుండఁబెట్టి."

2) కొడికెక్కు : మితిమీఱు.

"సహజబాలుఁడ వీవు సర్వదా గావు - మహిమల పోకిళ్లమారివైనావు
గుణము చేపట్టక కొడికెక్కినావు - గుణశాలి పోలికె గునిసి యాడెదవు"

-జల

3) చిట్టాఱు: 'చిఱు + ఆఱు' అనగా 'ఇంచుక మోసపోవు' అని భావము. ఇది 'యేమాఱు' వంటి ప్రయోగము.

"నిలుక దెక్కడ లేక నినుఁగన్నతల్లి - చెలరేఁగి జనుల వంచింపుచు
నుండు
అట్టి యిల్లాలని యమరఁగాఁ దొలుత - చిట్టాఱి మీ తండ్రి చేపట్టెఁ గనుక
కపటమానవుఁడయ్యెఁ గ్రమముగా నతని - కిపు డీవు పుట్టితి విందుచే ధరను."

-విష్ణు,67 పుట

4) చిల్లాడు: చిల్లుమని ధ్వనియగునటుల కొల్లలాడు.

"పెరుగుపాల్ చిల్లాడి బెదరించి చాల - మురిసి గ్రక్కున వెన్నముద్దలు మెక్కి."
-జల.

5) పుడియు (?): లాగు.

"కటకటా చెంచితా ! నా కడుపులో పేగు పుడుస్తూ
వున్నది ... ... శ్రీ వేంకటేశ్వరుని గుడిలో నైన గెంజి
వంటకం తెచ్చిపెట్టవే చెంచుబామా!" - చెంచు, 25 పుట.

6) ముద్దించు : 'ముద్దు' అను దానికి 'ఇంచుక్' చేరగా ఏర్పడిన నామధాతువు.

"అనఘ! యుధిష్ఠిరుం డభిమన్యుసుతుని - పెంచి ముద్దింపుచు పెద్దకాలంబు
నంచిత కురు రాజ్య మనుభవింపఁగను - పటుతరకాలంబు పరిపక్వమయ్యె."
- ద్విప. భాగ. I స్కం.

7) మోదించు : కొట్టు (మోదు ఇంచు)

"నా తండ్రీ! యీ చిన్ననాడు నీ కింత - యారడి వచ్చె నేనేమందు విధిని
ఊరి వా రెల్ల ని న్నుప్పతించినను - నే వినవలసె నీ నెత్తిన బ్రహ్మ
దేవుఁ డీ రీతి మోదింపుచు వ్రాసె." - జల

8) శేఖరమగు : 'శిరస్సుపై అలంకారముగా నుండు' అని మొదటి యర్థము. రాను రాను ఈ నామధాతువు 'విషయములన్నియు ఒక చోటికి చేరు,' 'పరిస్థితులన్నియు ఒనగూడు' - ఇత్యాద్యర్థములలో విపరిణామము నొందినది. తెనుగులో తరచుగా వాడబడు 'సేకరించు' ధాతువు దీనికి తద్భవరూపమే. ఇది యిట్లు శబ్దార్థ విపరిణామముల నొందినదని నిశ్చయించుటకు పై వెంగమ ప్రయోగమే మూదలయైనది!

"వినవే దుండి! నీవు తలంచిన తలంపులు శేఖర మౌతుండా
దంటా. దేవళ్లు వచ్చి పలుకుతుండారు." - శివ

నిఘంటువుల కెక్కని యిట్టి క్రియారూపము లింకను కొన్ని యీ కవయిత్రి వాఙ్మయములో గలవు.

**నిఘంటువుల కెక్కినను స్వరూపమున గాని,**
**అర్థమున గాని మార్పు నొందిన క్రియలు :**

1) ఉడ్డు గూర్చుకొను : ఊపిరి త్రిప్పుకొనజాలక ఉక్కిరి బిక్కిరి యగు. ఇది పై నిఘంటువులలో 'ఉడ్డుగుడుచు' అను రూపమున కలదు.

"ఉడ్డు కూర్చుకు నీ నమ్మా చిన్ని బిడ్డ ॥ఉడ్డు॥
వుడ్డు కూర్చుకు నీని లో యమ్మ నా బిడ్డ
డడ్డముగ చేతు లొడ్డి నీళ్లుబోయు ॥ఉడ్డు॥ - జల

2) పంగించు : ఉపాలంభించు, ఎత్తిపొడుచు. ఆం. క్రి. స్వ. మ. దీ. లో దీనికి 'కోపించు' అను నర్థము కలదు.

"తాళు కృష్ణా! మంచీది తాళు కృష్ణా ! అంతా
వేళ వచ్చిన నిన్ను వేడుకొనే గాని పోవే భామా!
అప్పుడు నను వేడే నంటే నే పంగించ
నటరా కృష్ణా ! నే పంగించ నటరా కృష్ణా!" -విష్ణు, 94పుట.

3) పట్టించుకొను: మోయించుకొను. ఆం.క్రి.స్వ.మ.దీ.లో 'శ్రద్ధ చూపు, లక్ష్యముగా నెంచు' అను అర్థము లీయబడినవి.

"సొగసు కాటుక దీర్చి సోగలు దిద్ది - యగరుగంధముఁ బూసి యద్దంబులోను
తన రూపమంతయుఁ దప్పకచూచి - మనసులో ముదమంది మత్తేభయాన
వీడెంబుఁ జేయుచు విభునికిఁ దగిన - వీడెముల్ గంధంబు విరులబంతులును
పటములు చెలులచేఁ బట్టించుకొనుచు - ఘలుఘల్లుమని కాళ్లగజ్జెలు మ్రోయ
నలువంద బృందావనంబున కపుడు - లలనాలలామ శ్రీరాధ యేతెంచె."
- బాలకృష్ణ.

4) పొదిలించు: విస్తరిల్లు సూ.రా.ని.లో 'పొదలించు' అను నది 'వృద్ధినొందించు' అను ప్రేరణార్థక క్రియగా నియ్యబడినది. 'పొదలించు' యొక్క వ్యావహారిక రూపము 'పొలించు'. ఇది ఈ కవయిత్రిచే 'విసర్తిల్లు' అను స్వార్థమున ప్రయోగింపబడియుండుట విశేషము.

"ఆ రీతి దేవకి యమల గర్భమున - నారాయణస్వామి నవ్యతేజంబు
వలనుగా నిల్చె దేవకి కటుమీఁదఁ - దలకొని యోకిలింతలు పుట్టసాగె
... ... ... ... ...
మునుకొని కుచకుంభములు పొదిలించె." - జల

5) బీర్చు : పీల్చు. నిఘంటువులలో 'పీర్చు, పీర్చుచు' అను రూపము లీయబడినవి. 'పీర్చు' కు వ్యావహారిక రూపమే 'బీర్చు'.

"దాని ప్రాణములతో దాని చన్బాలు - దానవాంతకుఁడైన తరిగొండ నృహరి
బీర్చుచు నుండఁగా బెడబొబ్బలిడుచు - నోర్చలే కా యింతి యులికి
యిట్లనియె." -జల

6) భంగి పడు : బ్రతిమాలు. నిఘంటువులలో 'భంగపడు' అను రూపము కలదు. కాని అర్థము వేఱు.

"అని భంగి పడెడి గోపాంగనామణులఁ - గని హరి దరహాస కలితుఁడై పలికె
పతిని గోరుచు రతిపతిని గెల్చుటకు వ్రతనిష్ఠతో నుండి వసనముల్ విడిచి
నీటిలోఁ జొత్తురె నియమంబు లేక." - జల

ఇది నేడు కొన్ని ప్రాంతములలో 'భంగపోవు' అని వ్యవహరింపబడుచున్నది. ఉదా : "మే మెంత భంగపోయి చెప్పినా వాడు వినలే దబ్బా."

## వెంగమాంబ ప్రయోగించిన క్రియలందలి కొన్ని ప్రత్యేకలక్షణములు :

1) 'చు' వర్ణమునకు మాఱుగా 'వు' వర్ణము ఉండుట.
ఉదా :- పూజింపుచు, సందేహింపుచు, కావింపుచుండు,

తలపుచు, చెరుపుచున్నాఁడు, కురియింపుచుండె మున్నగునవి.

2) అడఁగు, కడఁగు, తొడఁగు - ఇత్యాది ధాతువులను 'అణఁగు, కణఁగు, తొణఁగు' అని రీతిని 'ణ' కార సహితరూపములుగా ప్రయోగించి యున్నది. దీనిని బట్టి 'ణ' కార సహిత రూపములు వెంగమ కాలమునాటి భాషయందలి ప్రత్యేకలక్షణ మని చెప్పదగును.

3) క్రియలలో, అందును దేశ్యక్రియలలో మాండలిక స్వరూపత అధికము. 'ఒచ్చు (వచ్చు), ఒంగి (వంగి) తెలుసు (తెలియు), ఇయ్యు (ఈయు), కావలె (కావలయు) చేతు (చేయుదు), కూర్చొని (కూర్చుండి), పెరిగినే, శిగ్గయ్యీని, తెచ్చుక, తోడుక' - మున్నగునవి కొన్ని యుదాహరణలు.

4) వ్యతిరేకక్త్వార్థకములు (అకప్రత్యయాంతములు) నియతముగా ద్రుతాంతములై కన్పట్టును. 'లేకను, చేయకన్, పోవకను, విసువకను'- ఇత్యాదుల నెన్నైన ఉదాహరింపవచ్చును.

వేంకటాచల మాహాత్మ్యమందలి సంస్కృత క్రియాపదములను తెనిగించు పట్టులలో ఈ కవయిత్రి క్రియాకల్పనా నైపుణ్యము స్పష్టముగా వెల్లడియగుచున్నది.

| వెంగమ అనువాదము | సంస్కృత మూలము |
|---|---|
| i) "కావునఁ బెద్దలు తెల్పిన శ్రీ వేంకట గిరి విచిత్ర మహామహిమలన్." (I - 210) | i) 'శ్రుతం కిఞ్చి త్త్వయా పురా' (వరాహ, 41 అధ్యా, 2 శ్లో.) |
| ii) "అంజనాదేవి శ్రీ వేంకటాద్రి మీఁద నుండి రాముఁడు కపిపుంగవులను గూడి వచ్చుటం జూచి యెదురుగ వచ్చి యతని." (I - 213) | ii) 'తదా సత్యం జనాదేవీ ! వాయుసూనో ర్మహాత్మనః । జననీ పురతో గత్వా। రామం రక్తాంతలోచననమ్ ॥' (వరాహ, 41 అధ్యా, 9 శ్లో.) |

iii) "నిలుకడగా నిల్చె నిత్యు డగుచు." (II - 4) iii) 'ఆస్తే' (వరాహ, 43 అధ్యా, 2 శ్లో.)

iv) "నాసికాగ్రమున దృష్టి హత్తించి' "ధ్యానయోగ సునిష్ఠ నూని" (II - 41) iv) 'నాసాగ్రన్యస్త లోచనమ్' 'నిశ్చల ధ్యానయోగతః' (వరాహ; 45 అధ్యా; 39 శ్లో.)

వెంగమ క్రియా ప్రయోగదక్షతకు పై అంశ మొక్కటి చాలిని నిదర్శనము.

## సంధి

సంధి రూపములందు కూడ కొన్ని విలక్షణములు వెంగమ భాషలో కన్పించును.

### అచ్సంధి:

వెంగమ వాఙ్మయమందలి అచ్సంధులకు ఉచ్చారణమే, అందును నిత్యవ్యవహారమున భాషించురీతియే ఆధారకమై వెలసినది. ఈమె భాషలో ఇత్వసంధి నిత్యముగా కాననగును.

కావలుందురు : కావలి + ఉందురు - త. నృ. శ. 46 ప.
తప్పుమోపిచటికి : తప్పుమోపి+ ఇచ్చుటికి - విష్ణు, 40 పుట.
తొలగుండును : తొలగి + ఉండును - ద్విప. భాగ, 5 స్కం.
బుద్ధొకచోటను : బుద్ధి + ఒకచోటను - త.నృ. శ, 81 ప
మందాకినిల్లు : మందాకిని + ఇల్లు - శివ.

ఈ ఇత్వసంధి క్త్వార్థక - ఇకారమునకు చేయబడుట ఇందలి ప్రత్యేకత.

ఇట్లే శత్రర్థక చు వర్ణమందలి ఉత్వమునకు ఈ కవయిత్రి తరచుగ సంధి గావించినది.

మొఱయు చనిలుఁడు : మెఱయుచున్ అనిలుఁడు - వేం.మా, IV - 53.
చిఱునవ్వుఁజూపు చాతాపసుఁడనియె : చిఱునవ్వుఁ జూపుచున్ ఆతాపసుఁ డనియె. - వేం.మా; VI -241

ఇక అత్వ ఉత్వసంధుల విషయమున మిగుల స్వేచ్ఛ పాటించినట్లు కనబడును. ఇందులకు ఈ క్రింది ప్రయోగములు కొన్ని నిదర్శనములు.

భూమి కెక్కిన మీద = భూమిక + ఎక్కినమీఁద - వాసిష్ఠ; 347 పుట
మహిమారన్ = మహిమ + ఆరన్ - వేం. మా; I -118.
చెప్పె దంబుజనయనా! = చెప్పెదన్ + అంబుజనయనా! - వేం.మా;VI -93
భానుఁ డొచ్చుటకు = భానుఁడు + వచ్చుటకు - త.నృ.శ. 19ప.

పై యుదాహరణములలో తత్సమములందలి అకారమునకు ద్రుతమునకు ముందుండెడి అకారమునకు సంధి జరిగినది. చివరి యుదాహరణలో ఉత్వమునకు వ్యావహారిక సంధి జరిగినది. ఇట్లు నిత్యవ్యవహార సిద్ధములగు పెక్కు సంధి రూపములు ఈమె భాషలో చోటుచేసికొని యున్నవి.

**హల్సంధి :**

ఈ రచయిత్రి భాషయందలి హల్సంధి విధానమున ప్రముఖముగా పేర్కొనదగినది సరళాదేశము. బాలవ్యాకరణమున ప్రథమ మీది పరుషములకు గసడదవాదేశము, ద్రుతప్రకృతికముమీది పరుషములకు సరళాదేశము చెప్పబడినవి. (చూ. సంధిపరిచ్ఛేదము 13,16 సూ.) నిజమునకు గ స డ ద వా దేశములో రెండవ, ఐదవ అక్కరములగు స, వ - ల స్థానములో జ, బ - లు నిలిచినచో అది సరళాదేశమే యగును. ప్రాచీన భాషా స్వరూపమును పరికించినచో ప్రథమ మీది పరుషములకు సరళము లా దేశమగుట సహజమే యని తెలియవచ్చును. తెలుగుసంధికి సంబంధించిన ఈ స్వాభావిక లక్షణమును వెంగమభాషలో బాగుగా తిలకింపవచ్చును.

ప్రస్తుతి జేతున్ = ప్రస్తుతి + చేతున్. -శివ
విరిసరుల్జుట్టి = విరిసరుల్ + చుట్టి - విష్ణు; 25 పుట.
విల్లెక్కుబెట్టి = విల్లెక్కు+ పెట్టి - ద్విప. భాగ, 4 స్కం.
జోలలు బాడరె = జోలలు + పాడరె - జల.

పై రీతిని ప్రథమమీద సరళాదేశమేగాక, మఱికొన్నిచోట్ల ఈ కవయిత్రి భాషలో గ స డ ద వా దేశము కన్పట్టుచున్నది.

దీవన లొసంగి వోయిరి = దీవన లొసంగి + పోయిరి - వేం.మా, V - 55.

ఉడుగక గావింప్రచు = ఉడుగక + కావింప్రచు - ద్విప. భాగ; IV స్కం.

ఉచ్చారణనుబట్టి గ స డ ద వాదేశము ఆవశ్యక మనిపింపని చోట్లకూడ ఈమె గ స డ వా దేశమును గావించినట్లు పై యుదాహరణములవలన తెలియగలము. బహుశః అట్టి సంధిరూపములకు ప్రాంతీయ వ్యవహారపు ప్రభావమే కారణమై యుండును.

**మరికొన్ని సంధి విశేషములు :**

1) సంస్కృత సంధి జరుగవలసినచోట తెనుగు సంధిని, తెలుగు సంధి యుండవలసినచోట సంస్కృత సంధిని పాటించుట.

ఘనయావరణంబులు = ఘన + ఆవరణంబులు - త నృ.శ. 45 ప.

ఈ యుదాహరణమున సంస్కృత వ్యాకరణానుసారము సవర్ణదీర్ఘ సంధి జరుగవలసియుండగా తెనుగునందలి యడాగమము వచ్చి కూర్చొనినది.

తరిగొండాధిపుడు - తరిగొండ + అధిపుడు - విష్ణు,1 పుట.

ఇందు తెనుగు భాషా సంప్రదాయానుసారముగ 'తరిగొండ యధిపుడు' అని యడాగమము రావలసియుండగా, సవర్ణదీర్ఘము చేయబడినది.

2) పుంప్వాదేశ, టుగాగమాది సంధికార్యములు ఒక వ్యవస్థ ననుసరించి కాక, కవయిత్రి స్వేచ్ఛాధీనములై ప్రయుక్తమై నటుల తోచును.

మెందెండలోను = మెండు + ఎండలోను - ద్విప. భాగ, I స్కం.

తప్పడుగు = తప్పు + అడుగు - జల

ఈ రెంటిలో టు గా గమము రావలసియుండగా రాలేదు.

గొడ్డాలు = గొడ్డు + ఆలు -జల

ఇందు రుగాగమము రాలేదు

మదమేనుగు = మదము + ఏనుగు - శివ

ఇందు పుంప్వాదేశ టుగాగములు రాలేదు.

3) 'రెండున్నరైన గడియ' (వేం.మా; III -108)

'అష్టమదంబులున్నుడిగి' (త.నృ.శ ; 52 ప.) - వంటి ద్రుతద్విత్వసంధులు; 'పెబ్బులి' (త.నృ.శ ; 26 ప.) ముంగోపము (వేం.మా; I -13ప.) - వంటి ప్రాతాది సంధులు; 'తన్మరునాడు' (వేం.మా; II -114 ప.) - వంటి అనునాసిక సంధులు, 'పిల్చిపిల్చినన్' (త.నృ.శ. 23 ప.) 'గూడెగూడెము' (చెంచు; II పుట) - వంటి ఆమ్రేడిత సంధిరూపములు; 'మచ్చర పట్టినాడు' (శివ.), 'అనుమాన పడక' (ద్విప. భాగ; VI స్కం.) వంటి పడ్వాది సంధులు, 'గోపెమ్మ'. 'ఉట్టైందకున్న' (జల.) - వంటి వ్యావహారిక సంధులు మొదలగునవెన్నో ఈ కవయిత్రి వాఙ్మయమున నెలవుకొని యున్నవి.

ఒక్కమాటలో చెప్పవలె ననిన సమకాలీన వ్యవహారమందలి సంధి వైచిత్రికి వెంగమ సారస్వతము అద్దము పట్టియున్న దనవలెను.

## వాక్యము

వెంగమవాక్యప్రయోగ వైఖరి ఆమె భాషయందలి అనేకాంశములవలెనే నిత్యవ్యవహారమునకు సన్నిహితము. అందలి ముఖ్యవిశేషము లీ దిగువ నుట్టంకింపబడుచున్నవి.

**మాండలిక లక్షణము :**

ఈ కవయిత్రి వాక్యనిర్మాణము ప్రాయికముగా ప్రాంతీయ వ్యవహారమును పుణికి పుచ్చుకొన్నదిగా గోచరించును. ఈమె వాక్యవిన్యాసమున ప్రతిఫలించి యున్న వ్యావహారిక రీతు లివి.

1) కర్త బహువచనమున నుండగా క్రియ ఏకవచనమున నుండుట.

i) చౌషష్టి విద్యలున్ను నీ కుమారునికి వస్తున్నది" - జల.

ii ) "పెట్టెలు చేర్చినట్లా వుండది యిది యే కొండలురా అన్నయ్యా!"

- చెంచు; 8 పుట.

iii )"కాబట్టి నీ పుత్రికను ఆ సామి కిచ్చి పెండ్లిచేసి
కన్నులారా సూడుము తల్లీ! సుకంగా నుంటాది;
లేకుంటె కష్టాలు రాఁబోతుండాదె యమ్మా!"

- వేం. మా; V ఆశ్వా; 31వ.

2) తుమున్నర్థక ('కొఱకు' అను నర్థమిచ్చు) అసమాపక క్రియను వాడుక భాషలోవలె సమాపక రూపమున ప్రయోగించుట.

i) "కావున జీవుని కర్మంబు తెగను
శ్రీ విష్ణు భక్తి విశేషయోగంబు కావలె" - ద్విప. భాగ; I స్కం.

పై ద్విపదలో 'తెగుటకొఱకు' అను నర్థమున 'తెగను' అను సమాపక క్రియారూపము వాడబడినది.

ii ) విష్ణుదేవుని గనిరాను నేను బహుళోత్కళికం జన"

- వేం. మా; II ఆశ్వా; 18 ప.

పై పద్యపాదమున 'కనివచ్చుటకొఱకు' అను నర్థమున 'కనిరాను' అను సమాపకరూపము ప్రయుక్తము.

3) యుష్మచ్ఛబ్ద (నీ) విశేషణమునకు 'వు' చేర్చక ప్రయోగించుట.

i ) "బలాధమ! నీ వొక ధర్మసంధుఁడే?"
- వేం. మా; IV ఆశ్వా; 43 ప.

ధర్మసంధుఁడవే!' అని యనలేదు.

ii ) " ... ... మారుతా! యెపుడు నా కాహారమైనట్టి నీ వనగా
నెంతటివాఁడు'" - వేం. మా; IV ఆశ్వా; 43 ప.

4) కర్త్రర్థక వాక్యమున కర్మణ్యర్థక క్రియను వాడుట.

" ... ... ... మొనసి గావింపుచు మూఢాత్ముఁడగుచుఁ
జిర భక్తి తోడ భజింపకుండినను - పరువడి ధరఁవాడు భస్మకుండమునఁ
బనిఁబూని వ్రేల్పఁగాఁ బడిన వాఁడగుచుఁ - గనలుచుఁ జెడిపోవు గట్టెక్కలేక"
- ద్విప. భాగ; III స్కం

పై ద్విపదలలో 'వ్రేల్చినవాడగుచు' అనెడు కర్త్రర్థమున 'వ్రేల్వగా బడినవాడగుచు' అను కర్మణ్యర్థక క్రియరూపము ప్రయోగింపబడినది.

**ఏకదేశాన్వయములు :**

i) "తరిగొండ హరికి సోదరియైన గౌరికుమార!" - జల.
ii ) "పురుషోత్తముని పదాంబుజ దత్తపుష్ప
మరసి మూర్కొనని ముక్కగుఁ బందిముట్టె" - ద్విప. భాగ; II స్కం

పై రెండు వాక్యములలో సమాసమందలి యేకదేశముతో అన్వయము కల్పించియుండుట పరికింపదగినది.

**మఱికొన్ని వ్యావహారిక ధోరణులు :**

i ) "అదియేమొ తెలియలేదమ్మహామహుఁడు
చెదరక కృతి నెటు చెప్పింప గలఁడో'" - ద్విప. భాగ; I స్కం

నిత్యవ్యవహారములో తనకు దెలియని విషయము నెవరైన ప్రశ్నించినపుడు 'అదేమో?; అదెట్నో?' - అని సమాధానమిచ్చుట నేటికిని వ్యవహారములో నున్నది.

ii) "తనయుల గన్నారు లేదా?" - జల.

కన్నారా ? లేదా?' అను నర్థమున మొదటి ప్రశ్నార్థకము 'కన్నారు' అని భావార్థకముగా వాడబడినది. నేటికిని తరిగొండ ప్రాంతమున 'నీకు నేను చెప్పినాను లేదా?' ; 'నీ వీ పని చేసినావు లేదా?' - ఇత్యాది వాక్యధోరణులు వినబడును.

iii) "పెండ్లియాడియైనది వేడ్కన్" - వేం. మా; V ఆశ్వా; 257 ప.

ఈ వాక్యమున 'అడి' అను క్త్వార్థకము' ఆడుట' అను భావార్థకముయొక్క అర్థమున ప్రయుక్తమైనది. 'చూచి అయింది'; 'ఇచ్చి కావలె' - మొదలగు ప్రయోగములతో గూడిన అనుదిన వ్యవహారమే పై ప్రయోగమునకు ఆధారమని తలంపనగును.

"పెనుపొంద నొక్కనిఁ బిలిచిన మీరు
ముగురు వచ్చినదేమి మొనసి నా మీఁద." - ద్విప. భాగ; IV స్కం.

పై ద్విపదలో 'వచ్చుట యేమి?' అను క్రియారూపమునకు మాఱుగా 'వచ్చినదేమి?' అను రూపము ప్రయుక్తమైనది. 'చేయుట వచ్చుట' - మొదలగు భావార్థకములకు తెనుగుదేశమందలి వివిధ ప్రాంతములలో 'చేయటం, రావటం, చేయుడము, రావడము,'- ఇత్యాది విభిన్న రూపములు వాడుకలో నున్నవి. వెంగమ జన్మించిన ప్రాంతమున 'చేసినది, చేసేది, వచ్చినది, వచ్చేది' ఇత్యాది రూపములు వ్యవహారమందున్నవి. అవే భావార్థకరూపములను కవయిత్రి తన భాషలో విరివిగా ప్రయోగించియున్నది.

## కారకము

ఆయా విభక్తి ప్రత్యయములు వాక్యమున క్రియతో అన్వయించు విధానమే కారకము. ఈ కవయిత్రి వాక్యమందలి కారకప్రయోగ వైచిత్రి మిగుల స్వతంత్రము. అందలి ముఖ్యవిశేషము లీ క్రింద తెల్పబడినవి.

సప్తమికి ద్వితీయావిభక్తి వచ్చుట :

i ) "మద్భావంబు న్వసియించి యిచ్చు నొగి శబ్దశ్రేణి."
- వేం. మా; I ఆశ్వా; 9 ప.

'మద్భావంబునన్ + వసియించి' అను సప్తమీవిభక్తి మాఱుగా పై పద్యపాదమున ద్వితీయ వచ్చినది.

విభక్తి ప్రత్యయముల పునరుక్తి:

i )"బోరున రొక్కముఁ గూర్చు లోభినిన్." - త.నృ. శ. 92ప.
ii ) "వందనము నీవు సేసితి వందున వర్ధిలు చుండుము." - శివ.

పై యుదాహరణములలో ద్వితీయా, సప్తమీవిభక్తి ప్రత్యయములు పునరుక్తి నొందియుండుట గమనింపదగినది.

ఒక్కొక్క విభక్తి ప్రత్యయమును దాని తొలి యర్థమున ప్రయోగించుట :

"చని తన మందిరంబునకు సంతసమారగఁ బోయి భార్యచే
నొనరఁగ నిచ్చి." - వేం. మా; IV ఆశ్వా; 43 ప.

పై యుదాహరణమున 'భార్యచేన్' అనగా 'భార్యచేతియందు' అని యర్థము. ఇట్లు 'చేన్' అను తృతీయావిభక్తి ప్రత్యయము దాని తొలి యర్థమున ప్రయుక్తమై యుండుటవలన, తెలుగున విభక్తి పత్యయము లనబడునవి తొలుత ప్రత్యేక పదములే యను నభిప్రాయము విదితమగుచున్నది.

ఒక విభక్తికి మఱియొక్క విభక్తి వచ్చుట :

i) "ఇలు వెళ్ళి కుందేలు పిల్లను గంటి నమ్మ!" - శివ.

'ఇంటినుండి వెడలి' అను పంచమ్యర్థమునకు మాఱుగా ప్రథమ వచ్చినది.

ii) "మే మచ్చటుండి పోవ దశకంధరుఁడు వచ్చి
పొలతిఁజూచి" - వేం. మా; IV ఆశ్వా; 335 ప.
'అచ్చటనుండి' అను పంచమికి ప్రథమ వచ్చినది.

వేయేల? "కొన్నియెడల విభక్తి పరిణామంబు గ్రాహ్యంబు"అనెడి ప్రౌఢవ్యాకరణ (కారకపరిచ్ఛేదము 26 సూ.) సూత్రమునకు చక్కని లక్ష్యములగు కారక విశేషములు వెంగమ వాక్యప్రయోగమున సమృద్ధిగా సాక్షాత్కరించుచున్నవి.

మఱికొన్ని విశేషములు:

i) "తరుణి నిన్నుండి యింతటి కీడు వచ్చె" - ద్విప. భాగ; III స్కం.
'నిన్నుండి' యనునది 'నీ నుండి' కి వ్యావహారిక రూపము.

ii) "లలిమీఱ బ్రహ్మవల్ల జనించినావు" - ద్విప. భాగ; IV స్కం.
'వల్ల' యనునది 'వలన' కు వ్యావహారిక రూపము.

iii) "కదనరంగంబులోఁగా విజృంభించి" - ద్విప. భాగ; I స్కం.
' లోగాన్' అనునది 'లోన్' అను ప్రత్యయమునకు వాడుకరూపము.

పై నుదాహరించిన వానిని బోలిన వ్యావహారిక విభక్తిరూపములేగాక, "చెన్నలర నీ సేయుసృష్టి యను నుద్యోగ మున్నతంబుగ సాగుచున్నదట వోయి!" - (శివ.); "చూచి చెప్పితినని మీకు దోచవలదు" (వేం. మా; III ఆశ్వా; 205 ప.); "బలిపెట్టఁ దలఁచె, నీ బ్రాహ్మణోత్తముఁడు నాకు హరించునె?" (ద్విప. భాగ; V స్కం.); "వినమిత భక్తి నచ్యుతుని వేచిరి" (వేం. మా; II ఆశ్వా; 30 ప.) వంటి ప్రౌఢ ప్రయోగములును ఈ రచయిత్రి యొక్క కారకవైచిత్రిలో భాగస్వాములై యున్నవి.

## ఊనిక

వెంగమ వాక్యము నిత్యవ్యవహార సరణికి సన్నిహిత మగుటచే అందలి ఊనిక, కాకువు మున్నగు వాని స్పందన అటనట స్పష్టముగా చెవి సోకుచుండును.

ఎ, ఏలను అవధారణార్థకములుగా తరచు ప్రయోగించుట:

i) "శ్రీ యలమేలుమంగ యురమందే నిల్చి దీపింపఁగా"

- వేం. మా; I ఆశ్వా; 15 ప.

ii) "మీటఁగా దొడ్డవాఁడే సమీరుఁడపుడు"

- వేం. మా; IV ఆశ్వా; 52 ప.

వాక్యములు అనతి దీర్ఘములై వేర్వేరు చోటులందలి ఊనిక, కాకువు మున్నగువానివలన భావము సుగమ మగుచుండుట :

i) "మునిప్రవర! నా తండ్రివి!' - వేం. మా; IV ఆశ్వా; 241 ప.

ii) "ఏమి యీ దినమిచ్చుట మనము చేరుటలు!'

- వేం. మా; V ఆశ్వా; 72 ప.

iii) అన శుకయోగి వల్కువిని యంబుజ మిత్రుఁడు నవ్వి యిట్లనెన్

... ... ... ... ...

... ... ... ... బిడ్డలన్

గని నటువంటి నిను గాఢవిరక్తిని బొందఁ జెప్పెనే.

- వేం. మా; VI ఆశ్వా; 163 ప.

పై చివరి యుదాహరణమందలి కాకువు గమనింపదగియున్నది.

మొత్తముమీద ఈ కవయిత్రి వాక్యవిన్యాసము 'అల్పాక్షరముల అనల్పార్థరచన' అను సూక్తికి నిదర్శనమై ప్రకాశించుచున్నది.

## మఱి కొన్ని వ్యాకరణ విశేషములు

ఈ కవయిత్రి వాఙ్మయమున గన్పట్టు మఱి కొన్ని వ్యాకరణాంశము లిట క్రోడీకరింపబడుచున్నవి.

1) వికటోక్తులతోడి పరిహాస ప్రసంగములలో 'గి, గీ' - లను వినియోగించుట.

ఉదా:- విష్ణుపారిజాతము, శివనాటకము, బాలకృష్ణ నాటకము మున్నగు యక్షగానములలోని సహాయ పాత్రముల పల్కులు. మచ్చునకు విష్ణుపారిజాతమందలి వక్రభాషిణి వక్రోక్తులివి.

"నీ వెవతెవే అక్కయ్యా? నన్ను వక్రభాషిణి యందురే
గిక్కయ్యా! యిక్కడికి యేల వచ్చినావే భామా?
నాతో టంతా తొక్కి తోమ్మాడు చున్నారు గనుక
మీతో కొట్లాటకు వచ్చినామే దోమా!" - విష్ణు, 11 పుట.

2) విశేషణములను విశేష్యములుగా ప్రయోగించుట.

i) "అంత సమస్తులు నా చంద్రమౌళి
శాంతంబునకు చాల సంతసింపుచును."- ద్విప. భాగ; IV స్కం.

ii) "గూఢము నమ్మలేదు." - త.నృ.శ, 32 ప.

పై యుదాహరణలలో రేఖాంకితములగు విశేషణములు, విశేష్యములుగా ప్రయుక్తమైనవి. ఈ లక్షణ మీమె భాషలో బాగుగా గోచరించుచున్నది.

3) సమకాలీన లేఖన సంప్రదాయానుగుణముగా పదములను ప్రయోగించుట.

"విపుల పరాక్రమక్రమ వివేక విచక్షణులైన పార్షిదుల్."

- వేం. మా; I ఆశ్వా; 86 ప.

ఈ పద్యపాదమున పారిషదుల్ అను పదము నాటి లేఖన పద్ధతి నూతగా గొని గణబద్ధము గావింపబడినది. ఇట్టి పదములు - పుర్షుడు, కల్వారింపు, వెల్కురుకు - వంటివి అటనట గన్పట్టును.

4) 'విధివత్తు, సాక్షాత్తు' - వంటి వ్యావహారిక తత్సమములు; 'అర్భటము, ఆవిర్భవము, భగీరథి' - వంటి ఆభాసతత్సమములు; 'గాడ్పుకు, ప్రభువుకు' - వంటి నగాగమ రహిత రూపములు; 'తేలులు, మేలులు' వంటి బహువచన రూపములు, 'ఆడ (అక్కడ), వాదము (ఓదము)' వంటి మాండలిక రూపములు ఎన్నో ఈమె భాషలో శరణొంది యున్నవి.

మొత్తముమీద ఈ కవయిత్రి కృతులయందు విస్తరించియున్న భాషాసమష్టి, ఈమె సాహితీ రసస్పర్శచే వినూత్నముగా దీపించుచున్నది.

## నుడికారము

సిద్ధహస్తురాలగు వెంగమ సృజించిన వాఙ్మయవారాశిలో రత్నరాశి వంటివి నుడికారములు. ఆ రాశినుండి మచ్చుకుగా ఈ క్రిందివి కొన్ని.

**జాతీయములు :**

జాతీయము లనగా జాతికి సంబంధించినవి. ఇవి ఒక జాతియొక్క భావవ్యక్తీకరణ సామర్థ్యము, అనుభవము గూడుకట్టియుండు గుటికెల (capsules) వంటివి. పైకి తోచెడు పరిమిత శబ్దార్థమున గాక, తదాధారమున స్ఫురించెడు విస్తృతార్థములో అవి చరితార్థము లగు చుండును.

1) అడవికి గాచిన వెన్నెల.

"పడతిరో నా యౌవనము -ప్రాణవిభుపై మోహము
అడవికి గాచిన వెన్నెల - యాయె నయ్యయ్యో
ఏమి సేతు నమ్మలారా!" - శివ

2) అఱుగని సొమ్ము

"ఘనముగా గగనమార్గమునఁ బోవుచును - దనమదిలోఁ దానె తలఁచె నీ రీతి
నినుఁడు ధరించిన దీ రత్నహార - మనువంద నెవ్వరి కఱుగ దీ సొమ్ము
పరమపతివ్రత పార్వతీదేవి - ధరియింపఁదగుఁగాని తపసుల కేల -శివ.

3) కాయో, పండో

"ఓ యోగీశ్వర! సత్కృప
నీ యెడ కిమ్మాడ్కి వచ్చుటిది మే లయ్యెన్
మాయావిరహిత ! నా పని
కాయో, పండో నిజంబుగాఁ దెల్పుమయా!"

- వేం. మా; V ఆశ్వా; 83 ప.

4) కొంగు బంగారము

"పదవే పిలిచి వత్తామూ గోపాలబాలునీ
నా కొంగుబంగారమైన నందకుమారునీ." - విష్ణు: 57 పుట.

5) గజదంత పరీక్ష

"అనిన విని వక్రభాషణుండు భయాక్రాంతుండై నమస్కరించి యో స్వామీ! యీ గజదంత పరీక్ష సేయను నే నెంతటివాడను? నామీద దయసేసి నీ సత్య లోక ప్రభావంబుఁ దెలుప మనిన." -శివ.

6) తలకట్టు

"వింత లాయె శౌరి వేణునాదమూ ... ... ...
... ... ... గానవిద్యల కెల్ల తలకట్టు నాదమూ" - బాలకృష్ణ.

7) తులతూగు

"శ్రీవరాహస్వామి! శ్రీనివాసుఁడు పెండ్లి
యాడఁదలంచినాఁ డర్థ మిచట
లేదు, వివాహమే లీలనౌ నందుల
కే యుపాయము సేయ నెసఁగు ధనము
పడుచు నిచ్చెడు వారు భాగ్యవంతులు, వారి
తో సరిగాఁ దులదూఁగ వలయు."
- వేం. మా; V ఆశ్వా; 93 ప.

8) నాల్కలు గ్రోయు.

"ఓహెూహెూ కృష్ణ! నా యురుతరంబైన - సాహసం బెఱుఁగక
సామాన్యుఁ డనుచుఁ
తలఁచితి వేమొ నాత్రాణైనఁ జూడు - మెలమి దివ్యాస్త్రంబు లేసెద నింకఁ
గాలానల జ్వాల కరణి దీపించి - నాలుకల్ గ్రోయు నానాగబాణంబు
యిదె వింటఁ దొడిగితి నిదిగొ వేసితిని." - విష్ణు, 125 పుట.

9) శ్రీరామరక్ష.

"అంత పార్వతి, సావిత్రి, సరస్వతులు కలశంబులఁ
గుంకుమోద కాభిషేకంఁ బొనర్చి, లక్ష్మితోడఁ దత్తీర్థంబు
పుడిసిళ్ల వట్టి శ్రీరామరక్ష యని శిరంబునకుఁ
జుట్టి చల్లి రంత." - వేం. మా; V ఆశ్వా; 139 ప.

10) సిగపట్ల బేరము.

"వీ రింటి బానల వెన్నఁ దా మెక్కి - వారింట నా ఘటావళు లన్నిఁ బెట్టి
జనఁగ నంతట వీరు జాడఁ బట్టుకొని - పెనగొని విగపట్ల బేరంబుగాను
వారు వీరును పెద్దవాదాడ నందుఁ - జేరి ధర్మంబులు జెప్పె నీ సుతుఁడు."
- జల.

**సామెతలు :**

సామ్యము గలవి సామెతలు. వీనిలో ప్రసిద్ధార్థముతోడి పోలిక ప్రధానమై యుండును.

1) అర్భకుల్ పుట్ట చెండాడిన కరణి

"కమలలోచన! నీవు కావలెననిన - అమితంబులగు పద్మజాండ భాండముల
నర్భకుల్ పుట్ట చెండాడిన కరణి - నిర్భయంబునఁబట్టి నీవు మీటుదువు."
- విష్ణు; 134 పుట.

2) ఎలుకలు ద్రవ్విన యింటిచందము.

"నా తండ్రి రఘువర ! నాటుగా నిపుడు - నీ తండ్రి రాజ్యంబు నెమ్మదిగాను
బాలింప యువరాజ్య పట్టభద్రుండ - వై లలిసుఖము లె ల్లనుభవింపకయ
యెలుకలు ద్రవ్విన యింటిచందమున - గలఁగుచు దిగులందఁ గారణమేమి'"
- వాసిష్ఠ, ఆదిప్రక, 12 పుట.

3) ఏనుగుతో దోమ పోర దలచినట్లు.

"ఏనుఁగును జూచి దోమ తా నెదిరి పోరఁ- దలఁచినటువలె నీవు న న్నలిగి యిన్ని

యెగ్గులాడిన నీ కేమి ఫలము వచ్చె - చాలు నిఁక పోవె నీ ప్రేమ
సత్యభామ!" - విష్ణు, 96 పుట.

4) గచ్చపొద కరణి పట్టుకొను.

"అయ్యయ్యో దుశ్శకునమున హరుని బిలువబోతిగదనే శైలజాతా!
గంగా గయ్యాళియై గచ్చపొదకరణి నన్ను బట్టుకొనెనే
శైలజాతా ! అయ్యయ్యో." -శివ.

5) చల్ల లమ్మిన వెనుక నుట్లదిక్కు జూచిన గతి.

"వెలఁది ! విను చల్ల లమ్మిన వెనుక నుట్ల
దిక్కుఁ జూచిన గతిఁ గృష్ణుఁ డక్కఱగను

వచ్చినప్పుడు పోనాడి, మెచ్చి మగుడి
పిలిచి నంతనె వచ్చునే బిసరుహాక్షి?" - విష్ణు, 47 పుట.

6) చింతగుంట జోగిచందము.

"శిఖరిజచే నేను సెలవంది యెట్లైన - నీ నగరికి రాను నిశ్చయించి
యున్నట్టితఱి నుత్తమోత్తమమైనట్టి - పత్రిక వ్రాయించి పంపినావు
గాన నిల్చితి; మించి నేను వచ్చిన నీకు - శ్రీపార్వతికిఁ గాక చింత
గుంట, జోగి చందమున నెచ్చోట నిల్చుట లేక - తిరుగవలసియుండు
దేశమెల్ల." -శివ.

7) నిద్రబోవుచు నుండువాని పదము లొత్తినరీతి.

"నెలఁత! యీ శౌరికి నేను మ్రొక్కినను - చెలఁగి నన్ జూడఁ డాశీర్వాద
మనఁడు

... ... ... ... ...

ఉరుతర నిద్రఁబోవుచు నుండువాని - పదము లొత్తినరీతి బాగాయెఁ
జూడు." - విష్ణు, 86 పుట.

8)హేమగిరితో కూచిగుట్ట పోరాడినట్లు.

"జ్ఞానకాంత:- శాంతిబొంది యున్నాడనీ - సంతోషించే వంతే గానీ
యింత మాత్రమున కేను మెచ్చేనా
వో భక్తికాంతా!
యిపుడె ముక్తి నంట నిచ్చేనా?

భక్తికాంత:- హేమగిరితో కూచిగుట్టా యెదురించి పో
రాడే ననెడి సామెతగా బలుకుచున్నావే
వో జ్ఞానకాంతా!
స్వామి మహిమా లేమి గన్నావే?" - ముక్తి, 34 పుట.

**లోకోక్తులు :**

లోక ప్రసిద్ధమైన అర్థమునకు నెలవగు ఉక్తులే లోకోక్తులు.

"తన్నిన నెఱుఁగడు పిన్నవాఁడని నేను
గూర్మి దలంపక గొట్ట నగునె?
-కడుపులోపల బిడ్డ కాలఁ దన్నె నటంచుఁ
దల్లి క్రమ్మఱ వానిఁ దన్నఁదగునె?"
- వేం. మా; IV ఆశ్వా; 126 ప.

"ఏలరా గోపాల! యే నీకుఁ దగుదునా?
తఱచైన గోపసుందరులె గాని
- క్రొత్తగా ముత్తెముల్ కొల్లగా వచ్చిన
యీ పాతమాణిక్య మేల నీకు?" -బాలకృష్ణ.

"అన విని గంగ యి ట్లనె సఖితోడ
విను నీలవేణి యీ విశ్వేశుఁ బిలువ
ఢీకొని దాని యింటికిఁ బోయినపుడు
శ్రీకంఠు నంపక చిక్కులఁ బెట్టె
నట్టి తంటలమారి యంపిన చెలినిఁ
బట్టికొట్టినఁ దప్పు బట్ట రెవ్వరును
- 'చెట్టు ద్రిప్పినవారిఁ జెలరేఁగి మరల
గుట్ట ద్రిప్పినఁగాని కోపంబు బోదు" - -శివ
" ... ... ... ఆశయ మెఱిఁగి పద్మాక్షుఁడు తానె
మనల మోహించి సమ్మానించు దనుక - మన మూరకుండుట
మర్యాద నిజము
తమకముల్ మానుఁడీ - తాళినగోవు; లమరంగఁ దేటనీ ళ్ళావలఁగ్రోలు
నంబుజాననలార ! హరిమధ్యలార! " - జల.

- "పెట్టినవారికిన్ మఱియుఁ బెట్టినయంతయుఁ గల్గు - 'నేటికిన్
వట్టి దురాశలన్ దగిలి వాజతనంబున నన్యసంపదల్."
త.నృ.శ; పుట 90 ప.

"చిక్కితి విపుడు నాచేత, బొంకించి; యెక్కడబోయె - వింక మీఁదటను
- పెట్టు సంజీవి యౌ బిడ్డల కెల్ల" - - జల.

"క్రొవ్విరాధతోను మీరు కొట్లాడకురే
రచ్చకైన భయములేక వచ్చేమనేరే యిట్ల
- ముచ్చుల కుండేదైతేను మూరెడు నోరు" - -బాలకృష్ణ.
- "లోకం బంతయు మూయను
మూఁకుడులే దతని నేల మోహించితివే? -
కూతుర! మాకును నీకును
బ్రాకట బుణ మింతె కీర్తి రాఁగలదె మహిన్."
- వేం. మా; V అశ్వా; 50 ప.
"వెన్నయుఁ జేతఁ బట్టుకొని వేమఱు నేయని కూయ నేటికో?"
- త.నృ.శ. 100 ప.

**మఱికొన్ని పలుకుబళ్లు :**

మీద నుదాహరించినవేగాక, మఱి కొన్ని అర్థవంతములగు పలుకుబళ్ల నెన్నింటినో కవయిత్రి తన రచనలలో ప్రయోగించి యున్నది. అట్టివి ముఖ్యముగా శబ్దపల్లవములయందు కాన నగును.

'అట్లట్ల చెనకు, కనుగీటినను, కన్నుమిన్నెఱుగకుండు, గునిసి యాడు, చేతిలో చేయిబెట్టు, తొక్కితోమ్మాడు, నెమ్మినెగడు, పూటబడు, పౌరుషము నిల్పి, బ్రతుకు బంగారమైపోవు, ముద్రవేయు, మొగమొగంబులు జూచుకొను, రూకగూర్చు, వంతుకెక్కు, వాకిళ్లవచ్చు, సిరిగుల్కు' - అనునవి అట్టి పలుకుబళ్లలో కొన్ని మాత్రమే!

'బీజాంకుర న్యాయము, జలశర్కరాన్యాయము, గజమశక న్యాయము' వంటి న్యాయములు, ఉపమోత్ప్రేక్షాది ప్రసిద్ధాలంకారములు మున్నగున వన్నియు ఈ నుడికారపు సొంపులోని భాగములే!

స్థాలీపులాకముగా నింతవరకు పరికించిన అంశము లన్నింటిని బట్టి, తరిగొండ వెంగమాంబ జీవద్భాషా స్వరూపమును, అంతస్తత్త్వమును సమగ్రముగా దర్శించిన "భాషాద్రష్ట" యని నిశ్చయింపదగును.

ఈ కవయిత్రి యింతటి భాషావేత్తయైనను, తాను ప్రయోగించిన భాష 'బాలభాష' యని సవినయముగా వచించియున్నది.

## బాలభాష

వేంకటాచల మాహాత్మ్యావతారికయందలి ఈ క్రింది పద్యమున వెంగమాంబ తన భాష 'బాలభాష' యని పేర్కొనినది.

"పండితాగ్రణులార! ప్రజలార! యిపుడు నా
  బాలభాష కసూయపడక వినుఁడు
తల్లిదండ్రులు చిన్నపిల్లల పల్కుల
  కానంద మొందెదునట్ల యిందు
మీరు నా తప్పొప్పు లే రీతిగా నైన
    గేలిసేయక చిత్తగింపవలయు."

- వేంకటాచల మాహాత్మ్యము, I ఆశ్వా; 19 ప.

బాలురయొక్క భాష (చిన్నపిల్లల పల్కులు) ఉచ్చారణలో అస్పష్టరూపమై, అర్థవ్యక్తీకరణలో అసమగ్రమై యుండును. ప్రాచీనులగు పండితకవుల భాషతో పోల్చి చూచినపుడు తనది బాలురభాష వంటిదను అభిప్రాయమును కవయిత్రి పై పద్యమున సవినయముగా వెల్లడించినది.

ఆంధ్ర వాఙ్మయమున 'బాలభాష' యను పదమును తులనాత్మక దృక్పథముతో గూడిన ఇట్టి నిర్దిష్టార్థమున ఈ కవయిత్రిగాక మఱొక రెవ్వరును ప్రయోగింపలేదు. లాక్షణిక నియమములను అనుసరింపక పోవుటలో వెంగమ కృతులయందలి భాష కొంతవరకు 'బాలత్వము'ను పుణికి పుచ్చుకొనియున్నను, అర్థవ్యక్తీకరణలో మాత్రము ఆ కొదువ కాన్పింపదు.

ఆలోచించి చూచినచో బాలుర భాషలో రెండు విశేషములు గోచరించును. i )'కలితీ' లేని సహజ స్వరూపము ii) సుకుమారమైన అభిప్రాయ వ్యక్తీకరణము. ఈ రెండు లక్షణములు వెంగమ భాషలో ఎక్కడ బట్టిన నక్కడ చేతి కందుచుండును. ఇట్లు ఈ కవయిత్రియొక్క 'బాలభాష' ఒక ప్రత్యేకతను సంతరించుకొని, "అమృతం బాలభాషితం"[4]

అన్న సూక్తికి అమలిన నిదర్శనమై ఆంధ్రవాఙ్మయమున అలరారుచున్నది.

వెంగమ తన కృతులలో బహుముఖముగా ప్రదర్శించిన భాషావైచిత్రి యంతయు ఆమె 'బాలభాష' కు లక్ష్యమై యున్నది. ఆ వైవిధ్యమును చాటుచున్న అంశములు కొన్ని ఈ దిగువ నీయబడినవి.

**పాత్రోచితభాష :**

ఈ కవయిత్రి పాత్రోచిత భాషాప్రయోగ నైపుణికి ప్రథమ నిదర్శనము ఎఱుకత బాస. శివనాటకము, విష్ణుపారిజాతము, వేంకటాచలమాహాత్మ్యము - అను కృతులలో ఈ పాత్రయొక్క వేషభాషలను అత్యంత స్వాభావికముగా ఆవిష్కరించియున్నది.

i) విష్ణుపారిజాతమునందలి 'పలుకుసింగి' పల్కులు ప్రథమ దృష్టాంతముగా పరికింపదగియున్నది.

"వినవే యవ్వ! నీవు తలంచిన తలంపులు మరుగుబెట్టి పలుకుసుండావు. అవ్వోయవ్వ! నీ తలంపులు మా కొల్లాపురమ్మ వచ్చి సెప్పుసుండది. అవ్వోయవ్వ! అది యేమంటె సెప్పె వినవే దుండి! అవ్వోయవ్వ! ఒక్కమేలు కడుగుసుండావే భాగ్యశాలీ! ... ... ... అదిగో నందన వనంబులోనుండే పారిజాత వృచ్ఛంబు కోరుసుండావే బూటకాల బిడ్డా! అవ్వోయవ్వ! ఆ వ్రిచ్ఛంబు తపంబు శాయనివారికి లభ్యంబుగాదె దుండెమ్మా ! ... ... అవ్వోయవ్వ! యీ కన్నకల తభరో తాతోట్లో ధరకట భరకటో తబ్బిబ్బో తోడంబరమో ధసుకో భుసుకో కల్లోకైలాటమో యని యనుమానింపుసుండావే భాగ్యశాలీ! ... ... ... అవ్వోయవ్వ! నీ కన్నకలలో పరమ పురుషుండు వచ్చి శ్రీకృష్ణజపంబు నుపదేశించిన ప్రకారంబున జపంబు శాయవే దుండి! అవ్వోయవ్వ! ఆ జపంబు శాత శ్రీమన్నారాయణుండైన పడిగె కొండలవాడు తరిగొండ నారసింహుడై వచ్చి నిన్ను మెచ్చి పారిజాతంబు తెచ్చి యిచ్చి నీ శెంత నిలిచియుండునే భాగ్యశాలీ! ... ... ..."

25 విష్ణుపారిజాతము,78 పుట.

పై 'ఎఱుకజాతివచన' భాగమును దక్షిణాంధ్ర కవయిత్రియగు పసపులేటి రంగాజమ్మ (క్రీ.శ. 17 శతాబ్ది) రచించిన మన్నారు దాసవిలాస యక్షగానమున అత్యంత సంగ్రహముగా నున్న 'ఎఱుకతమాట'5 తో పోల్చి పరిశీలించినచో వెంగమయొక్క సహజభాషా ప్రయోగచాతురి తెల్లము కాగలదు.

చెంచునాటకమందలి చెంచుదంపతుల పల్కులు మఱొక నిదర్శనము.

"చెంచిత:- కటకటా ! చెంచునాయుడా! నీ విట్లా మోడిమాటలంటే వినసహింపదు. శ్రీ వేంకటేశ్వరుండు మహాయోగీశ్వరుడంటా. వేదముల బలుకుచుండారంటా. మన తుంబుర కోనలోని జడలమునులు బలుకుచుండుదురు గావున యీ మహాత్ముని జారుడంటే పాపం వచ్చునోయో చెంచునాయుడా!

చెంచునాయుడు:- కటకటా! చెంచితా! యీ వేంకటేశ్వరుడు జారచోర శిఖామణి యని బహుమంది పెద్దలు జెప్పచుండుదురు గావున యీ విటకాని కండ్ల ముందరికి అబ్బబ్బ మా యబ్బతోడే నిన్ను పోనియ్యనే చెంచుభామా!"

- చెంచునాటకము, 20 పుట.

ii) జలక్రీడా విలాసమందలి గొల్లదంపతుల సంభాషణ సమాజమందలి ఇంకొక్క వర్గపు మాండలికమునకు చక్కని యుదాహృతి.

"గొల్లగౌడు:- వోశోశి ముసిలాపె! వోశోశి ముసిలాపె
వోశోశి ముసిలాపె! వో ముసిలాపె
కూశి కూశి మన గోపెమ్మతోడ నా
క్రోశముతో నీవు కొట్లాడే దేమే?

కమ్మగా నంబిలిగాశే కోడండ్లాతో
నెమ్మెలు శేసూత నిందుండా వేమే?

సక్కగ తరిగొండసామి పూజ శెయ్య
కిక్కడనే వుండా రీ పాప మేమే?

గౌడసాని :- యీ కేటి కాపురమురా? వో ముసిలోడ!
యింకేటి కాపురమురా?

యింకేటి కాపుర? మీ వూళ్లో క్రిష్ణుడు
మంకువాడై నాతో మల్లాడ వచ్చినా
డింకేటి కాపురమురా:

పాలాకుండలు గొట్టి బాలామణులబట్టి
ఛీలల్లా! శిగ్గూలు జెఱచి గాబర జేశె ॥యింకేటి॥

యెరనాగి న్నలనాగి న్నిరుకు మానికాడ
కరచి జరికి ఆట్లగా జేశినాడంట ॥యింకేటి॥

తరిగొండ నరహారి దాడిమెండైనాది
పొరుగూళ్ళకైనాను పోదాము వలసగా. ॥యింకేటి॥

-జలక్రీడావిలాసము.

**వయోచిత భాష :**

వెంగమ భాషాప్రయోగములో వినూత్నమైనది వయోచిత భాషాప్రయోగము. తదితర యక్షగాన రచయిత లెల్లరు పాత్రోచితమగు భాషను ప్రయోగించుటతో తనివి చెందగా, ఈ కవయిత్రి జలక్రీడా విలాసమున బాలురగు బలరామకృష్ణులకు వయోచితభాషను సమకూర్చి అపూర్వ చమత్కృతిని పాదుకొల్పినది. బాలకృష్ణుని ఈ క్రింది ముద్దుపలుకు లిందుల కొక యుదాహరణ.

"ఆవేశమారుదామా? తలలూచుకుంతా ఆవేశమారుదామా?
ఆవేశమారుతావుంతే నపురు మన కన్నులకు
శ్రీ వైకుంతమెదులుగాను చెలగి కానవొత్తిందిప్పు రావేశమారుదామా?

మీ పెద్దవారు దూ! మాయమ్మతో పొల్లుమాతలు జెప్పి
యీ పట్ల నన్ను గొత్తించే రిందు చద్దుచేయ కిప్పు ॥రావేశ॥

జంతగా నందలము మూలయింతిలో జేలి యచ్చోత
కంతకుల కెవ్వాలికి కనుపరకుంద దాక్కొని ॥యావేశ॥

చెలగి తారిగొందనార చిమ్మచ్చామి పాత లన్ని
పలుమారు పొలుకుంత నాలుకుంత ॥యావేశ॥

- జలక్రీడా విలాసము.

తనది 'బాలభాష' యని పేర్కొన్నందుకు నిదర్శనముగానో అన్నట్లు, ఈ కవయిత్రి పై యక్షగానములో ఇష్టదైవమగు బాలకృష్ణుని ముద్దుమాటలను అత్యంత సహజముగా వర్ణించి తనిసినది.

**జాత్యుచిత భాష :**

ఈ కవయిత్రి సారస్వతమందలి భాషా విశేషములలో మఱియొక నూతనాంశము జాత్యుచిత భాషాప్రయోగము. ఈమె యక్షగానములలో ఎఱుకత లోకులకు సోదె చెప్పునపుడు తెలుగులో మాటాడినను, తన పెనిమిటి యగు ఎఱుకల సింగనితో మాటాడునపుడు మధ్య మధ్య తమిళమున భాషించును. దీనినిబట్టి ఆ కొఱవంజి యింటిలో మాటాడెడి భాష తమిళమని తప్పక స్ఫురించును. ఇందువలన సోదె చెప్పెడి ఎఱుకలవారి మాతృభాష తమిళమని, వారొకప్పుడు తమిళజాతీయులని ఈ కవయిత్రి యభిప్రాయమైనట్లు తెలియుచున్నది. వెంగమ జాత్యుచిత భాషా ప్రయోగమునకు తార్కాణముగా శివనాటకమున 'కలుముల సింగి' తన పతియగు 'తరిగొండ నరసింగని' తో పలికిన పలుకులు ఆలకింప దగియున్నవి.

"ఆడా యెన్నడా యింగె వాడా సింగా! నీ
గుడిసె విట్టు యింగె వందదేండా సింగా!
గుడిసెక్కుళ్లె యెళిగళ్వందు గుడిక్కుదు సింగీ! యెన్నై

కడిక్కు మెన్ను బయందు వందేన్ కలికి సింగీ!
ఉన్నై పార్క శూరన్ బోలే యిరుక్కుదు సింగా! యిప్పో

మెన్నుడనె బయందు శొల్వ దే డా సింగా!
పాయ్ గళెల్లాం వున్నె విట్టు పోగుం సింగీ! యిప్పొ
పోలాం తరిగొండైక్కి వాడీ సింగీ!" - శివనాటకము.

అరవమున రచింపబడిన పై దరువులలో 'తరిగొండ' ను 'తరిగొండై' గా ప్రయోగించిన ఈ కవయిత్రి తమిళభాషా పరిజ్ఞానము ప్రశంసనీయము.

**లేఖలు, వడ్డీపత్రములు :**

శివనాటకము, విష్ణుపారిజాతము, వేంకటాచల మాహాత్మ్యము, ముక్తికాంతా విలాసము - అను కృతులలో వెంగమ ఇతివృత్తానుకూలముగ కొన్ని 'లిఖితము' లను కూర్చినది. అట్లే వేంకటాచలమాహాత్మ్యమున నొక వడ్డీపత్రమును రచించియున్నది. ఇవెల్ల ద్విపద, సీసము - అను ఈ రెండు ఛందములలో నేదో యొకదానియందు రచింపబడినవి. ఏ ఛందస్సున రచితమైనను అంధిమిడియున్న రచనాక్రమము మాత్రము సమకాలీన వ్యవహారమునందలి పద్ధతిని స్పష్టముగా ప్రకటించుచున్నది. ఈ కవయిత్రి రచించిన ఉత్తర ప్రత్యుత్తరములందలి "శ్రీమదఖండ లక్ష్మీయుక్తులైన", "శ్రీమదఖండ లక్ష్మీప్రసన్నేక్షణాలంకృతులైన" - ఇత్యాద్యుపక్రమములు, "చేసి చాయంగల విన్నపములు," "మీ కుశలాతిశయము వ్రాయించి పంపించవలయు" - ఇత్యాది పదబంధములు, వాక్యములు నాటి లేఖాధోరణిని చాటుచున్నవి. మచ్చునకు వేంకటాచలమాహాత్మ్యమందలి ఈ క్రింది వడ్డీపత్రము పరికింపదగినది.

"శ్రీకరలీల స్వస్తిశ్రీ జయాభ్యుద
యాష్టాదశ ద్వాపరాంతమందుఁ
గల కలి నాది వేంకటనాయకుఁడు ధన
పతి కొసంగిన వడ్డీపత్ర మెట్ల
యనినను నా వివాహమునకు నీ చేత
నప్పుగాఁ గైకొనినట్టి రామ
టెంకి నిష్కములు కోటియుఁ జతుర్దశ లక్ష
లందుకు వడ్డి సహస్రనిష్క
ములను బ్రతివత్సరము దీర్చి మొనయు కలియు
గాంతమున నేను గైకొని నంత విత్త

మియ్యఁ గలవ్వార మజరుద్రు లిందు కిపుడు
సాక్షు, లశ్వత్థుఁ డిచ్చట సాక్షి నిజము."

- వేం. మా; V ఆశ్వా; 160 ప.

పై సీన పద్యమునకు సంస్కృత మూలమున్నను, అందు ఇమిడియున్న 'అప్పుపత్ర' రచనావిధాన మంతయు అచ్చముగా కవయిత్రి. కాలమునాటి వ్యవహారమును పుణికి పుచ్చుకొన్నదే! ముఖ్యముగా అందలి 'రామటెంకీలు' కవయిత్రి కాలమున చలామణిలో నుండినవే!

**మఱికొన్ని విశేషములు :**

వెంగమ భాషయందలి మఱి కొన్ని విశేషము లీ దిగువ పేర్కొనబడుచున్నవి.

1) సన్నివేశోచిత వ్యావహారికము - ఈ కవయిత్రి తన కృతులలో నొకటి రెండుచోట్ల ఆయా పాత్రల నోట సన్నివేశానుగుణమైన వ్యావహారికమును పలికించి యున్నది. రమాపరిణయ కావ్యమందలి బువ్వముబంతి సన్నివేశమున పెండ్లికొడుకును మేలమాడుచున్న శంకరుడు "భుజియింపవోయి! భక్షింపవోయి!" అని యీ రీతిని పెక్కుమారులు సంబోధించును. ఇందులో తెనుగు దేశీయమగు బావమఱదుల సంభాషణారీతి ప్రతిధ్వనించుచున్నది.[6] శివనాటకములో తన కడకు వచ్చిన బ్రహ్మను బంధుత్వసరణిగా శివుడు పలుకరించుటలోను పై సన్నివేశోచిత భాషణము కూర్చబడినది. వేంకటాచల మాహాత్మ్యమందలి శేష మారుత సంవాదము ఇందుల కింకొక యుదాహరణము.[7]

2) పద్యములలో వ్యావహారికము - ఈ రచయిత్రి తన వాఙ్మయమున గేయములు, వచనములు మున్నగు వానిలోనే గాక ఎడ నెడ పద్యములలోను శిష్టవ్యవహారమును ప్రవేశపెట్టియున్నది. ఈ లక్షణము ముఖ్యముగా ఈమె యక్షగానములందలి పద్యములలో కన్పట్టుచున్నది. బాలకృష్ణ నాటకమందలి ఈ క్రింది పద్యము అట్టివానిలో . నొకటి.

"యేమే సుందరులార! రేయనక మీ రిఁ దెందుకున్ వస్తిరే?
యీ మం ... ... ... గణం బే వేళ గాచుండునే

యీ మాట్కిన్ బలువంతకారు లయి మీ రిట్లా పనుల్ జేతురే!
రామారత్నములార! చాలు చనరే ర ట్టేల మీ యిండ్లకున్."
-బాలకృష్ణ నాటకము. (అము.)

3) వచనములో గ్రాంథికము - పై రీతిని యక్షగానములందలి పద్యములలోగూడ వ్యావహారిక ధోరణిని ప్రవేశపెట్టిన ఈ రచయిత్రి వచనములో ఒక్కొకచో గ్రాంథికలక్షణమును ప్రదర్శించియుండుట యొక విశేషము. జలక్రీడా విలాసమందలి ఈ క్రింది వచన మిందులకొక దృష్టాంతము.

అని యిట్లు పెరుఁగుఁ జిలుకుచున్న సమయంబున కృష్ణుండు క్రమ్మఱ గోపసతుల మీఁద దాడి వెడలి, యాడుచు పాడుచు జల్ల చిల్లాడ నుల్లాసంబున కొల్లకాఁడై రాఁగా, నల్లనయ్యను జూచి వల్లవ పల్లవాధరలు చెల్లరే! యని తమలోఁ దా మిట్లనుచున్నారు." - జలక్రీడా విలాసము.

ఇట్లే ఈ కవయిత్రి వేంకటాచల మాహాత్మ్యమున తాళ్లపాక పెదతిరుమలాచార్యుల 'వేంకటేశ్వర వచనముల' పోకడను పుణికి పుచ్చుకొన్న వచనము నొకదానిని రచించియున్నది.8 ఇవన్నియు వెంగమాంబయొక్క బహుముఖరచనా ప్రజ్ఞకు భాషావైశారద్యమునకు సముచిత నిదర్శనములు.

4) వ్యాఖ్యానసరణి - జలక్రీడా విలాసములో పురోహితుడు నందగోపునకు కుమారుని జాతకఫలమును దెలుపుపట్టున ఈ క్రింది శ్లోకము, దాని వివరణయు కలవు.

సౌఖ్యానాం వర్ధనీ కులసంపదామ్।
పదవీ పూర్వపుణ్యానాం లిఖ్యతే జన్మపత్రికా॥

యిషనేని సిద్ధాంతం వుంచున్నది గనుక, జన్మసౌఖ్యాలకున్ను కులసంపద వర్ధమానం అయ్యేటందుకున్ను పూర్వజన్మ పుణ్యవిశేషములు తెలియుటకున్ను మాకు తోచినట్లు లెస్సగా విచారించి చెప్పినాము."

ఈ వివరణ ధోరణి తాళ్లపాక పెదతిరుమలాచార్యుని భగవద్గీతా వ్యాఖ్యా ధోరణిని తలపించుచున్నది. దీనినిబట్టి ఈ కవయిత్రి

తలచుకొనియుండినచో వాసిష్ఠరామాయణమువంటి తాత్త్వికకావ్యమునకు వ్యావహారిక వచనములో చక్కని వ్యాఖ్యను సంతరించియుండెడిదని భావింపవచ్చును.

పరిశీలించినచో ఏ కవి భాషలోనైనను భాషావినియోగము, భాషాసృష్టి - అను రెండంశములు కలిసి మెలసి యుండుటను బాగుగా గుర్తింపవచ్చును. కవి తన 'కందుబాటు' లోని భాషను సముచితరీతిని రచనలో ప్రయోగించుట 'భాషా వినియోగము'. కవి తనకు గల భాషాపాండిత్యపు బలిమినిబట్టి కృతిరచనమున భాషను కల్పించుటే 'భాషాసృష్టి' పదములు, జాతీయములు, సామెతలు మొదలగునవి మొదటి అంశమునకు చెందినవికాగా, సమాసములు, సంధులు మున్నగునవి రెండవ అంశమునకు చేరును. రచయిత భాషను సృజించుటలో ఛందోనియమములుకూడ ప్రభావము నెరపుచుండును.

తరిగొండ వెంగమాంబ తనకు సుపరిచితమైన శిష్టవ్యవహారమును వినియోగించుటలో, దానిని సలక్షణ బాషాస్వరూప పరిధిలో సుందరముగా నెలకొల్పినది. ఇది యీమె "భాషాసృష్టి."

మొత్తముమీద ఈ కవయిత్రి భాష అధునిక భాషకన్న ప్రాచీనభాషకే మిగుల సన్నిహితమైనది. పందొమ్మిదవ శతాబ్ది మధ్యభాగమునుండి (అనగా క్రీ.శ. 1857 నుండి) శిష్టవ్యవహారము అంతకుమును పెన్నడును లేనంతటి శీఘ్రగతిని మార్పునకు లోనైయుండుట అందులకు కారణము.

ఒక్కమాటలో, జీవద్భాషా ప్రావీణ్యపు బలిమితో దేశి, మార్గ కవితారీతులకు జెందిన వివిధప్రక్రియలలో కృతులను వెలయించిన దక్షత తాళ్లపాక వంశకవులకు తరువాత తరిగొండ వెంగమాంబ కొక్కర్తెకే చెల్లినది!

## భాష - జ్ఞాపికలు

1. "By the major scheme of redistribution of the Districts Madanapalli Sub - Division has been split up. Rayachoti has gone to Cuddapah, Kadiri to Anantapur, and Vayalpad and Madanapalli to the new Chittoor Dt. The new Madanapalli Sub - Division formed on April 1st 1911 now consists of Madanapalli, Vayalpad and the Punganur Zamindari of the old North Arcot Dt."

- 'A Brief History of Madanapalli page 57 Addenda, compiled by F.A. Coleridge.

2. వెంగమ తండ్రి యగు కానాల కృష్ణయార్యునకు పూర్వులలో కొందరు కవులు నుండిరి. వారి యిల్లు సారస్వత వాతావరణము కల దనుటకు ఇది యొక నిదర్శనము. అట్టి పూర్వకవులలో కానాల నరసింహకవి యొకడు. ఇతడు రచించిన కృతి 'శేషధర్మములు.' ఈ కవి తన రచనను ఇష్టదైవమగు నృసింహ వరప్రసాద సమాసాదిత కవితా సామ్రాజ్యధురీణు' డితడు!

చూ. 'శేషధర్మములు' నం. 7604 (a) తాళపత్రప్రతి. యస్.వి.యు. ఓ.రీ.ఇ. లై; తిరుపతి.

3 చూ. శృంగార సంకీర్తనలు, సంపుటము 22, పుట 1.

4 చూ. నీతిశాస్త్రము, ప్రథమ భాగము, 95 శ్లో.

5. చూ. మన్నారు దాస విలాసనాటకము, పుటలు ౩౬, ౩౭

6 చూ. ఇదే గ్రంథము, పుట 209.

7 చూ. IV ఆశ్వా; 42 -49 ప.

8. చూ. ఇదే గ్రంథము, పుట 316.

## మూర్తిమత్త్వము

మూర్తిమత్త్వ మనగా వ్యక్తిత్వము. ఇది భౌతికము, ఆధ్యాత్మికము - అని ద్వివిధము. ఈ రెండిటిలో మొదటిదానికన్న రెండవది ముఖ్యమైనది. మహాకార్య దీక్షాదక్షులగు మహనీయులెల్లరును విశిష్టమగు ఆత్మీయ వ్యక్తిత్వమువలననే గణన కెక్కుచుందురు. అట్టి మహనీయుల శ్రేణిలో మహాకవులది ప్రత్యేకమైన పంక్తి. వారి ధ్యేయము లోకసంగ్రహము. అనగా విశ్వశ్రేయస్సు. 'నాఽనృషిః కురుతే కావ్యమ్', 'కవయః క్రాంతదర్శినః' ఇత్యాది వాక్యములు ఆ యుత్తమ ధ్యేయమునే చాటును.

ఆంధ్రవాఙ్మయ జగత్తున విశిష్ట వ్యక్తిత్వముతో విలసిల్లు మహాకవులలో, కవయిత్రీమతల్లులలో గణనీయ సారస్వతమూర్తి తరిగొండ వెంగమాంబ. ఆమె రచనల యాధారమున ఈ ప్రకరణములో నామె మూర్తిమత్త్వము, తద్వైశిష్ట్యము పరామర్శింపబడుచున్నవి.

**స్వభావము :**

ఈ కవయిత్రి స్వభావమున ప్రథమగణ్యమైనది వినయగుణము. ప్రతి రచనలో ఆరంభమున "వినరయ్య కవులార! విద్వాంసులార! వినరయ్య మీ రెల్ల విమలాత్ములార!" అని అణకువతో సంబోధించి, నిమ్మళముగా కథలోనికి సాగిపోవును. నిజజీవితమున తా నెన్నో ఇక్కట్టులను ఎదుర్కొనినను, తదావేదనను గాని, అందులకు కారకు లైన వారి యెడ ఆగ్రహమును గాని, భంగ్యంతరముగానైనను ప్రకటింపక, తన మోక్షాభిలాషనే వెంగమాంబ అడుగడుగున వెల్లడించినది. వేంకటాచల మాహాత్మ్యమున కుకవినిందను కనీనము తెలుగునందలి కావ్యప్రబంధరచనా పరిపాటిని చెల్లించుటకైనను చేయకపోవుట ఆమె మృదుస్వభావమునకు సదమల నిదర్శనము.

శతకములలో స్పష్టముగాను, వేదాంతరచనలలో లీలగాను వ్యక్తమగుచున్న ఆత్మీయాంశ సైతము ఈ కవయిత్రియొక్క స్వభావమాధురిని చాటుచున్నది. విశాల విశ్వము నంతటిని బ్రహ్మమయముగా భావించి మనుగడ సాగించిన వెంగమాంబయొక్క సరళ ఋజు స్వభావమే ఆమె సృజించిన సాహిత్యమునందంతట సమతాగుణమును ప్రసరింప జేసినది.

**వైదుష్యము :**

వెంగమాంబ తా నేమియు జదువుకొన లేదని తన కృతులలో వెల్లడించినది. ఐనను సువిస్తృతమగు ఆమె సారస్వతవే ఆమె వైదుష్యమునకు అక్షర నిదర్శనమై అలరుచున్నది. 'అక్షరశిక్ష' మొదలుకొని 'పద్యవిద్య' వరకుగల విజ్ఞానము నంతటిని ఈ కవయిత్రి స్వయంకృషితో సాధించినది. పిన్నప్రాయముననే పొందిన ఆధ్యాత్మికోపదేశము, అనంతరకాలమున తిరుమల క్షేత్రమున పడసిన హయగ్రీవ మంత్రోపదేశము, అన్నిటిని మించి ఆమెయందు నిబిడముగానున్న నిర్మల భక్తితత్త్వము - ఇవన్నియు, ఈ కవయిత్రియందు జన్మాంతర సంస్కారరూపమున ప్రసుప్తమై యున్న సారస్వత విజ్ఞానము సర్వతోముఖముగా వికసించుటకు దోహదకారులైనవి.

వెంగమ ప్రహ్లాదునివలె 'చదువులలో మర్మ మెల్లఁ జదివి'నది. వివిధ పురాణేతిహాసాదులయందలి కథలను, వాటి పరస్పర సంబంధమును, సందేశమును కూలంకషముగా ఆకళించుకొనినది. ఈ సమస్త సంప్రదాయ ప్రజ్ఞానమునకు దీటుగా, మేలుచేయిగా ఈ కవయిత్రి లోకజ్ఞత వెల్లివిరిసినది. సమకాలీన సమాజమందలి వివిధ వర్గముల వేషభాషలను, ఆచార వ్యవహారములను, వినోద, విశ్వాసములను సూక్ష్మేక్షికతో పరికించి తన కృతులలో అవసరమైన పట్టుల ఆహ్లాదకరముగా పొందుపరచి

యున్నది. తుంబురకోనలో లభించెడు 'సృగాలశృంగి' (నక్కకొమ్ము) మొదలుకొని పెండ్లిలో వరుడు గైకొనిపోవు 'దొంగతపేలా' వరకు, తేలుమంత్రము మొదలుకొని కరాళనృసింహ మంత్రమువరకు, గ్రామజాతర మొదలుకొని సోమయాగమువరకు, 'రామరసము' మొదలుకొని భక్తిరసమువరకు, ఊకుడుకతలు మొదలుకొని ఉపనిషత్తుల వరకు గల అసంఖ్యాక విశేషములు ఆమెకు కరతలామలకములు.

వెంగమాంబ తెలుగునందే గాక, సంస్కృతమున, తమిళముననను రచన చేయ గల సమర్థురాలు. సాహిత్య సాంప్రదాయములే గాక జ్యోతిష, సంగీత, నాట్య, సాముద్రికాది వివిధ శాస్త్ర విశేషములు కూడ ఆమె కధిగతార్థములు.

'విద్యావతాం భాగవతే పరీక్షా' అనిన సూక్త్యనుసారము విద్యావంతుల వైదుష్యమునకు భాగవతమే గీటురాయి. అట్టి భాగవతమును పోతనామాత్యు నంతటి పరిపక్వమానసిక స్థాయితో సంతరించిన సహజ కవయిత్రి తరిగొండ వెంగమాంబ. వెంగమ పాండిత్యము కేవల పుస్తక పఠనజన్య జ్ఞానముకాదు. అట్లే కేవల శ్రుతపాండిత్యముకూడ గాదు. ఆ రెంటి నధిగమించినదై, ఆధ్యాత్మికానుభూతి విలసితమైన ఉదాత్తసాహితీ సంస్కార మామెది! యావదాంధ్ర వాఙ్మయమున "అక్షరశారదా" సాక్షాత్కారము నొందిన ఏకైక విదూషీమణి ఇంజేటి వెంగమాంబ.

**జీవితదృక్పథము :**

ఈ కవయిత్రి దృక్పథము మొదటినుండియు ఆధ్యాత్మికము. ఆమెకు తటస్థించిన ఐహిక జీవనపరిస్థితులు సైతము ఆ పారమార్థిక దృక్పథమును ప్రోదిసేయునవిగా ఒనగూడినవి. అదినుండియు ఐహిక

విరక్తితో గూడిన తీవ్రమోక్షకాంక్షతో ఆమె జీవయాత్ర సాగించిన దని తరిగొండ నృసింహ శతకము మొదలుకొని వాసిష్ఠ రామాయణము వరకు గల ఆమె కృతు లన్నియు సాక్ష్యమిచ్చుచున్నవి. ఈ మోక్షపదవి నుద్దేశించియే ఆమె గ్రంథరచనను చేపట్టినది.

"అతులితమైన మీ పదవి నందఁదలంచి విశాలభక్తిచే
వితరణగాను మీ రిపుడు వేడ్కను వాక్కుల నిచ్చినంతలో
శతకముగాను జెప్పెదను." - త. నృ. శ, 3ప.

"ధరణిమీద మదాత్మ తరియించుకొఱకు
సామోదమతిని సుజ్ఞాన వాసిష్ఠ
రామాయణార్థ సారమును గ్రహించి."-వాసిష్ఠ రామాయణము,3పుట.

అట్లామె మోక్షానందము నాశించియే కృతులను వెలయించినను, అవి లోకమునకు ఆనందమును, అమూల్య తాత్త్వికసందేశమును అందింప గలవిగా అవతరించి యుండుటలో ఆమెయందలి కవితా ప్రతిభ కారణమైనది.

నిజజీవితమున ఛాందసములగు సాంఘికాచారముల నెదిరించు చొరవ గల్గిన ఈ కవయిత్రి, సారస్వతమున ప్రక్రియావై విధ్యమును ప్రదర్శించుటలో ఆ నూతన దృక్పథమును ప్రకటించినది. తాను స్వీకరించిన ఇతివృత్తమున కనుగుణముగా ఎడనెడ సుకుమారముగా సంఘ విమర్శ చేసిన ఈమె దృక్పథము ప్రధానముగా ప్రాచీనానుసరణలో నవ్యతాప్రదర్శనము. తాను జన్మించిన దేశమునకు, జీవించిన కాలమునకు అతీతముగా ఈ కవయిత్రి తిరుమలపై ప్రశాంతముగ సారస్వత వ్యాసంగమును సల్పినది.

తిరుమలలో తా నొనరించుచుండిన నృసింహ జయంతి - ఉత్సవాది కార్యక్రమములకై అయాచితముగనే జమీందారులు, పాళెగారులు ధన, గ్రామదానముల నొసంగినపుడు వాటి నామె స్వీకరించుటలో ధర్మ కార్యనిర్వహణవంటి సాంఘిక కార్యకలాపములలో ఆమె యభిలాష వ్యక్తమగుచున్నది. ఇట్లు ఈ కవయిత్రి జీవనదృక్పథము ఆధ్యాత్మికమయ్యు సామాజిక ప్రయోజనముతో ముడివడి ఉభయతారకమై వెలసినది.

**భక్తి :**

ఈ కవయిత్రి భక్తి భేదములేని 'విశాలభక్తి.' ఆ విశాలభక్తి భావనలో ఇష్టదైవమగు "తరిగొండ శేషకుధరాధ్యక్షు"నకే గాక, తదితర సమస్త దేవతలకును స్థానము కలదు. ఇందులకు ఈమె కృతుల ఆరంభములు. ఆ యా చోటులందలి స్తుతిసందర్భములు తార్కాణములు. సర్వమును బ్రహ్మమయముగా భావించు తత్త్వవేత్త గనుక, తలకోన సిద్ధేశ్వరుడు మొదలుకొని తాళ్లపాక గంగమ్మవరకు గల సర్వదేవతలందును ఒకే సత్యస్వరూపమునే వెంగమాంబ సందర్శింపగలిగినది.

ఈమె తన కృతులయందు స్తుతించిన దేవుళ్లలో ఇలవేల్పగు తరిగొండ లక్ష్మీనృసింహుడు అధ్యాత్మ విద్యాగురుడగు సుబ్రహ్మణ్యయోగి, కులదేవతయైన చౌడేశ్వరి - ఈ ముప్వురును ముఖ్యముగా దర్శనమిత్తురు. వెంగమ తిరుమల చేరిన పిదప రచించిన కృతులలో ఈ ముప్వురితోపాటు వేంకటేశ్వరుడు వెంగమాంబ పూజాపీఠము నధిష్ఠించినాడు.

వెంగమ కులదైవతమగు చౌడేశ్వరిని స్తుతించుటలో నొక విశేష మున్నది. తదితర దేవతలతో పాటు సామాన్యముగా నుతి సేయక, ఆ దేవత తమ నందవరీక కులము నుద్ధరించుటకై కాశినుండి వెలువడి వచ్చిన దను గాథను కవయిత్రి యుగ్గడించినది.[1] తాళ్లపాక కవులును తమ 'నందవరా' న్వయత్వమును పేర్కొనినను,[2] శ్రీవైష్ణవము స్వీకరించి యుండుటచే కాబోలు 'చౌడేశ్వరి'ని ప్రస్తావింపరైరి.

పారవశ్యము భక్తికి బాహిరమగు నిదర్శనము. భక్తుడైన వ్యక్తి భగవద్గుణానుభవముచే మైమరచి ఆనందతన్మయుడై నర్తించును. ఈ కవయిత్రి యిట్టి భక్తుల కోవకు చెందినది. ఈ విషయము నామె జీవితచరిత్రములే గాక, సారస్వతము సైతము సాక్ష్యమిచ్చుచున్నది. పోతన భాగవతమున భగవంతుడు సాక్షాత్కరించిన ఘట్టములను తన్మయుడై వర్ణించినట్లే ఈ కవయిత్రి తన కృతులలో అట్టి సన్నివేశములందు తాదాత్మ్యము నొంది దేవతాస్తుతులను సంతరిచినది. వేంకటాచల మాహాత్మ్యమందలి ఈ క్రింది అమూలక సన్నివేశ మిందుల కొక చక్కని యుదాహరణము.

నైమిశారణ్యమందలి శౌనకాది మహర్షులు సూతుని ప్రేరణచే శేషాచలమున కేగి శ్రీనివాసుని సందర్శించిన సందర్భమున, వారల భక్తిపారవశ్య మీ క్రింది రీతిని (మూలమున లేకున్నను) వర్ణింపబడి యున్నది.

"శ్రీనివాసునిఁజూచి యానందపరవశు
　　లై జడ ల్జీరాడ నాడి యాడి
యిదమిత్థ మననేర కెనలేని ముదమున
　　నిందిరేశునిచెంత నెగిరి యెగిరి
భక్తియుక్తావేశ భరితాత్ములై యప్డు
　　చక్కగఁ జిందులు త్రొక్కి త్రొక్కి
ఘనపద క్రమజట కలితస్వరంబుల
　　సకలవేదంబులఁ జదివి చదివి

నిలిచి యానందదుగ్ధాబ్ధి నెమ్మి మునిఁగి
శ్రీనివాసుని రూపంబుఁ బ్రియము గదురఁ
గనుల పండువుగను జూచి మనము లచట
మగ్నము లొనర్చి రెంతయు మౌనివరులు"

- వేంకటాచల మాహాత్మ్యము, IIIఆశ్వా, 18 ప.

'శ్రీవేంకటేశ్వర దివ్యపాదారవింద చింతనామృతపాన విశేషమత్తచిత్త' యైన వెంగమాంబ గాక మఱియొకరు పై రీతిని భక్తిపారవశ్య సన్నివేశమును సృజించి యుండజాలరు.

ఆ యా స్తుతి ఘట్టములలో ఈ కవయిత్రి రచించిన చూర్ణికలు, దండకములు, శ్లోకములు, పద్యములు, కీర్తనలు భక్తిరసోదీర్ణములై విలసిల్లుచున్నవి.

'మోక్షసాధన సామగ్ర్యాం భక్తి రేవ గరీయసీ' అను ఆర్యోక్తిని అవగత మొనర్చుకొనిన పరమభాగవతోత్తమరాలు తరిగొండ వెంగమ. 'భక్త్యా భాగవతం జ్ఞేయం నవ్యుత్పత్త్యా నటీకయా' అను సూక్తి కామె ద్విపద భాగవతము ప్రకృష్టనిదర్శనము. ఆంధ్రవాఙ్మయమందలి భక్తనారీ ముక్తాహారమున ఆమె నాయకమణి.

**మతము - వేదాంతము :**

వెంగమాంబ స్వభావతః వేదాంతి. గురూపదేశము నొంది యోగసాధన మొనర్చి ఆమె పిన్న వయస్సుననే రాజయోగినియై వరలినది. ఈమె అద్వైతమతానుయాయి యనుటకు రాజయోగసార మందలి గురుపరంపరయే తార్కాణము. శివనాటకము, జలక్రీడావిలాసమువంటి మఱికొన్ని కృతులలో వెంగమ్మ తన అద్వైత మతత్వమును ప్రాతముఖమున పల్కించియున్నది. శివనాటకమున ఎఱుకతయైన లక్ష్మి, గంగ యడిగిన ప్రశ్నకు సమాధానముగా "ధరవెలయు నద్వైతపరమై ప్రకాశించి గురుతరంబైన మా కులము గురుకులమే" అని పల్కును. ఇట్లే జలక్రీడా విలాసములో హరి యాజ్ఞచే యోగమాయ భూమికి దిగి వచ్చిన సన్నివేశమును వర్ణించుటలో కవయిత్రి "శివము నద్వైతాము నిర్విశేషమైన బ్రహ్మమందు సంతోషాశ్చర్యామూను విస్తారముగా గల్పించిన మాయ వచ్చెనూ" అని వక్కాణించినది.

ఈ కవయిత్రి కృతులలో గురునకు దైవమునకు, జీవునకు ఈశ్వరునకు, సగుణమునకు నిర్గుణమునకు, తరిగొండ నృసింహునకు తిరుపతి వేంకటేశ్వరునకు నిజమైన అభేదభావన ఆవిష్కరింపబడి

యున్నది. రమాపరిణయములో 'బువ్వముబంతి' సందర్భమున పరస్పరమున మేలమాడు కొనుచున్న హరిహరుల నుద్దేశించి సముద్రుడు పల్కిన పల్కుల ద్వారా కవయిత్రి తనకు గల అభేద భావనను స్పష్టముగా ప్రకటించినది.

"అని పక పక నవ్వె, నప్పుడా హరిని - గనుఁగొని పలికె సాగరుఁడు నవ్వుచును జలజాక్ష! నీవును, శర్వాణివిభుఁడు - బలవంతు లానందభరితు లన్నిటను ఒక్క రొక్కరికన్న నుత్తమోత్తములు - తక్కక మీకు భేదము లేదు గనుక మొనసి నవ్వులకు బల్ ముచ్చట మీర - లనుకొంటి రీమాట లానందము గను." -శ్రీ వేంకటేశ్వర లఘుకృతులు, 170 పుట.

శివనాటకమున తరిగొండలక్ష్మీనృసింహులను సింగి, సింగడుగా సృజించుట, విష్ణుపారిజాతమున ఇంద్రోపేంద్రుల యుద్ధమును ఈశ్వరునిచే ఉపశమింప జేయుట - అను కల్పనలు ఈమె యద్వైత భావనకు మంజులోదాహరణములు. ఇట్టిదే మఱియొక ముఖ్యోదాహరణ ఈ క్రింది తత్త్వకీర్తన.

"శివు డంటే నేమి కేశవు డంటే నేమి?
శివకేశవుల చిత్తస్థిత భేద మేమి? ॥శివు డంటే నేమి॥
రతిరాజు భ్రమలచే రట్టయ్యే దేమి?
మతిమంతుడైతె యీ మత భేద మేమి? ॥శివు డంటే నేమి॥
మంచువంటిది దేహ మని యెంచలేరు
మించుబోణుల గూడి విఱ్ఱ వీగేరు ॥శివు డంటే నేమి॥
మంచిది, కానిది మది నెంచలేరు
పంచేంద్రియంబుల బడి పొర్లేరు ॥శివు డంటే నేమి॥
ఆ మహాదేవుడే అచ్యుతు డాయె
శ్రీమహావిష్ణువే శివరూప మాయె ॥శివు డంటే నేమి॥
ఈ మహాతత్త్వార్థ మిది నిత్య మాయె
సోముడే నరసింహనాము డత డాయె ॥శివు డంటే నేమి॥
తమకము బోదాయె తాల్మి లే దాయె
తమ గతి గానక తహతహ లాయె ॥శివు డంటే నేమి॥

స్వామి శ్రీ తరిగొండ నరహరి యాయె
సామ్యాద్రి వాసుడే శివశంభు డాయె." ॥శివు డంటే నేమి॥

పై కీర్తన వెంగమాంబ శివకేశవ భేదములేని 'మతిమంతురా' లని చెప్పకయే చెప్పుచున్నది కదా !

వెంగమ శివ కేశవుల ఏకత్వమును ప్రబోధించెడు అద్వైతి యైనను, తదితరములగు ద్వైత, విశిష్టాద్వైతలయందును ఆమెకు మిగుల గౌరవభావము గలదు. వేంకటాచల మాహాత్మ్యావతారికలో త్రిమతంబుల నుద్ధరించు ధన్యులను తలంచియుండుట యిందుల కొక నిదర్శనము.[4] ఆమె మతమున త్రిమతములకు సముచిత ప్రాధాన్యము కల దనుటకు రథోత్సవవర్ణన సందర్భమందలి ఈ క్రింది సీసము మనోజ్ఞ దృష్టాంతము.

"ధీరయతుల్ వాసుదేవుని విజ్ఞాన
సురుచిర భక్తులఁ జూడఁగాను
నుపనిషత్తులు చెప్పుచో స్మార్తు లా హరిం
జిత్స్వరూపముగల లక్షింపఁగాను
ద్వైతవాదులును భేద శ్రుతిసార మీ
దేవతోత్తముఁ డని తెలియఁగాను
మొనసి వేదాంతంబు లొనరంగఁ జదువు వై
ష్ణవులు మాధవభక్తి సలుపఁగాను."

-వేంకటాచల మాహాత్మ్యము,IIఆశ్వా; 117 ప.

త్రిమతస్థుల నొక్కచో జేర్చి చెప్పిన పై పద్యము అమూలకము.

నిత్యజీవితమున తాను ఆదినుండి అనుసరించి, ఆచరించి, ప్రబోధించిన వేదాంత విజ్ఞానము ఈమె కృతు లన్నిటియందును అద్ద ములోవలె ప్రతిబింబించియున్నది. అందులోను విశేషించి కొన్ని రచనలు ఈమె తాత్త్విక విజ్ఞానమున కాలవాలములై యున్నవి. అవి 1) తరిగొండ నృసింహ శతకము 2)రాజయోగసారము 3)అష్టాంగయోగసారము 4)ముక్తికాంతా విలాసము 5)వాసిష్ఠ రామాయణము.

చిత్తశుద్ధిలేని కర్మాచరణములు, అంతరార్థ మెఱుగక చేసెడి తీర్థయాత్రాదులు వెంగమచే తీవ్రముగా తిరస్కరింపబడినవి.

వాసిష్ఠ రామాయణమున మనువు ఇక్ష్వాకునకు దెల్పినఈ క్రింది వాక్యములు వెంగమ వేదాంతసారమును ప్రకటించుచున్నవి.

"లలితాత్మ ! కర్మఫలత్యాగి నిలను - బొలుపుగా నంటవు పుణ్యపాపములు కామకర్మంబులు గావించువారు-పామరులై పుణ్యాపాపఫలముల ననుభవిం పుచు.. నుందు రజ్ఞాను లగుచు - ఘనతరజ్ఞానమార్గము నెఱుంగకయె తనువుల సకల తీర్థములలో ముంచి - పనివడఁ గష్టంబు పాలుగావించి తుదిని ముక్తిని బొందుదు మటంచుఁదలఁతు - రది యెట్టులన్న మహాతీర్థమును శ్వానముల్ మునిగిన చందంబు గాదె - జ్ఞానంబు గలుగ నా క్షణమాత్రమందె యానందకరమగు నమలసమాధిఁ - బూని జీవన్ముక్తిఁ బొందఁగా వచ్చు."

-వాసిష్ఠ రామాయణము, పంచమ ప్రకరణము, 329 పుట

ఈ కవయిత్రి అద్వైత విశిష్టాద్వైతములకు; జ్ఞాన, భక్తి వివేక, వైరాగ్యములకు ముక్తికాంతా విలాసమున ప్రతిపాదించిన సమన్వయము అనిదంపూర్వము. తరిగొండ నృసింహునకు, తిరుపతి వేంకటేశ్వరునకు వస్తుతః భేదము లేకున్నను, వ్యావహారిక దృష్టిని ఆయన జ్ఞానస్వరూపుడని, ఈయన భక్తినిలయుడని, ఐహికమునకు ఈయన, ఆధ్యాత్మిక జ్ఞానమున కాయన ఆరాధ్యులని ఆ యక్షగానమున సూచింపబడి యున్నది.

ఆలోచించి చూచినయెడల వెంగమ తన సారస్వతము ద్వారా లోకమున కీయదలచిన ముఖ్యసందేశము. వేదాంతమే యని చెప్ప వచ్చును. ఆమె వేదాంత కృతులలోనే గాక, తదితర రచన లన్నింటియందును అవకాశము కల్గినచోటు లన్నింట ఈ కవయిత్రి తత్త్వజ్ఞానమును ప్రబోధించియుండుట ఇందులకు నిదర్శనము, యక్షగానములలో మాయిక, తామసి-మున్నగు సహాయపాత్రల

పల్కులందు; సింగి, సింగడు-వీరి సంభాషలయందు వేదాంతము పుష్కలముగా ప్రపంచింపబడి యున్నది.

ఆంధ్రదేశమున అనూచానముగా వచ్చుచున్న అద్వైత దర్శనము క్రీ. శ. 15వ శతాబ్ది ప్రాంతమున మహారాష్ట్ర దేశము నుండి తెలుగునాట ప్రచారము నొందిన దత్తాత్రేయ సంప్రదాయముతో అభేదము నొందినది. పరమానందయతి, ముమ్మడి మల్లన, వేగినాటి కొండయ్య, తరిగొప్పుల మల్లన, కంభంపాటి నారప్ప మొదలగువారీ దత్తాత్రేయ సంప్రదాయ మునకు చెందిన కవులు. వెంగమ్మ నేరుగా ఆ సంప్రదాయానుయాయిని కాకపోయినను, దానిచే ప్రభావితయైనదని చెప్పవచ్చును.

సాంఖ్య, తారక, అమనస్కపూర్వకమగు రాజయోగమును అటు తెలంగాణమున పరశురామపంతుల లింగమూర్తి తన రచనల ద్వారా ప్రచారము గావించినట్లే తరిగొండ వెంగమ్మ యిటు రాయల సీమ ప్రాంతములో తన కృతుల మూలమున తత్త్వజ్ఞానమును ప్రబోధించినది. జన్మించినది ఉన్నతవర్గములోనైనను, ఉద్దేశించినది సామాన్య ప్రజానీకమునే యగుటచే ఈమె సారస్వతము, అందలి తాత్త్వికసందేశము ముఖ్యముగా సామాన్యప్రజలలో పరివ్యాప్తమైనది. ఈ ప్రజాకవయిత్రి ప్రబోధించిన వేదాంతమునకు సమన్వయము, సౌలభ్యము అనునవి రెండు ముఖ్యలక్షణములు.

'కవితైవ తపః' అను నానుడి ననుసరించి వేదాంత విజ్ఞాన ప్రబోధమునకు సాహిత్యమును సాధనముగా గొని, ఈ 'కవితా తపస్విని' రసవత్కావ్య రచనమే భవ్యతపస్సాధనగా, తత్త్వమహోదధిని మథించిన "తఱిగొండ" (మంథాద్రి)యై వరలినది!

## ప్రాచీనకవి ప్రభావము :

వెంగమ వేంకటాచలమాహాత్మ్యావతారికలో తాను "కావ్యనాట కాలంకార శాస్త్రముల్ వీనులనైనను వినఁగ లే"దనియు, "పూర్వేతిహాస విస్ఫురితాంధ్ర సత్కృతుల్ శోధించి వరుసగాఁ జూడలే" దనియు కంఠోక్తిగా నుడివినది. ఐనను ఆమె సారస్వతములో ప్రాచీన కవుల కవితాప్రభావ

ముద్రలు అచ్చటచ్చట దర్శనమిచ్చుచునే యున్నవి. ఈ రెంటికి సమన్వయము నిట్లూహింపవచ్చును.

వెంగమాంబ తన తండ్రి యింటియందలి సాహిత్య వాతావరణము కారణముగా తొలుత అప్రయత్నముగను, అనంతర కాలమున ఆమెయొక్క స్వయంకృషి ఫలితముగా సప్రయత్నముగను ప్రాచీన వాఙ్మయ ప్రభావమునకు లోనైనది.

వెంగమపై పూర్వకవుల కవితా ప్రభావము ఆమె తొలిరచనయగు తరిగొండ నృసింహ శతకములోనే వెల్లడి యగుచుండుట విశేషము. ఇందలి మకుటము, పద్యముల ఎత్తుగడలు, అవతారవర్ణనలు, పద్యసంఖ్య మున్నగు వివిధాంశములలో దాశరథీ శతకప్రభావము గోచరించుచున్నది.[5]

ఈమె యక్షగానములలో పెక్కింటిపై సిద్ధేంద్రయోగి భామాకలాప రచనా ప్రభావము ప్రసరించియున్నది. ఇట్లే 'తోడైమంగళ' కీర్తనల అనుకరణ తాళ్లపాకవారి కవితా ప్రభావమును, కొన్నిటిలో విఘ్నేశ్వరపాత్ర ప్రవేశము దాక్షిణాత్య యక్షగానముల ప్రభావమును చాటుచున్నవి.6 తాళ్లపాక తిమ్మక్క సుభద్రాకల్యాణము ఈ కవయిత్రి రమాపరిణయ రచనకు ప్రేరకమను విషయమిట స్మరింపదగియున్నది.

వెంగమాంబ రచనలలో నచ్చటచ్చట కొన్ని సీసపద్యములపై నన్నయ, మొల్ల మున్నగు ప్రాచీనుల శైలీప్రభావము కొట్టవచ్చినంత స్పష్టముగా గోచరించుచున్నది. వేంకటాచల మాహాత్మ్యమును సంస్కృత శ్లోకముతో ప్రారంభించుట నన్నయ కవితా ప్రభావమే. ఇట్లే ఈ మాహాత్మ్య కావ్యమందలి ఆశ్వాసాంత పద్యములపై తిక్కన భారతమందలి ఆశ్వాసాంతపద్యముల శైలీప్రభావము కన్పట్టు చుండుట పరికింపదగినది. వెంగమ ఆశ్వాసాంత పద్యములు తిక్కన పద్యములవోలె తాత్త్వికభావ ములతో ఉదాత్తముగా ధ్వనించుచున్నవి. ఇక ఈ కావ్యమందలి ఆశ్వా సాంత గద్యలు పోతన భాగవతమందలి స్కంధాంత గద్యలవలె 'కథాంశ సంగ్రహము'తో వెలసియున్నవి.

వెంగమ కవితను ప్రభావిత మొనర్చిన ఆంధ్రమహాకవులలో అగ్రేసరుడు పోతనామాత్యుడు. కవయిత్రి ద్విపద భాగవతావతారికలో

"ఆ నాడు పోతరా జాత్మయం దుండి - నానార్థసార నిర్ణయ వాక్యములను బలికించి నటువంటి పట్టాభిరాముఁ - డలర నా మీఁద నేఁడభిమాన ముంచి చెలువొప్ప నెవుడు నా జిహ్వాయం దుండి-పలికించినటులనేఁ బల్కి తత్కృతిని శ్రీతరిగొండ నృసింహుఁ డనంగ - ఖ్యాతిగా వెలయు వేంకటగిరీశ్వ రుని పదయుగళికి సమర్పణము చేసెదను."

అనెడి పల్కుల ద్వారా 'పలికించెడువాఁడు రామభద్రుం డట' అను పోతన విశ్వాసమునే పునరుద్ఘాటించినది. ద్విపద భాగవత రచనలో వెంగమాంబకు పోతన భాగవతమే యొరవడియైనదని అందలి ప్రత్యక్షరము సాక్ష్య మిచ్చుచున్నది.

భక్తకవయిత్రి గావున, కృష్ణకర్ణామృతము' వంటి సంస్కృత స్తోత్రముల ప్రభావము ఈమెలో క్వాచిత్కముగా కానిపించుచున్నది.

**తాళ్ళపాక కవుల ప్రభావము :**

వెంగమాంబ తరిగొండను వీడి తిరుమలను చేరుట ఆమె జీవితమున ప్రధానసంఘటనయైనట్లే, తిరుమల చేరిన కొంతకాలమునకు తాళ్లపాక వంశీయుల పొరుగును చేరుట ఆమె సారస్వత జీవితమున ప్రకృష్టమైన సన్నివేశము. ఇందువలన ఈ కవయిత్రికి తరతరములుగా శ్రీవేంకటేశ్వరుని సారస్వతారాధన మొనర్చుచున్న తాళ్లపాక వంశీయుల తోడను, వారి పూర్వులు రచించిన రచనలతోడను సన్నిహిత పరిచయ మేర్పడెను.

ఆ రచనలలో అన్నమాచార్యుని ధర్మపత్ని తిమ్మక్క రచించిన 'సుభద్రా కల్యాణము పాట' ఈమె కవితాహృదయము నాకర్షించి నట్లున్నది. తత్ప్రేరణ ఫలితముగా వెంగమాంబ అదే శైలిలో 'రమాపరిణ యము పెండ్లిపాట'ను రచించినది. తాళ్లపాక కవుల రచనల కనుకరణగా ఈ కవయిత్రి రచించిన మఱియొక కృతి శ్రీకృష్ణమంజరి. అన్నమయ్య,

ఆయన కుమారుడు పెదతిరుమలయ్య దివ్యశృంగార వస్తుసమన్విత ములగు మంజరీకృతులను సృజించియుండగా వెంగమ అదే ఛందస్సులో నిర్మల భక్తిరసభరితమగు శ్రీకృష్ణమంజరీ స్తుతిని వెలయించినది.

వెంగమాంబ పై రీతిని తాళ్లపాక కవుల రచనల బాహ్యస్వరూప మునే గాక, వారి ఆధ్యాత్మిక కీర్తనల ఛాయలను సైతము చక్కగా అనుక రించియున్నది.[7]

తాళ్లపాక వంశీయులలో తక్కిన కవుల నటుంచి ఆ'కవివంశము' నకు కూటస్థుడైన అన్నమాచార్యునకు, ఈ కవయిత్రికి స్ఫుటముగా గోచరించు సామ్యము లీ సందర్భమున పేర్కొనదగియున్నవి.

1) ఇరువురును వేంకటేశ్వరుని వరమున జన్మించియున్నట్లు జీవిత చరిత్రలు తెల్పుచున్నవి.[8]

2) ఇరువురకు భగవత్ప్రసాదముగా విద్యలు లభించినవి.[9]

3) అన్నమయ్యవలెనే వెంగమాంబయు పరిస్థితుల ప్రాతికూల్యమువలన నే స్వగ్రామమును వీడి తిరుమల చేరుకొనినది.

4) అన్నమయ్య రాచఱికపు నిరంకుశత్వమువలని ఒత్తిడికి లోను కాగా, వెంగమాంబ సాంఘికమగు నిరంకుశత్వమువలన ఇబ్బందులకు గుఱియైనది. ఇష్టదైవమందలి భక్తిప్రపత్తులే ఇర్వురకు ఏడుగడయై నిలిచినవి.

5) అన్నమాచార్యుడు, అహోబల నారసింహుడు మున్నగు దేవుళ్లకు వేంకటేశ్వరునితో ఏకత్వమును చాటినట్లే, వెంగమాంబ తరిగొండ నృసింహుని తిరుపతి వేంకటేశ్వరుని అభేదముగా భావించి భజించినది.

6) ఇరువురును జీవితమున సహస్ర చంద్రదర్శన మొనర్చి యుండిరి.

7) ఇరువురును జీవితమున అత్యధిక కాలము తిరుమలలో వసించు సారస్వతసృష్టిచే స్వామి నారాధించి, ఆ పుణ్యక్షేత్రముననే సిద్ధిపొందిరి.

8) భాగవత సంప్రదాయమునకు చెందిన భక్తశిఖామణులై, పరిపక్వస్థాయిని చేరిన సహజ స్వతంత్ర కవులై ఇరువురును ఒకే ప్రాంతమునకు చెందినవారై యుండుటవలన, వారి కృతులు ఆ ప్రాంతమున (పశ్చిమాంధ్రమున) చెల్లుబడియం దుండిన శిష్టవ్యవహారభాషా స్వరూపమును చక్కగా ప్రతిబింబించుచున్నవి.

9) అన్నమయ్య సంస్కృతమున వేంకటాద్రి మాహాత్మ్యమును రచింపగా వెంగమాంబ తెనుగున వేంకటాచల మాహాత్మ్యమును రచించినది. అటు సంస్కృతమునను, ఇటు తెలుగులోను, ఆ క్షేత్రమున నివసించుచు తన్మాహాత్మ్యమును వెలయించిన కీర్తి ఈ యిర్వురకే దక్కియుండుట ముఖ్యవిశేషము.

10) ఈ సామ్యము లన్నిటికి దోడు ఈ యిర్వురిలో ఒకరు (వెంగమాంబ) మఱియొకరిని (అన్నమయ్యను) పూర్వకవి స్తుతిలో సభక్తికముగా ప్రస్తుతించి యుండుట ప్రత్యేకించి పేర్కొనదగిన యంశము.

"ఆదికవీశ్వరుం డైన వాల్మీకికి
వ్యాసమౌనికిఁ గాళిదాసకవికి
నది గాక వరలబ్ధ మన్న మాచార్యున
కాంధ్రభాషా కవిత్వాఢ్యు లగుచుఁ
దనరు నన్నయకుఁ దిక్కన సోమయాజికిఁ
బోతరాజునకు సునీతు లయిన
కవులకుఁ బండితాగ్రణులకుఁ బౌరాణి
కులకు భక్తిని మ్రొక్కికొనుచు నేను"

- వేంకటాచల మాహాత్మ్యము, Iఆశ్వా;18ప.

పై పద్యమున అన్నమాచార్యుని నామధేయము సంస్కృతకవులకు, ఆంధ్రకవులకు మధ్య ఘటింపబడినది. 'వరలబ్ధము' అను విశేషణ మాయనకు చెప్పబడినది.ఈ విశేషణమునకు 'వరమువలన జన్మించిన వా'డని ఒక యర్థము. 'భగవంతుని వరమువలన పడసిన కవిత గలవా'డని ఇంకొక యర్థము. ఈ సందర్భము 'పూర్వకవిస్తుతి' గావున, కవయిత్రి రెండవ అర్థమునే ప్రధానముగా ఉద్దేశించి

ఆ విశేషణమును ప్రయోగించెనని సులభముగా ఊహింపవచ్చును. ఇట్లు పూర్వకవి స్తుతిలో తాళ్లపాక అన్నమాచార్యుని ప్రశంసించిన కవు లరుదు. లేరని చెప్పిన అతిశయోక్తి కాదు.

ఇన్ని విధముల పోలికలు గల ఈ యిరువురు భక్తకవులు ఒక విషయమున భిన్నులై యున్నారు. జన్మతః అద్వైతియైనను అన్నమాచార్యుడు శ్రీవైష్ణవ స్వీకార మొనర్చి, విశిష్టాద్వైత సిద్ధాంతము చూపిన పథమున వేంకటేశ్వర ప్రపత్తితో పరమపదముదెస పయనింపగా, వెంగమాంబ అద్వైత దర్శనమును పట్టువీడకయే శరణాగతి సిద్ధాంతముచే స్ఫూర్తినొంది, ఆ రెంటి సమన్వయమువలన ఏర్పడిన మధ్యేమార్గమున తన జీవితలక్ష్యము (మోక్షము) వైపునకు సాగి పోయినది. ఈ భేదమే ఈ యిరువురు మహనీయుల స్వతంత్ర వ్యక్తిత్వ లక్షణమును ప్రకటించుచున్నది.

11) అన్నమయ్య పురుషుడై నను నాయికా భావనతో స్వామి నారాధించి తరింపగా, వెంగమ తాను స్త్రీయై యున్నందున అంతకు మించిన ఉదాత్తనాయికా భావనతో స్వామిని సేవించి చరితార్థ యైనది. భర్తపేరు, ఇష్టదైవము పేరు ఒకటిగా నుండుట ఈ పవిత్ర ప్రణయ భావనకు ఇనుమిక్కిలిగా దోహదకారి యైనది.

శ్రీవేంకటేశ్వరుని నిత్యసేవలలో చివరిది 'ఏకాంతసేవ.' "తాళ్లపాక వారి లాలి(పాట),తరిగొండవారి హారతి"అను సూక్తిపై సేవ యాధారముగా నేర్పడినది. ఆ సూక్తిలో మొదటి భాగమునకు అన్నమయ్య కైంకర్యము కారణము కాగా, రెండవ భాగమునకు వెంగమాంబ కైంకర్యము హేతువుగా వెలసినది.

అన్నమయ్యకు దాదాపు పదితరముల పిమ్మట అంతటి భక్తి పారమ్యముతో తిరుమలపై సారస్వతసేవ గావించిన మహనీయమూర్తి వెంగమాంబ. తొలితెలుగు కవయిత్రియైన తాళ్లపాక తిమ్మక్క క్రీ. శ. 15వ శతాబ్దిలో ఏ కొండపై సుభద్రా కల్యాణ రచనచే తెలుగు కవయిత్రి

సారస్వతమునకు శ్రీకారము చుట్టెనో, ఆ కొండపైనే క్రీ. శ. 18వ శతాబ్ది యుత్తరార్ధమున తరిగొండ వెంగమాంబ తన వాసిష్ఠ రామాయణ రచన ద్వారా ఆ ప్రాచీన కవయిత్రుల తరమునకు భరత వాక్యము పాడినది. ఆంధ్ర వాఙ్మయ చారిత్రమునందలి అపూర్వ సన్నివేశములలో నిది యొక్కటి.

## అనంతర కవులపై ప్రభావము :

వెంగమాంబపై ప్రాచీన కవుల వాఙ్మయ ప్రభావము నెలకొని నటులే, ఆమె కవితాప్రభావము సమకాలీన, అనంతరకాలీన కవులపై బాగుగా ప్రసరించి ప్రతిఫలించినది.

ఆమె యక్షగానములు, అందులోను ముఖ్యముగా విష్ణుపారి జాతము, ద్విపద కావ్యములలో రాజయోగసారము, పద్యరచనలలో వేంకటాచల మాహాత్మ్యము తరువాతి రచయితలకు రచనా వస్తువును ప్రసాదింపజాలినవి. కూచిపూడి సిద్ధేంద్రయోగి భామాకాలపపు పోకడలను పుణికిపుచ్చుకొని ఆవిర్భవించిన విష్ణుపారిజాతము కాలక్రమమున ఆ 'కూచిపూడి రచనపై తన కవితా ప్రభావమును ప్రసరింప జేయగల్గుట అపూర్వమైన విషయము.[10]

ఇక రాజయోగసారము వచనముగను, యక్షగానముగను, అవతరించి వెంగమ కవితాప్రభావమును చాటినది.[11]

వెంగమ సారస్వత ప్రభావమును ప్రసరింపజేసిన కృతులలో కిరీట సదృశము వేంకటాచల మాహాత్మ్యము. ఈ కావ్యము మఱికొందరు కవుల పద్యానువాదములకు, యక్షగానములకు, నాటకములకు, విపుల, సంగ్రహవచన రచనలకు ఆధారమై, ఆంధ్ర దేశమున వేంకటాచలక్షేత్ర మహిమను బహుముఖముగా ప్రచార మొనరించినది.[12]

మొత్తముపై వెంగమాంబ సారస్వతము గత శతాబ్ది ఉత్తరార్ధము నుండి ఈ శతాబ్ది పూర్వార్ధమువరకు బాగుగా ప్రచారమునొందింది,

ప్రభావమును నెఱపినది. నేటికిని ఆమెకృతుల యుత్కృష్టతను తెనుగువారు విస్మరింపకుండుటలో ఆ ప్రభావమే ఆదికారణమై వెలసినది.

## ఆంధ్ర సారస్వతము - వెంగమాంబ :

సారస్వతము కవుల రచనల సమాహార స్వరూపము. అందులో ఒకానొక కవయిత్రియొక్కగాని, కవియొక్కగాని స్థానమును అంచనావేయు ప్రయత్నములో వారు రచించిన కృతులు ప్రాధాన్యము వహించును. ఆ రచనల వలన సారస్వతమునకు కలిగిన పుష్టి, తరువాతి కవులపై తత్ప్రభావము, మున్నగు అంశముల మూలమున సాధారణముగా ఆ రచయిత స్థానము నిరూపిత మగుచుండును.

క్రీ.శ.18వ శతాబ్ది ద్వితీయపాదమున జన్మించి 19వ శతాబ్ది ప్రథమ పాదమువరకు మనుగడ సాగించిన తరిగొండ వెంగమాంబకు ఆంధ్రవాఙ్మయమున గల స్థానము ప్రకృతము పరిశీలింపదగియున్నది.

ముద్దుపళని (క్రీ. శ. 18వ శతాబ్ది పూర్వార్థము) వంటి కవయిత్రుల రచనలవలన నీతి విలువలను కోల్పోయిన తెలుగు కవయిత్రీ సారస్వతము వెంగమాంబ కృతులచే సమున్నతస్థితికి గొనితేబడినది. వెంగమ కృతులు సంఖ్యాధిక్యమునుబట్టియే గాక, గుణ ప్రాచుర్యమునుబట్టియు ఆ కాలమున ఆ యా వాఙ్మయ ప్రక్రియల యందు వెలవడిన రచనలలో అగ్రగణ్యములై వెలసినవి.

ఆంధ్రవాఙ్మయమున ఆదినుండియు పారంపర్యముగా వచ్చు చున్న విభాగములలో 'దేశి,మార్గ' విభాగము ముఖ్యమైనది. కవయిత్రులలో తాళ్ళపాక తిమ్మక్కవంటివారు కేవలము 'దేశి' రచనలనే వెలయింపగా మొల్లవంటి మఱికొందరు 'మార్గ' పద్ధతిలో కృతులను సంతరించిరి. వెంగమ ఈ యుభయ మార్గములలో మనోజ్ఞ కృతులను నెలకొల్పినది. కవయిత్రులలోనేగాక, కవులలోను ఇంతటి వైవిధ్యము గల సారస్వతమును సృజించినవా రరుదు.

ఈ కవయిత్రి రచించిన రాజయోగసారాది వేదాంత కృతుల వలన తెనుగులోని తాత్త్విక వాఙ్మయమునకు వలసినంత పుష్టి చేకూరినది. వెంగమ ఇతివృత్తముతోడి తాదాత్మ్యములో పోతనను ఛందో, భాషా వైవిధ్యములో తాళ్ళపాక కవులను, ప్రక్రియా వైవిధ్యమున దక్షిణాంధ్ర కవులను సరిపోలుచున్నది. వస్తువును ఆధ్యాత్మికముగా స్పందింప జేయుటలోను, జీవద్భాషయందలి వైచిత్రిని సొంపుగా ప్రదర్శించుటలోను భక్తిసురభిళముగా వెల్లివిరియజేయుటయందును ఈమె కీమెయే సాటి. ఈ కవయిత్రి రచనలలో సగబాలు యక్షగానములు. ఈ దేశీయ రూపక ప్రక్రియ సర్వతో ముఖముగా పరిణతి నొందిన ఆ కాలమున ఈమె కృతులు ఆ శాఖలో కనిష్ఠికాధిష్ఠితములై వరలినవి.

ఈ కవయిత్రి రచన లన్నియు నొక యెత్తు. వేంకటాచల మాహాత్మ్య మొక్కటి ఒకయెత్తు. వ్యాసభారతము నెందరాంధ్రీకరించినను కవిత్రయ భారతమునకు గల ప్రశస్తి నధిగమింపజాలనట్లు, భాగవతానువాదమున పోతన కీర్తిని మించలేనట్లు వేంకటాచలమాహాత్మ్యాంధ్రీకరణముచే తరిగొండ వెంగమాంబ ప్రఖ్యాతిని త్రోసిరాజన లేరనుట తథ్యము. ఈ మాహాత్మ్య కావ్యము వెంగమ సారస్వతతరు పరిపక్వ ఫలము. వెంగమ ఈ కావ్యారంభమున

"....    ....    ....    ...శ్రీ వేంకటాద్రి మహిమ
మవనిపై రమ్య పద్యకావ్యం బొనర్చి
శ్రీనివాసునకే సమర్పింప నుంటి
నీఁగ తోయధి దాటఁబోయిన విధమున
నా స్వతంత్రత కిల బుధుల్ నవ్వి పోరె?"

- వేంకటాచల మాహాత్మ్యము, Iఆశ్వా:22 ప.

అని తన స్వాభావిక వినయ ముట్టిపడునటుల పల్కినది. పై పద్యము "తితీర్షుః దుస్తరం మోహా దుడుపే నాస్మి సాగరమ్", "మందః కవియశః ప్రార్థీ గమిష్యా మ్యపహాస్యతామ్" (రఘువంశః,Iసర్గ, 2,3శ్లో.) అను కాళిదాస మహాకవి పల్కుల భావమును ప్రతిధ్వనించుచున్నది. ఇట్లు 'కవికుల గురుని' వాక్యములతో అప్రయత్న సిద్ధ మగు సామ్యము జతపడియుండుట ఈ కవయిత్రి మహానుభావతకు నిదర్శనము.

"ఆంధ్ర గీర్వాణ మహాకృతు లుండఁగా
నిప్పు డీ కృతి విన నేల యనక
భక్ష్యములు మెక్కి యావలఁ బచ్చడియను
నంజుకొనిన విధంబున నా ప్రబంధ
మాలకింతు రటంచుఁ బేరాసచేత
నేను రచియింతు దీని మన్నించి గనుఁడు."

-వేంకటాచల మాహాత్మ్యము,Iఆశ్వా, 19 ప.

తనకు పూర్వము వెలసిన ఆంధ్ర, గీర్వాణభాషా కావ్యములు భక్ష్యములవంటివి. తన కావ్యము పచ్చడి వంటిది. భక్ష్యములను భుజించిన రీతిగా నెవ్వరును పచ్చడిని మెసవరు. ఐనను భక్ష్యములను బాగుగా భుజించ బాగుగా భుజించుటచే మొగము మొత్తినపుడు 'రుచిమార్పు' కొరకు పచ్చడిని ఆసక్తితో నంజుకొనుట, ఆ రుచిభేదము నాస్వాదించుట లోకసహజమైనదే. ఆ రీతిని రుచిభేదము (నవ్యత) కొరకైనను తన ప్రబంధము నాలకింప వలసినదిగా కవయిత్రి పై పద్యమున పండితులను సవినయముగా అర్థించినది. ఈ అభ్యర్థనలో వెంగమాంబయొక్క సాహిత్య రసజ్ఞతాచాతురి ధ్వనించుచున్నది.

పేరు ప్రతిష్ఠలకొరకు గాక, మోక్షవిభవము నాశించియే కవితా వ్యవసాయమును చేవట్టిన వెంగమ సృజించిన సాహిత్యము

ఔచిత్యములోను, భావమార్దవమునందును, భక్తి, శృంగారాది రసపోషణము నందును ప్రాచీన మహాకవులకు తీసిపోవనిదిగా ప్రకాశించుచున్నది.

సారస్వతసిద్ధి క్షేత్రమగు తిరుమలలో తాళ్లపాక కవుల అనంతరము కృతులను వెలయించిన కీర్తిమూర్తి వెంగమ. తాళ్లపాక వారు వేంకటేశ్వరుని సన్నిధిని సంకీర్తనాచార్య పదవి నధిష్ఠించి, ఆస్థానకవులై అలరగా, వెంగమాంబ ఆ'బంగారు వాకిలి'కి అల్లంత దూరమున నుండియే 'ఆనందనిలయుని' ఈవలకు రప్పించి తన వాఙ్మయమున ప్రతిష్ఠించినది.

పూవుపుట్టగనే పరిమళించు నన్నట్లు వెంగమ కృతులు ఆవిర్భవించిన అనతికాలముననే ఆంధ్రదేశ మెల్లయెడల వ్రాతప్రతుల రూపమున వ్యాప్తినందినవి. రాను రాను వాటిలో కొన్నింటి ప్రతులు మృగ్యములై పోయినవి. ద్విపద భాగవతమువంటి బృహద్గ్రంథములు ప్రాచీనతమస్థితివలన కొన్ని స్కంధములు ఖిలమై పోగా అసమగ్ర రూపములుగా నిలిచియున్నవి. మఱి కొన్ని గ్రంథములు గత శతాబ్ది ఉత్తరార్ధమున, ఈ శతాబ్ది తొలి వత్సరములలోను అచ్చుపడినను, ఆ గుజిలీ ప్రతులు అచ్చుతప్పులకు ఆకరములై యుండి - అవియు ఏ పురాతన గ్రంథాలయముననో తప్ప - సాధారణముగా అరుదైపోయినవి. ఈ విధముగా ఈ కవయిత్రి సారస్వతముయొక్క వ్యాప్తి, ప్రచారములకు అనువగు పరిస్థితులు పూర్తిగా ఏర్పడక పోయినను, ఈ'సకల తత్త్వార్థ వివేకిని' యొక్క సారస్వత మూర్తిమత్త్వము వాఙ్మయ జగత్తున సుస్పష్ట రేఖలతో భాసిల్లుచుండుట యొక విశేషము! ఒక్కమాటలో, తెనుగున కవులలో పోతన కెట్టి విశిష్టస్థానమున్నదో, అట్టి విశిష్టస్థానమే కవయిత్రులలో వెంగమాంబకు కలదు.

# మూర్తిమత్త్వము - జ్ఞాపికలు

1 i) "వారక మా నందవరకులం బిలను
సారంబుగాఁ బ్రోచు చౌడాంబఁ దలఁచి."
-ద్విపద భాగవతారంభము.

ii) "అల కాశినుండి వెలువడి
వలనుగ మా కొఱకు నందవరపురమునఁ దా
నెలకొని కులదేవతయై
యలరుచు మ మ్మేలు చౌడమాంబను గొలుతున్."
-వేంకటాచల మాహాత్మ్యము, I ఆశ్వా, 8

ప.

2 i) "నందాపురీవంశ నాయకోత్తముఁడు
అనఘుఁడు తాళ్లపాకాన్నయార్యుండు." -శృంగారమంజరి.

ii) ".... నంద, వర వరముఖ్యుఁడై భరద్వాజ సంతాన
తానకుం డన నెన్నఁదగు తాళ్లపాక
పాకశాసనుఁడు వైభవముల నొనరు
నరులలోఁ బూజ్యుఁ డన్నయవర్యతనయ
నయశాలి తిమ్మయ్య నవచతురతల." -చక్రవాళమంజరి.

చూ. తాళ్లపాక కవుల లఘుకృతులు, 14, 20 పుటలు.

iii) "నందవరాన్వయార్ణవ సుధాకరుఁడు."
- అన్నమాచార్య చరిత్రము, పుట4.

3 చూ. వివేక చూడామణి, 32 శ్లో.

4 చూ. I ఆశ్వా; 17 ప.

5 చూ. ఇదే గ్రంథము, పుటలు 95, 96.

6 చూ. ఇదే గ్రంథము, పుటలు 183, 184.

7 చూ. ఇదే గ్రంథము, పుట 108.

8 i) "వరదుఁడై వేంకటేశ్వరుఁడు తాఁబూను-బిరుదు గజ్జియల ముప్పిడి

కఠారంబు

కలలోన నొసఁగ నక్కజ మంది తపము-ఫలియించె ననుచు
దంపతు లేఁగి రంత."

-అన్నమాచార్య చరిత్రము, పుట 9.

ii)వెంగమాంబ వేంకటేశ్వరుని వరమువలన జన్మించిన దనుటకు ఆమెజీవితముపై వెలువడిన రచనలును, జనవాడుకయు సాక్ష్యములు. ఈ కవయిత్రి నామధేయము సైత మీ విషయమును బలపఱచుచున్నది.

9 i)"అన్నమాచార్యున కహినాయకాద్రి-వెన్నుని వరముచే విద్యలన్నియును
నమితంబులగుచు జిహ్వారంగసీమ - తము దామె సొచ్చి నర్తనమాడఁ
దొడఁగె."

- అన్నమాచార్య చరిత్రము. 11 పుట.

ii) "అక్షీణాక్షర పంక్తిరీతి మును మధ్యాహ్నంబునన్ నాకుఁ బ్రత్యక్షంబై"

"అలఘునభంబునుండి విమలక్షర పంక్తుల రీతి వచ్చి నే
వలసత నొందియున్న తఱి నాననమందు వసించి జ్ఞానముం
గలుగఁగఁ జేసి" -వేంకటాచల మాహాత్మ్యము.Iఆశ్వా: 3. 4ప.

10 చూ. ఇదే గ్రంథము, పుట 150.

11 చూ. ఇదే గ్రంథము, పుట 191.

12 చూ. ఇదే గ్రంథము, పుట 318.

# సింహావలోకనము

ఇంతవరకు సమీక్షింపబడిన వెంగమాంబ సారస్వతము ఇంచుమించు అఱువదేండ్ల కాలపరిమితిలో విస్తరిల్లినట్టిది. రాశిలోను, వాసిలోను మేలెన్నిక గన్న ఈ సారస్వతమునకు తరిగొండ, తిరుమల కొండ - అను రెండును జనుస్థానములు.

ఇంతటి వాఙ్మయమునకు స్రష్ట యగు వెంగమాంబ జీవిత సంగ్రహము ఈ సవిమర్శక పరిశీలనమున ప్రథమ ప్రకరణము. ఈ ప్రకరణమున పుక్కిటి పురాణములుగా వెలువడిన వెంగమ జీవిత చరిత్రములయందలి అంశములను కృతుల యాధారమున సహేతుకముగా సమన్వయించి ఈ క్షయిత్రి జీవితగాథను సత్యసమ్మత ముగా పునర్నిర్మించుట జరిగినది.

రెండవ ప్రకరణమున వెంగమాంబ జీవితకాలము చారిత్రక, సారస్వతాద్యాధారముల సహాయమున సప్రమాణముగా నిర్ణయింప బడినది. క్రీ. శ. 1730-`35 సంవత్సరముల నడిమి కాలమున జన్మించి, ఈ సారస్వతమూర్తి సహస్ర చంద్ర దర్శన మొనరించి, క్రీ. శ. 1817 ఈశ్వర వత్సరమున కైవల్యము నొందిన దను ఇందలి నిర్ణయము, నేటివరకు ఈ కవయిత్రి కాలమునుగూర్చి ఆంధ్రవాఙ్మయ ప్రపంచమున అవగాహనలో నున్న అపోహను నివారించుచున్నది.

మూడవ ప్రకరణమున వెంగమాంబ రచన లన్నియు లభ్యములు, అలభ్యములు, ముద్రితములు, అముద్రితములు - ఇత్యాదిగా వర్గీకరింపబడినవి. మఱియు ప్రక్రియ, ఛందస్సు, వస్తువు - మున్నగు అంశముల ఆలంబనమున పలు తెరగులుగ వింగడించుటవలన

ఈ వాఙ్మయముయొక్క విస్తృతిని, వైవిధ్యమును సుస్పష్టరేఖలతో సందర్శింప వీలు కలిగినది.

నాలుగవ ప్రకరణము మొదలుకొని ఎనిమిదవ ప్రకరణము వరకు (1) శతకములు, (2) యక్షగానములు, (3) ద్విపద కృతులు, (4)పద్యరచనలు, (5) తత్త్వకీర్తనలు -అను శీర్షికల క్రింద క్రమముగా వేర్వేరు ప్రకరణములయందు పరిశీలింపబడినవి. ఒక్కొక్క ప్రకరణమున ఆ యా కృతుల సవిమర్శక పరిశీలనము గావించిన పిమ్మట వాటి విశిష్ట లక్షణములు, ఆ వాఙ్మయశాఖలో వాటికి గల ప్రాముఖ్యము పరిగణింపబడి యున్నది.

తొమ్మిదవ ప్రకరణమున వెంగమాంబయొక్క రచనలలో ప్రయుక్తమైన భాషాస్వరూపము, అందలి విశేషములు పద, సమాస, క్రియా, సంధి-ఇత్యాది క్రమమున సోదాహరణముగా, స్థాలీపులాకముగా పరామర్శింపబడినవి. ఈ పరామర్శనమువలన, వెంగమాంబ తాను ప్రయోగించు భాషావిషయమై స్పష్టమగు అవగాహన గల్గియున్న మహాకవయిత్రి యను విషయము వెల్లడియైనది.

పదవ ప్రకరణమున వెంగమాంబయొక్క సారస్వత మూర్తి మత్త్వము (Literary Personality),స్వభావము, వైదుష్యము జీవితదృక్పథము,భక్తి, మతము - వేదాంతము, ప్రాచీన కవి ప్రభావము, తాళ్లపాక కవుల ప్రభావము, అనంతర కవులపై ప్రభావము, ఆంధ్రసారస్వతము - వెంగమాంబ - ఇత్యా ద్యంశములుగా సమీక్షింప బడినది. ఇట్లు వివిధకోణములలో సమీక్షింపబడిన ఈ కవయిత్రి యొక్క సమగ్ర సారస్వతమూర్తిమత్త్వా గాహన వలన ఆంధ్రవాఙ్మయమున ఈమెకు గల స్థానమును సహేతుకముగా నిర్ధారించు వీలు కలిగినది.

ఈ సందర్భమున ఈ కవయిత్రి సాహిత్యమందలి మఱికొన్ని ముఖ్యవిశేషములు సింహావలోకనదృక్పథమున ఉట్టంకింపబడుచున్నవి.

1. ప్రతి రచనను శ్రీకారముతో ప్రారంభించియుండుట.

2. కృతిని - కథాంశమును కల్పించియైనను - పొడిగించియైనను - మంగళాంతము గావించుట.

3. కృతులలో ఎడనెడ ఇష్టదైవమును సందర్భోచితముగా స్మరించుట. అనేకకృతులలో ఇష్టదైవమునకు, కథానాయకునకు, కృతిపతికి అభేదమును భజించుట.

4. ప్రతిరచనయు ఆద్యంతములలో నిసర్గమైన ఒకానొక నిరాడంబరతను సంతరించుకొని యుండుట.

5. ఛందస్సులో ద్విపద, ప్రక్రియలో యక్షగానము, కృతిసందేశమున వేదాంతము అగ్రేసరములై అలరుచుండుట.

6. భాషలో కొంత లక్షణ వైరుధ్యము కన్పట్టినను, అనర్గళశైలి ఆహ్లాదకారియగు అర్థావగతి 'ఎం దెందు వెదకి చూచిన అందందే కల' వన్నట్లు అంతట వ్యాపించి యుండుట.

తరిగొండ వెంగమాంబ సారస్వతమునకు గురు శేషగిరివాసుని కోమలదరహాసమే స్ఫూర్తి కేంద్రము. ఆ వెన్నెల వెలుగులు ఆమె సారస్వతమున అక్షరాకృతి నొంది ప్రకాశించుచున్నవి.

ఆమె "దారునిర్మితవీణ". ఆ వీణను "ఆరూఢిఁ బల్కించు గాయక పురుషుడు" వేంకటేశ్వరుడు. ఆ పురుషోత్తముడు దయాపూర్ణుడై పలికించిన వీణానాదమే ఈ సువిశాలసారస్వతము.[1]

## సింహావలోకనము - జ్ఞాపిక

"దారునిర్మితవీణ నారూఢిఁ బలికించు
గాయకపురుషునికరణిగాను
పురుషోత్తముఁడు దయాపూర్ణుఁడై నా జిహ్వ
యందుఁ దా వసియించి యరుదుగాను
బలికించు గావున .... .... .... ..."

-వేంకటాచల మాహాత్మ్యము, I ఆశ్వా; 22ప

## ఉపకరించిన

# గ్రంథములు - వ్యాసములు

అచలబోధలు - కపిల వెంకటరావు, ఆంధ్రపత్రిక, సర్వజిత్తు ఉగాది సంచిక, వాల్యూమ్-38 (1947 - '48), పుటలు 72 - 79.

అధ్యాత్మసంకీర్తనలు (XIవ సంపుటము) - అన్నమాచార్యవిరచితములు

పరి: రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, తి.తి.దే. ప్రచురణ (1955)

అన్నమాచార్యచరిత్రము - తాళ్ళపాక చిన్నన్న, పరి : గౌరిపెద్ది రామసుబ్బ శర్మ, తృ.ము. (1978), తి.తి.దే. ప్రచురణ.

అప్పకవీయము - అప్పకవి, పరి : రావూరి దొరస్వామిశర్మ, వావిళ్ల; చెన్నపురి (1962).

అబలా సచ్చరిత్రత్నమాల - భండారు అచ్చమాంబ, రెండవ కూర్పు, శ్రీచింతామణీ ముద్రాక్షరశాల, చెన్నపురి (1903).

ఆంధ్రకవయిత్రులు - ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ, ప్ర.ము.(1953), బాపట్ల.

ఆంధ్రకవితరంగిణి (9 వ సంపుటము) - చాగంటి శేషయ్య, ప్ర.ము. (1952),కపిలేశ్వరపురము.

ఆంధ్రకవితరంగిణి (10వ సంపుటము) - చాగంటి శేషయ్య, ప్ర.ము. (1953), కపిలేశ్వరపురము.

ఆంధ్రకవిసప్తశతి - బులుసు వేంకటరమణయ్య, మదరాసు (1956).

ఆంధ్రకవుల చరిత్రము - కందుకూరి వీరేశలింగం పంతులు. శ్రీ చింతామణీముద్రాక్షరశాల, రాజమహేంద్రవరము (1911).

ఆంధ్రక్రియాస్వరూపమణిదీపిక - ఆం.ప్ర.సాహిత్యఅకాడమీ,హైదరాబాదు (1962).

ఆంధ్రజానపదగేయవాఙ్మయచరిత్ర - స్త్రీలపాటలు - టేకుమళ్ళ కామేశ్వరరావు

ఆంధ్రమహాభారతము (ఆదిపర్వము)- నన్నయభట్టు, వావిళ్ల; చెన్నపురి (1929).

ఆంధ్రమహాభారతము (ఉద్యోగపర్వము) - తిక్కన సోమయాజి, రామా అండ్కో; ఏలూరు(1946).

ఆంధ్రమహాభారతము (శాంతిపర్వము) - తిక్కన సోమయాజి, వావిళ్ల; చెన్నపురి (1955).

ఆంధ్రయక్షగానవాఙ్మయచరిత్ర - యస్వీ జోగారావు, ఆంధ్ర విశ్వకళాపరిషత్ప్రకాశితము, వాల్తేరు (1961).

ఆంధ్రవాగ్గేయకారచరిత్రము - బాలాంత్రపు రజనీకాంతరావు, ద్వి.ము. (1975).

ఆంధ్రసంస్థానములు-సాహిత్యపోషణము - తూమాటి దోణప్ప, ప్ర.ము.(1969), ఆంధ్రవిశ్వకళాపరిషత్తు,వాల్తేరు.

ఆత్మబోధామృతతత్త్వములు - సి.వి.కృష్ణా బుక్డిపో; మదరాసు (1963).

ఉదాహరణవాఙ్మయ చరిత్ర - నిడుదవోలు వేంకటరావు, ప్ర,ము.(1950).

కాలజ్ఞాన తత్త్వములు - (సంకలనము) పరిమి వీరాచార్యులు, సి.వి.కృష్ణా బుక్డిపో; మదరాసు (1963).

కావ్యాలంకారసంగ్రహము - రామరాజభూషణుడు, వివరణ : సన్నిధానము సూర్యనారాయణశాస్త్రి, ఐదవ ముద్రణ (1976).

కృష్ణార్జునసంవాదము - నాదెండ్ల గోపన, నం.7410 (సి).తా.ప్ర; యస్.వి.యు.ఓ.రీ.ఇ.లై;తిరుపతి.

కైంకర్యపట్టి - సాధు సుబ్రమణ్యశాస్త్రి వ్రాతప్రతి.

గ్రంథవిమర్శలు (విష్ణుపారిజాతము) - ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, భారతి, డిసెంబరు 1965, పుటలు 75-76.

చమత్కారమంజరి (1,2 భాగములు)-చిలకమర్తి లక్ష్మీనరసింహము పంతులు (1964).

ఛందోదర్పణము - అనంతామాత్యుడు, వావిళ్ల; చెన్నపురి (1921)

జానపదగేయవాఙ్మయపరిచయము - హరి ఆదిశేషువు, ద్వి.ము. (1967).

తరిగొండ వెంకమాంబ జీవితరత్నాకరము - రామిసెట్టి జంగమయ్య, పిల్లగోవుల వారిపల్లె, వాయల్‌పాడు(తాలూకా).

తరిగొండ వేంగమాంబా విజయము - శ్రీమాన్ కళత్తూరు విక్రాల రామచంద్రా చార్యులు, ప్రభాతముద్రణాలయము, నెల్లూరు (1932?)

తాళ్ళపాక కవుల లఘుకృతులు - (సంపా.) వి. విజయరాఘవాచార్య & జి. ఆది నారాయణనాయుడు, తి.తి.దే. ప్రచురణ, మదరాసు (1935).

తాళ్ళపాక సంకీర్తనలు - తాళ్లపాక అన్నమాచార్యులు వగైరా, నం. 6609 (ఎ)కా.ప్ర; యస్.వి.యు,ఓ,రీ.ఇ.లై; తిరుపతి.

దాశరథిశతకము - కంచెర్ల గోపన్న, శతకమంజరి (భక్తిసంపుటము), (సంపా.) కాశీనాథుని నాగేశ్వరరావు, చెన్నపురి (1926).

పరతత్త్వరసాయనము - ఈశ్వరఫణిభట్టు, మదరాసు విశ్వవిద్యాలయ ప్రచురణ (1941).

పారిజాతాపహరణము - నంది తిమ్మన, వావిళ్ల; మదరాసు (1970).

పోతన - నిడుదవోలు వేంకటరావు, నేషనల్ బుక్‌ట్రస్టు ప్రచురణ (1962).

ప్రాక్పశ్చిమపవిత్రాంగనలు - (అను.) స్వామి శివశంకరశాస్త్రి, నేషనల్ బుక్‌ట్రస్టు ప్రచురణ (1969).

ప్రౌఢవ్యాకరణము - బహుజనపల్లి సీతారామాచార్యులు.

బాలవ్యాకరణము - పరవస్తు చిన్నయసూరి.

బ్రౌణ్య తెలుగు - ఇంగ్లీషు నిఘంటువు - సి. పి. బ్రౌన్, ఆం.ప్ర. సాహిత్య

(1915) గ్రీవ్స్, కుక్ సన్ అండ్‌కో, స్కాటిష్ ముద్రణాలయము, మద్రాసు.

శ్రీ తరిగొండ వేంకమాంబ చరిత్రము2 - పి.టి. జగన్నాథరావు,ప్ర.ము. (1960), త్రిలింగగ్రంథమాల, తిరుపతి.

శ్రీనివాసవిలాససేవధి - శ్రేష్ఠలూరి వేంకటార్యుడు (సంపా.) కోరాడ రామకృష్ణయ్య; శ్రీవేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనాలయ ప్రచురణము, తిరుపతి(1954).

శ్రీ భక్తవిజయము - కలవటాల జయరామారావు, సి.వి. కృష్ణా బుక్ డిపో, మదరాసు. శ్రీ భగవద్గీత (తొలితెలుగు భావానువాదం) - తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు,పరి; జి.యన్. రెడ్డి, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్యపరిశోధనాలయ ప్రచురణ, ప్ర.ము. (1978).

శ్రీ మదాంధ్ర భాగవతము - బమ్మెర పోతన, వావిళ్ల; చెన్నపురి (1915).

శ్రీ మలయళస్వామి చరిత్రము - నారు నాగనార్య, నాగవరము, ప్ర.ము. (1971).

శ్రీ మలయాళస్వామి జీవితచరిత్ర - సముద్రాల లక్ష్మణయ్య, ప్ర.ము. (1976),శ్రీ వ్యాసాశ్రమ స్వర్ణోత్సవసమితి (ఏర్పేడు).

శ్రీ మహాభక్త విజయము - శ్రీ పాద సుబ్రహ్మణ్యశాస్త్రి, వావిళ్ల;(1966).

శ్రీ వీరేశలింగయుగము - కల్లూరు వేంకటనారాయణరావు, ప్ర.ము. (1965), అనంతపురము.

శ్రీ వేంకటాచలమాహాత్మ్యము - దామెర చినవెంకటరాయకవి, ఆర్.నం. 544, కా.ప్ర.యస్.వి.యు.ఓ.రి.ఇ.లై; తిరుపతి.

శ్రీ వేంకటాచలమాహాత్మ్యము - శిష్టు కృష్ణమూర్తి, పరి: దంపూరి వేంకటసుబ్బా శాస్త్రులు, భువనగిరి రంగయ్యశెట్టిగారి జ్ఞానసూర్యోదయ

ముద్రాక్షరశాల,చెన్నపట్టణము (1858).

శ్రీ వేంకటేశ్వర భక్తవిజయము (మొదటిభాగము) - శ్రీ వేంకటేశ్వర బుక్‌డిపో, తిరుమల(1963).

శ్రీ వేంకటేశ్వర లఘుకృతులు - (సమకూర్పు) వేటూరి ప్రభాకరశాస్త్రి, ద్వి.ము.(1967) తి.తి.దే. ప్రచురణ.

శ్రీ వేంకటేశ్వర విజయము - బులుసు వేంకటేశ్వరులు, కాకినాడ (1973).

శ్రీ వ్యాసాశ్రమ రజతోత్సవ సంచిక - ఏర్పేడు శ్రీ వ్యాసాశ్రమ ప్రచురణ (1950).

సమగ్రఆంధ్రసాహిత్యం (8వ సంపుటము) - ఆరుద్ర. ప్ర.ము. (1965),యం.శేషాచలం అండ్‌కో; సికిందరాబాదు.

సారంగపాణిపదములు - సారంగపాణి, (సంపా) పురిపండా అప్పలస్వామి, సరస్వతీ పవర్ ప్రెస్, రాజమహేంద్రవరము.(1963)

సీతారామాంజనేయ సంవాదము - పరశురామపంతుల లింగమూర్తి, వావిళ్ల; చెన్నపురి (1925).

సుజ్ఞానరత్నావళి - (కూర్పరి) పోకల శేషాచలనాయుడు, పదవ కూర్పు (1961), యన్.వి. గోపాల్ అండ్ కో, మదరాసు.

సుభద్రాకల్యాణము - తాళ్ళపాక తిమ్మక్క, పరి: వేటూరి ప్రభాకరశాస్త్రి, ద్వి,ము. (1956), తి.తి.దే. ప్రచురణ.

సూర్యరాయాంధ్రనిఘంటువు (8 సంపుటము) - ఆంధ్రసాహిత్యపరిషత్తు, కాకినాడ.

హరివంశము - ఎఱ్ఱాప్రెగ్గడ, పరి: వేలూరి శివరామశాస్త్రి, వావిళ్ల; చెన్నపురి (1967).

అకాడమీ, హైదరాబాదు (1966).

బ్రౌను వ్రాతప్రతి ( September 1839) - బంగ్లోరె, ఇండియా ఆఫీను లైబ్రరీ (లండను) నుండి సేకరించినది.

భాగవతము (ద్విపద) - టేకుమళ్ళ రంగశాయి, ఆర్. నం. 697, కా.ప్ర;యస్.వి. యు.ఓ.రీ.ఇ.లై; తిరుపతి.

భామాకలాపము - సిద్ధేంద్రయోగి (మఱింగంటి శేషాచార్యులవారి వ్రాతప్రతి).

భామాకలాపము - సిద్ధేంద్రయోగి, ఆం.ప్ర. సంగీతనాటక అకాడమీ ప్రచురణము.

మ.ఓ.మే.లై;డి.కే. వాల్యూమ్ I (ప్రబంధములు) - మదరాసు (1915).

మ.ఓ.మే.లై;డి.కే. వాల్యమ్ IV (ద్విపదకావ్యములు) - మదరాసు (1936).

మ.ఓ మే.; లై.డి.కే. వాల్యూమ్ (మెకంజీ లోకల్ ట్రాక్ట్స్) - మదరాసు (1958). మ.ఓ.మే.లై; ట్రై.కే.వాల్యూమ్IVపార్ట్-3-మదరాసు (1934).

మన్నారుదాస విలాసనాటకము - పసపులేటి రంగాజమ్మ, ఆంధ్రసాహిత్య పరిషత్తు. కాకినాడ (1926).

మహాభక్త విజయము - ధూళిపాళ శ్రీరామమూర్తి, ప్ర.ము. (1968, కాళహస్తి తమ్మారావు అండ్ సన్స్, రాజమహేంద్రవరము.

మీరాబాయి - తరిగొండ వేంకమాంబ - వడ్డాది సీతారామంజనేయకవి, భారతి, సంపుటము 15, సంచిక 6 (1938జూన్), పుటలు 577 -583.

లక్ష్మణరాయ వ్యాసావళి (ప్రథమసంపుటము) - కొమఱ్ఱాజు వేంకటలక్ష్మణరావు, ద్వి.ము (1965), ఆదర్శగ్రంథమండలి, విజయవాడ

లవణరాజుకల - గురజాడ అప్పారావు, చూ. ముత్యాలసరాలు,తృ.ము

(1958), పుటలు21-30, విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ

వాసిష్ఠరామాయణము - మడికి సింగన, పరి; వేదం వేంకటరాయశాస్త్రులు, ద్వి.ము.(1935), వేదం వేంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్, మదరాసు.

విరాటపర్వనాటకము - యమ్మనూరి వేంకటసుబ్బకవి, ఆనందభారతీ ముద్రాక్షరశాల, యన్.వి గోపాల్ అండ్ కో; చెన్నపురి (1941).

విష్ణుపురాణము - వెన్నెలకంటి సూరన, వావిళ్ల; చెన్నపురి (1955).

వేంకటేశ్వరనాటకము - తాడిపర్తి లక్ష్మణరాయడు, ఆదికళానిధి ముద్రాక్షరశాల, చెన్నపట్టణము (1882)

శతకకవుల చరిత్రము - వంగూరి సుబ్బారావు, ప్ర.ము.(1924).

శతకసంపుటము (ప్రథమభాగము) - (సంపా.) నిడుదవోలు వేంకటరావు, ప్ర.ము. (1966), ఆం.ప్ర. సాహిత్య అకాడమీ, హైదరాబాదు.

శబ్దరత్నాకరము - బ సీతారామాచార్యులు, దేశభాషాగ్రంథకరణసభ, చెన్నపట్టణము (1969).

శృంగారసంకీర్తనలు, సంపుటము 22 - అన్నమాచార్య విరచితములు, పరి; రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, గౌరిపెద్ది రామసుబ్బశర్మ.ప్ర.ము. (1975, తి.తి.దే ప్రచురణ.)

శేషధర్మములు - కానాల నరసింహకవి, నం 7604 ఎ.తా.ప్ర; .యస్.వి.యు.ఓ.రీ.ఇ.లై; తిరుపతి.

శ్రీ కాళహస్తీశ్వరశతకము - ధూర్జటిశతకమంజరి, భక్తిసంపుటము,(సంపా.) కాశీనాథుని నాగేశ్వరరావు, చెన్నపురి (1926).

శ్రీ తరిగొండ వేంకమాంబ చరిత్రము 1 (శ్రీ వేంకటేశ్వర భక్తవిజయము) - రంగ ప్రకాశదాసు, పరి; కాండూరి రామకృష్ణమాచార్యులు, ద్వి.ము.

హిందువుల పండుగలు - సురవరము ప్రతాపరెడ్డి, తృ.ము. (1953), బాలసరస్వతీ బుక్‌డిపో; కర్నూలు.

## కన్నడము

తరిగొండ వెంకమాంబ (జీవనచరిత్రె) - శ్రీ లక్ష్మీనరసింహశాస్త్రి, సంతెకల్లుహళ్ళి (చింతామణితాల్లూకు) ముద్రణకారరు; వాజపేయం గోవిందయ్యనవరు, శ్రీవెంకటాద్రి ముద్రణాలయ, చిక్కపేటె, బెంగుళూరుసిటి (1940).

## హిందీ

యోగవాసిష్ఠఔర్‌ఉన్‌కే సిద్ధాంత - భీఖన్‌లాల్ ఆత్రేయ ద్వితీయ సంస్కరణ్ (1957). తారాప్రింటింగ్‌వర్క్స్,బెనారస్.

## సంస్కృతము

నీతిశాస్త్రము - (సరిక్రొత్తకూర్పు), రాయలు అండ్ కో; కడప (1962).

పాతంజల యోగదర్శనము - పతంజలి మహర్షి ప్రణీతము, శ్రీ వ్యాసాశ్రమము, ఏర్పేడు (1976).

ప్రతాపరుద్రీయమ్ (ప్రతాపరుద్రయశోభూషణమ్ - విద్యానాథుడు, (సంపా.) సి.శంకరరామశాస్త్రి,తృ.ము.(1950) బాలమనోరమ ప్రెస్, మైలాపూర్, మదరాసు.

రఘువంశమ్ - కాళిదాసు.

రక్షమాం శరణాగతమ్ - ముకుందదైవజ్ఞులు, ప్ర.ము. (1973).

లఘుయోగవాసిష్ఠః - సంగ్రహీకరణ: గౌడ అభినందపండితుడు. నిర్ణయసాగర్ ప్రెస్, బొంబాయి (1936).

వివేకచూడామణి - శంకరాచార్యవిరచితము, వానిళ్ల; చెన్నపురి (1945).

శ్రీకృష్ణకర్ణామృతము - లీలాశుకుడు,వేమూరి వేంకటకృష్ణమశెట్టి అండ్ సన్స్, మదరాసు (1910).

శ్రీమద్భాగవత మహాపురాణ్ - గీతాప్రెస్, గోరఖ్‌పుర్, తృతీయసంస్కరణ్ (1957).

శ్రీయోగవాసిష్ఠము (పూర్వార్ధము - ప్రథమసంపుటము) - మహర్షి వాల్మీకిప్రణీతము (సంపా.) శ్రీవ్యాసాశ్రమము, ఏర్పేడు (1974).

శ్రీవేంకటాచలమాహాత్మ్యగంథః - ప్రకటనకర్త; శ్రీమహంతుప్రయాగదాసజీ. ఆనందముద్రాక్షరశాల, చెన్నపురి (1928).

శ్రీవేంకటేశసుప్రభాతమ్ - శ్రీవాదిభీకరగురువిరచితము, పదకొండవ ముద్రణము (1973), తి.తి.దే. ప్రచురణము.

## ENGLISH

A Brief History of Madanapalli - (compiler) F.A.coleridge: member of Indian civil service, wednesday Review Press. Trichinopoly (1911).

A catalogue of the Telugu Books in the Library of the British Museum (1912).

An Indian Ephemeris vol. V (A.D. 1400 to A.D. 1599)

L.D. Swami Kannu Pillai, Madras (1922).

An Indian Ephemeris Vol VII (A.D.1800 to A.D. 1899)

L.D. Swami Kannu Pillai, Madras (1923).

Literary Autobiography of C.P. Brown - Chief Editor: G. N. Reddy, Editor: Bangorey, Pub: S.V. University, Tirupati, (First Printing 1978).

Literary and Philosophical works of Tarigonda Vengamamba, A woman saint - N.Venkata Rao, the Madras University Journal, (Section A), Vol XXX, No.I (January 1958).

North Arcot District Manual Vol.I (New Edition) -- compiled by Arthur F.Cox, M.C.S; Revised by Harold A Stuart I.C.S; Government Press, Madras (1895).

Sovenir In commemoration of 616th birth anniversary of Srivadi Bheekara mahaguru Anna (1977- (1978)-- Vadibheekara mahaguru Anna Sannidhi Institution, Tirumalai Hills (A.P.)

Sri Venkatachala Mahatmya-An Epitome-S.Subrahmanya Sastry Pub: Tirumalai Sri Venkateswara (Monthly Journal) Vol.No.I, pp.13-18.

Sri Venkateswara Balaji-- V.N.Srinivasa Rao,

Pub: Umadevan & Co; Madras 91949).

The Philosophy of theYogavasishtha -- B.L.Atreya, the Theological Publishing house, Adayar, Madras (1936).

Tirumala-tirupati Devasthanam Ephigraphical series Vol II-- Inscriptions of Saluva Narasimha's time (from 1445 A.D to 1504 A.D)-- Edited by V.Vijaya Raghavacharya, Mahants Devasthanam Press, Madras (1933).

Tirumala, Tirupati Devasthanam Ephigraphical Series Vol. V Inscriptions of Sadasivaraya's time (from 1541 A.D. to 1574 A.D.--Edited by Vijaya Raghavacharya, Mahants Devasthanam Press, Madras (1937).

## శ్రీ వేంకటేశ్వరుడు

"నీవే బ్రహ్మను గన్న తండ్రివి మహానిర్వాణసంధాత వీ
వే విష్ణుండవు రామచంద్రుఁడవు నీవే కృష్ణదేవుండ వీ
వే వేదాత్మవు సర్వతోముఖుఁడ వీవే కర్త వాభోక్త వీ
వే విశ్వంబు వరాహదేవుఁడవు నీవే శేషశైలాధిపా!"

-తరిగొండ వెంగమాంబ



తిరుమల క్షేత్రమందలి
తరిగొండ వెంగమాంబ బృందావనము

~s Series No.:787




మహా నిర్వాణము :- క్రీ.శ. 1817 ఈశ్వర-శ్రావణ శుద్ధ నవమినాడు - ఈ మహాజ్ఞాని, మహాయోగిని, భక్తకవయిత్రి, తిరుమల పుణ్యక్షేత్రంలో శ్రీవేంకటేశ్వరుణ్ణి స్మరిస్తూ, సజీవసమాధి చెందింది.

Published by Sri K.V.RAMANACHARY, IAS, Executive Officer, Tirumala Tirupati Devasthanams and Printed at T.T.D. Press, Tirupati.